
ఉత్కృష్ట మార్మికుడైన అష్టావక్రుడి పై ప్రసంగాలు

అష్టావక్ర గీత

"జ్ఞానోదయమే ఏకైక విప్లవం"



Enlightenment : The Only Revolution



OSHO

ఓషో

ఉత్కృష్ట మార్మికుడైన అష్టావక్రుడి పై ప్రసంగాలు

అష్టావక్ర గీత

(“ జ్ఞానోదయమే ఏకైక విప్లవం ”)

Enlightenment : The Only Revolution


(Discourses on the great mystic Ashtavakra)

ఓషో

అనువాదం

M. **మాధవి**

ఓషో చేత చువాంగ్ త్సు ఆడిటోరియం, పూణె, ఇండియాలో ఇవ్వబడిన ఆశు ప్రసంగాలు.





ఓషో

జన్మించలేదు

మరణించలేదు

ఆయన ఈ లోకాన్ని

డిసెంబర్ 11, 1931 నుండి

జనవరి 19, 1990 మధ్యకాలంలో

సందర్శించారు

విషయ సూచిక



పీఠిక

ఈ పుస్తకం, **జ్ఞానోదయమే ఏకైక విప్లవం**, ఒక అత్యుత్తమ సవాలు, అత్యుత్తమ ఆహ్వానం. అష్టావక్ర గీతపై ఓ వ్యాఖ్యానం. ఇప్పుడే విముక్తం కావడానికి, ఈ క్షణమే జ్ఞానోదయం పొందినవారుగా అవ్వడానికి మనం పిలుపునీయబడుతున్నాం.

అది స్వచ్ఛమైనది, అది సరళమైనది, అది అత్యవసరమైనది. అష్టావక్రుడు తన గీతంలో అన్నింటినీ ఇచ్చాడు. ఏదీ విడిచిపెట్టలేదు. ఇక మన ఇష్టం.

ఓషో మనకు అష్టావక్రుడిని పరిచయం చేస్తారు మరి అంగ వికృతి గల ఒక పన్నెండేళ్ళ బాలుడైన అతనికి మరి ఒక రాజైన జనకుడికి మధ్య సమావేశాన్ని గురించి మనకు చెబుతారు. ఆ సమావేశం నిస్సంగాన్ని, ప్రజ్ఞను మరి స్వేచ్ఛను ఎలా కనుగొనాలి అని ప్రశ్నించడానికి దారి తీసినది. జనకుడు ఎంతటి గ్రహింపుగల, సంసిద్ధతగల శిష్యుడంటే గురువు మాట్లాడుతూ ఉన్న సమయంలోనే రూపాంతరీకరణ సంభవిస్తుంది. అతను ఎంతటి అవగాహన మరి ధైర్యం గల శ్రోత అంటే అతను తత్క్షణమే జాగృతుడవుతాడు.

మనం రెచ్చగొట్టబడతాం. ఈ మాటల ద్వారా మనం కూడా దైవత్వాన్ని గ్రహించగలమా ? మనల్ని జాగృతపరచడానికి, మన హృదయాలలోకి బాణాలలా దూసుకుపోవడానికి ఈ వివరణములను మనం కూడా అనుమతించగలమా ?

ఈ ఆశు ప్రసంగాలలో ఓషో ఆయన ప్రజ్ఞను పంచుతారు. కథలు, పరిహాసాలు చెబుతూ, కవితలను వివరిస్తూ, జిజ్ఞాసువుల విచారణలకు జవాబులు ఇస్తూ, అంతర్ముఖులయ్యేలా మనల్ని ప్రేరేపించడానికి అష్టావక్రుడి యొక్క గీతతో ఆయన తన అంతర్దృష్టులను కలిపి అల్లుతారు. ఒక క్షణం స్వచ్ఛమైన సాక్షీతత్వం, స్వేచ్ఛ మరి నిస్సంగాల శీతలత్వం, ఆ మరుక్షణం దివ్యత్వానికై తీవ్ర ఆకాంక్ష, అగ్ని రాజుకుంటున్న ఓ హృదయం యొక్క ఉష్ణం.

ఓషో అంటారు : ***" మనం ఒక అరుదైన ప్రయాణం ప్రారంభిస్తున్నాం. మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోవాలని కోరుకుంటే కనుక మీరు ధ్యానం యొక్క లోతులలోకి వెళ్ళాలి."***

మరి అది అలానే ఉంటుంది. ఈ ప్రయాణం వర్షాకాలపు తుఫానులోని మెరుపు తాకిడిలా ఉంటుంది. రెప్పపాటుకాలం ప్రతీదీ దేదీప్యమానమవుతుంది, అనంతరం వర్షపు వెల్లువలో కొట్టుకుపోతుంది మరి తిరిగి సచేతనమవుతుంది. ఈ సందేశానికి, ఈ ఆహ్వానానికి ఒక నూతనత్వం, ఒక విస్తారత ఉంది. ఈ సందేశం అవశ్యమైనది మరి రెచ్చగొట్టేది. అయినాగానీ ప్రగాఢ అభిమానం మరి ప్రేమపూర్వకమైన ఆసరాతో నిండి వుంది. శ్రమ పడవలసినది ఏమీ లేదు. కేవలం సేదదీరండి, చైతన్యత్వంలో విశ్రాంతి తీసుకోండి. అది ఒక పోరాటం, ఒక ప్రయత్నం కాదు, అది ఒక అవగాహన.

" అష్టావక్రుడి మాటలు సంపూర్ణంగా అద్వితీయమైనవి. వాటిని వింటూంటే, ఇది మళ్ళీ మళ్ళీ సంభవిస్తుంది ; మీరు ఈ అవనిపై లేరనీ, ఆ ఆకాశంలో భాగం అయిపోయారనీ మీరు మళ్ళీ మళ్ళీ అనుభూతి చెందుతారు... ఎందుకంటే ఈ మాటలు ఆ ఆకాశమే. ఈ మాటలు ఆ స్వస్థానం నుంచి వచ్చాయి. మనం అందరం దేని నుంచి వచ్చామో, మనమందరం దేని వద్దకు తిరిగి వెళ్ళాలో ఆ మూలం నుంచి ఈ మాటలు వచ్చాయి. దాని వద్దకు తిరిగి వెళ్ళకుండా మనం ఎన్నటికీ శాంతిని పొందలేము ".

దేవ అలీస్

జనకుడు అడిగాడు : ఓ ప్రభూ, ఎవ్వరైనా ప్రజ్ఞను ఎలా సిద్ధించుకోవాలి ? మరి విముక్తి ఎలా సంభవిస్తుంది ? మరి నిస్సంగం ఎలా సాధించబడుతుంది ? దయచేసి దీనిని నాకు తెలియజేయండి.

అష్టావక్రుడు బదులిచ్చాడు : ఓ ప్రియతమా, నువ్వు విముక్తిని కోరుకుంటే కనుక విషయవాంఛలను విషంలా త్యజించు, మరి క్షమాతత్వం, నిష్కాపట్యం, దయ, సంతృప్తి మరి సత్యాన్ని అమృతంలా స్వీకరించు. నువ్వు పృథ్వివి కాదు, వాయువువూ కాదు, అగ్నివి కాదు, జలానివి కాదు, ఆకాశానివీ కాదు. విముక్తిని సాధించాలంటే వీటన్నింటినీ సాక్షిగా చూస్తున్న చైతన్యానివే నువ్వు అని తెలుసుకో.

నిన్ను నీవు ఈ భౌతిక శరీరం నుంచి వేరు చేసుకోగలిగితే మరి చైతన్యంలో విశ్రమించగలిగితే, అప్పుడు ఈ క్షణమే నువ్వు సంతోషంతో, శాంతితో ఉంటావు, మరి బంధాల నుంచి స్వతంత్రుడివి అవుతావు.

నువ్వు ఒక బ్రాహ్మణుడివి లేదా ఇతర కులస్థుడివి కాదు, నువ్వు జీవితం యొక్క నాలుగు దశలలో దేనిలోనూ లేవు, నువ్వు కళ్ళు లేదా ఇతర ఇంద్రియాల చేత కనుగొనదగినవాడివి కాదు. నిస్సంగుడవై మరి రూపరహితుడవై, ఈ సమస్త విశ్వాన్ని వీక్షించే సాక్షివి నువ్వు. దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు.

ఓ విస్తారమైనవాడా, మతం మరి నాస్తికత, ఆనందం మరి దుఃఖం అన్నీ మనస్సుకు చెందినవి, అవి నీ కోసం కాదు. నువ్వు కర్తవు లేదా అనుభవించేవాడివి కాదు. నువ్వు ఎల్లప్పుడూ విముక్తుడవే అయివున్నావు.

①

నిర్మలమైన సత్యం

మనం ఒక అరుదైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. మానవుడికి ఎన్నో పవిత్ర ప్రతులు ఉన్నాయి, కానీ అవి ఏవీ అష్టావక్ర గీతతో పోల్చదగినవి కావు. దాని ముందు వేదాలు వెలవెలబోతాయి, ఉపనిషత్తులు కేవలం ఒక గుసగుసలా ఉంటాయి. **అష్టావక్రసంహిత**లో కనిపించే మహత్యం భగవద్గీతలో సైతం లేదు ... అది కేవలం అసమానమైనది.

అత్యంత ప్రధానమైన విషయం ఏమిటంటే సమాజం, లేదా రాజకీయాలు లేదా మానవ జీవితంలోని ఏ ఇతర వ్యవస్థ కూడా అష్టావక్రుడి యొక్క వివరణముల ప్రభావాన్ని కలిగిలేవు. అంత స్వచ్ఛమైన, సర్వోత్కృష్టమైన, కాలానికి మరి స్థలానికి అతీతమైన ఏ ఇతర వివరణలూ ఎక్కడా లేవు. బహుశా అందువలనే అష్టావక్రుడి యొక్క గీత, **అష్టావక్రసంహిత**, అంతగా ప్రభావాన్ని చూపలేదు.

కృష్ణుడి యొక్క భగవద్గీత అత్యంత ప్రాబల్యాన్ని కలిగి వుంది. మొదటి కారణం ఏమిటంటే కృష్ణుడి యొక్క గీత ఒక సంయోగీకరణం. అతను సత్యంతో కంటే సంయోగీకరణతోనే ఎక్కువ నిమిత్తాన్ని కలిగివున్నాడు. సంయోగీకరణకై కాంక్ష ఎంత దృఢంగా ఉందంటే, అవసరమైతే కొంత సత్యాన్ని త్యాగం చెయ్యడానికైనా కృష్ణుడు వెనుకాడడు.

కృష్ణుడి యొక్క గీత అన్నింటినీ కలిగివున్న నానా పదార్థాల మిశ్రమం ; అందువలనే అది ప్రతి ఒక్కరికీ ఆకర్షణీయంగా ఉంటుంది, ఎందుకంటే దానిలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి ఉంది. గీతలో వారి స్వరం కనిపించని ఏ సంప్రదాయాన్నయినా కనుగొనడం కష్టం. గీత నుంచి ఓదార్పు పొందని వారెవరినైనా కనుగొనడం కష్టతరం. కానీ అటువంటి వారికి అష్టావక్రుడి గీత అత్యంత కష్టతరమైనదిగా నిరూపితం అవుతుంది.

ప్రజలు కృష్ణుడి గీతను ప్రేమిస్తారు ఎందుకంటే దాని నుంచి తమ స్వంత అర్థాన్ని తీసుకోవడం అత్యంత సులభం. కృష్ణుడి గీత కవితాత్మకమైనది : దానిలో రెండును రెండుతో కూడినప్పుడు అయిదు అవ్వగలదు, రెండును రెండుతో కూడితే అది మూడుకు సమానమూ కాగలదు. అష్టావక్రుడితో అటువంటి కుయుక్తులు ఏవీ సాధ్యం కాదు. అతనితో రెండును రెండుతో కూడితే సరిగ్గా నాలుగే వస్తుంది. అష్టావక్రుడి యొక్క వివరణములు స్వచ్ఛమైన గణితపు వివరణములు. ఇక్కడ కవితాత్మకతతో కూడిన అమిత స్వేచ్ఛకు ఎంత మాత్రమూ సంభావ్యత లేదు. అతను విషయాలను ఉన్నవి ఉన్నట్లుగా, ఏ రకమైన రాజీ అనేది లేకుండా చెబుతాడు.

కృష్ణుడి యొక్క గీతను చదువుతున్నప్పుడు, ఒక భక్తుడు అందులో నుంచి తాను ఒక విశ్వాసాన్ని తయారు చేసుకోగలిగిన దానిని తీసుకుంటాడు, ఎందుకంటే కృష్ణుడు భక్తి గురించి మాట్లాడాడు. ఒక కర్మయోగి తన విశ్వాసాన్ని దాని నుంచి గ్రహిస్తాడు ఎందుకంటే కృష్ణుడు కర్మయోగం గురించి మాట్లాడాడు. జ్ఞానాన్ని విశ్వసించే వ్యక్తి తనకు కావలసినది కనుగొంటాడు ఎందుకంటే కృష్ణుడు జ్ఞానంపై కూడా మాట్లాడాడు. ఒకచోట కృష్ణుడు భక్తిని అత్యుత్తమమైనదిగా పేర్కొంటాడు, మళ్ళీ మరొకచోట అతను కర్మయోగం అత్యుత్తమమైనది అని అంటాడు.

కృష్ణుడి యొక్క వివరణములు అత్యంత రాజకీయపూరితమైనవి. అతను ఒక రాజకీయవేత్త, ఒక చక్కని రాజకీయవేత్త. కేవలం అతను ఒక రాజకీయవేత్తగా ఉండేవాడు అని చెప్పడం సరి కాదు ; అతను ఒక సూక్ష్మ బుద్ధిగల రాజకీయవేత్త. ఒక అసలైన రాజకీయ మంత్రాంగవేత్త. అతని వివరణములలో అతను ఎన్నో విషయాలను పరిగణించాడు మరి జోడించాడు. ఇందువలనే గీత ప్రతి ఒక్కరికీ అనుగుణంగా ఉంటుంది, ఇందువలనే గీతపై వేలాది వ్యాఖ్యానాలు ఉన్నాయి.

అష్టావక్రుడితో ఎవ్వరికీ నిమిత్తం లేదు, ఎందుకంటే అష్టావక్రుడిని అంగీకరించడానికి మిమ్మల్ని మీరు వదిలేయవలసి ఉంటుంది... నిబంధనారహితంగా. మీతోపాటుగా మిమ్మల్ని మీరు తీసుకురాలేరు. మీరు వెనుక నిలిచి ఉండిపోతే మాత్రమే మీరు అతని సమీపానికి రాగలుగుతారు. కృష్ణుడి విషయంలో మిమ్మల్ని మీరు మీ వెంట తీసుకురావచ్చు. కృష్ణుడి విషయంలో మిమ్మల్ని మీరు రూపాంతరం చెందించుకోవలసిన అవసరం లేదు. కృష్ణుడి విషయంలో మీరు ఉన్న విధంగానే మీరు ఇమిడిపోవచ్చు.

కనుక ప్రతీ సంప్రదాయ వ్యవస్థాపకులూ కృష్ణుడి గీతపై వ్యాఖ్యానాలు వ్రాశారు... శంకరుడు, రామానుజుడు, నింబారకుడు, వల్లభుడు... ప్రతి ఒక్కరూ.

ప్రతివారూ తమ స్వంత అర్థాన్ని తీసుకున్నారు. అనేక అర్థాలను అనుమతించే విధంగా కృష్ణుడు విషయాలను చెప్పాడు ; అందువలనే నేను అతని గీతను కవితాత్మకమైనది అని అంటాను. ఒక కవిత నుంచి మీకు కావలసిన అర్థాన్ని మీరు తీసుకోవచ్చు.

కృష్ణుడి యొక్క వివరణములు వర్షఋతువులో మిమ్మల్ని ఆవరించే మేఘాలలా ఉంటాయి : మీరు కోరుకున్నదేదైనా వాటిలో మీరు చూస్తారు. ఎవరో ఏనుగు తొండాన్ని చూడవచ్చు, ఎవరో గజాననుడి యొక్క సంపూర్ణ శరీరాన్ని చూస్తారు. కొంతమంది ఏమీ చూడకపోవచ్చు. అతను అంటాడు, " ఏమిటీ అర్థరహితమైనది ! అవి మేఘాలు, ఆవిరి... మీరు వాటిలో రూపాలను ఎలా చూస్తారు ?"

పశ్చిమంలో, మానసిక విశ్లేషకులు సిరా మరక పరీక్షను వినియోగిస్తారు : కేవలం కొంత సిరాను బ్లాటింగ్ కాగితంపై ఒంపండి మరి ఒక వ్యక్తిని దానిలో అతను ఏమి చూస్తున్నాడు అనేది చెప్పమని అడగండి. ఆ వ్యక్తి శ్రద్ధగా గమనిస్తాడు మరి ఏదో ఒకటి చూస్తాడు. అక్కడ ఏమీ లేదు, కేవలం బ్లాటింగ్ పేపర్‌పై సిరా మరక మాత్రమే వుంది... అకస్మాత్తుగా విసరబడినది, ఏ ఆకారంతోనూ విసరబడనిది, కేవలం సీసా నుంచి ఒంపబడినది. కానీ దాని వైపు చూస్తున్న వ్యక్తి ఏదో ఒకటి కనుగొంటాడు. అతను కనుగొన్నది అతని మనస్సులో ఉంది, అతను దానిని ప్రసరింపజేశాడు.

ఒక గోడపై వర్షం పడినప్పుడు ఏర్పడిన చారలను మీరు చూసే ఉంటారు. కొన్నిసార్లు ఒక మనిషి ముఖం కనిపిస్తుంది, కొన్నిసార్లు ఒక గుర్రం ముఖం కనిపిస్తుంది. మీరు చూడాలని అనుకుంటున్నదాన్ని మీరు దానిపై ప్రసరింపజేస్తారు. రాత్రి యొక్క చీకటిలో తీగపై వేళ్ళాడుతున్న బట్టలు దెయ్యాలలా కనిపిస్తాయి.

కృష్ణుడి యొక్క గీత కేవలం ఇలాంటిదే... మీ మనస్సులో ఉన్నదానిని మీరు చూడగలుగుతారు. కనుక శంకరుడు జ్ఞానాన్ని చూస్తాడు, రామానుజుడు భక్తిని చూస్తాడు, తిలక్ కర్మను చూస్తాడు ... మరి కృష్ణుడు చెబుతున్నదీ తాను విశ్వసిస్తున్నదీ ఒకటే అని అనుకుంటూ ఉల్లాసకరమైన మనోస్థితితో ప్రతివారూ ఇంటికి తిరిగి వెళతారు.

ఎమర్సన్ ఏమి వ్రాశాడంటే ఒకసారి ఒక పొరుగింటి వ్యక్తి వచ్చి మరి అతని వద్ద నుంచి ప్లాటో యొక్క రచనలను అరువు తీసుకున్నాడు. ప్లాటో రెండు వేల సంవత్సరాల క్రితం జీవించాడు మరి ప్రపంచంలోని అరుదైన, అద్వితీయమైన చింతనాపరులలో ఒకడు. కొన్ని వారాల తరువాత ఎమర్సన్ అతనికి గుర్తు చేశాడు, " నువ్వు ఆ పుస్తకాలను చదివేస్తే కనుక దయచేసి వాటిని తిరిగి ఇవ్వు." పొరుగు

వ్యక్తి వాటిని తిరిగి ఇచ్చిన తరువాత ఎమర్సన్ అడిగాడు, " నీకు అవి ఎలా అనిపించాయి ?"

ఆ వ్యక్తి అన్నాడు, " ఈ మనిషి ప్లాటో యొక్క ఆలోచనలు నా ఆలోచనలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాయి. నేను చాలాసార్లు అనుకున్నాను : ఈ మనిషికి నా ఆలోచనలు ఎలా తెలిసాయి ?" ప్లాటో రెండు వేల సంవత్సరాల క్రితం జీవించాడు మరి ఈ మనిషి ప్లేటో తన ఆలోచనలను తస్కరించాడు అని అనుమానిస్తున్నాడు !

ఈ రకమైన అనుమానం కృష్ణుడి విషయంలో కూడా ఉత్పన్నం అవుతుంది. శతాబ్దాలు గడచిపోయాయి మరి కృష్ణుడిపై వ్యాఖ్యానాలు వస్తూనే ఉన్నాయి. ప్రతి శతాబ్ది తన స్వీయ భావాన్ని కనుగొంటుంది, ప్రతి వ్యక్తి తన స్వీయ భావాన్ని కనుగొంటాడు. కృష్ణుడి యొక్క గీత సిరా మరక లాంటిది ... అది ఒక నిష్ణాతుడైన రాజకీయవేత్త యొక్క వివరణము.

మీరు అష్టావక్రుడి గీత నుంచి ఏ విశ్వాసాలనూ వెలికి తీయలేరు. మీరు దానిలోకి వెళుతున్నప్పుడు మిమ్మల్ని మీరు విసర్జించుకున్నప్పుడు మాత్రమే, అష్టావక్రుడి గీత మీకు స్పష్టమవుతుంది. అష్టావక్రుడి సందేశం స్ఫటికం అంత సుస్పష్టంగా ఉంటుంది. మీరు దానికి మీ స్వంత తాత్పర్యం యొక్క చిన్న భాగాన్ని కూడా జోడించలేరు. అందువలనే ప్రజలు అష్టావక్రుడి యొక్క గీతపై వ్యాఖ్యానాలను వ్రాయలేదు. ఒక వ్యాఖ్యానాన్ని వ్రాయడానికి అవకాశమే లేదు ; దానిని వక్రీకరించడానికి లేదా అపార్థం చేయడానికి మార్గమే లేదు. దేనినైనా జోడించడానికి మీ మనస్సుకు అవకాశమే లేదు. అష్టావక్రుడు ఎటువంటి వ్యక్తీకరణను ఇచ్చాడంటే, శతాబ్దాలు గడచిపోయినా కూడా ఎవ్వరూ దానికి ఏదైనా జోడించడం లేదా దాని నుంచి ఏదైనా తొలగించడం చేయలేకపోయారు. అంతటి లోపరహితమైన వ్యక్తీకరణను ఇవ్వడం సులభం కాదు. మాటల పట్ల అంతటి నైపుణ్యం అన్నది రావడం అత్యంత కష్టతరమైనది.

ఇందువలనే మనం ఒక అరుదైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం అని నేను అంటున్నాను.

రాజకీయవేత్తలకు అష్టావక్రుడి పట్ల ఎటువంటి ఆసక్తి లేదు. తిలక్‌కు లేదు, అరబిందోకు లేదు, గాంధీకి లేదు, వినోబాకు లేదు : వారెవరికీ ఎటువంటి ఆసక్తి లేదు, ఎందుకంటే అష్టావక్రుడితో వారు వారి స్వంత ఆటలను ఆడుతూ పోవడం అనేది చేయలేరు. జాతీయతాభావాన్ని ప్రేరేపించడమే తిలక్ యొక్క ఆసక్తిగా ఉండేది. దేశమంతా కర్మలో పాలుపంచుకోవాలి అని అతను కోరుకునేవాడు... మరి కృష్ణుడి

యొక్క గీత సహాయకరం అయ్యింది. కృష్ణుడు ఎవ్వరికైనా తన భుజాన్ని ఆసరాగా అందించడానికి సిద్ధంగా ఉన్నాడు. అతని భుజంపై తమను తాము నిలకడగా ఉంచుకుని మరి తమ తూటాలను పేల్చాలి అని ఎవ్వరు కోరుకున్నా... కృష్ణుడు సిద్ధంగా ఉంటాడు. భుజం అతనిది, దాని వెనుక దాగి ఉండే అవకాశాన్ని మీరు తీసుకోవచ్చు. మరి అతని భుజం వెనుక నుంచి పేల్చుతూ ఉన్నప్పుడు తూటాలు సైతం ఆవశ్యకమైనవిగా కనిపిస్తాయి.

అష్టావక్రుడు ఎవ్వరినీ తన భుజంపై చేతిని వేయడానికి సైతం అనుమతించడు. కనుక గాంధీకి ఆసక్తి లేదు, తిలక్‌కు ఆసక్తి లేదు, అరబిందో, వినాబాలకు అతనితో ఏ నిమిత్తమూ లేదు, ఎందుకంటే వారు దేనినీ విధించలేరు. రాజకీయాలకు తావు లేదు... అష్టావక్రుడు ఒక రాజకీయ జీవి కాదు.

మీరు మనస్సులో ఉంచుకోవలసిన మొట్టమొదటి విషయం... అంతటి స్ఫటిక స్పష్టత, కనుచూపు మేరలో ఏ మబ్బూ లేని విశాలాకాశం వంటి వ్యక్తీకరణ, మీరు ఏ రూపాలనూ చూడలేరు. మీరు అన్ని రూపాలనూ విసర్జించినప్పుడు, అన్ని రూపాలతోనూ భేదాన్ని తెలుసుకుని మరి రూపరహితమైనదానితో అనుసంధానింప బడినప్పుడు మాత్రమే, మీరు అష్టావక్రుడిని గ్రహించగలుగుతారు. మీరు నిజంగా అష్టావక్రుడిని అవగాహన చేసుకోవాలని కోరుకుంటే కనుక మీరు ధ్యానం యొక్క లోతులలోకి వెళ్ళాలి. ఏ వ్యాఖ్యానమూ, ఏ తాత్పర్యమూ ఏ విధంగానూ దోహదపడదు.

మరి ధ్యానం కోసం అష్టావక్రుడు మనల్ని కూర్చుని " రామ,రామ " అని జపించమని అడగడు. మీరు చేసేది ఏదైనా ధ్యానం కాదు అని అతను చెబుతాడు. చేసేవాడు ఉన్నప్పుడు అక్కడ ధ్యానం ఎలా ఉండగలుగుతుంది ? చెయ్యడం అనేది ఉన్నంతవరకూ, భ్రమ అనేది ఉంటుంది. చేసేవాడు ఉన్నంతవరకూ, అహం అనేది ఉంటుంది. ధ్యానం అంటే ఒక సాక్షిగా అవ్వడమే అని అష్టావక్రుడు అంటాడు. అప్పుడు చేసేవాడు మాయమవుతాడు ; మీరు కేవలం చూసేవారుగా ఉంటారు, గమనించేవారు తప్ప మరేదీ కాదు. మీరు కేవలం గమనించేవారే తప్ప మరేదీ కానప్పుడు మాత్రమే 'దర్శించడం' అనేది ఉంటుంది ; అప్పుడు మాత్రమే ధ్యానం ఉంటుంది, అప్పుడు మాత్రమే ప్రజ్ఞ ఉంటుంది.

మనం ఈ సూత్రాలలోనికి ప్రవేశించే ముందు, అష్టావక్రుడి గురించి కొన్ని విషయాలను అవగాహన చేసుకోవడం అవసరం. అతను ఒక సాంఘిక లేదా రాజకీయ వ్యక్తి కాకపోవడం వలన ఎక్కువగా తెలియదు, కనుక ఏ చారిత్రక లేఖా ప్రమాణాలూ

లేవు. కేవలం కొన్ని సంఘటనలు మాత్రమే తెలిసాయి... మరి అవి కేవలం అద్భుతకరమైనవి, నమ్మశక్యం కానివి. కానీ మీరు వాటిని లోతుగా అవగాహన చేసుకుంటే ఆ ప్రాధాన్యత బహిర్గతమవుతుంది.

మొదటి సంఘటన అష్టావక్రుడు జన్మించక ముందు జరిగింది. తరువాత వచ్చినదాని గురించి ఏమీ తెలియదు, కానీ అతను ఇంకా గర్భంలోనే ఉన్నప్పటి సంఘటన ఇది. ఒక గొప్ప పండితుడు అయిన తన తండ్రి, ప్రతిరోజూ వేదాలు వల్లిస్తూ ఉంటే అష్టావక్రుడు గర్భంలో నుంచి వింటూ ఉండేవాడు. ఒకరోజు గర్భం నుంచి ఒక స్వరం ఈ విధంగా వినిపించింది, " దానిని ఆపు ! ఇది అంతా నిరర్థకమైనది. దీనిలో ప్రజ్ఞ అనేది ఏమీ లేదు. కేవలం పదాలు ... కేవలం పదాల సంకలనం మాత్రమే. వేదాలలో ప్రజ్ఞ కనుగొనబడుతుందా ? ప్రజ్ఞ అనేది మన అంతరంగంలోనే వుంది. పదాలలో సత్యం కనుగొనబడుతుందా? సత్యం అనేది మన అంతరంగంలోనే ఉంది."

సహజంగానే అతని తండ్రికి కోపం వచ్చింది. మొట్టమొదటిగా అతను ఓ తండ్రి మరి ఆ పైన ఒక పండితుడు. మరి గర్భంలో దాగి వున్న అతని తనయుడు అటువంటి మాటలు మాట్లాడుతున్నాడు ! ఇంకా జన్మించనైనా లేదు ! అతను ఆగ్రహంతో బద్దలయ్యాడు, కోపాగ్నిలో ముంచివేయబడ్డాడు : తండ్రి యొక్క అహం దెబ్బతింది. మరి ఒక పండితుడి యొక్క అహం... అతను ఒక ఉత్తమ పండితుడు, ఒక గొప్ప సంవాదకుడు, వేదాల జ్ఞానం కలిగినవాడు.

ఆగ్రహంలో అతను శపించాడు : జన్మించినప్పుడు, ఆ బాలుడు అంగవికృతి కలవాడు అవుతాడు ; అతని అవయవాలు ఎనిమిది భాగాలుగా వంకర తిరిగి వుంటాయి. అందువలనే అతనికి ఆ పేరు : అష్టావక్రుడు అంటే ఎనిమిది వంకరలు తిరిగిన శరీరం కలవాడు అని అర్థం. అతను ఎనిమిది స్థానాలలో చొట్టలతో జన్మించాడు; ఎనిమిది స్థానాలు, ఒంటెలాగా వంగిన వీపుతో ఉన్నాడు. క్రోధావేశంలో అతని తండ్రి తన తనయుడి శరీరాన్ని వికృతం చేశాడు.

ఇటువంటి ఇతర కథలూ ఉన్నాయి...

బుద్ధుడు నిలబడి జన్మించాడు అని చెప్పబడుతుంది. అతని తల్లి ఒక వృక్షం క్రింద నిలబడి ఉంది ; ఆమె నిలబడి జన్మను ఇచ్చింది మరి అతను నిలబడి జన్మించాడు. అతను నేలపైకి పడిపోకుండా నడవడం ప్రారంభించాడు ! అతను ఏడు అడుగులు వేశాడు మరి ఎనిమిదవ అడుగులో అతను ఆగాడు మరి నాలుగు దివ్య సత్యాలను ప్రకటించాడు ... జీవితం దుఃఖం అని..! అతను భూమిపై కేవలం

ఏడు అడుగులు నడిచాడు మరి జీవితం దుఃఖం అని, దుఃఖం నుంచి విముక్తులు కావడం సాధ్యం అని, దుఃఖం నుంచి విముక్తులు కావడానికి మార్గం వుంది అనీ, దుఃఖం నుంచి విముక్తమైన స్థితి ... నిర్వాణ స్థితి ఉంది అని ప్రకటించాడు.

లావో ట్జు గురించిన కథ ఏమిటంటే అతను వృద్ధుడిగా జన్మించాడు అని, అతను ఎనభై ఏళ్ళ వృద్ధుడిగా జన్మించాడు అని, అతను గర్భంలో ఎనభై సంవత్సరాలు ఉన్నాడు అని. అతనికి ఏదీ చెయ్యాలనే కోరిక లేకపోవడం వలన, అతనికి గర్భాన్ని వీడాలి అనే కోరిక లేదు. అతనికి కోరికలు లేకపోవడం వలన, అతను ప్రపంచంలోకి రావాలని కూడా అనుకోలేదు. అతను జన్మించినప్పుడు అతనికి తెల్ల జుట్టు ఉంది, ఎనభై సంవత్సరాల వృద్ధుడు !

జరాతుస్ట్రా యొక్క కథ ఏమిటంటే అతను జన్మించిన వెంటనే అతను పగలబడి నవ్వడం ప్రారంభించాడు.

కానీ అష్టావక్రుడు వారందరినీ ఓడించాడు. ఇవి అన్నీ జన్మించిన తరువాత జరిగిన సంఘటనలు ; అతను జన్మించక ముందే అష్టావక్రుడు తన పూర్తి వివరణమును అందించాడు.

ఈ కథలు భావగర్భితమైనవి. ఈ గురువుల యొక్క జీవితపు సారం, ఆవశ్యక నిధులను ఈ కథలు కలిగి వుంటాయి.

బుద్ధుడి యొక్క కథ అతను తన జీవితమంతా ఏదైతే బోధించాడో దాని సారాన్ని కలిగి వుంటుంది... బుద్ధుడు అష్టాంగ మార్గాన్ని బోధించాడు, కనుక అతను ఏడు అడుగులు వేశాడు మరి ఎనిమిదవ దానిపై ఆగాడు. అన్నీ కలిపి ఎనిమిది భాగాలు ఉన్నాయి ; చివరి అడుగు సరియైన సమాధి ' కి చెందినది, మరి ఆ సమాధి స్థితిలో మాత్రమే జీవితం యొక్క సమస్త సత్యం తెలుసుకోబడుతుంది. కనుక అతను నాలుగు దివ్య సత్యాలను ప్రకటించాడు.

లావో ట్జు వృద్ధుడిగా జన్మించాడు. ప్రజలు ఎనభై సంవత్సరాలు జీవిస్తారు, అయినా జన్మించినప్పుడు లావో ట్జు కలిగి వున్న అవగాహనను వారు కలిగి వుండరు. కేవలం వృద్ధులు కావడం వలన ప్రజలు వివేకవంతులు అవ్వడం మీరు చూశారా ? వృద్ధులు అవ్వడం మరి వివేకవంతులు అవ్వడం అనేవి పర్యాయపదాలు కావు. పండు ముసలి వయస్సులో సూర్యుడి చేత రంగు పోగొట్టబడడం వలన మాత్రమే జుట్టు తెల్లబడవచ్చు.

లావో ట్జు యొక్క కథ కేవలం ఏమి చెబుతుందటే ఒకరి జీవితంలో తీవ్రత, ఆవశ్యకత ఉంటే కనుక, అప్పుడు ఎనభై సంవత్సరాలు పట్టేది కేవలం ఒక్క క్షణంలో సంభవించగలదు. ఒకరి అవగాహన తీవ్రతను కలిగి వుంటే కనుక అది ఒక్క క్షణంలో సంభవించగలదు, మరి స్వచ్ఛమైన జ్ఞానం లేకుండా అది ఎనభై సంవత్సరాలలో సైతం సంభవించదు.

జరాతుస్త్రా పుడుతూనే నవ్వాడు. నవ్వే మతం అని పిలువదగిన ఏకైక మతం ప్రపంచంలో జరాతుస్త్రా యొక్క మతం మాత్రమే... ఎంతో ఐహికమైనది, భూమి యొక్క మతం. అందువలనే ఇతర మతాలవారు పార్శీలను ధార్మికులుగా చూడరు. వారు పార్శీలను నాట్యం చేస్తూ, పాడుతూ, ఆనందంగా ఉన్నవారుగా చూస్తారు... జరాతుస్త్రా యొక్క మతం ఒక నవ్వుల మతం, జీవితాన్ని స్థిరపరచే మతం, జీవితాన్ని నిరాకరించేది కాదు. దానిలో త్యజించడానికి తావు లేదు. ఒక పార్శీ సాధువును కేవలం నగ్నంగా, అంతా త్యజించి, ఎర్రటి ఎండలో నిలబడి, ఒక హిందూ సన్యాసిలా అగ్నికి అభిముఖంగా కూర్చుని ఉండడం మీరు ఎప్పుడైనా చూశారా ? లేదు, శరీరాన్ని హింసించడం మరి దానికి సమస్యను కలిగించడం పట్ల పార్శీ మతానికి ఆసక్తి లేదు. జరాతుస్త్రా యొక్క సమస్త సందేశమూ ఇదే : నవ్వుతూ ఉండడం ద్వారా మీరు దైవత్వాన్ని సిద్ధించుకోగలినప్పుడు, దానిని విలపిస్తూ సిద్ధించుకోవడం ఎందుకు ? మీరు నాట్యం చేస్తూ ఆలయానికి చేరుకోగలిగినప్పుడు, మీరు మార్గంలో అనవసరంగా ముళ్ళను పరుచుకోవడం ఎందుకు ? మీరు పువ్వులతో వెళ్ళగలిగినప్పుడు, వేదన మరి దైన్యంతో నిండిన విధానాలను అనుసరించడం ఎందుకు ? అది సరైనదే, ఆ వృత్తాంతం, జన్మ సమయంలో జరాతుస్త్రా నవ్వుతూ ఉన్నాడు అనేది, సరైనదే.

ఈ కథలలో చారిత్రక వాస్తవాల కోసం చూడకండి. అవి ఇదే విధంగా జరిగాయి అని కాదు ... కానీ ఈ కథలలో అత్యంత నిగూఢమైన భావం ఉంది.

మీరు ఒక విత్తనాన్ని కలిగి వున్నారు : మీరు విత్తనం వైపు చూసినప్పుడు దాని నుంచి వృద్ధి చెందే పువ్వుల యొక్క చిహ్నమేదీ మీరు కనుగొనలేరు. అది ఏమి అవ్వగలదు అనేదాని జాడ సైతం ఉండదు. అది ఒక పద్మం అవుతుందా ... నీటిలో వికసించినా కూడా దాని చేత స్పృశించకుండానే వుండి, సూర్య కిరణాలలో నాట్యం చేస్తుందా ? మరి సూర్యుడు సైతం దాని సౌందర్యం, దాని సౌకుమార్యం, దాని అసమానమైన శోభ మరి సొగసుల పట్ల అసూయ చెందవచ్చు. దాని పరిమళం గగనంలోనికి ఎగిసిపోతుంది. విత్తనం వైపు చూస్తున్నప్పుడు ఇది తెలియదు. విత్తనం

వైపు చూస్తున్నప్పుడు ఎవ్వరూ కనీసం ఊహించలేరు, అంచనా సైతం వేయలేరు. కానీ ఒకరోజు అది సంభవిస్తుంది.

కనుక మనం రెండు విధాలుగా ఆలోచించవచ్చు. మనం విత్తనాన్ని గట్టిగా పట్టుకుని మరి ఇలా అనవచ్చు, " విత్తనంలో కనిపించనిది పద్మంలో సైతం సంభవించలేదు. అది ఒక భ్రమ, అది ఒక యుక్తి, అది ఒక అబద్ధం." మనం హేతువాదులు, సంశయాళువులు అని పిలిచేవారి అభిప్రాయం ఇది. విత్తనంలో కనిపించనిది పువ్వులో ఉండదు అని వారు అంటారు ... ఏదో దోషం ఉంది. అందువలనే ఒక సంశయశీలుడైన వ్యక్తి ఒక బుద్ధుడిని విశ్వసించలేడు, ఒక మహావీరుడిని అంగీకరించలేడు, ఒక జీసస్‌ను ఆలింగనం చేసుకోలేడు, ఎందుకంటే తనకు ఇప్పటికే వారు తెలుసు అని అతను అంటాడు.

జీసస్ తన గ్రామానికి వచ్చినప్పుడు అతను ఎంతగానో ఆశ్చర్యపోయాడు... ఆ గ్రామ ప్రజలు అతని గురించి అసలు పట్టించుకోనే లేదు. ఒక ప్రవక్త తన స్వంత దేశంలో ఎప్పుడూ గౌరవించబడడు అని జీసస్ అన్నాడు. కారణం ఏమిటి? ఎందువలన ఆ గ్రామం తన ప్రవక్తను గౌరవించదు ? ఆ గ్రామ ప్రజలు అతనిని వడ్రంగి జోసెఫ్ యొక్క కుమారుడిగా చూశారు. అతను కలపను మోసుకువెళుతుండగా చూశారు, అతను కలపను రంపంతో కోస్తూండగా చూశారు, అతను చెమటతో తడిసి ముద్ద అవ్వడం చూశారు, అతను వీధులలో ఆడుకుంటూ ఉండగా మరి పోట్లాడుతూ ఉండగా చూశారు. ఆ గ్రామ ప్రజలకు అతను చిన్నప్పటి నుంచి తెలుసు, అతనిని అక్కడ ఒక విత్తనంలా చూశారు. అకస్మాత్తుగా అతను దైవకుమారుడు కావడం అనేది ఎలా సాధ్యం అవుతుంది ! లేదు, విత్తనాన్ని చూసినవారు పువ్వును అంగీకరించలేరు. ఏదో మోసం, ఏదో వంచన ఉండి వుంటుంది అని వారు అంటారు ; ఈ మనిషి కపటమైనవాడు.

బుద్ధుడు తన గ్రామానికి తిరిగి వచ్చాడు. మరి ఆ తండ్రి ... సమస్త ప్రపంచమూ చూడగలిగినదానిని, ఆ తండ్రి చూడలేకపోయాడు. ప్రపంచం ఒక ప్రకాశాన్ని అనుభవిస్తోంది, దూరదూరాల వరకూ ఆ వార్త వ్యాపిస్తోంది, సుదూర దేశాల నుంచి ప్రజలు రావడం ప్రారంభించారు. కానీ పన్నెండు సంవత్సరాల తర్వాత బుద్ధుడు తన స్వగృహానికి తిరిగి వచ్చినప్పుడు, అతని తండ్రి అన్నాడు, " ఇప్పటికీ నేను నిన్ను క్షమించగలను. నువ్వు చేసినది తప్పు అయినా కూడా, నువ్వు మమ్మల్ని ఎంతో బాధపెట్టావు, నువ్వు నిశ్చయంగా ఒక నేరం చేశావు, నాకు ఒక తండ్రి హృదయం వుంది ... నేను నిన్ను క్షమిస్తాను. నీ కోసం ద్వారాలు తెరిచే వున్నాయి.

ఈ భిక్షాపాత్రను విసిరెయ్యి, ఈ సన్యాసి వస్త్రాలను తొలగించు. ఇవి ఏవీ ఇక్కడ పనిచేయవు. తిరిగి రా ... ఈ సామ్రాజ్యం నీదే. నేను వృద్ధుడిని అయ్యాను ; దానిని ఎవరు చూసుకుంటారు ? ఈ బుద్ధిహీనత ఇక చాలు, ఇక ఈ ఆటలన్నింటినీ ఆపెయ్యి !"

బుద్ధుడు అన్నాడు, " దయచేసి నా వైపు చూడండి. వెళ్ళిపోయినవాడు తిరిగి రాలేదు. మరెవరో వచ్చారు, మీ ఇంటిలో జన్మించిన వ్యక్తి తిరిగి రాలేదు. మరెవరో ఇక్కడ ఉన్నారు, ఆ విత్తనం ఒక పుష్పంలా తిరిగి వచ్చింది. లోతుగా చూడండి."

ఆ తండ్రి అన్నాడు, " నువ్వు నాకు బోధిస్తున్నావా ? నువ్వు జన్మించిననాటి నుంచి నువ్వు నాకు తెలుసు ... వెళ్ళు మరి ఇతరులను మోసగించు ; వెళ్ళు మరి ఇతరులకు ఉపన్యాసం ఇవ్వు మరి వారిని వంచించు ... నువ్వు నన్ను మోసగించలేవు. నేను మళ్ళీ చెబుతున్నాను, నాకు నీ గురించి బాగా తెలుసు ... నాకు నేర్పాలని ప్రయత్నించవద్దు. నిన్ను క్షమించాలి అని నేను కోరుకుంటున్నాను."

బుద్ధుడు అన్నాడు, " మీకు నేను తెలుసు అని మీరు అంటున్నారా ? ఇంతకు ముందు నా గురించి నాకే తెలియదు. కేవలం ఇటీవలే వెలుగు కిరణాలు దిగి వచ్చాయి మరి నా గురించి నేను తెలుసుకున్నాను. నన్ను మన్నించండి, కానీ మీరు చూసిన మనిషి నేను కాదు అనేది నేను చెప్పాలి. మీరు ఏదైతే చూశారో అది నేను కాదు. మీరు బాహ్య కవచాన్ని చూశారు, కానీ మీరు నా అంతరంలోనికి చూశారా ? నేను మీ నుంచి జన్మించాను కానీ మీరు నన్ను సృష్టించలేదు. ఒక ప్రయాణికుడు ఒక నిర్ణీత మార్గం ద్వారా వచ్చినట్లుగా నేను మీ ద్వారా వచ్చాను, కానీ ప్రయాణికుడు మరి మార్గానికి ఒకరితో ఒకరికి నిమిత్తం ఏం వుంది ? ఒకవేళ రేపు ఆ మార్గం ' నువ్వు నాకు తెలుసు, నీ అస్తిత్వం నా నుంచి వచ్చింది,' అని అంటే ... మీరు అంటున్నట్లుగానే.

" మీకన్నా ముందు నేను ఉన్నాను. ఎన్నో జన్మలుగా నేను ఈ ప్రయాణంలో ఉన్నాను. నేను నిశ్చయంగా మీ ద్వారా పయనించాను, ఇతరుల ద్వారా నేను పయనించినట్లుగానే. ఇతరులు కూడా నా తండ్రిగా ఉన్నారు, ఇతరులు కూడా నా తల్లిగా ఉన్నారు. కానీ నా అస్తిత్వం సంపూర్ణంగా ప్రత్యేకమైనదిగానే ఉంది."

అది ఎంతో కఠినమైనది, అత్యంత కఠినమైనది : మీరు విత్తనాన్ని చూస్తే కనుక పుష్పం మీ ఎదుట వుంది అని మీరు విశ్వసించలేరు.

చూడడం అనేది ఒక విధానంలో అపనమ్మకంతో, హేతువుతో, సంశయశీలతతో ఉండడానికి చెందినది. వారు అంటారు, " మాకు ఆ విత్తనం తెలుసు కనుక ఈ పుష్పం సాధ్యం కాదు. మాకు ఆ బురద తెలుసు ... దాని నుంచి ఒక పద్మం ఎలా రాగలదు ? అది అంతా అసత్యం ... ఒక స్వప్నం, ఒక భ్రాంతి. అతను ఒక విధమైన హిప్నోసిస్‌లో పడి ఉండవచ్చు. ఎవరో అతనిని మోసగించారు; ఏదో మాయ, ఏదో మంత్రం...

ఇది ఒక విధానం. మరొకటి విశ్వాసం యొక్క విధానం ... ప్రేమికుడు, భక్తుడికి చెందినది, అవగాహనా సామర్థ్యంతో నిండిన హృదయానికి చెందినది. అతను పుష్పాన్ని చూస్తాడు మరి ఆ పుష్పం నుంచి వెనుకకు పయనించడం ప్రారంభిస్తాడు. అతను అంటాడు, "పుష్పం ఇంత పరిమళభరితం అయినప్పుడు, ఆ పుష్పంలో అంతటి తేజస్సు కనిపించినప్పుడు, ఆ పువ్వులో అంత సౌందర్యం ఉన్నప్పుడు, అంతటి తాజా అమాయకత్వం ఆ పువ్వులో కనిపించినప్పుడు, నిశ్చయంగానే అది విత్తనంలో సైతం ఉండి వుంటుంది ... ఎందుకంటే పుష్పంలో ఏదైతే ఉన్నదో అది అప్పటికే విత్తనంలో ఉండుండకపోవడం అనేది సాధ్యం కాదు."

ఈ కథలు వాస్తవంగానే జరిగాయి అని కాదు. అష్టావక్రుడిలో పువ్వులు వికసించడం చూసినవారు ఏ ముగింపుకు వచ్చారంటే ఈరోజు ఏదైతే సంభవించిందో అది నిన్న కూడా ఉనికిలో ఉండే వుంటుంది... అది దాగి వుంది, మరుగుపరచబడి, ముసుగు చాటున ఉంది. ఇక్కడ అంతంలో ఉన్నది ప్రారంభంలో సైతం ఉండే వుంటుంది. మరణ సమయంలో ఏదైతే కనిపించిందో అది జన్మ సమయంలో సైతం ఉండే వుంటుంది ; లేదంటే అది ఏ విధంగా ఉదయించగలదు ?

కనుక పువ్వు నుంచి వెనుకకు చూడడం అనేది ఒక విధానం, మరి విత్తనం నుంచి ముందుకు చూడడం అనేది మరొక విధానం. మీరు శ్రద్ధగా చూస్తే కనుక వాటి సారం ఒకటే, వాటి పునాది ఒకటే, కానీ ఎంతటి వ్యత్యాసం ... భూమి మరి ఆకాశాల మధ్యన ఉన్నట్లుగా ! ఆ విత్తనం గురించి తెలిసిన వ్యక్తి అంటాడు, " విత్తనంలో లేనిది పుష్పంలో ఎలా ఉండగలదు ?" ఇది అతని వాదన. పుష్పం గురించి తెలిసిన వ్యక్తి కూడా అదే అంటాడు. అతను అంటాడు, " పుష్పంలో ఉన్నది విత్తనంలో సైతం ఉండే వుంటుంది." వారిది ఒకే వాదన. కానీ ప్రతివారూ విభిన్న విధానంలో చూస్తున్నారు.

అది ఒక గొప్ప అడ్డంకి. నన్ను ఈ విధంగా అడుగుతూంటారు, " మీ బాల్యంలో మీతో కలిసి ఎంతోమంది చదువుకున్నారు ... పాఠశాలలో, కళాశాలలో

... కానీ వారు ఎవరూ ఇక్కడ కనిపించరు.” వారు ఎలా ఉండగలరు ?... అది వారికి ఒక గొప్ప అడ్డంకి. వారు చూస్తున్నది వారు విశ్వసించలేరు, అది వారికి అత్యంత కష్టతరమైనది. కేవలం నిన్న ఎవరో నాకు రాయ్‌పూర్ నుంచి ఒక వార్తాపత్రికను పంపించారు. శ్రీ హరిశంకర్ పర్సాయియా నాకు ప్రతికూలంగా ఒక వ్యాసం వ్రాశాడు. అతనికి నేను తెలుసు, నా కళాశాల రోజుల నుంచీ అతనికి నేను తెలుసు. అతను ప్రముఖ హిందీ వ్యంగ్య రచయిత. నేను ఆయన లేఖనాలను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. ఆ వ్యాసంలో అతను వ్రాశాడు, “ జబల్‌పూర్ వాతావరణంలోనే ఏదో దోషం ఉండి వుండాలి. ఇక్కడ కేవలం వంచకులు మరి దాంబికాలు పలికేవారూ జన్మించారు ... ఓషో, మహేష్ యోగి మరి మునీంద్ర వంటివారు.”

అతను మూడు పేర్లను జాబితాలోకి ఎక్కించాడు. కనీసం అతని జాబితాలో నేను మొదటివాడిగా ఉన్నందుకు అతనికి నేను ధన్యవాదాలు చెప్పాలి ! నన్ను ఈ మాత్రం యోగ్యుడిగానైనా అతను పరిగణించాడు. అతను నన్ను పూర్తిగా అతని మనస్సు నుంచి బయటకు తోసెయ్యలేదు. అతను నన్ను పూర్తిగా విస్మరించాడని కాదు. కానీ అతని సమస్య సహజం, సుస్పష్టం మరి సరళమైనది. అతని అభిప్రాయాన్ని నేను అవగాహన చేసుకోగలను.అది అసాధ్యం ... అతను ఆ విత్తనాన్ని చూశాడు ; అతను పుష్పాన్ని ఎలా నమ్మగలడు ? మరి పుష్పాన్ని చూసినవారికి విత్తనం పట్ల నమ్మకాన్ని కలిగి వుండడం కష్టతరం అవుతుంది.

కనుక గొప్ప వ్యక్తులు అందరి జీవితకథనూ రెండు కోణాల నుంచి వ్రాయవచ్చు. అతనికి ప్రతికూలమైనవారు అతని బాల్యం నుంచి ప్రయాణం ప్రారంభిస్తారు, మరి అతనికి అనుకూలమైనవారు చివరి నుంచి ప్రయాణాన్ని ప్రారంభిస్తారు మరి బాల్యం వద్దకు వెనుకకు వెళతారు. ఒక విధంగా రెండూ సరైనవే. కానీ బాల్యం నుంచి ప్రారంభించి మరి చివరివైపు పయనించేవారు సత్యాన్ని చేజార్చుకుంటారు. వారి సరైన సామీప్యం అనేది స్వవినాశకరమైనది. చివరి నుంచి ప్రయాణించి మరి వెనుకకు వెళ్ళేవారు అనుగ్రహింపబడినవారు. ప్రయాస ఏదీ లేకుండానే వారు అధికంగా పొందుతారు... మొదటి విధానంలో ఆలోచిస్తున్నవారు, సంశయాళువుల విధానంలో ఆలోచిస్తున్నవారు, పొందలేనిది.

ఇప్పుడు నాది మాత్రమే దోషం కాదు, కానీ నా వలన జబల్‌పూర్ యొక్క గాలి దోషపూరితమైంది ! వాతావరణంలోనే ఏదో దోషం ఉండి వుంటుంది. కానీ నేను అతనికి చెప్పాలి అని అనుకుంటున్నది ఏమిటంటే జబల్‌పూర్‌కు నాపై అధికారం

లేదు, ఆ వాతావరణం మంచిదైనా లేదా చెడ్డదైనా. నాకు జబల్‌పూర్‌తో పెద్దగా సంబంధం లేదు ; నేను అక్కడ కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉన్నాను. మహేష్ యోగి సైతం అక్కడ కొన్ని సంవత్సరాలే ఉన్నాడు ; అతనికి కూడా సంబంధం లేదు.

మేము ఇరువురమూ మరొక ప్రదేశంతో సంబంధం కలిగివున్నాం. ఆ ప్రదేశపు ప్రజలు ఎంత నిద్రావస్థలో ఉన్నారంటే ఇప్పటికి కూడా మా గురించి వారికి ఏమీ తెలియదు. మహేష్ యోగి యొక్క మరి నా యొక్క జన్మస్థానాలు ఒకదానికి ఒకటి అతి సమీపంలో ఉన్నాయి ; మేము ఇరువురమూ గడావారాకు సమీపంలో జన్మించాం. అతను చిచ్లీలో జన్మించాడు, నేను కుచ్‌వాడాలో జన్మించాను. ఆ వాతావరణం చెడ్డది అయితే కనుక, అది అక్కడ ఉండాలి. గడావారా దానివలన వేదన పొందుతూండాలి ... లేదా అనుగ్రహాన్ని స్వీకరిస్తూ ఉండాలి. జబల్‌పూర్ దీనిలోకి లాగబడకూడదు.

కానీ మనస్సు ఎలాంటి వాదనలను కల్పిస్తుంది !

అష్టావక్రుడి యొక్క కథను విన్నవారు ఎవ్వరైనాగానీ వెంటనే అరుస్తారు "అసత్యం, అసాధ్యం ! " అవశ్యంగానే ఎవ్వరూ గర్భాశయం నుంచి మాట్లాడరు అనేది ఈ కథను వ్రాసినవారికి తెలుసు. వారు కేవలం చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే చివరకు కనిపించేది గర్భాశయంలో సైతం ఉండి వుండాలి. తదనంతరం వికసించిన స్వరం గర్భాశయంలో ఏదో లోతైన ప్రదేశంలో ఉండి వుండాలి ; లేదంటే అది ఎక్కడి నుంచి వికసించింది, అది ఎక్కడి నుంచి వచ్చింది ? కేవలం శూన్యంలో నుంచి విషయాలు వస్తాయా ?

ప్రతి దాని వెనుకా ఒక కారణం ఉంటుంది. మనం దానిని చూడలేకపోవచ్చు కానీ అది తప్పకుండా ఉండి వుండాలి. ఈ కథలు అన్నీ దీనినే సూచిస్తాయి.

అష్టావక్రుడి గురించి తెలిసిన రెండవ సంఘటన అతని పన్నెండు సంవత్సరాల వయస్సులో జరిగింది. కేవలం ఈ రెండు సంఘటనలు మాత్రమే తెలుసు. మూడవది అతని అష్టావక్ర గీత, లేదా కొందరు దానిని పిలిచినట్లు, అష్టావక్ర సంహిత. అష్టావక్రుడు పన్నెండు సంవత్సరాల ప్రాయంలో ఉన్నప్పుడు, జనకుడు ఒక అతిపెద్ద చర్చా గోష్ఠిని ఏర్పాటు చేశాడు. జనకుడు ఒక రాజు, మరి అతను దేశంలోని పండితులు అందరినీ వేదాలపై చర్చించడానికి ఆహ్వానించాడు. అతను రాజసౌధం యొక్క ద్వారం వద్ద వెయ్యి గోవులను ఉంచాడు మరి ఆ గోవుల కొమ్ములను రత్న ఖచితమైన బంగారు రేకులతో అలంకరింపజేశాడు. అతను ప్రకటించాడు, " విజేత అయినవారు, ఈ గోవులను స్వాధీనం చేసుకోవచ్చు ".

అది ఒక గొప్ప చర్చ. అష్టావక్రుని తండ్రి కూడా పాల్గొన్నాడు. సందె చీకటి కమ్ముకుంటున్న వేళ, అతని తండ్రి ఓడిపోతున్నాడు అని అష్టావక్రుడికి సందేశం అందింది. అతను అప్పటికే మిగిలినవారు అందరినీ ఓడించాడు, కానీ అతను వందినుడు అనబడే పండితుడి చేత ఓటమిపాలవ్వబోతున్నాడు. ఈ సందేశాన్ని అందుకోగానే అష్టావక్రుడు రాజసౌధానికి వెళ్ళాడు.

ఆ సభ అప్పటికే ముగింపుకు వస్తోంది ; ఆ చర్చ చివరి దశలో వుంది మరి నిర్ణయాత్మక క్షణం వేగంగా సమీపిస్తోంది. అతని తండ్రి యొక్క ఓటమి అనేది ఒక సంపూర్ణమైన, ముందుగానే నిశ్చయింపబడిన ముగింపు... అతను ఓటమి అంచుపై ఉన్నాడు.

అష్టావక్రుడు రాజసభలో ప్రవేశిస్తున్నప్పుడు అతనిని పండితులు చూశారు. వారంతా విద్యావంతులైన పండితులు. అతని శరీరం వంగిపోయి వుంది మరి ఎనిమిది స్థానాలలో అంగవికృతితో ఉంది : అతను కొద్దిగా కదలగానే మరి ఎవ్వరైనా నవ్వడం మొదలుపెడతారు. అతని కదలికే ఒక హాస్యాస్పదమైన విషయం.

ఆ సభ అంతా పగలబడి నవ్వింది. అష్టావక్రుడు కూడా విరగబడి నవ్వాడు. జనకుడు అన్నాడు, " మిగిలినవారంతా నవ్వుతున్నారు. వారు ఎందుకు నవ్వుతున్నారు అనేది నేను అర్థం చేసుకోగలను, కానీ నువ్వు ఎందుకు నవ్వుతున్నావు, కుమారా ?"

అష్టావక్రుడు అన్నాడు, " నేను ఎందుకు నవ్వుతున్నానంటే ఈ గోష్ఠిలో చర్మకారుల చేత సత్యం నిర్ణయించబడుతోంది "... ఆ మనిషి అసాధారణమైనవాడు అయివుంటాడు.

" ఈ చర్మకారులు అందరూ ఇక్కడ ఏం చేస్తున్నారు ? "

సమావేశమంతటా గాఢ నిశ్శబ్దం అలముకుంది. చర్మకారులా ? చెప్పులు కుట్టేవారా ?

ఆ రాజు అడిగాడు, " నీ ఉద్దేశ్యం ఏమిటి ?"

అష్టావక్రుడు అన్నాడు, " అది సరళం మరి సూటి అయినది. వారు కేవలం చర్మాన్ని మాత్రమే చూస్తున్నారు, వారు నన్ను చూడడం లేదు. నాకన్నా అధిక స్వచ్ఛత గల మరి సరళమైన మానవుడిని కనుగొనడం కష్టతరం, కానీ వారు దీనిని చూడడం లేదు ; వారు ఒక వంగిపోయివున్న మరి కురూపి అయిన శరీరాన్ని చూస్తున్నారు. వారు చర్మంతో పనిచేసేవారు, వారు చర్మాన్ని బట్టి నిర్ణయిస్తారు. మహారాజా, ఒక ఆలయం యొక్క ఒంపులో ఆకాశం ఒంపు తిరిగుతుందా ? ఒక కుండ నాశనం

చేయబడినప్పుడు, ఆకాశం నాశనమవుతుందా ? ఆకాశం మార్పుకు అతీతమైనది. నా శరీరం మెలికలు తిరిగి వుంది, కానీ నేను కాదు. అంతరంగంలో ఉన్నవాడివైపు చూడండి. అంతకన్నా సూటి అయిన మరి స్వచ్ఛమైన దానిని మీరు కనుగొనలేరు."

అది అత్యంత ఉలికిపాటును కలిగించే ప్రకటన. అక్కడ పూర్తి నిశ్శబ్దం ఆవరించి ఉంటుంది. జనకుడు ప్రభావితుడయ్యాడు మరి దిగ్భ్రమపరచబడ్డాడు : " నిశ్చయంగా సరైనది, తాను అక్కడ చర్మకారుల గుంపును ఎందుకు సమావేశపరచాడు ?" అతను పశ్చాత్తాపానికి గురయ్యాడు, తాను కూడా నవ్వినందుకు అతను అపరాధ భావనకు లోనయ్యాడు.

ఆ రోజు ఆ రాజు ఏమీ మాట్లాడలేకపోయాడు, కానీ ఆ మరునాడు, అతను తన ఉదయపు స్వారీ నిమిత్తమై బయటకు వచ్చినప్పుడు, అతను దారిలో అష్టావక్రుడిని చూశాడు. జనకుడు తన అశ్వంపై నుంచి దిగి మరి అతని పాదాల వద్ద ప్రణమిల్లాడు. ఆ ముందు రోజు, అందరి ముందూ, అతను ధైర్యం చెయ్యలేకపోయాడు. అప్పుడు అతను అన్నాడు, " నువ్వు ఎందుకు నవ్వుతున్నావు, కుమారా ?" అష్టావక్రుడు పన్నెండు సంవత్సరాల బాలుడు, మరి జనకుడు అతని వయస్సును పరిగణనలోకి తీసుకున్నాడు. ఈ రోజు అతను వయస్సును పట్టించుకోలేదు. ఈ రోజు అతను తన అశ్వంపై నుంచి కిందకు దిగాడు మరి సాష్టాంగ నమస్కారం చేస్తూ, అష్టావక్రుడి పాదాలపై పడ్డాడు.

అతను అన్నాడు, " దయచేసి రాజసౌధాన్ని సందర్శించండి, మరి సత్యం తెలుసుకోవాలనే నా కాంక్షను తృప్తిపరచండి. ఓ ప్రభూ, నా గృహానికి వచ్చి కటాక్షించండి. నేను అవగాహన చేసుకున్నాను. నేను రాత్రంతా నిద్రపోలేకపోయాను. మీరు సత్యమే వచించారు : కేవలం శరీరాన్ని మాత్రమే గుర్తించేవారు లోతైన అవగాహనను ఎలా కలిగివుండగలరు ? వారు అస్తిత్వం గురించి చర్చిస్తున్నారు, కానీ శరీరం పట్ల ఆకర్షణ మరి అసహ్యం ఇంకా ఉత్పన్నమవుతూనే ఉంది. అనశ్వరమైనదాని గురించి మాట్లాడుతూ వారు మృత్యువు వైపు చూస్తున్నారు. మీరు వచ్చి మరి నన్ను అనిశ్చలపరచి, మీరు నా నిద్రను భంగపరచడం వలన నేను అనుగ్రహింపబడ్డాను. దయచేసి రాజసౌధానికి విచ్చేయండి."

జనకుడు రాజసౌధాన్ని దేదీప్యమానంగా అలంకరింపజేశాడు. అతను అష్టావక్రుడిని స్వాగతించాడు మరి అతనిని ఒక బంగారు సింహాసనంపై ఆసీనుడిని చేశాడు... ఈ పన్నెండేళ్ళ ప్రాయంగల అష్టావక్రుడిని. అప్పుడు అతనిని తన ప్రశ్నలు అడిగాడు. మొదటి సూత్రం జనకుడి యొక్క విచారణ. జనకుడు అడిగాడు మరి

అష్టావక్రుడు వివరించాడు. దీనిని మించి, అష్టావక్రుడి గురించి ఏమీ తెలియదు. మరి ఇంకా అధికంగా తెలుసుకోవలసిన అవసరం లేదు, ఇదే చాలా ఎక్కువ. వజ్రాలు ఎక్కువ ఉండవు ; కేవలం గులకరాళ్ళు మరి స్ఫటికాలు ఎంతో సామాన్యమైనవి. ఒక్క వజ్రమైనా చాలు.

ఇవి రెండు చిన్న సంఘటనలు. ఒకటి జన్మించడానికి ముందు : " నువ్వు ఏ పిచ్చిలో పడిపోయావు. వేదాల చేత... మాటల చేత అయోమయానికి గురయ్యావా? మేలుకో ! ఇది జ్ఞానం కాదు, ఇది అంతా అరువు తెచ్చుకున్నది. ఇది అంతా మనస్సు యొక్క వలలో చిక్కుకోవడమే, అనుభవం కాదు. దానిలో లేశమాత్రపు వాస్తవమైనా లేదు. నిన్ను నువ్వు ఎంతకాలం వంచించుకుంటావు ?" అనే ప్రకటనతో గర్భంలో నుంచి వచ్చిన స్వరం.

మరి ఆ రెండవ సంఘటన : రాజసౌధంలోని పండితులు నవ్వడం మరి అష్టావక్రుడు జీవితంలో రెండు విధానాలలో చూడవచ్చు అని చెప్పడం : ఒకటి అస్తిత్వాన్ని చూడడం మరి మరొకటి చర్మాన్ని చూడడం.

చర్మకారులు చర్మాన్ని చూస్తారు, జ్ఞానులు అస్తిత్వాన్ని చూస్తారు.

మీరు గమనించారా ? ఒక చెప్పులు కుట్టేవాడు మీ ముఖం వైపు చూడడు, అతను మీ పాదరక్షలను మాత్రమే చూస్తాడు. వాస్తవానికి ఒక చెప్పులు కుట్టేవాడు కేవలం మీ చెప్పుల వైపు చూడడం ద్వారా మీ గురించి మొత్తం తెలుసుకోగలడు : మీ ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయి, మీరు సఫలమైన వ్యక్తులా లేదా విఫలమైనవాం; మీ అదృష్టం ఎలా వుంది... ఆ పాదరక్షల స్థితి అతనికి చెబుతుంది. మీ ఆత్మకథ మీ పాదరక్షలపై వ్రాసి ఉంటుంది ... చెప్పులు కుట్టేవాడు దానిని చదువగలడు. చెప్పులు మెరుస్తూ ఉంటే కనుక, చెప్పులు పరిశుభ్రంగా మరి కొత్తగా ఉంటే కనుక, చెప్పుల తయారీదారు మిమ్మల్ని కలుసుకోవడానికి సంతోషిస్తాడు. అతనికి మీ చెప్పులు మీ ఉనికి యొక్క నిరూపణలు. ఒక దర్జీ దుస్తులవైపు చూస్తాడు. మీ వస్త్రధారణ ఎలా వుంది అనేది చూసి అతను మీ పరిస్థితిని అర్థం చేసుకుంటాడు. అందరూ తమ స్వంత సంకుచిత దృష్టిని కలిగి వున్నారు. తన స్వీయ అస్తిత్వంతో నిండివున్న వ్యక్తి మాత్రమే అస్తిత్వాన్ని చూస్తాడు. అతనికి స్థిరపరచబడిన దృష్టి లేదు. అతను కేవలం దర్శనాన్ని కలిగి వున్నాడు.

మరొక చిన్న సంఘటన ... అది అష్టావక్రుడి గురించి కాదు కానీ రామకృష్ణుడు మరి వివేకానందుడి గురించి, కానీ అందులో అష్టావక్రుడూ కలసి వున్నాడు.. దీని తరువాత మనం సూత్రాలలోకి ప్రవేశిద్దాం.

వివేకానందుడు రామకృష్ణుడి వద్దకు వచ్చినప్పుడు అతని పేరు అప్పటికి ఇంకా నరేంద్రనాథుడే ... తరువాత రామకృష్ణుడు అతనికి వివేకానందుడు అని నామకరణం చేశాడు. అతను రామకృష్ణుడి వద్దకు వచ్చినప్పుడు అతను అతిగా తర్కించేవాడుగా, ఒక నాస్తికుడుగా, ఒక హేతువాదిగా ఉండేవాడు. అతను ప్రతిదానికీ రుజువును కోరేవాడు.

రుజువులు లేని విషయాలు కొన్ని ఉంటాయి ... చెయ్యగలిగినది ఏమీ లేదు. దైవత్వానికి ఏ రుజువూ లేదు : అది ఉంది, మరి అయినాగానీ రుజువు అనేది లేదు. ప్రేమకు ఏ రుజువూ లేదు. అది ఉంది, మరి అయినాగానీ రుజువు అనేది లేదు. సౌందర్యానికి రుజువు అనేది లేదు. అది ఉంది, మరి అయినాగానీ రుజువు అనేది లేదు.

ఒకవేళ నేను, " ఈ ఐరన్ ఉడ్ చెట్లు ఎంత అందంగా ఉన్నాయి," అని అంటే కనుక, మరి మీరు, " నాకు ఏ అందమూ కనిపించడం లేదు ... చెట్లు అంటే కేవలం చెట్లే. దానిని నిరూపించు !" అని అంటే కనుక, అది కష్టతరమైనది అవుతుంది. అవి అందంగా ఉన్నాయి అని ఎవరైనా ఎలా నిరూపించగలరు ? సౌందర్యాన్ని చూడడానికి మీకు సౌందర్య జ్ఞానం అవసరం ... మరొక మార్గం ఏదీ లేదు. మీకు కళ్ళు అవసరం ... మరొక మార్గం ఏదీ లేదు.

మజ్నూ ఇలా అన్నాడు అని చెప్పబడింది, " లైలాను తెలుసుకోవాలంటే మీరు మజ్నూ కళ్ళతో చూడాలి." అది సత్యం ; లైలాను చూడడానికి మరొక మార్గం ఏదీ లేదు.

అతని ప్రాంతపు మహారాజు మజ్నూను పిలిపించాడు మరి అన్నాడు," నువ్వు పిచ్చివాడివి ! నాకు నీ లైలా తెలుసు ... ఒక సామాన్యమైన అమ్మాయి, కారునలుపు... ప్రత్యేకతేదీ లేదు. నేను నీపై జాలి పడుతున్నాను, కనుక నా సౌధంలోని పన్నెండు మంది అమ్మాయిలు ఇక్కడ వున్నారు ... వారు దేశంలోనే అత్యంత సౌందర్యవతులు అయిన స్త్రీలు. నీకు నచ్చినవారు ఎవరినైనా నువ్వు ఎంపిక చేసుకోవచ్చు. నువ్వు విలపించడం చూసి, నా హృదయం కూడా విలపిస్తోంది."

మజ్నూ వారి వైపు చూశాడు మరి అన్నాడు, " వారిలో లైలా లేదు. వారిని లైలాతో పోల్చనైనా పోల్చలేము. వారు ఆమె పాదధూళితోనైనా సమానం కాదు."

ఆ రాజు అన్నాడు, " మజ్నూ, నువ్వు పిచ్చివాడివి...!"

మజ్నూ అన్నాడు, " అయివుండవచ్చు, కానీ నేను మీకు ఒక విషయం చెప్పాలి : లైలాను చూడాలి అంటే మీకు మజ్నూ యొక్క కళ్ళు కావాలి."

మజ్నూ సరిగ్గా చెప్పాడు. వృక్షాల సౌందర్యాన్ని చూడాలంటే మీకు కళాత్మక దృష్టి అవసరం ... ఏ రుజువూ లేదు. ఎవరైనా ప్రేమను తెలుసుకోవాలి అనుకుంటే, వారికి ఒక ప్రేమికుడి హృదయం కావాలి... ఏ రుజువూ లేదు. మరి సౌందర్యమంతటి యొక్క ప్రేమ అంతటి యొక్క మరి ఈ విశ్వపు సత్యమంతటి యొక్క సామూహిక నామమే దైవత్వం. దానికి నిస్సందేహమైన చైతన్యం అవసరం, సాక్షీతత్వం అవసరం... అక్కడ ఏ మాటా మిగిలి వుండదు, ఏ ఆలోచనా మిగిలి వుండదు, ఏ కెరటమూ ఎగిసి పడదు... అక్కడ ఏ మానసికపరమైన ధూళీ మిగిలి వుండదు మరి చైతన్యత్వపు దర్పణం నిష్కళంకమైన స్వచ్ఛతతో ఉంటుంది. రుజువు ఏమిటి ?

రామకృష్ణుడితో వివేకానందుడు అన్నాడు, " నాకు రుజువు కావాలి. భగవంతుడు ఉంటే కనుక దానిని నిరూపించండి."

రామకృష్ణుడు వివేకానందుడివైపు చూశాడు. ఈ యువకుడు అభివృద్ధికి రాదగినవాడు, గొప్ప శక్యతను కలిగి వున్నాడు. వివేకానందుడికి పరిచయంలేని ఒక గొప్ప నిధి ఉంది. రామకృష్ణుడు ఈ యువకుడి గత జన్మలలోకి చూశాడు, సూక్ష్మ దృష్టితో చూశాడు. వివేకానందుకు ఒక గొప్ప నిధిని, సత్యం యొక్క గొప్ప నిధిని తీసుకువచ్చాడు, కానీ అది అతని తర్కం కింద అణచివేయబడి వుంది. ఇది చూసి, తీవ్ర మనోవేదన మరి కరుణలతో కూడిన కేక రామకృష్ణుడి యొక్క హృదయంలో నుంచి వెలువడి వుంటుంది. అతను అన్నాడు, " ఇదంతా మరచిపో. మనం రుజువు మరి అటువంటి విషయాల గురించి తరువాత మాట్లాడుకుందాం. నేను కొద్దిగా వృద్ధుడిని అయ్యాను, నాకు చదవడం కష్టతరంగా ఉంది ; నువ్వు యువకుడివి, నీ కళ్ళు ఇంకా బలంగా ఉన్నాయి... అక్కడ ఉన్న పుస్తకంలో నుంచి చదువు " అది అష్టావక్ర గీత. " నాకు వినిపించేలా కొంచెం గట్టిగా చదువు."

వివేకానందుడికి ఇందులో తప్పు ఏమీ కనిపించలేదని చెప్పబడుతుంది, ఈ వ్యక్తి ప్రత్యేకమైనది ఏదీ కోరడం లేదు. అతను మూడు లేదా నాలుగు సూత్రాలు చదివాడు మరి ప్రతీ కణమూ కనిపించడం ప్రారంభించింది. అతను భీతి చెందడం ప్రారంభించాడు మరి అతను అన్నాడు, " నేను చదవడం కొనసాగించలేను."

రామకృష్ణుడు పట్టుబట్టాడు, " ముందుకు సాగు మరి చదువు. దానిలో ఏం హాని ఉండగలదు ? ఈ పుస్తకం నిన్ను ఎలా నొప్పించగలదు ? నువ్వు యువకుడివి,

నీ కళ్ళు ఇంకా తాజాగానే ఉన్నాయి, మరి నేను వృద్ధుడిని, చదవడం అనేది నాకు కష్టతరమైనది. నేను ఈ పుస్తకాన్ని వినాలి ... దానిని నాకు చదివి వినిపించు."

వివేకానందుడు ఆ పుస్తకంలో ఉన్నదానిని బిగ్గరగా చదువుతూపోయాడు, మరి ధ్యానంలో మాయమైపోయాడు అని చెప్పబడుతుంది. రామకృష్ణుడు ఈ యువకుడు వివేకానందుడిలో, గొప్ప శక్యతను, ఒక అత్యంత పురోభివృద్ధి చెందగల శక్యతను, ఏదో ఒకరోజు ఒక బుద్ధుడు అవ్వడానికి నిర్దేశించబడిన ఒక బోధిసత్వుడి వంటి శక్యతను చూశాడు. ముందువెనుకలుగా, అతను ఎంతగా త్రోవ తప్పి సంచరించినా గానీ, అతను బుద్ధత్వాన్ని చేరుకోబోతున్నాడు.

తనకు అష్టావక్ర గీతను బిగ్గరగా చదివి వినిపించమని రామకృష్ణుడు ఎందువలన అతనిని అడిగాడు ? ఎందువలనంటే సత్యం యొక్క మరింత స్వచ్ఛమైన వివరణము ఏదీ లేదు ?

ఈ మాటలు మీలోకి చొచ్చుకుపోతే కనుక, అవి మీ నిదురిస్తున్న ఆత్మను మేల్కొల్పడం ప్రారంభిస్తాయి. ఈ మాటలు మిమ్మల్ని పులకరింపజేస్తాయి. ఈ మాటలు మిమ్మల్ని బ్రహ్మానందంతో నింపుతాయి. ఈ మాటలు మిమ్మల్ని ఆఘాతానికి గురిచేస్తాయి.

ఈ మాటలతో ఒక విప్లవం చోటు చేసుకోవచ్చు.

నేను అష్టావక్ర గీతను ఆకస్మికంగా ఎంపిక చేసుకోలేదు. నేను దానిని ఇంతకు ముందే ఎంపిక చేసుకుని వుండేవాడిని కాదు ... నేను దానిని ఒక సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, ఎంతో ఆలోచించిన తరువాత ఎంపిక చేసుకున్నాను. నేను కృష్ణుడి గీత గురించి మాట్లాడిన సమయం వుంది ఎందుకంటే నా చుట్టూ ఒక సమూహం ఉంది. ఒక సమూహానికి అష్టావక్ర గీత అర్థవంతమైనది కాదు. గొప్ప ప్రయత్నంతో నేను ఆ సమూహాన్ని వదిలించుకున్నాను.

ఇప్పుడు కొద్దిమంది వివేకానందులు ఇక్కడ ఉన్నారు.

ఇప్పుడు నేను గొప్ప శక్యతగలవారితో మాట్లాడాలని అనుకుంటున్నాను.

ఎవరిపైన పనిచేయడం అనేది ఫలితాలను తెస్తుందో ఆ కొద్దిమందితో నేను పనిచేస్తాను. ఇప్పుడు నేను వజ్రాలను మలుస్తాను. స్ఫటికాలు మరి రాళ్ళపై ఈ ఉలిని నాశనం చెయ్యకూడదు. ఇందువలనే నేను అష్టావక్ర గీతను ఎంపిక చేసుకున్నాను : మీరు సిద్ధంగా ఉన్నారు కనుక నేను దానిని ఎంచుకున్నాను.

మొదటి సూత్రం.

జనకుడు అడిగాడు : " ఓ ప్రభూ, ఎవ్వరైనా ప్రజ్ఞను ఎలా సిద్ధించుకోవాలి ? మరి విముక్తి ఎలా సంభవిస్తుంది ? మరి నిస్సంగం ఎలా సాధించబడుతుంది ? దయచేసి దీనిని నాకు తెలియజేయండి."

" నాకు చెప్పండి, ఓ ప్రభూ, దయచేసి దానిని నాకు వివరించండి." పన్నెండేళ్ళ బాలుడితో జనక మహారాజు అంటాడు, " ఓ ప్రభూ, భగవాన్. దయచేసి వివరించండి. నా వంటి తెలియనివాడికి కొంత అవగాహనను ప్రసాదించండి. నా వంటి అజ్ఞానిని జాగృతపరచండి."

మూడు ప్రశ్నలు అడుగబడ్డాయి....

ఎవ్వరైనా ప్రజ్ఞను ఎలా సిద్ధించుకోవాలి ? సహజంగానే, మనం విస్మయానికి గురి కావచ్చు, అతను అడుగవలసి అవసరం ఏం వుంది ? ఈ విషయాలతో నిండిన పుస్తకాలు ఉన్నాయి. జనకుడికి కూడా ఇది తెలుసు.

పుస్తకాలు దేనితో అయితే నిండి వున్నాయో అది ప్రజ్ఞ కాదు. అది కేవలం ప్రజ్ఞ వదిలి వెళ్ళిన ధూళి ... బూడిద. ప్రజ్ఞా జ్వాల జ్వలించినప్పుడు, బూడిద మిగల్చబడుతుంది. బూడిద పోగవుతూ పోతుంది, మరి అది పవిత్ర ప్రతి అవుతుంది. వేదాలు బూడిదలే ; ఒకప్పుడు అవి జ్వలిస్తున్న బొగ్గులు. వేదర్షులు వాటిని తమ ఆత్మలలో జ్వలింపజేశారు మరి బూడిద వెనుక వదలివేయబడింది. అప్పుడు ఆ బూడిదలు సేకరించబడ్డాయి, సంకలనం చేయబడ్డాయి మరి క్రమానుసారం పొందుపరచబడ్డాయి.

అది ఒక మనిషి యొక్క శరీరం దహనం అయిన తరువాత ప్రజలు ఆ బూడిద మరి ఎముకలను సేకరించడంలాంటిది. వారు వీటిని " పుష్పాలు " అంటారు. ప్రజలు అత్యంత విచిత్రమైనవారు. అతను సజీవంగా ఉన్నప్పుడు వారు ఆ మనిషిని ఎన్నడూ ఒక పుష్పం అని పిలువలేదు, కానీ అతనిని దహనం చేసిన తరువాత తాము పుష్పాలను సేకరించాం అని అంటూ వారు అతని అస్థికలను సేకరిస్తారు. అప్పుడు వారు వాటిని భద్రపరుస్తారు, వాటిని ఒక భరిణలో ఉంచుతారు. ఆ మనిషి జీవించి వున్నప్పుడు వారు ఎన్నడూ అతనిని ఒక పుష్పంలా గౌరవించలేదు ; అతను జీవించి ఉన్నప్పుడు వారు ఎన్నడూ అతనివైపు ఒక పుష్పంలా చూడనే చూడలేదు. అతను మరణించినప్పుడు... మానవుడు మతిస్థిమితం లేనివాడు !... వారు అతని అస్థికలను, అతని చితా భస్మాన్ని, పుష్పాలు అని పిలుస్తారు.

అదే విధంగా, ఒక బుద్ధుడు సజీవుడై ఉన్నప్పుడు మీరు వినరు. ఒక మహావీరుడు మీలో నడచినప్పుడు, మీరు ఆగ్రహిస్తారు. ఈ మనిషి మీ స్వప్నాలను నాశనం చేస్తున్నట్లు లేదా మీ నిద్రలో జోక్యం చేసుకుంటున్నట్లు కనిపిస్తుంది : "ఇది అసలు మేల్కొనవలసిన సమయమా ? సరిగ్గా నా కలలు నిజం కాబోతున్నప్పుడు, సరిగ్గా విజయం నా జీవితంలో ప్రవేశిస్తున్నప్పుడు, సరిగ్గా నా అవకాశాలు మెరుగు అవుతున్నప్పుడు, బాణం తన లక్ష్యాన్ని చేరబోతున్నప్పుడు ... ఇప్పుడు ఈ వ్యక్తి వస్తాడు మరి ప్రతిదీ అర్థరహితమైనది అని అంటాడు ! నేను ఎన్నికలలో గెలుపొందగానే మరి అధికారంలోకి రావడానికి మార్గం తెరచివున్నప్పుడు, ఈ ఉన్నత మానవుడు వస్తాడు, మరి ఇది అంతా ఒక కల అని, దానికి అర్థం లేదు అని, మృత్యువు వచ్చి అన్నింటినీ తీసుకుపోతుంది అని చెబుతాడు. ఈ విధంగా మాట్లాడవద్దు ! మృత్యువు వచ్చినప్పుడు మేం చూస్తాం, కానీ ఇప్పుడు అటువంటి ప్రస్తావన సైతం తీసుకురావద్దు."

కానీ మహావీరుడు మరణించినప్పుడు లేదా బుద్ధుడు మరణించినప్పుడు మనం వారి చితా భస్మాలను సేకరిస్తాం. మనం వాటి నుంచి ధమ్మపదాన్ని సృష్టిస్తాం, మనం వేదాలను సృష్టిస్తాం, మరి అప్పుడు మనం పూజా పుష్పాలను సమర్పిస్తాం.

పవిత్ర గ్రంథాలు అన్నీ కేవలం సమాచారంతో నిండి ఉన్నాయి అని కూడా జనకుడికి తెలుసు. కానీ అతను అడిగాడు, ***ఎవ్వరైనా ప్రజ్ఞను ఎలా సిద్ధించుకోవాలి ?*** ... ఎందుకంటే మీకు ఎంత తెలిసివున్నాగానీ, ప్రజ్ఞ అనేది సిద్ధించదు. మీరు మరింత మరింత జ్ఞానాన్ని పోగుచేసుకుంటూ పోవచ్చు, పవిత్ర గ్రంథాలను కంఠస్థం చేయవచ్చు, చిలుకలుగా తయారవ్వవచ్చు, ప్రతీ ఒక్క సూత్రాన్నీ స్మృతిలో ఉంచుకోవచ్చు, మీ స్మృతిలో వేదాలను సంపూర్తిగా ముద్ర వేయనివ్వవచ్చు ... అయినాగానీ ప్రజ్ఞ అనేది ఉండదు. ***ఎవ్వరైనా ప్రజ్ఞను ఎలా సిద్ధించుకోవాలి ? విముక్తి ఎలా సంభవిస్తుంది ?*** అతను అడిగాడు ఎందుకంటే మీరు ప్రజ్ఞ, జ్ఞానం అని పిలిచేది, బదులుగా మిమ్మల్ని బంధిస్తుంది ... ఇది విముక్తి ఎలా అవ్వగలదు ? మిమ్మల్ని విముక్తం చేసేదే ప్రజ్ఞ. "సత్యం మిమ్మల్ని స్వతంత్రులను చెయ్యాలి," అని జీసస్ అన్నాడు. మిమ్మల్ని విముక్తం చేసేదే ప్రజ్ఞ... సత్యం యొక్క లక్షణం ఇదే. పండితులు విముక్తం అయినట్లు కనిపించరు, వారు బంధితులైనట్లుగా కనిపిస్తారు. వారు విముక్తి గురించి మాట్లాడుతారు కానీ వారు స్వేచ్ఛాయుతులుగా కనిపించరు. వాళ్ళు వెయ్యి సంకెళ్ళతో బంధించబడి వున్నట్లుగా కనిపిస్తారు.

మీరు ఎప్పుడైనా గమనించారా : మీ ధార్మిక వ్యక్తులు అనబడేవారు మీకన్నా ఎక్కువ బానిసలుగా వున్నట్లు కనిపిస్తారు. మీరు కొంత స్వేచ్ఛను కలిగివుండవచ్చు, కానీ మీ మహాత్ములు మీకన్నా ఎక్కువ ఇరుక్కుని ఉన్నారు. వాళ్ళు కేవలం సంప్రదాయాన్ని గుడ్డిగా అనుసరిస్తున్నారు. వాళ్ళు స్వేచ్ఛగా కదలలేరు, వాళ్ళు స్వేచ్ఛగా కూర్చోలేరు, వాళ్ళు స్వేచ్ఛగా జీవించలేరు.

కొద్దిరోజుల క్రితం నాకు కొందరు జైన సాధ్వీలు, జైన సన్యాసినుల నుంచి, వాళ్ళు నన్ను కలుసుకోవాలని అనుకుంటున్నారనీ, కానీ వాళ్ళ శిష్యులు వారిని రావడానికి అనుమతించడం లేదు అనీ, సందేశం వచ్చింది. ఇది ఒక అత్యంత విచిత్రమైన పరిస్థితి ! ఒక సాధ్వి అంటే ఇక సంఘం గురించి పట్టించుకోని వ్యక్తి, అవిదితమైన అరణ్యాలలోకి ఓ ప్రస్థానాన్ని ప్రారంభించిన వ్యక్తి, " ఇక నాకు మీ గౌరవం లేదా మీ మన్ననల అవసరం లేదు," అని చెప్పిన వ్యక్తి అని అర్థం. కానీ ఆ సన్యాసినులు మరి సాధువులు చెబుతారు, " శిష్యులు మమ్మల్ని రావడానికి అనుమతించడం లేదు." వారు అంటారు, " అక్కడికి వెళ్ళాలి అని అనుకోనైనా వద్దు. మీరు అక్కడికి వెళితే కనుక మేము మా ద్వారాలను మీపై మూసివేస్తాం." వాళ్ళు ఏ రకమైన అన్వేషకులు ? ఇది కేవలం పరాధీనత, బానిసత్వం. ఇది పూర్తిగా వెనుకకు నడవడం. దాని అర్థం ఏమిటంటే సాధ్వి ఆ శిష్యుడిని రూపాంతరీకరించే బదులు, ఆ శిష్యుడే సాధ్విని రూపాంతరీకరిస్తున్నాడు.

ఒక మిత్రుడు వచ్చి మరి నాకు ఏమని చెప్పాడంటే ఒక జైన సాధ్వి నా పుస్తకాలను చదువుతుంది, కానీ కేవలం రహస్యంగా. ఆమె నా టేపులను కూడా వినడానికి ప్రయత్నిస్తుంది, కానీ మళ్ళీ రహస్యంగానే. మరి యాదృచ్ఛికంగా ఎవరైనా నా పేరును ఆమె సమక్షంలో ప్రస్తావిస్తే కనుక, ఆమె నా గురించి ఎన్నడూ విననట్లుగా నటిస్తూ అక్కడ కూర్చుని వుంటుంది. విముక్తి అంటే ఇదా ?

జనకుడు అడిగాడు : **విముక్తి ఎలా సంభవిస్తుంది ?** " విముక్తి అంటే ఏమిటి ? విముక్తిని కలిగించేదైన ప్రజ్ఞను నాకు వివరించండి."

స్వేచ్ఛ అనేది మానవుడి యొక్క అత్యంత ప్రధాన కాంక్ష. అన్నింటినీ సాధించండి, కానీ మీరు ఇంకా స్వేచ్ఛగా లేనట్లయితే, అది బాధిస్తుంది. అన్నింటినీ సిద్ధించుకోండి, కానీ స్వతంత్రం సిద్ధించనట్లయితే, మీరు దేనినీ సిద్ధించుకోలేదు.

మానవుడు తెరచివున్న ఆకాశాన్ని, అనంతమైన దానిని కోరుకుంటాడు. ఇది మానవుడి యొక్క అత్యంత ఆంతరంగిక కాంక్ష, అత్యంత రహస్యమైన కాంక్ష ... ఏ

పరిమితులూ, ఏ అడ్డంకులూ లేని ఒక ప్రదేశం కోసం. మీరు దానిని దైవికమైన వారు కావాలనే కాంక్ష అని పిలువవచ్చు లేదా దానిని మోక్షం, విముక్తి కోసం కాంక్ష అని పిలువవచ్చు. సంస్కృతంలో మేము సరైన పదాన్ని ఎంచుకున్నాం, మోక్షం. అంతటి అందమైన పదం మరే ఇతర భాషలోనూ లేదు. హెవెన్, ప్యారడైజ్ (స్వర్గం) లాంటి పదాలు ఉన్నాయి, కానీ మోక్షం యొక్క శ్రావ్యత ఆ పదాలలో లేదు. మోక్షం ఒక అద్వితీయ సంగీతాన్ని కలిగివుంది. దాని సరళమైన అర్థం ఏమిటంటే అది ఎంతటి అత్యున్నతమైన స్వేచ్ఛ అంటే దానికి ఏ అడ్డంకీ లేదు ; ఎంతటి స్వచ్ఛమైన స్వేచ్ఛ అంటే అది అపరిమితమైనది.

జనకుడు అడిగాడు : ... విముక్తి ఎలా సంభవిస్తుంది ?
మరి నిస్సంగం ఎలా సాధించబడుతుంది ?
ఓ ప్రభూ, దయచేసి దీనిని నాకు తెలియజేయండి.

జనకుడి వైపు అష్టావక్రుడు సావధానంగా చూసి వుంటాడు ... ఎందుకంటే ఎవరైనా అడిగినప్పుడు ఒక గురువు చేసే మొదటి పని ఇదే. అతను శ్రద్ధగా గమనిస్తాడు : ఈ విచారణ ఏ మూలం నుంచి ఉదయిస్తోంది ? ప్రశ్నించే వ్యక్తి దేనినో ఎందుకు అడిగాడు ? ఆ ప్రశ్న ఎందుకు అడుగబడింది అనేది అతను స్పష్టంగా అవగాహన చేసుకున్నప్పుడు మాత్రమే ఆ గురువు సమాధానం భావగర్భితమైనది అవ్వగలదు.

గుర్తుంచుకోండి, సత్యాన్ని సిద్ధించుకున్న వ్యక్తి ... ఒక గురువు ... మీ ప్రశ్నకు సమాధానం ఇవ్వడు. అతను **'మీకు'** సమాధానం ఇస్తాడు.

మీరు ఏం అడుగుతున్నారు అనేది అతను పెద్దగా పట్టించుకోడు, మీరు ఎందుకు అడిగారు, ఆ ప్రశ్న వెనుక ఏం వుంది, అచేతనంలో దాగివున్న సంకీర్ణత ... మీ ప్రశ్న అనే తెర వెనుక వాస్తవంగా దాగి వున్న కోరిక ఏమిటి అనేదాని పట్ల అతను అధిక నిమిత్తం కలిగివున్నాడు.

ప్రపంచంలో నాలుగు రకాల ప్రజలు ఉన్నారు : జ్ఞాని, అన్వేషకుడు, అజ్ఞాని, మూర్ఖుడు. మరి నాలుగు రకాల విచారణలు వున్నాయి. మొదటి విచారణ పదాలు లేనిది ... జ్ఞాని యొక్క విచారణ, తెలిసినవాడు. వాస్తవానికి జ్ఞాని యొక్క విచారణ అసలు విచారణే కాదు. అతనికి తెలుసు ... తెలుసుకోవడానికి ఏదీ మిగిలిలేదు. అతను చేరుకున్నాడు ; మనస్సు స్పష్టమయ్యింది, నిశ్శబ్దమయ్యింది. అతను స్వగృహానికి చేరాడు, అతను విశ్రాంతస్థితికి వచ్చాడు.

కనుక ఒక జ్ఞాని యొక్క విచారణ అసలు విచారణే కాదు. దీని అర్థం ఒక జ్ఞాని నేర్చుకోవడానికి సిద్ధంగా లేడు అని కాదు. ఒక జ్ఞాని సరళమైనవాడు అవుతాడు, ఒక పసిబాలుడిలా ... అతను ఎల్లప్పుడూ నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటాడు. మీరు ఎంతగా నేర్చుకుంటే, నేర్చుకోవడానికి అంత ఎక్కువ సంసిద్ధత వృద్ధి అవుతుంది. మీరు ఎంత ఎక్కువ సరళంగా మరి అమాయకంగా అయితే, అంత ఎక్కువగా మీరు నేర్చుకోవడానికి తెరువబడి ఉంటారు. పవనాలు వస్తాయి మరి మీ ద్వారాలు తెరచివుండడం కనుగొంటాయి. సూర్యుడు వస్తాడు మరి మీ తలుపును తట్టవలసిన అవసరం ఉండదు. అస్తిత్వం వస్తుంది మరి మీరు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉండడం కనుగొంటుంది.

ఒక జ్ఞాని జ్ఞానాన్ని సేకరించడు, అతను కేవలం తెలుసుకోగల సామర్థ్యాన్ని కలిగివుంటాడు. దీనిని చక్కగా అవగాహన చేసుకోండి, ఎందుకంటే అది మీకు ఉపయోగకరం అవుతుంది. ' జ్ఞాని ' అంటే సరళమైన అర్థం, నేర్చుకోవడానికి పూర్తి సంసిద్ధతతో ఉన్న వ్యక్తి, దురభిమానం లేనివాడు, నేర్చుకోవడానికి ప్రతికూలంగా ఏ అడ్డూ లేనివాడు, తెలుసుకోవడానికి ఏ పూర్వ ప్రణాళికా వ్యవస్థ లేదా నిర్మాణం లేనివాడు. ఒక జ్ఞాని అంటే అర్థం ఒక **ధ్యాని**, ధ్యానమగ్నమైన వ్యక్తి.

అష్టావక్రుడు శ్రద్ధగా గమనించి, జనకుడిలోనికి చూసి ఉంటాడు మరి ఈ వ్యక్తి ఒక జ్ఞాని కాదు, అతను ధ్యానాన్ని సిద్ధించుకోలేదు అనేది చూసివుంటాడు ; లేదంటే అతని విచారణ నిశ్శబ్దంగా ఉండేది, దానిలో ఏ పదాలు ఉండేవి కాదు.

బుద్ధుడి జీవితంలో ఒక సంఘటన ఉంది... అతనిని కలుసుకోవడానికి ఒక ఫకీరు వచ్చాడు ; ఒక ఏకాకి తపస్వి, ఒక సంచారి అతనిని చూడడానికి వచ్చాడు. అతను వచ్చాడు మరి బుద్ధుడితో అన్నాడు : అడగడానికి తగిన పదాలు నా వద్ద లేవు, నేను అడగాలి అనుకుంటున్నదానిని పదాలలోకి తీసుకురాగల నైపుణ్యం నాకు లేదు. మీకు ఇప్పటికే అది తెలుసు. అవగాహన చేసుకోండి మరి నాకు ఏది సరైనదో తెలియజేయండి." ఒక తెలిసిన వ్యక్తి యొక్క విచారణ ఇది.

బుద్ధుడు మౌనంగా కూర్చుని ఉన్నాడు. అతను ఒక్క విషయం కూడా చెప్పలేదు. కొద్ది సమయం తరువాత ఏదో జరిగినట్లుగా కనిపించింది. ఆ మనిషి బుద్ధుడి వైపు చూస్తున్నాడు, మరి ఇప్పుడు అతని కళ్ళు కన్నీళ్ళతో పొంగి పొరలడం ప్రారంభించాయి. అతను బుద్ధుడి పాదాల వద్ద మోకరిల్లాడు మరి అన్నాడు, " ధన్యవాదాలు ! నేను నిజంగా భాగ్యశాలిని ... నేను ఇక్కడికి దేనికోసం వచ్చానో దానిని మీరు నాకు

ఇచ్చారు." అతను పైకి లేచాడు వెళ్ళిపోయాడు. అతని వదనం అద్వితీయ తేజస్సుగల ఆరాను ప్రకాశింపజేస్తోంది. అతను నాట్యం చేస్తూ వెళ్ళాడు.

బుద్ధుడి శిష్యులు అయోమయానికి గురయ్యారు. ఆనందుడు అడిగాడు, "భగవాన్. ఇది ఒక రహస్యం. మొదట ఈ మనిషి అంటాడు, "నాకు ఎలా అడగాలో తెలియదు, ఏ పదాలలో అడగాలో నాకు తెలియదు, నేను ఏం అడగాలని వచ్చానో కూడా నాకు తెలియదు. కానీ మీకు అన్నీ తెలుసు. నావైపు చూడండి, నాకు అవసరమైనది ఏదో చెప్పండి." మొదట, ఈ మనిషి ఒక రహస్యం. విచారణ చేయదగిన విధానమేనా ఇది ? ఏం అడగాలో మీకు తెలియనప్పుడు, అసలు అడగడం ఎందుకు ? మీరు ఎలా అడగగలరు ? అవిశ్వసనీయం!

"కానీ విషయం ఇక్కడ ముగిసిపోలేదు. మీరు మౌనంగా కూర్చుని ఉన్నారు, మరి మీరు మౌనంగా కూర్చోవడాన్నే కొనసాగించారు. అంత నిశ్శబ్దంగా మీరు కూర్చోవడం మేము ఎన్నడూ చూడలేదు. ఎవరైనా అడిగితే కనుక, మీరు సమాధానం ఇస్తారు. కొన్నిసార్లు ఏం జరుగుతుందంటే ఎవరో అడగకుండా ఉంటారు మరి అయినా మీరు సమాధానం ఇస్తారు. మీ కరుణ నిరంతరం ప్రవహిస్తూంటుంది. ఏం జరగడం వలన అకస్మాత్తుగా మీరు మౌనంగా ఉన్నారు మరి మీ కళ్ళు మూసి వున్నాయి ? మరి అప్పుడు ఏ రసవాదం జరగడం వలన ఆ మనిషి రూపాంతరం చెందడం ప్రారంభించాడు ? అతను మారడం మేము చూశాం. అతను సంపూర్ణ మార్పును పొందడం మేము చూశాం. బ్రహ్మానందం అతనిపై ఆవరించడం మేము చూశాం. అతను కన్నీరు కార్చుతూ, మునిగిపోయి, బ్రహ్మానందంతో వెళ్ళాడు. అతను మీ పాదాలకు ప్రణమిల్లాడు. అతని పరిమళం మమ్మల్ని కూడా స్పృశించింది. ఏం సంభవించింది ? మీరు ఒక్క పదమైనా ఉచ్ఛరించలేదు ; అతను ఎలా విన్నాడు? ఎన్నో రోజులు, ఎన్నో సంవత్సరాలపాటు మేం మీతో ఉన్నాం. మాపై మీరు తక్కువ కరుణ చూపుతున్నారా ? మీరు అతనికి ఇచ్చిన ఆ అనుగ్రహాన్ని మేము ఎందుకు పొందడం లేదు ?"

కానీ గుర్తుంచుకోండి, మీరు ఎంత స్వీకరించగలరో అంతే మీరు పొందుతారు.

బుద్ధుడు, "విను. అశ్వాలు..." అతను ఆనందుడితో అశ్వాల గురించి మాట్లాడుతాడు, ఎందుకంటే ఆనందుడు ఒక యోధుడిగా ఉండేవాడు. అతను బుద్ధుడి యొక్క బంధువు, మరి చిన్న వయస్సు నుంచే అశ్వాలంటే ఎంతో మక్కువ చూపేవాడు. అతను ఒక రౌతు. అతను ఒక సుప్రసిద్ధుడైన రౌతు, ఒక గొప్ప ప్రత్యర్థి.

" విను, ఆనందా," బుద్ధుడు అన్నాడు, " నాలుగు రకాల అశ్వాలు ఉన్నాయి. ఒక రకం అశ్వం నువ్వు దానిని కొరడాతో కొట్టినా కూడా ఒక్క అంగుళమైనా కదలదు ... అశ్వాలన్నింటిలోకీ అత్యంత నిరుపయోగమైనది. నువ్వు వాటిని ఎంతగా కొరడాతో కొడితే అంత ఎక్కువ మొండిగా అవి అడ్డగిస్తాయి. అవి నిశ్చలంగా నిలబడతాయి ... ఒక హఠయోగి నిలబడినంత మొండిగా. మీరు వాటిని కొరడాతో కొడితే మీరు అడ్డగింతను మాత్రమే రేపుతారు.

" తరువాత రెండవ రకం అశ్వం ఉంది. మీరు వాటిని కొరడాతో కొడితే అవి కదులుతాయి. మీరు వాటిని కొరడాతో కొట్టకపోతే అవి కదలవు. కనీసం అవి మొదటివాటికంటే మెరుగైనవి.

" మరి మూడవ రకం అశ్వం ఉంది. కేవలం కొరడా ఝళిపించండి... వాటిని కొట్టవలసిన అవసరం లేదు. కేవలం కొరడాను ఝళిపించండి, ఆ శబ్దమే చాలు, అవి అధిక రాజసం కలవి ... మరి రెండవ రకం కన్నా మెరుగైనవి.

" తరువాత, ఆనందా, కేవలం కొరడా నీడను చూడగానే పరుగెత్తే అశ్వాలు నీకు తెలిసే ఉండాలి. మీరు దానిని కనీసం ఝళిపించవలసిన అవసరం కూడా ఉండదు. ఆ మనిషి ఆ రకమైన అశ్వం : నీడ మాత్రమే చాలు."

అష్టావక్రుడు శ్రద్ధగా చూసి ఉంటాడు.

మీరు నన్ను ఏమైనా అడగాలని వచ్చినప్పుడు, స్వయంగా మీరే ఒక ప్రశ్న, మీరు అడిగేదానికన్నా అత్యంత ప్రధానమైనది. మీరు అడగని ప్రశ్నకు నేను సమాధానమిచ్చాను అనేది కూడా కొన్నిసార్లు మీరు అనుభూతి చెందవచ్చు. మరి బహుశా నేను మీ ప్రశ్నను విసర్జించి, దాని నుంచి పక్కకు వెళ్ళి మరి దేనికో సమాధానమిచ్చాను అని కూడా మీరు అనుభూతి చెందవచ్చు. కానీ నాకు మీ అంతర్గత అవసరం ఎల్లప్పుడూ అత్యంత ప్రధానమైనది, మీరు ఏం అడుగుతున్నారు అనేది ప్రధానం కాదు...ఎందుకంటే మీరు ఏం అడుగుతున్నారు, మీరు ఎందుకు అడుగుతున్నారు అనేది నిజానికి స్వయంగా మీకే తెలియదు. మీ అవసరానికి మాత్రమే సమాధానం ఇవ్వబడుతుంది ; సమాధానంలోనిది ఏదీ మీ ప్రశ్న ద్వారా నిర్ణయించబడదు.

జనకుడు ఒక జ్ఞాని కాదు అనేది అష్టావక్రుడు చూసి ఉంటాడు. అయితే అతను అజ్ఞానియా ? కాదు, అతను అజ్ఞాని కూడా కాదు... ఎందుకంటే అజ్ఞాని దురహంకారపూరితుడై ఉంటాడు, అతను గర్వంతో నిటారుగా నిలబడుతాడు. అతనికి

ఎలా వంగి నమస్కరించాలో కూడా తెలియదు ... మరి ఈ మనిషి అతని పాదాల వద్ద ప్రణమిల్లాడు, ఒక పన్నెండేళ్ళ బాలుడి యొక్క పాదాల వద్ద సాష్టాంగపడ్డాడు. అజ్ఞానికి ఇది అసాధ్యం. తనకు ఇప్పటికే తెలుసు అని అజ్ఞాని భావిస్తాడు ... అతనికి ఏదైనా ఎవరు వివరించగలరు ? ఒక అజ్ఞాని అడిగినా కూడా, అతను కేవలం మీరు తప్పు అని నిరూపించడానికే అడుగుతాడు, ఎందుకంటే ఆ అజ్ఞాని తనకు అప్పటికే తెలుసు అని అనుకుంటాడు మరి మీకు తెలుసా లేక తెలియదా అనేది చూడాలని అనుకుంటాడు. అజ్ఞాని మిమ్మల్ని పరీక్షించడానికి అడుగుతాడు.

అష్టావక్రుడు అనుకుని ఉంటాడు, " లేదు, జనకుడి కళ్ళు అత్యంత స్పష్టంగా ఉన్నాయి. అతను ఒక మహారాజు అయినా కూడా అతను నన్ను, ఒక పన్నెండేళ్ళ, తెలియని, అపరిచిత బాలుడిని అడిగాడు, " ఓ ప్రభూ. దయచేసి నాకు వివరించండి..." లేదు, అతను వినమ్రుడై ఉన్నాడు, అతను అజ్ఞాని కాదు. అయితే అతను ఒక మూర్ఖుడా ? మూర్ఖులు ఎన్నడూ అడగరు. జీవితంలో ఏవైనా సమస్యలు ఉన్నాయి అనే తలపు సైతం మూర్ఖులకు ఉండదు.

మూర్ఖులు మరియు జ్ఞానోదయం పొందినవారి మధ్య ఒక సారూప్యం ఉంది. జ్ఞానోదయం పొందినవారికి ఏ సమస్యా మిగిలి ఉండదు; మూర్ఖులకు ఏ సమస్యా ఇంకా ఉత్పన్నమవ్వలేదు. జ్ఞానోదయం పొందినవారు సమస్యలకు అతీతంగా వెళ్ళారు ; మూర్ఖులు ఇంకా వాటిలోకి ప్రవేశించలేదు. మూర్ఖులు ఎంత అచేతనమైనవారంటే , వారు ఎలా ప్రశ్నించగలరు ? " ప్రజ్ఞ అంటే ఏమిటి ", అని ఒక మూర్ఖుడు అడుగుతాడా ? " విముక్తి అంటే ఏమిటి", అని ఒక మూర్ఖుడు అడుగుతాడా ? "నిస్సంగం అంటే ఏమిటి", అని ఒక మూర్ఖుడు అడుగుతాడా ? అసాధ్యం !

మరి ఒక మూర్ఖుడు అడిగినా కూడా, తన వ్యామోహాలను ఎలా తీర్చుకోవాలి అని అడుగుతాడు. ఒక మూర్ఖుడు అడిగితే, ఇక్కడ మరికొన్ని రోజులు జీవించడం ఎలా అని అతను అడుగుతాడు. విముక్తి ? లేదు, ఒక మూర్ఖుడు తన సంకెళ్ళను బంగారు సంకెళ్ళుగా చెయ్యడం ఎలా, తన సంకెళ్ళలో రత్నాలను పొదగడం ఎలా అని అడుగుతాడు. ఒక మూర్ఖుడు అడిగితే కనుక, అతను అలాంటి విషయాలు అడుగుతాడు. ప్రజ్ఞ ? ప్రజ్ఞ అనేది ఉండగలదు అని ఒక మూర్ఖుడు ఊహించలేదు. ఆ సంభావ్యతను సైతం అతను అంగీకరించలేడు. అతను అంటాడు, " ప్రజ్ఞ అంటే ఏమిటి ?" మూర్ఖుడు ఒక మృగంలా జీవిస్తాడు.

లేదు, జనకుడు ఒక మూర్ఖుడు కూడా కాదు. అతను ఒక ముముక్షువు, సత్యాన్ని అన్వేషిస్తున్నవాడు. ' ముముక్షువు ' అనే పదాన్ని అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది. ముముక్షువు అనేది విముక్తికై కోరిక, ముక్తికై కోరిక,

అతను ఇంకా విముక్తిని చేరుకోలేదు : అతను ఒక జ్ఞాని కాదు. అతను విముక్తి వైపు వెన్ను చూపి నిలబడి లేడు : అతను ఒక మూర్ఖుడు కాదు. అతను విముక్తి గురించి ఏ సాంప్రదాయిక భావనలలోనూ చిక్కుకుపోయి కూర్చోలేదు : అతను అజ్ఞాని కూడా కాదు. అతను ఒక ముముక్షువు. ముముక్షువు అంటే అర్థం అతని విచారణ సరళమైనది మరి సూటైనది. అది మూర్ఖత్వం చేత భ్రష్టమవ్వలేదు లేదా అజ్ఞానపూరిత పూర్వాభిప్రాయాలచేత వక్రమవ్వలేదు. అతని విచారణ స్వచ్ఛమైనది ... అతను నిష్కళంకమైన మనస్సుతో అడుగుతాడు.

అష్టావక్రుడు బదులిచ్చాడు : ఓ ప్రియతమా,
నువ్వు విముక్తిని కోరుకుంటే కనుక
విషయ వాంఛలను విషంలా త్యజించు,
క్షమాతత్వం, నిష్కాపట్యం, దయ
సంతృప్తి మరి సత్యాన్ని అమృతంలా స్వీకరించు.

... నువ్వు విముక్తిని కోరుకుంటే కనుక విషయవాంఛలను విషంలా త్యజించు. **" విషయం "** అనే పదం ఎంతో అర్థవంతమైనది. అది **విషం** అనే పదం నుంచి వచ్చింది. విషం అంటే అర్థం ఏమిటంటే ఆ పదార్థాన్ని ఎవరైనా తింటే కనుక, వారు మరణిస్తారు. విషయం అంటే అర్థం ఏమిటంటే, మనం దానిని అనుభవిస్తే కనుక, మనం మళ్ళీ మళ్ళీ మరణిస్తాం ; విషయ వాంఛలతో మనం మళ్ళీ మళ్ళీ మరణిస్తాం. ఆహారంతో మనం మళ్ళీ మళ్ళీ మరణిస్తాం ; తృష్ణలు, కోపం, ద్వేషం, జ్వలిస్తున్న అసూయలు... వీటిని అనుభవిస్తూ ... మనం మళ్ళీ మళ్ళీ మరణిస్తూనే వుంటాము. వీటి వలన మనం మళ్ళీ మళ్ళీ మరణించాం.

ఇప్పటివరకూ కూడా, జీవించడం ద్వారా జీవితం అనేదానిని మనం నిజంగా తెలుసుకోలేదు, మనం కేవలం మృత్యువునే తెలుసుకున్నాం. ఇప్పటి వరకూ మన జీవితం... జీవితం యొక్క జ్వలిస్తున్న జ్యోతి ఏది ? మృత్యువు యొక్క పొగ మాత్రమే అక్కడ వుంది. జననం నుంచి మరణం వరకూ మనం క్రమక్రమంగా మరణిస్తున్నాం. మనం జీవిస్తున్నామా ? మనం ప్రతీ ఒక్క రోజూ మరణిస్తున్నాం. మనం జీవితం అని పిలిచేది మరణించడం యొక్క నిరంతర ప్రక్రియ.

మనకు ఇంకా జీవితం అనేది తెలియదు, మనం ఎలా జీవించగలం ? శరీరం ప్రతిరోజూ బలహీనం అవుతూపోతుంది, బలం ప్రతిరోజూ క్షీణిస్తూపోతుంది. సుఖానుభవం మరియు విషయవాంఛ మన శక్తిని అనుదినం పీల్చుతూపోతాయి, మనల్ని ముసలివారిని చేస్తూ పోతాయి. విషయ వాంఛలు మరి కోరికలు రంధ్రాల వంటివి, మరి మన శక్తి, మన అస్తిత్వం, వాటి ద్వారా బయటకు ప్రవహిస్తూ పోతాయి. చివరకు మన కడవ ఖాళీగా వుంటుంది ... దీనినే మనం మృత్యువు అని పిలుస్తాం.

మీరు ఎప్పుడైనా చూశారా ?... మీరు చిల్లులతో నిండిన ఒక చేదను బావిలో వేస్తే కనుక, అది నీటిలో మునిగి ఉన్నంతసేపూ అది నిండుగా ఉన్నట్లు కనిపిస్తుంది. తాడును లాగి మరి దానిని నీటిలో నుంచి పైకి లేపండి మరి అప్పటికే అది ఖాళీ అవ్వడం ప్రారంభించి వుంటుంది. అది ఒక గొప్ప కలతను సృష్టిస్తుంది. మీరు జీవితం అని పిలిచేది దీనినేనా ? క్రిందకు జారుతున్న నీటి ప్రవాహాలు ... మీరు జీవితం అని పిలిచేది దీనినేనా ? ఆ చేద మీ చేతులకు దగ్గరగా వస్తున్న కొద్దీ, అది మరింత మరింతగా ఖాళీ అవుతుంది. అది మీ చేతులను చేరినప్పుడు అది ఖాళీగా వుంటుంది... ఒక్క నీటి చుక్క కూడా ఉండదు, మన జీవితం ఇలానే ఉంది.

ఒక శిశువు జన్మించక ముందు, అతను నిండుగా ఉన్నట్లు కన్పిస్తాడు. పుట్టగానే, అతను ఖాళీ అవ్వడం ప్రారంభిస్తాడు. జన్మించిన మొదటి రోజు అతని మరణపు మొదటి రోజు. అతను ఖాళీ అవ్వడం ప్రారంభిస్తాడు : ఒకరోజు మృతిపొందినవాడు, రెండు రోజులు మృతిపొందినవాడు, మూడు రోజులు మృతిపొందినవాడు. మీరు మీ జన్మదినం అని పిలిచేది మరణదినం అని పిలువబడడం మెరుగైనది ... అది సత్యానికి దగ్గరగా వుంటుంది. మీరు ఒక సంవత్సరం పాటు మరణిస్తూ వున్నారు మరి ఒక జన్మదినం వచ్చింది అని మీరు అంటారు. మీరు యాభై ఏళ్ళుగా మరణిస్తూ వున్నారు మరి మీరు యాభై ఏళ్ళు జీవించారు అని మీరు అంటారు : " నా స్వర్ణోత్సవాన్ని మనం వేడుక చేసుకుందాం." కానీ మీరు యాభై సంవత్సరాలు మరణించారు. మృత్యువు సమీపానికి వస్తోంది మరి జీవితం మరింత మరింతగా వెనుకకు పోతోంది : ఆ చేద ఖాళీ అవుతోంది. మీరు జీవితం గురించిన మీ చింతనను వెనుకకు పోతున్న దానిపైన ఆధారితం చేస్తారా లేదా మీరు దానిని సమీపిస్తున్న దానిపైన ఆధారితం చేస్తారా ? ఏ విధమైన తలక్రిందులు అంకగణితం ఇది ? మనం ప్రతిరోజూ మరణిస్తున్నాం, మృత్యువు సమీపానికి ప్రాకుతూ ఉంటుంది.

విషయవాంఛలు విషపూరితమైనవి అని అష్టావక్రుడు చెబుతాడు ఎందుకంటే వాటికి లోలులమై మనం కేవలం మరణిస్తాం. మనం వాటినుంచి ఎన్నటికీ ఏ జీవితాన్నీ పొందము.

ఓ ప్రియతమా, నువ్వు విముక్తిని కోరుకుంటే కనుక

విషయవాంఛలను విషంలా త్యజించు, మరి క్షమాతత్వం,

నిష్కాపట్యం, దయ, సంతృప్తి మరి సత్యాన్ని అమృతంలా స్వీకరించు.

అమృతం అంటే అర్థం జీవితాన్ని ఇచ్చేది, అమరత్వాన్ని ఇచ్చేది, అమృతం ... ఎవ్వరైనా దానిని కనుగొన్నప్పుడు, వారు మళ్ళీ ఎన్నటికీ మరణించరు.

తరువాత క్షమాతత్వం. కోపం అనేది విషం...క్షమాతత్వం అనేది అమృతం.

నిష్కాపట్యం. వక్రబుద్ధి అనేది విషం ... సరళత, నిష్కాపట్యం అనేవి అమృతం.

కరుణ. క్రూరహృదయం, క్రూరత్వం, అనేవి విషం ... జాలి, దయ అనేవి అమృతం.

సంతృప్తి. అసంతృప్తి అనే పురుగు అన్నింటినీ తినేస్తూ పోతుంది. అసంతృప్తి అనే పురుగు హృదయంలో క్యాన్సర్‌లా తిష్ఠ వేస్తుంది. అది దానిలోకి చొచ్చుకుపోతూ ఉంటుంది, అది విషాన్ని వ్యాపింపజేస్తూ పోతుంది.

సంతృప్తి. ఉన్నదానితో తృప్తి, లేనిదాని కోసం కోరిక లేదు. ఏదైతే ఉందో, అదే చాలా ఎక్కువ. అది ఉంది, అదే చాలా ఎక్కువ. మీ కళ్ళను కొద్దిగా తెరవండి మరి చూడండి.

ఎవ్వరూ జీవితంపై సంతృప్తిని విధించవలసిన అవసరం లేదు. మీరు శ్రద్ధగా చూస్తే కనుక మీరు కనుగొనేది ఏమిటంటే మీరు పొందేది మీకు అవసరమైనదాని కన్నా ఎల్లప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. మీకు కావలసినది మీరు పొందుతూనే వుంటారు, మీకు కావలసినది మీరు ఎల్లప్పుడూ పొందారు. మీరు దుఃఖాన్ని కోరుకుంటే కనుక మీరు దుఃఖాన్ని పొందారు. మీరు ఆనందాన్ని కోరుకుంటే కనుక మీరు ఆనందాన్ని పొందారు. మీరు ఏదైనా సరికాని దానిని కోరుకుంటే కనుక మీరు సరికాని దానినే పొందారు. మీ కోరకలే మీ జీవితానికి ఆకృతిని ఇచ్చాయి.

కోరిక అనేది విత్తనం, మరి జీవితం అనేది దాని ఫలసాయం.

జన్మ తర్వాత జన్మ మీరు కోరుకున్నదే మీరు పొందుతూ ఉన్నారు. మీరు ఒక విషయాన్ని కోరుకున్నారు కానీ మరింకేదో మీరు పొందుతున్నారు అని ఎన్నోసార్లు మీరు అనుకుంటారు. అప్పుడు దోషం అనేది మీరు కోరుకున్న దానిలో లేదు, మీరు కోరుకుంటున్న దానికి తప్పు పదాన్నే మీరు ఎంచుకున్నారు, ఉదాహరణకు, మీరు విజయాన్ని కోరుకున్నారు మరి వైఫల్యాన్ని పొందారు. మీరు విజయాన్ని కోరుకోవడం

వలన మీరు విఫలమయ్యారు అని మీరు అంటారు. కానీ విజయం కోరుకున్న వ్యక్తి అప్పటికే వైఫల్యాన్ని అంగీకరించాడు. అంతరంగంలో అతను వైఫల్యం పట్ల భయపడ్డాడు. వైఫల్యం వలన అతను విజయాన్ని కోరుకుంటాడు. మరి అతను విజయం కోసం ఎప్పుడెప్పుడు కాంక్షించినా, వైఫల్యం అనే భావన వస్తుంది ; వైఫల్యం అనే భావన మరింత దృఢం అవుతూపోతుంది. కొన్నిసార్లు అతను సఫలీకృతుడు అవుతాడు, కానీ అతను తన జీవిత పయనాన్ని వైఫల్యం తరువాత వైఫల్యంలోనే నిశ్చయంగా గడపబోతున్నాడు. వైఫల్యం యొక్క రీతి లోతుగా వెళుతూపోతుంది. అది ఎంత లోతుగా అవుతుందంటే ఒక రోజు అది సాకారమవుతుంది. అప్పుడు మీరు విజయాన్ని కోరుకున్నారని మీరు ఫిర్యాదు చేస్తారు. కానీ విజయాన్ని కోరుకోవడంలో, మీరు వైఫల్యాన్ని కోరుకున్నారు.

లావోట్జూ చెప్పారు, " విజయం కోసం కాంక్షించండి మరి మీరు విఫలమవుతారు. మీరు నిజంగా విజయాన్ని కోరుకుంటే కనుక, ఎన్నడూ దానిని కాంక్షించకండి. అప్పుడు ఎవ్వరూ మిమ్మల్ని విఫలం చేయలేరు."

మీరు గౌరవాన్ని కోరుకున్నారని, కానీ మీరు అవమానాలనే పొందుతున్నారని మీరు చెబుతారు. గౌరవాన్ని కోరుకునే వ్యక్తి తనపట్ల తాను గౌరవాన్ని కలిగిలేడు, అయినా గానీ అతను ఇతరుల నుంచి గౌరవాన్ని కోరుకుంటాడు. తనపట్ల తనకు గౌరవం లేని వ్యక్తి ఇతరులు దానికి ముసుగు వేయ్యాలని, తన గౌరవలేమిని మరుగుపరచాలి అని కోరుకుంటాడు. గౌరవం కోసం ఈ కాంక్ష అనేది మీ పట్ల మీరు అంతరంగంలో అగౌరవాన్ని అనుభూతి చెందుతున్నారు అనేదానికి సూచన. మీరు అసలు ఏమీ కాదు అనే భావన మీకు వుంది. ఇతరులు మిమ్మల్ని ఎవరిగానో చెయ్యాలి, మిమ్మల్ని ఒక సింహాసనంపై కూర్చోబెట్టాలి, మీ కోసం బ్యానర్లు పెట్టాలి, మీ పేరిట పతాకాలు ఎగురవేయాలి ... ఇతరులు ఏదో చేయాలి ! మీరు యాచకులు. మీరు గౌరవాన్ని కోరుకున్నప్పుడు మిమ్మల్ని మీరు అప్పటికే అవమానించుకున్నారు. మరి ఈ అవమానం అన్నది లోతుగా వెళుతూపోతుంది.

లావో ట్జూ అంటారు, " నన్ను ఎవ్వరూ అవమానించలేరు ఎందుకంటే నేను గౌరవాన్ని కోరుకోవడం లేదు." అసలైన గౌరవాన్ని సిద్ధించుకోవడం అంటే ఇదే.

లావో ట్జూ అంటారు, " నన్ను ఎవ్వరూ ఓడించలేరు. ఎందుకంటే గెలుపొందడం అనే భావననే నేను వదిలేశాను. మీరు నన్ను ఎలా ఓడించగలరు ? గెలుపొందాలి అని కోరుకుంటున్నవారిని మాత్రమే మీరు ఓడించగలరు." అది ఒక విచిత్రమైన వాస్తవం.

ఈ ప్రపంచంలో గౌరవాన్ని కోరుకోనివారే దానిని పొందుతారు. విజయాన్ని కోరుకోనివారే దానిని పొందుతారు, ఎందుకంటే విజయాన్ని కోరుకోనివారు తాము సఫలీకృతులమని అప్పటికే అంగీకరిస్తారు : ఇంకేం విజయం కావాలి మీకు ? మీ అంతరంగంలోని అస్తిత్వం చేత మీరు ఇప్పటికే గౌరవించబడ్డారు : ఇంకేం కావాలి మీకు ? మీకు జన్మనివ్వడం ద్వారానే అస్తిత్వం మీకు ఇప్పటికే గౌరవాన్ని ఇచ్చింది : ఇంకెవరి గౌరవం కావాలి మీకు ? అస్తిత్వం మీకు తగినంత ఘనతను ఇచ్చింది. అది మీకు జీవితాన్ని ఇచ్చింది. అది మీకు కళ్ళను ఇచ్చి అనుగ్రహించింది ... వాటిని తెరువండి మరి ఈ హరిత వృక్షాలను, ఈ పుష్పాలను, ఈ పక్షులను చూడండి. అది మీకు చెవులను ఇచ్చింది ... సంగీతాన్ని, జలపాతపు నీరు తుళ్ళిపడే సవ్వడిని వినండి. మీరు ఒక బుద్ధుడు కాగలిగేందుకు అది మీకు జాగృతిని ఇచ్చింది : ఇంకేం కావాలి మీకు ? మీరు ఇప్పటికే గౌరవించబడ్డారు. అస్తిత్వం మిమ్మల్ని యోగ్యులుగా రూఢి చేసింది ; యోగ్యతా పత్రం కోసం, ఒక యాచకుడిలా, మీరు ఎవరిని అడుగుతున్నారు ? మీ నుంచి యోగ్యతా పత్రం యాచించేవారినా ?

అది అత్యంత ఉల్లాసకరమైన పరిస్థితి, ఇద్దరు యాచకులు ముఖాముఖి ఒకరిని ఒకరు యాచించడం. మీరు ఏదైనా ఎలా పొందగలరు ? ఇద్దరూ యాచకులే. మీరు ఎవరి నుంచి గౌరవాన్ని అడుగుతున్నారు ? మీరు ఎవరి ముందు నిలబడి వున్నారు ? ఈ విధంగా మిమ్మల్ని మీరు అవమానించుకుంటున్నారు. మరి ఆ అవమానం లోతులను చేరుతుంది.

సంతృప్తి అంటే : మీ వద్ద ఉన్న దానిని చూడండి ! మీ కళ్ళను కొద్దిగా తెరువండి మరి ఇప్పటికే మీరు ఏం పొందివున్నారో చూడండి.

అష్టావక్రుడు ఇస్తున్న అత్యంత విలువైన తాళం చెవి ఇది. అది మీకు నెమ్మదిగా స్పష్టం అవుతుంది. అష్టావక్రుడి దృష్టి అత్యంత విప్లవాత్మకమైనది, అత్యంత అద్వితీయమైనది. అతని విప్లవం మూలాల నుంచి ఉంటుంది.

... సంతృప్తి మరి సత్యాన్ని అమృతంలా స్వీకరించండి

ఎందుకంటే అసత్యంలో జీవించేవారు మరింత అసత్యమైనవారుగానే తయారవుతూపోతారు. అబద్ధాలు చెప్పేవారు, అబద్ధాలలో జీవించేవారు, సహజంగానే అబద్ధాలచేత పరివేష్టించబడి వుంటారు. జీవితంతో అతని సంబంధం తునాతునకలవుతుంది. అతని వేర్లు కత్తిరించబడతాయి.

మీకు అస్తిత్వంలో వేర్లు కావాలా ? ఆ వేర్లు కేవలం సత్యం ద్వారా మాత్రమే సాధ్యం అవుతాయి. కేవలం ప్రామాణికత మరి సత్యం ద్వారా మాత్రమే మీరు అస్తిత్వంతో బాంధవ్యం కలిగివుండగలరు. మీరు అస్తిత్వం నుంచి వేరుపడాలని కోరుకుంటున్నారా ? అయితే అబద్ధపు పొగతెరను సృష్టించండి, మీ చుట్టూ అబద్ధపు మహా మేఘాలను తయారు చెయ్యండి. మీరు ఎంతగా అసత్యపూరితులు అయితే అస్తిత్వం నుంచి మీరు అంత దూరంగా ఉంటారు.

నువ్వు పృథ్వివి కాదు, వాయువువూ కాదు, అగ్నివి కాదు, జలానివి కాదు, ఆకాశనివీ కాదు. విముక్తిని సాధించాలంటే వీటన్నింటినీ సాక్షిగా చూస్తున్న చైతన్యానివే నువ్వు అని తెలుసుకో.

ఈ వివరణములు ఎంతో అవ్యవధియైనవి ; ఒక పరిచయమైనా లేదు. అష్టావక్రుడు రెండు వాక్యాలు అయినా ఉచ్ఛరించలేదు మరి ధ్యానం ప్రవేశించింది ; అతను సమాధి గురించి, ప్రగాఢ ధ్యానం గురించి మాట్లాడడం ప్రారంభిస్తాడు. తెలిసినవారికి సమాధి తప్ప పంచుకోవడానికి మరేదీ ఉండదు. అతను మొదట రెండు వాక్యాలు చెప్పాడు ఎందుకంటే అతను వెంటనే సమాధి గురించి మాట్లాడడం మొదలుపెట్టి వుంటే కనుక, బహుశా అవగాహన చేసుకోలేనంతగా మీరు మరీ బెదిరిపోయి ఉండేవారు. కానీ రెండు వాక్యాలు... మరి అవ్యవధిగా అతను సమాధి గురించి మాట్లాడుతున్నాడు.

అష్టావక్రుడు ఏడు అడుగులు కూడా వెయ్యలేదు. బుద్ధుడు ఏడు అడుగులు వేశాడు మరి ఎనిమిదవ అడుగు, సమాధి. అష్టావక్రుడు మొట్టమొదటి అడుగులోనే సమాధిని తీసుకువస్తాడు.

నువ్వు పృథ్వివి కాదు, వాయువువూ కాదు,
అగ్నివి కాదు, జలానివి కాదు, ఆకాశానివీ కాదు.

ఈ సత్యంలోకి మిమ్మల్ని మీరు విశ్రమింపజేసుకోండి.

విముక్తిని సాధించాలంటే, వీటన్నింటినీ సాక్షిగా చూస్తున్న
చైతన్యత్వానివే నువ్వు అని తెలుసుకో.

సాక్షి అనేదే ఆ తాళం చెవి. దీనికన్నా విలువైన తాళం చెవి మరొకటి లేదు.

గమనించేవారుగా ఉండండి. ఏది జరిగినా, దానిని జరుగనివ్వండి. దానిలో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదు. ఈ శరీరం పృథ్వి, వాయువు, అగ్ని, జలం మరియు ఆకాశం యొక్క మేళనం. దేని వలన అయితే ఇవి అన్నీ ... పృథ్వి, వాయువు,

అగ్ని, జలం, ఆకాశం ... ప్రకాశిస్తున్నాయో ఆ అంతరంగంలోని జ్యోతే మీరు. మీరు గమనించేవారు. దీనిలోకి లోతుగా వెళ్ళండి.

... సాక్షిగా చూస్తున్న చైతన్యత్వానివే నువ్వు అని తెలుసుకో...

ఇది అస్తిత్వంలోని అత్యంత ప్రధానమైన సూత్రం. ఒక సాక్షిగా ఉండండి. దాని ద్వారా ప్రజ్ఞ సంభవిస్తుంది. దాని ద్వారా నిస్సంగం సంభవిస్తుంది. దాని ద్వారా విముక్తి సంభవిస్తుంది. ఆ ప్రశ్నలు మూడు కానీ సమాధానం ఒక్కటే.

నిన్ను నీవు ఈ భౌతిక శరీరం నుంచి వేరు చేసుకోగలిగితే మరి చైతన్యంలో విశ్రమించగలిగితే, అప్పుడు ఈ క్షణమే నీవు సంతోషంతో, శాంతితో ఉంటావు, మరి బంధాల నుంచి స్వతంత్రుడవు అవుతావు.

... ఈ క్షణమే ! ఇందువలనే అది మూలాల నుంచి విప్లవం అని నేను అంటాను. " ఈ క్షణమే ", అని చెప్పగలిగేంత నిర్భయత్వం పతంజలికి లేదు. పతంజలి అంటాడు, " అంతరంగంలో మరి బాహ్యంలో క్రమశిక్షణను అభ్యసించండి. శ్వాసను నియంత్రించడం, అంతర్ముఖులవ్వడం మరి యోగ భంగిమలను అభ్యసించండి. పరిశుద్ధం చెయ్యండి. దానికి అసంఖ్యాకమైన జన్మలు పడతాయి... అప్పుడు జ్ఞానోదయం..."

మహావీరుడు అంటాడు, " అయిదు గొప్ప ప్రతిజ్ఞలను అభ్యసించండి. మరి అసంఖ్యాక జన్మలు గడచినప్పుడు, తర్ఫీదులనుంచి స్వతంత్ర్యం (deconditioning) సంభవిస్తుంది, శుద్ధి జరుగుతుంది. అప్పుడు కర్మ బంధాలు తెంచుకుంటారు."

అష్టావక్రుడు చెప్పేది వినండి :

నిన్ను నీవు ఈ భౌతిక శరీరం నుంచి వేరు చేసుకోగలిగితే
మరి చైతన్యంలో విశ్రమించగలిగితే, అప్పుడు ఈ
క్షణమే నీవు సంతోషంతో, శాంతితో ఉంటావు,
మరి బంధాల నుంచి స్వతంత్రుడవు అవుతావు.

సరిగ్గా ఇక్కడే, సరిగ్గా ఇప్పుడే, ఈ క్షణమే, **నిన్ను నీవు ఈ భౌతిక శరీరం నుంచి వేరు చేసుకోగలిగితే, మరి చైతన్యంలో విశ్రమించగలిగితే...** మీరు ఆ వాస్తవాన్ని చూడడం ప్రారంభిస్తే, " నేను శరీరాన్ని కాదు, నేను కర్తను లేదా అనుభవించేవాడిని కాదు : నా అంతరంగంలో దాగి వుండి అంతటినీ చూస్తూ వున్నవాడినే నేను... బాల్యం వచ్చినప్పుడు అది బాల్యాన్ని చూసింది, యవ్వనం వచ్చినప్పుడు అది యవ్వనాన్ని

చూసింది. వృద్ధాప్యం వచ్చినప్పుడు అది వృద్ధాప్యాన్ని చూసింది. బాల్యం నిలిచిపోలేదు, కనుక నేను బాల్యాన్ని కాదు. అది వచ్చింది మరి వెళ్ళిపోయింది, అయినాగానీ నేను ఉన్నాను. వృద్ధాప్యం వచ్చింది, మరి అది కూడా వెళ్ళిపోతోంది, కనుక నేను వృద్ధాప్యం కాదు. వచ్చేది మరి పోయేది నేను ఎలా అవ్వగలను ? నేను ఎల్లప్పుడూ ఉన్నాను. ఎవరికైతే బాల్యం వస్తుందో, ఎవరికైతే యవ్వనం వస్తుందో, ఎవరికైతే వృద్ధాప్యం వస్తుందో... ఎవరికైతే వేలాది విషయాలు వస్తాయి మరి పోతాయో అదే నేను. శాశ్వతమైనదీ, నిత్యమూ ఉండేదే నేను.

రైల్వేస్టేషన్లలాగా అవి మారుతూ పోతాయి : బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం, జననం. ఆ ప్రయాణికుడు పయనిస్తూ పోతాడు. రైలు స్టేషన్లతో మీరు ఏకమయ్యారు అని మీరు ఎన్నడూ అనుకోరు. పూణె స్టేషనుకి వచ్చినప్పుడు మీరు పూణె అని మీరు అనుకోరు. మీరు మన్మాడ్ చేరుకున్నప్పుడు మీరు మన్మాడ్ అని మీరు అనుకోరు. పూణె వచ్చింది మరి వెళ్ళిపోయింది, మన్మాడ్ వచ్చింది మరి వెళ్ళిపోయింది అని మీకు తెలుసు. మీరు ఒక ప్రయాణికుడు. పూణెను చూసిన గమనించేవారే మీరు... పూణె వచ్చింది మరి వెళ్ళిపోయింది ; మన్మాడ్‌ను చూసినవారు ... మన్మాడ్ వచ్చింది మరి వెళ్ళిపోయింది. ఆ చూసేవారే మీరు.

మొదటి విషయం : జరుగుతున్నదానిని గమనించేవారి నుంచి వేరు చెయ్యండి.

... నిన్ను నీవు భౌతిక శరీరం నుంచి వేరు చేసుకో
మరి చైతన్యంలో విశ్రమించు...

అంతకన్నా చేయదగిన విలువైనది ఏమీ లేదు.

లావో ట్జు యొక్క మూలసూత్రం అధీనత అయినట్లుగానే, అష్టావక్రుడి మూల సూత్రం విశ్రాంతి, సడలింపు. చేయడానికి ఏమీ లేదు.

ప్రజలు నా వద్దకు వస్తారు మరి ధ్యానం ఎలా చెయ్యాలి అని అడుగుతారు. వారు అడిగే ప్రశ్నే దోషపూరితమైనది. వారు ఒక తప్పు ప్రశ్నను అడుగుతారు, కనుక కేవలం దానిని చెయ్యాలి అని నేను వారికి చెబుతాను. నేను ఏం చెయ్యాలి ? నేను వారికి చెబుతాను, “ చెయ్యండి ... ఏదో ఒకటి చెయ్యబడాలి.” ఏదో చెయ్యాలి అనే దురదతో మీరు ఉన్నారు ; ఆ దురదను తీర్చడం అవసరం. దురద పెడుతూ ఉంటే, ఏం చెయ్యాలి ?... దానిని గోకకుండా వదిలెయ్యడం కుదరదు. కానీ క్రమంగా, చెయ్యడంలో వారిని అవిశ్రాంతంగా ఉంచుతూ, నేను వారిని అలసిపోయేలా చేస్తాను. అప్పుడు వారు అంటారు, “ దీని నుంచి మమ్మల్ని విడుదల చెయ్యండి.

మేము ఇది ఎంతకాలం చేస్తూపోవాలి ? ” నేను చెబుతాను. “ నేను ప్రారంభం నుంచే సిద్ధంగా ఉన్నాను, కానీ అవగాహన చేసుకోవడానికి మీకు సమయం అవసరం అయ్యింది. ఇక విశ్రమించండి !”

ధ్యానం యొక్క అత్యుత్తమ భావం విశ్రాంతి... చైతన్యంలో విశ్రమించండి... తన చైతన్యాన్ని విశ్రాంతిలో ఆగిపోనిచ్చే వ్యక్తి, కేవలం అస్తిత్వంలోనే విశ్రమించే వ్యక్తి ... చేయడానికి ఏమీ లేదు ఎందుకంటే మీరు అన్వేషిస్తున్నది మీరు ఇప్పటికే కలిగివున్నారు, ఎందుకంటే మీరు అన్వేషిస్తున్నది మీరు ఎన్నడూ పోగొట్టుకోలేదు. దానిని పోగొట్టుకోవడం సాధ్యం కాదు ... అది మీ మూల స్వభావం. మీరే దివ్యత్వం. **అనల్ హక్** (Anal Haq) – మీరే సత్యం. మీరు ఏ స్థానాన్ని అన్వేషిస్తున్నారు, మీరు ఎక్కడకు పరుగెత్తుతున్నారు? స్వీయ అన్వేషణలో, మీరు ఎక్కడకు పరుగెత్తుతున్నారు ? ఆగండి. విశ్రమించండి. పరుగెత్తడం ద్వారా దైవత్వం సిద్ధించదు, ఎందుకంటే అది పరుగెత్తేవాడి అంతరంగంలో దాగి వుంది. ఏదైనా చేయడం ద్వారా దైవత్వం సిద్ధించదు, ఎందుకంటే అది చేసేవాడిలో దాగి వుంది. దైవత్వపు అనుభవాన్ని పొందడానికి ఏదీ చేయవలసిన అవసరం లేదు ... మీరు అదే.

కనుక అష్టావక్రుడు చెబుతాడు : ... **చైతన్యంలో విశ్రమించు** ... విశ్రాంతిగా ఉండండి, మిమ్మల్ని మీరు సేదదీరనివ్వండి. ఈ ఆందోళనను వదిలెయ్యండి. మీరు ఎక్కడికి వెళుతున్నారు ? వెళ్ళడానికి ఎక్కడా లేదు, చేరవలసినది ఎక్కడా లేదు ... **మరి చైతన్యంలో విశ్రమించు...** అప్పుడు సరిగ్గా ఇప్పుడే... ఈ క్షణమే మీరు సంతోషంతో, శాంతితో ఉంటారు, మరి దాస్యం నుంచి స్వతంత్రులు అవుతారు. ఈ వివరణము అద్వితీయమైనది. మరే ఇతర పవిత్ర గ్రంథమూ దీనితో పోల్చదగినది కాదు.

నువ్వు ఒక బ్రాహ్మణుడివి లేదా ఇతర కులస్థుడివి కాదు,
నువ్వు జీవితం యొక్క నాలుగు దశలలో దేనిలోనూ లేవు,
నువ్వు కళ్ళు లేదా ఇతర ఇంద్రియాల చేత కనుగొనదగిన వాడివికాదు.
నిస్సంగుడివై మరి రూపరహితుడవై,
ఈ సమస్త విశ్వాన్ని వీక్షించే సాక్షివి నువ్వు.
దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు.

ఒక బ్రాహ్మణుడు దీనిపై వ్యాఖ్యానాన్ని ఎలా వ్రాయగలడు ? **నువ్వు ఒక బ్రాహ్మణుడివి లేదా ఇతర కులస్థుడివి కాదు...** ఒక హిందువు ఈ పవిత్రగ్రంథాన్ని హృదయానికి ఎలా హత్తుకోగలడు ? అతని మతం సమస్తం కులం మరి జీవితం యొక్క దశలపై ఆధారితమై వుంది. మరి ప్రారంభం నుంచే అష్టావక్రుడు ఈ విశ్వాసాల

వేర్లను కత్తిరిస్తున్నాడు. అతను అంటాడు నువ్వు ఒక బ్రాహ్మణుడివి కాదు, నీచ కులపు శూద్రుడివి కాదు, ఒక క్షత్రియుడివి, ఒక యోధుడివి కాదు ... ఇది అంతా అర్ధరహితమైనది. ఇవి అన్నీ యుక్తులు. ఇది అంతా రాజకీయాలు మరి సమాజం యొక్క క్రీడ. నువ్వు కేవలం బ్రహ్మం, దైవం ... ఒక బ్రాహ్మణుడు కాదు, ఒక క్షత్రియుడు కాదు, ఒక శూద్రుడు కాదు.

నువ్వు ఒక బ్రాహ్మణుడివి లేదా ఇతర కులస్థుడివి కాదు,
నువ్వు జీవితం యొక్క నాలుగు దశలలో దేనిలోనూ లేవు...

మరి నువ్వు ఒక బ్రాహ్మచర్య విద్యార్థివి, లేదా ఒక గృహస్థుడివి, లేదా సన్యాసానికి ముందు దశ వద్ద ఉన్నవాడివి కాదు ... నువ్వు జీవితం యొక్క నాలుగు దశలలో దేనిలోనూ లేవు. ఈ స్థితులన్నింటి ద్వారా పయనిస్తున్న అంతరంగంలోనున్న సాక్షివి, గమనించేవాడివి నువ్వు.

అష్టావక్ర గీత తమదే అని హిందువులు వాదించలేరు, అష్టావక్ర గీత ప్రతి ఒక్కరిదీ. అష్టావక్రుడి యొక్క కాలంలో మహమ్మదీయులు, హిందువులు మరి క్రైస్తవులు ఉండివుంటే కనుక, అతను అని ఉండేవాడు, " నువ్వు ఒక హిందువువి కాదు, ఒక క్రైస్తవుడవు కాదు, ఒక మహమ్మదీయుడవు కాదు." అష్టావక్రుడికి ఆలయాన్ని ఎవరు నిర్మిస్తారు ? అతని పవిత్ర గ్రంథం పక్షాన ఎవరు నిలుస్తారు ? అతను తమవాడు అని ఎవరు వాదిస్తారు ?... ఎందుకంటే అతను ప్రతి ఒక్కరినీ నిరాకరిస్తున్నాడు. అది సత్యం యొక్క సూటియైన ప్రకటన.

నిస్సంగుడివై మరి రూపరహితుడివై, ఈ సమస్త విశ్వాన్ని
వీక్షించే సాక్షివి నువ్వు. దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు.

నువ్వు దీనిని తెలుసుకున్న తరువాత నువ్వు ఆనందం పొందుతావు అని అష్టావక్రుడు చెప్పలేదు. ఈ వివరణమును శ్రద్ధగా వినండి. అష్టావక్రుడు చెబుతాడు : **దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు.**

నువ్వు ఒక బ్రాహ్మణుడివి లేదా ఇతర కులస్థుడివి కాదు,
నువ్వు జీవితం యొక్క నాలుగు దశలలో దేనిలోనూ లేవు,
నువ్వు కళ్ళు లేదా ఇతర ఇంద్రియాల చేత కనుగొనదగినవాడివి కాదు.
నిస్సంగుడివై మరి రూపరహితుడవై,
ఈ సమస్త విశ్వాన్ని వీక్షించే సాక్షివి నువ్వు.
దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు.

ఆనందంగా ఉండు. సరిగ్గా ఇప్పుడే ఆనందంగా ఉండు. జనకుడు అడుగుతాడు, " ఎవ్వరైనా ఆనందంగా ఎలా ఉండగలరు ? విముక్తి ఎలా సంభవిస్తుంది ? ప్రజ్ఞ ఎలా ప్రాప్తిస్తుంది ?"

అది సరిగ్గా ఇప్పుడే సంభవించగలదు అని అష్టావక్రుడు చెబుతాడు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయవలసిన అవసరం లేదు. దానిని రేపటికోసం వదిలివేయడానికి ఏ కారణమూ లేదు, దానిని వాయిదా వేయవలసిన అవసరం లేదు. ఈ సంభవం భవిష్యత్తులో ఎప్పుడో సంభవించదు, అది ఇప్పుడే సంభవిస్తుంది లేదా ఎన్నటికీ సంభవించదు. అది సంభవించినప్పుడు అది సరిగ్గా ఇప్పుడే సంభవిస్తుంది, ఎందుకంటే ప్రస్తుతం తప్ప కాలం అనేదే లేదు. భవిష్యత్తు ఎక్కడ వుంది ? అది వచ్చినప్పుడు, అది ప్రస్తుతంగానే వస్తుంది.

కనుక జ్ఞానోదయం పొందినవారు, ప్రస్తుతంలోనే జ్ఞానోదయాన్ని పొందారు. దానిని మరెప్పటికో వదిలివేయకండి - మనస్సు యొక్క కపటం అదే. మనస్సు వాదిస్తుంది, " అంత త్వరగా అది ఎలా సంభవించగలదు ? మొదట నువ్వు సిద్ధంగా ఉండాలి."

ప్రజలు నన్ను కలవడానికి వస్తారు మరి వారు అంటారు, " మేము సన్యాసం తీసుకుంటాం. ఏదో ఒకరోజు మేము దానిని తీసుకుంటాం." ఏదో ఒకరోజు ! వారు దానిని ఎన్నటికీ తీసుకోరు. అది పక్కకు పెట్టబడితే, అది ఎప్పటికీ పక్కకు పెట్టబడుతుంది. 'ఏదో ఒకరోజు' ఎన్నటికీ రాదు. మీరు దానిని తీసుకోబోతున్నట్లయితే కనుక, దానిని ఇప్పుడే తీసుకోండి. ఇప్పుడు తప్ప మరో సమయం అనేదే లేదు. జీవితం ఇప్పుడే ఉంది, విముక్తి ఇప్పుడే ఉంది. అజ్ఞానం ఇప్పుడే ఉంది, తెలుసుకోవడం ఇప్పుడే ఉంది. నిద్ర ఇప్పుడే ఉంది, జాగృతులవ్వడం ఇప్పుడే సంభవించగలదు. ఏదో ఒకరోజు ఎందుకు ?

మనస్సుకు అది కష్టతరమైనది ; మనస్సు అంటుంది, మీరు ఏర్పాట్లు చేసుకోవాలి. మనస్సు వాదిస్తుంది, " ఏర్పాట్లు లేకుండా ఏదైనా ఎలా సంభవించగలదు ? ఒక వ్యక్తి విశ్వవిద్యాలయం నుంచి యోగ్యతా పత్రాన్ని కోరుకున్నప్పుడు, అది సంవత్సరాలు పడుతుంది. ఒక డాక్టరేట్‌కు ఇరవై నుంచి ఇరవై అయిదు సంవత్సరాలు పడుతుంది, సంవత్సరాల తరబడి పనిచేస్తూ, మరి చివరికి ఒకరు ఒక డాక్టరేట్‌ను సాధిస్తారు. అది ఈ క్షణమే ఎలా సంభవించగలదు ?"

అష్టావక్రుడికి ఇది తెలుసు. మీరు ఒక దుకాణాన్ని కలిగివుండాలి అని కోరుకుంటే కనుక, మీరు దానిని సరిగ్గా ఇప్పుడే తెరువలేరు. మీరు అన్నింటినీ సేకరించాలి, వస్తువులను సర్దాలి, సరుకులను తేవాలి, దుకాణాన్ని నిర్మించాలి, కొనుగోలుదారులను ఆకర్షించాలి, ప్రచారం చెయ్యాలి ... దానికి సంవత్సరాలు పడుతుంది. ఈ ప్రపంచంలో ఏదీ సరిగ్గా ఇప్పుడే సంభవించదు. అది క్రమబద్ధమైన అడుగులలో సంభవిస్తుంది. మరి ఇది మంచిది. అష్టావక్రుడికి ఇది తెలుసు, నాకు కూడా ఇది తెలుసు.

కానీ ఈ ప్రపంచంలో సరిగ్గా ఇప్పుడే సంభవించే దృగ్విషయం ఒకటి ఉంది. అది దైవత్వం. దైవత్యం అనేది మీ దుకాణం కాదు, లేదా మీ పరీక్ష హాల్ కాదు, మీ విశ్వవిద్యాలయం కాదు. దైవత్వం అనేది దశలుగా సంభవించదు, అది ఇప్పటికే సంభవించింది. అది కేవలం మీ కళ్ళను తెరువడానికి సంబంధించిన ప్రశ్న. సూర్యుడు ఇప్పటికే బహిర్గతం అయ్యాడు. మీ కళ్ళు తెరుచుకునే వరకూ తాను బయటకు రాను అని అంటూ, మీ కళ్ళ కోసం సూర్యుడు నిరీక్షించడం లేదు. సూర్యుడు ఇప్పటికే బయటకు వచ్చాడు. కాంతి అంతటా వ్యాపించింది. అతని సంగీతం రేయింబవళ్ళూ మ్రోగుతోంది. ఓంకార నాదం అన్ని దిక్కులలోనూ ప్రకంపిస్తోంది. వాయించబడని సంగీతం అంతటా ప్రతిధ్వనిస్తోంది. మీ చెవులను తెరవండి ! మీ కళ్ళను తెరవండి ! మీ కళ్ళను తెరవడానికి ఎంత సమయం పడుతుంది ? దైవత్వాన్ని సిద్ధించుకోవడానికి అంతకన్నా తక్కువ సమయం పడుతుంది. కనురెప్ప వెయ్యడానికి ఒక్క క్షణం పడుతుంది. ' క్షణం ' అనే దానికి హిందీ పదం (పల్) యొక్క అర్థం ఏమిటంటే కనురెప్ప వెయ్యడానికి పట్టే కాలం (రెప్పపాటుకాలం). కానీ దైవత్వం సిద్ధించుకోవడానికి ఆ మాత్రం సమయం కూడా పట్టదు.

... ఈ సమస్త విశ్వాన్ని వీక్షించే సాక్షివి నువ్వు. దీనిని తెలుసుకో మరి ఆనందంగా ఉండు. సరిగ్గా ఇప్పుడే ఆనందంగా ఉండు.

అష్టావక్రుడి యొక్క మతం వాయిదాల పద్ధతికి చెందినది కాదు. అది చేతిలోని నగదు, ద్రవ్యము.

ఓ విస్తారమైనవాడా, మతం మరి నాస్తికత,
ఆనందం మరి దుఃఖం - అన్నీ మనస్సుకు చెందినవి,
అవి నీ కోసం కాదు. నువ్వు కర్తవు లేదా
అనుభవించేవాడివి కాదు. నువ్వు ఎల్లప్పుడూ
విముక్తుడవే అయివున్నావు.

జ్ఞానోదయం మన సహజ స్వభావం. ప్రజ్ఞ మన అంతర్గత స్వభావం. దైవత్వం మన ఉనికి యొక్క విధానం. అది మన కేంద్రం. అది మన జీవితం, మన అస్తిత్వం యొక్క పరిమళం.

అష్టావక్రుడు అంటాడు : **ఓ విస్తారమైనవాడా** ... ఓ ఆనందాన్ని తెచ్చేవాడా, ఓ అపురూప దివ్యత్వమా, **... మతం మరి నాస్తికత, ఆనందం మరి దుఃఖం ... అన్నీ మనస్సుకు చెందినవి...** ఇవన్నీ ఆలోచనా తరంగాలు. మీరు చెడు లేదా మంచి చేశారు, పాపం చేశారు లేదా మంచి కార్యాలు నిర్వర్తించారు, ఒక ఆలయాన్ని నిర్మించారు లేదా దానధర్మాలు చేశారు - ఇవన్నీ మనస్సుకు చెందినవి.

నువ్వు కర్తవు లేదా అనుభవించేవాడివి కాదు.

నువ్వు ఎల్లప్పుడూ విముక్తుడవే అయివున్నావు

మీరు శాశ్వతంగా స్వతంత్రులు, మీరు ఎల్లప్పుడూ స్వతంత్రులుగానే ఉన్నారు.

విముక్తి అనేది మనం శ్రమించవలసిన అవసరం ఉన్న ఒక సంభవం కాదు.

విముక్తి అనేది మన అస్తిత్వాలలో ఇప్పటికే సంభవించింది.

ఈ సమస్త అస్తిత్వమూ స్వేచ్ఛ నుంచే రూపొందించబడింది. దాని ప్రతి అణువూ, దాని ప్రతి సూక్ష్మ రంధ్రమూ విముక్తిచే రూపొందించబడింది. ఈ సమస్త అస్తిత్వం స్వేచ్ఛ అనే పదార్థం నుంచే ఉత్పత్తి చేయబడింది. దాని మూల స్వభావం స్వేచ్ఛే.

ఈ ప్రకటన ... కేవలం దానిని అవగాహన చేసుకోండి మరి ఆ రూపాంతరీకరణ చోటు చేసుకుంటుంది. దానిని అవగాహన చేసుకోవడం తప్ప చేయడానికి ఏమీ లేదు. అది మీలోకి దిగివస్తే కనుక, మీరు మీ మనస్సంతటితో వింటే కనుక, అది చాలు.

నేను చెప్పాలనుకుంటున్నాను " ఈ రోజుకు చాలు."

అష్టావక్రుడిని అవగాహన చేసుకోవడానికి ఒక సంపూర్ణ ప్రయత్నం చెయ్యండి. అష్టావక్రుడిలో చేతలకు స్థానం లేదు. కనుక మీరు చేయగలిగిన పద్ధతి ఏదో బహిర్గతమవ్వబోతోంది అని అనుకోకండి. అష్టావక్రుడు చెయ్యడానికి ఏదీ సూచించడు. విశ్రాంతిగా ఉండి వినండి. చెయ్యడం ద్వారా ఏదీ సంభవించబోవడం లేదు.

కనుక ఒక సూత్రం వచ్చినప్పుడు జ్ఞాపకార్థమై వ్రాసుకోవడానికి ఒక పుస్తకం లేదా స్క్రాచ్ ప్యాడ్‌ను తీసుకురాకండి. తరువాత చెయ్యడానికి దానిని వ్రాసుకోకండి. చెయ్యడం అనేది ఇక్కడ పనిచెయ్యదు. భవిష్యత్తుకై నిమిత్తం లేకుండా వినండి. కేవలం

వినండి. కేవలం నాతో నిశ్శబ్దంగా కూర్చోండి మరి వినండి. విశ్రాంత స్థితిలో నేను చెప్పేది వినండి. కేవలం వింటూ... వింటూ, మీరు జ్ఞానోదయం పొందగలరు.

అందువలనే ఒక ' శ్రావకుడు ' కేవలం వినడం ద్వారానే జ్ఞానోదయాన్ని పొందగలడు అని మహావీరుడు చెబుతాడు ! ' శ్రావకుడు ' అంటే అర్థం ఏమిటంటే కేవలం వినడం ద్వారానే విముక్తుడు అయ్యేవాడు అని. ' సాధువు ' అంటే అర్థం ఏమిటంటే వినడం ద్వారా విముక్తుడు కాలేనివాడు. అతను కొంత తక్కువ వివేకంగలవాడు ... అతను దేనినో సాధన చెయ్యాలి. కొరడా యొక్క నీడ అతనికి సరిపోదు. ఈ అశ్వం కొద్దిగా నిమ్న జాతికి చెందినది : కొరడాను ఝుళిపిస్తే, అప్పుడు అది కొద్దిగా కదులుతుంది. లేదా దానిని కొట్టండి మరి అది కొద్దిగా కదులుతుంది.

ఆ నీడే చాలు.

వినండి ... ఆ కొరడా యొక్క నీడ కనబడుతుంది.

అష్టావక్రుడితో ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి : చెయ్యడానికి ఏమీ లేదు. మీరు ఆనందంగా వినవచ్చు. తదనంతరం ప్రయత్నించడానికి దాని నుంచి మీరు ఏమీ వెలికితీయవలసిన అవసరం లేదు. జరిగేది ఏదైనా వినడం ద్వారానే జరుగుతుంది. సరిగ్గా వినడం అనేదే ఆ తాళం చెవి.

... ఈ క్షణమే మీరు సంతోషంతో, శాంతితో ఉంటారు
మరి దాస్యం నుంచి స్వతంత్రులు అవుతారు.

సరిగ్గా ఇప్పుడే విముక్తులు అవ్వండి. ఈ క్షణమే జ్ఞానోదయం పొందినవారు అవ్వండి. ఎవ్వరూ మిమ్మల్ని ఆపడం లేదు, ఏదీ మిమ్మల్ని నిరోధించడం లేదు. ఒక్క అంగుళం కూడా కదలవలసిన అవసరం లేదు. సరిగ్గా మీరు ఉన్నచోటే జ్ఞానోదయాన్ని పొందండి. ఎందుకంటే ఇప్పటికే మీరు స్వేచ్ఛాయుతులు. జాగృతులవ్వండి మరి జ్ఞానోదయం పొందండి.

నిస్సంగుడివై, రూపరహితుడవై, ఈ సమస్త విశ్వాన్నీ
వీక్షించే సాక్షివి నువ్వు. దీనిని తెలుసుకో, ఆనందంగా ఉండు.

ఆనందంగా ఉండండి. ఒక్క క్షణం కూడా నిరీక్షించవలసిన పని లేదు. అది ఒక గంతు, ఒక ఆకస్మికమైనగంతు. అష్టావక్రుడితో దశలు అనేవి ఉండవు. అది ఒక క్రమక్రమమైన వికాసం కాదు, అది ఆకస్మికమైనది. అది ఈ క్షణమే సంభవించగలదు.

హరి ఓం తత్ సత్ !

నిన్న మీ ప్రసంగాన్ని వింటున్నప్పుడు, నేను ఈ అవనిపై లేనట్లుగా, బదులుగా నేను విస్తారమైన మరి అనంతమైన ఆకాశంలో కాంతి యొక్క చిన్న అణువునై ఉన్నట్లుగా అనుభూతి కలిగింది. అయినాగానీ ఇది పిచ్చి అయివుండవచ్చు. ఇది నా అహం యొక్క యుక్తి కావచ్చు అనే భావన కొన్నిసార్లు ఉదయిస్తూంటుంది. దయచేసి నా మార్గంపై కాంతిని ప్రసరించండి.

అది సరిగ్గా ఇప్పుడే, సరిగ్గా ఇక్కడే సంభవించగలదు అని మీరు ఎల్లప్పుడూ నొక్కివక్కాణిస్తారు. దీనిని మళ్ళీ మళ్ళీ చెప్పడం అనేది రెచ్చగొట్టడమా ? మరి మాలో దాహార్తిని రేకెత్తించడానికి ఒక విధానం లేదా సాధనమా ?

మీరుగానీ లేదా అష్టావక్రుడు గానీ " ఒక సాక్షిగా ఉండు " అని చెప్పినప్పుడు, మీరు ఎవరిని ఉద్దేశిస్తున్నారు ?

②

సరిగ్గా ఇక్కడే, సరిగ్గా ఇప్పుడే

మొదటి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

నిన్న మీ ప్రసంగాన్ని వింటున్నప్పుడు, నేను ఈ అవనిపై లేనట్లుగా, బదులుగా నేను విస్తారమైన మరి అనంతమైన ఆకాశంలో కాంతి యొక్క చిన్న అణువునై ఉన్నట్లుగా అనుభూతి కలిగింది. ప్రసంగం తరువాత కూడా, తేలికదనం మరి శూన్యతల యొక్క అనుభవం కొనసాగింది మరి నేను ఈ ఆకాశంలో సంచరిస్తూనే ఉండాలని కోరుకున్నాను. జ్ఞానం, కర్మ, భక్తి అంటే ఏమిటో నాకు తెలియదు, కానీ ఏకాంతంలో ఈ స్థితిలోనే మునిగిపోయి ఉండాలని నేను వాంఛిస్తున్నాను. అయినాగానీ ఇది పిచ్చి అయివుండవచ్చు, ఇది నా అహం యొక్క యుక్తి కావచ్చు అనే భావన కొన్నిసార్లు ఉదయిస్తూంటుంది. దయచేసి నా మార్గంపై కాంతిని ప్రసరించండి.

మనం ఈ అవనిపై ఉన్నాం, కానీ వాస్తవానికి మనం ఈ అవనిపై ఉండలేము, మరి మనం లేము. మనం దానిని అనుభూతి చెందుతాము : మనం ఈ అవనిపై అపరిచితులం. మన శరీరంలో మనం ఒక గృహాన్ని తయారు చేసుకున్నాం, కానీ మన శరీరం మన గృహం కాదు.

అది ఒకరు విదేశంలో స్థిరపడి మరి తన జన్మభూమిని మరచిపోవడం లాంటిది. అకస్మాత్తుగా విపణి వీధిలో ఒకరోజు తన ఇంటిని జ్ఞాపకం చేసేవారు ఎవరినో, తన స్వంత భాషను మాట్లాడేవారు ఎవరినో అతను కలుసుకుంటాడు. ఒక క్షణకాలం ఆ పరాయి దేశం మాయమైపోతుంది మరి అతని జన్మభూమి అక్కడ ఉంటుంది.

పవిత్ర గ్రంథాల యొక్క భావం ఇదే.

పరమగురువుల యొక్క మాటల వాస్తవ ఉద్దేశ్యం ఇదే.

వాటిని విన్న తరువాత, ఒక క్షణంపాటు మనం ఇక ఇక్కడ ఉండము. మనం ఎక్కడకు చెందుతామో అక్కడికి మనం వెళతాం. మనం వారి సంగీతంలో ప్రవహిస్తాం. మనల్ని సంపూర్ణంగా మమేకం చేసిన పరిస్థితులు మాయమవుతాయి, మరి ఎంతో సుదూరాన ఉన్నది సమీపానికి వస్తుంది.

అష్టావక్రుడి యొక్క మాటలు పూర్తిగా అద్వితీయమైనవి. వాటిని వింటూంటే అది మళ్ళీ సంభవిస్తుంది ; మీరు ఈ అవనిపై లేరనీ, ఆ ఆకాశంలో భాగమైపోయారనీ మీరు మళ్ళీ మళ్ళీ అనుభూతి చెందుతారు... ఎందుకంటే ఈ మాటలు ఆ ఆకాశానికి చెందినవి. ఈ మాటలు ఆ స్వస్థానం నుంచి వచ్చాయి, మనం అందరం దేని నుంచి వచ్చామో, మనం అందరం దేని వద్దకు తిరిగి వెళ్ళాలో ఆ మూలం నుంచి ఈ మాటలు వచ్చాయి. దాని వద్దకు తిరిగి వెళ్ళకుండా మనం ఎన్నటికీ శాంతిని పొందలేము.

మనం ఉన్నచోటు ఒక సత్రంలాంటిది, ఒక ఇల్లు కాదు. అది ఒక ఇల్లు అని మనం ఎంత హఠం చేసినాగానీ, ఇంకా ఒక సత్రం అనేది సత్రంగానే ఉంటుంది. దానిని మరచిపోవడానికి, అది మీ దోషం కాదు అని విశదీకరించడానికి ప్రయత్నించండి. దాని వలన ఏ వ్యత్యాసమూ ఉండదు. ఆ ముల్లు మనలను గుచ్చుతూనే ఉంటుంది, ఆ జ్ఞాపకం వస్తూనే ఉంటుంది. మరి కొన్నిసార్లు, ఒక అయస్కాంతంలాగా మనలను ఆకర్షించి మరో ప్రపంచాన్ని మనకు చూపగలిగినటువంటి సత్యాన్ని మనం ఎదుర్కొనడం సంభవిస్తే కనుక, అప్పుడు మనం ఈ అవనిలో భాగం కాదు అని మనం అనుభూతి చెందుతాం.

అది మంచిది : " నిన్న మీ ప్రసంగాన్ని వింటున్నప్పుడు, నేను ఈ అవనిపై లేనట్లుగా అనుభూతి కలిగింది." ఈ భూమికి చెందినవారు ఎవ్వరూ లేరు. మనం దానికి చెందినవారిలా కనిపిస్తాం. మనం అవనికి చెందినవారిమే అయినట్లుగా మనం భావిస్తాం ; వాస్తవంలో మనం ఆ ఆకాశంలో ఉంటాము. మన స్వభావం ఆ ఆకాశానికి చెందినది.

అస్తిత్వం అంటే అంతర్గత ఆకాశం.

శరీరం అంటే భూమి, ఈ శరీరం భూమి నుంచే తయారు చేయబడింది. మీరు ఆకాశం నుంచి తయారు చేయబడ్డారు.

ఈ రెండూ మీ అంతరంగంలో కలుసుకున్నాయి.

ఈ అవని ఆ ఆకాశాన్ని కలుసుకుంటున్నట్లుగా కనిపించే దిజ్మండలమే మీరు.

కానీ అది దానిని ఎప్పుడైనా కలుసుకుందా ? ఆకాశం భూమిని స్పృశిస్తూ ... దిజ్మండలం సుదూరతీరాన కనిపిస్తుంది. దానిని ఒకటి లేదా రెండు నిమిషాలలో చేరుకుంటామని ఆశిస్తూ, దానివైపు నడవడం ప్రారంభించండి. జన్మ తరువాత జన్మ నడుస్తూనే ఉండడం కొనసాగించండి ... ఆకాశం అవనిని స్పృశించే ప్రదేశాన్ని మీరు ఎన్నటికీ చేరరు. అది కేవలం ఒక ఎండమావి. కొద్దిగా ముందుకు వెళితే, కేవలం కొద్ది ముందుకు వెళితే మీరు దానిని స్పృశించగలరు అన్నట్లుగా అది ఎల్లప్పుడూ కనిపిస్తుంది.

ఆ దిజ్మండలం అనేది ఉండదు, అది కేవలం ఉన్నట్లుగా కనిపిస్తుంది. బాహ్యంలోని దిజ్మండలంతో ఉన్నట్లుగానే మన అంతరంగంలోనూ ఉంటుంది. అంతరంగంలోనూ ఏ కలయికా ఎన్నడూ సంభవించదు. అస్తిత్వం శరీరాన్ని ఎలా స్పృశించగలదు ? అనిత్యమైనది నిత్యమైనదానిని ఎలా కలుసుకుంటుంది ? పాలు నీళ్ళతో కలిసిపోతాయి... రెండూ ఈ భూమికి సంబంధించినవే. కానీ అస్తిత్వం శరీరంతో ఎలా ఐక్యమైపోగలదు ? వాటి మౌలిక లక్షణం విభిన్నమైనది. అవి ఎంత దగ్గరగా వచ్చినాగానీ, అవి స్పృశించలేవు. అవి ఎప్పటికీ సమీపంగానే ఉండవచ్చు, అయినాగానీ అవి స్పృశించుకోలేవు, అవి కలుసుకోలేవు. అది కేవలం మనం ఊహించుకున్నది, మన భావన ... దిజ్మండలం అనేది కేవలం మన భావనగానే ఉనికిలో ఉంటుంది.

అష్టావక్రుడి యొక్క వివరణములను మీరు మీ హృదయంలోకి బాణాలలా దూసుకుపోవడానికి అనుమతిస్తే కనుక, అవి మిమ్మల్ని జాగృతపరచి, మీకు తిరిగి జ్ఞాపకం చేస్తాయి. ఎప్పుడో మరచిపోయిన జ్ఞాపకాన్ని అవి నిద్ర లేపుతాయి. ఒక్క క్షణకాలం ఆ ఆకాశం తెరుచుకుంటుంది, మబ్బులు విడిపోతాయి, మరి మీ జీవితం సూర్యరశ్మితో నిండిపోతుంది.

అది కష్టతరం కావచ్చు ... ఆ అనుభవం మన జీవన విధానం అంతటికీ ప్రతికూలంగా ఉంటుంది. అది అసౌఖ్యాన్ని కలిగిస్తుంది. అంతరంగంలోని మేఘాలను మీరు చెదరగొట్టలేదు, ఈ మేఘాలు ఒక గురువు యొక్క మాటల చేత చెదరగొట్టబడ్డాయి. ఈ మేఘాలు మళ్ళీ ముసురుకుంటాయి. మీరు ఇంటికి చేరేలోపు, మళ్ళీ ఆ మేఘాలు మిమ్మల్ని ఆవరిస్తాయి. అంత తొందరగా మీరు మీ అలవాట్లను వదిలెయ్యరు. మళ్ళీ ఆ మేఘాలు ముసురుకుంటాయి, మరి మీరు మరింత అసౌఖ్యంగా ఉంటారు. మీరు సందేహిస్తారు. మీరు చూసినది ఒక కల కాదా ? అది ఒకరకమైన ప్రసరణ కాదా ? అది అహం యొక్క, మనస్సు యొక్క యుక్తి కాదా ? బహుశా మీరు ఒక విధమైన/ఉన్మాదంలో పడిపోయారేమో ?

సహజంగానే, మీ అలవాట్ల యొక్క బరువు భారమైనది, అతి పురాతనమైనది. అంధకారం పురాతనమైనది ... అది ఉండదు, అయినా అది పురాతనమైనది. సూర్యరశ్మి యొక్క కిరణాలు ఎప్పుడు బయటపడినా, అవి తాజాగా ఉంటాయి... పూర్తి నూతనంగా, అప్పుడే స్నానం చేసినట్లుగా. మీకు వాటిని ఒక్క క్షణంపాటు చూస్తారు, మరి తిరిగి అంధకారంలో మీరు మునిగిపోతారు. మీ అంధకారం అత్యంత సుదీర్ఘ చరిత్రను కలిగివుంది. మీరు ఈ రెండింటినీ తూచినప్పుడు సూర్యరశ్మిని గురించిన సందేహం ఉదయిస్తుంది కానీ అంధకారాన్ని గురించినది కాదు. అంధకారాన్ని సందేహించాలి. దాని బదులుగా సూర్యరశ్మి సందేహించబడుతుంది. ఎందుకంటే దాని కిరణాలు నూతనమైనవి, మరి అంధకారం అతి పురాతనమైనది. అంధకారం అనేది శతాబ్దాల తరబడి వస్తున్న ఒక సంప్రదాయం లాంటిది. వెలుగు యొక్క కిరణాలు ఇప్పుడే వచ్చాయి ... తాజాగా, నూతనంగా. ఎంత నూతనమైనవంటే, వాటిని నమ్మడం ఎలా ?

" నేను ఈ అవనిపై లేనట్లుగా నేను అనుభూతి చెందాను." ఈ భూమికి చెందినవారు ఎవ్వరూ లేరు. మనం ఈ భూమికి చెందినవారం కాలేము. మరొక విధంగా భావించడం అనేది మన విశ్వాసం, మన ప్రసరణ. అది అలా కనిపిస్తుంది, కానీ అది సత్యం కాదు.

" బదులుగా నేను విస్తారమైన మరి అనంతమైన ఆకాశంలో కాంతి యొక్క చిన్న అణువునై ఉన్నట్లుగా నేను అనుభూతి చెందాను." ఇదే ప్రారంభం, " అనంతమైన ఆకాశంలో కాంతి యొక్క చిన్న అణువు." త్వరలోనే మీరు భావిస్తారు, " నేనే అనంతమైన ఆకాశాన్ని." ఇదే ప్రారంభం.

సరిగ్గా ఇప్పుడే ఈ అనంతమైన ఆకాశంలోకి పూర్తిగా ఆకర్షింపబడడానికి మనం సిద్ధంగా లేము. మరి తుఫాను రావడం, గాలులు మనల్ని మోసుకుపోవడం మనం అనుభూతి చెందితే కనుక, ఇంకా మనం విడిగానే ఉంటాం మరి మనల్ని మనం కాపాడుకుంటాం. "... కాంతి యొక్క అణువు..." మీరు ఇక ఎంతమాత్రమూ అంధకారం కాదు, మీరు కాంతి యొక్క అణువుగా అయ్యారు. కానీ ఆకాశం నుంచి వ్యత్యాసం అనేది ఇంకా వుంది ; ఆ వ్యత్యాసం వుంటుంది, ఆ ఖాళీ వుంటుంది. మీరు ఆకాశంగా మారిన రోజు ఆ అత్యున్నతమైనది సంభవిస్తుంది. కాంతి యొక్క అణువు కూడా వేరైనదే. మీరు, అవిభాజ్యం, ఏకం అయిన రోజు, ఆ రోజు " నేను విస్తారమైన శూన్యాకాశాన్ని," అని మీరు అనుభూతి చెందుతారు.

దానిని భాషలో మనం ఆ విధంగానే వ్యక్తీకరిస్తాం : " నేను ఒక శూన్య ఆకాశాన్ని." కానీ ' నేను ' అనేది ఉన్నంతకాలం అది ఎలా సాధ్యం అవుతుంది ? " నేను " అనేది ఉంటే కనుక అప్పుడు ఆకాశం విడిగా ఉంటుంది. శూన్య ఆకాశం యొక్క అనుభూతి వచ్చినప్పుడు, అప్పుడు ' నేను ' అనేది పోతుంది, కేవలం శూన్యాకాశమే ఉంటుంది.

ప్రజలు అంటారు, " అహం బ్రహ్మోస్మి – నేనే భగవంతుడిని, నేనే బ్రహ్మాన్ని." కానీ బ్రహ్మం ఉన్నప్పుడు, ' నేను ' అనేది ఎలా మిగిలి ఉండగలదు ? కేవలం బ్రహ్మమే మిగిలి ఉంటుంది, నేను కాదు. కానీ దానిని వ్యక్తీకరించడానికి మరో మార్గం లేదు.

నిద్రావస్థలో ఉన్న ప్రజల కోసమే భాష అనేది ఉంది. ఒక అపరిచిత దేశంలో స్థిరపడినవారు కానీ దానినే తమ మాతృభూమిగా భావించేవారికే భాష చెందుతుంది.

మౌనం అనేది జ్ఞానుల కోసం.

భాష అనేది అజ్ఞానుల కోసం.

కనుక మీకు ఏదైనా చెప్పగానే, కేవలం దానిని చెప్పడంలోనే సత్యం అనేది అసత్యమైపోతుంది. " అహం బ్రహ్మోస్మి " – నేనే బ్రహ్మాన్ని, నేనే ఆకాశాన్ని. దానిని చెప్పండి, అది ఒక అబద్ధం అయిపోతుంది. కేవలం ఆకాశమే ఉంది. కానీ, " కేవలం ఆకాశమే వుంది " అని చెప్పడం పూర్తి సత్యం కాదు, ఎందుకంటే 'కేవలం' అనేది ఇంకా ఎక్కువ ఏదో ఉండాలి అనేది సూచిస్తుంది; లేదంటే కేవలం అనేది నొక్కి చెప్పడం ఎందుకు ? " ఆకాశం ఉంది ?" ... దీనిని చెప్పడంలో కూడా సమస్య ఉంది ఎందుకంటే " ఉంది " అనేది " లేదు " కూడా అవ్వగలదు.

" ఈ ఇల్లు ఉంది" అని మనం అంటాం. ఏదో ఒకరోజు అది ఉండకుండా పోతుంది, అది పడిపోవచ్చు, ఒక శిథిలంగా మారవచ్చు. మనం అంటాం, " ఆ మనిషి ఉన్నాడు, " ఏదో ఒకరోజు ఆ మనిషి మరణిస్తాడు. కొన్నిసార్లు అది ఉండడం మరి కొన్ని సార్లు అది ఉండకపోవడం, ఆకాశం ఈ విధంగా ఉండదు. ఆకాశం ఎల్లప్పుడూ ఉంది, కనుక, " ఆకాశం వుంది " అని అనడం పునరుక్తి అవుతుంది. ఆకాశం యొక్క మూల స్వభావమే ఉండడం. కనుక " ఉంది " అని మళ్ళీ చెప్పడం ఎందుకు ? ఏదో ఒకరోజు ఉండకుండా పోయే వాటి విషయంలో ' ఉంది ' అని చెప్పడం సరైనది. ఒక మనిషి ఉన్నాడు. ఒకరోజు అతను లేడు, ఈరోజు అతను ఉన్నాడు, మరి రేపు మళ్ళీ అతను ఉండడు. మన ' ఉంది ' అనేది రెండు ' లేదు ' ల మధ్యన ఉంటుంది.

ఆకాశం యొక్క ఉనికి అనేది నిన్న ఉండేది, ఈరోజు ఉంది మరి రేపు కూడా ఉంటుంది. రెండు 'ఉంది' ల మధ్యన ' ఉంది ' అనే దానికి అర్థం ఏముంది? రెండు ' ఉండకపోవడం ' ల మధ్యన 'ఉంది' అనే దానికి అర్థం ఉంటుంది. కనుక, ' ఆకాశం వుంది ' అని చెప్పడం కూడా పునరుక్తే. మనం అందాము, " ఆకాశం ". కానీ మనం ఆకాశం అని అన్నప్పుడు, మనం ఒక పదాన్ని తయారు చేసినప్పుడు,అప్పుడు కూడా అది తప్పే అవుతుంది. కేవలం ఆకాశం అని అనడంలోని అర్థం దాని నుంచి భిన్నమైనది, దాని నుంచి వేరుగా వున్నది ఏదో ఉంది అనేది అవుతుంది ; లేదంటే ఒక పదం యొక్క అవసరం ఏముంది ? కేవలం ఒక్కటే ఉన్నట్లయితే కనుక, ఒకటి అని చెప్పవలసిన అవసరం లేదు. అంకెలు ఉన్నప్పుడు, రెండు ఉన్నప్పుడు ... మూడు ఉన్నప్పుడు, నాలుగు ఉన్నప్పుడు మాత్రమే ఒకటి అనేది అర్థవంతమైనది అవుతుంది. ఆకాశం అని అనడం ఎందుకు ?

ఇందువలనే ప్రజ్ఞ మౌనంగా ఉంటుంది. అత్యున్నత ప్రజ్ఞను మాటలలోకి తేవడం అనేది అసాధ్యం.

కానీ మనం అదృష్టవంతులం ఎందుకంటే అష్టావక్రుడి లాంటి అరుదైన వ్యక్తులు అలుపులేని, అసాధ్యమైన ప్రయత్నాలు చేశారు. అది సాధ్యమైనంతవరకూ సత్యం యొక్క పరిమళాన్ని మాటలలోకి తేవడానికి వాళ్ళు ప్రయత్నించారు. మరి గమనించండి : అతికొద్దిమందే అష్టావక్రుడిలా తమ ప్రయత్నంలో సఫలమయ్యారు. ఎంతోమంది సత్యాన్ని మాటలలోకి తేవడానికి ప్రయత్నించారు ... అందరూ విఫలమయ్యారు. వైఫల్యం అనేది నిశ్చితం. కానీ విఫలమైనవారిలో మీరు చూస్తే కనుక, అతి తక్కువ విఫలమైనవాడు అష్టావక్రుడే. అతను అత్యంత విజయవంత మయ్యాడు. మీరు సరిగ్గా వింటే కనుక మీకు మీ స్వగృహం జ్ఞాపకం వస్తుంది.

మీరు కాంతి యొక్క అణువుగా ఉన్నట్లు మీరు అనుభూతి చెందడం అనేది శుభకరమైనది. మరుగైపోవడానికి సిద్ధంగా ఉండండి. కాంతి యొక్క అణువు సైతం మరుగైపోయినట్లు, కేవలం ఆకాశం మాత్రమే మిగిలి ఉన్నట్లుగా ఒకరోజు మీరు అనుభూతి చెందుతారు. అప్పుడు మైకం మిమ్మల్ని పూర్తిగా ముంచెత్తుతుంది. అప్పుడు సత్యం యొక్క మధువులో మీరు మునిగిపోతారు. అప్పుడు మీరు నాట్యం చేస్తారు. అప్పుడు మీరు అమృతం యొక్క సంపూర్ణ రుచిని అనుభవిస్తారు.

" ప్రసంగం తరువాత కూడా, తేలికదనం, శూన్యతల యొక్క అనుభవం కొనసాగింది. నేను ఈ ఆకాశంలో సంచరిస్తూనే ఉండాలని కోరుకున్నాను." ఇక్కడ మనం ఒక చిన్న తప్పు చేస్తాం. మనకు ఏదైనా మనోహర అనుభవం కలిగినప్పుడు,

మనం దానిని మళ్ళీ మళ్ళీ కోరుకుంటాం. మానవుడి మనస్సు ఎంత దుర్బలం. అది కోరికలతో నిండి వుంటుంది, తృష్ణతో నిండి ఉంటుంది ; ఆకర్షణలు ఉత్పన్నం అవుతూనే ఉంటాయి. మనోహరంగా ఏది వున్నా అది దానిని పునరుక్తం చేయాలని కోరుకుంటుంది. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి : పునరుక్తి అనేది ఇప్పటికే తప్పు. " అది మళ్ళీ జరుగనివ్వు," అని మీరు కోరుకోగానే, అది ఎన్నటికీ జరగదు, ఎందుకంటే మొదటిసారి అది సంభవించినప్పుడు అది మీ కోరిక నుంచి రాలేదు. అది తనంతట తాను జరిగింది, అది మీ చర్య కాదు.

ఇక్కడే అష్టావక్రుడు దృఢంగా నొక్కి వక్కాణిస్తాడు : సత్యం *సంభవిస్తుంది.* అది ఒక చర్య కాదు, అది ఒక సంభవం. వింటూ ఉన్నప్పుడు మీకు అది సంభవించింది. మీరు ఏం చేస్తున్నారు ? వినడం అంటే మీరు ఏమీ చేయడం లేదు అని అర్థం. శూన్యతను అనుభూతి చెందుతూ మీరు కూర్చుని ఉన్నారు. మీరు మౌనంగా ఉన్నారు, మీరు అప్రమత్తంగా ఉన్నారు, మీరు మెలకువతో ఉన్నారు, మీరు నిద్రావస్థలో లేరు. మంచిది ! కానీ మీరు ఏం చేస్తూ ఉన్నారు ? మీరు కేవలం స్వీకరించేవారు. మీ మనస్సు అద్దంలాంటిది ... దాని ముందుకు వచ్చినది ప్రతిఫలించబడింది, చెప్పినది వినబడింది. మీరు దానికి ఏదీ జోడించడం లేదు. మీరు ఏదైనా జోడించి వున్నట్లయితే కనుక అది ఎన్నటికీ సంభవించేది కాదు. మీరు వ్యాఖ్యానాలు చేస్తూ లేరు, " అవును, ఇది సరైనది, అది తప్పు. నేను దీనితో ఏకీభవిస్తున్నాను, నేను ఏకీభవించడం లేదు. ఇది పవిత్ర గ్రంథాలకు అనుగుణంగానే ఉంది, " లేదా " అది లేదు ", అని మీ యొక్క మనస్సులో మీరు అనడం లేదు. మీరు దాని గురించి తార్కికమైన వివరణములను చేయడం లేదు. మీరు తర్కంలో మునిగిపోయివుంటే కనుక ఈ సంభవం అన్నది ఎన్నటికీ చోటుచేసుకుని వుండేది కాదు.

ఈ ప్రశ్నను అడిగిన వ్యక్తి ... స్వామి ఓం ప్రకాశ్ సరస్వతి ... అతను నాకు తెలుసు. అతని మనస్సు తర్కానికి సుదూరంలో వుంది, సందేహాలు మరి వాదనలకు సుదూరంలో వుంది. ఆ రోజులు పోయాయి. ఒకానొక సమయంలో అతను తార్కికమైన వాదనలు చేసి ఉండవచ్చు, అనుమానాలను వ్యక్తం చేసి ఉండవచ్చు. ఇప్పుడు జీవితానుభవాల వలన అతను పరిపక్వం అయ్యాడు. ఇప్పుడు ఆ బుద్ధిహీనత మనస్సులో లేదు. ఇందువలనే అది సంభవించగలిగింది. అతను ఏమీ చెయ్యకుండా, కూర్చుని, కేవలం వింటున్నాడు ... అతను కేవలం కూర్చోవడాన్నే కొనసాగించాడు మరి అది సంభవించింది.

మీరు ఏమీ చెయ్యకుండానే మొదటిసారి అది సంభవించింది. అది రెండవసారి సంభవించాలి అని మీరు కోరుకుంటే కనుక, అది ఒక గందరగోళాన్ని సృష్టిస్తుంది. అది సంభవించడానికి కారణం కోరుకోవడం కాదు. కనుక అలాంటి అరుదైన సంభవం చోటుచేసుకున్నప్పుడు, కోరుకోకండి. అది సంభవించినప్పుడు, దానిని ఆనందంగా అంగీకరించండి. అది సంభవించనప్పుడు, ఫిర్యాదు చేయకండి, దానికోసం అడగకండి. అడగండి మరి మీరు దానిని కోల్పోతారు. అడగడం అనే దానిలో అధికారంతో కోరడం, హఠం ఉంటాయి : " అది సంభవించి తీరాలి. అది ఒకసారి సంభవించింది, అది ఇప్పుడు ఎందుకు సంభవించడం లేదు ?"

ఇది ప్రతిరోజూ జరుగుతుంది. ప్రజలు ధ్యానం చెయ్యడానికి ఇక్కడకు వచ్చినప్పుడు, ప్రారంభంలో వారు తాజాగా మరి నూతనంగా ఉంటారు. వారికి అనుభవం లేదు, కనుక అది సంభవిస్తుంది. ఇది అత్యంత ఆశ్చర్యకరమైనది. మీరు దీనిని గ్రహించాలి ... అష్టావక్రుడిని మెరుగుగా అవగాహన చేసుకునేందుకు అది మీకు దోహదపడుతుంది. ఇది నా దైనందిన అనుభవం. ప్రజలు తాజాగా మరి నూతనంగా వచ్చినప్పుడు మరి వారికి ధ్యానం యొక్క అనుభవం లేనప్పుడు, అది సంభవిస్తుంది. అది సంభవిస్తుంది మరి వారు ఆనందంతో నిండిపోతారు ... కానీ ఆ అనుభవమే సమస్యను సృష్టిస్తుంది. అప్పుడు ఆశించడం మొదలవుతుంది. ఈ రోజు సంభవించినది రేపు సంభవించి తీరాలి ; కేవలం సంభవించడం కాదు, కానీ మరింత శక్తివంతంగా సంభవించాలి. కానీ అది మళ్ళీ సంభవించదు మరి రోదిస్తూ, వారు నన్ను సమీపిస్తారు. వారు అంటారు. " ఏం జరిగింది ? మేము ఏదైనా తప్పు చేశామా ? అది ఒకసారి సంభవించింది, కానీ ఇప్పుడు అది సంభవించడం లేదు."

" ఇదే మీ తప్పు," నేను వారికి చెబుతాను. " అది మొదటిసారి సంభవించినప్పుడు మీరు దేనినీ ఆశిస్తూ లేరు ; ఇప్పుడు మీరు ఆశిస్తున్నారు. ఇక మనస్సు ఎంతమాత్రమూ అమాయకంగా లేదు. మీ ఆకాంక్ష దానిని కలుషితం చేసింది. ఇప్పుడు మీరు నిష్కళంకంగా లేరు, మీరు తెరువబడిలేరు ... అడగడం అనేది ద్వారాలను మూసేసింది. ఆకాంక్ష అనేది ఉదయించింది, మరి ఈ ఆశించడం అనేది అన్నింటినీ నాశనం చేస్తుంది. ఇప్పుడు కోరిక ప్రేరేపించబడింది. అత్యాశ ప్రవేశిస్తుంది."

ఇది ప్రతిరోజూ సంభవిస్తుంది. సుదీర్ఘకాలంపాటు ధ్యానం చేసినవారు ఎన్నో పద్ధతులను ప్రయత్నిస్తూపోతారు. కానీ కేవలం అతి కష్టం మీద ధ్యానంలో పడతారు. వారి అనుభవం ఒక అడ్డంకి అవుతుంది. కొన్నిసార్లు ఎవరో కేవలం వస్తారు, ఆ

ప్రకంపనతో ప్రవహిస్తూ ... అతను ఎన్నడూ ధ్యానం గురించి ఆలోచించనైనా లేదు. ఒక మిత్రుడు వస్తున్నాడు, కనుక అతను అనుకున్నాడు, " వెళ్ళి అది ఏమిటో చూద్దాం." అతను కేవలం ఉత్సుకతతో వచ్చాడు ... కోరిక లేదు, ఆధ్యాత్మిక అన్వేషణ లేదు, ధ్యానం దిశగా ప్రయత్నాలు లేవు ... అతను కేవలం వచ్చాడు. ఇతరులు ధ్యానం చేస్తూండడం అతను చూసినప్పుడు అంతరంగంలో ఏదో ప్రేరేపించబడింది మరి అతను వారితో చేరాడు. అప్పుడు అది సంభవించింది ! అతను విస్మయం చెందాడు : " నేను ధ్యానం కోసం రాలేదు, కానీ ధ్యానం సంభవించింది." ఇప్పుడు సమస్యలు మొదలవుతాయి. ఇప్పుడు, అతను మళ్ళీ వచ్చినప్పుడు ఆశించడం అనేది ఉంటుంది. మనస్సు ఆసక్తితో ఉంది ; అది మళ్ళీ సంభవించాలి. అక్కడ అత్యాస, పునరుక్తం కావాలనే కోరిక ఉన్నాయి. మనస్సు లోనికి వచ్చింది మరి ప్రక్రియ అంతా గందరగోళం అయ్యింది.

మనస్సు అనేది లేనప్పుడు మాత్రమే అది సంభవిస్తుంది.

గుర్తుంచుకోండి, మనస్సు అనేది పునరుక్తికై కోరిక.

సంతోషకరమైనది మళ్ళీ సంభవించాలి, అసంతోషకరమైనది ఎన్నడూ పునరుక్తం కాకూడదు ... ఇదే మనస్సు. మనస్సు ఎంచుకుంటుంది : ఇది జరగాలి మరి అది జరగకూడదు. ఇలానే అది మళ్ళీ మళ్ళీ జరగాలి, కానీ ఎన్నటికీ అలా జరగకూడదు... మనస్సు అంటే ఇదే.

మీరు జీవితంతో ప్రవహించడం ప్రారంభించినప్పుడు : ఏది జరిగినాగానీ, ఫరవాలేదు ; ఏదీ జరగకపోయినాగానీ, ఫరవాలేదు... వేదన వస్తుంది, అది అంగీకరించబడుతుంది. వేదన వస్తుంది, అడ్డగించడం అనేది ఉండదు. ఆనందం వస్తుంది, అది అంగీకరించబడుతుంది. ఆనందం వస్తుంది, ఉద్రేకం అనేది ఉండదు. ఆనందం మరి వేదన రెండింటిలోనూ, నిశ్చలత అనేది ఉన్నప్పుడు, సమత్వం అనేది వృద్ధి చెందడం ప్రారంభిస్తుంది. అప్పుడు ఆనందం మరి వేదన అత్యంత సదృశమైనవిగా కనిపించడం ప్రారంభిస్తాయి ... ఎందుకంటే ఏ ఎంపికా మిగిలిలేదు. ఇప్పుడు అది మన చేయి దాటిపోయింది. ఏది సంభవిస్తుందో, సంభవిస్తుంది.

మనం చూస్తూ పోతాము... దీనినే అష్టావక్రుడు సాక్షీభావం, సాక్షీతత్వం అని అంటాడు. మరి అతను అంటాడు సాక్షీభావం సిద్ధిస్తే కనుక, అన్నీ సిద్ధించినట్లే. అంతరంగంలో, సాక్షీభావం సాక్షిని మేల్కొలుపుతుంది, బాహ్యంలో అది సమతను తెస్తుంది.

సమత అనేది సాక్షీభావం యొక్క నీడ.

లేదా, మీరు సమతను సాధిస్తే కనుక, సాక్షీభావం వస్తుంది. ఈ రెండూ కలిసే వుంటాయి. అవి ఒకే దృగ్విషయం యొక్క రెండు కాళ్ళు లేదా రెండు రెక్కలు.

"నేను ఈ ఆకాశంలో సంచరిస్తూనే ఉండాలని కోరుకున్నాను." అప్రమత్తంగా ఉండండి. ధ్యానం యొక్క క్షణాలను నాశనం చేయడానికి మనస్సుకు అవకాశం ఇవ్వకండి. ఇదే మనస్సు ఇప్పటికే మీ జీవితాన్ని నాశనం చేసింది. మీ బాంధవ్యాలన్నింటినీ అది నాశనం చేసింది. ఈ మనస్సు మీ సమస్త జీవితాన్నీ ఒక ఎడారిలా శుష్కం చేసింది. ఎన్నో పువ్వులు వికసించగలిగినచోట కేవలం ముళ్ళు మాత్రమే ఉన్నాయి. మీరు అంతర్యానంలో ఈ మనస్సును మీతో తీసుకురాకండి. దానికి వీడ్కోలు చెప్పండి మరి మీరు సెలవు తీసుకోండి. ప్రేమపూర్వకంగా, దానికి వీడ్కోలు చెప్పండి. దానికి చెప్పండి, " ఇక చాలు. ఇప్పుడు నేను ఏదీ కోరను. ఏది జరిగినా నేను మేల్కొని వుంటాను, నేను చూస్తూ ఉంటాను."

మీరు అధికారపూర్వకంగా కోరిన వెంటనే, మీరు ఒక సాక్షిగా ఇక ఎంతమాత్రం ఉండలేరు. ఆనందించేవారు మరి వేదన పొందేవారుగా మీరు అభేదతతో ఉంటారు. అప్పుడు ధ్యానం మాయమవుతుంది. అభేదముతో ఉండడం అంటే అర్థం మీరు ఇలా అంటున్నారు : " దీన్ని ఆస్వాదించినది నేను, అది నాకు ఆనందాన్ని కలిగించింది."

" జ్ఞానం, కర్మ, మరి భక్తి అంటే ఏమిటో నాకు తెలియదు, కానీ ఏకాంతంలో ఈ స్థితిలోనే మునిగిపోయి ఉండాలని నేను వాంఛిస్తున్నాను." ఈ కోరికను విసిరి పారెయ్యండి మరి మీరు అదే స్థితిలోకి తెలియకుండా వెళ్ళిపోతారు. ఏకాంతంలో మాత్రమే కాదు సమూహంలో కూడా మీరు దానిలోకి వెళ్ళిపోతారు. మీరు అంగడి వీధిలో ఉన్నా కూడా మీరు మునిగిపోయే ఉంటారు. ఏకాంతం లేదా సమూహం, అంగడి వీధి లేదా ఆలయం, జనసామాన్యం లేదా ఏకాంతవాసం అనేదానితో ఆ స్థితికి ఏ నిమిత్తమూ లేదు. మీ మనస్సు ప్రశాంతం అవ్వడంతో, అది సమత్వంతో ఉండడంతో అది సంబంధం కలిగివుంది. ఎక్కడెక్కడ శాంతి, సమత్వం ఉంటాయో అక్కడ ఈ సంభవం చోటు చేసుకుంటుంది. కానీ దానిని అధికారంతో కోరకండి, లేదంటే ఆ కోరడం అనేదే అసౌఖ్యకరమైనది అవుతుంది, ఆందోళనను సృష్టిస్తుంది.

అష్టావక్రుడు అంటాడు, " సరిగ్గా ఇక్కడే, సరిగ్గా ఇప్పుడే." కోరిక అనేది ఎల్లప్పుడూ రేపటికోసమై వుంటుంది. అది ఇక్కడ మరి ఇప్పుడు అయివుండలేదు. అధికారపూర్వకంగా కోరడం అనేదాని స్వభావం ఏమిటంటే అది ప్రస్తుతంలో లేదు. అది గెంతుతుంది. హక్కుగా కోరడం అంటే : " దానిని జరుగనివ్వు ... రేపు, ఒక

గంట తరువాత, ఒక క్షణంలో, దానిని జరుగనివ్వు. " కోరడం అనేది సరిగ్గా ఇప్పుడే అయివుండలేదు... సమయం అవసరమవుతుంది. అది అతి స్వల్పమే అయివుండవచ్చు, కానీ సమయం కావాలి. మరి భవిష్యత్తు అనేది ఉండదు. భవిష్యత్తు అంటే ఏది లేదో అది. ప్రస్తుతం అంటే అర్థం ' ఉన్నది ' అని. ప్రస్తుతం మరి అధికారంతో కోరడం అనేవి సంబంధం లేనివి.

మీరు ప్రస్తుతంలో ఉన్నప్పుడు హక్కుగా కోరడం అనేది లేదు అని మీరు కనుగొంటారు. మరి అప్పుడు ఆ సంభవం చోటుచేసుకుంటుంది. దాని కోసం ఏ కాంక్షా లేనప్పుడు, అది విస్తారంగా సంభవిస్తుంది.

ఈ రెట్టింపు బంధనాన్ని బాగా అవగాహన చేసుకోండి. దాని యొక్క దర్శనాలన్నింటితోనూ పరిచితులు అవ్వండి. మీరు దేనినీ ఒక హక్కుగా కోరని రోజు ప్రతీదీ సంభవించే రోజు అవుతుంది. దైవత్వం వెనుక ఒక పిచ్చివాడిలా మీరు పరుగెత్తుతూ ఉండని రోజు, అది మీ వెనుకే వస్తుంది. మీరు ధ్యానం పట్ల ఏ ఆత్రుతనూ ప్రదర్శించని రోజు, మీ లోపల ఏ ఆందోళనా లేనప్పుడు, ఆ రోజు మీరు ధ్యానంతో నిండిపోయి, పొంగిపొరలుతూ ఉంటారు.

ధ్యానం అనేది బాహ్యం నుంచి రాదు. మీరు ఆందోళనతో లేకుండా ఉన్నప్పుడు మీ అంతరంగంలో మిగిలివుండేదే ధ్యానం అని పిలువబడుతుంది. మీ అంతరంగంలో ఏ కోరికా లేనప్పుడు మిగిలివుండేదే ధ్యానం అని పిలువబడుతుంది.

అది ఒక సరోవరంలాంటిది : అలలు లేస్తాయి, అప్పుడు అకస్మాత్తుగా ప్రబల వాయువులు వీస్తాయి. సరోవరం యొక్క ఉపరితలం గాలి వాన మరి వాయువులతో కమ్మివేయబడుతుంది ; ప్రతీదీ తలక్రిందులవుతుంది. ఆకాశంలో చంద్రుడు ఉన్నాడు, నిండుగా ; కానీ ఏ ప్రతిబింబమూ ఉండదు ఎందుకంటే ఆ ఉపరితలం కొద్దిగా మెరుస్తోంది. అది ఒక అద్దంలా ఎలా ఉండగలదు ? చంద్రుడి యొక్క ప్రతిబింబం వెయ్యి ముక్కలుగా పగిలిపోయింది ... సరోవరమంతటా వెండి పరచుకున్నట్లుగా, కానీ ఏ ప్రతిమా ఏర్పడనట్లుగా ఉంటుంది.

ఆ సరోవరం నిశ్శబ్దంగా అవుతుంది. ఆ అలలన్నీ ఎక్కడికైనా వెళ్ళిపోయాయా ? ఆ అలలు మరెక్కడినుంచైనా వచ్చాయా ? అవి సరోవరం నుంచే వచ్చాయి. ఇప్పుడు అవి నిద్రలోకి తిరిగి వెళ్ళాయి, అవి సరోవరానికి తిరిగి వెళ్ళాయి. సరోవరం తన నిశ్చలత్వాన్ని తిరిగి పొందింది. సరోవరం ఉపరితలమంతటా వెండి తరగలా పరుచుకున్న చంద్రుడు, ఇప్పుడు ఒక్క చోటుకు చేరాడు. ఆ ప్రతిబింబం స్పష్టమవుతుంది.

మీ మనస్సు అనే సరోవరంలో ఏ అలలూ లేకుండా పోగానే, కోరికల అలలు, అధికారంతో ఆశించే కలలు, " ఇది ఇలా ఉండాలి మరి అది అలా ఉండకూడదు," అనే అలలు, మనస్సు అనే సరోవరంపై ఏ అలలూ లేనప్పుడు, అప్పుడు ఉన్నది ఉన్నట్లుగా సత్యం ప్రతిబింబిస్తుంది. అప్పుడు మీ అంతరంగంలోని జాబిలి యొక్క సౌందర్యం ఎలా వర్ణించబడుతుంది ? దాని పరమానందం ఎలా చెప్పబడుతుంది ? ఒక బ్రహ్మానంద తరంగణి జాలువారుతుంది. మీ అంతరంగంలోని ప్రియతముని కలుసుకుంటారు. అప్పుడు ఒక హనీ-మూన్ అనేది ఉంటుంది, కేవలం అప్పుడు మాత్రమే.

కానీ మీరు దానిని కోరుకుంటే కనుక, మీరు దానిని చేజార్చుకుంటారు.

ఈ కోరిక పూర్తి సహజమైనదిగా కనిపిస్తుంది అని నాకు తెలుసు. కానీ ఇది ఒక పెద్ద అడ్డంకి. అటువంటి క్షణాలలో ఎంత ఆనందం వస్తుందంటే, మీరు కోరుకోవడాన్ని ఎలా నిరోధించగలరు. అది మానవ సహజం. మీరు ఒక పెద్ద తప్పును చేశారనీ, మానవులుగా అయోగ్యులనీ నేను చెప్పడం లేదు. అది పూర్తిగా మానవ సహజమైన దోషమే. ఒక్క క్షణంపాటు గవాక్షం తెరుచుకుని మరి ఆ విశాల గగనం మీలోకి ప్రవహించినప్పుడు, ఒక్క క్షణకాలం అంధకారం అంతర్ధానమైపోయి మరి కాంతి కిరణాలు దిగి వచ్చినప్పుడు, మరింత కావాలని కోరుకోవడం అసాధ్యం, దాదాపూ అసాధ్యం. కానీ ఆ అసాధ్యం అనేదానిని నేర్చుకోవాలి. దానిని ఈరోజు నేర్చుకోండి, దానిని రేపు నేర్చుకోండి లేదా ఎల్లుండి దానిని నేర్చుకోండి, కానీ దానిని నేర్చుకుని తీరాలి. మీరు ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మేలు. సరిగ్గా ఇప్పుడే సంసిద్ధులు అవ్వండి మరి అది అవ్యవధిగా సంభవిస్తుంది. ఒక్క క్షణం కూడా నిరీక్షించవలసిన అవసరం లేదు.

"... ఈ స్థితిలోనే మునిగిపోయి వుండాలని నేను వాంఛిస్తున్నాను." ఈ స్థితి వస్తుంది. మీ మనస్సుతో దానికి ఏ నిమిత్తమూ లేదు కనుక మీ మనస్సును వెనుకే వదిలేయండి. అది ఎప్పుడు తొంగి చూసినా, మీరు దానికి మళ్ళీ మళ్ళీ చెప్పాలి, "నన్ను క్షమించు, నువ్వు అవసరాన్ని మించి జోక్యం చేసుకున్నావు ! నువ్వు ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేశావు, ఇప్పుడు దైవత్వాన్ని కూడా అస్తవ్యస్తం చెయ్యవద్దు. నువ్వు జీవితపు ఆనందమంతటినీ నాశనం చేశావు. ఇప్పుడు ఆనందం అనేది అంతర్గత లోతులనుండి వస్తోంది; కనీసం దీనినైనా నాశనం చేయకు."

అప్రమత్తంగా ఉండండి మరి మనస్సుకు వీడ్కోలు పలకండి.

క్రమక్రమంగా, ఎక్కువగా, అటువంటి క్షణాలు వస్తాయి.

అవి మీ అనుభవం ద్వారా వస్తాయి. ఎప్పుడు మనస్సు అనేది లేకపోయినా, వెంటనే ఆ గవాక్షం తిరిగి తెరుచుకుంటుంది. మళ్ళీ ఆ దివ్యమైన ఆనందపు జలపాతం ప్రవహిస్తుంది. మళ్ళీ ఆ కాంతి దిగివస్తుంది. మళ్ళీ మీరు తేజోవంతంగా, మైకంలో ఉంటారు. మళ్ళీ మీరు అమృతంలో మునిగిపోతారు.

ఇది మళ్ళీ మళ్ళీ సంభవించినప్పుడు, అది స్పష్టం అవుతుంది. మనస్సును మీ నుంచి దూరంగా ఉంచడంలో మీరు నైపుణ్యంగలవారుగా అవుతారు. అది సంభవించినప్పుడు, దానిని సంభవించనివ్వండి. అది సంభవించనప్పుడు, దానికోసం నిశ్శబ్దంగా నిరీక్షించండి. అది వస్తుంది. ఒకసారి ఏదైతే వచ్చిందో అది మళ్ళీ మళ్ళీ వస్తుంది ... కేవలం దానిని కోరుకోకండి. అసలు మధ్యలో రానేరావద్దు. ఏ అడ్డంకినీ సృష్టించకండి.

" అయినాగానీ, ఇది పిచ్చి అయివుండవచ్చు అనే భావన కొన్నిసార్లు ఉదయిస్తూంటుంది ..." అటువంటి భావాలు బుద్ధిలో ఉదయిస్తుంటాయి, ఎందుకంటే బ్రహ్మానందం అనేది సాధ్యమతుంది అని అది విశ్వసించలేదు. బుద్ధి అనేది దుఃఖంతో సౌఖ్యంగా వుంటుంది. అది దుఃఖాన్ని సంపూర్ణంగా అంగీకరించింది ఎందుకంటే అదే దానికి జన్మనిచ్చింది. తమ స్వంత సంతతిని అంగీకరించకుండా ఎవరు ఉంటారు ? కనుక బుద్ధి అంటుంది, " దుఃఖం అనేది ఉన్నట్లయితే, అది ఖచ్చితంగా సరైనదే. కానీ అత్యున్నత ఆనందమా ? నిశ్చయంగా ఏదో తప్పు ఉండి వుండాలి. అది ఎప్పుడైనా సంభవించిందా ? అది ఊహ అయివుండవచ్చు. మీరు కలగన్నారు, మీరు ఏదో పగటి కలలో మునిగిపోయారు. మీరు హిప్నోసిస్‌లోకి వెళ్ళిపోయారు. నిశ్చయంగా మీకు పిచ్చి పట్టింది." బుద్ధి తరచుగా అటువంటి మాటలు మాట్లాడుతుంది. దాని మాటలు వినకండి. దాని పట్ల శ్రద్ధను చూపకండి. మీరు దాని పట్ల శ్రద్ధ చూపితే, ఆ అనుభవాలు ఆగిపోతాయి. ఆ ద్వారాలు, గవాక్షాలు ఎన్నటికీ మళ్ళీ తెరుచుకోవు.

ఒక విషయం జ్ఞాపకం ఉంచుకోండి : సత్యం యొక్క వివరణ పరమానందమే.

మీరు ఎప్పుడు ఆనందాన్ని కనుగొన్నా, అదే సత్యం అని తెలుసుకోండి. అందువలనే దివ్యత్వాన్ని మనం సత్-చిత్-ఆనందం...సత్యం, చైతన్యం, ఆనందం అని పిలిచాము. ఆనందం సత్యం కన్నా ఉన్నతంగా వుంది, చైతన్యం కన్నా కూడా ఉన్నతంగా వుంది ... సత్యం - చైతన్యం - ఆనందం. సత్యం అనేది దిగువ సోపానం, చైతన్యం అనేది దిగువ సోపానం, ఆనందం అత్యున్నతమైనది. ఎక్కడ ఆనందం

ప్రవహిస్తున్నా, ఎక్కడ మీరు పారవశ్యాన్ని కనుగొన్నా ... అస్సలు దిగులుపడకండి, మీరు సత్యానికి దగ్గరగా ఉన్నారు.

అది ఒకరు ఉద్యానవనాన్ని సమీపించడం లాంటది. పవనాలు శీతలమవుతాయి ; అతను పక్షుల కిలకిలారవాలను వినడం ప్రారంభిస్తాడు, అతను ఒక శీతలత్వాన్ని అనుభూతి చెందడం ప్రారంభిస్తాడు. ఇంకా ఆ ఉద్యానవనం కనిపించడం లేదు, అయినా అతను సరైన మార్గంలోనే వున్నాడు, అతను ఉద్యానవనాన్ని సమీపిస్తున్నాడు అని ఈ సంజ్ఞలు అతనికి చెబుతాయి. అలాగే, మీరు సత్యాన్ని చేరుకోవడం మొదలుపెట్టినప్పుడు ఆనందపు ఊట పైకి ఉబికి వస్తుంది. మనస్సు చల్లబడడం ప్రారంభిస్తుంది, మీరు సమతలో ఉండడం ప్రారంభిస్తారు, సహనం వృద్ధి చెందడం మొదలవుతుంది, సంతోషం పెంపొందుతుంది. ఉప్పొంగిన సంతోషం మిమ్మల్ని ముంచెత్తుతుంది ... కారణరహితమైనది. ఏ కారణమూ కనుగొనబడదు. మీరు లాటరీని గెలువలేదు లేదా వ్యాపారంలో అధిక లాభాలను పొందలేదు, లేదా ప్రతిష్ఠతో కూడిన ఉద్యోగం మిమ్మల్ని వరించలేదు. లేదా ఏమి సంభవించవచ్చునంటే మీకు ఉన్న ఉద్యోగం ఊడిఉండవచ్చు, మీ చేతులలో ఉన్నదానిని మీరు పోగొట్టుకుని ఉండవచ్చు, మీ వ్యాపారం దివాళా తీసి ఉండవచ్చు... కానీ కారణరహితంగా ఉప్పొంగుతున్న సంతోషం అంతరంగంలో నాట్యం చేస్తూ, ఎన్నటికీ ఆగకుండా ఉండవచ్చు, బుద్ధి అంటుంది, "నీకు పిచ్చి పట్టిందా ? ఇవి అన్నీ పిచ్చి యొక్క లక్షణాలు !"

ఇది ఒక అత్యంత విచిత్రమైన ప్రపంచం. ఇక్కడ కేవలం పిచ్చివారు మాత్రమే ఆనందంగా కనిపిస్తారు. ఇందువలనే మీకు పిచ్చి పట్టి ఉండవచ్చు అని బుద్ధి అంటుంది. పిచ్చివారు తప్ప మరెవరైనా ఇక్కడ ఉల్లాసంగా, సంతోషంగా ఉండడాన్ని మీరు చూశాం ? సంతోషంగా ఉండడానికి వేనవేల కారణాలు ఉన్నాయి, అయినాగానీ మానవుడు సంతోషంగా లేడు. అతను ఒక పెద్ద సౌధాన్ని, సంపదనూ, అన్ని రకాల సౌఖ్యాలనూ కలిగివుండవచ్చు ; అయినా అతను సంతోషంగా లేడు. ఈ ప్రపంచం దీనజనుల యొక్క ప్రపంచం, అత్యధిక సంఖ్యాకులు దీనంగానే ఉన్నారు. కనుక ఇక్కడ మీరు కారణం లేకుండా నవ్వడం ప్రారంభిస్తే, ప్రజలు మీకు పిచ్చి అని అంటారు. "ఈ నవ్వు ఏ కారణమూ లేకుండా వస్తోంది, దాని అలలు అంతరంగంలో ఎగిసిపడతాయి, అది కేవలం విస్తరిస్తుంది," అని మీరు అంటే కనుక, ప్రజలు అంటారు, "చాలు ! అతని మనస్సు అస్తవ్యస్తం అయ్యింది."

కానీ మీరు అయిష్టంగా ముఖం పెడితే, దెయ్యాలు కూడా భయపడేంత ఖిన్నతతో కనిపిస్తే కనుక, అప్పుడు మీరు బాగున్నారు, అప్పుడు మీరు ఇక్కడ

సరిపోతారు : సమస్యేమీ లేదు, మీకు అంతా చక్కగా గడిచిపోతుంది. మీరు కేవలం ఇతర మానవులందరిలాంటి మానవులే. మానవులు ఉండవలసిన విధానంలోనే మీరు ఉన్నారు. కానీ మీరు చిరునవ్వు చిందించడం మొదలు పెట్టినప్పుడు, నవ్వడం ప్రారంభించినప్పుడు, పాటలు పాడడం ఆరంభించినప్పుడు, రోడ్డు ప్రక్కన మీరు నాట్యం చెయ్యడం మొదలు పెట్టినప్పుడు ... అప్పుడు నిశ్చయంగా మీకు పిచ్చి పట్టింది.

ఈ విధంగానే మనం భగవంతుడిని నిరాకరించాము. అతను ఇక్కడకు వస్తే కనుక, మనం అతనిని ఉన్మాద గృహంలో పెట్టేస్తాం. బహుశా అందుకే ఆయన రాలేదు. ఆయన రావడానికి భయపడుతున్నాడు ...

ఊహించండి : తన నెమలిపింఛపు కిరీటాన్నీ, పట్టు పీతాంబరాలన్నూ ధరించి, గోపికలు చుట్టూ నాట్యం చేస్తూండగా, తన వేణువును వాయిస్తున్న కృష్ణుడిని మీరు వీధిలో కలుసుకుంటే కనుక ... మీరు ఏం చేస్తారు ? పోలీస్ స్టేషన్‌కు వెంటనే పరుగెత్తి ఫిర్యాదు చేస్తారు : "రోడ్డుపై సమస్య వుంది. అక్కడ ఏం జరుగుతోంది? ఆ విధంగా జరుగకూడదు !" మీరు అతనిని జైలులో పడేస్తారు.

పరమానందం అనేది వెలివేయబడింది.

ఆనందాన్ని మన జీవితం నుంచి మనం బహిష్కరించాం. మనం దుఃఖాన్ని కౌగిలించుకుని కూర్చుంటాం. ఇక్కడ, ఒక నిరాశావాది అయిన వ్యక్తి వివేకవంతుడిలా కనిపిస్తాడు. ఒక ఆహ్లాదకరమైన వ్యక్తి పిచ్చివాడిలా కనిపిస్తాడు. మన ప్రమాణం సమస్తమూ తలక్రిందులుగా వుంది. అది సహజం : మీ జీవితమంతా మీరు వివేకవంతమైనదిగా పరిగణించినది ఆకస్మికంగా మాయమైపోవడం ప్రారంభిస్తే, జారిపోవడం ప్రారంభిస్తే కనుక; మీ వివేకం అనబడేదాని యొక్క పునాది కంపించడం ప్రారంభిస్తే, అకస్మాత్తుగా ప్రతిచోటా మీరు ఆనందాన్ని చూడడం ఆరంభిస్తే కనుక, మరి గుర్తుంచుకోండి, "కారణ రహితంగా" ... ఉన్మాదం అంటే ఇదే, కారణం లేని ఆనందం ... కారణం అనేదే లేదు. మీరు ఏకాంతంగా కూర్చుని వున్నారు, మీరు చిరునవ్వు చిందించడం ప్రారంభిస్తారు. చాలు, మీకు పిచ్చి పట్టింది. ఎందుకంటే కేవలం పిచ్చివారే అలా కూర్చుని వుండడం మనం చూశాం.

అవగాహన చేసుకోండి : పిచ్చివాళ్ళు మరి పరమహంసలు, జ్ఞానోదయం పొందినవారు కొద్దిగా ఒకే విధమైనవారు. పిచ్చివాళ్ళు నవ్వుతారు, సంతోషంగా వుంటారు ; వాళ్ళు తమ బుద్ధిని కోల్పోయారు. పరమహంసలు కూడా నవ్వుతారు, ఆనందంగా వుంటారు ; వాళ్ళు వివేకానికి అతీతంగా వెళ్ళారు. ఇరువురూ నవ్వుతారు

... దిగువకు జారిపోయినందువలన ఒక పిచ్చివాడు నవ్వుతాడు. తాను వివేకానికి అతీతమైనందువలన ఒక పరమహంస నవ్వుతాడు. ఆ ఇరువురి మధ్య ఈ చిన్న పోలిక వుంది. పిచ్చివాడు, పరమహంస ఒక విషయంలో పోలికను కలిగివున్నారు : ఇరువురూ తమ వివేకాన్ని కోల్పోయారు. ఒకరు దానిని చేతనా పూర్వకంగా త్యజించారు, మరొకరు అచేతనంలో. అందువలనే ఆ వ్యత్యాసం విస్తారమైనది, భూమి, ఆకాశం అంత వ్యత్యాసం, అయినాగానీ ఈ పోలిక అనేది ఉంది. కనుక కొన్నిసార్లు మీరు ఒక పరమహంసను పిచ్చివాడిలా చూస్తారు మరి కొన్నిసార్లు ఒక పిచ్చివాడిని పరమహంసలా చూస్తారు. తప్పులు జరుగుతూనేపోతాయి.

పశ్చిమంలో ఉన్మాదులు కానివారు ఎందరో ఉన్మాద గృహాలలో బంధింపబడి వున్నారు. ఇటీవలే అక్కడ ఒక గొప్ప విప్లవం ఆరంభమైంది. కొందరు మనోవైజ్ఞానికులు, గుర్తుంచుకోదగినవారు ఆర్.డి. లైంగ్ మరి అతని తోటివారు, ఒక ఉద్యమాన్ని మొదలు పెట్టారు. ఆశ్రయాలలో ఉన్నవారిలో అనేకులు ఉన్మాదులు కారు అని వారు వాదిస్తున్నారు. ఈ వ్యక్తులు ప్రాచ్యంలో జన్మించివుంటే కనుక వాళ్ళు గౌరవింపబడేవారు. ప్రాచ్యంలో దానికి వ్యతిరేకమైనది సంభవిస్తుందని ఆర్.డి. లైంగ్‌కు తెలియదు... ఇక్కడ అనేకమంది పిచ్చివారు పరమహంసలుగా భావింపబడతారు. కానీ తప్పు చేయడం అనేది మానవ సహజం. ఇక్కడ తూర్పులో పరమహంసలుగా భావించబడుతున్న పిచ్చివారు అనేకమంది ఉన్నారు. ఈ తప్పులు జరుగుతాయి, ఎందుకంటే ఈ రెండింటి సరిహద్దులూ ఒకదానినొకటి తాకుతాయి. ఈ అయోమయం అనేది సహజం.

ఆనందం వృద్ధి చెందుతూంటే కనుక, దిగులు పడవలసిన అవసరం లేదని గుర్తుంచుకోండి. కానీ ఆనందం అనేది ఉన్మాదం వలన కూడా వృద్ధి చెందవచ్చు. అలాంటప్పుడు దానికి సురక్షితమైన లక్షణం ఏమిటి ? ఇదే ఆ లక్షణం . మీ ఆనందం వృద్ధి చెందుతుంటే మరి అదే సమయంలో ఇతరులెవరి దుఃఖాన్నీ మీరు పెంపొందించకపోతే కనుక, అప్పుడు సమస్యేమీ లేకుండా సాగిపోండి. ఎవరిపట్ల హింస, ఎవరి పట్ల ఉగ్రత, లేదా ఎవరినైనా దుఃఖితులుగా చేయడం అనేవాటిపై మీ ఆనందం ఆధారపడి ఉండకూడదు. అప్పుడు పిచ్చివారు అయిపోవడం గురించి భయపడడానికి కారణమే ఉండదు. మీరు పిచ్చివారు అయిపోతున్నా కూడా, అది ఒక మంచి సూచన, అది సరైనదే. ఏ సంకోచమూ లేకుండా దానిలోకి వెళ్ళండి. మీరు ఎవరికైనా హానీ కలిగించడం ప్రారంభించినప్పుడు మాత్రమే మీరు దాని గురించి పట్టించుకోవలసి వస్తుంది. మీ నాట్యం వలన ఎవ్వరికీ ఇబ్బంది

లేదు. కానీ ఎవరైనా నిద్రిస్తూ ఉంటే మరి మీరు అతని తలపై మీ డోలును వాయిస్తూ నాట్యం చెయ్యడం మొదలు పెడితే కనుక...? నాట్యం చెయ్యండి. దానిలో ఏ సమస్యా లేదు. మీ ప్రార్థనలను ఉచ్ఛరించండి, అది మంచిదే. కానీ మధ్యరాత్రిలో మీరు ఒక మైకును ఏర్పాటు చేసి నిర్విరామంగా కీర్తనలను ఆలపించడం ప్రారంభిస్తే కనుక, అప్పుడు మీరు నిజంగానే పిచ్చివారు... అయినప్పటికీ భారతదేశంలో మిమ్మల్ని ఎవ్వరూ పిచ్చివారని అనరు ఎందుకంటే మీరు భక్తి గీతాలను ఆలపిస్తున్నారు. ఎందరో పిచ్చివారు ఇది చేస్తారు. వారు అంటారు, " మేము ఒక నిర్విరామ కీర్తనను చేస్తున్నాము... ఇరవై నాలుగు గంటలూ. మీరు నిద్రపోతారా లేక నిద్రపోరా అనేది మీ సమస్య. మరి మా కార్యక్రమాన్ని మీరు వ్యతిరేకిస్తే కనుక, మీరు మతపరమైనవారు కాదు."

మీ ఆనందం అనేది హింసాత్మకమైనది కాకుండా ఉండేలా చూసుకోండి. ఇది చాలు. మీ ఆనందం మీ స్వంతానికి చెందినదై ఉండాలి. దానితో మరెవరి జీవితాన్నీ కలతపరచకండి. మీ సుమాలను విరబూయనీయండి. కానీ విరబూయడంలో, దాని ముళ్ళను ఎవరికీ గుచ్చుకోనీయకండి. మీరు దీనిపట్ల శ్రద్ధ వహిస్తే కనుక అప్పుడు మీరు సరైన దిశలో పురోగమిస్తున్నారు. ఇప్పుడు ఇతరులు మీ ప్రవర్తన చేత కలతపరచబడుతున్నారు అని మీరు భావించినప్పుడు, జాగ్రత్తగా వుండండి ... మీరు జ్ఞానోదయం దిశగా వెళ్ళడం కాక ఉన్మాదానికి చేరే మార్గంపై ఉన్నారు.

ఓం ప్రకాశ్ చేత ఎవ్వరూ కలతపరచబడడం లేదు. మీరు నిస్సంకోచంగా, నిర్భయంగా ముందుకు సాగవచ్చు.

నిన్న నేను ఒక కవితను చదువుతూ వున్నాను :

అందమైనదీ, ప్రేమించదగినదీ, కోరదగినదీ అయినదంతా :
మంచిది, శుద్ధమైనది, నూతనమైనది, సత్యమైనది మరి వాస్తవమైనదంతా ;
నేను ఎంపిక చేసి తెచ్చాను,
నా కానుకలను సమర్పించాను.
కానీ ఏం జరిగింది ?
అది ఉంచబడిన చోటే అదంతా క్షీణించిపోయింది.
ఎండిపోయింది. వాడిపోయింది.
ఒక్కదానిని తీసుకోవడానికైనా ఆయన తన చేతిని కదపలేదు,
ఆయన స్వీకరిస్తాడని ఎక్కడో వ్రాసివున్నా కూడా...

కానీ నేను ఇచ్చినది లేదా తీసుకున్నది,

నేను పానం చేసినది లేదా పడవేసినది,

నేను బంపినది లేదా చిందించినది,

నేను స్రవించినది లేదా వడగట్టినది,

మైకం లేదా అది మాసిపోవడం,

నేను సేకరించినది, జారవిడిచినది లేదా విసర్జించినది...

వీటన్నింటి చివరి లెక్క,

అది కూడా అదే హోమగుండంలోకి పడిపోవడం నేను చూశాను,

మరి ఆ క్షణంలోనే నేను అనుభూతి చెందాను,

ఓహ్ ! నేను విడుదలయ్యాను, నేను దాని మరో దరిని చేరాను !

సరే, అంగీకరించబడింది, నేను పిచ్చివాడినయ్యాను...

అవును, మానవుడు మరో దరిని చేరుతాడు – మనస్సు అనేది ఓ చలచిత్తత. మీరు దైవానికి ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసినవి సమర్పిస్తూ పోవచ్చు, అత్యుత్తమమైనవి. కానీ మీరు మీ మస్తిష్కాన్ని సమర్పించే వరకూ దాన్ని నుంచి ఏమీ రాదు.

మళ్ళీ వినండి :

అందమైనదీ, ప్రేమించదగినదీ, కోరదగినదీ అయినదంతా ;

మంచిది, శుద్ధమైనది, నూతనమైనది, సత్యమైనది మరి వాస్తవమైనదంతా ;

నేను ఎంపిక చేసి తెచ్చాను,

నా కానుకలను సమర్పించాను.

కానీ ఏం జరిగింది ?

అది ఉంచబడిన చోటే అదంతా క్షీణించిపోయింది.

ఎండిపోయింది. వాడిపోయింది.

ఒక్కదానిని తీసుకోవడానికైనా ఆయన తన చేతిని కదపలేదు...

అత్యంత సౌందర్యపూరితమైనదానిని అన్వేషించి తీసుకురండి, అత్యంత విలువైనదానిని కనుగొనండి, కోహినూర్ వజ్రాన్ని సమర్పించండి ... అన్నీ తుచ్ఛమైనవిగా వెలవెలబోతాయి. పుష్పాలను ఎంపిక చేయండి, కమలాలు, గులాబీలు, వాటిని సమర్పించండి ... అన్నీ వాడిపోతాయి. ఇక్కడ కేవలం ఒకే ఒక్కటి స్వీకరించబడుతుంది : మీ మస్తిష్కం, మీ అహం, మీ వివేకం, మీ మనస్సు. ఇవన్నీ సరిగ్గా ఒకే విషయం యొక్క విభిన్న నామాలు. మీరు ఇక్కడ మిమ్మల్ని మీరు సమర్పించుకోవాలి.

మరి ఆ క్షణంలోనే నేను అనుభూతి చెందాను,
ఓహ్ ! నేను విడుదలయ్యాను, నేను దాని మరోదరిని చేరాను !
సరే, అంగీకరించబడింది, నేను పిచ్చివాడినయ్యాను...

ఓం ప్రకాశ్, ప్రజలు నీకు అదే విషయాన్ని చెబుతారు : నీకు పిచ్చిపట్టింది. వారిని అలాగే అననివ్వండి ! వారు ఏమంటున్నారు అనేదాని గురించి దిగులుపడకండి. ప్రజలు మిమ్మల్ని పిచ్చివారు అని పిలిచినప్పుడు వారు తమ స్వంత బుర్రలను కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు, మరేమీ కాదు. మీకు పిచ్చి అని వారు అన్నప్పుడు, వారంటున్నారు, "మా నుంచి దూరంగా ఉండు, మా దగ్గరకు రావద్దు ! ఈ పాటలను మా వద్ద పాడవద్దు, ఈ నవ్వును మా ద్వారాల వద్దకు తీసుకురావద్దు, మధిర నిండిన నీ కళ్ళను మాకు చూపవద్దు, ఈ సందేశాన్ని మాకు తీసుకురావద్దు." వాళ్ళు బెదిరిపోతారు.

వాళ్ళు అంతరంగంలో ఇదే సంగీతాన్ని కలిగివున్నారు. తన తంత్రులను సుతారంగా స్పృశించేవారి కోసం ఎన్నో జన్మలుగా నిరీక్షిస్తున్న ఒక వీణను వారు తమ అంతరంలో కలిగివున్నారు. కానీ వారు భయంతో, అభద్రతా భావంతో ఉన్నారు. వారు ఎంతో నిర్మించారు మరి ఈ నకిలీ ప్రపంచంలో స్థిరపడ్డారు. ఇప్పుడు వాళ్ళు వేర్లతో పెకలించబడడం గురించి భయపడుతున్నారు.

నేను అలహాబాదులో ఉన్నాను, మరి నేను చెప్పేది వింటూ, సరిగ్గా నా ముందే ఒక మిత్రుడు కూర్చుని ఉన్నాడు. కోట్లాదిమంది ప్రజలు నా ముందు కూర్చున్నారు మరి విన్నారు, కానీ అతను వింటున్నంతటి అనుభూతితో విన్నవారు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అతని వదనంపై నుంచి కన్నీటి ఏరులు ప్రవహిస్తున్నాయి.

ఆకస్మికంగా, అతను ప్రసంగం మధ్యలో లేచాడు మరి ఆ హాలును వదిలి వెళ్ళిపోయాడు. నేను కొద్దిగా ఆశ్చర్యపోయాను మరి ఆ నిర్వాహకుడిని ఏం జరిగిందని అడిగాను. ఆ మనిషి అత్యంత సుప్రసిద్ధుడు అని తేలింది ... నాకు తెలియలేదు. అతను ఒక సాహితీవేత్త, ఒక కవి, ఒక రచయిత.

ఆ నిర్వాహకుడు అతని ఇంటికి వెళ్ళాడు మరి విచారణ చేశాడు. ఆ మనిషి అతనికి చెప్పాడు, " నన్ను క్షమించండి ... నేను కలత చెందడం ప్రారంభించాను. ఇరవై నిమిషాల తరువాత నేను అనుకున్నాను, ఇక్కడి నుంచి పారిపోవడం మెరుగైనది. నేను ఇంకొద్ది సేపు ఉన్నట్లయితే, ఏదో ఒకటి జరుగుతుంది. ఈ మనిషి ఇప్పటికే ఓ కోయిల ... అతను నాకు పిచ్చెక్కిస్తాడు. నేను వస్తాను, కానీ ఇప్పుడు కాదు. నేను నిశ్చయంగా మళ్ళీ వస్తాను, కానీ నాకు కొద్దిగా సమయం ఇవ్వండి. నేను రెండు

రాత్రులు నిద్రపోలేకపోయాను, మరి ఆయన చెప్పినది నా మనస్సులో ప్రతిధ్వనిస్తోంది. లేదు, ప్రస్తుతం నాకు ఎంతో పని ఉంది. ఇప్పుడు నా పిల్లలు చిన్నవాళ్ళు, ఇంటినీ మరి కుటుంబాన్నీ నేను చూసుకోవలసివుంది, కానీ నేను నిశ్చయంగా వస్తాను. వెళ్ళండి మరి దయచేసి ఆయనకు చప్పండి నేను నిశ్చయంగా వస్తాను - కానీ ఇప్పుడు కాదు."

మీరు ఓ కోయిల అని ఎవరైనా చెప్పినప్పుడు, అతను కేవలం తనను తాను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. మీరు పిచ్చివారు అని నిర్ణయించడం ద్వారా అతని భావం ఏమిటంటే తన ఆకర్షణను అతను అణచుకుంటున్నాడు. అతను కూడా తన అంతరంగంలో అణచివేయలేని కాంక్షను కలిగివున్నాడు. అత్యున్నత వాస్తవాన్ని అన్వేషించని వారెవరు ? బ్రహ్మానందానికై తృష్ణలేనివారు ఎవరు ? సత్యం కోసం కాంక్షించనివారెవరు ? అటువంటి వ్యక్తి ఎన్నడూ లేదు. మీరు నాస్తికులు అని పిలిచేవారు భయపడిపోయినవారు. వాళ్ళు అంటారు, "లేదు, భగవంతుడే లేడు"... ఎందుకంటే వారు అతనిని నిరాకరించకపోతే కనుక, వాళ్ళు అతనిని అన్వేషించాలి.

విశ్వసించేవాడిలో కన్నా ఒక నాస్తికుడిలో సత్యం కోసం గాఢమైన కోరిక ఉంటుంది అనేది నా స్వానుభవం. అతను ఒక ఆలయానికి వెళ్ళాలంటే భయపడతాడు, కానీ మీరు భయపడరు. మీరు భయపడరు ఎందుకంటే మీలోని కోరిక మీకు పిచ్చి పట్టించేంత బలమైనదిగా ఉండదు. మీరు మీ దుకాణానికి వెళ్ళినట్లుగా ఆలయానికి వెళతారు. మీరు ఆలయం లోపలికి వెళ్ళి మరి బయటకు వస్తారు కానీ మీరు ఏ మాత్రం ప్రభావితమవ్వరు.

తాను ఆలయంలోనికి ప్రవేశిస్తే కనుక తాను తిరిగి రాలేను అని తెలిసిన వ్యక్తే ఒక నాస్తికుడు. అతను ప్రవేశిస్తే కనుక, తాను ప్రవేశించినప్పుడు ఉన్న విధంగానే అతను తిరిగిరాడు. కనుక కేవలం ఒక విధంగానే తప్పించుకోవచ్చు ; అతను అంటాడు, " భగవంతుడే లేడు ... మతమంతా వంచన మాత్రమే." ఈ విధంగా అతను తనను తాను రక్షించుకుంటాడు, తనను తాను ఒప్పించుకుంటాడు, " భగవంతుడు లేడు, కనుక ఆలయానికి వెళ్ళడం ఎందుకు ? భగవంతుడు లేడు, ఈ అస్తవ్యస్తమంతటిలో ఇరుక్కోవడం ఎందుకు ? ధ్యానం చెయ్యడం ఎందుకు ? ప్రార్థించడమెందుకు ?"

నేను దానిని చూస్తున్న విధంగా, నాస్తికుడు అంతర్ముఖంగా తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. నేను ఒక అసలైన, ప్రామాణిక నాస్తికుడిని ఇంకా చూడలేదు. మానవుడు ఒక నాస్తికుడిలా ఎలా ఉండగలడు ? ఒక నాస్తికుడు

అంటే భావం ఏమిటంటే ' లేదు ' అనేదానిలో జీవించడానికి ప్రయత్నించే వ్యక్తి. ఎవ్వరైనా లేదు అనేదానిలో ఎలా జీవించగలరు ? ఎవ్వరైనా నాస్తికతలో ఎలా జీవించగలరు ?

జీవించడానికి ఎవరికైనా ' అవును ' అనేది అవసరం.

ఎన్నడైనా సుమాలు ' లేదు ' లో వికసిస్తాయా ? ' అవును ' అనేది అవసరం. అంగీకారం అనేది అవసరం. జీవితం ఎంత ఎక్కువగా అంగీకరించబడితే, దానిలో అంత ఎక్కువగా సుమాలు విరబూస్తాయి. కానీ మీకు భయం మీ సామర్థ్యాన్ని మించి పుష్పాలు వికసిస్తాయనీ, ఆ సుమాలు ఎంత పుష్కలంగా ఉంటాయంటే మీరు దానిని ఇముడ్చుకొని ఉండలేరనీ....

గత రాత్రి ఒక యువకుడు నాకు చెప్పాడు, " సహాయం చెయ్యండి ! ఈ అనుభవం నియంత్రించలేనిదిగా అవుతోంది. నేను ఎంత ఆనందంగా వున్నానంటే, నేను పేలిపోతానేమో అన్నట్లు అనిపిస్తోంది. ఆ పరమానందం ఎంత అధికమైనదంటే, నేను ఇముడ్చుకోలేను. నా హృదయపు పాత్ర ఎంతో చిన్నది. నాకు సహాయం చెయ్యండ ! అది నన్ను ఎక్కడికో తీసుకుపోతోంది. నా పరిమితులన్నీ నాశనం అయిపోతున్నాయి. మరి నేను దానితోపాటుగా ప్రవహిస్తే కనుక తిరిగి రావడమనేది ఉండదని నేను భయపడుతున్నాను."

నియంత్రణ కోల్పోవడం ... ఇదే ఆ భయం. అహం అనేది దుఃఖంతో ఇష్టపూర్వకంగా జీవించగలదు ; దుఃఖంలో నియంత్రణ అనేది పోదు. మీరు దైన్యంలో ఎంతగా విలపించినాగానీ, మీరే యజమానిగా ఉంటారు. ఆనందంలో నియంత్రణ అనేది పోతుంది, పరిమితులు ధ్వంసమైపోతాయి. దైన్యంలో ఎన్నడూ పరిమితులు ఉల్లంఘించబడవు. నరకంలో సైతం పరిమితులు ఎన్నడూ ఉల్లంఘించబడవు. మీరు నరకంలోకి పడితే కనుక మీరు లోపల దృఢంగా ఉంటారు. స్వర్గంలో హద్దులు ఉల్లంఘించబడతాయి... అక్కడ నియంత్రణ పోతుంది. మరి ఎక్కడ నియంత్రణ అనేది పోతుందో, అహం అనేది పోతుంది. ఎక్కడ నియంత్రణ అనేది పోతుందో, వివేకం యొక్క పట్టు సడలిపోతుంది. హేతువాదం యొక్క బలం పోతుంది.

జరుగుతున్నది అదే. భయపడకండి. విడుదలయ్యే క్షణం, ఆ దరిని చేరే క్షణం సమీపంలోనే వుంది. కానీ మనస్సు తన పిచ్చితనాన్ని అంగీకరిస్తే తప్ప అది ఎన్నడూ సంభవించలేదు.

నేను ఓ రాగాన్ని అన్వేషిస్తున్నాను,
అది పెదవులపై ప్రతిధ్వనించక
రక్తనాళాలలో కొట్టుకుంటుంది,
లావా లాగా మండుతూ,
కరిగిపోయేందుకు.

నేను ఓ అగ్నిని అన్వేషిస్తున్నాను
నా ప్రతి కణమూ కరిగిపోయి,
మరి నేను నూలుపోగును అయిపోయేందుకు :
ఎవరో నన్ను ఒక వలలో ఎంత నాజూకుగా అల్లుతారంటే,
నేను పారదర్శకమైపోతాను.

నేను ఓ పరిమళాన్ని అన్వేషిస్తున్నాను
తేలికగా అయిపోయి,
నేను గాలిలో తేలుతాను,
తేలికైన వాన యొక్క మృదువైన జల్లులో వణుకుతాను.
చీకటి పడిపోతున్న సాయంత్రపు బూడిద రంగు ఆకాశంపై
కొద్దిసేపు నేను ప్రకాశించాలనుకుంటున్నాను,
నేను ఓ కాంతివంతమైన వర్ణాన్ని అన్వేషిస్తున్నాను...

ఓం ప్రకాశ్, నేను నీకు ఈ కాంతివంతమైన వర్ణాన్ని ఇచ్చాను : ఈ కాషాయ వస్త్రాలే ఆ కాంతివంతమైన వర్ణం. ప్రవహిస్తూ, పరిమితులను అధిగమిస్తూ సాగిపో. వివేకానికి అతీతంగా తేలిపో. నియంత్రణను పోనివ్వు. నియంత్రణ అంటే అర్థం 'చేసేవాడు'... నియంత్రణను పక్కన వదిలెయ్యి. చేసేవాడు ఉన్నట్లయితే, అది కేవలం ఉనికి కాగలదు. ఉనికితో పోటీ పడవద్దు. దానికి విరోధివి కావద్దు. దానితో పోరాడవద్దు. అధీనుడివవ్వు, దాని ప్రవాహంతో ప్రవహించు. నువ్వు తేలుతావు. మునిగిపోయేవారు తేల్చబడతారు... ఈదడానికి ప్రయత్నించేవారు ముంచి వేయబడతారు.

రెండవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

అన్వేషకులు ఎల్లప్పుడూ గమనించినది ఏమిటంటే దైవత్వాన్ని సిద్ధించుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం. కానీ జ్ఞానోదయం పొందిన మీలాంటివారు అది సరిగ్గా ఇప్పుడే, సరిగ్గా ఇక్కడే సంభవించగలదు అని ఎల్లప్పుడూ నొక్కి వక్కాణిస్తారు. దీనిని మళ్ళీ మళ్ళీ

చెప్పడం అనేది రెచ్చగొట్టడమా ? మరి మాలో దాహార్తిని రేకెత్తించడానికి అది ఒక విధానం లేదా సాధనమా ?

అదే సత్యం.

అది ఒక విధానం కాదు, ఒక సాధనం కాదు.

మీరు దీనిని అడగడం అనేది మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి ఒక విధానం, ఒక సాధనం. దైవత్వాన్ని ఇక్కడే, ఇప్పుడే సిద్ధించుకోవచ్చు అని అంగీకరించడానికి మనస్సు సిద్ధంగా లేదు. అది దానిని ఎందుకు అంగీకరించలేదు ? అది దానిని అంగీకరించలేదు. ఎందుకంటే దైవత్వం అనేది ఇక్కడే మరి ఇప్పుడే అందుబాటులో ఉండి, మనం దానిని సిద్ధించుకోనట్లయితే కనుక, అప్పుడు దానికి కారణం ఏదైవుంటుంది ? మనం దానిని ఏ విధంగా వివరించగలం ? దానిని ఇక్కడే, ఇప్పుడే సిద్ధించుకోగలిగినట్లయితే, మనం దానిని ఎందుకు సిద్ధించుకోవడం లేదు ? ఒక గొప్ప అసౌఖ్యం ఉత్పన్నమవుతుంది : దానిని ఇక్కడే మరి ఇప్పుడే సిద్ధించుకోవచ్చు, కానీ మనం సిద్ధించుకోవడం లేదు. దానిని ఎలా వివరించాలి ? అది ఒక గొప్ప భంగపాటు అవుతుంది. ఆ భంగపాటు నుంచి ఉపశమనం కోసం మీరంటారు దైవత్వాన్ని సాధించవచ్చు కానీ మీరు యోగ్యతగలవారై ఉండాలి.

వివేకం ఎల్లప్పుడూ ఒక మార్గాన్ని కనుగొనగలిగేలా నిభాయిస్తుంది. ఏ చిక్కు ఉత్పన్నమైనా, మనస్సు ఒక పరిష్కారాన్ని కనుగొంటుంది. అది అంటుంది, "ఆ మార్గాన్ని వెతకాలి, యోగ్యతను ప్రాప్తించుకోవాలి, నువ్వు పరిశుద్ధుడివి కావాలి : అప్పుడు నువ్వు సిద్ధించుకుంటావు. మరి దానిని ఇక్కడే మరి ఇప్పుడే సాధించవచ్చు అని అష్టావక్రుడు అంటే కనుక, నిశ్చయంగా దానికై అతని వద్ద కారణం ఉండివుంటుంది. మనం తీవ్ర ప్రయత్నం చేయడం ప్రారంభించేందుకు అతను అది చెబుతాడు. కానీ మనం ప్రయత్నాలు చేయాలి." మనస్సు ఎంతో చురుకైనది.

అష్టావక్రుడి యొక్క వివరణ సంపూర్ణంగా స్పష్టమైనది. దైవత్వాన్ని ఇక్కడే, ఇప్పుడే కనుగొనవచ్చు, ఎందుకంటే అది ఒక సిద్ధి కాదు, అది మీ స్వభావం. అతను నొక్కి చెప్పేదంతా ఎంతో సరళమైనది : మీరు అదే. సాధించడం అనే భావనే అయుక్తమైనది.

దైవత్వాన్ని ఇక్కడే, ఇప్పుడే సిద్ధించుకోవచ్చు అని మేము చెప్పినప్పుడు, దాని భావం కేవలం ఏమిటంటే అది ఇప్పటికే సిద్ధించింది. కేవలం మీ కళ్ళను తెరువండి మరి చూడండి !

సిద్ధించుకోవడం అనే భాషే అయుక్తమైనది. సిద్ధించడంలో మీరు మరి అస్తిత్వం వేరుగా ఉన్నట్లు కనిపిస్తుంది. మీరు అన్వేషకులు మరి అన్వేషించవలసిన బాహ్యమైనది అది. మీరు ప్రయాణికులు మరి అది గమ్యం. కాదు, దానిని ఇక్కడే, ఇప్పుడే సిద్ధించుకోవచ్చు అనేదాని అర్థం కేవలం ఏమిటంటే మీరు దేనినైతే అన్వేషిస్తున్నారో అదే మీరు.

మిమ్మల్ని మీరు తెలుసుకోండి.

మీ కళ్ళను తెరువండి, చూడండి ... లేదా మీ కళ్ళను మూయండి, చూడండి. కానీ చూడండి !

అది అంతర్దృష్టికి సంబంధించిన విషయం, యోగ్యతకు సంబంధించినది కాదు.

యోగ్యత అంటే ఏమిటంటే దైవత్వం సైతం ఒక వ్యాపార వ్యవహారమే. మీరు విపణి వీధికి వెళ్ళినప్పుడు ఏదో వెయ్యి రూపాయలకు అమ్మబడుతుంది, ఏదో లక్ష రూపాయలకు అమ్మబడుతుంది, ఏదో కోటి రూపాయలకు అమ్మబడుతుంది. ప్రతిదానికీ దాని వెల ఉంటుంది. యోగ్యత అంటే ఏమిటంటే దైవత్వానికి కూడా దాని వెల వుంది. తన యోగ్యతను నిరూపించుకోవడం ద్వారా దాని వెలను చెల్లించినవారు ఎవ్వరైనా దానిని పొందుతారు. మీరు దైవత్వాన్ని సైతం విపణి వీధిలోని ఓ వస్తువుగా చేయాలనుకుంటున్నారు : " త్యజించండి, తపస్సులు చేయండి, అప్పుడు మీరు దానిని సిద్ధించుకుంటారు. ఆ వెలను చెల్లించండి మరి మీరు దానిని పొందుతారు. మీరు దానిని ఉచితంగా ఎక్కడ పొందగలరు ? మీరు దైవత్వాన్ని ఒక దుకాణంలోకి లాగుతారు, దానిని ఒక పెట్టెలో బంధిస్తారు, ఒక వెలను సూచించే కాగితాన్ని అంటిస్తారు, మరి దానిని అరలో ఉంచుతారు. మీరు అంటారు, " ఇన్ని ఉపవాసాలు చెయ్యండి, అన్ని ధ్యానాలు చెయ్యండి, ఇంత తపస్సు చెయ్యండి; ఎండలో నిలబడండి, చలిని మరి వేడిని అనుభవించండి, అప్పుడు మీరు దానిని సిద్ధించుకుంటారు."

మీరు ఏమంటున్నారో మీరు ఎప్పుడైనా ఆలోచించారా. ? దైవత్వాన్ని సిద్ధించుకోవడం అనేది మీరు ఏదో చెయ్యడం అనేదానితో సంబంధం కలిగివుందని మీరు అంటున్నారు. మీరు చేసేది ఏదైనాగానీ అది మీరు చేసినదే అవుతుంది. మరి మీ చర్య అనేది మీకన్నా గొప్పది కాలేదు. మీ తపస్సు మీదే అయివుంటుంది... మీరున్నంత నిమ్నమైనదిగా, మీరున్నంత మలినంగా. మీ తపస్సు మీకన్నా ఘనమైనదిగా ఉండలేదు. మీ తపస్సు ద్వారా మీరు సాధించినది ఏదైనా పరిమితమైనదీ, హద్దులుగలదీ అవుతుంది, ఎందుకంటే పరిమితమైనదాని ద్వారా కేవలం పరిమితమైనది మాత్రమే

పొందబడుతుంది, అపరిమితమైనది కాదు. తపస్సు ద్వారా మీరు మీ మనస్సు యొక్క ఛాయనే కనుగొంటారు, దివ్యత్వాన్ని కాదు.

దైవత్వం ఇప్పటికే ఉందని అంటాడు అష్టావక్రుడు. మీలోని గుండె సవ్వడి అదే. మీలో శ్వాసిస్తున్నది అదే, మీరు జన్మించినప్పుడు మీరుగా వచ్చేది ఆయనే. మీ మరణంలో మీరుగా వెళ్ళిపోయేది ఆయనే. అది తనను తాను అనంతమైన రూపాలలో సదా ప్రత్యక్షీకరించుకుంటోంది ... ఇక్కడ ఒక వృక్షంగా, అక్కడ ఒక పక్షిగా, మరెక్కడో ఒక మనిషిగా దైవత్వం ఉంది ! అది తప్ప మరింకేమీ లేదు.

ఈ సత్యాన్ని గుర్తించడం, ఈ సత్యాన్ని జ్ఞాపకం చేసుకోవడం...

నేను విన్నది ఏమిటంటే ఒకసారి ఒక చక్రవర్తి తన కుమారుడి వలన కలవరానికి గురయ్యాడు, అతనిని దేశం నుంచి బహిష్కరించాడు. అతను ఒక చక్రవర్తి కుమారుడు కావడం వలన, ఆ అబ్బాయికి ఏదీ చెయ్యడం రాదు. అతను ఎన్నడూ మరేదీ చేయలేదు ... అతను కేవలం యాచించగలడు. ఒక చక్రవర్తి ఇక ఎంత మాత్రమూ చక్రవర్తి కానప్పుడు, అతను చేయగలిగినది కేవలం యాచించడం మాత్రమే.

అతను యాచించడం ప్రారంభించాడు. ఇరవై సంవత్సరాలు గతించి పోయాయి, అతను పూర్తిగా విస్మరించాడు ... ఇరవై సంవత్సరాలుగా యాచిస్తున్నవారు ఎవ్వరైనా తాను చక్రవర్తిని అనే విషయం గుర్తుంచుకోగలరా ? అసాధ్యం. అది కష్టతరమైనది, అది యాచనను కష్టతరమైనదిగా చేస్తుంది. దానిని మరచిపోవడం మెరుగైనది. కనుక అతను మరచిపోయాడు ; లేదంటే అతను ఎలా యాచించగలడు ? ఒక చక్రవర్తి మరి యాచించడం ! ఒక ద్వారం నుంచి మరో ద్వారానికి తన యాచన పాత్రను పట్టుకుని, భోజనశాలల ముందు నిలబడి యాచిస్తూ, మిగిలిపోయిన ఆహారపదార్థాలను అర్థిస్తూ ? ఒక చక్రవర్తి ! ఆ చక్రవర్తిని అతను మరచిపోయాడు. అతని స్మృతి నుంచి దానిని చెరిపివేయవలసి వచ్చింది. అది ముగిసిపోయింది, ఆ అధ్యాయం మూసివేయబడింది. అది ఒక కలలాంటిది, అతను ఎంతోకాలం క్రితం చదివిన ఒక కథలాంటి లేదా అతను ఒకసారి చూసిన చలనచిత్రంలాంటిది. ధానికి అతనితో ఏ నిమిత్తం వుంది ?

ఇరవై సంవత్సరాల తరువాత ఆ చక్రవర్తి, ఆ తండ్రి, వృద్ధుడైనప్పుడు, అతను కలవరానికి గురయ్యాడు... అతనికి కేవలం ఒకే ఒక కుమారుడు ఉన్నాడు మరి ఆ కుమారుడు పరిపాలించేవాడవుతాడు. అతను తన మంత్రులకు చెప్పాడు, " వెళ్ళండి అతనిని కనుగొనండి. అతను ఎక్కడ ఉన్నాగానీ అతనిని వెనక్కు తీసుకురండి.

అతని తండ్రి అతనిని క్షమించాడని అతనికి చెప్పండి. అది క్షమించడం లేదా క్షమించకపోవడానికి సంబంధించిన ప్రశ్న కాదు ... నేను మరణిస్తున్నాను. ఈ రాజ్యాన్ని ఎవరు చూసుకుంటారు ? మరొకరు ఎవరికైనా వెళ్ళే బదులు నా స్వంత రక్తం చేతులలోనే అది ఉండడం అనేది మెరుగైనది. అతను ఏ విధంగా ఉన్నా సరే, మంచిగా లేదా చెడ్డగా, అతనిని తిరిగి తీసుకురండి."

ఆ మంత్రులు యువరాజును ఒక భోజనశాల ముందు తన విరిగిపోయిన పాత్రతో నిలబడి వుండి, డబ్బు కోసం యాచిస్తూండగా కనుగొన్నారు. అతను దిగంబరంగా ఉన్నాడు. అతని పాదాలకు పాదరక్షలు లేవు. అది మిట్ట మధ్యాహ్నం, వేసవి కాలపు వేడిలో, వేడిగాలుల్లు వీస్తోంది. అతని పాదాలు కాలిపోతున్నాయి మరి పాదరక్షలు కొనుగోలు చేయడానికి కొద్దిగా డబ్బును అతను యాచన చేస్తున్నాడు. అతని భిక్షాపాత్రలో కొద్దిగా చిల్లర వుంది.

ఆ రథం వచ్చింది ఆగింది. మంత్రి కిందకు దిగి అతని పాదాలపై పడ్డాడు ... అతను భావి సామ్రాట్టు. మంత్రి అతని పాదాలను స్పృశించగానే, మెరుపుపాటులో అది సంభవించింది, అదంతా తిరిగి వచ్చింది. ఇరవై ఏళ్ళపాటు తాను ఒక చక్రవర్తిని అనే విషయం అతనికి జ్ఞాపకం లేదు. ఇప్పుడు, జ్ఞాపకం చేసుకోవడానికి కూర్చుని ఆలోచించవలసిన, చింతన చేయవలసిన, తపస్సు, ధ్యానాలు చేయవలసిన అవసరం అతనికి లేదు. లేదు, ఒక్క క్షణంలోనే, ఒక్క క్షణం కూడా కాదు ... లిప్తపాటులో ఆ రూపాంతరీకరణ సంభవించింది.

ఆ మనిషి మరేదో అయ్యాడు. అతను ఇంకా ఒక యాచకుడిగానే, దరిద్రుడిగానే ఉన్నాడు. అతను ఇంకా దిగంబరుడిగానే ఉన్నాడు. అతను ఇంకా తన పాదాలకు పాదరక్షలు లేకుండానే ఉన్నాడు. అతను తన భిక్షాపాత్రను విసిరిపారేసాడు, తన స్నానానికి ఏర్పాటు చేసి మరి యుక్త వస్త్రాలను ఏర్పాటు చేయమని తన మంత్రివర్యులకు చెప్పాడు. అతను ముందుకు అడుగేసి తన రథాన్ని అధిరోహించాడు. అతని ముందుకు అడుగేసి తన రథాన్ని అధిరోహించాడు. అతని శోభ చూసి తీరవలసినదే. అతను ఇంకా అలానే ఉన్నాడు, అతని వదనం దివ్యమైనదిగా వుంది, అతని నయనాలు ప్రకాశిస్తున్నాయి, అంతటా ఒక వైభవం వుంది. అతను ఒక చక్రవర్తి. ఆ స్మృతి తిరిగి వచ్చింది. అతని తండ్రి ఆహ్వానాన్ని పంపాడు.

అది కేవలం ఇలాంటిదే.

అష్టావక్రుడు ఇక్కడ మరి ఇప్పుడు అని చెప్పినప్పుడు, అతను ఇదే చెబుతున్నాడు: మీరు ఎంత దూరం ప్రయాణించినాగానీ... ఇరవై ఏళ్ళు, ఇరవై

జన్మలైనాగానీ ... మీరు బహిష్కృతులుగా వున్నారు, మీరు ఎంతో కాలంగా యాచిస్తూ వున్నారు, మీరు పూర్తిగా మరచిపోయారు. ఆ జ్ఞాపకం గాఢ నిద్రలో వుంది... దానిని నిద్రపుచ్చవలసి వచ్చింది. ఆ జ్ఞాపకం నిదురిస్తూ ఉండకపోతే కనుక, యాచించడం అనేది అసాధ్యం అయివుండేది. ఒక భిక్షాపాత్రతో మీరు ఒక ద్వారం నుంచి మరో ద్వారానికి తిరుగుతూ ఉన్నారు. అష్టావక్రుడు అంటున్నాడు, "ఆ ఆహ్వానం వచ్చింది. మేలుకోండి ! మీరు యాచకులు కాదు ! మీరు ఒక చక్రవర్తి కుమారులు !"

ఎవ్వరైనా సరిగ్గా వింటే కనుక, కేవలం వినడం ద్వారానే ఆ సంఘటన చోటుచేసుకుంటుంది. అష్టావక్ర గీత యొక్క ఘనత మరి మహిమ ఇదే. ఏదీ చేయాలని నిర్బంధించడం అనేది ఉండదు. కేవలం వినండి. కేవలం సత్యాన్ని మీ హృదయంలోకి చేరనివ్వండి. మార్గంలో అడ్డురాకండి. కేవలం స్వీకృతితో ఉండండి. కేవలం వినండి. ఆ బాణం మీ హృదయాన్ని చేరనివ్వండి. దాని తాకిడి చాలు. ఎన్నెన్నో జన్మల మరపు అనేది బద్దలవుతుంది, ఆ జ్ఞాపకం తిరిగి వస్తుంది: మీరే దైవం. అందువలనే అతను అంటాడు సరిగ్గా ఇక్కడే, సరిగ్గా ఇప్పుడే.

సాకులను వెతకకండి. మీరు అంటారు, ప్రజలలో తీవ్రతను వృద్ధిచేయడానికి, అత్యవసరాన్ని పెంపొందించడానికి బహుశా ఇది ఒక విధానం, ఒక సాధనం.

ఈ ప్రశ్న స్వామి యోగ చిన్మయ నుంచి వచ్చింది. చిన్మయ వద్ద ... చిన్మయ యొక్క వివేకంలో ప్రయత్నం, శ్రమ, తపస్సు మరీ అతిగా ఉన్నాయి. అతని అవగాహన ఒక సాధారణ యోగి యొక్క అవగాహనలాంటిది. అష్టావక్రుడి యొక్క వివరణలు సాధారణ యోగి కోసం కావు. అవి అసాధారణమైనవారు, వివేకవంతులు ... కేవలం వినడం ద్వారానే జాగృతులు కాగలిగినవారి కోసం. చిన్మయ కొద్దిగా ఓ హఠయోగి ... బాగా కొట్టిన తరువాత మాత్రమే అతను కదులుతాడు. కేవలం కొరడాను చూడడంతోనే, కేవలం కొరడా యొక్క నీడను చూడడంతోనే అతను కదలలేడు.

నవ్వకండి, ఎందుకంటే అధికశాతం ప్రజలు చిన్మయలాంటివారే. మీ నవ్వు మీరు చిన్మయ కన్నా భిన్నమైనవారు అని నిరూపిస్తుందని అనుకోకండి. చిన్మయ కనీసం అడిగేందుకు ధైర్యాన్ని కూడగట్టుకోగలిగాడు ... మీరు కనీసం అడగనైనా అడగలేదు. ఇదే ఏకైక వ్యత్యాసం. మీరు కేవలం అతనిలాంటి వారే. అష్టావక్రగీత ప్రసంగాలు ముగిసే సమయానికి మీరు దైవం అయివుండకపోతే కనుక, అప్పుడు ఏ వ్యత్యాసమూ లేదని తెలుసుకోండి, మీరు కేవలం అతనిలాంటివారే. కానీ వింటూన్నప్పుడు మీరు జాగృతులై మరి దైవంగా అయితే కనుక, అప్పుడు కేవలం కొరడా యొక్క నీడే పనిచేసింది.

" అన్వేషకులు ఎల్లప్పుడూ గమనించినది ఏమిటంటే దైవాన్ని సిద్ధించుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం." అన్వేషకుడు మొట్టమొదటి నుంచే దారి తప్పి ఉన్నాడు. అసలు ' అన్వేషకుడు ' అనే దానికి అర్థం ఏమిటంటే దైవాన్ని వెతకాలి అనీ, అతను దానిని ఎక్కడో పోగొట్టుకున్నాడు అనీ. ఎంతటి వింత భావన. అతను దైవాన్ని పోగొట్టుకున్నాడు ? మీరు ఆయనను ఎలా పోగొట్టుకోగలరు ?

తాము దైవాన్ని అన్వేషించాలని అనుకుంటున్నామని చెబుతూ ప్రజలు నా వద్దకు వస్తారు. నేను అంటాను, "సరే, అన్వేషించండి ! కానీ ఆయనను మీరు ఎక్కడ పోగొట్టుకున్నారు ? ఎప్పుడు ?" వారు అంటారు, " దాని గురించి మాకు ఏమీ తెలియదు." మొదట దానిలోకి చూడండి. మీరు ఆయనను అసలు ఎన్నడూ పోగొట్టుకుని ఉండకపోవచ్చు. కొన్నిసార్లు ఏమి జరుగుతుందంటే మీ కళ్ళజోడు మీ ముక్కుపైనే ఉంటుంది మరి వాటి ద్వారా చూస్తూ మీరు వాటికోసం వెతుకుతూ ఉండవచ్చు. దైవత్వం మీ ముక్కు చివరనే ఉండి మరి మీరు దానికోసం వెతుకుతూ ఉండి వుండవచ్చు కదా ? అది ఇలానే ఉంది. అన్వేషకుడు మౌలికంగా పొరబడ్డాడు. తాను దైవత్వాన్ని కోల్పోయానని, లేదా ఇంకా ఆయనను కనుగొనలేదని, భగవంతుడు ఎక్కడో సుదూరంలో ఉన్నాడని మరి ఆయన కనుగొనబడాలనీ అతను అంగీకరించాడు.

అన్వేషించడం ద్వారా దైవం ఎన్నడూ కనుగొనబడదు. వెతకడం మరి వెతకడం ద్వారా అన్వేషణలో ఏమీ లేదని ఎవ్వరైనా తెలుసుకుంటారు. వెతుకుతూన్నప్పుడు, ఒకరోజు ఆ వెతకడం అనేదే విడిచిపెట్టబడుతుంది.

అన్వేషణ అన్నది విడిచిపెట్టబడగానే దైవత్వం కనుగొనబడుతుంది.

బుద్ధుడు ఆరు సంవత్సరాలపాటు అన్వేషించాడు, సంపూర్ణంగా వెతికాడు. అతనికంటే గొప్ప అన్వేషకుడిని మీరు ఎక్కడ కనుగొనగలరు ? ఎక్కడెక్కడ ఎవరైనా జ్ఞానాన్ని సిద్ధించుకున్నారని అతను విన్నా, అతను అక్కడికి వెళ్ళాడు. అతను తన శిరస్సును వారి పాదాల చెంత ఉంచాడు. ఆ గురువులు, ఆ బోధకులు, అతనికి చెప్పినదేదైనా అతను చేశాడు. ఆ బోధకులు సైతం అతనితో విసిగిపోయారు. తమ ఉపదేశాలను అనుసరించని విద్యార్థుల విషయంలో బోధకులు ఎన్నడూ విసిగిపోరు. వాళ్ళు వారి విషయంలో ఎన్నడూ అలసిపోరు ఎందుకంటే వారు ఎప్పుడూ ఇలా అనవచ్చు, " నువ్వు బోధనలను అనసరించడం లేదు. అందువలనే ఏదీ సంభవించడం లేదు. మేము ఏం చేయగలం ? " మీరు అతని అజ్ఞానువర్తనులు కాకపోతే కనుక ఒక బోధకుడు సౌఖ్యంగా ఉంటాడు ... మీరు ఆజ్ఞానుసారం ప్రవర్తించలేదని అతను

ఎల్లప్పుడూ అనవచ్చు. మీరు ఆజ్ఞానుసారం ప్రవర్తించి ఉంటే కనుక అది సంభవించి ఉండేది.

కానీ బుద్ధుడి విషయంలో ఆ బోధకులు సంకటంలో ఉన్నారు. గురువులు ఏం చెప్పినా బుద్ధుడు చేశాడు. వారు చెప్పినదానికన్నా ఎక్కువగా చేసేలా బుద్ధుడు ఎల్లప్పుడూ నిభాయించాడు. చివరకు ఆ గురువులు, పట్టరాని ఆగ్రహంతో, అతనికి చెప్పారు, " చూడూ, ఇంకెక్కడికైనా వెళ్ళు. మేము చెప్పవలసినది ఏదైనా, మేము చెప్పాము." బుద్ధుడు అన్నాడు, " కానీ దాని ద్వారా ఏమీ సంభవించలేదు." వారు అన్నారు, " మాకు సైతం ఏమీ సంభవించలేదు. మేము నీ నుంచి దానిని దాచివుంచలేము. కేవలం మరెక్కడికైనా వెళ్ళు."

అటువంటి ప్రామాణిక వ్యక్తిని ఎదర్కొని వుండగా గురువులు సైతం మోసపూరితంగా ఉండలేరు. అన్ని దిశలలోనూ తీవ్రంగా అన్వేషించిన తరువాత, అన్వేషణ అనేది నిష్ఫలమైనదనీ, అన్వేషణ ద్వారా అది కనుగొనబడదనీ బుద్ధుడు చివరకు చూశాడు. ఇప్పటికే అతనికి ప్రపంచం ఏ అర్థమూ లేనిది; ఆధ్యాత్మికత సైతం అర్థరహితమైనది అయ్యింది. ప్రాపంచిక సుఖాలు అతని దృష్టిలో ఏ అర్థమూ లేనివి. అతను రాజసౌధాన్ని వదిలి వచ్చిన రోజే అవి అతనికి అర్థరహితమైనవి అయిపోయాయి, అందుకే అతను వదిలి వచ్చేశాడు. యోగం సైతం నిరర్థకమైనది అయిపోయింది. సుఖాలలో ఏమీ మిగిలిలేదు. యోగంలో ఏమీ మిగిలిలేదు. ఇప్పుడు ఏం చెయ్యాలి ! ఇప్పుడు ఇక చెయ్యడానికి ఏమీ మిగిలిలేదు ... ఒక కర్తగా ఉండడం అనేది ఇక ఎంతమాత్రమూ సాధ్యం కాదు.

ఈ పరిస్థితిని సరిగ్గా అవగాహన చేసుకోండి. ప్రాపంచిక సుఖమూ మిగిలి వుండదు మరి యోగమూ మిగిలి వుండదు, ప్రపంచమూ మిగిలి వుండదు మరి స్వర్గమూ మిగిలి వుండదు. కర్తకు ఏ తావూ మిగిలి వుండదు. చేయడానికి ఏమైనా ఉన్నట్లయితే కనుక కర్త అనేవాడు ఉండగలడు. చేయడానికి ఏమీ మిగిలి లేదు, మరి ఆ రాత్రే అది సంభవించింది.

ఆ సాయంత్రం, బోధి చెట్టు కింద కూర్చుని ఉండి, చేయడానికి ఏమీ లేదు. బుద్ధుడు అయోమయంలోనికి నెట్టివేయబడ్డాడు. అతను ప్రపంచాన్ని వదిలేసినప్పుడు, అతను యోగం యొక్క పట్టును చేజిక్కించుకున్నాడు : అతను విషయ లోలతను విసర్జించినప్పుడు, అతను ఆధ్యాత్మికతలోనికి దూకాడు. చేయడానికి ఏదో వుంది... మనస్సు పనిలో తలమునకలై వుంది. ఇప్పుడు మనస్సుకు చోటేలేదు. మనస్సు... పక్షి రెక్కలు కొట్టుకోవడం ప్రారంభించింది ... చోటు లేదు ! మనస్సుకు చోటు

అవసరం. అహానికి చర్యల యొక్క పోషణ అవసరం, దానికి విధులు అవసరం, చేయడానికి ఏదైనా ఉన్నట్లయితే కనుక అహం అనేది మనగలుగుతుంది. చేయడానికి ఏమీ మిగిలిలేదు. దాని గురించి కొద్దిగా ఆలోచించండి. అతనిలో ఒక లోతైన ఉపేక్ష జనించింది, దానినే అష్టావక్రుడు నిస్సంగం అని పిలుస్తాడు.

ఒక యోగి నిస్సంగుడు కాదు, ఎందుకంటే ఒక యోగి నూతన సుఖాన్ని అన్వేషిస్తాడు : ఒక యోగి ఆధ్యాత్మిక సుఖాన్ని వెతుకుతాడు. అతను ఉపేక్షించడం లేదు, అతనికి ఆనందించాలనే కోరిక ఇంకా వుంది. అతను దానిని ప్రపంచంలో కనుగొనలేకపోయాడు, కనుక అతను దైవత్వంలో వెతుకుతాడు... కానీ అన్వేషణ అనేది కొనసాగుతుంది. అది ఇక్కడ కనిపించలేదు, కనుక అతను అక్కడ చూస్తాడు. అది బాహ్యంలో కనిపించలేదు, కనుక అతను అంతరంగంలోకి చూస్తాడు. కానీ అన్వేషణ కొనసాగుతుంది. సౌఖ్యమే శ్రేష్ఠమైన పురుషార్థమని బోధించేవారూ లేదా యోగి ఇరువురూ సుఖం పట్ల ఉపేక్ష వహించడంలేదు. అవును, వారు సుఖం కోసం వేరువేరుగా వెతుకుతారు. ఒకరు బాహ్యానికి వెళతారు, ఒకరు అంతరంగంలోనికి వెళతారు. కానీ వారు ఇరువురూ ఎక్కడికో అక్కడికి వెళతారు.

ఆ రాత్రి బుద్ధుడికి వెళ్ళడానికి ఏ చోటూ లేదు, అంతరంగంలోనూ లేదు బాహ్యంలోనూ లేదు. కేవలం ఆ రాత్రిని ఊహించుకోండి, దానికి ప్రాణం పోయండి. ఆ రాత్రి ఎలా ఉంటుందో అనుభూతి చెందండి. మొట్టమొదటి సారిగా అతను విశ్రాంతిని సిద్ధించుకున్నాడు, అష్టావక్రుడు చెప్పినట్లుగా, చైతన్యంలో విశ్రాంతి, దానిలోనుంచి ఎవరైనా సత్యాన్ని సిద్ధించుకుంటారు. ఆ రోజు విశ్రాంతి సంభవించింది.

చేయడానికి ఏదైనా ఉన్నంతకాలం, ప్రయత్నం కొనసాగుతుంది. చేయడానికి ఏదైనా ఉన్నంతకాలం, ఆందోళన కొనసాగుతుంది. ఇప్పుడు ఆందోళన అనే ప్రశ్నే లేదు. శరీరం పూర్తిగా అలసిపోయింది, మనస్సు పూర్తిగా అలసిపోయింది. బుద్ధుడు ఆ వృక్షం కింద కుప్పకూలిపోయాడు మరి నిద్రలోకి జారిపోయాడు. ఉదయం అతని కళ్ళు తెరుచుకున్నప్పుడు, ప్రతి ఒక్కరి కళ్ళూ తెరుచుకోవలసిన విధానంతోనే అవి తెరుచుకున్నాయి. ప్రాతఃకాలం అతను తన కళ్ళను తెరిచినప్పుడు, ఆ కళ్ళు మొదటిసారిగా తెరుచుకున్నాయి. శతాబ్దాలుగా మూసుకుని ఉన్న ఆ కళ్ళు తెరుచుకున్నాయి.

ప్రాతఃకాలాన అతను తన కళ్ళను తెరిచినప్పుడు, చిట్టచివరి ఉదయతార కాంతిహీనమవుతోంది. ఆఖరి నక్షత్రం బయట మాయమైపోతుండగా అతను చూశాడు. బాహ్యంలో ఆఖరి ఉదయతార కరిగిపోయింది... అంతరంగంలో మనస్సు యొక్క

ఆఖరి ఆనవాలు కూడా మాయమైపోయింది. ఏదీ లేదు, అంతరంగంలో ఎవ్వరూ మిగిలిలేరు. పూర్తి నిశ్శబ్దం, ఒక శూన్యం, ఒక మహాశూన్యం, ఆకాశం ఉంది.

బుద్ధుడు ఆ విధంగా ఏడు రోజులపాటు కూర్చుని ఉండిపోయాడని చెప్పబడుతుంది... ఒక విగ్రహంలా, స్వల్ప కదలికైనా లేకుండా. దేవుళ్ళు వ్యాకులతకు గురయ్యారనీ మరి స్వర్గం నుంచి దిగి వచ్చారనీ వాళ్ళు చెబుతారు. బ్రహ్మ, ఈ విశ్వం యొక్క సృష్టికర్త, దిగి వచ్చాడు మరి బుద్ధుడి యొక్క పాదాలపై పడి ఈ విధంగా అన్నాడు, " దయచేసి మాట్లాడండి ! ఇటువంటి దృగ్విషయం శతాబ్దాలలో ఒకే ఒకసారి సంభవిస్తుంది మరి అప్పుడు కూడా అతి కష్టం మీద. దయచేసి ఏదైనా చెప్పండి. ఏమి సంభవించిందో వినాలని మేము ఎంతో ఉత్సుకతతో ఉన్నాం."

బౌద్ధ కథలలో బ్రహ్మ బుద్ధుడి యొక్క పాదాలపై పడినట్లుగా ఉందని హిందువులు ఎంతో ఆగ్రహంతో ఉన్నారు. కానీ ఆ కథ ఎంతో సరైనది... ఎందుకంటే దేవుళ్ళు స్వర్గంలో నివసిస్తూండవచ్చు కానీ వాళ్ళు గగనానికి అతీతంగా జీవించడం లేదు. ఒక వ్యక్తి కోరికకు అతీతంగా వెళ్ళడం అనే దృగ్విషయం ఈరోజు సంభవించింది. ఇప్పుడు బుద్ధుడికన్నా ఉన్నతులైనవారు ఎవ్వరూ లేరు. బుద్ధత్వమే అత్యున్నతమైది. దేవుళ్ళు సైతం నిమ్నమైనవారే. స్వర్గం మరి స్వర్గ సౌఖ్యాలకై కోరిక ఇంకా వారిలో వుంది.

అందువలనే ఎవరో ప్రత్యర్థి వస్తున్నాడు, ఎవరో ఋషి ధ్యానంలోకి గాఢంగా వెళుతున్నాడు అని అతను విన్నప్పుడు ఇంద్రుడి యొక్క సింహాసనం కంపించడం ప్రారంభిస్తుంది అని చెప్పే కథలు ఉన్నాయి. ఇంద్రుడు ధైర్యహీనుడవుతాడు, అతని సింహాసనం కంపించడం ప్రారంభిస్తుంది. అది ఢిల్లీలోని సింహాసనం విషయంలో ఉన్నదానిలాంటి కథే. దానిని ఇంద్రుడి యొక్క సింహాసనం అనండి లేదా ఇందిర యొక్క సింహాసనం, అది ఒకటే, పెద్ద వ్యత్యాసమేదీ లేదు. సవాలు విసిరేవాడు వస్తున్నాడు : పోటీ, ఆందోళన, భయం...

నిష్కర్మ ద్వారా బుద్ధుడు సిద్ధించుకున్నాడు. బుద్ధుడి యొక్క జీవితంలో ఏదైతే సంభవించిందో అది అష్టావక్రుడి యొక్క జీవితంలోనూ సంభవించి ఉంటుంది. మనకు దాని గురించిన ఏ కథా లేదు, దానిని ఎవ్వరూ వ్రాయలేదు, కానీ అది నిశ్చయంగా సంభవించి ఉంటుంది ఎందుకంటే అష్టావక్రుడు చెప్పినదేదైనా కేవలం ఇదే : మీరు ఎంతగానో పరుగుపెట్టడం చేశారు ... ఇక ఆపండి. పరుగెత్తడం ద్వారా దైవత్వం సిద్ధించదు, అది ఆగిపోవడం ద్వారా సిద్ధిస్తుంది. మీరు తగినంతగా వెతికారు, ఇక ఆ అన్వేషణను వదిలేయండి. అన్వేషణ ద్వారా మీరు సత్యాన్ని కనుగొనలేరు

ఎందుకంటే అన్వేషిస్తున్న వాడిలోనే సత్యం దాగి వుంది. మీరు ఇక్కడ మరి అక్కడ ఎందుకు పరుగెత్తుతున్నారు ?"

కబీర్ చెప్పినట్లుగా, " కస్తూరి మృగం యొక్క కస్తూరి నాభిలో వుంది... ఆ పరిమళం మీ స్వంతం." కానీ కస్తూరి మృగం యొక్క నాభి నుంచి పరిమళం వెలువడినప్పుడు, దానికి పిచ్చిపడుతుంది. అది ఇక్కడికీ, అక్కడికీ పరుగెత్తుతుంది, అన్వేషిస్తూ. ఈ సువాసన ఎక్కడి నుంచి వస్తోంది ? ఈ పరిమళాన్ని ఎవరు ఉత్పత్తి చేశారు ? అది ఎక్కడి నుంచి వస్తోంది ?... ఎందుకంటే ఆ జింకకు తెలిసిన పరిమళమేదైనా బాహ్యం నుంచే వస్తోంది : కొన్నిసార్లు పువ్వుల నుంచి, కొన్నిసార్లు మరి దేనినుంచో, కానీ ఎల్లప్పుడూ బాహ్యం నుంచే. ఈ రోజు ఆ పరిమళం అంతరంగంలో నుంచి వస్తోంది. కానీ అది ఇంకా అది బాహ్యం నుంచే వస్తోందని అనుకుంటోంది. అది పరుగుతీయడం ప్రారంభిస్తుంది. మరి ఆ కస్తూరి దాని స్వంత నాభిలోనే ఉంది, ఆ పరిమళం దాని స్వంత పరిమళం !

దైవత్వం మీ అంతరంగంలోనే నివసిస్తోంది. మీరు దానిని బాహ్యంలో వెతికినంతకాలం ... యోగంలో, సౌఖ్యమే శ్రేష్ఠమైన పురుషార్ధమని బోధించే మతంలో... అది నిరుపయోగం.

ఒక సామాన్య యోగి మిమ్మల్ని విషయ లోలత నుంచి బయటపడేస్తాడు, అష్టావక్రుడు మిమ్మల్ని విషయలోలత మరి యోగం రెండింటి నుంచీ బయటపడేస్తాడు... యోగానికి అతీతంగా, సౌఖ్యమే శ్రేష్ఠమైన పురుషార్ధమని బోధించే మతానికి అతీతంగా. ఇందువలన ప్రాపంచికుడైన మనిషికి అహం ఉంటుందని మీరు కనుగొంటారు, కానీ ఒక యోగి యొక్క అహాన్ని మీరు చూశారా ? ఒక ప్రాపంచిక మానవుడు ఆగ్రహిస్తాడు. ఒక మహాత్ముడి యొక్క శాపాన్ని మీరు విన్నారా? ఒక ప్రాపంచిక మానవడు తన తలను ఎత్తుకుని, తన జెండాను ఊపుతూ అహంకారంతో నడుస్తాడు. యోగుల యొక్క ధ్వజాలనూ, ఏనుగులనూ, ఆ ఆడంబరాన్నీ మీరు చూశారా ? ఒక సాధారణ వ్యక్తి తన సంపదను బహిరంగ పరుస్తాడు, తాను సాధించిన వాటిని చాటింపు వేస్తాడు. తమకు ఇలాంటి మరి ఇలాంటి శక్తులు ఉన్నాయి, ఇలాంటి మరి ఇలాంటి సామర్థ్యాలు ఉన్నాయి అని డంబములు చెప్పుకునే యోగులను మీరు చూశారా ? కానీ ఈ విషయాలు అన్నీ ఒకటే. వాటిలో ఏ వ్యత్యాసమూ లేదు.

యోగం అధిగమించబడనంతవరకూ, " నేనే కర్తను " అనే భావన నుంచి ఒక వ్యక్తి పూర్తిగా స్వతంత్రుడు అవ్వనంతవరకూ, ఏదీ సంభవించలేదు. మీరు

కేవలం రంగును మార్చారు. మీరు ఒక ఊసరవెల్లి, మీరు కేవలం రంగును మార్చారు అంతే. కానీ కేవలం రంగు మాత్రమే మారింది, మీరు కాదు.

"అన్వేషకులు ఎల్లప్పుడూ గమనించినది ఏమిటంటే దైవాన్ని సిద్ధించుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం." ఒక అర్థంలో ఇది నిజమే. కఠినంగా పరుగెత్తడం ద్వారా సిద్ధిని పొందడంపై మీరు పట్టుబడితే కనుక అప్పుడు ఎవ్వరైనా ఏమి చేయగలరు ? మీ తల చుట్టూ తిరిగి మీ ముక్కును మీరు ముట్టుకోవాలనుకుంటే కనుక, ముందుకు వెళ్ళండి, దానిని చెయ్యండి, నిశ్చయంగానే చుట్టు తిరిగి మీరు మీ ముక్కును ముట్టుకున్నప్పుడు ఎవరి ముక్కును వారు ముట్టుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం అనే మీరు భావిస్తారు. ఇది మీ వలనే, మీ ముక్కువలన కాదు.

మీరు మీ తలపై నిలబడి, నడవడానికి ప్రయత్నిస్తే కనుక, అయిదు లేదా పది అడుగులు నడవడమైనా కష్టమే. అప్పుడు మీరు నడవడం అనేది ఒక కఠినమైన దృగ్విషయం అని అంటే కనుక మీరు అబద్ధం చెప్పడం లేదు ; మీరు చెప్పినది సరైనదే. కానీ మీరు మీ శిరస్సుపై నిలబడి వున్నారు. తమ కాళ్ళపై నిలబడినవారికి, నడవడం అనేది ఒక కష్టతరమైన విషయం కాదు.

మీరు ఉపవాసం చేస్తారు, అగ్ని ముందు మిమ్మల్ని మీరు అధిక ఉష్ణానికి గురిచేసుకుంటారు. అనవసరంగా మీ శరీరాన్ని కష్టపెడతారు, దానిని హింసిస్తారు, వెయ్యిరకాల బుద్ధిహీనమైన పనులను చేస్తారు ... మరి అప్పుడు మీరు అంటారు దైవత్వాన్ని సిద్ధించుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం. మీరు చెబుతున్నది సరైనదే. మీరు దేనినైతే సులభంగా, సహజంగా చేరుకోగలిగి ఉండేవారో, మీరు అసహజంగా అవుతూ చేరుకుంటున్నారు, కనుక మీకు అది కష్టతరమైనదిగా కనిపిస్తుంది. మీరు చేరుకునే విధానం అయుక్తమైనది. కానీ మానవుడు అసాధ్యమైనదానిని ఎందుకు ఎంచుకుంటాడు ? దానిని అవగాహన చేసుకోవాలి. మీకు కాళ్ళు ఉన్నప్పుడు మీ తలపై నడవడంలో ఉండే ఆనందం ఏమిటి ? తలపై నడవడంలో సంతోషం ఉంది. అది అహం యొక్క సంతోషం.

ముల్లా నసీరుద్దీన్ ఒక సరస్సులో చేపలు పడుతున్నాడు. నేను కొద్దిసేపు చూశాను. నేను చూస్తూనే పోయాను కానీ అతనికి ఒక్క చేప అయినా దొరకడం లేదు. ఆ సరస్సులో చేపలే లేనట్లుగా కనిపించింది. నేను అతనిని అడిగాను, "నసీరుద్దీన్, ఈ సరస్సులో చేపలే లేనట్లుగా కనిపిస్తోంది. నువ్వు ఇంకెంత సేపు

ఇక్కడ కూర్చోబోతున్నావు ? ఆ మరో సరస్సు సమీపంలోనే ఉంది ... నువ్వు అక్కడికి వెళ్ళి చేపలు పట్టవచ్చు కదా ? ఇక్కడ ఒక్క చేపలు పట్టేవాడు కూడా కనిపించడం లేదు ; చేపలు పట్టే వారందరూ అక్కడే ఉన్నారు."

నసీరుద్దీన్ అన్నాడు, " అక్కడ చేపలు పట్టడంలో విషయం ఏముంది ? ఆ సరస్సులో ఎన్ని చేపలు ఉన్నాయంటే వాటికి ఈదడానికి కూడా చోటు లేదు. నువ్వు అక్కడ చేపలను పడితే కనుక, ఏముంటుంది ? నువ్వు ఇక్కడ చేపలను పడితే కనుక, అది విషయమున్నది అవుతుంది !"

అసాధ్యమైనది ఆకర్షణీయంగా ఉంటుంది. అది ఎంత అసాధ్యమైనదిగా ఉంటే, దానిని చేయడం ద్వారా అహం అంతగా బలోపేతం అవుతుంది. మీరు ఇక్కడ చేపలు పట్టినట్లయితే అందులో విషయం వుంటుంది. మిగిలిన వారంతా చేస్తున్నదానినే మీరూ చేసినట్లయితే దానిలో విషయమేముంది ? ప్రతి ఒక్కరూ తమ కాళ్ళపైనే నడుస్తారు. మీరు కూడా అదే చేస్తే కనుక, అందులో వినోదం ఏముంది ? మీ తలపై నడవండి.

నేను దానిని చూస్తున్న విధంగా, కాఠిన్యం మరి దైవత్వం మధ్యన ఎటువంటి అనుసంధానమూ లేదు. కాఠిన్యం అనేది అహంతో అనుసంధానించబడి వుంది. అహం కఠినమైన పనులు చేయడాన్ని ఆస్వాదిస్తుంది. ప్రతి ఒక్కరూ పనులను సులభమైన విధానంలోనే చేస్తారు. అందులో విషయం ఏముంది ? మీరు మీ కాళ్ళపై నడుస్తున్నారని మీరు ఎవరికైనా చెప్పినట్లయితే, ప్రజలు అంటారు, " నీకు పిచ్చి పట్టిందా ? ప్రతివారూ అదే చేస్తారు." కానీ మీరు మీ తలపై నడిచినట్లయితే కనుక మీ పేరు వార్తాపత్రికలలో ప్రచురించబడుతుంది. ప్రజలు మీ వద్దకు రావడం మొదలుపెడతారు. వారు మీ పాదాల వద్ద తమ శిరస్సులను వంచుతారు. మీరు ఏదో సాధించారు. మీరు మీ తలపై నడుస్తున్నారు !

మీరు అసాధ్యమైనది ఏదైనా చేసినప్పుడు అహం పూజించబడుతుంది... ఎడ్మండ్ హిల్లరీ మౌంట్ ఎవరెస్టును అధిరోహించినప్పుడు, ప్రపంచమంతా దాని గురించి తెలుసుకుంది. మీరు పూణె వద్దనున్న ఒక చిన్న కొండను ఎక్కి మరి దానిపై మీ జెండాను పాతి మరి అంటారు, " ఏ విలేఖరీ రావడం లేదు, ఏ ఫొటోగ్రాఫరూ రావడం లేదు. విషయం ఏమిటి ? ఈ భేదం ఎందుకు ? హిల్లరీ గురించి అంత హడావిడి చేశారు, అతని పేరు ఇప్పుడు చరిత్రలో స్థిరపరచబడింది, మరి నా విషయంలో ఏమీ జరగడం లేదు. అతను ఒక జెండాను పాతాడు ... నేనూ అదే చేస్తున్నాను !" కానీ ఎవరెస్టును అధిరోహించడం కష్టతరమైనది ... యాభై

నుంచి అరవై సంవత్సరాల పాటు ప్రజలు దానిని అధిరోహించడానికి ప్రయత్నించారు; అప్పుడు ఒక మనిషి చివరకు సఫలమయ్యాడు ... అందువలనే ఈ వ్యత్యాసం ఉంది.

తుదకు ఒక బాట ఏర్పరచబడుతుంది. త్వరలోనో లేక తరువాతో బస్సులు అక్కడకు వెళ్ళడం మొదలవుతుంది. ఇక ఎంతో కాలం ఎవరెస్టు తనను తాను మానవుల నుంచి సురక్షితంగా ఉంచుకోలేదు. ఒక మనిషి దాని శిఖరాగ్రాన్ని చేరినప్పుడు, ఒక పరంపర అంతా మొదలవుతుంది. ఇటీవల ఒక మహిళ అక్కడకు చేరుకుంది కూడా. స్త్రీలు సైతం చేరుకున్నప్పుడు, దానిని చేరుకోవడంలో ఏం మిగిలింది. కడకు ప్రతి ఒక్కరూ వెళతారు. కొద్దికాలంలోనే అక్కడ హోటళ్ళూ మరి బస్సులూ మరి మిగిలినవన్నీ ఉంటాయి. బస్సులు వెళ్ళడం మొదలైనప్పుడు మీరు వెళ్ళి మరి ఒక జెండాను పాతి, ఇలా అంటే, “ హిల్లరీ తన జెండాను పాతిన ప్రదేశం ఇదే. కానీ నా పట్ల భేదం చూపబడుతోంది, నాకు ప్రతికూలంగా పక్షపాతం చూపబడుతోంది...”

అహం కష్టాలను ఆస్వాదిస్తుంది. తన అహాన్ని సంతృప్తి పరచుకోవడం కోసం మానవుడు ఎన్నో విషయాలను కఠినతరమైనవిగా చేస్తాడు.. మనం ఎన్నో విషయాలను కష్టతరమైనవిగా తయారు చేస్తాం : మనం దానిని ఎంత కష్టతరమైనదిగా చేస్తే అంత రసవంతంగా అది తయారవుతుంది. దైవత్వాన్ని సిద్ధించుకోవడంలో కాఠిన్యం లేదు; కాఠిన్యం అనేది అహానికి రసం వంటిది.

మీరు చెబుతున్నది సరైనదే : “ అన్వేషకులు ఎల్లప్పుడూ గమనించినది ఏమిటంటే దైవత్వాన్ని సిద్ధించుకోవడం అనేది ఒక అత్యంత కఠినమైన దృగ్విషయం.” ఈ అన్వేషకులంతా అహంకారులు. మరి అన్వేషకులు దైవత్వాన్ని ఎప్పుడు సిద్ధించుకున్నారు ? అన్వేషణ అనేది విడిచిపెట్టబడినప్పుడే అది సంభవించింది. అన్వేషణ అనేది విడిచిపెట్టబడినప్పుడు మీరు ఎక్కడికీ వెళ్ళకుండా ఉన్నప్పుడు ... విశ్రాంతిగా, అత్యున్నత విశ్రాంతిలో కేవలం కూర్చుని ఉన్నప్పుడు మాత్రమే మీరు దైవత్వాన్ని సిద్ధించుకుంటారు. ఆ తీర్థయాత్ర శూన్యంలోనికి అంతర్ధానమై పోయినప్పుడు మాత్రమే అది సంభవిస్తుంది.

ప్రజలు సాధారణంగా ఏమనుకుంటారంటే వాళ్ళు దైవత్వాన్ని గ్రహిస్తే కనుక ఆ తీర్థయాత్ర అంతమవుతుంది. కానీ అది సరిగ్గా వ్యతిరేకమైనదై ఉంటుంది. మీరు ఆ ప్రయాణాన్ని వదిలేస్తే కనుక, దైవత్వం అవ్యవధిగా సిద్ధిస్తుంది. ప్రజలు అనుకుంటారు, “ మనం గమ్యాన్ని చేరుకున్నప్పుడు మనం విశ్రమిస్తాం.” కానీ పరిస్థితి మరో విధంగా వుంది : మీరు విశ్రమిస్తే కనుక, మీరు గమ్యాన్ని చేరుకుంటారు.

విశ్రమించడమే ధ్యానానికి మరి సమాధికి తాళంచెవి. ప్రయత్నం అనేది అహానికి తాళంచెవి.

అందువలనే ఒక మతం ఎంత ఎక్కువ ప్రయత్నపూర్వకమైనది అయితే, ఆ మతానికి చెందిన సన్యాసులు అంత ఎక్కువ అహంకారపూరితులుగా ఉంటారు అనేది మీరు కనుగొంటారు. ఒక జైన సాధువు ఓ హిందూ సాధువు కన్నా ఎక్కువ అహంకారిగా ఉంటాడు. ఒక జైన సాధువు అంటాడు, " ఒక హిందూ సాధువా ? అయితే ఏమిటి ? ఎవరైనా అది కాగలరు. ఒక జైన సాధువు ? అది ఒక కష్టతరమైన విషయం ... రోజుకు కేవలం ఒకే ఒక్కసారి భోజనం, ఎన్నో ఎన్నో ఉపవాసాలు, అన్ని రకాలైన కఠిన అభ్యాసాలు..."

మళ్ళీ, జైనులలో దిగంబర సన్యాసులు మరి శ్వేతాంబర సన్యాసులు వున్నారు. దిగంబర సన్యాసులు అంటారు," శ్వేతాంబర సన్యాసులకు ఏముంది ? వాళ్ళు బట్టలు ధరిస్తారు. దిగంబరులే అసలైన సన్యాసులు." ఒక దిగంబర సన్యాసిలో ఉన్నదానికన్నా ఎక్కువ ప్రకాశిస్తున్న అహాన్ని మీరు ఎక్కడా ఎప్పుడూ కనుగొనలేరు. అతని శరీరం శుష్కించిపోయి ఉంటుంది, కేవలం ఓ అస్థిపంజరంలా ... అంత ఉపవాసాలూ, దిగంబరంగా జీవించడం, ఎండ మరి అగ్నిని సహించడం వలన ... కానీ అతని అహం జ్వలిస్తూ ఉంటుంది. అతని అహంభావం హిల్లరీకి ఉన్నదానిలాంటిది.

భారతదేశంలో నుహా అయితే ఇరవైమంది దిగంబర సన్యాసులు, అయిదు లేదా ఆరు వేల శ్వేతాంబర సన్యాసులు, మరి అయిదు కోట్లమంది హిందూ సన్యాసులు ఉన్నారు. మరి అది నా చేతిలో ఉన్నట్లయితే నేను ప్రపంచమంతటినీ సన్యాసులను చేస్తాను. కనుక నా సన్యాసిగా కావడంలో అహం అనేది ఉండలేదు... ఎందుకంటే ఇది చెయ్యండి మరి అది చెయ్యండి అని నేను చెప్పను. అది ఒక అత్యంత సరళమైన విషయం : కాషాయ వస్త్రాలను ధరించండి, మీరు ఓ సన్యాసి !

సన్యాసం సులభతరమైతే కనుక అప్పుడు అహానికి రసం ఎక్కడ ఉంటుంది ? ప్రజలు నా వద్దకు వస్తారు. సన్యాసం ఇవ్వడానికి నేను ఒక ప్రత్యేక ఆచారాన్ని ఏర్పరచాలని వారు అంటారు. సన్యాసానికి ప్రత్యేక ఆచారాలు ! ఒక జైన ఉపదేశం చోటు చేసుకున్నప్పుడు ఇదే జరుగుతుంది కనుక ఒక విధంగా వారు సరైనవారే. సంగీతం పెద్ద ధ్వనితో వినిపించబడుతుంది, ఒక అశ్వం తీసుకురాబడుతుంది, అక్కడ ఎంతో ఉత్సవ వాతావరణం ఉంటుంది. ఏదో గొప్ప విషయం జరుగుతున్నట్లు ఎవరో సింహాసనాన్ని అధిష్టింపజేయబడుతున్నట్లుగా అది కనిపిస్తుంది. సన్యాసం అనేది ఒక రాజసింహాసనంలా తయారయ్యింది. ప్రజలు ఈ గొప్ప ఘటనను ప్రశంసించడం,

స్తుతించడం ప్రారంభిస్తారు. మరి నేను సన్యాసాన్ని ఎంత నిశ్శబ్దంగా ఇస్తానంటే ఎవ్వరికీ తెలియదు... నేను దానిని మెయిల్ ద్వారా కూడా ఇస్తాను. ఆ మనిషి ఎవరో కూడా నాకు తెలియదు, దానిని ఎవరు ఇచ్చారో అతనికీ తెలియదు. అది మంచిది.

నేను దానిని చూస్తున్న విధంగా, సన్యాసం అనేది సరళమైనదిగా ఉండాలి.

నేను దానిని చూస్తున్న విధంగా, దైవత్వం అనేది విశ్రాంతి ద్వారా సిద్ధిస్తుంది, అహం ద్వారా కాదు. అది ఒక కర్మ కాదు, ఒక అన్వేషణ కాదు.

దైవత్వం ఇప్పటికే సిద్ధించింది.

కొంత తేలికగా ఉండండి, మరి కొంత ప్రశాంతంగా ఉండండి, కేవలం ఆగండి. ఆకస్మికంగా మీరు కనుగొనేది ఏమిటంటే అవి ఎల్లప్పుడూ ఇక్కడే వుంది.

చివరి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

మన శరీరంలో సుమారు ఇరవై బిలియన్ కణాలు ఉన్నాయి, మరి రసాయనిక ప్రతిచర్యలు నిరంతరంగా సాగుతుంటాయి. మీరుగానీ లేదా అష్టావక్రుడు గానీ " ఒక సాక్షిగా ఉండు " అని చెప్పినప్పుడు, మీరు ఎవరిని ఉద్దేశిస్తున్నారు ? మీరు మస్తిష్కపు కణాలను ఉద్దేశిస్తున్నట్లయితే, అది అర్ధరహితమైనది, ఎందుకంటే మనస్సు అస్థిరమైనది. మీరు ఆత్మను మేల్కొలపడానికి ప్రయత్నిస్తున్నట్లయితే అప్పుడు అది అర్ధరహితమైనది, ఎందుకంటే ఆత్మ ఇప్పటికే జాగృతమై వుంది. దానిని మేల్కొల్పడం మరి " నిన్ను నువ్వు తెలుసుకో " అని చెప్పడం బుద్ధిహీనమైనది.

మీరు ప్రజలను భ్రాంతిలోకి నెట్టెయ్యడం లేదా ? ప్రజలు సుఖానికీ మరి బాధకూ ప్రతిస్పందించడం మానేస్తే కనుక, వాళ్ళు చెట్లు మరి జంతువులలా తయారైపోరా ?

శరీరంలో ఇరవై బిలియన్ కణాలు ఉన్నాయని చెబుతున్నది ఎవరు ? నిశ్చయంగా అది కణాలు కాదు. ఒక కణం మిగిలిన కణాలన్నింటి జాడనూ కనిపెట్టి ఉండలేదు ... శరీరంలో బిలియన్ల కొద్దీ కణాలు ఉన్నాయి.

దీనిని చెబుతున్నది ఎవరు ? దీనిని అడిగేది ఎవరు ? దీనిని ఎవరు కనుగొన్నారు ? నిశ్చయంగా కణాల నుంచి పూర్తిగా ప్రత్యేకమైనవారు, ఇరవై బిలియన్ల కణాలు ఉన్నాయని లెక్కించి చెప్పేవారు ఎవరో మీలోపల ఉన్నారు.

" మన శరీరంలో సుమారు ఇరవై బిలియన్ కణాలు ఉన్నాయి, మరి రసాయనిక ప్రతిచర్యలు నిరంతరంగా సాగుతుంటాయి. మీరుగానీ లేదా అష్టావక్రుడు గానీ " ఒక సాక్షిగా ఉండు " అని చెప్పినప్పుడు, మీరు ఎవరిని ఉద్దేశిస్తున్నారు ?" అతనిని, ఇరవై బిలియన్ కణాలు ఉన్నాయని చెప్పేవాడిని.

" మీరు మస్తిష్కపు కణాలను ఉద్దేశిస్తున్నట్లయితే కనుక, అది అర్ధరహితమైనది, ఎందుకంటే మనస్సు అస్థిరమైనది." లేదు, మేము మస్తిష్కపు కణాలను ఉద్దేశించి మాట్లాడడం లేదు, మేము **మీతో** మాట్లాడుతున్నాము. అష్టావక్రుడు మిమ్మల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. అతను మీ మస్తిష్కపు కణాలను ఉద్దేశించి మాట్లాడేంతటి మూర్ఖుడు కాదు, అతను మీతో మాట్లాడుతున్నాడు. మీ అస్తిత్వం మీ కణాలకు అతీతమైనది. వాస్తవమేమిటంటే, మీరు కణాలను వినియోగిస్తారు. అది కారు చక్రం వద్ద కూర్చునే ఓ డ్రైవర్ లాంటిది. ఆ కారు పరుగెత్తుతోంది, వేగంగా వెళుతోంది, గంటకు వంద మైళ్ళు కదులుతోంది. అయినాగానీ లోపల వున్న డ్రైవరే కారు కాదు. ఒకవేళ ఓ పోలీసు అతనిని ఆపి పక్కకు లాగితే మరి అతను పోలీసును ఇలా అడిగినట్లయితే, "నువ్వు ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నావు ? ఈ మోటారునా ?... కారును ముందుకు తోసే సాధనమే ఈ మోటారు. నువ్వు ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నావు ? ఈ పెట్రోలునా ? పెట్రోలు దానిని నడిచేలా చేస్తుంది. ఈ చక్రాలనా ? ... అవి వేగంగా తిరుగుతాయి."

ఆ గస్తీ తిరిగే పోలీసు ఏమంటాడు ? నేను మీకు చెబుతున్నదే చెబుతాడు : " నేను నీతో మాట్లాడాలని అనుకుంటున్నాను. నేను పక్కకు లాగి ఆపినది నిన్నే."

" మీరు ఆత్మను మేల్కొలపడానికి ప్రయత్నిస్తున్నట్లయితే అప్పుడు అది అర్ధరహితమైనది, ఎందుకంటే ఆత్మ ఇప్పటికే జాగృతమై వుంది. దానిని మేల్కొలపడం మరి " నిన్ను నువ్వు తెలుసుకో" అని చెప్పడం బుద్ధిహీనమైనది."

మీరు పూర్తిగా సరైనదే చెప్పారు : ఆత్మ ఇప్పటికే జాగృతమై ఉంది. దానిని మేల్కొల్పగల మార్గమే లేదు. మేము దానిని చేయాలని ప్రయత్నించడమూ లేదు.

ఆ పరిస్థితి ఇటువంటిది. మీరు పడుకుంటారు మరి బుద్ధిపూర్వకంగానే నిద్రను నటిస్తారు ; మీ కళ్ళను మూసుకుని వుండి మీరు మెలకువతోనే పడుకున్నారు. నిదురిస్తున్నవారు ఎవరినైనా మేల్కొల్పడం అత్యంత సులభం : అతనిని కొద్దిగా కదిలించండి లేదా అతని ముఖంపై నీళ్ళు చల్లండి మరి అతను మేలుకుంటాడు. కానీ మేలుకుని వుండి కూడా కళ్ళు మూసుకుని పడుకుని నిద్ర నటిస్తున్న మనిషి. మీరు అతనిని ఎలా లేపుతారు ? నీళ్ళు చల్లండి ; అది ఏ మేలూ చెయ్యదు. అతనిని

కదిలించండి, అతనిని తట్టండి ; అతను దొర్లుతాడు మరి నిద్రపోతూనే వుంటాడు. అతని పేరును పిలువండి ; అతను వింటాడు కానీ ప్రతిస్పందించడు. ఇదీ మీ పరిస్థితి.

జాగృతులైనవారిని మేల్కొల్పడం అనేది అర్ధరహితమైనది, కానీ ఈ జాగృతుడు నిద్రను నటిస్తున్నాడు ; అందువలనే మేల్కొల్పవలసిన అవసరం వుంది.

మేము నిదురిస్తున్నవారు ఎవరినీ మేల్కొలపడం లేదు, ఎందుకంటే ఆత్మ నిదురించలేదు. నిదురించేది శరీరమే, మరి శరీరాన్ని మేల్కొలుపవచ్చు. ఇప్పటికే మేలుకుని ఉన్న ఆత్మను మేల్కొల్పడంలో అర్థం లేదు. మీరు పూర్తిగా సరైనదే చెప్పారు, మీరు గొప్ప ప్రజ్ఞతో మాట్లాడుతున్నారు ... కానీ అది అరువు తెచ్చుకున్నది అయివుంటుంది. అది మీ స్వీయ అవగాహన నుంచి వచ్చినదైతే కనుక మీరు ఎన్నడూ అడిగి ఉండేవారు కాదు.

అష్టావక్రుడు లేదా నేను, మేము ఇప్పటికే మేల్కొని ఉన్నవాడిని కానీ తాను మేల్కొనివున్నానని మరచిపోయినవాడిని ; మేల్కొనివున్నా కూడా నిదురిస్తున్నట్లుగా నటిస్తున్నవాడిని ; నిదురిస్తున్నట్లు ఆటలాడుతున్నవాడిని మేల్కొలుపుతున్నాం. మరి ఇందువలనే ఎవ్వరినైనా మేల్కొల్పడంలో సమస్యలు ఉన్నాయి, గొప్ప సమస్యలు.

" మీరు ప్రజలను భ్రాంతిలోకి నెట్టెయ్యడం లేదా ?" ప్రజలు ఇప్పటికే భ్రాంతిలో లేరు అని మీరు అనుకుంటున్నారా ? వారు లేనట్లయితే కనుక, అప్పుడు నిశ్చయంగా నేను వారిని భ్రాంతిలోకి నెట్టేస్తున్నాను. కానీ వారు భ్రాంతిలో " లేనట్లయిత " కనుక, వారు దానిలోకి ఎలా నెట్టబడతారు ; ఈ బుద్ధుళ్ళందరూ భ్రాంతిలోకి నెట్టబడగలరా ? మరి ప్రజలు భ్రాంతిలోనే " ఉన్నట్లయితే " కనుక, నేను చేస్తున్నది వారిని బయటకు తీసుకురావడానికి ఓ ప్రయత్నమే. మీరు ఏ విధంగా వున్నా, నేను దానిని తలక్రిందులు చేస్తాను.

మీరు భ్రాంతిలో ఉన్నారని మీరు అనుకుంటే కనుక, ఇది మిమ్మల్ని మేల్కొలిపే ప్రయత్నం. మరి మీరు ఇప్పటికే జాగృతులు అయివున్నారని మీరు అనుకుంటే కనుక, మిమ్మల్ని భ్రాంతిలోకి నెట్టెయ్యడానికి ఇది ఒక ప్రయత్నం.

కానీ మీరు ఇప్పటికే జాగృతులై ఉన్నట్లయితే మిమ్మల్ని భ్రాంతిలో ఎవరు పడెయ్యగలరు ? గుర్తుంచుకోండి, మీరు తప్ప మరెవరూ మిమ్మల్ని భ్రాంతిలో పడెయ్యలేరు, మరి మీరు తప్ప మరెవ్వరూ మిమ్మల్ని మేల్కొలపలేరు. మిమ్మల్ని మేల్కొలపడానికి ఎవరో ప్రయత్నం చేయవచ్చు, కానీ మీరు సహకరిస్తే తప్ప మీరు

మేల్కొనరు ... ఎందుకంటే ఇది చెడగొట్టగలిగిన నిద్రకాదు. మీరు దానిని నటిస్తున్నారు. మీ సహకారం అనేది అవసరం. సహకారం అంటే శిష్యరికం. సహకారం అంటే ఏమిటంటే మిమ్మల్ని మేల్కొలపగలిగినవారి వద్దకు మీరు వెళతారు. మీరు అతనికి చెబుతారు, " నన్ను నేను మోసగించుకోవడం అనేది ఒక పాత అలవాటు అయిపోయింది ... ఈ అలవాటు నుంచి బయట పడేందుకు దయచేసి నాకు సహాయం చెయ్యండి."

ఒక యువతి నా వద్దకు వచ్చింది మరి ఓ అలవాటుగా మారిపోయే డ్రగ్‌ను తీసుకునే వ్యసనం తనకు ఉందని నాకు చెప్పింది. ఆమె దానిని ఆపెయ్యాలను కుంటోంది. ఆ డ్రగ్‌ను వదిలించుకోవాలని ఆమె ఎంతగానో కోరుకుంటోంది, ఏదో విధంగా దానిని ముగించాలని ఆమె ఎంతో ఆత్రుతగా ఉంది. కానీ ఆ డ్రగ్ వ్యసనం ఆమె శరీర కణాలలోకి లోతుగా వెళ్ళిపోయింది. ఆమె ఆ డ్రగ్‌ను తీసుకోనప్పుడు, శరీరమంతటా ఎంత తీవ్రమైన బాధ మరి అసౌఖ్యం ఉంటుందంటే ఆమె నిద్రపోలేదు, నిలబడలేదు, కూర్చోలేదు, కనుక ఆమె దానిని తీసుకోవలసి వచ్చేది. మరి ఆమె దానిని తీసుకున్నట్లయితే, తాను ఉన్న గందరగోళ స్థితి వలన ఆమె కృంగిపోయేది. ఆ డ్రగ్‌ను వదిలించుకోవడానికి ఆమె నా వద్దకు, ఆసరా కోసం నా చేతిని అడుగుతూ వచ్చింది. ఇదే పరిస్థితి, మీ అవస్థ ఇదే.

జన్మల తరబడి నిద్రావస్థలో ఉండిపోయిన మీ అభ్యాసం మిమ్మల్ని గాఢంగా ప్రభావితం చేసింది. తాను నిద్రావస్థలో ఉన్నాను అనే భ్రాంతిలో ఉన్న జాగృతులు మీరు. తనను తాను ఒక యాచకుడిగా పరిగణిస్తున్న ఓ మహారాజు. అతను దానిని ఎన్ని జన్మలుగా విశ్వసించాడంటే ఇప్పుడు అతని స్వంత అలవాటు...

కేవలం వినడం ద్వారా ఏదీ సంభవించదు. మీరు నేను చెప్పేది వినవచ్చు, కానీ దాని ద్వారా ఏదీ సంభవించదు ... మీరు దానిని మీ స్వంతం చేసుకునే వరకూ, మీరు దానిని అంగీకరించే వరకూ. మీరు తప్ప మరెవ్వరూ మిమ్మల్ని జాగృతులను చేయలేరు ; లేదంటే ఒక్క జ్ఞానోదయం పొందిన వ్యక్తే సరిపోయేవాడు. అతను గట్టిగా అరిచి వుండేవాడు మరి ప్రతి ఒక్కరినీ మేల్కొలిపి ఉండేవాడు. అతను తన మద్దెలను వాయించేవాడు మరి ప్రతి ఒక్కరినీ మేల్కొలిపి ఉండేవాడు.

ఇక్కడ వందమంది నిద్రిస్తున్నట్లయితే, వారిని మేలుకొలుపడానికి ఒక్క వ్యక్తి చాలు. వాస్తవానికి, ఎవ్వరూ అవసరం లేదు ; ఒక అలారం గడియారం వారిని మేల్కొలపగలదు. ఒక మనిషి వచ్చి ఓ డోలును వాయించవచ్చు, అందరూ లేచి కూర్చుంటారు, లేదా ఒక గంటను మ్రోగించవచ్చు, అందరూ లేచి కూర్చుంటారు.

కానీ బుద్ధుడు ఇక్కడ ఉన్నప్పుడు, మహావీరుడు ఉన్నప్పుడు, అష్టావక్రుడు ఉన్నప్పుడు, కృష్ణుడు ఉన్నప్పుడు, క్రీస్తు ఉన్నప్పుడు, జరాతుష్ట్రా ఉన్నప్పుడు, లావో ట్జూ ఇక్కడ ఉన్నప్పుడు ఇది ఎందుకు సంభవించలేదు ? ఎందువలన వాళ్ళు గట్టిగా గంటను మ్రోగించి, సమస్త భూమండలాన్నీ మేల్కొలపలేకపోయారు ? వాళ్ళు గంటను గట్టిగా మరి ఎంతోసేపు మ్రోగించారు. ఎవ్వరైనా నిజంగా నిద్రిస్తూ ఉన్నట్లయితే వాళ్ళు మేలుకొని ఉండే వాళ్ళు ... కానీ ఇక్కడ ప్రజలు నిద్ర నటిస్తున్నారు. వాళ్ళు తమ కళ్ళను మూసుకుని పడుకుంటారు. వాళ్ళు ఆ గంట మోతను వింటారు, వాళ్ళు అనుకుంటారు, " దానిని మోగిస్తూనే ఉండండి. మమ్మల్ని ఎవరు మేలుకొల్పుతారో మేమూ చూస్తాం !"

మీరు మేలుకొనాలని అనుకున్నప్పుడు మీరు మేలుకుంటారు.

నేను మిమ్మల్ని భ్రాంతిలో పడెయ్యలేను. మీరు ఇప్పటికే భ్రాంతిలో ఉన్నారు : మీరు ఇంకా ఏ భ్రాంతిలోకి పడెయ్యబడతారు ? మీరు మరింత తప్పుదారిలో తీసుకెళ్ళబడవచ్చని మీరు అనుకుంటున్నారా ? మీరు తప్పు దారి పట్టించబడగల ప్రదేశం ఇంకా ఎక్కడో ఉంది అని మీరు అనుకుంటున్నారా ? ఇంతకన్నా దిగువకు మీరు క్రిందకు పడిపోగలరా ? పడిపోవడానికి ఏ ప్రదేశమైనా ఇంకా మిగిలి వుందా ? మీలోని అత్యాశ ఒక అంగుళమైనా పెరగగలదా ? మీలోని ఆగ్రహం ఒక్క గ్రాము అయినా పెరగగలదా ? మిమ్మల్ని ముంచెత్తే కోరికలు మరింత బలవత్తరమైనవిగా ఉండగలవా ? మీరు వరుస చివరన నిలబడి వున్నారు. మొదట ఉండవలసిన వాడు చివర నిలబడతాడు. ఒక మహారాజులా ఉండవలసినవాడు ఓ యాచకుడిలా నిలబడతాడు. మీరు దిగువకు వెళ్ళలేరు... మరింత కిందకు పడిపోగల మార్గమే లేదు.

మీరు మరింత భ్రమింపజేయబడే సంభావ్యతే లేదు. ఎవరైనా చేయాలని అనుకున్నా కూడా, అతను మీకు అది చెయ్యలేడు. అవును, మహా అయితే ఎవరైనా చేయగలిగినది మీ భ్రమను మరొక దానికి మార్చడమే. మీరు ఒక భ్రాంతితో విసిగిపోయినట్లయితే కనుక, అతను మీకు మరొక దానిని ఇస్తాడు. సాధువులు చేస్తూ పోయేది అదే.

ప్రాపంచిక భ్రమలతో మీరు విసుగు చెందడం ప్రారంభిస్తారు. మీకు చీకాకు పుడుతుంది, మీరు వాటిలో మరీ అతిగా జీవించారు. ఇప్పుడు ఏదీ వాస్తవమైనది కాదు ... భ్రాంతిని కల్పిస్తారు. వాళ్ళు అంటారు, " వచ్చి స్వర్గాన్ని ఆస్వాదించు. మంచి పనులు చెయ్యి, త్యజించు, నిష్ఠగా ఉండు, స్వర్గానికి చెందిన కన్యలను

ఆస్వాదించు. నువ్వు ఎంతగానో ఆనందించావు. దుఃఖించావు, కానీ ఉపయోగమేమీ లేదు. ఇక్కడ నువ్వు మధువును కొద్ది మోతాదులో తాగుతావు, కేవలం పిడికెడు ; అక్కడ స్వర్గలోకపు ఉద్యానవన ప్రాకారం లోపల, మధువు ఏరులై ప్రవహిస్తోంది. నువ్వు మధువులో మునిగిపోవచ్చు. ఇక్కడ ఏమి వుంది ? స్వర్గంలో స్వర్ణ సౌధాలు, వజ్రాలు మరి రత్నాల వృక్షాలు ఉన్నాయి. కల్పవృక్షం కింద కూర్చో మరి నీకు కావలసినదేదైనా అడుగు. నువ్వు ఇక్కడ మరీ అతిగా వేదన పొందావు." కానీ ఇది ఒక భ్రాంతి.

నేను మీకు ఏ కొత్త భ్రాంతినీ ఇవ్వడం లేదు. నేను కేవలం సూచిస్తున్నాను : మీరు తగినంత భ్రాంతిని చూశారు, ఇప్పుడు కొద్దిగా మేలుకోండి.

సాక్షీతత్వం అనేది భ్రాంతి ఎలా కాగలదు ? దాని గురించి ఆలోచించండి.

నేను కేవలం మిమ్మల్ని ఓ సాక్షిగా ఉండండి అని అడుగుతున్నాను. ఏది వుందో, దానిని వీక్షించండి అని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. నేను మిమ్మల్ని ఏదైనా చెయ్యమని అడిగితే కనుక, భ్రాంతి అనేది కలుగుతుంది. నేను కేవలం సూచిస్తున్నది ఏమిటంటే మీరు ఏమి చేస్తున్నాగానీ ; మీరు ఎవరైనా గానీ, ఒక యోగి లేదా ఒక జోర్బా ; మీరు ఏదై ఉన్నాగానీ, హిందువు లేదా మహమ్మదీయుడు ; మీరు ఎక్కడ ఉన్నాగానీ, ఒక గుడిలో లేదా ఒక మసీదులో ... మేల్కొనండి, అప్రమత్తతతో వీక్షించండి. ఎరుకతో ఉండడంలో భ్రాంతి అనేది ఎలా ఉండగలదు? ఒక జాగృతుడైన వ్యక్తికి భ్రాంతిలో ఉండడం అనే సంభావ్యతే లేదు. కలలు అనేవి నిద్రలో వస్తాయి. ఎవ్వరైనా పూర్తి మెలకువతో ఉన్నప్పుడు అవి ఎలా రాగలవు ?

" ప్రజలు సుఖానికీ మరి బాధకు ప్రతిస్పందించడం మానేస్తే కనుక, వాళ్ళు చెట్లు మరి జంతువులలా తయారైపోరా ?"

మొదట, చెట్లు మరి జంతువులు మీకన్నా పనికిమాలినవి అని మీకు ఎవరు చెప్పారు ? నిర్ధారించుకోకుండానే మీరు దానిని సత్యమని భావించారు. మీరు చెట్లను మరి జంతువులను అడుగవలసింది. జంతువులనూ అడగండి... జంతువుల యొక్క కళ్ళలోకి చూడండి. ఇది కూడా మానవుడి యొక్క అహంకారమే... తాను జంతువులకన్నా ఉన్నతంగా ఉన్నానని అతను అనుకోవడం. మరి విచిత్రమైన విషయం ఏమిటంటే, సాక్ష్యం ఇవ్వాలని జంతువులు ఎన్నడూ అడుగబడలేదు. మీరు ఏక-పక్షంగా నిర్ణయాన్ని తీసుకున్నారు, మీ అంతట మీరే నిర్ణయించేశారు. మీ పవిత్ర గ్రంథాలలాంటి పుస్తకాలను జంతువులు వ్రాసుంటే కనుక ' మానవుడు బాగుపరచడం సాధ్యం కాని జంతువు ' అని వాటిలో వ్రాసి ఉంటుంది.

నేను విన్నది ఏమిటంటే మానవుడు ఓ పతనం అయిపోయిన కోతి అని కోతులలో చెప్పబడుతుంది. మానవుడు కోతుల నుంచి వికసించాడు అని డార్విన్ చెబుతాడు. కానీ నిర్ణయించడానికి డార్విన్ ఎవరు ? మీరు కోతులు చెప్పేది కూడా వినాలి. ఇరు పక్షాలు చెప్పేదీ వినాలి. మానవుడు పతనమైపోయాడు అని కోతులు చెబుతాయి. మరి అవి చెబుతున్నది అవగాహన చేసుకోగలిగినదే. కోతులు ఉన్నతంగా ఉన్నాయి, వృక్షాలపైన ఉన్నాయి, మరి మీరు దిగువన నేలపై ఉన్నారు : మీరు పతనమయ్యారు. కోతులు ఎక్కడో పైన ఉన్నాయి, మీరు కింద ఉన్నారు. ఏ కోతినైనా పోరాటానికి సవాలు చెయ్యండి, మరి చూడండి : బలం పెరిగిందా లేక తరిగిందా ? మీరు ఒక వృక్షం నుంచి మరో దానిపైకి దూకగలరేమో కేవలం చూడండి ... మీ ఎముకలు విరిగిపోతాయి. యోగ్యత అనేది వికసిస్తోందా లేక మాయమైపోతోందా ? మీరు శ్రేష్ఠమైనవారు అని మీకు ఎవరు చెప్పారు ? లేదా నిర్ధారించుకోకుండానే కేవలం అదే సత్యమని మీరు భావించారా ?

అది కేవలం హాస్యాస్పదమైనది. తాను శ్రేష్ఠమైనవాడిని అని విశ్వసించడమే మానవుడికి ఉన్న అనేకానేక రోగాలలో ఒక రోగం. మీరు పురుషులను అడిగితే కనుక, స్త్రీలకన్నా తాము శ్రేష్ఠులమని వారు అనుకుంటారు ... స్త్రీలను అడగనైనా అడగకుండానే. స్త్రీల యొక్క వాంగ్మూలం ఎన్నడూ తీసుకోబడలేదు. దానిపై ఎన్నడూ ఏ అభిప్రాయమూ తీసుకోబడలేదు. తమ మనస్సులలో ఉన్నదానిని వ్యక్తీకరిస్తూ, పురుషులు పవిత్ర గ్రంథాలను వ్రాశారు, మరి స్త్రీలు వాటిని చదువడం నిషేధించబడింది, కనుక వాళ్ళు అభ్యంతరం తెలుపలేకపోయారు. ఎలా చదవాలో ఆమెకు తెలిసివుంటే కనుక, ఆ పండితుడి యొక్క భార్య అతను వ్రాసినదాని గురించి అతనిని పీడించి ఉండేది. కనుక చదవడం నుంచి స్త్రీలు నిరోధించబడ్డారు : స్త్రీలు వేదాలను చదువకూడదు, ఇది చెయ్యకూడదు, అది చెయ్యకూడదు... ఈ పురుష దురహంకారులు సరిహద్దుల దాకా వెళ్ళిపోయారు : స్త్రీలు మోక్షాన్ని సైతం పొందలేరని వాళ్ళు అన్నారు. మొదట వాళ్ళు పురుషులుగా జన్మించాలి, ఒక పురుష శరీరంలో జన్మను తీసుకోవాలి ; అప్పుడు వాళ్ళు జ్ఞానోదయాన్ని పొందగలరు.

తరువాత పురుషుల నడుమ అడగండి. శ్వేత జాతీయుడు తనను తాను నల్ల జాతీయుడి కన్నా శ్రేష్ఠమైనవడిగా పరిగణించుకుంటాడు. కానీ నల్ల జాతీయుడిని అడగండి...

నేను విన్నది ఏమిటంటే ఒక ఆంగ్లేయుడు, తనతో పాటుగా ఒక నల్ల జాతీయుడైన గైడ్‌ను తీసుకుని ఆఫ్రికన్ అరణ్యంలో వేటకు వెళ్ళాడు. వాళ్ళు ఆ

అరణ్యంలో తప్పిపోయారు మరి అప్పుడు దాదాపు వందమంది కిరాతులు ఈటెలతో తమ వద్దకు రావడం వాళ్ళు చూశారు. ఆ అంగ్లేయుడు భయపడిపోయాడు ! అతను తన నల్లవాడైన గైడ్‌తో అన్నాడు, " మన ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి !"

ఆ నల్ల జాతీయుడు అన్నాడు, " మన ప్రాణాలా ? నన్ను దీనిలో నుంచి వదిలెయ్యి ! కేవలం నీ పట్ల నువ్వు జాగ్రత్త వహించు. నా ప్రాణం ప్రమాదంలో ఎందుకు ఉండాలి ?"

శ్వేత జాతీయుడు తాను శ్రేష్ఠుడినని అనుకుంటాడు. నల్ల జాతీయుడు తానే శ్రేష్ఠుడినని అనుకుంటాడు. చైనీయుడిని అడగండి. ఆంగ్లేయులు కోతులు అని చైనీయుల గ్రంథాలలో వ్రాసి ఉంది. వాళ్ళు వారిని మానవులుగా సైతం లెక్కించరు.

ఈ రోగం ప్రపంచమంతటా ఉంది. అది మనిషిలోకి ఎంతో లోతుగా వెళ్ళిపోయింది. మరో పక్షాన్ని సంప్రదించకుండానే అతను విషయాలను నిర్ణయిస్తూ పోతాడు. ఇదంతా అహం యొక్క క్రీడ. మీ అహాన్ని పక్కన పెట్టి, మీరు కేవలం చూస్తే కనుక, అంతా దైవ స్వరూపాలే అన్నది మీరు కనుగొంటారు ... జంతువులు, పక్షులు, చెట్లు, మానవుడు, ప్రతీ ఒక్కటీ.

కొన్నిసార్లు దైవత్వం హరితంగా ఉండాలని అనుకుంటున్నది, కనుక అది హరితంగా ఉంది. కొన్నిసార్లు అది పక్షుల యొక్క పాటలలో విశదమవ్వాలని అనుకుంటుంది, మరి అది విశదమవుతుంది. కొన్నిసార్లు అది మానవుడిగా అవ్వాలని అనుకుంటుంది కనుక అది మానవుడు అవుతుంది. ఇక్కడ ఏ అంతస్తులూ, ఏ ఆధిపత్యం లేదు, ఎవ్వరూ ఎగువన లేదా దిగువన లేరు. అందరూ ఏకకాలంలో దివ్యత్వపు అనంతమైన అలలే. ఒక చిన్న అలలో, అది దైవత్వమే, ఒక పెద్ద అలలోనూ అది అదే, ఒక తెల్లని కెరటంలో అది దైవత్వమే, ఒక నల్లని అలలోనూ అది అదే, గడ్డిలో అది దైవత్వమే, ఆకాశాన్నంటుతున్న వృక్షాలలోనూ అది అదే.

ఈ క్షణంలో ఉన్నది ఏదైనా దైవత్వమే అని ధార్మిక దర్శనం చెబుతుంది. దివ్యత్వంలో ఏదైనా ఎక్కువ ముందు లేదా వెనుక ఎలా ఉండగలదు ? ఇది అత్యంత కష్టతరమైనది. దేనినో ఉన్నతమైనదిగా మరి దేనినో అధమమైనదిగా చేయడంలో, మీరు సమస్యలను సృష్టిస్తున్నారు. వాస్తవానికి కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. మీరు ఒక సాక్షిగా చూస్తే కనుక, అంతా ఒక్కటే అనేది మీరు చూస్తారు.

కనుక మొదటి విషయం ఏమిటంటే, " ప్రజలు సుఖానికీ, బాధకూ ప్రతిస్పందించడం మానేస్తే కనుక, వాళ్ళు చెట్లు మరి జంతువులలా తయారైపోరా?"

అని అడగకండి. వాళ్ళు దానిని చూస్తే నష్టమేమీ లేదు. హిట్లర్ ఒక జంతువు లేదా ఒక చెట్టు అయితే కనుక ఏదైనా నష్టం ఉంటుందా ? అవును, కోట్లాది ప్రజలు మృత్యువాతన పడకుండా కాపాడబడతారు ; మరే ఇతర హానీ చేయబడదు. నాదిర్షా ఒక పులి అయినట్లయితే ప్రమాదం ఏమిటి ? అయిదు లేదా పదిమంది మానవులను చంపడంతో, కేవలం ఆహారం కోసమే చంపడంతో అతను సంతృప్తుడయ్యేవాడు. ఒక మానవుడుగా అతను ఏ కారణమూ లేకుండానే ఈ భూమిని శవాలతో నింపేశాడు.

ఇంతవరకూ నిశ్చయం ... జంతువులు ఇంతవరకూ అణుబాంబులాంటిది ఏదీ కనిపెట్టలేదు. జంతువులు చంపడం కోసం తమ పంజాను ఉపయోగిస్తాయి, ఒక అత్యంత పురాతన విధానం. మరి అవి కేవలం ఆహారం కోసం మాత్రమే చంపుతాయి. తినాలనే ఉద్దేశ్యం లేకుండా చంపే ఏకైక మృగం మానవుడే. మానవుడు పక్షులను మరి జంతువులను వేటాడడానికి అడవికి వెళతాడు, అది తన వినోదం, తన క్రీడ అని అంటాడు. కానీ ఒక సింహం అతనిపై దాడి చేస్తే కనుక, అది ఒక వినోదం కాదు. " ఆ సింహం కేవలం ఆడుకుంటోంది ... దానిని అది చేయనివ్వండి. అది దాని వినోదం," అని అతను అనడు. క్రీడ కోసం మీరు చంపుతారా ? క్రీడ కోసం ఏ జంతువూ చంపదు.

మరొక భావగర్భితమైన అంశం ఏమిటంటే ఏ ఇతర జంతువూ తన స్వంత జాతి వాటిని చంపదు. ఏ సింహమూ ఇతర సింహాలను చంపదు. ఏ కోతీ అదే జాతి దానిని చంపదు. తన స్వంత జాతిని చంపే ఏకైక జంతువు మానవుడే. చీమలు చీమలను చంపవు. ఏనుగులు ఏనుగులను చంపవు. కుక్కలు కుక్కలను చంపవు. అవి కలహిస్తాయి మరి పోరాడుతాయి. కానీ అవి హత్య చేయవు. ఒకరినొకరు హత్య చేసుకునే ఏకైక మృగాలు మానవులే.

మీరు కోల్పోతామేమో అని అంతగా దిగులు పడుతున్నది మానవుడిలో ఏముంది ? ఏమి పోతుంది ? వృక్షాలు మరి మొక్కలు అందమైనవి, జంతువుల ఎంతో అమాయకమైనవి. కానీ నేను మిమ్మల్ని వృక్షాలు లేదా మొక్కలు లేదా జంతువులలా ఉండమని అడగడంలేదు ; " అహాన్ని వదిలెయ్యండి," అని మాత్రమే నేను అంటున్నాను.

రెండవ విషయం ఏమిటంటే, సుఖానికీ, బాధకూ ప్రతిస్పందించడం మానెయ్యండి అని నేను ఎన్నడూ అనలేదు. అష్టావక్రుడు సైతం అది చెప్పలేదు. ఆనందం, బాధలో సమత్వంతో ఉండడమంటే అర్థం సుఖానికీ, బాధకూ ప్రతిస్పందించడం మానెయ్యడం అని కాదు. సుఖం మరి దుఃఖంలో సమతత్వంతో

ఉండడమంటే అర్థం కేవలం ఇదే : " నేను సాక్షిగా ఉంటాను. బాధ వస్తే కనుక నేను దానిని గమనిస్తాను ; ఆనందం వస్తే కనుక, నేను దానిని గమనిస్తాను."

మీరు బుద్ధుడిని ఒక ముల్లుతో గుచ్చినట్లయితే అతను బాధను అనుభూతి చెందడు అని కాదు దీని అర్థం. మీరు బుద్ధుడిని ఒక ముల్లుతో గుచ్చినట్లయితే అతను మీకన్నా ఎక్కువ బాధను అనుభవిస్తాడు ఎందుకంటే అతను మీకన్నా ఎక్కువ సున్నితంగా ఉంటాడు. బుద్ధుడు ఒక సుకుమారమైన పద్మంలా ఉండగా, మీరు ఓ రాయిలాగా తయారయ్యారు. మీరు బుద్ధుడిని ముల్లుతో గుచ్చినప్పుడు అతను మీకన్నా ఎక్కువ బాధను అనుభూతి చెందుతాడు. కానీ ఆ బాధ శరీరంలో ఉంది. ఇది తెలియడంవలన, బుద్ధుడు విడిగా నిలబడి ఉంటాడు. అతను వీక్షిస్తాడు ... వేదన సంభవిస్తోంది. బాధ సంభవిస్తోందని అతనికి తెలుసు, అయినా ఆ బాధతో అతను తనను తాను ఐక్యం చేసుకోడు. అతనికి తెలుసు, " నేను తెలుసుకునేవాడిని ; అంతర్గత స్వభావానుసారం, నేను తెలుసుకునేవాడిని ".

ప్రతిస్పందించడం మానెయ్యమని అష్టావక్రుడు మిమ్మల్ని అడగడం లేదు. మీ ఇంటికి నిప్పు అంటుకున్నట్లయితే బయటకు పరుగుతీయకండి ; కూర్చునే ఉండండి మరి మీరు ఓ బుద్ధుడు అవుతారు అని అతను చెప్పడం లేదు. అతను ఏమి చెబుతున్నాడంటే పరుగెత్తి పోతున్నప్పుడు ఇల్లు కాలిపోతోంది, కానీ మీరు కాలిపోవడం లేదు అనేది తెలుసుకోండి అని అతను చెబుతున్నాడు. మరి మీ శరీరం కాలుతూ వున్నా కూడా, శరీరమే కాలిపోతోంది, మీరు కాదు అనేది తెలుసుకోండి. మీ శరీరాన్ని మీరు కాలిపోనివ్వాలి అని అతని ఉద్దేశ్యం కాదు ... మీ శరీరాన్ని అగ్ని నుంచి దూరంగా తీసుకెళ్ళండి. శరీరానికి ఏ రకమైన క్లేశాన్నైనా కలిగించాలని అతను అనడం లేదు.

ప్రతిస్పందించకుండా ఉండడమంటే ఒక రాయిలాగా, నిర్జీవంగా అయిపోవడం అని అర్థం. బుద్ధుడు ఒక రాయి కాదు. బుద్ధుడి కన్నా ఎక్కువ కరుణామయుడిని ఎవరినైనా మీరు ఎప్పుడైనా కలుసుకున్నారా ? అష్టావక్రుడు ఒక రాయిలా ఉండేవాడు కాదు ... అతని నుంచి ఓ ప్రేమ తరంగిణి ప్రవహించేది. ఎవరి నుంచి అయితే ప్రేమ ఏరులై పారుతుందో వారి సున్నితత్వం పెరిగింది, తరగలేదు. అతని ద్వారా ఒక మహోన్నత కరుణ దిగివచ్చింది... కానీ మీరు దానిని అపార్థం చేసుకోవచ్చు.

మరి ఈ ప్రశ్నను అడిగినవారెవరైనా ఏదో విధమైన శ్రుతి విహిత వివేకాన్ని కలిగివున్నట్లు కనిపిస్తోంది, వివేకంలో కొంత ఎక్కువ చెత్తే ఉన్నట్లుంది. అతను కొంత చదివాడు, కొంత విన్నాడు, కొద్దిపాటి సమాచారాన్ని పోగుచేశాడు ... ఇప్పుడు అది

అతనిలో మధిస్తోంది. అతనిని విననివ్వడం లేదు, అతనిని చూడనివ్వడం లేదు. అది విషయాలను వక్రీకరిస్తూ పోతుంది.

ఒక కవి చెబుతాడు :

పథికులు అందరూ ఆగిపోయారు.
లోనున్న నీరు సగం- గడ్డ కట్టింది,
బయట మంచు పేరుకుపోయింది.
ఒకవైపు మెడలోతు వరకూ ఉన్న దాటలేని చిత్తడి నేల,
మరొక వైపు మహాసాగరపు వరద.
పెనుగాలులు వీస్తున్నాయి,
అడవి తారుమారైపోయింది.
పథికులు అందరూ ఆగిపోయారు.
తలుపులు మూసివున్నాయి, కిటికీలు సగం తెరిచి ఉన్నాయి,
కళ్ళు బయటకు తొంగి చూస్తున్నాయి.
సందె చీకటి యొక్క అసంఖ్యాకమైన నల్లని దండములు
సూర్యుడి ముఖాన్ని బాణాలలా గుచ్చుతున్నాయి.
నిశ్శబ్దంగా, తమ ముసుగుల వెనుక దాగి వుండి,
భయంతో, సంకోచంతో,
పథికులు అందరూ ఆగిపోయారు.

ఈ వివేకపు ముసుగులు మరి కృత్రిమ ముఖాలు, ఆధ్యాత్మిక జ్ఞానం మరి పండితులుగా చెలామణీ అవ్వడం అన్నీ ... వాటి వెనుక మీరు ఎంతకాలం దాగుతారు ? ఈ ఆలోచనల పొరలన్నీ ... వాటి వెనుక మీరు ఎంతకాలం దాగి వుంటారు ? వాటిని వదిలించుకోండి. మీ అంతరంగంలోని నిర్మలమైన చైతన్యాన్ని జాగృతపరచండి. విషయాలవైపు వీక్షకుడిలా చూడండి, ఆలోచనాపరుడిగా కాదు, ఎందుకంటే ఆలోచనాపరుడు అంటే మనస్సు యొక్క ప్రక్రియలు మొదలయ్యాయి అని అర్థం.

కనుక మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోవాలని అనుకుంటే కనుక మీరు అతనిని కేవలం ఓ శుద్ధ చైతన్యంగానే అవగాహన చేసుకోగలుగుతారు. మీరు ఆలోచించడం మరి సమీక్షణలలోకి జారిపోతే కనుక, మీరు అతనిని అవగాహన చేసుకోలేరు, మీరు అతనిని చేజార్చుకుంటారు.

అష్టావక్రుడు ఓ తత్వవేత్త కాదు, అష్టావక్రుడు ఓ చింతనాపరుడు కాదు.

అష్టావక్రుడు ఒక దూత, చైతన్యం యొక్క సాక్షీతత్వం యొక్క దూత. శుద్ధ సాక్షీతత్వం, కేవలం వీక్షించడం. దుఃఖం ఉన్నట్లయితే, దానిని గమనించండి. సంతోషం ఉన్నట్లయితే, దానిని గమనించండి. దుఃఖంలో ఉన్నప్పుడు సంతోషంతో అభేదాన్ని అనుభూతి చెందకండి. రెండింటినీ రానివ్వండి, రెండింటినీ పోనివ్వండి. రాత్రి వచ్చింది, దానిని గమనించండి. పగలు వచ్చింది, దానిని గమనించండి. రాత్రివేళ, మీరు రాత్రి అయిపోయారని అనుకోకండి. పగటివేళ, మీరు పగలు అయిపోయారని అనుకోకండి.

నిస్సంగంతో, అధిగమించి, అతీతంగా, ఉన్నతంగా, సుదూరంగా ఉండండి.

కేవలం ఒకే ఒక విషయంతో అభేదాన్ని అనుభూతి చెందండి : మీరే వీక్షకులు, మీరే సాక్షి.

హరి ఓం తత్ సత్ !

అష్టావక్రుడు అన్నాడు : అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు. వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి. నీ బంధనం ఇదే : గమనించేవాడిగా నువ్వు మరొకరిని చూస్తావు ... నిన్ను నువ్వు కాదు.

" నేనే కర్తను," ఇలాగే అహం అనే నల్ల త్రాచు నిన్ను కాటు వేసింది. " నేను కర్తను కాను," విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి, ఆనందంగా ఉండు.

" నేనే శుద్ధమైన ఎరుకను, " ఇలాగే నిశ్చయం యొక్క ఈ అగ్నితో నీ అజ్ఞానారాణ్యాన్ని దహించి, దుఃఖానికి అతీతుడివై, ఆనందంగా ఉండు.

దేనిలోనైతే ఈ ఊహాత్మక ప్రపంచం అనే ఒక తాడు పాములాగా ప్రసరింపబడుతోందో ఆ పరమానందమే, ఆ అత్యున్నత పరమానందమే నువ్వు. దీనిని తెలుసుకుని, అలాగే ఆనందంగా సంచరించు. తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే, మరి తనను తాను ఓ బంధితుడిగా పరిగణించుకునేవాడు బంధితుడే; ఎందుకంటే ఈ ప్రపంచంలో ఈ సామెత సత్యమే : " మీరు ఎలా ఆలోచిస్తారో అలానే మీరు ఉంటారు ".

ఆత్మ అనేది సాక్షి, అంతటా వ్యాపించినది, సంపూర్ణమైనది, ఏకమైనది, స్వతంత్రమైనది, చైతన్యపూరితమైనది, చేత నుంచి స్వేచ్ఛాయుతమైనది, పూర్తిగా ఏకాకైనది, నిస్సంగమైనది, నిర్మోహమైనది, ప్రశాంతమైనది. భ్రాంతివలన, అది ప్రపంచంలా కనిపిస్తుంది.

" ప్రత్యేకంగా ప్రసరించబడిన జీవితాన్నే నేను," ఈ భ్రమను వదిలిపెట్టు, అంతరంగం మరి బాహ్యం అనే భావనను కూడా వదిలిపెట్టు, నిర్వికారమైన, చేతనమైన, నిర్ద్వంద్వమైన ఆత్మే నువ్వు అనే భావనలో జాగృతమవ్వు.

3

ముసుగును తొలగించండి

మొదటి సూత్రం :

అష్టావక్రుడు అన్నాడు : అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు, వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి. నీ బంధనం ఇదే : గమనించేవాడిగా ... నువ్వు మరొకరిని చూస్తావు నిన్ను నువ్వు కాదు.

ఈ సూత్రం అత్యంత ఆవశ్యకమైనది. ప్రతీ ఒక్క పదాన్నీ సరిగ్గా అవగాహన చేసుకోండి. ***అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు, వాస్తంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి.*** సాధారణంగా మనం మన జీవితాలను ఇతరుల కళ్ళ ద్వారా గ్రహిస్తాము. మనం ఇతరుల యొక్క కళ్ళను ఓ దర్పణంలా వినియోగిస్తాము. మనం గమనించేవాడిని మరచిపోతాం మరి గమనించబడేవారుగా తయారవుతాం.

మరి అది సహజం. ఒక శిశువు జన్మిస్తాడు : అతనికి తన గురించి తనకు ఏమీ తెలియదు. కేవలం ఇతరుల యొక్క కళ్ళలోకి చూడడం ద్వారానే తాను ఎవరు అనేది అతను తెలుసుకుంటాడు. మీ స్వంత ముఖాన్ని మీరు చూడలేరు, మీరు ఒక అద్దంలో చూసుకోవలసి వస్తుంది. ఒక అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకున్నప్పుడు మీరు గమనించబడేవారు అవుతారు, మీరు ఇక ఎంత మాత్రమూ గమనించేవారుగా ఉండరు. మీ గురించి మీకు ఎంత తెలుసు ? ఆ అద్దం ఎంత వెల్లడి చేస్తే అంత.

తల్లి అంటుంది, " నా బిడ్డ అందంగా ఉన్నాడు " ; కనుక ఆ బాలుడు తాను అందంగా ఉన్నాను అని అనుకుంటాడు. పాఠశాలలో ఉపాధ్యాయురాలు చెబుతుంది, " నువ్వు తెలివైనవాడివి," మరి మిమ్మల్ని మీరు తెలివైనవారుగా విశ్వసించడం ప్రారంభిస్తారు. ఎవ్వరైనా మిమ్మల్ని అవమానిస్తే కనుక, ఎవ్వరైనా మిమ్మల్ని నిందిస్తే కనుక, ఆ దూషణ మీలోకి లోతుగా చొచ్చుకుపోతుంది. అందువలనే మనను గురించిన మన జ్ఞానం ఎంతో అయోమయంగా ఉన్నట్లు కనిపిస్తుంది ... ఎందుకంటే

అది ఎన్నో స్వరాలు, ఎన్నో పరస్పర విరుద్ధ స్వరాలతో ఏర్పరచబడినది. ఎవరో అంటారు, "నువ్వు అందంగా ఉన్నావు," మరి మరొకరెవరో అంటారు, "నువ్వా? అందంగానా ? నీ ముఖాన్ని అద్దంలో చూసుకో !" రెండు స్వరాలూ లోనికి తీసుకోబడ్డాయి ... ఒక ద్వంద్వత సృష్టించబడుతుంది. ఎవరో అంటారు, "నువ్వు ఎంతో వివేకవంతుడివి," మరి వేరెవరో అంటారు, "ఇంతటి మూర్ఖుడిని నేను ఎన్నడూ చూడలేదు !" రెండు స్వరాలూ లోనికి తీసుకోబడ్డాయి, రెండూ సమీకరించబడ్డాయి. ఒక గొప్ప అసౌఖ్యం కలుగుతుంది, ఒక లోతైన చీలిక కల్పించబడుతుంది.

ఇందువలనే, మీరు ఎవరు అనేదాని గురించి మీరు నిశ్చయంతో లేరు. మీరు అంతగా అభిప్రాయాల సమూహాన్ని పోగుచేసుకున్నారు. మీరు ఎన్నెన్నో అద్దాలలో చూశారు, మరి ప్రతి ఒక్కటీ మీకు ఓ విభిన్న సందేశాన్ని ఇచ్చింది. దర్పణాలు మీ గురించిన సందేశాన్ని కలిగివుండవు, వాటి సందేశం వాటి గురించినదే అయివుంటుంది.

మీరు పొడవుగా కనిపించే అద్దాలను మీరు చూసే ఉంటారు, మీరు లావుగా కనిపించే అద్దాలు, మీరు అత్యంత అందమైనవారుగా కనిపించే అద్దాలు, మీరు అత్యంత వికారంగా కనిపించే అద్దాలు ... మీరు ఒక అష్టావక్రుడిలా అవుతారు. అద్దంలోని ఆ ప్రతిబింబం మీకు చెందినది కాదు. ఆ ప్రతిబింబం అనేది అద్దం యొక్క స్వభావం.

పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు ప్రోగవుతూపోతాయి. మీరు ఈ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాల ప్రోగు అని మీరు విశ్వసించడం ప్రారంభిస్తారు. అందువలనే మీరు ఎల్లప్పుడూ వణికిపోతూ, ఎల్లప్పుడూ భయపడుతూ ఉంటారు. జనాభిప్రాయం పట్ల ఈ భయం, ఎంత లోతైనది ! "ప్రజలు నా గురించి చెడుగా అనుకుంటే ? వాళ్ళు నన్ను ఒక మూర్ఖుడిగా భావిస్తే ? నేను అనైతికమైనవాడిని అని వాళ్ళు అనుకుంటే ? మనం దిగులు చెందుతాం ఎందుకంటే మనం ఇతరులకు అనుగుణంగా మన ఉనికిని మలచుకున్నాం.

గుర్జీఫ్ తన శిష్యులకు చెబుతూ ఉండేవాడు, "మీ ఆత్మను మీరు తెలుసుకోవాలనుకుంటే కనుక, మీరు ఇతరులను వెనుకే వదిలెయ్యాలి." అతను సరిగ్గా చెప్పాడు. శతాబ్దాలుగా గురువులు దీనినే చెబుతున్నారు. మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనుకుంటే కనుక ఇతరుల కళ్ళలో మీ రూపం కోసం చూడడాన్ని మీరు ఆపెయ్యాలి.

నేను చూస్తున్న విధంగా ఎందరో జిజ్ఞాసువులు, సత్యాన్వేషణకులు, సమాజంలో ఉండగా సత్యాన్ని తెలుసుకోవడం అనేది అసాధ్యం కావడం వలన సమాజాన్ని వదిలెయ్యలేదు. కానీ సమాజంలో ఉండగా తమ స్వంత ముఖాన్ని సరిగ్గా తెలుసుకోవడం అనేది అత్యంత కష్టతరం కావడం వలన సమాజాన్ని వదిలేశారు. ఇక్కడ ప్రజలు మీరు ఎవరు అనేదాని గురించి అభిప్రాయాలను వెల్లడి చేస్తూనే ఉంటారు. మీరు అడిగినా లేదా అడగకపోయినా, అన్నివైపుల నుంచి మీరు ఎవరు అనేదాని గురించిన చిత్తరువులు కుమ్మరించబడుతూనే ఉంటాయి. మరి రాను రానూ మనం ఈ చిత్తరువులకు అనుగుణంగా జీవించడం ప్రారంభిస్తాం.

నేను విన్నాను : ఒక రాజకీయవేత్త మరణించాడు, అతను మరణించగానే, రెండు సంవత్సరాల క్రితం మరణించిన అతని భార్య ... అతనిని మరో ప్రపంచపు ప్రవేశ ద్వారం వద్ద స్వాగతించింది. కానీ ఆ రాజకీయవేత్త అన్నాడు, “ నేను ఇప్పుడే ప్రవేశించను. నా శవవాహనంతో పాటుగా జాతీయ దహన నాటిక వద్దకు నన్ను వెళ్ళనివ్వు.”

భార్య అంది, “ ఇప్పుడు ఉపయోగమేముంది ? ఆ శరీరం అక్కడ పడివుంది ... అది మట్టి.”

అతను జవాబిచ్చాడు, “ అది మట్టి కాదు. నాకు వీడ్కోలు పలుకడానికి ఎంతమంది ప్రజలు వచ్చారో నన్ను చూడనివ్వు.”

ఆ రాజకీయవేత్త మరి అతని భార్య ఆ శవయాత్రతో పాటుగా నడవడం ప్రారంభించారు. వాళ్ళను ఎవ్వరూ చూడలేరు, కానీ వాళ్ళు చూడగలరు... అక్కడ ఒక మహా సమూహం ఉంది. పాత్రికేయులు మరి ఫోటోగ్రాఫర్లూ ఉన్నారు. పతాకాలు అవనతం చేయబడ్డాయి. సైనిక శకటం పై వచ్చిన శవపేటికపై పువ్వులు గుట్టలుగా పోయబడ్డాయి. గొప్ప గౌరవం కనబరచబడుతోంది. ఆ శవవాహనానికి ముందు మరి వెనుక తుపాకీలు ఉన్నాయి. మరి ఆ శవయాత్రను సైనికులు అనుసరిస్తున్నారు. ఆ రాజకీయవేత్త ఎంతగానో కదిలిపోయాడు.

భార్య అడిగింది, “ నువ్వు ఎందుకంత సంతోషంగా ఉన్నావు ? ” అతను అన్నాడు, “ నేను మరణించినప్పుడు ఇంతమంది ప్రజలు వస్తారని నాకు తెలిసివుంటే కనుక, నేను ఇంకా ముందుగానే మరణించి వుండేవాడిని. నేను మరింత ముందుగానే మరణించి వుండాల్సింది; ఇన్ని సంవత్సరాలు నేను ఎందుకు నిరీక్షించాను ? కానీ నేను మరణించినప్పుడు ఇటువంటి మహా సమూహం వచ్చేందుకే నేను జీవించాను.”

ప్రజలు సమూహం కోసమే జీవిస్తారు, ప్రజలు సమూహం కోసమే మరణిస్తారు.

ఇతరులు ఏమి చెబుతున్నారు అనేది ఎంత ప్రధానమైనది అయిపోయిందంటే మీరు ఎవరు అనేది మీరు కనీసం అడగనైనా అడగరు. ఇతరులు ఏముంటున్నారు అనేదాని గురించిన కత్తిరింపులను మీరు సేకరిస్తారు మరి మీ స్వీయ-చిత్తరువును తయారు చేసుకుంటారు. ఈ చిత్తరువు అత్యంత అస్థిరమైనది అయితీరుతుంది. ఎందుకంటే ప్రజల యొక్క మనస్సులు మారిపోతూండడమే కాదు, వాళ్ళ కారణాలు కూడా మారిపోతూనే వుంటాయి.

ఎవరో మీ వద్దకు వస్తారు మరి అంటారు, " నువ్వు అత్యంత నీతివంతుడివి." ఇది కేవలం పొగడ్తే తప్ప మరేమీ కాదు. మిమ్మల్ని ఎవ్వరైనా ఒక నీతివంతమైనవాడిగా పరిగణిస్తారా ? తనను తాను తప్ప ఇతరులు ఎవరినీ ఇక్కడ ఉన్నవారు నీతివంతులుగా పరిగణించరు. మీ గురించి మీరు ఆలోచించండి ... మరెవరినైనా నీతివంతులుగా మీరు పరిగణిస్తారా ? కొన్నిసార్లు మీరు అలా చెప్పవలసి వస్తుంది, అది వేరే సంగతి. అవసరాలు ఉంటాయి, జీవిత సమస్యలు, ఒక అబద్ధాన్ని సత్యమని మీరు నొక్కి చెప్పాల్సి వస్తుంది, ఒక దుష్టుడిని మంచివాడని పిలువవలసి వస్తుంది, ఒక కురూపిని అందమైనవాడని పొగడవలసి వస్తుంది. మీరు పొగడ్తను అవలంబించాల్సి వస్తుంది. సరిగ్గా ఇందువలనే పొగడ్తకు అంత విలువ ఇవ్వబడుతుంది.

ప్రజలు పొగడ్తల వలలో ఎందుకు పడిపోతుంటారు ? అత్యంత మూర్ఖుడైన వ్యక్తికి అతను ఓ మేధావి అని మీరు చెప్పినా కూడా అతను దానిని నిరాకరించడు, ఎందుకంటే అతని గురించి అతనికి ఏ అభిప్రాయమూ లేదు. మీరు ఏమి చెప్పినా అతను దానిని వింటాడు, మీరు ఏమి చెప్పినా అతను అది అవుతాడు.

కనుక కారణాలు మారుతూపోతాయి. ఒకరు అందమైనవారు అని అంటారు. ఒకరు కురూపి అని అంటారు. ఒకరు మంచి అని అంటారు, మరొకరు చెడు అని అంటారు – ఇది ప్రోగవుతూ పోతుంది. మరి ఈ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాల పునాదిపై మీరు మీ ఉనికి రూపాన్ని ఏర్పరచుకుంటారు. ఎద్దులు దానిని అన్నివైపులకూ లాగడానికి ప్రయత్నిస్తున్న ఓ ఎడ్ల బండిపై మీరు స్వారీ చేస్తున్నారు, మరి ఆ బండి ఒకేసారి అన్ని దిక్కులకూ వెళ్ళడానికి ప్రయత్నిస్తోంది. మీరు పూర్తిగా అలసిపోతారు. మీరు కేవలం ఈడ్చబడతారు. మీరు ఎక్కడికీ చేరుకోరు, మీరు కదలలేరు.

ఈనాటి మొదటి సూత్రం చెబుతుంది :

అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు,
వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి.

వ్యక్తి గమనించేవాడే అయివున్నాడు, గమనించబడేవాడు కాదు.

మూడు రకాల ప్రజలు ఉన్నారు. చూడదగిన వస్తువులుగా తయారైపోయిన వారు, ప్రదర్శకులు ... వాళ్ళు గాఢాంధకారంలో ఉన్నారు... చూపరులుగా తయారైనవారు రెండవవారు. వాళ్ళు మొదటి రకం కన్నా కొద్దిగా మెరుగైనవారు, కానీ పెద్ద వ్యత్యాసం లేదు. గమనించేవారుగా అయినవాళ్ళు మూడవవారు. ఈ మూండింటినీ స్పష్టంగా అవగాహన చేసుకోవడం మంచిది.

మీరు గమనించబడేవారు అయినప్పుడు, మీరు ఒక వస్తువు అవుతారు ; మీరు మీ ఆత్మను కోల్పోయారు. ఒక రాజకీయ నాయకుడిలో ఆత్మను కనుగొనడం అనేది కష్టతరమైనది. ఒక నటుడిలో ఆత్మను కనుకోవడం అనేది కష్టతరమైనది. అతను ఒక చూడదగిన వస్తువుగా తయారయ్యాడు, ఒక చూడదగిన వస్తువుగా ఉండడానికే అతను జీవిస్తాడు. అతని ప్రయత్నమంతా ప్రజలను మెప్పించడానికే : మంచిగా ఎలా కనిపించాలి, అందంగా ఎలా కనిపించాలి, అది అత్యుత్తమంగా ఉండడం కోసం చేసే ప్రయత్నం కాదు, కేవలం అత్యుత్తమంగా కనిపించడానికి చేసే ప్రయత్నమే. గమనించబడేవారుగా అయినవారు వంచకులుగా తయారవుతారు. అతను తన ముఖాన్ని ఓ ముసుగుతో కప్పుకుంటాడు. అతను ఒక చక్కని బాహ్య ప్రదర్శనను సమర్పిస్తాడు కానీ లోపల కుళ్ళిపోతూ వున్నాడు.

రెండవవారు చూపరులుగా తయారైనవాళ్ళు. వాళ్ళు విస్తారమైన సమూహం. సహజంగానే, మొదటి రకం వారికి రెండవ రకం ప్రజలు అవసరం ; లేదంటే, ప్రజలు ప్రదర్శకులు ఎలా కాగలరు ? ఎవరో ఒక రాజకీయవేత్తగా అవుతాడు, తన కోసం చప్పట్లు కొట్టడానికి అతనికి సమూహం లభిస్తుంది. వారి మధ్య ఒక గొప్ప సమ్మతి వుంది. ఒక నాయకుడికి అనుచరులు అవసరం. ఎవరైనా నాట్యం చేస్తున్నట్లయితే, చూసేవాళ్ళు అవసరం. ఎవరైనా పాడినట్లయితే, వినేవాళ్ళు అవసరం ; అందువలనే కొంతమంది తమనుతాము ప్రదర్శకులుగా నిమగ్నం చేసుకుంటారు మరి కొందరు చూపరులుగా ఉంటారు. చూపరులు విస్తారమైన సమూహం.

పాశ్చాత్య మనో వైజ్ఞానికులు ఎంతో కలత చెందుతున్నారు. ఎందుకంటే ప్రజలు ఒట్టి చూపరులుగా తయారవుతున్నారు. వాళ్ళు చలన చిత్రాలకు వెళతారు, రేడియో వింటారు, లేదా గంటల తరబడి టెలివిజన్ ముందు కూర్చుంటారు. అమెరికాలో, సగటు మనిషి దాదాపు రోజుకు ఆరుగంటలు టీవీ చూస్తూ గడుపుతాడు.

ఫుట్‌బాల్ ఆట ఉన్నట్లయితే, వాళ్ళు అది చూస్తారు ; ఒక కుస్తీ పోటీ ఉంటే, వాళ్ళు దానిని చూస్తారు. ఒక బేస్ బాల్ ఆట లేదా ఒలంపిక్స్, వాళ్ళు అది చూస్తారు. ఇప్పుడు వాళ్ళు ఒట్టి చూపరులుగా తయారయ్యారు, రోడ్డు ప్రక్కన నిలబడి చూసేవాళ్ళు: జీవితపు ఊరేగింపు సాగిపోతుంది మరి మీరు చూస్తూనే ఉండిపోతారు.

ఊరేగింపులో కలిసినవాళ్ళు కొంతమంది ఉన్నారు. అది కఠినమైనది. ఎంతో పోటీ వుంది. ఊరేగింపులో కలవడం అనేది సులభం కాదు. ఎంతో పోరాటం మరి ఉగ్రత్వం అవసరమవుతాయి. కానీ ఆ ఊరేగింపును చూడడానికి చూపరులు కూడా అవసరం. వాళ్ళు ప్రక్కలకు నిలబడి వుంటారు చూస్తారు. వాళ్ళు అక్కడ లేనట్లయితే, ఊరేగింపు కూడా మాయమైపోతుంది.

ఊహించండి, అనుచరులు రాకపోతే కనుక, నాయకులకు ఏమవుతుంది ? "మన జెండాను పైకెగురనివ్వండి !" అని ఏకాకిలా అరుస్తూ, వాళ్ళు గొప్ప మూర్ఖులలా కనిపిస్తారు, వాళ్ళు పిచ్చివాళ్ళలా కనిపిస్తారు. కనుక చూపరులు అవసరం, ఒక సమూహం అవసరం, అప్పుడు ఉన్మాదం సైతం సరైనదిగానే కనిపిస్తుంది. ఒక క్రికెట్ మ్యాచ్ నడుస్తూ ఉండి మరి దానిని చూడడానికి ఎవ్వరూ రాకపోవడాన్ని ఊహించండి. ఆ మ్యాచ్ మృతమైనదవుతుంది. మ్యాచ్‌లోని రసం స్వయంగా ఆ మ్యాచ్‌లోనే లేదు, దానిని చూడడానికి పోగయ్యే వేలాది మందిలో అది వుంది.

మానవుడు విచిత్రమైనవాడు ! అతను గుర్రపు పందేలను చూడడానికి కూడా వెళ్తాడు. ఈ కోరేగావ్ పార్క్ ప్రదేశమంతా గుర్రపు పందేల అభిమానులతో నిండి వుంది. అది అత్యంత విచిత్రమైనది ... మానవుల పరుగును చూడడానికి ఏ గుర్రమూ వెళ్ళదు. గుర్రాలు పరుగెత్తుతాయి మరి మానవులు దానిని చూసేందుకై వస్తారు. మానవుడు గుర్రాల కన్నా దిగువకు పడిపోయాడు.

జీవితం చూస్తూండడంతోనే గడుపబడుతుంది, కేవలం చూడడం. చూసేవాళ్ళు... మీరు ప్రేమించరు, మీరు చలనచిత్రాలలో ప్రేమ కలాపాలను చూస్తారు. మీరు నాట్యం చెయ్యరు, మరెవరో నర్తిస్తుంటే మీరు చూస్తారు. మీరు పాడరు, మరెవరో పాడుతుంటే మీరు వింటారు. మీ జీవితం నపుంసకమైనదైతే, జీవశక్తి సమస్తమూ పోయినట్లయితే అందులో ఆశ్చర్యమేముంది ? మీ జీవితంలో ఏ కదలికా లేదు. ఏ శక్తి ప్రవాహమూ లేదు. మీరు ఒక శవంలా కూర్చుని వుంటారు. చూస్తూండడమే మీ ఏకైక కార్యక్రమం. ఎవరో చూపిస్తూపోతారు, మీరు చూస్తూపోతారు. ఒకరికి ఒకరు బంధింపబడి, ఈ రెండు రకాలైనవారూ ప్రపంచంలో పుష్కలంగా ఉన్నారు.

ప్రతీ రుగ్మతకూ రెండు ధృవాలు ఉంటాయని మనోవైజ్ఞానికులు అంటారు. మనోవైజ్ఞానికులచే మాసోచిస్టులని పిలువబడే ప్రజలు ఉన్నారు ; వాళ్ళు తమను తాము హింసించుకుంటారు. మరి మనోవైజ్ఞానికులచే శాడిస్టులని పిలువబడే మరో రకమూ ఉన్నారు ; వాళ్ళు ఇతరులను హింసించడంలో సంతోషాన్ని పొందుతారు. ఇరువురూ అవసరమే. కనుక, వీరిద్దరూ జతగూడినప్పుడు, అది ఒక గొప్ప నాటకంలోని సన్నివేశంలా తయారవుతుంది. మనోవైజ్ఞానికులు ఏమంటారంటే భర్త ఓ శాడిస్టూ మరి భార్య ఓ మాసోచిస్టూ అయివున్న జంట కన్నా మెరుగైన జంటను మీరు కనుగొనలేరు. ఆ స్త్రీ తనను తాను హింసించుకోవడాన్ని ఆస్వాదిస్తుంది. ఆ భర్త ఇతరులను హింసించడాన్ని అస్వాదిస్తాడు-స్వర్గంలో నిర్ణయించబడిన పెళ్ళి ! ఒకరు గుడ్డివారు, మరొకరు ఓ కుష్టురోగి ... చక్కగా సరిపోయారు, ఒక సరైన అమరిక. ప్రతీ రుగ్మతకూ రెండూ ధృవాభిముఖాలు ఉంటాయి. ప్రదర్శించేవాడు మరి చూసేవాడు ఒకే వ్యాధి యొక్క రెండు ధృవాలు. సాధారణంగా స్త్రీలు చూడబడేందుకు ఇష్టపడతారు. మనోవైజ్ఞానిక శాస్త్రం యొక్క భాషలో స్త్రీలు ప్రదర్శకులు. వారి ఆసక్తి అంతా ఆడంబరాల ప్రదర్శనలోనే ఉంది.

ఒకసారి ముల్లా నసీరుద్దీన్ ఈగలను తోలుతున్నాడు. ఆ చుట్టుపక్కల మరీ ఎక్కువ ఈగలున్నాయి మరి అతని భార్య వాటిని వదిలించమని అతనితో చెప్పింది. అతను అద్దం దగ్గర వాటిని కొడుతూ నిలబడి వున్నాడు. అతను అన్నాడు, " ఇక్కడ కూర్చున్న ఈ రెండు ఆడ ఈగలను చూడు."

భార్య అంది, " ఇది మరి అతిగా వుంది ! ... అవి ఆడవా లేక మగవా అనేవి నీకు ఎలా తెలుసు ?"

అతను జవాబిచ్చాడు, " అవి గంటనుంచీ అద్దం మీదే ఉన్నాయి ... అవి ఆడవే అయివుండాలి. అద్దం మీద మగ ఈగ ఏం చేస్తుంది ?"

స్త్రీలు అద్దం లేకుండా జీవించలేరు. వాళ్ళు ఓ అద్దాన్ని చూసినప్పుడు అది వాళ్ళను అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. వాళ్ళ జీవితమంతా దాని ముందే గడుపబడుతుంది : వస్త్రాలను ప్రయత్నిస్తూ, నగలను వేసుకుని చూస్తూ మరి తమను తాము అలంకరించుకుంటూ. మరి ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పూర్తిగా తయారయ్యి స్త్రీ బయటకు వెళ్ళినప్పుడు, ఆమెను ఎవరైనా గిల్లినట్లయితే ఆమె కోపగించుకుంటుంది ! ఆమెను ఎవ్వరూ వేధించనట్లయితే అప్పుడు కూడా ఆమె దుఃఖితురాలే అవుతుంది ... ఎందుకంటే రెచ్చగొట్టేలా ఉండడానికి, వేధించేలా రెచ్చగొట్టడానికి వింతో సన్నాహం చేయబడింది. లేదంటే ఆ అవసరం ఏముంది ?

స్త్రీలు తమ భర్తల ముందు చక్కగా ముస్తాబై తిరగడం గురించి పట్టించుకోరు. తమ భర్తల ముందు వాళ్ళు, నిఖార్సైన మాంత్రికురాళ్ళలా ఉంటారు. ఎందుకంటే, అతనితో వెంటాడడం మరి మరులుగొలపడం ఎంతో కాలం క్రితమే ఆగిపోయింది. కానీ ఆమె బయటకు వెళ్ళవలసి వస్తే కనుక, ముస్తాబవ్వడానికి ఆమె ఎంతో సమయం తీసుకుంటుంది. ఆమెను చూసేవాళ్ళు వుంటారు, ఆమె వేదికపై వుంటుంది.

మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే పురుషుడు ఇతరులను చూడడం పట్ల అత్యంత ఆసక్తిగలవాడు. చూడడంలోనే అతని కేంద్రీకరణంతా వుంది, చూడడంలోనే అతని ఆసక్తి అంతా వుంది. స్త్రీ చూడడం పట్ల ఆసక్తిని కలిగిలేదు. తనను తాను ప్రదర్శించుకోవడంలోనే ఆమె ఆసక్తిని కలిగివుంది. అందువలనే స్త్రీ–పురుషుల జంట ఒకరికొకరు సరిపోతారు. అక్కడ ఏకకాలంలో రుగ్మత యొక్క రెండు దిశలూ వున్నాయి. మరి రెండు స్థితులూ అనారోగ్యకరమైనవే.

ఒక ద్రష్టగా, ఒక గమనించేవాడుగా ఉండడమే మానవుడి యొక్క స్వభావమని అష్టావక్రుడు చెబుతాడు ; అది ఒక ప్రదర్శకుడిగా లేదా ఓ చూసేవాడిగా ఉండడం కాదు.

ఈ రెండింటి విషయంలోనూ మళ్ళీ ఎన్నడూ గందరగోళపడకండి. ఎన్నోసార్లు ప్రజలు ఈ తప్పిదాన్ని చేయడం నేను చూశాను... వాళ్ళు ఓ చూసేవాడిగా అయినప్పుడు ఓ గమనించేవాడిగా అయ్యామని వాళ్ళు అనుకుంటారు. ఈ రెండు పదాలకూ మధ్య ఒక అత్యంత మౌలికమైన భేదం వుంది. ఈ వ్యత్యాసాన్ని నిఘంటువు చూపకపోవచ్చు. అక్కడ చూసేవాడికీ మరి గమనించేవాడికీ ఒకే అర్థం ఉండవచ్చు. కానీ జీవితపు నిఘంటువులో ఒక గొప్ప వ్యత్యాసం వుంది.

చూసేవాడు అంటే ఇతరులపై కళ్ళు ఉన్నవాడు.

మరి ఓ గమనించేవాడు అంటే తనపైనే కళ్ళు ఉన్నవాడు.

కళ్ళు వస్తువుపై ఉన్నప్పుడు మీరు చూసేవారు అవుతారు, కళ్ళు ద్రష్టపై ఉన్నప్పుడు మీరు గమనించేవారు అవుతారు. అది ఒక విప్లవాత్మకమైన వ్యత్యాసం. అత్యంత మౌలికమైనది. మీ కళ్ళు వస్తువుపై ఆగిపోయి మరి మిమ్మల్ని మీరు మరచిపోయినప్పుడు, అప్పుడు మీరు కేవలం చూసేవారు మాత్రమే. కనిపిస్తున్న వస్తువులన్నీ వెళ్ళిపోయినప్పుడు, మీరు, మరి మీరు మాత్రమే, అక్కడ ఉన్నప్పుడు... కేవలం జాగృతి మిగులుతుంది, కేవలం అప్రమత్తత మిగులుతుంది... అప్పుడు మీరు గమనించేవారు.

మీరు చూసేవారుగా ఉన్నప్పుడు, మీరు పూర్తిగా మరపుగలవారు అవుతారు. మిమ్మల్ని మీరు పూర్తిగా మరచిపోతారు, మీ శ్రద్ధ అక్కడ చిక్కుబడిపోతుంది. మీరు సినిమాలకు వెళతారు, మూడు గంటలపాటు మిమ్మల్ని మీరు మరచిపోతారు, మీరు ఎవరు అనేది కూడా మీకు గుర్తుండదు. మీరు అన్ని దిగుళ్ళు, ఆందోళనలనూ మరచిపోతారు. ఇందువలనే సమూహాలు అక్కడికి పరుగుపెడతాయి. జీవించడంలో ఎంతో దిగులు, ఆందోళన, సమస్య వుంది... మరచిపోయే ఓ పద్ధతి అవసరం. ప్రజలు పూర్తిగా ఏకాగ్రమవుతారు. కేవలం చలనచిత్రాల వద్ద మాత్రమే వారి పూర్తి ధ్యాస కేంద్రీకృతమై వుంటుంది. వాళ్ళు చూస్తారు... వాస్తవానికి ఆ తెరపై ఏమీ లేదు, కేవలం నీడలు అటూ ఇటూ చలిస్తుంటాయి, కానీ ప్రజలు పూర్తి శ్రద్ధతో వుంటారు. వాళ్ళు తమ అస్వస్థతను, తమ ఆందోళనలను, తమ వృద్ధాప్యాన్నీ మరచిపోతారు, మృత్యువు వచ్చినా కూడా వాళ్ళు దాన్ని మరచిపోతారు.

కానీ గుర్తుంచుకోండి, ఆ థియేటరులో మీరు ఓ గమనించే వాడుగా తయారవ్వలేదు ; మీరు ఓ చూసేవాడుగానే తయారయ్యారు. మిమ్మల్ని మీరు మరచిపోయారు, మీరు ఎవరు అనే స్మృతి మీకు లేదు. మీ అంతరంలోనున్న దర్శించడమనే శక్తి యొక్క స్మృతిని అంతటినీ మీరు కోల్పోయారు. మీ ముందు వున్న వస్తువు వద్ద మీరు ఆగిపోయారు, మీరు దానిలో పూర్తిగా మునిగిపోయారు.

చూసేవాడుగా ఉండడం అనేది ఒక విధమైన స్వీయ- విస్మరణ. మరి ఒక గమనించేవాడుగా ఉండడమంటే ఇప్పుడు గమనిక యొక్క వస్తువులన్నీ మాయమైపోయాయి అని అర్ధం. ఆ తెర ఖాళీగా వుంది, ఇప్పుడు దానిపై ఏ చలనచిత్రమూ చలించడం లేదు. ఏ ఆలోచనలూ మిగిలి వుండవు, ఏ మాటలూ మిగిలి వుండవు ; ఆ తెర పూర్తి ఖాళీగా, శూన్యంగా, మెరుస్తూ, తెల్లగా అవుతుంది. చూడడానికి ఏదీ మిగిలిలేదు, కేవలం ద్రష్ట మాత్రమే మిగిలి వుంటాడు. ఇప్పుడు మీ ద్రష్టలోనికి ఒక మునకవేస్తారు. మీరు గమనించేవారు అయ్యారు.

ప్రదర్శకులు, చూసేవారు : మానవాళి ఈ రెండింటికీ మధ్య విభజించబడి వుంది. ఎంతో అరుదుగా ఓ గమనించేవాడు జన్మిస్తాడు ... ఒక అష్టావక్రుడు, ఓ కృష్ణుడు, ఓ మహావీరుడు, ఓ బుద్ధుడు... ఎంతో అరుదుగా ఎవరో జాగృతులవుతారు, గమనించేవారుగా అవుతారు.

అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు...

ఈ సూత్రంలోని సౌందర్యం ఏమిటంటే మీరు గమనించేవారిగా అవ్వగానే మీరు తెలుసుకునేది ఏమిటంటే గమనించేవారు ఒక్కరే వున్నారు, అనేకమంది కాదు.

వస్తువులు అనేకం వుంటాయి, చూసేవారు అనేకులు వుంటారు. అనేకం వుండడం అనేది వస్తువులు మరి చూపరుల యొక్క స్వభావం : అది ఓ అబద్ధాల వల. గమనించేవాడు కేవలం ఒక్కడే. ఉదాహరణకు, చంద్రుడు బయటకు వచ్చాడు, ఒక నిండు చంద్రుడు. నదులలో మరి చిన్న నీటి గుంటలలో, కొలనులలో, మడుగులలో, మహాసాగరంలో, ఏరులలో ... అన్నిచోట్లా అది ప్రతిబింబిస్తుంది. ఆ ప్రతిబింబాలన్నీ లెక్కిస్తూ మీరు భూమి అంతా సంచరిస్తే కనుక ట్రిలియన్ల కొద్దీ వుంటాయి. చంద్రుడు ఒక్కడే, ప్రతిబింబాలు అసంఖ్యాకం. గమనించేవాడు ఒక్కడే, ప్రదర్శకులు అనేకులు వుంటారు, చూసేవారు అనేకులు వుంటారు. వాళ్ళు కేవలం ప్రతిబింబాలే, వాళ్ళు నీడలే.

ఒక వ్యక్తి ఓ ప్రదర్శకుడు లేదా ఓ చూసేవాడుగా ఉండడం నుంచి స్వతంత్రుడు అయినప్పుడు, ప్రదర్శించాలనే లేదా చూడబడాలనే కోరిక లేకుండా వున్నప్పుడు, చూడాలనే కోరిక లేకుండా వున్నప్పుడు, చూడడం, చూపడం అనే వల అసత్యమైనదని అతను తెలుసుకున్నప్పుడు ... ఇక ఆసక్తే లేనప్పుడు, అతను నిస్సంగాన్నీ, కోరిక నుంచి స్వతంత్రాన్ని సిద్ధించుకుంటాడు. మీరు అందంగా వున్నారు, మీరు మంచివారు, మీరు నీతివంతులు అని ఎవరైనా చెప్పాలనే కోరిక ఇక లేదు. మీరు నీతివంతులు అని ప్రజలు అనుకోవాలనే కోరిక మీలో అంతర్గతంగా వున్నా కూడా, మీరు ఇంకా అదే పాత వలలో చిక్కుకునే వున్నారని తెలుసుకోండి. మీరు ధార్మికులు అని ప్రజలు తెలుసుకోవాలని మీ హృదయంలో మీరు కోరుకుంటే కనుక, అప్పుడు మీరు ఇంకా అదే వలలో చిక్కుకునే ఉన్నారు. ప్రపంచం ఇంకా మీతోనే ఉంది. అది మరొక రూపం దాల్చింది, ఒక నూతన వైఖరిని అవలంబిస్తోంది, కానీ అదే పాత వల కొనసాగుతోంది. అదే పురాతన నమూనా కొనసాగుతుంది.

చూడడం ద్వారా మీరు ఏం పొందుతారు ? మీరు ఎంతో చూశారు. మీరు ఏం పొందారు ? ప్రదర్శించడం ద్వారా మీరు ఏమి పొందుతారు ? మీ ప్రదర్శనకు వాస్తవమైనది ఏదైనా మీకు ఎవరు ఇవ్వగలరు ?

ఈ రెండింటినీ ప్రక్కకు పెట్టి, ఈ ద్వంద్వత్వాన్ని ప్రక్కకు పెట్టి మరి గమనించేవాడిలోనికి మునకవేయడం ద్వారా, కేవలం ఒక్కరే ఉన్నారు అనేది కనుగొంటారు ; ఈ నిండు చంద్రుడు కేవలం ఒక్కడే. ఈ మడుగులు, నీటిగుంటలు, సరస్సులు, సరోవరాలలో అది అసంఖ్యాకంగా కనిపించింది. అవి భిన్న దర్పణాలు, కనుక ఎందరో చంద్రుళ్ళు ఉన్నట్లుగా కనిపించింది.

నేను విన్నది ఏమిటంటే ఒక మహారాజు అద్దాలతో ఒక సౌధమంతటినీ నిర్మించాడు. అతను లోపల అద్దం తరువాత అద్దాన్ని ఉంచాడు మరి అది ఓ అద్దాల సౌధంగా తయారయ్యింది. ఒకసారి, ఓ కుక్క... రాజుగారి స్వంత కుక్క... రాత్రివేళ దానిలో పెట్టి మూసివేయబడుతుంది. పొరపాటున అది లోపల వదిలివేయబడింది. మీరు ఆ కుక్క పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు... అది ఒక మానవుడి స్థితిలాంటిదే. అది చుట్టూ చూసింది. మరి కుక్కలు తప్ప ఏమీ కనిపించలేదు. ప్రతి అద్దంలోనూ ఓ కుక్క. అది మొరిగింది ... దానికి వెర్రెత్తిపోయింది !

ఒక మానవుడు భయపడినప్పుడు అతను ఇతరులను కూడా భయకంపితులను చేయాలని అనుకుంటాడు. బహుశా ఇతరులు కూడా భయపడితే తన భయం కొంత తగ్గుతుందని అతను అనుకుంటాడు.

ఆ కుక్క మొరిగింది, కానీ సహజంగానే అక్కడ కేవలం అద్దాలు మాత్రమే ఉండడం వలన, అద్దం తరువాత అద్దంలో కుక్కలు తిరిగి మొరిగాయి. ఆ ధ్వని దాని వద్దకు తిరిగి వచ్చింది... అది తన స్వంత ప్రతిధ్వని. అది రాత్రంతా మొరిగింది, పరుగెత్తింది, అద్దాలపై దాడి చేసింది, మరి తన స్వంత రక్తంతో అది తడిసిపోయింది. అక్కడ మరెవరూ లేరు, అది ఒంటరిగా వుంది. అది ఉదయానికి చనిపోయి కనిపించింది. ఆ ప్రదేశమంతటా రక్తపు మరకలు ఉన్నాయి. దాని కథ మనిషి యొక్క కథే.

ఇక్కడ మరొకరెవరూ లేరు. మరొకరు అనేవారు ఉండరు. కేవలం ప్రేమే ఉంటుంది. ఇక్కడ కేవలం ఒక్కరే ఉంటారు. కానీ మీ అంతరంగంలోనున్న ఆ ఒక్కడినీ మీరు ఒడిసి పట్టుకోనంతవరకూ ఇది అవగాహనకు రాదు.

అంతటినీ గమనించే ఒక్కడివే నువ్వు, వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి

అష్టావక్రుడు అంటాడు : "... వాస్తవంలో స్వతంత్రుడివి," ఇది కేవలం ఒక కల్పన అని అనుకోవద్దు. మనిషి అత్యంత విచిత్రమైనవాడు : అతను ప్రపంచం వాస్తవమైనదని అనుకుంటాడు మరి ఈ సత్యం యొక్క వివరణలను, కేవలం కల్పనలేనని అనుకుంటాడు. అతను దుఃఖాన్ని వాస్తవమైనదిగా పరిగణిస్తాడు, మరి ఒక ఆనందకిరణం దిగి వస్తే కనుక అతను దానిని ఒక కలగా, ఓ వంచనగా పరిగణిస్తాడు.

ప్రజలు నా వద్దకు వస్తారు, వారు అంటారు, " మేము మహదానందాన్ని అనుభూతి చెందుతున్నాము, కానీ బహుశా అది ఒక భ్రాంతేనేమో అనే సందేహం కలుగుతోంది." వాళ్ళు ఎన్ని జన్మలుగా దైన్యంలో జీవించారంటే ఆనందం అనేది కూడా ఉండగలదు అనే విశ్వాసాన్ని వాళ్ళు పోగొట్టుకున్నారు. ఆనందం అనేది అసాధ్యమైనదిగా కనిపించడం ప్రారంభిస్తుంది. వాళ్ళు విలపించడానికి ఎంతగా అలవాటుపడ్డారంటే, దుఃఖానికి ఎంతగా అలవాటు పడ్డారంటే, జీవితపు ముళ్ళతో ఎంతగా పరిచితులయ్యారంటే వాళ్ళు పువ్వులను చూసినప్పుడు వాళ్ళ కళ్ళను వాళ్ళు నమ్మరు. వాళ్ళు అనుకుంటారు, " ఇది ఒక కల అయివుంటుంది ... ఒక అవాస్తవమైన ఆకాశ పుష్పం ; అది ఉండలేదు, అది ఉండకూడదు."

అందువలనే అష్టావక్రుడు అంటాడు : ".... వాస్తవంలో స్వతంత్రుడివి." ఎవరూ బంధితులై లేరు. బంధనం అనేది అసాధ్యం, ఎందుకంటే కేవలం దివ్యత్వమే వుంది, కేవలం ఒక్కరే వున్నారు. బంధించేది ఏదీ లేదు, బంధితమయ్యేది ఏదీ లేదు. "... వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి." ఇందువలనే అష్టావక్రుడి లాంటి మనిషి అంటాడు, " మీరు కోరుకుంటే కనుక మీరు ఈ క్షణమే స్వతంత్రులు కావచ్చు... ఎందుకంటే మీరు ఇప్పటికీ స్వతంత్రులు. స్వతంత్ర్యాన్ని నిరోధిస్తున్నది ఏదీ లేదు, ఎన్నడూ ఏ బంధనమూ లేదు ... కేవలం మీరు బంధితులు అని మీరు విశ్వసించారు."

నీ బంధనం ఇదే : గమనించేవాడిగా ... నువ్వు మరొకరిని చూస్తావు ... నిన్ను నువ్వు కాదు.

కేవలం ఒకే ఒక్క బంధనం ఉంది : గమనించేవాడిగా, మీరు ఇతరులను పరిగణిస్తారు, మిమ్మల్ని మీరు కాదు. కేవలం ఒకే ఒక్క విముక్తి ఉంది: గమనించేవాడుగా మిమ్మల్ని మీరు తెలుసుకోవడం.

ఈ ప్రయోగాన్ని ప్రయత్నించడం ప్రారంభించండి. మీరు చూస్తున్నారు... మీరు ఒక చెట్టు వద్ద కూర్చుని వున్నారు. మీరు దానిని చూస్తున్నారు. అప్పుడు క్రమక్రమంగా, చెట్టు వైపు చూడడం కొనసాగిస్తూనే, ఆ చెట్టు వైపు చూస్తున్నవాడిని చూడడం మొదలు పెట్టండి ... కేవలం ఒక చిన్న సర్దుబాటు. సాధారణంగా చైతన్యం యొక్క బాణం చెట్టు దిశగా కదులుతుంది. ఈ బాణాన్ని రెండు దిశలలోనూ వెళ్ళనివ్వండి. అది రెండు దిశలలోనూ ఫలాన్ని కలిగి వుండనివ్వండి ... అది చెట్టును చూడాలి మరి అదే సమయంలో చూస్తున్న వాడిని చూడడానికి ప్రయత్నించాలి. ఆ ద్రష్టను మరచిపోకండి.

ఆ ద్రష్టను మరింత మరింతగా పట్టుకోండి. మీరు మళ్ళీ మళ్ళీ చేజార్చుకుంటారు ... అది ఎన్నో జన్మల యొక్క పాత అలవాటు. మీరు చేజార్చుకుంటారు, కానీ దర్శించేవాడిని పట్టుకోవడానికి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి. మరి ఆ ద్రష్ట మీ పట్టులోనికి రాగానే, కొన్నిసార్లు కేవలం క్షణకాలం ... ఆ క్షణంలో అవిదితమైన శాంతి బహిర్గతమవ్వడాన్ని మీరు అనుభూతి చెందుతారు. ఒక ఆశీర్వాదం కురిపించబడింది. ఒక అనుగ్రహ కిరణం దిగి వచ్చింది. అది ఆ విధంగా ఒక క్షణం పాటు సంభవించినట్లయితే కనుక, ఆ క్షణంలో మీరు విముక్తి యొక్క బ్రహ్మానందాన్ని ఆస్వాదిస్తారు. ఈ బ్రహ్మానందం మీ జీవితం యొక్క రుచిని రూపాంతరం చెందిస్తుంది, మీ జీవిత ప్రవాహాన్ని మారుస్తుంది. మీ జీవనదిని మాటలు మార్చలేవు, పవిత్ర గ్రంథాలు రూపాంతరం చెందించలేవు.

అనుభవం రూపాంతరం చెందిస్తుంది, ఆ రుచి రూపాంతరం చెందిస్తుంది.

మీరు ఇక్కడ నేను చెప్పేది వింటున్నారు... ఎవరైనా రెండు విధాలుగా వినవచ్చు. వింటూన్నప్పుడు, కేవలం నేను చెప్పేదానిపైనే మీ ధ్యాస నిమగ్నమై వుండి, మిమ్మల్ని మీరు మరచిపోతే కనుక, అప్పుడు మీరు గమనించేవారు కాదు, వినేవారు కాదు, మీరు వింటున్నదానిని సాక్షిలా వీక్షించడం లేదు. మీ ధ్యాస నాపై చిక్కుకు పోయింది మరి మీరు చూసేవారు అవుతారు. మీరు కేవలం కళ్ళతో మాత్రమే కాదు, చెవులతో సైతం ఓ చూసేవారిగా తయారవుతారు. వస్తువుపై మీ ధ్యాస చిక్కుబడినప్పుడల్లా మీరు చూసేవారు అవుతారు.

వింటూన్నప్పుడు, నేను చెప్పేది వినండి, అదే సమయంలో ఆ ఒక్కడిని కూడా చూస్తూ ఉండండి, అతనిని పట్టుకోండి, అతనిని స్పృశిస్తూ ఉండండి ... వింటున్న ఆ ఒక్కడిని.

నిశ్చయంగానే మీరు వింటున్నారు, నేను మాట్లాడుతున్నాను. కానీ కేవలం వక్తనే గమనించకండి, వినేవాడి జాడను కూడా కనిపెట్టి ఉండండి. అతనిని నిరంతరంగా మళ్ళీ మళ్ళీ గుర్తుంచుకోండి. క్రమక్రమంగా మీరు వినేవాడితో సంబంధంలో ఉన్న క్షణాలు మాత్రమే మీరు నేను చెప్పేది విన్న క్షణాలు అనేది మీరు కనుగొంటారు ; మిగిలినవన్నీ నిరుపయోగమైనవి. వింటున్నవాడితో సంబంధాన్ని కలిగివుండి మీరు విన్నప్పుడు నేను ఏమి చెబుతున్నానో సరిగ్గా దానినే మీరు వింటారు. మరి వింటున్నవాడితో సంబంధం లేకుండా మీరు విన్నప్పుడు, మీరు వినేది ఏమిటో ఎవరికి తెలుసు ? అష్టావక్రుడు గాని నేనుగానీ చెప్పనిది ఏదో మీరు వింటారు.

అప్పుడు మీ మనస్సు అన్ని రకాలైన వలలనూ అల్లుతుంది. మీరు అచేతనమైనవారు. అచేతనంలో మీరు చైతన్యం యొక్క మాటలను ఎలా వినగలరు ?

ఇవి చైతన్యం యొక్క వివరణములు. ఇవి మరో ప్రపంచానికి చెందిన మాటలు. మీరు నిద్రావస్థలో విన్నప్పుడు, ఈ మాటల చుట్టూ మీరు కలలను అల్లుకుంటారు. మీరు ఈ వివరణముల యొక్క వర్ణాన్ని నాశనం చేస్తారు. మీరు దానిపై రంగు పూస్తారు. మీరు మీదైన విధానంలో వాటి అర్థాలను సాగదీస్తారు. మీరు వాటిపై వ్యాఖ్యానిస్తారు, మీ వ్యాఖ్యానంలోనే ఈ అత్యంత అద్వితీయమైన మాటలు ప్రేతాలుగా తయారైపోతాయి. మీ చేతులు కేవలం అష్టావక్రుడి యొక్క ప్రేతాన్ని మాత్రమే తాకుతాయి. మీరు జీవించివున్న అష్టావక్రుడిని చేజార్చుకుంటారు, ఎందుకంటే సజీవుడైన అష్టావక్రుడిని స్పృశించాలంటే మీరు మీలోని గమనించేవాడిని స్పృశించవలసి వస్తుంది. అక్కడే సజీవుడైన అష్టావక్రుడు ఉన్నాడు.

దాని గురించి ఆలోచించండి, మీరు నేను చెప్పేది వింటున్నారు. మీరు వింటూ పోతున్నప్పుడు, వింటున్నవాడిని కూడా వినండి. ఆ బాణాన్ని రెండు మొనలుగలదిగా ఉండనివ్వండి : నా దిశగా మరి మీ దిశగా కూడా. మీరు నన్ను మరచిపోతే కనుక హాని ఏమీ లేదు, కానీ మీరు మరచిపోబడకూడదు. మరి మీరూ మిగిలివుండని, నేనూ మిగిలివుండని ఓ క్షణం వస్తుంది... ఎంతటి ప్రగాఢ శాంతిమయ క్షణమంటే, ఇరువురూ లేనప్పుడు, కేవలం ఒక్కరే మిగిలివుంటారు. మాట్లాడుతున్నవారూ మీరే, వింటున్నవారూ మీరే. వీక్షిస్తున్నవారూ మీరే, వీక్షించబడుతున్నవారూ మీరే. అష్టావక్రుడు సూచిస్తున్న ఆ క్షణం ఇదే :

... అంతటినీ గమనించే ఒక్కడివి, వాస్తవంలో ఎల్లప్పుడూ స్వతంత్రుడివి.

బంధనం అనేది స్వప్న సదృశమైనది. ఈ రాత్రి మీరు పూణెలో నిదురిస్తారు, కానీ మీ నిద్రావస్థలో మీరు కలకత్తాలో ఉండవచ్చు, మీరు ఢిల్లీలో ఉండవచ్చు, ఖాట్మండూలో ఉండవచ్చు ... మీరు ఎక్కడైనా ఉండవచ్చు. ఉదయం మీరు నిద్ర లేచినప్పుడు మిమ్మల్ని మీరు మళ్ళీ పూణెలోనే కనుగొంటారు. మీ కలల్లో మీరు ఖాట్మండూ వెళితే కనుక, తిరిగి రావడానికి మీరు విమానంలో ప్రయాణించాల్సిన అవసరం లేదు, ఓ ట్రైను పట్టుకోవలసిన అవసరం లేదు, కాలి నడకనా తిరిగి రానవసరం లేదు. మీరు అసలు ప్రయాణించవలసిన అవసరమే లేదు. ఉదయం మీ కళ్ళు తెరుచుకుంటాయి. మిమ్మల్ని మీరు పూణెలో కనుగొంటారు. మీరు ఎన్నడూ

ఎక్కడికీ వెళ్ళనేలేదు అనేది ఉదయాన మీరు కనుగొంటారు. మీరు మీ కలల్లో ఎక్కడికో వెళ్ళారు, కానీ కలల్లో ఎక్కడికైనా వెళ్ళడమనేది నిజంగా వెళ్ళడమా ?

నీ బంధనం ఇదే : గమనించేవాడిగా ... నువ్వు మరొకరిని చూస్తావు ... నిన్ను నువ్వు కాదు.

కేవలం ఒకే ఒక్క బంధనం ఉంది : మనకు మన గురించిన చైతన్యం లేదు, మనలోని గమనించేవాడి గురించిన చైతన్యం మనకు లేదు.

ఇది ఈ సూత్రం యొక్క ఒక అర్థం ; పరిగణించదగినదైన మరొక అర్థం కూడా వుంది. అష్టావక్రుడి గురించి వ్రాసినవారు ఎవ్వరైనా సామాన్యంగా దానికి ఈ అర్థాన్ని ఇచ్చారు, కనుక మరొక అర్థాన్ని కూడా అవగాహన చేసుకోవడమనేది అవసరం. రెండవ అర్థం కూడా సరైనదే. రెండూ కలిసి సరైనవే అవుతాయి.

నీ బంధనం ఇదే : గమనించేవాడిగా ... నువ్వు మరొకరిని చూస్తావు ... నిన్ను నువ్వు కాదు.

మీరు నేను చెప్పేది వింటున్నారు ; చెవులు వింటున్నాయని మీరు అనుకుంటారు. మీరు నా వైపు చూస్తున్నారు ; కళ్ళు చూస్తున్నాయని మీరు అనుకుంటారు. కళ్ళు ఎలా చూస్తాయి ? గమనిస్తున్నది కళ్ళే అని మీరు అనుకుంటే కనుక మీరు పొరబడ్డారు. చూసేవాడు ఆ కళ్ళ వెనుక ఉన్నాడు. వినేవాడు ఆ చెవుల వెనుక ఉన్నాడు. మీరు నా చేతిని స్పృశిస్తే కనుక, మీ చెయ్యి నా చేతిని స్పృశిస్తోంది అని మీరు అనుకుంటారు. అది తప్పు, స్పృశిస్తున్నవాడు ఆ చెయ్యి లోపల దాగి వున్నాడు ; చెయ్యి ఎలా స్పృశించగలదు ?

మీరు రేపు మరణిస్తే కనుక ఆ మృతకళేబరం ఇక్కడ పడివుంటుంది. ఆ చేతిని పట్టుకుని ప్రజలు కూర్చుని వుంటారు కానీ స్పృశించబడడానికి ఆ శరీరంలోపల ఎవ్వరూ ఉండరు. ఆ మృతదేహం అక్కడ పడుకుని వుంటుంది, ఆ కళ్ళు ఇంకా తెరుచుకునే ఉంటాయి ; ప్రతీదీ చూడబడుతున్నట్లుగానే కనిపిస్తుంది కానీ ఏదీ చూడబడదు. ఆ శవం అక్కడ పడివుంటుంది... అక్కడ సంగీతం ఉండవచ్చు. వాద్యమేళం మ్రోగిస్తుండవచ్చు, శబ్ద తరంగాలు చెవులను తాకుతాయి, ప్రకంపనాలు మిమ్మల్ని చేరుతాయి, కానీ ఏదీ వినిపించదు. వింటూండేవాడు, చూసినవాడు, స్పృశించినవాడు, రుచి చూసినవాడు ... అతను వెళ్ళిపోయాడు.

అనుభవించేవాడు ఇంద్రియాలు కాదు, కానీ బదులుగా ఆ ఇంద్రియాల మరుగున దాగివున్నవాడు ...

ఈ సూత్రం యొక్క మరో అర్థం ఏమిటంటే మిమ్మల్ని మీరు ఓ శరీరంగా కాక, కళ్ళుగా, చెవులుగా, ఇంద్రియాలుగా కాక, గమనించేవారుగా తెలుసుకోవడం. కేవలం అంతర్గత చైతన్యాన్నే గమనించేవాడిగా తెలుసుకోండి.

"నేనే కర్తను," ఇలాగే అహం అనే నల్లత్రాచు నిన్ను కాటు వేసింది. "నేను కర్తను కాను," విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి మరి ఆనందంగా ఉండు.

"నేనే కర్తను," ఇలాగే అహం అనే నల్లత్రాచు నిన్ను కాటువేసింది. మన నమ్మకమే అంతా. నమ్మకం యొక్క కలల్లోకి మనం పడిపోయాం. మన గురించి మనం ఏది నమ్మితే మనం అదే అవుతాం. ఈ భావన ఎంతగానో ఆలోచనలను రేకెత్తించేది. ప్రాగ్దిశ అనుభవం యొక్క మూలసారమే ఇది : మన గురించి మనం ఏమి నమ్ముతామో, అదే మనమవుతాము.

ఒక హిప్నాటిస్టు తన ప్రదర్శనను ఇస్తున్నప్పుడు మీరు ఎప్పుడైనా చూస్తే కనుక, మీరు ఆశ్చర్యచకితులవుతారు. అతను ఒక పురుషుడిని హిప్నటైజ్ చేస్తున్నట్లయితే, అప్పుడు హిప్నసిస్‌లో ఉండగా అతనికి చెబుతాడు, "నువ్వు ఒక స్త్రీవి ... లేచి నిలబడు మరి నడువు." ఆ పురుషుడు ఓ స్త్రీలాగా నడవడం మొదలు పెడతాడు. ఒక స్త్రీలాగా నడవడం అనేది పురుషుడికి అత్యంత కష్టతరం. దాని కోసం, ఒక నిర్దిష్ట శరీరాకృతి అవసరం. ఒక స్త్రీలాగా నడవాలంటే గర్భాశయం కోసం ఖాళీ ప్రదేశాన్ని కలిగివున్న ఓ ఉదరం అవసరమవుతుంది ; లేదంటే ఎవరైనా ఓ స్త్రీలాగా నడవలేరు. లేదా ఎవ్వరైనా దానిని ఓ సుదీర్ఘ అభ్యాసం అనంతరం మాత్రమే చేయగలరు. కానీ ఒక హిప్నాటిస్టు ఓ పురుషుడిని నిద్రావస్థలోకి పంపి మరి హిప్నాసిస్‌లో అతనికి "లేచి నిలబడు ! నువ్వు ఒక స్త్రీవి. ఓ పురుషుడివి కాదు– నడువు !" అని చెప్పినప్పుడు, అతను ఒక స్త్రీలాగా నడుస్తాడు.

లేదా అతను ఒక ఉల్లిపాయను అతని చేతికి ఇచ్చి మరి అనవచ్చు, "ఇదిగో ఒక ఆపిల్ ... కానివ్వు మరి దానిని తిను". అతను ఆ ఉల్లిపాయను తింటాడు. దాని రుచి ఎలా ఉందని మీరు అతనిని అడిగితే కనుక అది చాలా బావుందని అతను చెబుతాడు ! అది ఒక ఉల్లిపాయ అని అతను కనీసం అనుమానించలేదు ... అతను దాని వాసనను చూడలేదు.

హిప్నాటిస్టులు దీని అనుభవాన్ని పొందారు, మరి ఇప్పుడు అది ఒక శాస్త్రీయమైన వాస్తవం. దానిపై ఎన్నో ప్రయోగాలు జరిగాయి. అచేతనంగా వున్న, హిప్నటైజ్ అయిన వ్యక్తి యొక్క చేతిని పైకి ఎత్తండి మరి దానిలో ఒక మామూలు రాయిని పెట్టండి. అది ఒక కాలుతున్న బొగ్గు అని అతనికి చెప్పండి, మరి అతను దానిని ఒక్క ఉదుటున విసిరి పారేస్తాడు, "నా చేయి కాలిపోయింది !" అని అరుస్తాడు. అది కేవలం ఇంతవరకే వెళితే ఫరవాలేదు, కానీ అతని చేతిపై ఒక బొబ్బ ఏర్పడుతుంది !

నిప్పులపై నడిచేవారి గురించి మీరు వినే వుంటారు. ఇది కూడా ఒక ప్రగాఢమైన హిప్నసిస్ స్థితే. మీకు కాలదు అని మీరు నమ్మితే కనుక, ఆ నిప్పు మిమ్మల్ని కాల్చదు. అది నమ్మకానికి సంబంధించినది. కొద్దిపాటి అనుమానం ఉన్నట్లయితే, సమస్య ఉంటుంది ... మీరు దహించబడతారు. ప్రజలు ధైర్యాన్ని అనుభూతి చెంది మరి సులువుగా నిప్పులపై నడిచిన సంఘటనలు ఎన్నో వున్నాయి : "ఇంతమంది నడుస్తున్నప్పుడు, మనం కూడా నడువగలం." కానీ ఎవరిలోనైనా అనుమానపు పురుగు ఉన్నట్లయితే, అతను దహించబడతాడు.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వద్ద దీనిపై ఒక ప్రయోగం జరిగింది. నిప్పులపై నడవడానికి శ్రీలంకకు చెందిన కొందరు బౌద్ధ సన్యాసులు ఆహ్వానించబడ్డారు. ప్రతీ సంవత్సరం బుద్ధ పౌర్ణమి నాడు బుద్ధుని సంస్మరణార్థం వాళ్ళు నిప్పులపై నడుస్తారు. ఇది పూర్తిగా సరైనదే. బుద్ధుడి సంస్మరణార్థం నిప్పులపై నడవడం అనేది సరైనదే ఎందుకంటే బుద్ధుడి బోధన సమస్తమూ ఏమిటంటే మీరు శరీరం కాదు.

మనం శరీరం కాకపోతే కనుక, అప్పుడు అగ్ని మనల్ని ఎలా దహించగలదు ? గీతలో కృష్ణుడు చెబుతాడు, "అగ్ని నిన్ను దహించలేదు, అస్త్రాలు నిన్ను ఛేదించలేవు." కనుక శ్రీలంకలో బుద్ధ పౌర్ణమి రోజు ఎందరో సన్యాసులు నిప్పులపై నడుస్తారు.

వారిలో కొందరు ఆక్స్‌ఫర్డ్‌కు ఆహ్వానించబడ్డారు మరి వాళ్ళు అక్కడ కూడా నిప్పులపై నడిచారు. వాళ్ళు ఆక్స్‌ఫర్డ్ వద్ద నిప్పులపై నడుస్తున్నప్పుడు ఒక సన్యాసి దహించబడ్డాడు. దాదాపు ఇరవైమంది సన్యాసులు నడిచారు ... మరి కేవలం ఒకే ఒక్కడికి కాలింది, అది ఎలా జరిగింది అనేది కనుగొనడానికి దానిపై పరిశోధన జరిగింది. ఆ సన్యాసి కేవలం ఇంగ్లాండును చూడడానికి వచ్చాడు, తాను నిప్పులపై నడువగలననే నమ్మకం అతనికి లేదు. అతని ఉద్దేశ్యం మరేదో అయివుంది, అతను కేవలం ఒక పర్యాటకుడిగా వచ్చాడు ; అతను కేవలం ఇంగ్లాండును చూడాలనుకున్నాడు. మరి అతను అనుకున్నాడు, "ఈ పందొమ్మిది మందికీ కాలదర

లేదు ... నేను ఎందుకు కాలుతాను ?" కానీ అంతరంలో ఒక అనుమానపు పురుగు ఉంది మరి అతను కాల్చబడ్డాడు.

అదే రాత్రి మరొక సంఘటన జరిగింది. ఒక ప్రొఫెసర్ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయపు ప్రొఫెసర్, కూర్చుని చూస్తున్నాడు. అతను నిప్పులపై నడవడం గురించి ఎన్నడూ వినలేదు, ఎన్నడూ చూడలేదు. అతను చూశాడు మరి ఎంత నమ్మకాన్ని అనుభూతి చెందాడంటే అతను లేచి నిలబడ్డాడు మరి నిప్పులపై నడవడం మొదలుపెట్టాడు. అతను ఓ బౌద్ధుడు కాదు, మతపరమైనవాడు కాదు ... అతనికి ఏమీ తెలియదు. అతను కేవలం అంతమంది ప్రజలు నడవడం చూశాడు మరి అతను అనుభూతి చెందాడు ... ఆ అనుభూతి ఎంత లోతుల నుంచి వచ్చిందంటే, ఆ విశ్వాసం ఎంత దృఢమైనదిగా అయ్యిందంటే ప్రగాఢ పారవశ్యంలో అతను లేచి నిలబడ్డాడు మరి ఆ నిప్పు కణికలపై నాట్యం చేయడం మొదలుపెట్టాడు.

ఆ సన్యాసులు ఆఘాతానికి గురయ్యారు ఎందుకంటే బుద్ధుడు తమను కాపాడుతున్నాడు అనే భావనలో వారున్నారు. ఈ మనిషి బౌద్ధుడు కాదు. అతను ఆంగ్లేయుడు, మరి కనీసం మతపరమైనవాడు కూడా కాదు. అతను చర్చ్‌కు వెళ్ళడు, కనుక జీసస్ అతని గురించి పట్టించుకోడు. అతనికి బుద్ధుడితో ఏ నిమిత్తమూ లేదు, అతనికి అసలు గురువు అనేవాడే లేదు... కేవలం విశ్వాసం.

ప్రగాఢ విశ్వాసంలో, విశ్వాసం తనను తాను నెరవేర్చుకుంటుంది.

" నేనే కర్తను ", ఇలాగే అహం అనే నల్లత్రాచు నిన్ను కాటు వేసింది.
" నేను కర్తను కాను," విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని
పానం చెయ్యి, ఆనందంగా ఉండు.

ఈ వివరణను వినండి : అష్టావక్రుడు మళ్ళీ మళ్ళీ చెబుతాడు : " ఆనందంగా ఉండండి." అది ఈ క్షణమే సంభవించగలదు అని అతను చెబుతున్నాడు !

" ***నేనే కర్తను.*** " ఇది మన ప్రసరణ మరి ఈ ప్రసరణకు అనుగుణంగానే మనం మన అహాన్ని సృష్టించుకుంటాం. కర్త అంటే అహమే. " **నేనే కర్తను** "... దీని నుంచి మనం అహాన్ని సృష్టించుకుంటాం, కనుక కర్త ఎంత గొప్పవాడుగా ఉంటే, అహం అంత గొప్పదిగా ఉంటుంది. మీరు ఎన్నడూ ప్రత్యేకమైనదేదీ చేయకపోతే కనుక, మీరు ఓ గొప్ప అహాన్ని ఎలా కలిగివుండగలరు ? మీరు ఒక గొప్ప సామ్రాజ్యాన్ని సృష్టించుకున్నారు, కనుక మీ అహం యొక్క హద్దులు దాని సరిహద్దుల వరకూ విస్తరిస్తాయి. దీనివలనే, కొందరు పిచ్చివాళ్ళు ప్రపంచాన్ని జయించేందుకు

బయలుదేరారు. ప్రపంచాన్ని జయించడానికి ప్రయత్నించడమా ? దానిని ఎప్పుడైనా ఎవ్వరైనా జయించగలిగారా ? మనుషులు వస్తారు మరి పోతారు ... ప్రపంచాన్ని ఎవరు జయించగలిగారు ?

కానీ ప్రజలు దానిని జయించడానికి ప్రయత్నిస్తారు, తమ అహం ఎంతో విస్తారమైనదనీ, ఈ సమస్త ప్రపంచంకన్నా అది పెద్దదని వారు వాదిస్తారు: " నేను దానిని చుట్టుముడతాను. నేను పొలిమేరలను ఏర్పరుస్తాను, నేను సమస్త విశ్వాన్నీ నిర్వచిస్తాను." అలెగ్జాండర్ మరి నెపోలియన్, తామెర్లేన్ మరి నాదిర్షా ... అందరూ పిచ్చివాళ్ళు ... ప్రపంచాన్ని జయించేందుకు ప్రయత్నించారు. సమస్తం ప్రపంచాన్నీ జయించాలనే ఈ ఆకాంక్ష అహం యొక్క ఆకాంక్ష.

మీరు ఎవరినైనా చూసివుండవచ్చు... అతను ఒక మంత్రి లేదా ముఖ్యమంత్రి అయినప్పుడు, అతను అంగలు వేస్తూ నడువడాన్ని మీరు చూశారా ? తరువాత అతను పదవిలో లేనప్పుడు అతని వైపు చూడండి : పదవిలో లేనప్పుడు అతను ఎంతో దీనస్థితిలో వుంటాడు. అతను అదే మనిషి, కానీ అతని బలం పోయింది. అతనికి ఆ చురుకుదనాన్ని ఇచ్చిన, ఆ గర్వాన్ని ఇచ్చిన, అతని అడుగుకు ఓ తేలికదనాన్ని తెచ్చిన, అతని శిరస్సును ఉన్నతంగా మరి అతని వెన్నును నిటారుగా ఉంచిన ఆ అహం యొక్క విషం ... ఇదంతా పోయింది. ఏమి జరిగింది ? ఒక క్షణం ముందు అతను ఎంతో శక్తిమంతుడిలా కనిపించాడు, ఆ మరుక్షణమే అతను ఎంతో బలహీనుడయ్యాడు. ఒకసారి వారి పదవి పోయిందంటే రాజకీయవేత్తలు ఇక ఎంతో కాలం జీవించరు. వాళ్ళు ఎన్నికలలో గెలుస్తూపోయినంత వరకూ వాళ్ళు దృఢమైనవారుగానే ఉంటారు, కానీ వాళ్ళు ఓడిపోగానే వాళ్ళు శక్తిని కోల్పోతారు.

మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే పదవీవిరమణ చేయనివారి కంటే పదవీ విరమణ చేసినవారు త్వరగా చనిపోతారు. హెచ్చుతగ్గులుగా, పది సంవత్సరాలు వ్యత్యాసం వుంది. ఎనభై సంవత్సరాలు జీవించిన మనిషి, అతను అరవై సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేస్తే కనుక అతను డెబ్భయ్యేళ్ళకే మరణిస్తాడు. మృత్యువు త్వరగా రావడానికి ఏకైక కారణమేమిటంటే ఇక అతను ఎంతమాత్రమూ అధికారంలో లేడు ; ఇక ఎంత మాత్రమూ ఒక కలెక్టరు, ఒక కమీషనరు, ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు లేదా ఒక కానిస్టేబులు లేదా ఒక పాఠశాల ఉపాధ్యాయుడు కూడా కాదు. ఒక పాఠశాల ఉపాధ్యాయుడికి కూడా అతని దురహంకారం ఉంటుంది. అతనికి అతని స్వంత సామ్రాజ్యం ఉంటుంది: ముప్ఫయి లేదా నలభై మంది అబ్బాయిలపై అతను

అధికారాన్ని కలిగివుంటాడు. అతను వారిని అధీనతలో ఉంచుతాడు – అతను ఆ తరగతి గదికి సార్వభౌముడు.

కథనం ఏమిటంటే ఔరంగజేబు తన తండ్రిని చెరసాలలో ఉంచినప్పుడు, అతని తండ్రి అతనికి చెప్పాడు, " నాకు ఇక్కడ సౌఖ్యంగా లేదు. నువ్వు నా కోసం ఒకటి చేయగలవా ?... నేను పాఠశాలను తెరువగలిగేందుకు నా వద్దకు ముప్ఫయి లేదా నలభై మంది చిన్న పిల్లలను పంపించు."

ఔరంగజేబు ఇలా వ్యాఖ్యానించాడని చెప్పబడుతుంది, " నా తండ్రి చెరసాలలో ఉండుండవచ్చు కానీ సార్వభౌముడిగా వున్న ఆ పురాతన గర్వం మిగిలే వుంది. ఇప్పుడు అతను కేవలం ముఫ్పయి లేదా నలభై మంది అబ్బాయిలపై ఆధిపత్యాన్ని కలిగి వుంటాడు."

అత్యంత అల్పుడైన పాఠశాల ఉపాధ్యాయుడు కూడా ముప్ఫయి లేదా నలభై మంది పిల్లల ప్రపంచంలో ఓ రాజే. అత్యంత శక్తివంతమైన మహారాజులు కూడా తమ ప్రజలపై అంత అధికారాన్ని ఎన్నడూ కలిగిలేరు. " లేచి నిలబడండి !" అని ఆ ఉపాధ్యాయుడు చెప్పినప్పుడు వాళ్ళు లేచి నిలబడతారు, మరి అతను " కూర్చోండి!" అని చెప్పినప్పుడు వాళ్ళు కూర్చుంటారు. అందరూ అతని చేతులలోనే ఉన్నారు.

కేవలం ఓ పాఠశాల అధ్యాపకుడు, ఒక కలెక్టరు, ఒక డిప్యూటీ కలెక్టరు, ఒక క్యాబినెట్ మంత్రి, ఎవ్వరైనా ఏదైవున్నా : అతను పదవీ విరమణ చేయగానే అతను బలహీనుడవుతాడు. ఇక వీధులలో ఎవ్వరూ అతనికి నమస్కరించడం లేదు. అతనికి ఎక్కడా ఏ పనీ ఉన్నట్లు కనిపించడం లేదు. అతను అనావశ్యకమైనవాడిలా కనిపిస్తున్నాడు, ఒక చెత్తకుప్ప పైకి విసిరేయబడినట్లుగా లేదా చెత్త సామాన్ల కొట్టులో ఉంచబడినట్లుగా. ఇప్పుడు అతని అవసరం ఎక్కడా లేదు. అతను ఎక్కడికి వెళ్ళినా అతని సమక్షాన్ని ప్రజలు సహిస్తారు, కానీ వాళ్ళ హావభావాలను బట్టి వాళ్ళు ఇలా అంటున్నట్లు అతను అవగాహన చేసుకుంటాడు, " సాగిపో. అయినా అసలు నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు ? మమ్మల్ని విడిచిపెట్టు – ఇక మమ్మల్ని మా పని చేసుకోనివ్వు ?"

అతనిని పొగడ్తలతో ముంచెత్తినవారే, అతనిని తప్పించుకుంటూ ఉంటారు. అతని కాళ్ళను ఒత్తే వారందరూ మాయమైపోయారు. అకస్మాత్తుగా అతని అహం అనే గాలి బుడగ కుంచించుకుపోతుంది, ఆ గాలి బుడగ పేలిపోయినట్లుగా ; గాలి

బయటకు వెళ్ళిపోయింది, దానికి చిల్లు పడిపోయింది. అతను కుంచించుకుపోవడం ప్రారంభిస్తాడు. జీవించడానికి అక్కడ ఏ కారణమూ కనిపించడం లేదు. మరణించాలనే కోరిక అతని వద్దకు రావడం మొదలుపెడుతుంది. అతను మరణించడం గురించి ఆలోచించడం మొదలుపెడతాడు. ఎందుకంటే ఇప్పుడు జీవితానికి ఏ అర్థమూ లేదు.

ప్రజలు పదవీ విరమణ అనంతరం త్వరగా చనిపోతారు. ఎందుకంటే వాళ్ళ జీవితాల యొక్క రసం మరి శక్తి సమస్తమూ వాళ్ళు పనిచేసే ప్రదేశంలోనే వుంది. ఎవరో ఒక హెడ్ గుమస్తా, కనుక అతను పీడిస్తూండే అయిదు లేదా పదిమంది గుమస్తాలు ఉండేవాళ్ళు. మీరు ఎవరు అనేది ముఖ్యం కాదు – మీరు కేవలం ఒక ప్యూను మాత్రమే అయినా కూడా, మీ గర్వం మీకు ఉంటుంది. మీరు ఒక కార్యాలయంలో ప్రవేశించినప్పుడు, అక్కడ కూర్చుని వున్న ప్యూనును చూడండి. అతను ఆ హాలులో తన స్టూలుపై కూర్చుంటాడు, కానీ " ఆగు ! వేచి వుండు !" అని అతను చెప్పినప్పుడు అతని దురహంకారాన్ని చూడండి.

ముల్లా నసీరుద్దీన్ ఒక పోలీసుగా పనిచేస్తున్నాడు మరి అతివేగంగా వాహనాన్ని నడుపుతున్నందుకు అతను ఒక మహిళను ఆపాడు. అతను త్వరగా తన కాగితాలను బయటకు తీసి మరి వ్రాయడం ప్రారంభించాడు. ఆ మహిళ అంది, " విను, వ్రాయడంలో నీ సమయాన్ని వృథా చేసుకోవద్దు ... మేయరుకు నేను తెలుసు." కానీ అతను వ్రాస్తూనే వున్నాడు. ఆ మహిళ అంది, " నువ్వు విన్నావా లేక వినలేదా ? ముఖ్యమంత్రికి కూడా నేను తెలుసు." కానీ అతను కేవలం వ్రాస్తూ పోయాడు చివరకు ఆ మహిళ తన చివరి అస్త్రాన్ని ప్రయోగించింది. ఆమె అంది, " నువ్వు వింటున్నావా లేదా ? ఇందిరాగాంధీకి కూడా నేను తెలుసు."

ముల్లా అన్నాడు, " ఈ అర్థరహితమైనదంతా మాట్లాడడం ఆపు. నీకు ముల్లా నసీరుద్దీన్ తెలుసా ?"

ఆ మహిళ జవాబిచ్చింది, " అతను ఏ ముల్లా నసీరుద్దీన్ ? నీ ఉద్దేశ్యం ఏమిటి ?"

అతను అన్నాడు, " నా పేరు ముల్లా నసీరుద్దీన్, మరి నాకు నువ్వు తెలిసినట్లయితే కనుక ఏదైనా చేయడం సాధ్యమవుతుంది. మరెవరికి నువ్వు తెలిసినా... స్వయానా భగవంతుడికే నువ్వు తెలిసినా, ఈ ఫిర్యాదు వ్రాయబడి తీరుతుంది మరి నువ్వు విచారణ ఎదుర్కొనబోతున్నావు."

ప్రతి ఒక్కరికీ తనదైన గర్వం ఉంటుంది. పోలీసుకు సైతం అతని దురహంకారం ఉంటుంది ; అతనికి అతని స్వంత ప్రపంచం, స్వీయ సామ్రాజ్యం ఉంటుంది. మీరు దానిలో చిక్కుకుంటే కనుక అతను మిమ్మల్ని వేధిస్తాడు.

మీరు ఏమి చేయగలరు అనేదాని సరిహద్దుల లోపలే అహం జీవిస్తుంది. ఒక అహంకారపూరితుడైన వ్యక్తి అవును అని చెప్పడానికి ఎంతో నిస్సహాయతను అనుభూతి చెందుతాడు అనేది మీరు చూడవచ్చు.

మిమ్మల్ని మీరు జాగ్రత్తగా పరీక్షించుకోండి. ఇతరులను సరిచూడడానికి ఓ కొలమానాన్ని నేను మీకు ఇవ్వడం లేదు. స్వీయ-విశ్లేషణ కోసం దానిని వినియోగించండి. కాదు అని చెప్పడం సౌఖ్యాన్ని కలిగిస్తుంది ఎందుకంటే కాదు అని చెప్పడంలో ఎవ్వరైనా శక్తివంతులుగా అనుభూతి చెందుతారు.

ఒక బాలుడు తను బయటకు వెళ్ళి ఆడుకోవచ్చా అని అడిగినప్పుడు అతని తల్లి వద్దు అని చెబుతుంది: " కాదు !" బయటకు వెళ్ళి ఆడుకోవడంలో హాని ఏమీ లేదు. బాలుడు బయట ఆడుకోలేకపోతే కనుక అతను ఎక్కడ ఆడుకుంటాడు ? మరి తల్లికి కూడా తెలుసు ... అతను అల్లరి చేస్తాడనీ, అతను కూడా తన బలాన్ని ప్రదర్శిస్తాడనీ. సంకల్పాల మధ్య విరోధం వుంటుంది మరి రాజకీయాలు ఉపయోగించబడుతాయి. అతను అరుస్తాడు మరి కేకలు పెడతాడు ; అతను వస్తువులను విసిరేస్తాడు. అప్పుడు ఆమె అంటుంది, " వెళ్ళి బయట ఆడుకో !" కానీ ఆమె " వెళ్ళి బయట ఆడుకో," అని అన్నప్పుడు అది ఫరవాలేదు. అప్పుడు అతను వెళతాడు; ఆమె ఆజ్ఞలను మన్నిస్తూ.

ముల్లా నసీరుద్దీన్ కుమారుడు అల్లరి చేస్తున్నాడు మరి ముల్లా అతనికి మళ్ళీ మళ్ళీ చెప్పాడు, " కూర్చో మరి నిశ్శబ్దంగా వుండు ! నేను చెప్పినట్లు చెయ్యి. కూర్చో మరి నోరు మూసుకో."

కానీ ఆ అబ్బాయి వినడం లేదు. ఏ కుమారుడు వింటాడు? చివరకు, కోపం వచ్చి, ముల్లా అన్నాడు, " నీ ఇష్టం వచ్చినంత అల్లరి చెయ్యి. ఇప్పుడు నువ్వు నా ఆజ్ఞలను మన్నించకుండా ఉంటావేమో చూస్తాను. ఇప్పుడు ఇది నా ఆదేశం: సమస్యలను కలిగించు ! ఇప్పుడు నువ్వు నా ఆదేశాలను మన్నించకుండా ఉంటావేమో చూస్తాను."

" కాదు " అనేది సులభంగా వస్తుంది. మీరు దానిని మీ నాలుక చివరే సిద్ధంగా ఉంచుకుంటారు. శ్రద్ధగా చూడండి : నూటికి తొంభైసార్లు కాదు అని చెప్పవలసిన అవసరమే ఉండదు, కానీ దానిని చెప్పగల ఏ అవకాశాలన్నీ మీరు చేజార్చుకోరు. కాదు అని చెప్పగల అవకాశం మీకు రాగానే మీరు వెంటనే దానిని చేజిక్కించుకుంటారు. అవును అని చెప్పవలసి వచ్చినప్పుడు మీరు నిస్సహాయతను అనుభూతి చెందుతారు. అవును అని మీరు చెప్పవలసి వచ్చినప్పుడు మీరు అల్పమైన వారిలా అనుభూతి చెందుతారు. అవును అని చెప్పడమంటే మీరు అధికారం లేనివారు అని అర్థం.

అందువలనే, అత్యంత అహంకారపూరితులైనవారు నాస్తికులు అవుతారు. ఒక నాస్తికుడిగా ఉండడమంటే వారు చిట్టచివరి నిరాకరణను చేశారు అని అర్థం. భగవంతుడు సైతం లేడని వాళ్ళు అన్నారు. ఇతరులందరి గురించీ మరచిపోండి. ఒక నాస్తికుడు కడపటి, చిట్టచివరి నిరాకరణ చేశాడు. ఆస్తికుడు అత్యున్నతాన్ని అంగీకరించాడు, అతను అవును అని అన్నాడు, భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు ఉన్నాడు అని అనడమంటే, " నేను లేను " అని అర్థం. మరి భగవంతుడిని నిరాకరించడమంటే అర్థం, " కేవలం నేను మాత్రమే ఉన్నాను. నాకన్నా ఉన్నతంగా ఎవ్వరూ లేరు, నన్ను అధిగమించి ఎవ్వరూ లేరు. నాపై ఎవ్వరూ పరిమితులను విధించలేరు."

మన కృత్యం మన అహానికి బలాన్నిస్తుంది. అష్టావక్రుడి యొక్క ఈ సూత్రాన్ని మనస్సులో ఉంచుకోండి : **" నేనే కర్తను," ఇలాగే అహం అనే నల్లత్రాచు నిన్ను కాటు వేసింది.** మీరు నిరూపయోగంగా కలతపరచబడ్డారు, దైన్యంతో ఉన్నారు. ఈ దైన్యం బయట ఎక్కడి నుంచో రావడం లేదు ... మనం అనుభవిస్తున్న దుఃఖాన్ని మనంతట మనమే సృష్టించుకున్నాం. అహం ఎంత గొప్పదిగా వుంటే, దైన్యం అంత ఎక్కువగా ఉంటుంది. అహం అనేది ఒక గాయం, స్వల్పమైన గాలి తాకిడి, కూడా నొప్పిని కలిగిస్తుంది.

అహంకారరహితుడైన వ్యక్తిని దీనుడిగా చేయడమనేది అసాధ్యం. ఒక అహంభావిని సంతోషపరచడమనేది అసాధ్యం. అహంభావి సంతోషంగా ఉండకూడదు అనే నిర్ణయాన్ని తీసుకున్నాడు... ఎందుకంటే సంతోషం అనేది అవును అనే మనోస్థితి నుంచి, అంగీకారంతో కూడిన మనోస్థితి నుంచి వస్తుంది. " నేను అసలేమీ కాదు ... నేను సముద్రంలోని ఓ నీటి బిందువును. సముద్రపు నీటి బిందువు ... మరి కేవలం సముద్రం మాత్రమే ఉంది. నా అస్తిత్వం ఏమిటి ?"

మీరు లేకపోవడం అనే అనుభవం ఎంత విస్తారంగా గాఢమవుతుందో, ఆనందపు జల్లులు మిమ్మల్ని అంతగా ముంచెత్తడం ప్రారంభిస్తాయి. ఎవరైతే శూన్యంగా అవుతారో వారు నింపబడతారు, ఎవరైతే గర్వంగా నిలబడతారో వారు శూన్యం చేయబడతారు. **" నేను కర్తను కాను," విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి మరి ఆనందంగా ఉండు.**

" నేను కర్తను కాను " అష్టావక్రుడు ఈ అనుభూతిని దివ్యామృతం అని పిలుస్తాడు. **" నేను కర్తను కాను."** ఇదే అమృతం.

మీరు మరొక భావాన్ని కూడా అవగాహన చేసుకోవాలి. కేవలం అహమే మరణిస్తుంది, మీరు ఎన్నటికీ మరణించరు ; అందువలనే అహం అనేది మృత్యువు, విషం. అహం అనేటటువంటి విషయమే లేదు అని మీరు తెలుసుకున్నరోజు, అప్పుడు మీ అంతరంలో కేవలం దివ్యత్వం మాత్రమే ఉంటుంది ... మీరు దానితో ఏకమవుతారు, దానిలో ఒక కిరణమవుతారు, దానిలో ఓ బిందువవుతారు ... అప్పుడు మీకు మృత్యువనేదే లేదు, అప్పుడు మీరు శాశ్వతులవుతారు.

దివ్యత్వంతో మీరు చిరంజీవులవుతారు. మీతో మీరు మరణించబోతున్నారు. మీతో మీరు ఒంటరివారు ... ప్రపంచానికి ప్రతికూలంగా, అస్తిత్వానికి ప్రతికూలంగా, ఓటమి అనేది నిశ్చయమైన ఓ అసాధ్యమైన యుద్ధంలో మీరు తలమునకలై ఉన్నారు. దివ్యత్వంతో ప్రతీదీ మీతోనే వుంది. దానిలో ఓటమి అనేది అసాధ్యం, విజయం అనేది నిశ్చయం. మీరు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నప్పుడు మీతో అంతటినీ తీసుకెళ్ళండి. సహకారంతో అది సంభవించగలిగినప్పుడు, పోరాటం ఎందుకు ? వంగి వందనం చేయడం ద్వారా తీసుకోవడానికి ప్రయత్నించడమెందుకు ? అది సరళత ద్వారా, నిష్కాపట్యం ద్వారా సాధించగల్గిగినప్పుడు, నిరుపయోగంగా సమస్యను కలిగించడం ఎందుకు ?

" నేను కర్తను కాను," విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి, ఆనందంగా ఉండు. జనకుడు అడిగాడు, " నేను ఆనందంగా ఎలా ఉండగలను? ఆనందం అనేది ఎలా సంభవిస్తుంది ? విముక్తి అనేది ఎలా సిద్ధిస్తుంది ?" అష్టావక్రుడు ఏ పద్ధతులనూ ఇవ్వడం లేదు. ఇది చెయ్యి లేదా అది చెయ్యి అని అతను చెప్పడు. ఈ విధంగా చూడండి, మీ చూపును ఈ విధంగా ఉండనివ్వండి అని అతను అంటాడు. అది అంతా చూడడానికి సంబంధించిన విషయం. మీరు దుఃఖంగా ఉంటే కనుక అది అయుక్తంగా చూడడంలో వేళ్ళూని వుంది. మీరు ఆనందంగా ఉండాలనుకుంటే, అప్పుడు సరైన విధంగా చూడడం...

....విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి, ఆనందంగా ఉండు. విశ్వాసం యొక్క ఈ నిర్వచనాన్ని అవగాహన చేసుకోవడం అవసరం. అవిశ్వాసం అంటే సమస్తంతోనూ మీరు ఏకమయ్యి ఉన్నారు అనేదానిని మీరు అంగీకరించడం లేదు. దీని నుంచి, సందేహం కలుగుతుంది. మీరు సమస్తంతోనూ ఏకమై ఉన్నారని మీరు అంగీకరిస్తే కనుక అవిశ్వాసం అనేది ఎలా ఉండగలదు? అస్తిత్వం మిమ్మల్ని ఎక్కడకు తీసుకెళ్ళినా, అది మంచిదే. మనం ఇక్కడకు మన స్వంత ఇచ్ఛ ద్వారా రాలేదు, మనం మన స్వంత ఇచ్ఛ ద్వారా వెళ్ళిపోము. మనం ఎందుకు జన్మించామో మనకు తెలియదు, మనం ఎందుకు మరణిస్తామో కూడా మనకు తెలియదు. జననానికి ముందు మనం జన్మించాలని అనుకుంటున్నామా లేదా అని ఎవ్వరూ మనల్ని అడగలేదు. మరణానికి ముందు మనం మరణించాలనుకుంటున్నామా లేదా అని ఎవ్వరూ మనలను అడగరు.

ఇక్కడ ప్రతీదీ తనంతట తాను జరుగుతోంది. మనలను ఎవరు అడుగుతారు ? మనల్ని మనం నిరుపయోగంగా దానిలోకి ఎందుకు తీసుకురావాలి ? ఎవరినుంచైతే జీవం బహిర్గతమయ్యిందో దానిలోనికే మనం మళ్ళీ మాయమైపోతాము. మరి జీవాన్నిచ్చినది దివ్యత్వమే, మనం దానిపట్ల అవిశ్వాసంతో ఎలా ఉండగలము ? ఈ అందమైన జీవితం దేని నుంచి అయితే బహిర్గతమయ్యిందో ఆ మూలం పట్ల మనం అవిశ్వాసంతో ఎలా ఉండగలం ? దానిలోనే ఈ పుష్పాలు వికసిస్తాయి, ఈ కమలాలు విరబూస్తాయి ; ఈ చంద్రుడు, నక్షత్రాలు, ఈ మానవుడు, ఈ జంతువులు, పక్షుల మరుగున ఉన్నది అదే. ఇక్కడ ఎంత గీతం, ఎంత సంగీతం, ఎంత ప్రేమ ఉందంటే - మనం దాని పట్ల అవిశ్వాసంతో ఎందుకు ఉండాలి ?

విశ్వాసం అంటే మనల్ని మనం భిన్నమైనవారుగా పరిగణించుకోవడం లేదు, మనం అన్యులము కాదు అని అర్థం. ఈ అస్తిత్వంతో మనం ఏకమై ఉన్నాము అని దాని అర్థం. ఈ ఏకత యొక్క ప్రకటన చేయడంతోనే జీవితం ఆనందంతో వర్షించబడుతుంది.

... విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి, ఆనందంగా ఉండు. సరిగ్గా ఇప్పుడే ఆనందంగా ఉండు. *... విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి మరి ఆనందంగా ఉండు.* ఈ క్షణమే ఆనందంగా ఉండు.

"నేను శుద్ధమైన ఎరుకను," ఇలాగే నిశ్చయం యొక్క
ఈ అగ్నితో నీ అజ్ఞానారణ్యాన్ని దహించి,
దుఃఖానికి అతీతుడివై, ఆనందంగా ఉండు.

సరిగ్గా ఇప్పుడే ద్వైన్యానికి అతీతులవ్వండి. “ నేను శుద్ధమైన ఎరుకను, నేను కేవలం సాక్షిని మాత్రమే, నేను కేవలం గమనించేవాడిని మాత్రమే,” అని మీరు గ్రహించినప్పుడు దుఃఖం అంతా మాయమైపోతుంది.

అహపు రుగ్మతే ఏకైక రుగ్మత.

నేను విన్నాను, ఒకసారి ముల్లా నసీరుద్దీన్ ఢిల్లీలో ఒక కవి సమ్మేళనంలో పాల్గొన్నాడు. ఆ సమ్మేళనం ముగిసిన తరువాత ఆ కార్యక్రమ పెద్ద కవులకు బహుమతుల ప్రదానం చేశాడు. ముల్లాకు సంతృప్తి కలుగలేదు ... అతను తనకు వచ్చిన దానికన్నా పెద్ద బహుమతిని ఆశించాడు. అతనికి ఎంతో కోపం వచ్చింది మరి అతను అన్నాడు, “ నేను ఎవరో నీకు తెలుసా ? నేను పూణె యొక్క కాళిదాసును !”

ఆ కార్యక్రమపు పెద్ద ఎంతో తెలివైనవాడై ఉంటాడు. అతను అన్నాడు, “ అది గొప్ప విషయం. కానీ నువ్వు పూణెలోని ఏ ప్రాంతానికి చెందిన కాళిదాసువో మాకు చెప్పు ?” ప్రతీ ప్రాంతమూ తన కాళిదాసును, ప్రతి వీధీ తన ఠాగూరును కలిగివుంది.

ప్రతీ వ్యక్తీ తాను అద్వితీయుడిననీ, తాను అసమానమైన తెలివితేటలు గల వాడిననీ అనుకుంటాడు...

అరేబియాలోని ఒక సామెత ఏమిటంటే భగవంతుడు మానవుడిని తయారు చేసినప్పుడు, ఆయన అతని చెవులలో రహస్యంగా చెబుతాడు, “ నీకన్నా మెరుగైన మానవుడు ఏనాడూ లేడు.” మరి ఆయన దానిని ప్రతి ఒక్కరికీ చెబుతాడు. ఈ పరిహాసం ఎంతో లోతైనది. మరి ప్రతి వ్యక్తీ తన మస్తిష్కంలో ఈ భావనతో జీవిస్తాడు, “ నా కన్నా గొప్పవాడైన మానవుడు ఎన్నడూ లేడు, సృష్టించబడినవారందరిలోకీ నేనే అత్యున్నతమైనవాడిని. నేను చెప్పేది ఎవరైనా నమ్మినా లేదా నమ్మకపోయినా ఎవరు పట్టించుకుంటారు ? ... అది వారి సమస్య. కానీ సృష్టిలో నేనే అత్యున్నతమైనవాడిని.”

ఈ దురహంకారంతో జీవించే మానవుడు తనను తాను దీనుడిగా చేసుకుంటాడు. ఈ అయుక్త భావన నుంచి ఎన్నడూ నెరవేరలేని ఆకాంక్షలు కలుగుతాయి. అతని ఆకాంక్షలు అనంతమైనవి ... కానీ జీవితం అత్యంత చిన్నది. ఆకాంక్షలలో జీవించేవారు దుఃఖంగానే ఉండితీరుతారు.

ఈ జీవితాన్ని ఒక పూర్తి విభిన్న విధానంలో జీవించే కళ ఉంది ... ఏ ఆకాంక్షలూ లేకుండా, దేనినీ హక్కుగా కోరకుండా, తాము కలిగి వున్నదానిపట్ల కృతజ్ఞతతో నిండిపోయి, ధన్యవాదములతో జీవించడం. విశ్వసించేవారి పద్ధతి ఇదే.

మీరు కలిగి వున్నది ఎంతో వుంది... కానీ కేవలం మీరు దానిని చూసినప్పుడు మాత్రమే.

నేను విన్నాను : ఒక మనిషి తన జీవితాన్ని అంతం చేసుకోవడానికి నది వద్దకు వెళ్ళాడు. ఆ నదీ తీరాన ఒక సూఫీ ఫకీరు కూర్చుని ఉన్నాడు, అతను అడిగాడు, " నువ్వు ఏం చేస్తున్నావు ?"

ఆ మనిషి అప్పుడే నదిలోకి దూకబోతున్నాడు. అతను అన్నాడు, " నన్ను ఆపవద్దు. ఇది మరీ శృతి మించింది ! ఈ జీవితం ఏమీ కాదు, అంతా అర్థరహితమైనదే. నేను కోరుకున్నది ఏదీ నాకు ఎన్నడూ లభించలేదు, నేను తప్పించుకోవాలని కోరుకున్నదే నాకు ఎల్లప్పుడూ లభించింది. భగవంతుడు నాకు ప్రతికూలంగా ఉన్నాడు, కనుక నేను ఈ జీవితాన్ని ఎందుకు కొనసాగించాలి ?"

ఫకీరు అన్నాడు, " ఆగు, మరొక్క రోజు ఉండు – అప్పుడు నువ్వు చనిపోవచ్చు. తొందరేముంది ? నీకు ఏమీ లేదని నువ్వు అంటున్నావు కదా ?"

ఆ మనిషి సమాధానమిచ్చాడు, " ఏమీ లేదు. నాకు ఏమైనా ఉంటే కనుక, నా ప్రాణాలు తీసుకోవడానికి నేను ఎందుకు వస్తాను ?"

ఫకీరు అన్నాడు, " నాతో రా. ఈ ప్రాంతపు రాజు నా మిత్రుడు." ఆ ఫకీరు అతనిని రాజు వద్దకు తీసుకెళ్ళాడు మరి రాజుగారి చెవిలో అతను రహస్యంగా ఏదో చెప్పాడు. ఆ మహారాజు అన్నాడు, " నేను నీకు కోటి రూపాయలు ఇవ్వగలను." ఆ మనిషి కేవలం ఇదే విన్నాడు, ఫకీరు గుసగుసలాడినది ఏమిటో అతను వినలేకపోయాడు. ఆ రాజు అన్నాడు, " నేను నీకు కోటి రూపాయలు ఇవ్వగలను."

ఫకీరు ఆ మనిషి వద్దకు వెళ్ళాడు మరి అతని చెవిలో గుసగుసలాడాడు, " నీ రెండు కళ్ళనూ కోటి రూపాయలకు కొనుగోలు చేయడానికి మహారాజు సిద్ధంగా ఉన్నారు : నువ్వు వాటిని విక్రయిస్తావా ?"

ఆ మనిషి అన్నాడు, " నీ ఉద్దేశ్యం ఏమిటి ? నేనా ? నా కళ్ళను అమ్మడమా ! కోటి రూపాయలకా ! ఆయన పది కోట్లు ఇచ్చినా కూడా నేను వాటిని ఇవ్వబోవడం లేదు."

ఫకీరు మళ్ళీ మహారాజుతో సంప్రదించాడు, మరి అప్పుడు అతను అన్నాడు, " సరే, ఆయన నీకు పదకొండు కోట్లు ఇవ్వగలరు."

ఆ మనిషి అన్నాడు, " ఆ భావనను వదిలెయ్యండి. నేను ఆ రకమైన వ్యాపారం చేయను. నేను నా కళ్ళను ఎందుకు విక్రయించాలి ?"

ఫకీరు అన్నాడు, " నువ్వు నీ చెవులను అమ్ముతావా ? నీ ముక్కు సంగతి ఏమిటి ? నీ శరీరంలోని ఏ భాగాన్నయినా సరే, మరి నువ్వు అడిగిన వెలకే కొనుగోలు చేయడానికి మహారాజు సిద్ధంగా ఉన్నారు."

ఆ మనిషి అన్నాడు, " లేదు. ఈ వ్యాపారంలో నేను పాల్గొనను. నేను దేనినైనా ఎందుకు విక్రయించాలి ?

ఫకీరు అన్నాడు, " చూడూ, పదకొండు కోట్ల రూపాయలకు కూడా నువ్వు నీ కళ్ళను విక్రయించడానికి సిద్ధంగా లేవు, మరి గతరాత్రి నిన్ను నువ్వు చంపుకోబోయావు.నీ వద్ద ఏమీ లేదని నువ్వు అన్నావు."

మనం కలిగివున్న దానిని మనం చూడలేము. కేవలం ఈ కళ్ళను గురించి ఆలోచించండి. ఎంతటి అద్భుతం ! ఈ కన్ను చర్మంతో తయారు చేయబడింది, అది చర్మంలోని ఒక భాగం, కానీ ఈ కన్ను చూడగలదు. అది స్ఫటికమంత స్పష్టంగా వుంది ! అసాధ్యం సాధ్యమయ్యింది. ఈ చెవులు సంగీతాన్నీ, పక్షుల మధుర గానాలనూ, పవనాల గుసగుసలనూ, సముద్రపు హోరునూ వినగలవు. ఈ చెవులు మాంసం మరి ఎముకలతో రూపొందించబడినవి. ఈ అద్భుతాన్ని చూడండి.

మీరు ఉన్నారు ! ఇది ఎంతటి మహాద్భుతం. ఇంతకన్నా గొప్ప అద్భుతాన్ని మీరు ఊహించగలరా ? ఈ మర్త్య శరీరంలో చైతన్యపు దీపం వెలుగుతోంది. కేవలం ఈ చైతన్యపు దీపం యొక్క విలువను అంచనా వేయండి.

లేదు, దానిని చూడగల కళ్ళు మీకు లేవు. వంద రూపాయల జీతం వచ్చే ఉద్యోగం మీకు కావాలని మీరు అంటారు, కానీ తొంభై రూపాయలు వచ్చే దానిని మీరు పొందుతారు మరి మీరు ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. లేదా మీరు ఒక మంత్రి కావాలని అనుకున్నారు కానీ మీరు కేవలం ఓ సహాయమంత్రి మాత్రమే కాగలిగారు, కనుక ఇప్పుడు మీరు స్వవినాశకరమైనవారుగా ఉన్నారు. లేదా మీరు ఒక పెద్ద ఇంటిని కలిగి వుండాలని కోరుకున్నారు కానీ మీకు ఓ చిన్న ఇల్లు లభించింది. మరి జీవితానికి ఏ అర్థమూ లేనట్లుగా కనిపిస్తుంది. లేదా మీరు దివాళా తీస్తే, మీ బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతే, మీరు అంటారు, " ఇక జీవించడం

ఎందుకు ?" లేదా మీరు ఒక స్త్రీని ప్రేమించారు మరి ఆమెను పొందలేకపోయారు, లేదా ఒక పురుషుడిని ప్రేమించారు మరి అతనిని పొందలేకపోయారు. ఇప్పుడు మీరు మరణించాలనుకుంటున్నారు.

మీరు ఎంత ఎక్కువ కోరుకుంటే, అంత ఎక్కువ దుఃఖంగా మీరుంటారు. కోరుకోకుండానే మీరు ఎంత పొందుతున్నారు అనేది మీరు ఎంత ఎక్కువగా చూస్తే, అంత ఎక్కువ వర్ణనాతీతమైన బహుమతులు మీపై వర్షిస్తాయి, కారణరహితంగా. మీ యోగ్యత ఏమిటి ? మీకు ఇవ్వబడిన జీవితానికి యోగ్యులవ్వడానికి మీరు ఏం చేశారు? ఓ క్షణం పాటు సూర్య కిరణాలలో నాట్యం చేయగలిగేందుకు లేదా చంద్రుడు మరి తారలతో మాట్లాడేందుకు మీరు ఏం చేశారు ? ఏ ఆధారంతో ? మీరు ఏ వాదనను చేయగలరు ?

సుతారంగా వీచే గాలులను స్పృశించడానికి, మరి మధురంగా ఆలపించడానికి, ఆనందంతో ఉప్పొంగడానికి, లేదా ధ్యానం చేయగలిగేందుకు ఏ ఆధారంతో అది మీ హక్కు అని మీరు వాదించగలరు ? ఈ బహుమానాల కోసం మీరు ఏం చేశారు ? ఇదంతా మీ వద్దకు వచ్చింది ... స్వచ్ఛమైన అనుగ్రహం ... మరి మీరు ఇంకా దైన్యంతోనే ఉన్నారు. మీరు ఇంకా ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు, మీరు ఇంకా దుఃఖంగానే ఉన్నారు. నిశ్చయంగానే అహం అనే ఈ రుగ్మత మనల్ని హరింపజేస్తుంది. ప్రతి ఒక్కరూ దాని బారిన పడ్డారు.

అందరూ చలనచిత్రాలలోనే పనిచేసే ఒక కుటుంబం గురించి నేను విన్నాను. ఒకసారి తండ్రి కుటుంబ వైద్యుడి వద్దకు వెళ్ళి అన్నాడు, " వైద్య మహాశయా, నా కుమారుడు అంటువ్యాధితో బాధపడుతున్నాడు, ఎరుపు జ్వరం, మరి అది పరిచారికను ముద్దాడడం వలన వచ్చిందని అతను అనుకుంటున్నాడు."

" దిగులు పడకండి," ఆ వైద్యుడు సలహా ఇచ్చాడు. " యువతలో, రక్తం ఉద్రేకపూరితమై వుంటుంది."

" మీకు అర్థం కావడం లేదు డాక్టర్, " ఆ మనిషి మరింత అసౌఖ్యంగా అయిపోతూ అన్నాడు. "వాస్తవమేమిటంటే తరువాత నేను కూడా ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకున్నాను."

" అయితే విషయాలు నిశ్చయంగా క్లిష్టతరం అవుతున్నాయి," ఆ వైద్యుడు అంగీకరించాడు.

" కానీ మరిన్ని సంక్లిష్టతలు ఉన్నాయి వైద్య మహాశయా. దాని తరువాత నేను నా భార్యను కూడా చుంబించాను, రెండుసార్లు."

దీనిని వినడంతోనే, ఆ వైద్యుడు అరుస్తూ తన కుర్చీ మీద నుంచి దూకాడు, " అయితే మన పని అయిపోయింది ! నాకు కూడా ఈ వ్యాధి సోకి వుండాలి" - ఎందుకంటే అతను ఆ మనిషి యొక్క భార్యను ముద్దాడాడు.

ఇటువంటి వ్యాధి వ్యాపిస్తూనే వుంటుంది.

అహం అనేది ఒక అంటువ్యాధి. ఒక శిశువు జన్మించినప్పుడు అతనికి అహం ఉండదు. అతను పూర్తిగా అహంకారరహితుడు, అమాయకుడు. అతను ఏమీ వ్రాయబడి లేని ఒక తెరిచివున్న పుస్తకం ... ఒక ఖాళీ పుస్తకం. అనంతరం క్రమక్రమంగా అక్షరాలు వ్రాయబడతాయి. అప్పుడు అహం క్రమక్రమంగా సృష్టింబడుతుంది. తల్లిదండ్రులు, కుటుంబం, సమాజం పాఠశాల, విశ్వవిద్యాలయం: అన్నీ అహన్ని బలోపేతం చేస్తూపోతాయి. మన విద్యావిధానాలన్నీ, మన సంస్కృతి, మన సమాజం మరి నాగరికత ఈ ఒక్క రుగ్మతకు జన్మనిస్తాయి, అహానికి జన్మనిస్తాయి.అనంతరం మన జీవితమంతా ఈ అహం మనల్ని ఒక భూతం లాగా వెంబడిస్తుంది.

అసలైన మతం యొక్క అర్థాన్ని మీరు తెలుసుకోవాలని అనుకుంటే కనుక, అది ఇదే : అసలైన మతం అనేది, సమాజం సంస్కృతి మరి నాగరికత చేత మీకు ఇవ్వబడిన రుగ్మతకు ఒక ఔషధమే తప్ప మరేమీ కాదు.

ఈ మతం సమాజానికి వ్యతిరేకమైనది, సంస్కృతికి వ్యతిరేకమైనది, నాగరికతకు వ్యతిరేకమైనది, ఈ మతం ఒక తిరుగుబాటు. ఈ మతం ఓ విప్లవం.

ఈ మతపరమైన విప్లవం యొక్క సమస్త భావమూ ఏమిటంటే మీకు ఇతరుల చేత ఇవ్వబడినది, ఇతరుల చేత బోధించబడినది విసర్జించడమే. దానిని పట్టుకుని వేళ్ళాడకండి : అదే మీ దైన్యం, అదే మీ నరకం, అహం కాకుండా మీ జీవితంలో మరే ఇతర భారాలూ లేవు. అహం కాకుండా ఏ బంధనాలూ, ఏ సంకెళ్ళూ లేవు.

" నేనే శుద్ధమైన ఎరుకను ," ఇలాగే నిశ్చయం యొక్క
ఈ అగ్నితో అజ్ఞానారణ్యాన్ని దహించి, దుఃఖానికి
అతీతుడవై, ఆనందంగా ఉండు.

అహం అంటే ఒకరి చైతన్యాన్ని మరిదేనితోనో కలగలిపేయడం అని అర్థం. ఒక మనిషి అంటాడు, " నేను తెలివైనవాడిని "; ఇప్పుడు అతను తన తెలివికి అహాన్ని జోడించాడు. అతని చైతన్యం కలుషితమైపోతుంది.

మీరు గమనించారా ? ఎవ్వరైనా పాలకు నీళ్ళను జోడిస్తే కనుక, ఆ పాలు కలుషితమైపోయాయని మనం అంటాము. అతను అప్పుడు కాదు, అవి కలుషితం కాలేదు, తాను కేవలం స్వచ్ఛమైన నీళ్ళనే జోడించాను అని అంటే కనుక ఇంకా అవి కలుషితమైనవి అనే మీరు అంటారు. ఆ నీరు స్వచ్ఛమైనవా లేదా అశుద్ధమైనవా అనేది కాదు ప్రశ్న : నీరు జోడించబడింది. మీరు స్వచ్ఛమైన నీటినే జోడించారు అనే దాని వలన ఏ వ్యత్యాసమూ ఉండదు ; అయినాగానీ ఆ పాలు కలుషితమైనవే అయ్యాయి. మీరు మరికొంత దగ్గరగా చూస్తే కనుక, కేవలం పాలు మాత్రమే కాదు కలుషితం అయినది, నీరు కూడా కలుషితమైపోయింది అనేది మీరు చూస్తారు. విడిగా, నీళ్ళు మరి పాలు స్వచ్ఛంగానే ఉన్నాయి ; కలగలసి, రెండూ కలుషితమై పోయాయి. వ్యతిరేకమైనవి కలవడం వలన, విభిన్న రకాలు కలవడం వలన అయోమయం కలుగుతుంది.

ఏదో విభిన్నమైనదానికి చైతన్యం జోడించబడగానే సమస్య మొదలవుతుంది. మీరు తెలివైనవారు అని మీరు అంటారు... తెలివి అనేది ఒక యంత్రాంగం... దానిని వినియోగించండి. తెలివిపరులుగా అవ్వకండి. ఇదే అసలైన తెలివి... తెలివిపరులుగా తయారు కాకపోవడం. మీరు తెలివైనవారు అని మీరు అన్నప్పుడు, అప్పుడు సమస్య మొదలయ్యింది ... పాలలో నీళ్ళు. అప్పుడు మీ తెలివి ఎంత స్వచ్ఛమైనది అనే దానివలన ఏ వ్యత్యాసమూ ఉండదు : మీరు గుణవంతులు అని మీరు అన్నప్పుడు, పాలకు నీరు జోడించబడుతుంది. మీ గుణం ఎంత స్వచ్ఛమైనది అనే దానివలన ఏ వ్యత్యాసమూ ఉండదు : దుర్గుణం లేదా సద్గుణం, రెండూ అహాలను కలిగి వుంటాయి.

నేను ఒక సనాతన గాథను విన్నాను : రష్యాలో, చక్రవర్తుల కాలంలో, ముగ్గురు నేరస్థులు సైబీరియాలో ఖైదు చేయబడ్డారు. ఆ ముగ్గురూ అతిపెద్ద నేరస్థుడు ఎవరు అని తమలో తాము ఎల్లప్పుడూ వాదించుకుంటూ ఉండేవారు మరి సుదీర్ఘకాలంపాటు ఖైదులో ఎవరు ఉంచబడతారు అనేదాని గురించి కూడా వాళ్ళు వాదించుకునేవారు. జైలులో ఇది సాధారణంగా జరుగుతుంది ... వాళ్ళు మాట్లాడినప్పుడు జనాలు తమ నేరాలను ఎక్కువచేసి చెప్పుకుంటూ ఉంటారు. మీకు ఉన్నదానికన్నా ఎక్కువ బ్యాంకు బ్యాలన్సు గురించి మాట్లాడేది మీరు మాత్రమే కాదు. ఒక అతిథి వచ్చినప్పుడు

మీరు మీ పొరుగువారి నుంచి ఫర్నీచరును మరి మీ నేలపై పరచడానికి తివాచీలను అరువు తెస్తారు. ఇతరులను మోసగించేది మీరు మాత్రమే కాదు. ఇతరులను చూస్తూనే, " హరే రాం, హరే రాం," అని జపించడం మొదటపెట్టేది మీరు ఒక్కరే కాదు. లేదా ఎవరైనా వచ్చినప్పుడు మీరు ప్రార్థనలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. మరి పూజ గంటలను గట్టిగా మ్రోగిస్తారు, కానీ ఎవ్వరూ రానప్పుడు మీరు అన్నీ త్వరగా ముగించేస్తారు. ఇది చేస్తున్నది మీరు ఒక్కరే అని కాదు. ఇంట్లో ఒక అతిథి ఉంటే కనుక, మీరు మతపరమైనవారు అనే అభిప్రాయాన్ని కలిగించడానికి మీరు గుడికి వెళతారు. జైలులో, ఖైదీలు అదే చేస్తారు.

ఆ ముగ్గురు ఖైదీలూ తమలో తాము వాదించుకునేవారు. ఒక రోజు మొదటి ఖైదీ అన్నాడు, " నేను సైబీరియాలోని కారాగారానికి పంపబడినప్పుడు, నేను ఈ జైలుకు చేరుకున్నప్పుడు, మోటారు కారులనేవే లేవు."

రెండవవాడు అన్నాడు, " అయితే అందులో గొప్ప ఏముంది ? నేను ఖైదు చేయబడినప్పుడు, కనీసం ఎడ్ల బండ్లు కూడా లేవు."

మూడవవాడు అన్నాడు, " ఎడ్ల బండ్లా ? ఎడ్ల బండి అంటే ఏమిటి ?"

ఎవరు ఎక్కువకాలం పాటు ఖైదు చేయబడ్డారు అనేది రుజువు చేయడానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. అక్కడ కూడా అహం ఉంటుంది.

నేను విన్నాను, ఒక జైలుకు ఓ క్రొత్త నేరస్థుడు వచ్చాడు. అతను పంపబడిన సెల్‌లో అప్పటికే ఒక పాత గ్యాంగ్‌స్టర్ ఉన్నాడు. ఆ గ్యాంగ్‌స్టర్ అతనిని అడిగాడు, " నువ్వు ఎంతకాలం ఉండబోతున్నావు ?"

అతను జవాబిచ్చాడు: " నాకు ఇరవై సంవత్సరాలు శిక్ష పడింది."

అతను అన్నాడు, " అయితే ఆ తలుపు దగ్గర ఉండు. నువ్వు త్వరలోనే వెళ్ళిపోతావు. నీ పడకను తలుపు ప్రక్కగా ఏర్పాటు చేసుకో."

నేరస్థులకు కూడా అహం ఉంటుంది. తప్పు చేయడంలో ఒకరు తమ అహాన్ని ఉబ్బువేసుకుంటారు ; మంచిని చేయడంలోనూ ఒకరు తమ అహాన్ని ఉబ్బువేసుకుంటారు. కానీ రెండు స్థితులలోనూ చైతన్యం కలుషితమవుతుంది.

అష్టావక్రుడు అంటాడు : **"నేనే శుద్ధమైన ఎరుకను"** ... "నేను తెలివైనవాడినీ కాదు లేదా గొప్ప గుణవంతుడినీ కాదు, లేదా గుణహీనుడినీ కాదు ; నేను సౌందర్య శోభితుడినీ కాదు లేదా కురిపినీ కాదు ; నేను వృద్ధుడినీ కాదు లేదా యువకుడినీ కాదు ; తెల్లవాడినీ కాదు నల్లవాడినీ కాదు ; హిందువునూ కాదు మహమ్మదీయుడినీ కాదు ; బ్రాహ్మణుడినీ కాదు శూద్రుడినీ కాదు. నాకు ఏ గుర్తింపూ లేదు ... వీటన్నింటినీ చూసేవాడినే నేను."

మీరు మీ ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించినప్పుడు దాని కాంతి బల్లపైన, కుర్చీపైన, గోడపైన, గోడగడియారంపైన, ఫర్నీచరుపైన, బీరువాపైన, తివాచీపైన, నేలపైన, లోకప్పు పైన పడుతుంది ... అది అన్నింటిపైనా పడుతుంది. మీరు అక్కడ ఉంటే కనుక, అది మీపైన కూడా పడుతుంది. కానీ ఆ జ్వాల గోడ కాదు, పైకప్పు కాదు, నేల కాదు, బల్ల లేదా కుర్చీ కాదు.దాని కాంతి ద్వారా ప్రతీదీ దేదీప్యమానమవుతుంది, కానీ ఆ కాంతి భిన్నమైనది.

స్వచ్ఛమైన చైతన్యమే మీ కాంతి, మీ ఎరుక, ఆ ఎరుక యొక్క కాంతి మీ వివేకంపై, మీ శరీరంపై, మీ చర్యలపై పడుతుంది ... కానీ మీరు వీటిలో ఏదీ కాదు. మిమ్మల్ని మీరు దేనితోనైనా గుర్తించుకున్నంతకాలం, అహం అనేది ఉదయిస్తుంది. మరేదో విషయంతో మీ చైతన్యాన్ని గుర్తించడమే అహం. మీరు గుర్తింపు అంతటినీ వదిలేయగానే ... నేను కేవలం స్వచ్ఛమైన తెలుసుకోవడం, నేను స్వచ్ఛమైన ఎరుకను, నేను పూర్తిగా ఓ బుద్ధుడిని అని మీరు అంటారు ... అప్పుడు మీరు మీ స్వగృహానికి రావడం ప్రారంభిస్తారు. విముక్తి యొక్క క్షణం దగ్గరకు వస్తోంది.

అష్టావక్రుడు అంటాడు : **"నేను శుద్ధమైన ఎరుకను," ఇలాగే నిశ్చయం యొక్క ఈ అగ్నితో... దహించి...** ఈ నిశ్చయం, ఈ విశ్వాసం ఏమిటి ?

ఈ విశ్వాసం వినడం ద్వారా సంభవించదు.

ఈ నిశ్చయం వివేకపూరితమైన అవగాహన ద్వారా సంభవించదు ... మీరు దానిని ఎన్నోసార్లు అవగాహన చేసుకున్నారు, మరి అయినాగానీ మీరు దానిని మళ్ళీ మళ్ళీ మరచిపోతున్నారు.

ఈ నిశ్చయం అనుభవం నుంచి వస్తుంది.

మీరు కొద్దిగా ప్రయోగాన్ని చేస్తే కనుక, విశ్వాసం వస్తుంది. అనుభవం వచ్చినప్పుడు, ఆ విప్లవం సంభవిస్తుంది.

...నిశ్చయం యొక్క ఈ అగ్నితో నీ అజ్ఞానారణ్యాన్ని

దహించి, దుఃఖానికి అతీతుడివై, ఆనందంగా ఉండు.

దేనిలోనైతే ఈ ఊహాత్మక ప్రపంచం అనే ఒక తాడు

పాములాగా ప్రసరింపబడుతోందో ఆ పరమానందమే,

ఆ అత్యున్నత పరమానందమే నువ్వు.

దీనిని తెలుసుకుని, అలాగే ఆనందంగా సంచరించు.

ఇక్కడ దుఃఖానికి ఏ కారణమూ లేదు. మీరు వ్యర్థంగా ఒక దుస్స్వప్నంలో జీవిస్తారు మరి కలతపరచబడుతూనే వుంటారు. పీడకలలలో, మీరు గమనించాం ?... ఎవరో తన ఛాతీపై తన చేతిని ఉంచుకుని నిదురిస్తారు, కానీ అతని నిద్రావస్థలో ఒక దెయ్యం తనపై కూర్చుందని అతను అనుకుంటాడు. అతను తన స్వంత ఛేతిని తన ఛాతీపై ఉంచుకున్నాడు ... అది అతని స్వంత బరువు, కానీ నిద్రలో ఆ బరువు ఓ భ్రాంతిని కల్పిస్తుంది. లేదా తన ఛాతీపై తన స్వంత దిండును పెట్టుకోవడంతో, ఒక పర్వతం అతనిపై పడినట్లుగా అనిపిస్తుంది. అతను అరవడానికి మరి కేకలు వేయడానికి ప్రయత్నిస్తాడు ... ఆ కేక బయటకు కూడా రాదు. అతను తన చేతులు మరి కాళ్ళను కదపాలని అనుకుంటాడు ... అతని చేతులు మరి కాళ్ళు కదలవు. అతను ఎంతో భయోత్పాతానికి గురువుతాడు ... మరి అతని నిద్రాభంగమైనప్పుడు, తాను చెమటలో తడిసి ముద్దవ్వడం అతను కనుగొంటాడు. నిద్రాభంగమైనప్పుడు, అతను మేల్కొన్నప్పుడు, ఏ శత్రువూ లేడు, ఏ పర్వతమూ తనపై పడలేదు అని అతను అవగాహన చేసుకుంటాడు. అతను తన స్వంత దిండును తన ఛాతీపై పెట్టుకున్నాడు, అతను తన స్వంత చేతిని తన ఛాతీపై ఉంచుకున్నాడు. అతనేదో మైళ్ళదూరం పరుగెత్తినట్లుగా, అతని గుండె ఇంకా వేగంగానే కొట్టుకుంటోంది. ఆ కల చెదిరిపోయింది, కానీ దాని ప్రభావాలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రాపంచిక బాధలు అని మనం పిలిఛే బాధలు అనేవి కేవలం మన ఎరుకను అపార్థం చేసుకోవడం మాత్రమే.

...ఈ ఊహాత్మక ప్రపంచం అనే ఒక తాడు పాములాగా ప్రసరింపబడుతోంది.

కొన్నిసార్లు చీకటిలో రోడ్డుపై ఒక తాడు ముక్క పడి ఉండడం మీరు చూసే వుంటారు, మరి వెంటనే పాము అనే భావన వస్తుంది. ఆ భావన కలిగినప్పుడు, ఆ తాడుపై ఒక పాము ప్రసరించబడుతుంది, మీరు పరుగెత్తుతారు, మీరు అరుస్తారు మరి కేకలు వేస్తారు. పరుగెత్తుతున్నప్పుడు మీరు ముందుకు తూలి పడిపోయి మరి

ఓ కాలును విరగ్గొట్టుకోవచ్చు. తదనంతరం అది కేవలం ఒక తాడేనని మీరు తెలుసుకుంటారు. కానీ దానివలన ఇప్పుడు ఏం లాభం ? ... కాలు విరిగిపోయింది. కానీ మీరు కనీసం ఎరుక యొక్క ఓ చిన్న దీపాన్ని, కొద్దిపాటి కాంతిని కలిగివుంటే కనుక, అప్పుడు అత్యంత అంధకారంతో నిండిన రాత్రిలో సైతం మీరు ఒక పాముగా కాక, తాడును తాడు లాగానే చూడగలుగుతారు.

ఈ ఎరుకలోనే పరమానందం మరి అత్యున్నత పరమానందం జనిస్తుంది, **... అలాగే ఆనందంగా సంచరించు.** మీరు తాళం చెవిని కలిగివున్నారు ... మీరు కాంతిని కలిగివున్నారు. మీరు కాంతిని వ్యర్థంగా మూసి వుంచారు. ఆ ముసుగును తీసేయండి!

కబీరు అన్నాడు," ముసుగు యొక్క తెరను తెరవండి." ఆలోచన యొక్క వ్యామోహం యొక్క ఆకాంక్ష యొక్క కల్పనల యొక్క కలల యొక్క తెరలను పక్కకు నెట్టెయ్యండి. ఇవే ఆ ముసుగులు. వాటిని ప్రక్కకు నెట్టెయ్యండి. ముసుగు తీయబడిన కళ్ళతో చూడండి.

ప్రజలు తల నుంచి కాళ్ళ వరకూ ముసుగు వేసుకుని కూర్చుంటారు, మరి ఈ ముసుగుల వలన వాళ్ళు ఏమీ చూడలేరు. వాళ్ళు ఇక్కడకూ మరి అక్కడకూ తొయ్యబడతారు, మరి వాళ్ళు అగడ్తలలోకి పడిపోతారు.

... ఈ ఊహాత్మక ప్రపంచం అనే ఒక తాడు పాములాగా
ప్రసరింపబడుతోంది. దీనిని తెలుసుకుని, అలాగే
ఆనందంగా సంచరించు.

ఈ తెలుసుకోవడాన్ని అవగాహన చేసుకోండి ; దానిని చేజిక్కించుకోండి, దానితో పరిచితులు అవ్వండి. అప్పుడు ఆనందంగా సాగిపోండి. ఈ అస్తిత్వమే అత్యున్నత పరమానందం. ఈ అస్తిత్వానికి దుఃఖం అనేది తెలియదు. దుఃఖం అనేది మీ సృష్టి.

దీనిని అవగాహన చేసుకోవడం కష్టం. మనం ఎంతటి దైన్యంలో ఉంటామంటే, దైన్యం అనేది ఉండదు అని మనం ఎలా నమ్మగలుగుతాం ? ఒక తాడు ముక్కను చూసి పరుగెత్తినవాడు అక్కడ పాము అనేది లేదు అని నమ్మడు. తన ఛాతీపై ఒక దిండుతో పడుకుని మరి తనపై ఒక పర్వతం పడింది అని అనుకునేవాడు, వాస్తవానికి తనపై ఒక పర్వతం పడలేదు అనే విషయాన్ని ఆ క్షణంలో నమ్మలేడు. మన పరిస్థితి ఇదే. మనం ఏం చెయ్యగలం ?

గమనించబడేవాడినుంచి గమనించేవాడి దిశగా కొద్దిగా కదలండి.
ప్రతిదాన్నీ చూడండి, కానీ ఆ చూసేవాడిని మరచిపోకండి.
అన్నింటినీ వినండి, కానీ ఆ వినేవాడిని మరచిపోకండి.
అన్నీ చెయ్యండి, కానీ మీరు కర్త కాదని గుర్తుంచుకోండి.

బుద్ధుడు అంటూండేవాడు, " మార్గంపై కదలండి మరి అంతరంగంలో ఎవ్వరూ కదలడం లేదని గుర్తుంచుకోండి. అంతర్గతంగా, అంతా చలనరహితంగానే ఉంది." మరి అది ఈ విధంగానే ఉంటుంది. మీరు ఒక కదులుతున్న వాహనం యొక్క చక్రాలను చూశారా ? చక్రాలు కదులుతూ ఉండగా, ఇరుసు నిశ్చలంగా ఉంటుంది. అదేవిధంగా జీవితపు చక్రం కదులుతుంటుంది, కానీ ఇరుసు నిశ్చలంగా ఉంటుంది. మీరే ఆ ఇరుసు.

తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే,
మరి తనను తాను ఓ బంధితుడిగా పరిగణించుకునేవాడు బంధితుడే;
ఎందుకంటే ఈ ప్రపంచంలో ఈ సామెత సత్యమే :
" మీరు ఎలా ఆలోచిస్తారో అలానే మీరు ఉంటారు."

ఇది ఒక భావగర్భితమైన సూత్రం : **తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే...** తాను స్వతంత్రుడిని అని తెలుసుకున్నవాడు స్వతంత్రుడే. స్వతంత్ర్యానికి మరేదీ చేయవలసిన అవసరం లేదు. కేవలం మీరు స్వతంత్రులు అని తెలుసుకోవడమే చాలు. స్వతంత్రం అనేది మీ కృత్యాల నుంచి రాదు, స్వతంత్రం అనేది మీ తెలుసుకోవడం నుంచి వస్తుంది. స్వతంత్రం అనేది చర్య యొక్క ఫలితం కాదు, అది తెలునుకోవడం యొక్క ఫలం. **తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే, మరి తనను తాను ఓ బంధితుడిగా పరిగణించుకునేవాడ బంధితుడే ...** " నేను సంకెళ్ళతో ఉన్నాను " అని అనుకునేవాడు, సంకెళ్ళలోనే ఉన్నాడు. " నేను విముక్తుడనయ్యాను," అని భావించే వ్యక్తి, విముక్తుడే అయివున్నాడు.

దానిని ప్రయత్నించండి మరి చూడండి. ఒక్కరోజుకు ఏమని నిర్ణయించుకోండంటే ఈ ఇరవై నాలుగు గంటలపాటు అది సత్యం అని : మీరు స్వతంత్రులు అని, ఇరవై నాలుగు గంటల పాటు స్వతంత్రంగా ఉండడానికి ప్రయత్నించండి. మీరు ఆశ్చర్యపోతారు, మీరే అది నమ్మలేరు. మీరు స్వతంత్రులు అని మీరు అనుకుంటే కనుక, మిమ్మల్ని బానిసలుగా చేయడానికి ఎవ్వరూ లేరు, మరి మీరు స్వతంత్రులు. మీరు బానిసలుగా చేయబడ్డారని మీరు అనుకుంటే కనుక, అప్పుడు ప్రతీ ఒక్కటీ మిమ్మల్ని బంధిస్తుంది.

నాకు ఒక మిత్రుడు ఉండేవాడు, అతను నాతోపాటు ఓ ప్రొఫెసరుగా ఉండేవాడు. హోలీ పండుగ సందర్భంగా అతను భంగ్ ... ఓ గంజాయి పానీయం... త్రాగాడు మరి అతను వీధిలో గందరగోళాన్ని సృష్టించాడు, రచ్చ చేశాడు. అతను ఒక అత్యంత సౌమ్యమైన మరి సరళమైన మనిషి. ఒక సౌమ్యుడైన వ్యక్తిలో ప్రమాదం ఉంటుంది ; అటువంటి వ్యక్తి తనలోపల ఎంతో అణచివేసుకుని వుంటాడు. అతను సమస్యలను సృష్టించేవాడు కాదు. అతను పేరు కూడా భోలేరామ్, ' భోళా హృదయం గలవాడు ' ! అతను నిజాయితీపరుడు మరి సరళమైనవాడు. అంతటి మంచి మనిషిలో ఓ ప్రమాదం ఉంటుంది ... అతను భంగులాంటి విషయాలను నిరోధించాలి. ఆ భంగు అతని ఉపరితలంపైనున్న మనోహర స్వభావాన్ని కడిగేసింది మరి దాని అడుగున ఉన్నవి బయటకు వచ్చాయి. అతను వీధిలోకి వెళ్ళాడు మరి కోలాహలాన్ని చేసి సమస్యను సృష్టించాడు. అతను కొందరు స్త్రీలను వేధించాడు, అరెస్టు చేయబడ్డాడు పోలీసు స్టేషనులో బంధింపబడ్డాడు, మరి అతను ఓ ఆంగ్ల ప్రొఫెసరు !

దాదాపు ఉదయం రెండింటికి ఎవరో వచ్చారు మరి నా మిత్రుడు అరెస్టు చేయబడ్డాడనీ, తెల్లవారకముందే నేను అతనిని బయటకు తీసుకురావాలని అతను కోరుకుంటున్నాడనీ, లేదంటే అది ఒక పెద్ద గందరగోళం అవుతుందనీ నాకు సమాచారాన్ని అందించారు. కష్టం మీద కేవలం తెల్లవారబోతుండగా మేము అతనిని విడుదల చేయించగలిగాము. మేము అతనిని బయటకు తీసుకువచ్చాం, కానీ అతను ఎంతో కలతచెంది వున్నాడు ... అంతటి మంచి మనిషి ... అతను ఎంత కలవరానికి గురయ్యాడంటే ప్రతీదీ అసాధ్యమైపోయింది. మూడు నెలలపాటు అతను వేదనను అనుభవించాడు. రోడ్డుపై ఎప్పుడు ఒక పోలీసు కనిపించినా అతను దాక్కునేవాడు, " అతను నన్ను బంధించడానికే వస్తున్నాడు," అని అనుకునేవాడు. మేము ఒక గదిలో కలిసి జీవించేవాళ్ళం. రాత్రివేళ అతను పోలీసు ఈలను వింటే కనుక, అతను మంచం కింద దూరిపోయేవాడు. అతను చేస్తున్నది ఏమిటని నేను అడిగేవాడిని : వాళ్ళు తన కోసమే వెతుకుతున్నారు అని అతను అనేవాడు.

తుదకు అతని స్థితి ఎంతగా చెడిపోయిందంటే అతనూ నిద్రపోగలిగేవాడు కాదు, నన్నూ నిద్రపోనిచ్చేవాడు కాదు. అతను అనేవాడు, " మేలుకో ! నువ్వు విన్నావా ? ... ఆ మనుషులు... గాలిలో మాటలు వినిపిస్తున్నాయి. భోలేరాం ఎక్కడ ఉన్నాడు అని విచారిస్తూ, వాళ్ళు రేడియోలో సందేశాలను పంపుతున్నారు !"

నేను అనేవాడిని, " భోలేరాం, నిద్రపో."

అతను జవాబిచ్చేవాడు, "నేను ఎలా నిద్రపోగలను ? నా జీవితం ప్రమాదంలో వుంది ! వాళ్ళు నన్ను అరెస్టు చేస్తారు. వాళ్ళు నాకు వ్యతిరేకంగా ఒక దస్త్రాన్ని నిర్వహిస్తున్నారు."

చివరకు, నేను ఎంతో వేధింపబడ్డాను మరి బయటపడే మార్గమేదీ కనిపించడం లేదు... అతను కళాశాలకు వెళ్ళడం మానేశాడు, అతను సెలవు తీసుకున్నాడు మరి ఇంటి వద్దే ఉన్నాడు. ఇరవైనాలుగు గంటలూ అతనికి ఈ ఒక్క విషయమే, మనోవైజ్ఞానికులు పరధ్యాన రోగి అని పిలిచే విధంగా తయారయ్యాడు. అతను తన భయం నుంచి, తన పరధ్యాన రోగం నుంచి అంతటినీ సృష్టించుకున్నాడు.

అతను ఒక మంచి మనిషి, మరి ఇది జరుగగలదని నేను ఎన్నడూ అనుకోలేదు. కానీ మానవుడు ఏమేమి ఊహించుకోగల సమర్థుడో ఇప్పుడు నేను అనుభవం పొందాను. "ఆ గోడలకు," అతను అంటాడు, "చెవులు ఉన్నాయి. అన్నిచోట్లా జనాలు వింటున్నారు !" ఇంటికి దగ్గరగా ఎవరైనా నడవడాన్ని అతను చూస్తే కనుక అతను తన కోసమే చూస్తున్నాడని అతను అనుకునేవాడు. ఆ చుట్టు ప్రక్కల ఎవరైనా నవ్వుతూ నిలబడితే, అతను భోలేరాంను చూసే నవ్వుతూండవచ్చు. జనాలు తమలో తాము మాట్లాడుకుంటున్నట్లయితే వాళ్ళు అతనికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారు. ప్రపంచమంతా అతనికి ప్రతికూలంగానే ఉంది.

నాకు మరే ఇతర మార్గమూ కనిపించలేదు, కేవలం ఒకే ఒక సంభావ్యత వుంది : నాకు పోలీసు ఇన్‌స్పెక్టరు అయిన ఓ మిత్రుడు ఉండేవాడు. నేను అతనికి అంతా వివరించాను మరి ఒకరోజు భోలేరాం యొక్క ఫైలుతో రమ్మని అతనిని అడిగాను.

అతను అన్నాడు, "అతనిపై ఒక ఫైలు ఉంటే కనుక నేను దానిని తీసుకొస్తాను, కానీ ఏ ఫైలూ లేదు, కనీసం ఒక రికార్డు కూడా లేదు. ఈ మనిషి ఎన్నడూ ఏమీ చేయలేదు, అతను ఒక్కసారి భంగు తీసుకున్నాడు మరి ఏదో హడావుడిని సృష్టించాడు. ఆ విషయం అయిపోయింది ... ఇప్పుడు దాని గురించి ఏ రచ్చా ఉండదు."

నేను అతనికి చెప్పాను. "ఏ ఫైలు అయినా తీసుకురా, దానిని ఖాళీ కాగితాలతోనైనా నింపు, కానీ అది మందమైనదిగా ఉండాలి ఎందుకంటే అది ఎంతో పెద్ద మందమైన దస్త్రం అని అతను చెబుతాడు. మరి గుర్తుంచుకో, దానిపైన భోలేరాం యొక్క పేరు ముద్రించబడి ఉండాలి. దాని గురించి బెంగపడవద్దు. అతన్ని రెండు లేదా మూడు చరుపులు చరచు, మరి చేతి సంకెళ్ళు కూడా వెయ్యి. నేను నీకు

పదివేల రూపాయల లంచం ఇచ్చే వరకూ అతని వదిలెయ్యడానికి నిరాకరించు. అప్పుడు కూడా, కేవలం 'బహుశా' అతను విడుదల చేయబడాలి."

ఆ పోలీసు తనతోపాటుగా అన్నింటినీ తీసుకుని వచ్చాడు. వాళ్ళు అతనిని రెండు లేదా మూడు సార్లు చేతితో చరిచారు మరి అలా చరచబడడం వలన భోలేరాం ఎంతో సంతోషించాడు. అతను నాతో అన్నాడు, " చూడు ! అది జరుగుతుంది అని నేను చెప్పినట్లుగానే అది జరగడం లేదూ ? ఆ దస్త్రం ఇదుగో : " భోలేరాం " అని దానిపై పెద్ద అక్షరాలలో వ్రాయబడి వుంది. నీ వివేకవంతమైన వివరణలు అన్నీ ఇప్పుడు ఎక్కడికి పోయాయో నాకు చెప్పు ? ఇప్పుడు ఇది జరుగుతోంది : నేను చేతి సంకెళ్ళతో ఉన్నాను !. భోలేరాం పని అయిపోయింది !"

కానీ ఒక విధంగా అతను సంతోషంగా ఉన్నాడు, మరి అదే సమయంలో దైన్యంతో ఉన్నాడు. అతను విలపిస్తున్నాడు, కానీ తన ప్రసరణ సరైనదిగా నిరూపించబడడం వలన అతను సంతోషిస్తున్నాడు. మనిషి ఎంత పిచ్చివాడు ! బాధ గురించిన మీ ప్రసరణ సరైనదిగా రుజువు అయితే కనుక, మీ అహం తృప్తి చెందుతుంది, మీరు సరైనవారుగా నిరూపించబడ్డారు. మిగిలిన వారందరూ తప్పు అని రుజువు చేయబడ్డారనీ, తనకు సలహా ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నవారందరూ సరైనవారు కాదనీ అతను భావించాడు ; చివరకు, అతను ఒక్కడే సరైనవాడుగా నిరూపించబడ్డాడు.

అతి కష్టం మీద, ఆ ఇన్‌స్పెక్టరును నేను బ్రతిమాలాను మరి ఒప్పించగలిగాను. నేను చెప్పే దానితో మరీ తొందరగా అంగీకరించవద్దని నేను అతనికి ముందే చెప్పాను ; లేదంటే మేము కుట్ర చేశామని భోలేరాం అనుమానిస్తాడు.

ఆ ఇన్‌స్పెక్టరు అన్నాడు, " అది చేయడం కుదరదు. అతనికి జీవిత ఖైదు విధించాలి. అతను ఈ విధంగా మాట్లాడడం కొనసాగించాడు మరి అతను ఎలా చేస్తున్నాడు అనేది చూడడానికి నా వైపు చూశాడు. అతి కష్టం మీద నేను చివరకు అతనిని ఒప్పించాను, మరి ఆ నోట్ల కట్టలను లంచంగా స్వీకరించమని చేతులు జోడించి అతనిని అడిగాను. అప్పుడు అతను మా ముందే ఆ దస్త్రాన్ని తగులబెట్టాడు. ఆ రోజు నుంచీ భోలేరాం భయం నుంచి స్వతంత్రుడయ్యాడు ... అతను ఇప్పుడు బాగానే ఉన్నాడు. ఆ ఉపాఖ్యానమంతా అక్కడ ముగిసింది.

హెచ్చు తగ్గులుగా, మీ పరిస్థితి ఇదే.

తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే,
తనను తాను ఓ బందితుడిగా పరిగణించుకునేవాడు బంధితుడే;
ఎందుకంటే ఈ ప్రపంచంలో ఈ సామెత సత్యమే :
"మీరు ఎలా ఆలోచిస్తారో అలానే మీరు ఉంటారు."

మీరు ఏమి ఆలోచించారో అదే మీకు జరుగుతుంది. మీ ఆలోచనే మీ ప్రపంచాన్ని సృష్టించింది. మీ ఆలోచనలను మార్చుకోండి ! ఒక నూతన విధానంలో చూడండి. ప్రతీదీ ఉన్న విధంగానే ఉంటుంది, కేవలం మీరు చూసే, ఆలోచించే, తెలుసుకునే విధానం మారుతుంది ... అప్పుడు ప్రతీదీ మారుతుంది.

తనను తాను స్వతంత్రుడిగా పరిగణించుకునేవాడు స్వతంత్రుడే,
తనను తాను ఓ బంధితుడిగా పరిగణించుకునేవాడు బంధితుడే;
ఎందుకంటే ఈ ప్రపంచంలో ఈ సామెత సత్యమే :
"మీరు ఎలా ఆలోచిస్తారో అలానే మీరు ఉంటారు."

".... మీరు ఆలోచించిన విధంగానే మీరు ఉంటారు..."
ఆత్మ అనేది సాక్షి, అంతటా వ్యాపించినది, సంపూర్ణమైనది, ఏకమైనది,
స్వతంత్రమైనది, చైతన్యపూరితమైనది, కృత్యం నుంచి స్వతంత్రమైనది,
పూర్తి ఏకాకి, నిస్సంగమైనది, నిర్మోహమైనది, ప్రశాంతమైనది.
భ్రాంతి వలన, అది ప్రపంచంలా కనిపిస్తుంది.

... సాక్షి, అంతటా వ్యాపించినది, సంపూర్ణమైనది... ఈ మాటలను వినండి. మీరు సంపూర్ణమైనవారని అష్టావక్రుడు చెబుతున్నాడు, మీరు సంపూర్ణమైనవారుగా తయారవ్వాల్సిన అవసరం లేదు. మీకు ఏదీ జోడించడం కుదరదు. మీరు ఎలా ఉన్నా, మీరు సంపూర్ణంగా ఉన్నారు. మీకు ఏ మెరుగుదలా అవసరం లేదు. మీరు ఏ నిచ్చెననూ ఎక్కవలసిన అవసరం లేదు ... మీకన్నా ఉన్నతంగా ఏదీ లేదు. మీరు సంపూర్ణమైనవారు, మీరు దివ్యులు, అంతటా వ్యాపించినవారు ; సాక్షి, ఏకాకి, స్వతంత్రులు ; మీరు చైతన్యం, అన్ని కృత్యాల నుంచీ స్వతంత్రులు, నిస్సంగులు ... మిమ్మల్ని ఎవ్వరూ బంధించరు. మీకు ఏ సహచరులూ లేరు, మీరు ఏకాకి ; మీరు అత్యున్నత ఏకాంతంలో ఉన్నారు. మీరు నిర్మోహి.

మీరు ఇవన్నీ అవ్వాల్సిన అవసరం లేదు. అష్టావక్రుడి యొక్క సందేశంలోని వ్యత్యాసం ఇదే. మీరు మహావీరుడి సందేశాన్ని వింటే కనుక, మీరు ఇవన్నీ అవ్వాలని

అతను చెబుతాడు. మీరు ఇప్పటికే అయివున్నారని అష్టావక్రుడు అంటాడు. ఇది ఒక వ్యత్యాసం, స్వల్ప వ్యత్యాసం కాదు. మీరు నిస్సంగులుగా ఉండాలనీ, మీరు నిర్మోహులుగా అవ్వాలనీ, మీరు సంపూర్ణమైనవారుగా తయారవ్వాలనీ, మీరు అంతటా వ్యాపించినవారు కావాలనీ, మీరు ఓ సాక్షిగా కావాలనీ మహావీరుడు చెబుతాడు. మీరు ఇవన్నీ అయివున్నారనీ, మీరు కేవలం మేల్కొనాలనీ అష్టావక్రుడు అంటాడు. మీరు మీ కళ్ళను తెరవాలి మరి చూడాలి.

అష్టావక్రుడి యోగం ఒక అత్యంత సహజ సిద్ధమైన యోగం. కబీరు అన్నట్లుగా, " ఓ సాధూ, సహజ సమాధే అత్యుత్తమమైనది."

" ప్రత్యేకంగా ప్రసరించబడిన జీవితాన్నే నేను ", ఈ భ్రమను వదిలిపెట్టు, అంతరంగం, బాహ్యం అనే భావనను కూడా వదిలిపెట్టు, నిర్వికారమైన, చేతనమైన, నిర్ద్వంద్వమైన ఆత్మే నువ్వు అనే ఆలోచనలో జాగృతమవ్వు.

మీరు ఇప్పటివరకూ వేటినైతే విశ్వసించారో అవి ప్రతిఫలించబడిన ప్రసరణలే తప్ప మరేమీ కాదు. అది కేవలం మీ నమ్మకం, మీ అభిప్రాయం. అంతేకాక, మీ చుట్టూ ఉన్న ప్రజలు అవే నమ్మకాలను పంచుకుంటారు. ఈ విధంగా మీ నమ్మకాలు బలపరచబడతాయి. చివరకు, మానవుడు తన అభిప్రాయాలను అరువు తెచ్చుకుంటాడు. మీరు ఇతరుల నుంచి నేర్చుకుంటారు. మానవుడు అనుకరిస్తాడు. ఇక్కడ అందరూ దుఃఖంగా ఉన్నారు, కనుక మీరు కూడా దుఃఖంగా ఉంటారు.

జపాన్‌లో ఒక అరుదైన బుద్ధుడు ఉండేవాడు : హోతెయ్. అతనికి జ్ఞానోదయం అవ్వగానే, అతను మేల్కొనగానే, అతను నవ్వడం మొదలుపెట్టాడు. మరి ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి పయనిస్తూ, అతను తన జీవితమంతా నవ్వుతూనే ఉండడం కొనసాగించాడు. జపానులో వాళ్ళు అతనిని " లాఫింగ్ బుద్ధా " (నవ్వుతున్న బుద్ధుడు) అని పిలుస్తారు. అతను విపణి వీధి మధ్యలో నిలబడతాడు మరి నవ్వుతాడు. మరి అతని పేరు దూరదూరాలకు వ్యాపించింది. హోతెయ్ యొక్క ఆగమనం కోసం ప్రజలు నిరీక్షిస్తూండేవారు. విపణి వీధి మధ్యలో నిలబడి నవ్వడం తప్ప అతను మరే ఇతర సందేశాన్ని ఇచ్చేవాడు కాదు. ఒక సమూహం పోగవుతుంది మరి వాళ్ళు కూడా నవ్వడం ప్రారంభిస్తారు.

ప్రజలు అతనిని అడిగేవారు, " దయచేసి మాకు మరింత ఏదైనా చెప్పండి."

అతను జవాబిస్తాడు, " చెప్పడానికి ఇంకా ఏముంది ? మీరు అనవసరంగా విలపిస్తున్నారు. మిమ్మల్ని నవ్వించడానికి మీకు ఓ మూర్ఖుడు కావాలి. ఇదే నా ఏకైక

సందేశం: నవ్వండి ! లేనిది ఏదీ లేదు, కేవలం కడుపునిండా నవ్వండి. సమస్త అస్తిత్వమూ నవ్వుతోంది : మీరు అనవసరంగా ఏడుస్తున్నారు. మీ ఏడుపు అనేది పూర్తిగా వ్యక్తిగతమైనది. సమస్త అస్తిత్వమూ నవ్వుతోంది : చంద్రుడు మరి తారలు, పువ్వులు మరి పక్షుల అన్నీ నవ్వుతున్నాయి, మరి మీరు ఏడుస్తూపోతారు. మీ కళ్ళను తెరవండి మరి నవ్వండి ! నా వద్ద మరే ఇతర సందేశమూ లేదు."

అతను నవ్వేవాడు, మరి ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సంచరిస్తూనే ఉండేవాడు. అతను జపాన్ అంతటినీ నవ్వించాడు అని చెప్పబడుతుంది. అతనితో నవ్వుతూ మరి నవ్వుతూ ఉండడం ద్వారా ప్రజలు క్రమక్రమంగా క్షణదర్శనాలను పొందడం ప్రారంభించారు. ఏ కారణమూ లేకుండానే ... తాము నవ్వగలమనీ, తాము సంతోషంగా ఉండగలమనీ ప్రజలు అనుభవం పొందడం మొదలుపెట్టారు.

కారణాల కోసం వెతకడం అనేదే అయుక్తమైనది. మీరు నవ్వే ముందు ఒక కారణం కోసం మీరు చూసినంతకాలం మీరు ఎన్నటికీ నవ్వలేరు. దానికి ఒక కారణం ఉన్నప్పుడు మీరు ఆనందంగా ఉండగలరని మీరు అనుకుంటే కనుక, అప్పుడు మీరు ఎన్నటికీ ఆనందంగా ఉండలేరు. కారణాలకై వెతుకుతూ ఒకరు మరింత మరింత దుఃఖంగా అవుతారు. కారణం అనేది వేదనకు చెందుతుంది, ఆనందం అనేది మీ స్వభావం. కారణం అనేది కల్పించబడాలి, వేదన అనేది కల్పించబడాలి. ఆనందం ఉంది. ఆనందం అనేది ఇప్పటికే ఉంది. కేవలం ఆనందాన్ని సాక్షాత్కరించనివ్వండి. అష్టావక్రుడు మళ్ళీ మళ్ళీ చెప్పేది ఇదే : ... **అలాగే ఆనందంగా సంచరించు... దుఃఖానికి అతీతుడివై, ఆనందంగా ఉండు... విశ్వాసం యొక్క ఈ దివ్యామృతాన్ని పానం చెయ్యి, ఆనందంగా ఉండు.**

మానవుడు సంపూర్ణమైనవాడు, అతను ఏకం, అతను స్వతంత్రుడు. అతని ప్రసరణలే ఏకైక అడ్డంకి.

"ప్రత్యేకంగా ప్రసరించబడిన జీవితాన్నే నేను," ఈ భ్రమను వదలిపెట్టు, అంతరంగం,
బాహ్యం అనే భావనను కూడా వదిలిపెట్టు, నిర్వికారమైన,
చేతనమైన, నిర్ద్వంద్వమైన ఆత్మే నువ్వు అనే ఆలోచనలో జాగృతమవ్వు.

అంతరంగం మరి బాహ్యం అనే భావన నుంచి స్వతంత్రులు కావడం... మీ అస్తిత్వం బాహ్యమైనదీ కాదు మరి అంతర్గతమైనదీ కాదు. బాహ్యం మరి అంతర్గతం అనేవి కేవలం మనో వ్యత్యాసాలు. అస్తిత్వం బాహ్యంలోనూ వుంది, అస్తిత్వం అంతరంగంలోనూ వుంది ... అన్ని బాహ్యాలు మరి అంతర్గతాలూ అస్తిత్వంలోనే ఉన్నాయి. కేవలం అస్తిత్వమే ఉంది.

.... అంతరంగం మరి బాహ్యం అనే భావన వదిలిపెట్టు, నిర్వికారమైన, చేతనమైన, నిర్ద్వంద్వమైన ఆత్మే నువ్వు అనే ఆలోచనలో జాగృతమవ్వు.

ఈ అనువాదం సరైనది కాదు. అసలు సూత్రం ఏమిటంటే : అంతరంగం మరి బాహ్యం అనే భావనను వదిలిపెట్టు, మరి నిర్వికారమైన, చేతనమైన, నిర్ద్వంద్వమైన ఆత్మే నువ్వు అనే ' భావన 'లో జాగృతమవ్వు. ' ఆలోచన ' అనేది ఇక్కడ సరైన అనువాదం కాదు. నిర్వికారమైన ***... ఆత్మే నువ్వు అనే 'భావనలో' జాగృతమవ్వు.***

మీరు ఉన్నారు అని **తెలుసుకోండి,** మీరు ఉన్నారు అని **అనుభూతి చెందండి.** అటువంటి భావన పట్ల జాగృతమవ్వండి. ' ఆలోచన ' అనేది మళ్ళీ వివేకవంతమైనది అవుతోంది. ఆలోచన దానిని కేవలం ఉపరితలంపైనే ఉన్నదిగా చేస్తుంది. అది మస్తిష్కం నుంచి రాలేదు. అది కేవలం హృదయం నుంచి మాత్రమే రాగలదు. ఈ అనుభవం ప్రేమలాంటిది, గణితశాస్త్రంలాంటిది కాదు. అది ఒక తర్కంలాంటిది కాదు, అది ఒక పాట లాంటిది, దాని ఆలాపన లోతుగా మరింత లోతుగా ఇంకిపోతూ వుంటుంది, మరి ప్రగాఢాంతర్గత జీవశక్తిని స్పృశించి, దానిని ప్రకంపింపజేస్తుంది.

నిర్వికారమైన ... ఆత్మే నువ్వు అనే భావనలో జాగృతమవ్వు. మీరు ఈ తిరుగుతున్న జీవిత చక్రం కాదు, మీరు మధ్యలో ఉన్న ఇరుసు. ఆ ఇరుసు చలనరహితమైనది.

మీరు భూమిపై ఉన్నారని మీరు అనుకున్నంతకాలం, మీరు భూమిపైనే ఉంటారు. కానీ మీరు సంసిద్ధులైన క్షణం, గగనంలోకి ఎగిరిపోవడానికి మీరు సాహసించిన క్షణం, ఆ క్షణమే మీరు ఎగరడం ప్రారంభించవచ్చు.

మేల్కొనండి ! మీరు ఎన్నో కలలను చూశారు ... ఇక మేల్కొనండి.

జాగృతులవ్వడమే ఆ తాళం చెవి.

ఇంకేమీ చేయవలసిన అవసరం లేదు ... ఏ సాధనా అవసరం లేదు, ఏ యోగమూ అవసరం లేదు, ఏ యోగ భంగిమలూ అవసరం లేదు. కేవలం మేల్కొనండి.

హరి ఓం తత్ సత్ !

ధ్యానం మరి సాక్షీతత్వానికి మధ్యన ఉన్న బాంధవ్యం ఏమిటి ? మనస్సు మరి అహం వాటి ద్వారా ఏ విధంగా కరగించబడతాయి ? సంపూర్ణ అహంకార రాహిత్యాన్ని సాధించకుండా అధీనత అనేది సాధ్యం అవుతుందా ? సాక్షీతత్వం, జాగృతి మరి సరైన స్మృతి మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని కూడా దయచేసి వివరిస్తారా.

అష్టావక్రుడిపై మీ ప్రథమ ప్రసంగ తరుణంలో అనేకమంది ఎంతగానో విలపించారు. దీని భావం ఏమిటి ? ఆ విలపిస్తున్న వారు దుర్బల-హృదయంగలవారా, లేదా అది మీ స్వరం యొక్క శక్తేనా ?

మతం అన్నింటికీ ప్రతికూలమైనదని మీరు చెప్పారు. మతం అన్నింటికీ వ్యతిరేకంగా ఉంటే కనుక, అప్పడు అది అరాచకాన్నీ, గందరగోళాన్నీ సృష్టించకుండా ఉండడం సాధ్యం అవుతుందా ? దయచేసి వివరించండి.

4

ధ్యానమే ఏకైక ఔషధం

మొదటి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

ధ్యానం మరి సాక్షీతత్వానికి మధ్యన ఉన్న బాంధవ్యం ఏమిటి ? మనస్సు మరి అహం వాటి ద్వారా ఏ విధంగా కరగించబడతాయి ? సంపూర్ణ అహంకార రాహిత్యాన్ని సాధించకుండా అధీనత అనేది సాధ్యం అవుతుందా ? ధ్యానం మరి సాక్షీతత్వాలకు కాషాయ వస్త్రాలు మరి ఈ మాల ఏ మేరకు ఉపయోగపడతాయి ? సాక్షీతత్వం, జాగృతి మరి సరైన జ్ఞప్తిల మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని కూడా దయచేసి వివరిస్తారా.

మానవ జీవితాన్ని నాలుగు వృత్తాలుగా విభజించవచ్చు.

మొదటి వృత్తం కర్మకు చెందినది, చేత యొక్క ప్రపంచం. అది అత్యంత బాహ్యమైనది. కొద్దిగా లోపలకు వెళితే మనం ఆలోచన యొక్క ప్రపంచం వద్దకు వస్తాం. మరికొంత ముందుకు వెళ్ళినప్పుడు మనం అనుభూతి, భక్తి, ప్రేమల యొక్క ప్రపంచం వద్దకు వస్తాం. అంతరంగంలో మరింత ముందుకు వెళితే మనం కేంద్రాన్ని చేరుకుంటాము ... సాక్షి యొక్క ప్రపంచం.

సాక్షి అనేది మన స్వభావం, ఎందుకంటే దానిని అధిగమించి వెళ్ళగల మార్గమే లేదు. ఎవ్వరూ ఎన్నడూ వెళ్ళలేదు, మరి ఎవ్వరూ ఎన్నడూ వెళ్ళలేరు. సాక్షిని వీక్షించే సాక్షిగా అవ్వడం అనేది అసాధ్యం. సాక్షి కేవలం సాక్షి మాత్రమే. మీరు దానికన్నా లోతుగా వెళ్ళలేరు. అది మన పునాది. సాక్షీతత్వం యొక్క పునాది పైనే మన ఇల్లు నిర్మించబడి వుంది ... అనుభూతితో, ఆలోచనలతో, కర్మతో నిర్మించబడింది.

ఇందువలనే మూడు యోగాలు ఉన్నాయి : కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం ... కర్మ, జ్ఞానం మరి భక్తికి చెందిన యోగాలు. ఇవి మూడు ధ్యాన విధానాలు. ఈ మూడు అభ్యాసాల ద్వారా సాక్షిని చేరే ప్రయత్నాలను చేయవచ్చు.

కర్మయోగం అంటే ధ్యానం జోడించబడిన కర్మ అని అర్థం. కర్మయోగం అనేది నేరుగా చేత నుంచి సాక్షీతత్వానికి వెళ్ళే ప్రయత్నం. ధ్యానం అనేది ప్రక్రియ మరి సాక్షీతత్వం అనేది లక్ష్యం.

మీరు అడిగారు, " ధ్యానం మరి సాక్షీతత్వానికి మధ్యన ఉన్న బాంధవ్యం ఏమిటి ?" ధ్యానం అనేది మార్గం, సాక్షీతత్వం అనేది గమ్యస్థానం.

సాక్షీతత్వం అనేది ధ్యానం యొక్క అత్యున్నత స్థితి.

మరి ధ్యానం అనేది సాక్షీతత్వం యొక్క ఆరంభం.

ఒక కర్మ యోగి అనేవాడు చేతకు ధ్యానాన్ని జోడించేవాడు, ధ్యానాన్ని కర్మ యొక్క ప్రపంచానికి అనుసంధానించేవాడు ... ధ్యానం జోడించబడిన కర్మ.

ఇక ఒక జ్ఞానయోగి ఆలోచనకు ధ్యానాన్ని జోడిస్తాడు. అతను ధ్యానాన్ని ఆలోచన యొక్క ప్రపంచానికి అనుసంధానిస్తాడు. అతను ధ్యానాత్మకంగా ఆలోచించడం ప్రారంభిస్తాడు. ఒక నూతన అభ్యాసం జోడించబడింది : ఒకరు ఏది చేసినాగానీ ఎరుకతో చేయబడుతుంది. ధ్యానం జోడించబడిన ఆలోచన యొక్క స్థితి స్థాపితమైనప్పుడు, సాక్షీతత్వం దిశగా పయనం ఆరంభమవుతుంది.

ధ్యానం అనేది దిశ యొక్క మార్పు.

ధ్యానం దేనికి అనుసంధానించబడినా అది సాక్షీతత్వం దిశగా వెళ్ళడానికి ఓ వాహనం అవుతుంది.

మరి మూడవ మార్గం భక్తి యోగం ... అనుభూతికి ధ్యానాన్ని జోడించడం, ధ్యానం మరి అనుభూతి యొక్క లోతైన కలయిక, ధ్యానం మరి అనుభూతుల యొక్క వివాహం. కనుక, అనుభూతి చెందుతున్నప్పుడు, ధ్యానాత్మకంగా అవ్వండి.

ఈ మూడు మార్గాల ద్వారా సాక్షిని సమీపించవచ్చు. కానీ మిమ్మల్ని తీసుకువచ్చే విధానం ధ్యానమే, మూలాధారమైన విషయం ధ్యానమే. అది కేవలం ఒక వైద్యుడు మీకు ఔషధాన్ని ఇస్తూ, దానిని తేనెలో రంగరించి తీసుకోమని చెప్పడం లాంటిదే, మరి మీరు అంటారు నేను తేనెను తినను, నేను జైనుడిని. అప్పుడు అతను దానిని పాలతో తీసుకోమని చెబుతాడు, మరి మీరు అంటారు నేను పాలను తాగను ఎందుకంటే పాలు అనేది ఒకరకమైన రక్తమే, మీరు ఒక కచ్చితమైన కువైద్యులు ... మీరు పాలు తాగరు, అది మాంసం తినడంలాంటిదే. కనుక దానిని నీటితో తీసుకోమని ఆ వైద్యుడు చెబుతాడు. కానీ ఔషధం అదే ... తేనె, పాలు లేదా నీళ్ళు,

దాని వలన ఏ వ్యత్యాసమూ ఉండదు. అవి కేవలం ఔషధాన్ని మింగడానికి, దానిని గొంతు దిగేలా చేయడానికి సహాయపడేందుకే ఉన్నాయి. ఔషధం తనంతట తాను క్రిందకు వెళ్ళదు.

ధ్యానం అనేది ఔషధం.

ప్రపంచంలో మూడు రకాల వ్యక్తులు ఉన్నారు. కొంతమంది ప్రజలు కర్మ లేకుండా జీవించలేరు. వాళ్ళ జీవన-ప్రవాహం సమస్తమూ పని చేయడంలోనే ఉంటుంది. వాళ్ళు నిశ్చలంగా కూర్చోవాలని ప్రయత్నిస్తే కనుక వాళ్ళు ఉండలేరు ; వాళ్ళు ఏదో ఒకటి చేయాలి. శక్తి, ప్రవహిస్తున్న శక్తి ఉంది. దీనిలో ఏ హాని లేదు, కానీ గురువులు చెబుతారు, కర్మతో ధ్యానం అనే ఔషధాన్ని మింగండి. మీరు పని చేయడాన్ని ఆపలేరు, కానీ చేస్తున్న పనికి మీరు ధ్యానాన్ని జోడించగలరు. మీరు అంటారు, " ఏమీ చేయకుండా నేను ఒక్క క్షణం కూడా కూర్చోలేను. నేను అది చేయలేను. కూర్చోవడం అనేది నా వశంలో లేదు, అది నా స్వభావం కాదు."

మనోవైజ్ఞానికులు వారిని ఎక్స్‌ట్రోవర్టులని అంటారు : వాళ్ళు ఎల్లప్పుడూ నిమగ్నమై వుంటారు, వాళ్ళు ఏదో ఒకటి చేయవలసి వస్తుంది. వాళ్ళు అలసటతో పడిపోయి మరి నిద్రపోయేవరకూ పనిచేయడాన్ని ఆపకపోవడం అనేది వాళ్ళకు సహజం. పని చేయడమే వాళ్ళ స్వభావం.

గురువు చెబుతాడు, " మంచిది. కర్మపై స్వారీ చేస్తూ దానిని చెయ్యండి. దీనిని మీ అశ్వంగా చేసుకోండి. దీనితో మీ ఔషధాన్ని కలుపుకుని మరి దానిని మింగండి. ఔషధం అనేది అసలైన ప్రశ్న. ధ్యానాత్మకంగా పని చేయడం ప్రారంభించండి. మీరు ఏమి చేసినా, దానిని అచేతనంగా చేయకండి, దానిని ఎరుకతో చేయండి. చేస్తున్నప్పుడు మేల్కొని ఉండండి."

తరువాత కొందరు ఏమంటారంటే చేయడం అనేది తమను ఆకర్షించదనీ, కానీ ఆలోచనలు అలల్లా వచ్చి పడుతుంటాయనీ చెబుతారు. వాళ్ళు చింతనాపరులు ... పని అనేది వారికి ఏ రసాన్నీ ఇవ్వదు. వాళ్ళకు బాహ్యంలో ఏ ఆసక్తీ ఉండదు, కానీ అంతరంగంలో గొప్ప అలలు, ఒక మహా తుఫాను ఎగిసిపడుతూంటుంది. మరి వారు అంతరంగంలో ఆలోచనలు లేకుండా ఒక్క క్షణమైనా ఉండలేరు. వాళ్ళు అంటారు, " మేము నిశ్శబ్దంగా కూర్చుంటే కనుక మరిన్ని ఆలోచనలు వస్తాయి. మేము నిశ్శబ్దంగా కూర్చున్నప్పుడు మామూలు కన్నా ఎక్కువ ఆలోచనలు వస్తాయి. పూజ, ప్రార్థన, ధ్యానం అనేవాటిని కేవలం పేర్కొనండి, మరి ఆలోచనల ఓ

మహావెల్లువ - పటాలం - అలలు అలలుగా వస్తాయి మరి మమ్మల్ని ముంచేస్తాయి. మేము ఏమి చేయాలి ?"

గురువు చెబుతాడు, " మీ ఆలోచనలతో రంగరించబడిన ధ్యానాన్ని పానం చెయ్యండి. మీ ఆలోచనలను ఆపకండి, కానీ ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని గమనించండి. వాటిలో కొట్టుకుపోకండి, కొంచెం విడిగా, కొద్దిపాటి దూరంలో నిలబడండి. నిశ్చలంగా మీ ఆలోచనలను వీక్షిస్తూ, మీరు క్రమక్రమంగా సాక్షీతత్వాన్ని సిద్ధించుకుంటారు. మీ ఆలోచనలకు ధ్యానాన్ని జోడించండి."

అప్పుడు మరికొందరు ఉన్నారు మరి వారు అనేది ఏమిటంటే, " మాకు ఆలోచనలతో ఏ సమస్యా లేదు. పనితో ఏ సమస్యా లేదు. మాకు అమితమైన అనుభూతి ఉంది. అశ్రువులు ప్రవహిస్తుంటాయి, హృదయం ఉప్పొంగిపోయి, ముంచెత్తుతూ ఉంటుంది ... ప్రేమలో, అపేక్షలో, విశ్వాసంలో, భక్తిలో."

గురువు చెబుతాడు, " దీనిని మీ ఔషధంగా చేసుకోండి. దీనికి ధ్యానాన్ని జోడించండి. అశ్రువులను ప్రవహించనివ్వండి ... ధ్యానంతో నిండిన ప్రవాహం. ఆ పులకరింతను అక్కడ ఉండనివ్వండి, కానీ ధ్యానంతో నిండినదవ్వాలి. దాని సారము ధ్యానమే."

భక్తి, కర్మ మరి జ్ఞానాల మధ్యన ఉన్న ఈ వ్యత్యాసాలు ఔషధంలోని వ్యత్యాసాలు కాదు. ఔషధం ఒక్కటే. మీరు అష్టావక్రుడిలో దీనిని చూడవచ్చు. నేరుగా గెంతండి అని అష్టావక్రుడు చెబుతాడు. ఆ ఔషధాన్ని నేరుగా మింగెయ్యండి. ఈ అభ్యాసాల వలన ఏమి ఉపయోగం అని ఆయన అంటాడు ?

అందువలనే అష్టావక్రుడు ఒక జ్ఞానయోగి లేదా ఒక భక్తియోగి లేదా ఒక కర్మయోగి కాదు. నేరుగా సాక్షీతత్వంలోకి పడిపోండి అని అతను చెబుతాడు. ఈ ఊతకర్రలు ఉపయోగపడవు ... ఈ ఔషధాన్ని నేరుగా మింగెయ్యవచ్చు. ఈ ఊతకర్రలను వదిలెయ్యండి, ఈ వాహనాలను వదిలెయ్యండి - మీరు నేరుగా పరుగెత్తగలరు. మీరు నేరుగా ఒక సాక్షిగా ఉండగలరు.

అష్టావక్రుడికి సంబంధించినంతవరకూ, సాక్షి మరి ధ్యానం అనేవి విభిన్నమైనవి కావు. కానీ ఇతర విధానాలకు సంబంధించినంతవరకూ, సాక్షి మరి ధ్యానం అనేవి విభిన్నమైనవి. ఈ ఇతర మార్గాలకు, ధ్యానం అనేది ప్రక్రియ మరి సాక్షితత్వం అనేది గమ్యస్థానం.

అష్టావక్రుడికి మార్గం మరి గమ్యం ఒక్కటే. కనుక సరిగ్గా ఇప్పుడే బ్రహ్మానందంతో ఉండమని అతను చెప్పగలడు. మార్గం మరి గమ్యం వేరుగా ఉన్నవాళ్ళు " సరిగ్గా ఇప్పుడే " అని చెప్పలేరు. అతను అంటాడు, " కదలండి ! ఆ ప్రయాణం సుధీర్ఘమైనది ; ఎక్కండి, అప్పుడు మీరు పర్వతాన్ని చేరుకుంటారు." అష్టావక్రుడు చెబుతాడు. " మీ కళ్ళను తెరువండి : మీరు ఆ పర్వతం పైనే కూర్చుని వున్నారు ! మీరు ఎక్కడికి వెళుతున్నారు? ఎక్కడికైనా వెళ్ళడం ఎలా ?"

అష్టావక్రుడి యొక్క సూత్రం అత్యంత విప్లవాత్మకమైనది.

జ్ఞానం కాదు, భక్తి కాదు, కర్మయోగమూ కాదు ... వీటిలో ఏదీ అతని ఉన్నతత్వాన్ని చేరుకోలేదు. అది స్వచ్ఛమైన సాక్షీతత్వం. దానివైపు ఇలా చూడండి : ఆ ఔషధాన్ని మింగవలసిన అవసరం కూడా లేదు, కేవలం అవగాహన చాలు, ఎరుక చాలు, సహాయపు అవసరమే లేదు ... మీరు ఇప్పటికే అక్కడ ఉన్నారు. కానీ ప్రజలు దానిని అవగాహన చేసుకోలేని అసమర్థులు.

ఒక సూఫీ కథ :

ఒక మనిషి సత్యాన్వేషణలో వెళ్ళాడు. అతను కలుసుకున్న మొట్టమొదటి ధార్మిక వ్యక్తి కేవలం అతని స్వంత గ్రామం వెలుపలే, ఒక వృక్షం కింద కూర్చుని ఉన్నాడు. అతను అడిగాడు, " నేను ఒక నిజమైన గురువు కోసం అన్వేషిస్తున్నాను. ఒక అసలైన గురువు యొక్క లక్షణాలను దయచేసి నాకు చెప్పండి."

ఆ ఫకీరు అతనికి ఆ లక్షణాలను చెప్పాడు. అతని వర్ణన అత్యంత సరళమైనది. అతను చెప్పాడు, " నువ్వు అతనిని ఇలాంటిలాంటి వృక్షం క్రింద, ఇలాంటి ఇలాంటి భంగిమలో కూర్చుని ఉండి, అతని చేతులు ఇలాంటి ఇలాంటి సంజ్ఞలు చేస్తూ ఉండగా కనుగొంటావు ... అతను ఒక అసలైన గురువు అనేది తెలుసుకోవడానికి అది చాలు."

ఆ జిజ్ఞాసువు అన్వేషించడం ప్రారంభించాడు. అతను భూమండలమంతా సంచరిస్తూండగా ముప్పయి సంవత్సరాలు గడిచిపోయాయని చెప్పబడుతుంది. అతను ఎన్నో ప్రాంతాలను సందర్శించాడు. కానీ ఎన్నడూ ఆ గురువును కలుసుకోలేక పోయాడు. అతను ఎందరో గురువులను కలుసుకున్నాడు, కానీ వారెవ్వరూ అసలైన గురువులు కాదు. అతను పూర్తిగా అలసిపోయి తన స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అతను తిరిగి వస్తూండగా అతను ఆశ్చర్యపోయాడు, అతను దానిని నమ్మలేక పోయాడు : ఆ వృద్ధుడు అదే వృక్షం క్రింద ఆసీనుడై ఉన్నాడు, మరి ఆ వృద్ధుడు

చెప్పిన వృక్షం ఇదేనన్నది ఇప్పుడు అతను చూడగలుగుతున్నాడు "... అతను ఇలాంటి ఇలాంటి వృక్షం క్రింద కూర్చుని ఉంటాడు", మరి అతని భంగిమ సరిగ్గా అతను వర్ణించినట్లుగానే ఉంది. " ముప్ఫయ్యేళ్ళ క్రితం అతను ఇదే భంగిమలో కూర్చుని వున్నాడు ... నేను అంధుడినయ్యానా? అతని వదనంపై సరిగ్గా అవే హావభావాలు, సరిగ్గా అవే సంజ్ఞలు...!"

అతను ఆయన పాదాలపై పడి అన్నాడు, " మీరు మొదటే నాకు ఎందుకు చెప్పలేదు ? ఈ ముప్ఫయేళ్ళూ మీరు నన్ను తప్పుదోవ ఎందుకు పట్టించారు ? ఆ అసలైన గురువు మీరే అని మీరు నాకు ఎందుకు చెప్పలేదు ?"

ఆ వృద్ధుడు చెప్పాడు, " నేను నీకు చెప్పాను, కానీ నువ్వు వినడానికి సిద్ధంగా లేవు. ఎక్కడెక్కడో సంచరించకుండా స్వగృహానికి నువ్వు రాలేకపోయావు. నీ స్వగృహానికి రావడానికి నువ్వు వెయ్యి ఇళ్ళ తలుపులను తట్టవలసి వచ్చింది, కేవలం అప్పుడు మాత్రమే నువ్వు తిరిగి రాగలిగావు. నేను అది చెప్పాను, నేను ప్రతీ ఒక్కటీ చెప్పాను... ' ఇలాంటి ఇలాంటి వృక్షం క్రింద,' నేను ఈ వృక్షాన్నే, నేను కూర్చుని ఉన్న భంగిమనే వర్ణిస్తూ ఉన్నాను, కానీ నువ్వు మరీ తొందరలో ఉన్నావు, నువ్వు సరిగ్గా వినలేకపోయావు, నువ్వు తొందరలో ఉన్నావు. నువ్వు అన్వేషించడానికి ఎక్కడికో వెళుతున్నావు. నీకు అన్వేషణ అనేది అత్యంత ప్రధానమైనది, సత్యం అంత ప్రధానమైనది కాదు.

" కానీ నువ్వు వచ్చావు ! నీ కోసం నిరంతరంగా ఈ భంగిమలోనే కూర్చుని వుండి, నేను అలసటను అనుభవిస్తున్నాను. ముప్ఫయ్యేళ్ళుగా నువ్వు సంచరిస్తూనే ఉన్నావు, కానీ ఈ వృక్షం క్రింద కూర్చుని ఉన్న నా గురించి ఆలోచించు! ఏదో ఒకరోజు నువ్వు వస్తావని నాకు తెలుసు, కానీ నేను అప్పటికే మరణిస్తే ఎలా ? నేను నీ కోసం నిరీక్షించాను ... నువ్వు వచ్చావు ! నువ్వు ముప్ఫయ్యేళ్ళ పాటు సంచరించవలసి వచ్చింది, కానీ అది నీ స్వంత తప్పిదం. గురువు ఎల్లప్పుడూ ఇక్కడే ఉన్నాడు."

మన జీవితంలో ఎన్నోసార్లు ఏమి జరుగుతుందంటే దగ్గరగా ఉన్నదానిని మనం చూడలేము, మరి దూరంగా ఉన్నది మనల్ని ఆకర్షిస్తుంది. సుదూరంలోని మద్దెల దరువులు మధురంగా వినిపిస్తాయి, సుదూర స్వప్నాలచేత మనం ఆకర్షించబడతాము.

మీరు దేనినైతే అన్వేషిస్తున్నారో అదే మీరు అని అష్టావక్రుడు చెబుతాడు.

మరి సరిగ్గా ఇక్కడే, సరిగ్గా ఇప్పుడే మీరు అదే అయివున్నారు.

కృష్ణమూర్తి ప్రజలకు చెబుతున్నది సరిగ్గా అష్టావక్రుడి యొక్క సందేశమే. అష్టావక్రుడిని ఎవ్వరూ అవగాహన చేసుకోలేదు, కృష్ణమూర్తినీ ఎవ్వరూ అవగాహన చేసుకోలేదు. మరి మీ మహాత్ములూ మరి సన్యాసులూ అనబడేవారు ఎంతో ఆగ్రహంతో ఉన్నారు ఎందుకంటే ధ్యానం యొక్క అవసరమే లేదు అని కృష్ణమూర్తి చెబుతాడు. అతను చెబుతున్నది పూర్తిగా సరైనదే ... భక్తి యొక్క అవసరమే లేదు, కర్మ యొక్క అవసరమే లేదు, జ్ఞానం యొక్క అవసరమే లేదు. సామాన్య సాధువులు మరి సన్యాసులు ఎంతో ఆందోళన పడిపోతారు: " ఏదైనాగానీ అవసరమే లేదా ? అతను ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడు !" తప్పుదోవ పట్టించేది ఈ సాధువులే.

కృష్ణమూర్తి నిష్కపటంగా అష్టావక్రుడి యొక్క సందేశాన్నే ఇస్తున్నాడు. ఆ అవసరమే లేదు అని అతను చెబుతున్నాడు ఎందుకంటే మీరు ఏదైనా చేజార్చుకున్నప్పుడు మాత్రమే అది అవసరమవుతుంది. కేవలం లేచి నిలబడండి మరి ఆ దుమ్మును దులిపేసుకోండి ! మీ కళ్ళపై కొద్దిగా చల్లటి నీళ్ళను చిలకరించుకోండి ; ఇంకా ఏం కావాలి ?

అష్టావక్రుడి దృష్టిలో సాక్షీతత్వం మరి ధ్యానం ఒక్కటే, ఎందుకంటే గమ్యం మరి మార్గం ఒక్కటే. కానీ ఇతర మార్గాలు మరి మత వర్గాలన్నింటికీ ధ్యానం అనేది ఒక విధానం ; సాక్షీతత్వం, దాని చిట్టచివరి ఫలం.

" మనస్సు మరి అహం వాటి ద్వారా ఏ విధంగా కరగించబడతాయి ?" మనస్సు మరి అహం అనేవి సాక్షీతత్వం ద్వారా కరగించబడవు : అవి ఎన్నడూ లేవు అనేది మీరు సాక్షీతత్వంలో కనుగొంటారు. అవి ఉన్నట్లయితేనే అవి కరిగించబడతాయి.

అది ఈ విధంగా ఉంటుంది : మీరు ఒక చీకటి గదిలో కూర్చుని ఉన్నారు మరి అక్కడ ఓ భూతం ఉంది అని అనుకుంటారు. అక్కడ కేవలం మీ చొక్కా వ్రేళ్ళాడుతోంది కానీ మీరు భయపడ్డారు, మరి భయంలో మీ ఊహ దానికి చేతులు మరి కాళ్ళను జోడిస్తుంది. మిమ్మల్ని భయపెడుతూ అతను అక్కడ నిలబడి వున్నాడు ! ఎవరో ఒక దీపాన్ని వెలిగించమని చెబుతారు, మరి ఓ దీపాన్ని వెలిగించడం అనేది దెయ్యాలను ఎలా పారద్రోలుతుందని మీరు అడుగుతారు. కానీ దీపాన్ని వెలిగించడమనేది ఆ దెయ్యాన్ని పారద్రోలుతుంది ఎందుకంటే అసలు అది అక్కడ లేనేలేదు. అవి ఉన్నట్లయితే కనుక, ఒక దీపాన్ని వెలిగించడం అనేది దానిని తరిమెయ్యలేదు. దెయ్యాలను భయపెట్టి తరిమెయ్యడంతో దీపానికి నిమిత్తమేముంది ? అక్కడ ఒక దెయ్యం ఉంటే కనుక, ఒక దీపం దానిని తరిమెయ్యలేదు. కానీ అది ఉండదు, అది కేవలం భ్రాంతిమయమైనది ... అందువలనే అది వెళ్ళిపోతుంది.

అసలు లేనేలేని వేలాది రుగ్మతలతో మీరు బాధపడుతూ ఉంటారు. ఇందువలనే ఎవరో సాధువు ఇచ్చిన భస్మం మిమ్మల్ని నయం చేస్తుంది ; భస్మం మీ అస్వస్థతను పారద్రోలడం వలన కాదు. మీకేమైనా పిచ్చా ? బూడిద ఎప్పుడైనా ఓ వ్యాధిని నయం చేసిందా ? అలా అయితే కనుక, వైద్య విజ్ఞానశాస్త్రం సమస్తమూ నిరుపయోగమైనది అవుతుంది. బూడిద వ్యాధులను నయం చేయలేదు, మీరు అస్వస్థులై ఉన్నారు అనే భావనను మాత్రమే అది వదిలిస్తుంది.

ఒక వైద్యుడిని గురించిన ఓ కథను నేను విన్నాను– స్వయంగా అతనే నాకు దానిని చెప్పాడు. అతను బస్తరు ఆటవిక ప్రాంతం వద్ద జీవించేవాడు మరి బస్తర్ లోలోపలి నంచి ఒక ఆటవికుడు అతని వద్దకు వచ్చాడు. ఆ వైద్యుడు ఓ గ్రామాన్ని, ఓ అటవీ గ్రామాన్ని సందర్శిస్తున్నాడు, ఈ మనిషి అస్వస్థుడై ఉన్నాడు, కానీ ఆ వైద్యుడి వద్ద వ్రాయడానికి ఏమీ లేదు ; ఆ గ్రామంలో కలం లేదా కాగితం అనేవే లేవు. అతను ఒక వస్త్రాన్ని వెతికి మరి ఒక రాతి ముక్కతో దానిపై ఔషధం యొక్క పేరును వ్రాశాడు, మరి అతనికి చెప్పాడు,“ ఒక నెలంతా దీనిని పాలతో తీసుకో, మరి నీకు స్వస్థత చేకూరుతుంది.” ఆ మనిషి ఒక నెల తరువాత తిరిగి వచ్చాడు, అతను పూర్తిగా బాగున్నాడు... ఆరోగ్యంగా, బలిష్టంగా. వైద్యుడు అడిగాడు, “ ఆ మందు పనిచేసిందా ?”

అతను చెప్పాడు, “ అది దివ్యంగా పనిచేసింది. ఇప్పుడు నాకు మరో వస్త్రాన్ని వ్రాసివ్వండి.”

ఆ వైద్యుడు అడిగాడు, “ నువ్వు ఏమంటున్నావు ?”

అతను చెప్పాడు, “ ఆ వస్త్రపు ముక్క అయిపోయింది. నేను అదంతా త్రాగేశాను ! అది ఒక గొప్ప ఔషధం.”

అతను పూర్తి స్వస్థతతో వైద్యుడి వద్దకు వచ్చాడు ! ఇప్పుడు ఆ వైద్యుడు ఏదైనా వివరించడం సరికాదు ; అది అయుక్తమైనది అవుతుంది. అతను నాకు చెప్పాడు, “ అతనికి స్వస్థత చేకూరడం వలన నేను ఏమీ చెప్పలేదు : నిన్ను బాగు చేసేది ఔషధమే. ‘ ఓరి మూర్ఖుడా, నేను కేవలం ఆ ఔషధం పేరు వ్రాశాను, కానీ నువ్వు దానిని ఎన్నడూ కొననే లేదు !’ అని చెప్పడం ద్వారా నేను అతనిని అయోమయానికి ఎందుకు గురిచెయ్యాలి ? అతను ఆ మందుల చీటీని త్రాగాడు. కానీ అది పనిచేసింది.” ఆ రుగ్మత అసత్యమైనది, ఊహాజనితమైనది అయివుంటుంది.

నూటికి తొంభై రుగ్మతలు ఊహాజనితమైనవే అని మనోవైజ్ఞానికులు చెబుతారు. మరి అవగాహన పెరిగిన కొద్దీ తొంభై తొమ్మిది శాతం ఊహాజనితమైనవే అవ్వడం సాధ్యం కావచ్చు. బహుశా ఒకరోజు నూటికి నూరు శాతం రుగ్మతలన్నీ ఊహాజనితమైనవేనని కనుగొనబడవచ్చు.

ఇందువలనే పనిచేసే అనేక వైద్యవిధానాలను ప్రపంచం కలిగివుంది. అల్లోపతి ఔషధాన్ని వాడండి మరి రోగికి నయమవుతుంది. ఆయుర్వేదం లేదా హోమియోపతి లేదా గ్రీకు-ఇస్లామిక్ పద్ధతులు, లేదా న్యాచురోపతి, మరి రోగికి స్వస్థత చేకూరుతుంది. ఒక మంత్రం లేదా ఓ తాయెత్తు కూడా అతనికి స్వస్థత చేకూర్చగలదు.

అది విస్మయాన్ని కలిగిస్తుంది. అతను నిజంగానే వ్యాధిగ్రస్తుడై ఉంటే కనుక అప్పుడు ఆ వ్యాధిని నయం చేయడానికి కేవలం ఒకే విధానం పనిచేస్తుంది, ప్రతీ ఒక్క విధానమూ పనిచేయలేదు. వ్యాధి అనేదే లేదు. అది కేవలం మీ నమ్మకమే: ఎవరో అల్లోపతీని నమ్ముతారు కనుక అది పనిచేస్తుంది... మరి ఔషధం కన్నా కూడా ఆ వైద్యుడి యొక్క పేరు అనేది అతి ముఖ్యమైనది.

ఒక గొప్ప వైద్యుడి వద్దకు వెళ్ళి వచ్చినప్పుడు, భారీగా ఫీజును చెల్లించడం వలన మీ జేబులు ఖాళీ అవ్వడం, మీకు అప్పటికే సగం స్వస్థత చేకూరడం మీరు ఎప్పుడైనా గమనించారా ? అదే వైద్యుడు మీకు ఉచితంగా మందులు చీటీని వ్రాస్తే కనుక అది మీపై ఏ ప్రభావాన్నీ చూపించదు. అతని ఔషధం కన్నా మీరు చెల్లించిన ఫీజు ఎక్కువ మేలును కలిగిస్తుంది. అతను ఒక ఉత్తమ వైద్యుడు ... ఉత్తమోత్తముడు ... అనే భావన ఒకసారి మీకు కలిగిందంటే, అది చాలు.

మీరు అడుగుతున్నారు, " మనస్సు మరి అహం వాటి ద్వారా ఏ విధంగా కరగించబడతాయి ?" అవి కరగిపోవు. అవి ఉన్నట్లయితే, అవి కరగించబడతాయి. సాక్షీతత్వంలో మీరు కనుగొనేది ఏమిటంటే, " మూర్ఖుడా, నువ్వు అనవసరంగా తప్పిపోయావు ! నీ స్వంత భ్రమే ఎండమావులను ప్రసరించింది ... అది అంతా ఊహ మాత్రమే," అవి కరిగిపోవు, సాక్షీతత్వంలో మీరు అప్రమత్తులవుతారు మరి అవి ఎన్నడూ లేనేలేవు అని తెలుసుకుంటారు.

" సంపూర్ణ అహంకార రాహిత్యాన్ని సాధించకుండా అధీనత అనేది సాధ్యం అవుతుందా ?" ఇది ఒక భావగర్భితమైన ప్రశ్న. ప్రశ్నించేవారు అడుగుతున్నారు, " సంపూర్ణ అహంకారరాహిత్యాన్ని సాధించకుండా అధీనత అనేది సాధ్యం అవుతుందా ?" కానీ ప్రశ్నిస్తున్న వారి యొక్క మనస్సు వంచనతో కూడి ఉంది...బహుశా అచేతనంగా, అతను ' సంపూర్ణంగా ' అనేదానిని ' అహంకార

రాహిత్యానికి ' జోడించాడు, కానీ ' అధీనత ' కు కాదు. సంపూర్ణ అహంకార రాహిత్యం అనేది లేకుండా, సంపూర్ణ అధీనత అనేది సాధ్యం కాదు. మీరు ఎంత అహన్ని విడిచిపెడితే, అంత అధీనత అనేది సాధ్యమవుతుంది, మీరు మీ అహంలో యాభై శాతాన్ని విసర్జిస్తే, అప్పుడు యాభైశాతం అధీనతే సాధ్యమవుతుంది. అహన్ని వదిలెయ్యడం మరి అధీనులవ్వడం అనేవి రెండు విభిన్న విషయాలా ? అవి ఒకే విషయాన్ని చేప్పే రెండు విధానాలు.

మీరు చెబుతున్నది ఏమిటంటే అహాన్ని పూర్తిగా విసర్జించకుండా అధీనత అనేది సాధ్యం కాదనీ, సంపూర్ణ శరణాగతి అనేది సాధ్యం కాదనీ. " అధీనులవ్వాల్సిన అవసరం ఏమిటి ఎందుకంటే అవసరం అనేది సంపూర్ణంగా విసర్జించబడనంత వరకూ...?" అది ఎప్పుడు వదిలెయ్యబడుతుందో మరి అది ఎలా వదిలెయ్యబడుతుందో ఎవరికి తెలుసు.

అహం వదిలేయబడిన మేరకు అధీనత అనేది సాధ్యమవుతుంది. సంపూర్ణత్వం కోసం నిరీక్షించకండి : మీరు చేయగలిగినంత చేయండి. అంతవరకూ చెయ్యండి మరి తదుపరి అడుగు అందుబాటులోనికి వస్తుంది.

అది ఓ నిశిరాత్రిలో ఒక మనిషి ప్రయాణిస్తూండడం లాంటిది. అతను తన చేతిలో కేవలం నాలుగు అడుగుల ముందువరకూ మాత్రమే కాంతిని ప్రసరించే ఒక చిన్న క్రొవ్వొత్తిని కలిగి వున్నాడు.

" దీనితో ఎవ్వరైనా పది మైళ్ళు ఎలా ప్రయాణించగలరు ? నాలుగు అడుగుల వెలుతురు మరి పది మైళ్ళ అంధకారం ... నేను తప్పిపోతాను," అని ఆ మనిషి అంటే కనుక, అప్పుడు మనం అతనికి చెబుతాము, " దిగులు పడకు, నాలుగు అడుగులు వెయ్యి, మరి నువ్వు నాలుగు అడుగులు వేసినప్పుడు ఆ కాంతి మరో నాలుగు అడుగులు ముందుకు వెళుతుంది. నడవడం మొదలు పెట్టడానికి నీకు పది మైళ్ళ వెలుతురు అవసరం లేదు. నాలుగు అడుగులు చాలు."

ఎంత అహంకారం... ఒక బిందువును వదిలెయ్యండి, అప్పుడు మరో దానిని వదిలెయ్యండి. ఒక బిందువును వదిలెయ్యడంలోనే తరువాతి బిందువును వదిలెయ్యగల అవకాశం వస్తుంది. నాలుగు అడుగులు వెయ్యండి, మరి ఆ వెలుతురు నాలుగు అడుగులు ముందుకు వెళుతుంది. అహం సంపూర్ణంగా విసర్జించబడినప్పుడు మాత్రమే మీరు అధీనులవుతారని సాకులు చెప్పకండి. అప్పుడు మీరు దానిని ఎన్నడూ చెయ్యరు. మీరు మీ రక్షణను అత్యంత జాగ్రత్తగా చేసుకున్నారు. మీ అహం వదిలివేయబడినంతగా మీరు అధీనులవుతారు ... అది నిజం. అయితే మీరు

వదిలేయగలిగినంత వదిలేయండి ... మీకు సాధ్యమైనంత అధీనతను సమీకరించుకోండి. బహుశా దాని యొక్క రుచి మిమ్మల్ని మరింత సంసిద్ధులుగా చేస్తుంది ; దాని పరమానందం, దాని పారవశ్యం మీకు మరింత ధైర్యాన్నిస్తుంది. రుచి చూడడం ద్వారా ధైర్యం వస్తుంది.

“ నేను ఈదడాన్ని పూర్తిగా నేర్చుకోనంత వరకూ నేను నీటిలోకి వెళ్ళను,” అని ఒక మనిషి అనవచ్చు. అతను చెబుతున్నది సరైనదే ; అతని లెక్క సరైనదే, అతని తర్కం సరైనదే.“ నేర్చుకోకుండా నేను నీటిలోకి వెళ్ళి, మరి మునిగిపోతే ఎలా ? అంత సమస్యలో చిక్కుకోవడమెందుకు ? మొదట నేను చక్కగా ఈతకొట్టడం నేర్చుకుంటాను.” కానీ మీరు దానిని చక్కగా ఎక్కడ నేర్చుకుంటారు ? మీ పడక పైనా ? మీరు ఈతను సంపూర్ణంగా ఎక్కడ నేర్చుకుంటారు ? మీరు నీటిలోకి వెళ్ళవలసి వస్తుంది.

కానీ సముద్రంలోకి దూకమని మీకు ఎవ్వరూ చెప్పడం లేదు ... అంచు వద్దకు వెళ్ళండి, మీ మెడలోతు వరకూ వెళ్ళండి, మీ ధైర్యం మీకు చెప్పినంతవరకూ మాత్రమే వెళ్ళండి. అక్కడ ఈదడం నేర్చుకోండి మరి క్రమక్రమంగా మీ ధైర్యం పెంపొందుతుంది. మీరు ప్రతిసారీ మరో అడుగు లోతుకు వెళ్ళవచ్చు. సాగరపు పూర్తి లోతులో మీరు ఈదగలిగినంతవరకూ. ఒకసారి మీరు ఈదడం నేర్చుకుంటే... మరి దానిని నేర్చుకోవడానికి మీరు లోపలికి వెళ్ళాల్సివస్తుంది. తీరానికి దగ్గరగా ఉండండి. ఒక లోతైన నదిలోకి నేరుగా ఓ పర్వతం మీది నుంచి దూకెయ్యమని నేను చెప్పడం లేదు. తీరానికి దగ్గరగా ఉండండి, నీటితో స్నేహం చేసుకోండి. నీటితో పరిచితులు అవ్వండి, మీ కాళ్ళూ చేతులను కదపండి.

ఈత అంటే ఏమిటి ? మీ కాళ్ళూ చేతులను నైపుణ్యంతో కదిలించడమే. ప్రతి ఒక్కరికీ అలా చేయడమెలాగో తెలుసు. ఇతకు ముందు ఎన్నడూ ఈత కొట్టనివారిని మీరు నీళ్ళలోకి తోసేసినా కూడా అతను చేతులు కాళ్ళను కదిలించడం మొదలుపెడతాడు. దీనికీ మరి ఓ ఈతగాడికీ మధ్యన వున్న వ్యత్యాసం కేవలం కొద్దిపాటి నైపుణ్యం మాత్రమే ; వాళ్ళు చేస్తున్నదానిలో ఏ వ్యత్యాసమూ లేదు. మునుపెన్నడూ ఈతకొట్టని వ్యక్తి కూడా తన చేతులు మరి కాళ్ళను విసురుతున్నాడు కానీ అతనికి నీటి పట్ల విశ్వాసం, తన పట్ల తనకు విశ్వాసం లేదు. తాను మునిగిపోబోతున్నానని అతను భయపడుతున్నాడు. ఆ భయం అతనిని ముంచేస్తుంది – నీళ్ళు ఎన్నడూ ఎవ్వరినీ ముంచెయ్యలేదు.

ఒక మృతదేహం ఉపరితలంపైకి తేలడం, ఒక శవం నీటిపై తేలడం మీరు చూసే వుంటారు. ఆ శవాన్ని అడగండి, " నువ్వు ఏ గారడీ నేర్చుకున్నావు ? నువ్వు సజీవంగా ఉన్నప్పుడు నువ్వు మునిగిపోయావు. మరణించి, నువ్వు తేలుతున్నావు !" ఆ శవానికి భయంలేదు : ఆ నది దానిని ఎలా ముంచగలదు ? దేనినైనా ముంచడం అనేది నీటి యొక్క స్వభావం కాదు, నీరు వస్తువులను పైకి ఎత్తుతుంది. ఇందువలనే నీటిలో బరువు తగ్గినట్లుగా కనిపిస్తుంది. నీటిలో ఉన్నప్పుడు మీకన్నా బరువైన వ్యక్తిని మీరు పైకెత్తి మరి మొయ్యగలరు. నీటిలో ఉన్నప్పుడు మీరు ఒక పెద్ద రాయిని ఎత్తగలరు. నీటిలో వస్తువుల యొక్క బరువు తక్కువగా ఉంటుంది. భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉన్నట్లుగానే, భూమి క్రిందకు లాగుతుంది, నీరు పైకి తేల్చుతుంది. వస్తువులను పైకెత్తే స్వభావం నీటికి వుంది. మీరు మునిగిపోతోంటే కనుక దానికి కారకులు మీరే, నీరు ఎన్నడూ ఎవ్వరినీ ముంచెయ్యలేదు. తెలియకుండా నీటిని నిందించకండి. నీరు ఎన్నడూ ఎవ్వరినీ ముంచెయ్యలేదు.

ఒక శాస్త్రవేత్తను అడగండి : అతను కూడా ఏం చెబుతాడంటే ఒక మనిషి మునిగిపోవడం అనేది ఓ అద్భుతం, ఎందుకంటే నీరు పైకి తేలుస్తుంది. మీ భయోత్పాతంలో మీరు మునిగిపోతారు. మీరు అరుస్తారు మరి కేకలు పెడతారు, మీ నోటిని మీరు తెరుస్తారు, మీరు నీటిని లోపలికి త్రాగేస్తారు మరి మరింత బరువెక్కుతారు ... మరి మీరు మునిగిపోతారు. మీ మరణానికి మీరే కారకులు అవుతారు. ఒక ఈతగాడు కేవలం దీనినే నేర్చుకుంటాడు : నీరు మిమ్మల్ని పైకి ఎత్తుతుంది ! నీటిపై అతని విశ్వాసం మరింత దృఢమవుతుంది. నీటిలో బరువు తగ్గుతుంది అని అతను అవగాహన చేసుకుంటాడు. నేలపై ఉన్నప్పటికంటే నీటిలో మన బరువు ఎంతో తక్కువగా ఉంటుంది.

మీరు ఒక బావిలోకి చేదను వేసినప్పుడు ఆ బాల్చీ నిండతూన్నప్పుడు మరి నీటిలో ఉన్నప్పుడు అది తేలికగా ఉండడం మీరు చూసే వుంటారు. దానిని పైకి లాగడం మొదలుపెట్టండి మరి అది బరువుగా అవుతుంది. ఆ నీరు మిమ్మల్ని సమర్ధిస్తుంది ; అది మిమ్మల్ని ఎలా ముంచగలదు ? సాధకుడు నెమ్మది నెమ్మదిగా ఈ వాస్తవంతో పరిచితుడు అవుతాడు. విశ్వాసం కలుగుతుంది. నీరు శత్రువు కాదు మిత్రుడే అనే విశ్వాసం వస్తుంది. అది మిమ్మల్ని ముంచెయ్యదు.

నైపుణ్యంగల ఒక ఈతగాడు తన చేతులను ఆడించడు, వాటిని కదిలించడు, కానీ ఉపరితలం పైనే ఉండగలడు... ఒక తామర పువ్వులాగా. అతను కూడా మీలాంటి మనిషే ; అతనిలో విశ్వాసం ఉదయించింది అనేది తప్ప ఏ వ్యత్యాసమూ లేదు.

అతను తనను తాను విశ్వసిస్తాడు, అతను నీటిని విశ్వసిస్తాడు ... వాళ్ళ మధ్య ఓ మిత్రత్వం వృద్ధి చెందింది.

అధీనతలో కూడా అదే విధంగా జరుగుతుంది. అధీనతలో, భయమేమిటంటే మీరు మునిగిపోవచ్చు, కనుక మీరు ఒడ్డును ఎక్కాలని అనుకుంటారు. మీరు వంద డిగ్రీలూ అధీనులైపోవాలి అని నేను చెప్పడం లేదు ... ఒక్క డిగ్రీ అయినా చాలు. దానిని క్రమక్రమంగా చేయడం ద్వారా మీరు తెలుసుకుంటారు, ఆ రుచి పెంపొందుతుంది. రసం వృద్ధి చెందుతుంది, శక్తి పుష్పిస్తుంది.

అహం వలన ఎంత వృథా అయిపోయిందో, అతి స్వల్ప అధీనత వలన ఎంత వస్తుందో తెలుసుకుని మీరు ఆశ్చర్యపోతారు. క్రొత్త ద్వారాలు తెరుచుకుంటాయి ... కాంతి యొక్క ద్వారాలు. మీ అస్తిత్వంలో నూతన పవనాలు వీస్తాయి... ఒక క్రొత్త పులకింత, ఒక క్రొత్త ఉత్సాహం. అంతా తాజాగా ఉంటుంది. మీరు మొట్టమొదటిసారిగా జీవితాన్ని చూస్తారు. మొదటిసారిగా మీరు మీ కళ్ళ నుంచి పొగచూరిన తెరను తొలగిస్తున్నారు. దివ్యత్వం యొక్క ఉనికి తనను తాను సాకారం చేసుకోవడం ప్రారంభిస్తుంది. అధీనులు అవ్వండి మరి దివ్యత్వం సమీపానికి వస్తుంది. ఎందుకంటే మీరు లేకుండాపోవడం ప్రారంభిస్తారు, దివ్యత్వం సాక్షాత్కరించడం ప్రారంభిస్తుంది.

అస్తిత్వం సుదూరాన ఉందా ? మీ మందమైన అహం వలనే మీరు దానిని చూడలేరు. మీరు దానిని చూడలేరు ఎందుకంటే మీ కళ్ళు అహంకారంతో నిండిపోయి ఉన్నాయి. దానిని మీ కంటితో నేరుగా చూడగల సమర్థులుగా తయారవ్వండి. క్రమక్రమంగా ధైర్యం పెంపొందుతుంది ... నమ్మకం, ఆత్మ-విశ్వాసం. మీరు మరింత మరింతగా అధీనులు అవుతారు. ఏదో ఒకరోజు మీరు పూర్తిగా గెంతుతారు. ఏదో ఒకరోజు మీరు అంటారు, " ఇక చాలు !" ఇప్పటి వరకూ మిమ్మల్ని మీరు కాపాడుకోవడం కోసం మిమ్మల్ని మీరు వృథా చేసుకున్నారు. ఒకరోజు మీరు అవగాహన చేసుకుంటారు మరి వదిలేస్తారు, అప్పుడు మిమ్మల్ని మీరు మునిగిపోనిస్తారు మరి రక్షింపబడతారు.

మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్నవారు అనుగ్రహింపబడినవారు, ఎందుకంటే వాళ్ళను ఎవ్వరూ ముంచలేరు. రక్షింపబడినవారు దురదృష్టవంతులు ఎందుకంటే వాళ్ళు ఇప్పటికే మునిగిపోయి వున్నారు ... ఈ రోజు కాకపోతే, రేపు వాళ్ళ పడవ ఫెళఫెళమంటుంది మరి ముక్కలైపోతుంది.

అహం మరి అధీనతల గురించి పరిగణించవలసిన విషయం మరొకటి ఉంది, మనస్సు ఎంతో తెలివైనది ... అది సాకులను వెదుకుతుంది. మనస్సు అంటుంది, "అయితే మొదట ఏది ? అహాన్ని వదిలెయ్యడం ముందా లేక అధీనత అనేది ముందా ? అహంకారం విసర్జించబడేందుకు నేను అధీనుడను అవ్వాలా, లేక అధీనత సంభవించగలిగేందుకు నేను అహాన్ని వదిలెయ్యాలా ?"

మీరు గుడ్లు కొనడానికి విపణి వీధికి వెళ్ళినప్పుడు, "కోడిపిల్ల ముందా, లేక గుడ్డు ముందా ?" అని మీరు అడగరు. మీరు అది అడిగితే కనుక మీరు గుడ్లతో ఎన్నటికీ ఇంటికి తిరిగిరారు. మీరు కేవలం గుడ్లను కొనుగోలు చేస్తారు మరి ఏది ముందు - కోడిపిల్ల లేదా గుడ్డు - అనేది ముందుగా నిర్ధారణ చేసుకోకుండానే మీరు వెళ్ళిపోతారు.

అనేకమంది దానిని చర్చించారు. కోడిపిల్ల లేదా గుడ్డు అనే ఆ ప్రశ్న అత్యంత పురాతనమైనది. ఏది ముందు వస్తుంది ? ఒక జవాబును కనుగొనడం అత్యంత కష్టతరమైనది. గుడ్డు ముందు వస్తుంది అని మీరు అనగానే సమస్యలు మొదలవుతాయి, ఎందుకంటే ఆ గుడ్డు ఓ కోడి నుంచే వచ్చి వుండాలి ... కనుక కోడిపిల్ల అనేదే ముందు వస్తుంది. కోడిపిల్ల ముందు వచ్చింది అని మీరు అనగానే, మళ్ళీ సమస్య ఉత్పన్నమవుతుంది ఎందుకంటే గుడ్డు అనేది లేకుండా ఒక కోడిపిల్ల ఎలా రాగలదు? అది ఒక చక్రం. ఆ ప్రశ్న తప్పు దోవ పట్టించేది. ఆ ప్రశ్న తప్పుదోవ పట్టిస్తుంది ఎందుకంటే కోడిపిల్ల మరి గుడ్డు అనేవి రెండు కాదు. కోడిపిల్ల మరి గుడ్డు అనేవి ఒక విషయం యొక్క రెండు దశలు. ఒకదాని ముందు మరొక దానిని పెట్టి, వాటిని రెండుగా చేసి మీరు ఓ ప్రశ్నను రేకెత్తిస్తారు. కోడిపిల్ల అనేది గుడ్డు యొక్క ఒక రూపం ... ఒక సంపూర్ణంగా సాకారమైన రూపం. గుడ్డు అనేది కోడిపిల్ల యొక్క ఒక రూపం ... సాకారం కానిదైన రూపం ... ఒక విత్తనం మరి ఓ వృక్షంలాగా.

అహంకార రాహిత్యం మరి అధీనత అనేవి కేవలం ఇలాంటివే.

ఏది ముందు వస్తుంది ? ... వాదిస్తూ సమయాన్ని వృథా చేయకండి. మీరు కోడిపిల్లను తెస్తే కనుక మీరు గుడ్డును తెచ్చారు. మీరు గుడ్డును తెస్తే కనుక మీరు కోడిపిల్లను తెచ్చారు. మీరు ఎక్కడి నుంచి మొదలుపెట్టినా ఒకటి వస్తే కనుక, దానితోపాటుగా మరొకటి కూడా వస్తుంది. మీరు అహాన్ని వదిలిపెట్టగలిగితే కనుక, అహాన్ని వదిలిపెట్టడం ద్వారా ప్రారంభించండి. మీరు అహాన్ని వదిలిపెట్టలేకపోతే కనుక, అప్పుడు అధీనులు అవ్వడం ద్వారా ప్రారంభించండి. మీరు అధీనులు అయితే కనుక, అహం విసర్జించబడుతుంది. అది పూర్తిగా విసర్జించబడుతుంది అని నేను

చెప్పడం లేదు ; మీరు అధీనం అయినంత అది విసర్జించబడుతుంది. అధీనులు అవ్వడం అనేది కష్టతరమైనదిగా కనిపిస్తే కనుక, అప్పుడు అహాన్ని విసర్జించండి. మీరు అహాన్ని, ఎంత విసర్జిస్తే అంత అధీనత వస్తుంది.

రెండు రకాల మతాలు ఉన్నాయి. ఒకటి అహంకారరాహిత్యం యొక్క మతం, మరొకటి అధీనత యొక్క మతం. ఒక రకమైన మతం కోడిపిల్లకు ప్రాధాన్యతను ఇస్తుంది, మరొకటి గుడ్డుకు ప్రాధాన్యతను ఇస్తుంది. రెండూ సరైనవే. ఎందుకంటే ఒకటి ఉన్నప్పుడు, మరొకటి తనంతట తానే వస్తుంది.

ఉదాహరణకు, మహావీరుడి యొక్క మతం మరి బుద్ధుడి యొక్క మతం రెండింటిలోనూ అధీనతకు తావు లేదు ; కేవలం అహాన్ని వదిలెయ్యండి అని వారు చెబుతారు. మీరు ఎక్కడ అధీనులు అవుతారు ? మీరు దాని ముందు అధీనులు అవ్వడానికి ఏ దివ్యత్వమూ లేదు. మహావీరుడు చెబుతాడు, " ఏ ఆశ్రయమూ లేదు, ఏ దివ్య చరణాలూ లేవు : అధీనులు అయ్యేందుకు మీరు వెళ్ళడానికి ఏ ప్రదేశమూ లేదు. ఎవరి చరణాల వద్దకు మీరు వెళ్ళగలరు ? అధీనత లేకుండా సాగండి, కేవలం అహాన్ని విసర్జించండి."

హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు ... ఇవన్నీ అధీనత యొక్క మతాలు, అహాన్ని వదిలెయ్యడం గురించి అవి అంతగా ఏమీ చెప్పవు, అవి అంటాయి, " దివ్యత్వానికి అధీనులవ్వండి. ఎక్కడైనా ఆశ్రయాన్నీ, మీరు మీ శిరస్సును వంచి వందనం చేయగల చరణాలనూ కనుగొనండి ... అహం తనంతట తానే పోతుంది."

రెండూ సరైనవే ఎందుకంటే అవి ఒకే నాణెం యొక్క దిశలు. మీరు నాణెం యొక్క ' బొమ్మ ' దిశను తీసుకువచ్చినా లేదా ' బొరుసు ' దిశను ఇంటికి తీసుకు వచ్చినా దాని వలన ఏమి వ్యత్యాసం ఉండగలదు ?... ఆ నాణెం ఇంటికి తిరిగి వస్తుంది. అవి ఒకే నాణెం యొక్క రెండు దిశలు. కానీ మీరు ఏదో ఒకచోట మొదలుపెట్టాల్సి వస్తుంది. దానిని తేల్చాలని ప్రయత్నిస్తూ కేవలం ఊరికే కూర్చోకండి.

" ధ్యానం మరి సాక్షీతత్వాలకు కాషాయ వస్త్రాలు మరి ఈ మాల ఏ మేరకు ఉపయోగపడతాయి ?" మీరు సంసిద్ధతతో ఉంటే కనుక, ప్రతి ఒక్కటీ సహాయకారి కాగలదు. మీరు సంసిద్ధతతో ఉంటే కనుక, అతి చిన్న విషయాల నుంచి ఒక మార్గాన్ని ఏర్పరచవచ్చు.

లంకకు చేరడానికి రాముడు సముద్రం మీద సేతువు నిర్మిస్తున్నప్పుడు ఉడుతలు చిన్న రాళ్ళు మరి ఇసుక రేణువులను తీసుకువచ్చాయని చెప్పబడుతుంది.

అవి కూడా దానిలో చేయి వేశాయి, అవి కూడా వారధి నిర్మించడానికి దోహదపడ్డాయి. భారీ రాళ్ళను తీసుకువచ్చిన ఇతరులు ఉన్నారు. ఆ చిన్ని ఉడుతలు తాము చేయగలిగినది చేశాయి.

మీ వస్త్రాల రంగును మార్చడం నుంచి మరీ ఎక్కువగా ఆశించకండి, ఎందుకంటే కేవలం వస్త్రాలను మార్చడం ద్వారా ప్రతీదీ మారిపోగలిగితే కనుక అది అత్యంత సులభతరమైనది అయివుండేది. కేవలం మీ మెడ చుట్టూ ఓ మాలను ధరించడం ద్వారా ఎంతో జరిగిపోతుంది అనీ, రూపాంతరీకరణ సంభవిస్తుంది అనీ ఆశించకండి. రూపాంతరీకరణ అనేది అంత చవకనైనది కాదు. కానీ అది కేవలం ఒక ఉడుత యొక్క పని మాత్రమే; అది ఏమి చెయ్యగలదు అని కూడా అనుకోకండి. రాముడు ఉడుతలకు కూడా కృతజ్ఞతలు చెప్పాడు.

ఈ చిన్న ఉపకరణాలు కూడా దోహదపడతాయి. ఈ విధంగా దోహదపడుతాయి : మీరు ఆకస్మికంగా కాషాయ వస్త్రాలలో మీ గ్రామానికి తిరిగి వెళతారు. ఊరంతా మీ వైపు సంభ్రమంతో చూస్తుంది. ఆ గ్రామంలో మీరు ఇంతకు ముందు జీవించినట్లుగా మీరు జీవించలేరు. ఇంతకు ముందు ఉన్నట్లు ఆ గ్రామంలో మీరు మరుగున ఉండిపోలేరు, మీరు గ్రామానికి మీతోపాటుగా ఒక వ్యక్తిత్వాన్ని తీసుకువస్తారు. ఏమి జరిగిందని ప్రతి ఒక్కరూ అడుగుతారు. ఏదో సంభవించింది అని ప్రతి ఒక్కరూ మీకు జ్ఞాపకం చేస్తారు. ప్రతీ ఒక్కరూ మిమ్మల్ని ప్రశ్నిస్తారు. మీ స్మృతిని ప్రతి ఒక్కరూ మేల్కొలుపుతారు. ఒక సాక్షిగా తయ్యారవ్వాలని మీకు మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ మీకు ఓ అవకాశాన్ని ఇస్తారు.

ఒక మిత్రుడు సన్యాసం తీసుకున్నాడు మరి అనంతరం అతను విలపించడం ప్రారంభించాడు... ఒక సరళమైన వ్యక్తి మరి అతను అన్నాడు, " కేవలం ఒక్క సమస్య ఉంది : నేను మద్యం సేవిస్తాను, మరి నిశ్చయంగా దానిని వదిలెయ్యమని మీరు నన్ను అడుగుతారు."

నేను అన్నాను, " నేను ఎవ్వరినీ ఏదీ విసర్జించమని ఎన్నడూ అడుగను. త్రాగు, కానీ ధ్యానాత్మకంగా త్రాగు."

అతను అన్నాడు : " మీ ఉద్దేశ్యం ఏమిటి ? ఒక సన్యాసిగా ఉండి కూడా నేను మద్యం సేవించవచ్చా."

అతను ఒక నెల తరువాత తిరిగి వచ్చి ఇలా అన్నాడు, " మీరు నన్ను మాయ చేశారు ! నేను పబ్ దగ్గర నిలబడి ఉన్నప్పుడు ఒక మనిషి వచ్చి నా

పాదాలను స్పృశించాడు. మరి ఇలా అన్నాడు, ‘ మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు, స్వామీజీ ?’, నేను అక్కడి నుండి పారిపోయాను, “ పబ్‌లో ఒక స్వామీజీనా ?” అని నాతో నేను అనుకుంటూ.

అతను నాతో అన్నాడు, “ మీరు నన్ను మాయజేశారు. ఆ పబ్ దిశగా వెళ్ళాలన్నా కూడా ఇప్పుడు నేను భయపడుతున్నాను. ఎవ్వరైనా నా పాదాలను స్పృశించడం లేదా నాకు వంగి నమస్కరించడం లాంటిది ఏదైనా చేస్తే ఎలా ? నేను అక్కడకు వెళ్ళి ఇప్పటికి పదిహేను రోజులు అయ్యింది.” ఒక జ్ఞప్తి సంభవించింది. ఎరుక జాగృతమయ్యింది ! ఈ కాషాయ వస్త్రాలను వినియోగిస్తూ మీరు నిన్నటివరకూ చేసినట్లుగానే మీరు కోపాన్ని తెచ్చుకోలేరు. ఏదో మిమ్మల్ని బలంగా లాగుతుంది. దానిని మరచిపొమ్మని ఏదో మీకు చెబుతుంది. ఈ కాషాయ వస్త్రాలలో అది ఎంతో వికారమైనదిగా కనిపిస్తుంది.

కేవలం కొద్దిపాటి సమస్యను కల్పించడానికే నేను మీకు కాషాయ వస్త్రాలను ఇస్తాను, అంతే తప్ప ఇంకేమీ కాదు. మీరు ఒక దొంగ అయితే కనుక మీరు అంత సులభంగా ఓ దొంగగానే ఉండిపోలేరు. మీకు డబ్బు పిచ్చి, అత్యాశ, ఉంటే కనుక, అప్పుడు మీ అత్యాశ అంతే బలంతో ఉండలేదు. మీరు రాజకీయాలలో ఉంటే, రాజకీయ పదవి యొక్క కీర్తి వెనుక పరుగు పెడుతూంటే కనుక, అది అర్ధరహితమైనదని మీరు ఆకస్మికంగా కనుగొంటారు. ఈ చిన్న విషయం, ఈ వస్త్రాలు, ఎంతో సంకేతాత్మకమైనవి అవుతాయి. వాటికి వాటి స్వంత ప్రాముఖ్యత ఉండదు, కానీ మీరు వాటిని ధరించినప్పుడు ఏదైతే ఒక అతి చిన్న విషయమై ఉందో ... ఆ విత్తనం అతి చిన్నది ... అది క్రమంగా పెద్దదిగా మారింది, క్రమక్రమంగా ప్రతీదానినీ మార్చింది అని మీరు క్రమక్రమంగా తెలుసుకుంటారు. అది మీ చురుకుదనాన్ని మార్చుతుంది, అది మీ అలవాట్లను మార్చుతుంది, అది మీ ప్రవర్తనా శైలినీ మరి కదలికనూ మార్చుతుంది. మీ జీవితంలో ఒక నూతన శోభ ఉంటుంది. మీ పట్ల ప్రజల యొక్క అపేక్ష మార్పు చెందుతుంది. ప్రజల యొక్క కళ్ళ మీవైపు విభిన్నంగా చూస్తాయి.

మీ పేరును మార్చుకోవడంతో మీ పాత పేరు నుంచి మీరు వేరు చేయబడతారు. మీ వస్త్రాలను మార్చుకోవడంతో మీ పురాతన నమూనా నుంచి మీరు స్వతంత్రులు అవుతారు. మీ కంఠం చుట్టూ ఉన్న ఈ మాల మీకు నన్ను గుర్తు చేస్తూనే వుంటుంది. అది మీకు మరి నాకు మధ్య ఒక వారధి అవుతుంది ... మీరు అంత సులభంగా నన్ను మరచిపోలేరు. మరి ప్రజలు మిమ్మల్ని దూరంగా ఉంచడం ప్రారంభిస్తారు.

మరి వాళ్ళు మిమ్మల్ని దూరంగా ఉంచడం అనేది మీరు ఓ సాక్షిగా ఉండేందుకు గొప్ప సహాయకారి అవుతుంది.

కానీ కేవలం దీనిని చేయడం ద్వారానే ప్రతీదీ సంభవిస్తుంది అని నేను చెప్పడం లేదు ... కేవలం వస్త్రాలను మార్చడం, ఆ మాలను ధరించడం మరి అది అయిపోయిందనీ, ప్రయాణం పూర్తయిపోయిందనీ అనుకోవడం. అదంతా మీపై ఆధారపడి ఉంటుంది. ఇవి గుర్తులు తెలిపే స్తంభాలలాంటివి, బాట ప్రక్కన " పన్నెండు మైళ్ళు," " యాభై మైళ్ళు," " ఢిల్లీకి వంద మైళ్ళు ", అని వ్రాయబడి వున్న మైలురాయి ఉన్నా లేకపోయినా, ఢిల్లీకి అది వంద మైళ్ళ దూరంలో ఉంటే కనుక అది వంద మైళ్ళ దూరమే. కానీ రాతిపై వ్రాయబడి వున్న ఈ వాక్యాలు ప్రోత్సహకరమైనవి, ఈ బాణం గుర్తులు ప్రయాణికుడిని తేలికపరుస్తాయి. అతను అంటాడు, " ఫరవాలేదు, కేవలం వంద మైళ్ళే వెళ్ళాలి, ఇరవై అయిదు మైళ్ళే వెళ్ళాలి, యాభై మైళ్ళే వెళ్ళాలి."

స్విట్జర్లాండులో, మైలు రాళ్ళ స్థానంలో వాళ్ళు ' నిమిషపు-రాళ్ళు ' పెట్టారు. ఏదైనా పర్వత ప్రాంతంలో మీరు మీ కారును ఆపితే కనుక గత స్టేషను ఎంత దూరంలో ఉంది అనేది తెలిపే సైన్‌పోస్టును చూసి మీరు ఆశ్చర్యపోతారు ... ముప్ఫయి నిమిషాల దూరం. తదుపరి స్టేషను ... పదిహేను నిమిషాల దూరం. అది ఒక అర్థవంతమైన సూచన ... గడియారాలను తయారు చేయడంలో స్విస్ ప్రజలు నిష్ణాతులు కనుక అది మహదాశ్చర్యకరమైనదేమీ కాదు. సమయం గురించిన వారి ఎరుక అత్యంత లోతైనది. వాళ్ళు మైళ్ళను వ్రాయరు, వాళ్ళు సమయాన్ని వ్రాస్తారు : " పదిహేను నిమిషాల దూరం " ! ఈ ప్రజలలో సమయం యొక్క ఎరుక ఎంత లోతుగా వుంది అనే విషయాన్ని అది తెలియజేస్తుంది.

మీరు కాషాయ వస్త్రాలు ధరిస్తే కనుక అది మీ గురించి ఏదో తెలియజేస్తుంది. ప్రతీదీ ఓ సందేశాన్ని అందిస్తుంది. మీరు ఎలా కూర్చుంటారు, మీరు ఎలా కదులుతారు, మీరు ఎలా కనిపిస్తారు ... ప్రతీదీ మీ గురించి ఏదో తెలియజేస్తుంది.

మనం సైనికులకు ఎన్నడూ వదులైన వస్త్రాలు ధరింపజేయము, ప్రపంచంలో ఎవ్వరూ అది చెయ్యరు. వాళ్ళు వదులైన వస్త్రాలను ధరించి వుంటే కనుక వాళ్ళు ఓడించబడతారు. సైనికులకు అలా వస్త్రాలు ధరింపజేయడం అనేది ప్రమాదకరమైనదిగా నిరూపితం కావచ్చు. మనం సైనికులకు బిగుతైన దుస్తులను ధరింపజేస్తాం, ఎంత బిగుతైనవంటే వాళ్ళు ఎల్లప్పుడూ అసౌఖ్యాన్ని అనుభవిస్తారు

మరి వాళ్ళు వాటిలోనుంచి బయటపడాలని కోరుకుంటారు. బిగుతైన వస్త్రాలు పోరాట స్వభావాన్ని ప్రేరేపిస్తాయి.

బిగుతైన వస్త్రాలలో కూర్చుని వున్నవాళ్ళు ఎల్లప్పుడూ పోట్లాటకు సిద్ధంగా ఉంటారు. వదులైన వస్త్రాలను ధరించినప్పుడు ఎవరైనా కొద్దిగా విశ్రమిస్తారు. కేవలం ఒక చక్రవర్తి మాత్రమే వదులైన వస్త్రాలు ధరిస్తాడు, లేదా ఒక సన్యాసి, ఒక ఫకీరు. వదులైన వస్త్రాలను ధరించి మెట్లు ఎక్కుతున్నప్పుడు మీరు ఒకసారి ఒక మెట్టు మాత్రమే ఎక్కుతారు ; బిగుతైన వస్త్రాలు ధరించినపుడు మీరు ఒకేసారి రెండు మెట్లు ఎక్కుతారు అనేది మీరు ఎప్పుడైనా గమనించారా. బిగుతైన వస్త్రాలను ధరించి వున్నప్పుడు మీరు కోపంతో నిండి వుంటారు. ఎవరైనా ఒక చిన్న మాట అన్నా కూడా మీరు కలత చెందుతారు. వదులైన వస్త్రాలలో మీరు విశ్రమించి వుంటారు.

చిన్న విషయాలే వ్యత్యాసాన్ని కలిగిస్తాయి. జీవితం చిన్న విషయాలతోనే నిండి వుంటుంది. జీవితం అనే వారధి ఉడుతల చేత తీసుకురాబడిన చిన్న చిన్న రాళ్ళతోనే నిర్మించబడింది. మీరు ఏం తింటారు, మీరు ఏమి ధరిస్తారు, మీరు ఎలా లేస్తారు మరి కూర్చుంటారు ... చివరగా ఇవి అన్నీ తమ ప్రభావాన్ని కలిగి వుంటాయి. మీరు వీటన్నింటి కలయిక. ఇక్కడ ఒక మనిషి తళుకులీనే, గాడీ అయిన, రంగురంగుల దుస్తులను ధరించి నడుస్తూ వెళుతున్నాడు ... అది ఒక సందేశాన్ని అందిస్తుంది. ఒక స్త్రీ అసభ్యమైన, తన ఒంపులను ప్రదర్శిస్తున్న అశ్లీల వస్త్రాలను ధరించి నడచి వెళుతోంది.... అది ఒక సందేశాన్ని అందిస్తుంది. ఒక మనిషి దుస్తులను ధరించి వున్నాడు ... అతని గురించిన ఒక సందేశం అందించబడింది.

మనోవైజ్ఞానికులు చెప్పేది ఏమిటంటే మీరు ఎవరినైనా అరగంటసేపు నిశ్శబ్దంగా గమనిస్తే కనుక ... అతను తన దుస్తులను ఎలా ధరిస్తాడు, అతను ఎలా లేచి నిలబడతాడు, అతను ఎలా కూర్చుంటాడు, అతను ఎలా చూస్తాడు ... మీరు ఆ మనిషి గురించి ఎన్ని విషయాలను తెలుసుకుంటారంటే మీరు దానిని నమ్మలేరు. మన ప్రతి కదలిక యొక్క విధానం, ప్రతి సంజ్ఞ మనవే. సంజ్ఞలో మార్పు ద్వారా మనం మార్పు చెందుతాం ; మనలో మార్పు వలన మన సంజ్ఞలు మార్పు చెందుతాయి.

కనుక ఇవి కేవలం సూచనలే. ఇవి మీతోనే వుంటాయి. ఇవి మిమ్మల్ని నిర్దేశిస్తూ ఉంటాయి. అప్రమత్తంగా ఉండడంలో ఇవి మీకు కొంత సహాయాన్ని అందిస్తాయి.

" సాక్షీతత్వం, జాగృతి మరి సరైన స్మృతి మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని కూడా దయచేసి వివరిస్తారా." ఏ వ్యత్యాసమూ లేదు ; ఇవన్నీ వివిధ సంప్రదాయాల చేత వినియోగించబడే పర్యాయపదాలు. కృష్ణమూర్తి " జాగృతి " ని ఉపయోగిస్తాడు, బుద్ధుడు వినియోగించేది " సరైన స్మృతి ", ' జాగరూకత ' ; అష్టావక్రుడు, ఉపనిషత్తులు, గీత, అంతా ' సాక్షీతత్వాన్ని ' ఉపయోగిస్తారు. వ్యత్యాసం అనేది కేవలం సంప్రదాయానికి చెందినదే. కానీ అవి అన్నీ ఒకే దిశను సూచిస్తాయి.

రెండవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

అష్టావక్రుడిపై మీ ప్రథమ ప్రసంగ తరుణంలో అనేకమంది ఎంతగానో విలపించారు. దీని భావం ఏమిటి ? ఆ విలపిస్తున్న వారు దుర్బల హృదయంగలవారా , లేదా అది మీ స్వరం యొక్క శక్తేనా ? దయచేసి దీనిపై కొంత కాంతిని ప్రసరించండి ?

ఒక విషయం నిశ్చయం : ఈ ప్రశ్న వేస్తున్నది ఓ కఠిన హృదయుడైన మనిషి. అతను కన్నీళ్ళలో కేవలం దుర్బలత్వాన్ని మాత్రమే చూస్తాడు. ప్రశ్నిస్తున్న వ్యక్తి కన్నీళ్ళు ఇంకిపోయి, ఆ కళ్ళు ఒక ఎడారిలాగా బీడుపడిపోయాయనేది స్పష్టం. వాటిలో పువ్వులు వికసించవు... కన్నీళ్ళు అనేవి కనుల యొక్క కుసుమాలు.

ఈ ప్రశ్నిస్తున్న వ్యక్తి అనుభూతులు మృతమైపోయాయి. ప్రశ్నిస్తున్న వ్యక్తి హృదయం మొద్దుబారిపోయింది. ఈ ప్రశ్న వేస్తున్న వ్యక్తి కేవలం వివేకం ద్వారానే జీవిస్తున్నాడు. అతను తన మృత భావాలకు తర్పణాలు వదిలేశాడు. అతను ఆలోచనల్లో జీవిస్తూ ఉండుండాలి. ప్రేమ మరి దయ, జీవితం పట్ల గౌరవం, శృంగారం, పరమానందం... వీటన్నింటి సంభావ్యతనూ అతను నిరాకరించి ఉండాలి. ఏ వెల్లువా ప్రవహిస్తున్నట్లుగా కనిపించడంలేదు. అతని హృదయం ఒక ఎడారిలా శుష్కమైపోయి ఉంటుంది. కనుక అతనికి తోచిన మొదటి విషయం ఏమిటంటే ఇక్కడ విలపిస్తున్నవారు దుర్బల-హృదయులు.

విలపించడం అనేది దుర్బలత్వానికి సూచన అని మీకు ఎవరు చెప్పారు ? మీరా ఆపు లేకుండా విలపించింది ; చైతన్యుడి కళ్ళ నుంచి కన్నీళ్ళ సెలయేళ్ళు ప్రవహించాయి. లేదు, అవి దుర్బలత్వపు సూచనలు కాదు, అవి అనుభూతి యొక్క చిహ్నాలు, బలమైన అనుభూతి యొక్క చిహ్నాలు. మరి గుర్తుంచుకోండి అనుభూతి అనేది ఆలోచించడం కన్నా లోతైనది. నేను ముందుగానే చెప్పినట్లు, మొదట చర్య

యొక్క దశ, తరువాత ఆలోచన యొక్క దశ, తరువాత అనుభూతి, అనంతరం సాక్షితత్వపు కేంద్రం.

అనుభూతి అనేది సాక్షికి అత్యంత చేరువగా ఉంటుంది.

భక్తి అనేది దివ్యత్వానికి అత్యంత చేరువగా ఉంటుంది. చర్య అనేది అతి దూరంలోనిది ; అక్కడి నుంచి ఆ ప్రయాణం అత్యంత సుదీర్ఘమైనది. ఆలోచన కూడా సుదూరంలోనిదే ; అది కూడా ఓ సుదీర్ఘయానమే. భక్తి అత్యంత చేరువలోనిది.

గుర్తుంచుకోండి, కన్నీళ్ళకు కారణం అవశ్యంగా దుఃఖమే అయివుండాల్సిన అవసరం లేదు, ప్రజలు కేవలం ఒకే ఒక విధమైన కన్నీళ్ళతో పరిచితులై ఉన్నప్పటికీ ... దుఃఖాశృవులకు. దయలో కూడా కన్నీళ్ళు స్రవిస్తాయి, ఆనందంలో కూడా కన్నీళ్ళు స్రవిస్తాయి ; ధన్యవాదాలను తెలుపడంలో, కృతజ్ఞతలను తెలుపడంలోనూ కన్నీళ్ళు స్రవిస్తాయి. నియంత్రించుకోవడం కష్టమైనది ఏదో అంతరంగంలో సంభవిస్తోంది అనేదానికి కన్నీళ్ళు ఒక సూచన మాత్రమే ... దుఃఖం లేదా ఆనందం. అంతరంగంలో సంభవిస్తున్నదేదో ఎంత పుష్కలమైనదిగా ఉందంటే అది పొంగిపొరలడం ప్రారంభిస్తుంది. మరి అది దుఃఖం అయితే కనుక ... ఎంత లోతైన దుఃఖమంటే దానిని అంతరంగంలో నియంత్రించడం కష్టం, అది కన్నీళ్ళలో ప్రవహిస్తుంది. కన్నీళ్ళు అనేవి ఒక విడుదల. లేదా, ఆనందం మరీ ఎక్కువగా నిండిపోతే, ఆనందాశృవులు స్రవిస్తాయి. కన్నీళ్ళు అనేవి బయటకు వెళ్ళే మార్గం.

కన్నీళ్ళు అనేవి ఆవశ్యకంగా దుఃఖం లేదా ఆనందంతోనే సంబంధం కలిగివుండాల్సిన అవసరం లేదు ... అవి అతి పుష్కలతతో సంబంధాన్ని కలిగివుంటాయి. ఏది అధికం అయినా, కన్నీళ్ళు వాటిని పీల్చుకుంటాయి మరి కడిగేస్తాయి. కనుక విలపిస్తున్నవారి అంతరంగంలో ఓ అతి పుష్కలత్వం సంభవించి వుంటుంది, వారి హృదయంలోనికి ఏదో మధుర బాధ ప్రవేశించి ఉంటుంది. అవిదితమైనదాని యొక్క గుసగుసను వాళ్ళు విని ఉంటారు. సుదూరపు అవిదితం యొక్క ఓ కిరణం హృదయాన్ని స్పృశించి ఉంటుంది. వాళ్ళ అంధకారంలోనికి ఏదో దిగి వచ్చి వుంటుంది. ఏదో బాణం వాళ్ళ హృదయాన్ని వేదన మరి బ్రహ్మానందాలతో నింపి వుంటుంది ... వాళ్ళు తమ కన్నీళ్ళను ఆపుకోలేకపోయారు.

దీనికీ మరి నా మాటల యొక్క శక్తికీ మధ్యన ఏ బాంధవ్యమూ లేదు, ఎందుకంటే నువ్వు కూడా వింటున్నావు. అది కేవలం నా వాక్కు యొక్క శక్తే అయితే కనుక అప్పుడు నువ్వు కూడా విలపించి ఉండేవాడివి, ప్రతి ఒక్కరూ విలపించి వుండేవారు. లేదు, అది నా వాక్కు కన్నా కూడా శ్రోతల యొక్క హృదయపూర్వకత్వంతో

ఎక్కువ బాంధవ్యాన్ని కలిగివుంది. విలపించేవారు, విలపించారు. మరి విలపించడం అనేది ఒక మహత్తర శక్తి.

మానవాళి ఒక అత్యంత అద్వితీయమైన సామర్థ్యాన్ని కోల్పోయింది... ప్రత్యేకించి పురుషులు దానిని చేజార్చుకున్నారు. స్త్రీలు దానిని కొంత కాపాడుకున్నారు. స్త్రీలు భాగ్యశాలులు. మానవుల కళ్ళలోని అశృగ్రంధులు పురుషుడిలో మరి స్త్రీలో ఒకే విధంగా ఉన్నాయి ; ప్రకృతి అశృగ్రంధులను సారూప్యతతో రూపొందించింది. ప్రకృతి యొక్క ఉద్దేశ్యం స్పష్టంగానే ఉంది : ఇరువురి కళ్ళూ విలపించడానికి రూపొందించబడినవే. కానీ పురుషాహంకారం నెమ్మది నెమ్మదిగా ప్రతిదాన్నీ నియంత్రించింది. విలపించడం అనేది స్త్రీత్వ సంబంధమైనది అని పురుషులు క్రమ క్రమంగా అనుకోవడం ప్రారంభించారు ; కేవలం స్త్రీలే విలపిస్తారు. దీనివలన పురుషులు ఎంతో కోల్పోయారు... వాళ్ళు భక్తిని కోల్పోయారు, వాళ్ళు అనుభూతిని కోల్పోయారు, వాళ్ళు ఆనందాన్ని కోల్పోయారు, వాళ్ళు కృతజ్ఞతను కోల్పోయారు. దీనివలన వాళ్ళు వేదన యొక్క మహత్త్వాన్ని కోల్పోయారు, ఎందుకంటే వేదన సైతం దోషరహితం చేస్తుంది, పరిశుద్ధం చేస్తుంది.

ఇందువలనే పురుషుల యొక్క జీవితాలలో ఒక పెను వైపరీత్యం చోటు చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్మాదులయ్యే పురుషుల సంఖ్య స్త్రీల సంఖ్యకు రెట్టింపు వుంటుందని తెలుసుకుని మీరు ఆశ్చర్యపోతారు. మరి యుద్ధాలు నిలిపివేయబడితే కనుక ఈ సంఖ్య ఎంతో పెరిగిపోతుంది, ఎందుకంటే పురుషులు తమ ఉన్మాదాన్ని యుద్ధంలో విడుదల చేస్తారు, దానిని హెచ్చు పరిమాణంలో విడుదల చేస్తారు ! వంద సంవత్సరాల పాటు యుద్ధాలు పూర్తిగా నిలిపివేయబడితే కనుక, మొత్తం పురుషులలో తొంభై శాతం మంది ఉన్మాదులైపోతారని భయపడడం జరుగుతోంది.

పురుషులు స్త్రీల కంటే అధికంగా ఆత్మహత్యలు చేసుకుంటారు... రెట్టింపు సంఖ్యలో. సామాన్య విశ్వాసం మరోవిధంగా వుంటుంది, ఎక్కువమంది స్త్రీలు ఆత్మహత్య చేసుకుంటారని మీరు అనుకుంటారు. వాళ్ళు దాని గురించి మాట్లాడుతారు, కానీ వాళ్ళు దానిని చేసుకోరు. వాళ్ళు మాత్రలు లేదా మరేదో తీసుకుంటారు, మరి నిద్రపోతారు, కానీ వాళ్ళు ఆ మాత్రలను జాగ్రత్తగా తీసుకుంటారు.

కనుక ఆత్మహత్యా ప్రయత్నాలను స్త్రీలు అధికంగా చేస్తారు, కానీ సఫలీకృతులు కారు. వాళ్ళు తమ ప్రయత్నాలను జాగ్రత్తగా చేస్తారు. వాస్తవానికి, స్త్రీలు ఆత్మహత్య చేసుకోవాలని కోరుకోరు ... ఆత్మహత్య అనేది వారి ఫిర్యాదును వ్యక్తీకరించే ఓ విధానం మాత్రమే. ఈ జీవితం జీవించదగినది కాదనీ, ఒక మెరుగైన జీవన శైలి

అవసరమనీ వారు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటున్న ఓ స్త్రీ మీకు చెబుతున్నది ఏమిటంటే మీరు ఎంత శిలా హృదయులైపోయారంటే ఆమె తనను తాను చంపుకోవడానికి సిద్ధపడితే తప్ప మీరు ఆమె పట్ల ఏ శ్రద్ధనూ చూపడం లేదు. ఆమె కేవలం మీ శ్రద్ధను ఆకర్షిస్తోంది.

ఇది అత్యంత అనుచితమైనది ... మీ శ్రద్ధను ఆకర్షించేందుకు మరణించడాన్ని ఓ సాధనంగా ఆమె వినియోగించాల్సి రావడం. పురుషుడు నిశ్చయంగానే అసాధారణ కఠినత్వంతో ఉన్నాడు, ఒక శిలలాగా తయారయ్యాడు.

స్త్రీలు మరణించాలని అనుకోరు, వాళ్ళు జీవించాలని కోరుకుంటారు. జీవన పథంలో మరీ అతిగా సమస్యలు వచ్చినప్పుడు ... వినేవారు ఎవ్వరూ లేరు, శ్రద్ధను చూపేవారు ఎవ్వరూ లేరు ... మీరు శ్రద్ధ చూపేలా చేయడానికి వాళ్ళు ఆత్మహత్యను ఒక మార్గంగా ఉపయోగిస్తారు, కానీ పురుషులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు వాళ్ళు సఫలమవుతారు. పురుషులు ఉన్మాదంలో ఆత్మహత్య చేసుకుంటారు.

ఎక్కువమంది పురుషులు మానసికంగా అస్వస్థులు. ఎందుకు ? ఎన్నో కారణాలు ఉన్నాయి, వాటిలో ఒకటి కన్నీళ్ళు. పురుషులు మళ్ళీ ఏడవడం ఎలాగో నేర్చుకోవాలి అని మనోవైజ్ఞానికులు అంటారు. విలపించకపోవడం అనేది ఒక బలం కాదు. మీరు బలం అని పిలిచేది మొండితేలిపోవడమే. బలం అనేది అంత కఠినమైనదిగా ఉండదు, బలం అనేది సున్నితమైనది. కొండల మీద నుంచి క్రిందకు పారే జలపాతాలను, సెలయేళ్ళను, పడుతూండగా మీరు చూశారు ... సున్నితమైన నీరు. రాయి అత్యంత కఠినమైనది. రాయి నిశ్చయంగానే తాను బలమైనదాననినీ, మరి ప్రవహిస్తున్న నీరు దుర్బలమైనదనీ అనుకుంటుంది. కానీ చివరకు ఆ ప్రవహిస్తున్న నీరే గెలుపొందుతుంది. ఆ రాయి ఇసుకగా క్షీణింపజేయబడుతుంది మరి కొట్టుకు పోతుంది.

దివ్యత్వం సున్నితత్వంతోనే ఉంటుంది.
" దివ్యత్వం అనేది శక్తిహీనుల యొక్క శక్తి."

ఒక పువ్వు వికసించింది మరి దాని సమీపంలో ఒక రాయి వుంది. అవశ్యంగానే ఆ రాయి బలమైనదిగా, పువ్వు బలహీనమైనదిగా కనిపిస్తుంది. కానీ పువ్వు యొక్క శక్తిని మీరు ఎప్పుడైనా చూశారా ... జీవం యొక్క శక్తిని ? ఒక రాయికి ఎవరు మోకరిల్లుతారు ? దివ్యత్వం యొక్క చరణాల వద్ద సమర్పించడానికి మీరు ఓ రాయిని తీసుకెళ్ళరు. రాయి ఎంతో బలమైనది కనుక మీరు దానిని మీ ప్రేయసికి ఇవ్వాలని మీరు అనుకుంటారా ? లేదు, మీరు అది చెయ్యరు. మీరు పువ్వులను ఇస్తారు, ఒక

పువ్వుకు బలం వుంది. ఒక పువ్వుకు మహనీయత ఉంది. సౌకుమార్యమే దాని బలం. దాని బలహీనత కూడా దాని బలమే. అది ఉదయం విచ్చుకుంటుంది, మరి సాయంత్రానికల్లా అది ముడుచుకుపోతుంది... ఇదే దాని బలం. కానీ అది పుష్పిస్తుంది. ఒక రాయి ఎన్నటికీ పుష్పించదు, అది కేవలం ఉంది. ఒక రాయి మృతమైనది. ఒక పువ్వు సజీవమైనది ... మరి అది మరణిస్తుంది ఎందుకంటే అది జీవించింది. ఒక రాయి ఎన్నడూ మరణించదు, ఎందుకంటే అది ఇప్పటికే మరణించింది.

సున్నితంగా తయారవ్వండి. కన్నీళ్ళను మళ్ళీ వెనక్కు పిలవండి. మీ కళ్ళను గీతం మరి కవిత్వంతో వాటిని నింపనివ్వండి ; లేదంటే మీరు ఎన్నో విషయాలను పోగొట్టుకునే వుంటారు. మీ దైవం హేతుబద్ధమైనదిగానే వుంటుంది, హృదయానుభవంగా కాదు ; కేవలం ఒక వాదమే, ఒక రుచి మరి సత్యం యొక్క ఓ అనుభవమూ కాదు.

కన్నీళ్ళను స్రవించనిచ్చేవాళ్ళు అదృష్టవంతులు ... వాళ్ళు బలవంతులు. మీరు ఏమన్నా వాళ్ళు లెక్క చెయ్యరు, ఇతరులు ఏమంటున్నారు అనేదాని గురించి వాళ్ళు పట్టించుకోరు. ఎవరైనా పూర్తిగా విలపిస్తున్నప్పుడు అతను విమర్శలతో ఏ నిమిత్తాన్నీ కలిగివుండడు. మీరు పట్టించుకోకుండా ఉండగలగడానికి మరి " జనాలు ఏమని అంటారు ?" అని అనకుండా ఉండడానికి బలం కావాలి. వాళ్ళను మాట్లాడనివ్వండ! అపకీర్తి ? ... దాన్ని ఉండనివ్వండి. " నన్ను గుండెల నిండుగా విలపించనివ్వండి."

ఒక పురుషుడు ఏడ్చినప్పుడు, ఒక పసిబాలుడిలా రోదించినప్పుడు, అతని బలాన్ని గురించి ఆలోచించండి. మీ అందరి గురించీ అతను బెంగపడడం లేదు. అతను, ఇతరుల్లా, ప్రజలు ఏమనుకుంటారోనని దిగులు పడడం లేదు : " ఒక విశ్వవిద్యాలయపు ప్రొఫెసరునైన నేను మరి విలపించడమా ? ఒక విద్యార్థి చూస్తే కనుక !" లేదా, " అంత పెద్ద వ్యాపారవేత్త మరి విలపించడమా ? ఒక ఖాతాదారు చూస్తే కనుక...!" లేదా, " అంతటి బలవంతుడైన భర్త మరి విలపించడమా ? నా భార్య దగ్గరలోనే వుంది, మరి మేము ఇంటికి వెళ్ళిన తరువాత ఆమె నా అంతు చూస్తుంది." లేదా, " నేను ఒక తండ్రిని మరి విలపిస్తున్నాను, నా కుమారుడు చూస్తే కనుక, పసిపిల్లలు చూస్తే కనుక... నిన్ను నువ్వు నియంత్రించుకో !" మీ అహం వెనక్కు లాగుతుంది, నియంత్రిస్తుంది. అహంకార శూన్యులుగా, మీరు విలపిస్తారు. అహం ఎల్లప్పుడూ తనను తాను నియంత్రణలో ఉంచుకుంటుంది. అహంకార శూన్యులుగా మీరు ప్రవహిస్తారు, మీలో ఒక ప్రవాహం వుంది. ఒక కవి అంటాడు :

జ్వలించినది ఏదైనా ఆరిపోతుంది,

ఒకసారి ఆరిపోతే దానిని తిరిగి రగిలించడం సాధ్యం కాదు.

ప్రేమలో జ్వలించినవారు, ఓ రహీమ్,

మళ్ళీ మళ్ళీ రగులుతూనే ఉంటారు.

బొగ్గులు మండుతాయి ... " అవి తమంతట తాము మండుతాయి మరి ఆరిపోతాయి " ... కానీ అవి చివరగా ఆరిపోయే ఓ క్షణం వస్తుంది, అప్పుడు మీరు వాటిని తిరిగి రగిలించలేరు. బూడిదను మండే బొగ్గులుగా చేయడంలో ఎవ్వరైనా ఎన్నడైనా సఫలీకృతులయ్యారా !

జ్వలించినది ఏదైనా ఆరిపోతుంది,

ఒకసారి ఆరిపోతే దానిని తిరిగి రగిలించడం సాధ్యం కాదు

ఒకసారి అవి ఆరిపోతే అవి ఎన్నటికీ జ్వలించవు

ప్రేమలో జ్వలించినవారు, ఓ రహీమ్...

కానీ ప్రేమ బాణం వలన హృదయానికి గాయమైనవారి గురించి రహీమ్ ఏం చెబుతున్నాడు ? " ప్రేమలో జ్వలించినవారు, ఓ రహీమ్, ఆరిపోతారు కానీ మళ్ళీ రగులుతూనే వుంటారు." వాళ్ళు మళ్ళీ మళ్ళీ జ్వలిస్తారు, వాళ్ళు మళ్ళీ మళ్ళీ ఆరిపోతారు మరి మళ్ళీ మళ్ళీ తిరిగి రగిలించబడతారు. ప్రేమ జ్వాల నిత్యమైనది, శాశ్వతమైనది.

నేను చెబుతున్నదానిని ప్రేమతో వినేవారు విలపించగలుగుతారు. నేను చెబుతున్నదానిని కేవలం వివేకంతోనే వినేవారు నా నుంచి కొన్ని ముక్తాయింపులనూ, కొంత జ్ఞానాన్నీ తీసుకుంటారు. వాళ్ళు బూడిదనే తీసుకుంటారు ... ప్రేమ యొక్క జ్వలిస్తున్న నిప్పు కణికలను కాదు. ఎన్నటికీ తిరిగి రగిలించలేని బూడిదనే వాళ్ళు తీసుకుంటారు. గుర్తుంచుకోండి, ఆ అగ్ని ఆరిపోయింది. నేను మీకు ఆ మాటలను చెప్పగానే అవి ఆరిపోతాయి. మీరు వివేకంతో వాటిని స్వీకరించినప్పుడు అది బూడిదే, మీరు హృదయం ద్వారా స్వీకరించినప్పుడు అది మండుతున్న నిప్పు కణిక.

ప్రేమ అనే బొగ్గు జనించిన వారిలో, ఆ అగ్ని జ్వలిస్తుంది, తరువాత ఆరిపోతుంది, అనంతరం తిరిగి రగులుతుంది. అది మీకు ఎంతో పరితాపాన్ని కలిగిస్తుంది. అది మిమ్మల్ని పరిశుద్ధం చేస్తుంది. అది మీ జీవితం యొక్క సంపూర్ణ రూపాంతరీకరణను తీసుకొస్తుంది.

మీరు మీ హృదయాన్ని తెరచి మరి విలపించగలిగితే, ప్రేమ యొక్క మండుతున్న నిప్పు కణికలు మిమ్మల్ని చేరుకున్నాయి అని దాని అర్థం. మీరు విలపించలేకపోతే కనుక, అది కేవలం వివేకాన్ని మాత్రమే చేరింది. కొద్దిపాటి బూడిద సేకరించబడుతుంది. మీరు కొద్దిగా తెలుసుకున్నవారు అవుతారు, ఇతరులకు వివరించడంలో మీరు పూర్తి నైపుణ్యంగలవారు అవుతారు, చర్చలో, వాదించడంలో మీరు ప్రవీణులవుతారు. కానీ ప్రధాన అంశం చేజారిపోయి ఉంటుంది. మీరు మండుతున్న నిప్పు కణికలను తీసుకోగలిగిన చోటు నుంచి మీరు కేవలం బూడిదతోనే తిరిగి వచ్చారు. మీరు దానిని పవిత్ర భస్మం అని పిలిచినా కూడా దాని వలన ఏ వ్యత్యాసమూ ఉండదు ... బూడిద అనేది బూడిదే.

అగ్ని రగిలించబడింది, నా హృదయం నుంచి వేదనా
స్వర మాధర్యాలు ఉదయిస్తున్నాయి ;
నీ ప్రేమ వ్యథలో నేను ఓ నిప్పులు కురిపించే నాలుకనయ్యాను.
వివేకం వలన దారి తప్పి సంచరిస్తూ ;
నేను సాగిపోతున్న ఊరేగింపు వెనుక ధూళినయ్యాను.
... అగ్ని రగిలించబడింది, నా హృదయం నుంచి వేదనా
స్వర మాధుర్యాలు ఉదయిస్తున్నాయి...

ఆ కన్నీళ్ళు అగ్ని రాజుకుంటున్న హృదయం యొక్క కన్నీళ్ళు.

ఎవరైనా విలపిస్తూండడం మీరు చూసినప్పుడు వెళ్ళి అతని సమీపంలో కూర్చోండి. అది దివ్య సత్సంగం యొక్క క్షణం... దానిని కోల్పోకూడదు. మీరు విలపించలేకపోతే కనుక, కనీసం మీరు వెళ్ళి విలపిస్తున్నవారి ప్రక్కన అయినా కూర్చోవచ్చు. మీరు అతని చేతిని మీ చేతులలోకి తీసుకోవచ్చు. మరి బహుశా మీకు కూడా ఆ అంటువ్యాధి సంక్రమించవచ్చు.

అగ్ని రగిలించబడింది, నా హృదయం నుంచి వేదనా
స్వర మాధుర్యాలు ఉదయిస్తున్నాయి:..

ఆ అగ్నిని రగులుతూనే ఉండనివ్వండి ! ఈ కాషాయ వస్త్రాలు అగ్ని యొక్క చిహ్నమే. అవి ప్రేమాగ్ని యొక్క చిహ్నం.

... నీ ప్రేమ వ్యథలో నేను ఓ నిప్పులు కురిపించే నాలుకనయ్యాను.

మరి మీ హృదయాంతరంగంలో పరితాపం కలిగినప్పుడు, విరహ భావన … దివ్య కాంక్ష … ఉదయించినప్పుడు, ప్రతి శ్వాసలోనూ అగ్ని, నాల్కలు చాచిన అగ్ని ఉన్నప్పుడు " … నీ ప్రేమ వ్యథలో నేను ఓ నిప్పులు కురిపించే నాలుకనయ్యాను."

వివేకం వలన దారి తప్పి సంచరిస్తూ…

వివేకం వలన నేను దారి తప్పిపోయాను.

వివేకం వలన దారి తప్పి సంచరిస్తూ :
నేను సాగిపోతున్న ఊరేగింపు వెనుక ధూళినయ్యాను.

మరి వివేకం వలన నా పరిస్థితి ఊరేగింపు వెళ్ళిపోయిన తరువాత వెనుక మిగిలిపోయే ధూళిలా తయారయ్యింది. నేను ధూళినయ్యాను. వివేకం యొక్క చేతులకు ధూళి తప్ప ఎప్పుడూ మరేదీ అంటుకోదు.

వివేకం వలన దారి తప్పి సంచరిస్తూ :
నేను సాగిపోతున్న ఊరేగింపు వెనుక ధూళినయ్యాను.
హృదయం ప్రకాశవంతమైనప్పుడు, ఓ కృష్ణమోహనా,
సరిహద్దులన్నీ మాయమైపోయాయి, మరి నేను అపరిమితమయ్యాను.
… హృదయం ప్రకాశవంతమైనప్పుడు, ఓ కృష్ణ మోహనా …

ప్రేమ తాకితే కనుక, ప్రేమ బాణం హృదయాన్ని తాకితే కనుక, నివురుగప్పిన నిప్పు కాంతివంతమైతే కనుక…

హృదయం ప్రకాశవంతమైనప్పుడు ఓ కృష్ణ మోహనా,
సరిహద్దులన్నీ మాయమైపోయాయి, మరి నేను అపరిమితమయ్యాను.

ఆ క్షణంలో సరిహద్దులన్నీ చెరిగిపోతాయి … మీరు అమితమైపోతారు. కన్నీళ్ళు అనేవి అనంతం వైపు మీ మొదటి అడుగు. మీరు కరగిపోతున్నారనీ, మీ స్థిరమైన ఎల్లలు కొద్దిగా కరిగిపోయాయనీ ; మీరు మృదువుగా అయ్యారనీ, మీరు ఉత్సాహంగా తయారయ్యారనీ, మీరు మీ ఉదాసీనమైన వివేకాన్ని కొద్దిగా వదిలిపెట్టారనీ, కన్నీళ్ళు సూచిస్తాయి. ఒక అగ్ని రాజుకుంది, ఉష్ణం హెచ్చుతోంది. కన్నీళ్ళు శీతలమైనవి కావు, ఈ కన్నీళ్ళు మహోష్ణమైనవి. మరి ఈ కన్నీళ్ళు మీరు కరగుతున్న వార్తను తెస్తాయి. మంచు కరగినప్పటిలాగానే, మీ అహం అంతరంగంలో కరగడం ప్రారంభించినప్పుడు, కన్నీళ్ళు స్రవిస్తాయి.

కోరికతో నిండివున్నప్పుడు ప్రతీ శ్వాసా నిప్పను వచించింది ;

ఇప్పుడు ప్రేమ దిగి వచ్చింది : నేను మూగదానినయ్యాను.

మీరు వివేకంతో నిండిపోయి, కోరికలతో నిండిపోయి, కోటిన్నొక్క విషయాల గురించిన ఆలోచనలతో నిండిపోయి వున్నప్పుడు, నాలుక పదునుగా మరి వేగంగా ఉంది.

కోరికతో నిండి వున్నప్పుడు ప్రతీ శ్వాసా నిప్పను వచించింది ;

ఇప్పుడు ప్రేమ దిగి వచ్చింది : నేను మూగదానినయ్యాను.

ఆ కన్నీళ్ళు భాషకు అతీతమైన స్థితి యొక్క సూచనలు. ఏదైనా సంభవించి మరి దానిని వ్యక్తీకరించగల మార్గమే లేనప్పుడు, మీరు విలపించకపోతే కనుక మీరు ఏమి చేస్తారు ?

మీరు మాట్లాడగల సామర్థ్యం లేనివారు అయినప్పుడు, కళ్ళు దానిని కన్నీళ్ళతో చెబుతాయి. వివేకం మాట్లాడగల సామర్థ్యం లేనిదైనప్పుడు, ఒకరు దానిని నృత్యం ద్వారా చెబుతారు.

మీరా నర్తించింది. వ్యక్తీకరించడానికి మాటలు కరవైనది ఏదో ఆమెకు సంభవించింది.

కాలి అందెలు కట్టుకుని, మీరా నాట్యంలో ప్రవేశిస్తుంది...

ఆమె రోదించింది, నిరంతరంగా రోదించింది. మాటలలో వ్యక్తీకరించడం అసాధ్యమైనదేదో సంభవించింది, మాటలు ఎంతో పరిమితమైనవిగా కనిపించాయి. కేవలం కన్నీళ్ళే దానిని చెప్పగలవు ... ఆమె దానిని కన్నీళ్ళతో చెప్పింది.

లేదు, ఈ వ్యక్తులు దుర్బలమైనవారు 'అనే ఈ అభిప్రాయాన్ని కలిగి వుండకండి. ఈ వ్యక్తులు దృఢమైనవారు. వారి బలం సున్నితత్వానికి చెందినది. వారి బలం పోరాటానికీ మరి హింసకూ చెందినది కాదు, వారి బలం హృదయానికి చెందినది. మీరు ఈ వ్యక్తులను దుర్బలమైనవారుగా పరిగణిస్తే కనుక మీరు ఎన్నటికీ విలపించరు. నేను మళ్ళీ మళ్ళీ నొక్కి చెబుతున్నాను, ఈ వ్యక్తులు దుర్బలమైనవారు అని అనుకోకండి. వారి పట్ల అసూయ చెందండి. అంతరంగంలోకి మళ్ళీ చూసుకోండి మరి అడగండి : " ఏమి జరగడం వలన నేను విలపించలేకపోతున్నాను ?"

అనుభూతితో నిండి వున్న ఓ వ్యక్తి తన స్వీయ కేంద్రానికి అత్యంత చేరువలో ఉంటాడు. మరి ఎవరైనా తనకు తాను ఎంత సమీపంగా వస్తే, అంత ఎక్కువగా

అతను తీవ్ర వేదనను అనుభవిస్తాడు. స్వగృహం నుంచి మీరు ఎంత దూరంగా వుంటే దానిని విస్మరించడం అంత సులభం అవుతుంది. స్వగృహం చేరువకు రాగానే, దాని స్మృతులు బలంగా వస్తాయి.

భగవంతుడిని పూర్తిగా విస్మరించి, మీరు కూర్చున్నారు. ' భగవంతుడు ' అనే పదం మీ చెవులకు సోకుతుంది, కానీ అది ఏ కదలికనూ సృష్టించదు. మీరు దానిని వింటారు, కానీ అది కేవలం ఒక పదం మాత్రమే. భగవంతుడు కేవలం ఓ పదం కాదు, కేవలం వినడం గురించినది కాదు ప్రశ్న. తమ అంతరంగంలో కొద్దిపాటి జీవాగ్ని కలిగి వున్నవారికి ' భగవంతుడు ' ఒక కుదుపును ఇస్తాడు ... ఆ పదమే ఒక అఘాతాన్ని ఇస్తుంది.

నువ్వు హృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తే కనుక,
నువ్వు ఎందుకు ఇలా నన్ను విలపింపజేస్తున్నావు ?

భక్తుడు ఎల్లప్పుడూ భగవంతుడికి ఫిర్యాదు చేస్తూనే వుంటాడు :

నువ్వు హృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తే కనుక,
నువ్వు ఎందుకిలా నన్ను విలపింపజేస్తున్నావు ?

నీ కాంతి యొక్క ఈ గాఢాంధకారంలో,
నువ్వు నీ కడగంటి చూపును నా చూపు నుంచి ఎందుకు దాచేస్తున్నావు ?
చెంతకు వచ్చి కూడా, నువ్వు ఎన్నడూ చేరువ కాలేదు ;
నువ్వు నన్ను ఎన్నడూ చెంతకు పిలువవు.
ఎందుకోసం నువ్వు నా చుట్టు ప్రక్కల నివసిస్తున్నావు ?
ఎందుకోసం నువ్వు నా చుట్టు ప్రక్కలకు వస్తున్నావు ?

మీరు నేను చెప్పేది సరిగ్గా విన్నట్లయితే, అప్పుడు దివ్యత్వం అత్యంత సమీపంలోనే ఉంది అని మీరు అనేక పర్యాయాలు అనుభూతి చెందుతారు.

ఎందుకోసం నువ్వు నా చుట్టు ప్రక్కల నివసిస్తున్నావు ?
ఎందుకోసం నువ్వు నా చుట్టు ప్రక్కలకు వస్తున్నావు ?

.... చెంతకు వచ్చి కూడా, నువ్వు ఎన్నడూ చేరువ కాలేదు ;
నువ్వు నన్ను ఎన్నడూ చెంతక పిలువవు.

నువ్వు హృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తే కనుక,
నువ్వు ఎందుకిలా నన్ను విలపింపజేస్తున్నావు ?

నీ కాంతి యొక్క ఈ గాఢాంధకారంలో,

నువ్వు నీ కడగంటి చూపును నా చూపు నుంచి ఎందుకు దాచేస్తున్నావు ?

అనుభూతులలోకి లోతుగా వెళ్ళినవారు దైవత్వానికి ఎంత చేరువగా వస్తారంటే దివ్యత్వపు జ్వాల యొక్క వేడిని అతను అనుభవించడం ప్రారంభిస్తాడు. కళ్ళను కళ్ళు కలుసుకోవడం ప్రారంభిస్తాయి. సరిహద్దులు ఒకదానినొకటి దాటడం ప్రారంభిస్తాయి. వాళ్ళు ఒకరి పొలిమేరలనొకరు అధిగమనించడం ప్రారంభిస్తారు.

ఇక్కడ చెప్పబడినది కేవలం ఓ ప్రసంగం కాదు, అది మిమ్మల్ని రూపాంతరం చెందించేందుకే. అది కేవలం మాట్లాడడం కోసమే మాట్లాడడం కాదు, అది మిమ్మల్ని పూర్తిగా మార్చడానికే – మూలాల నుంచీ.

మూడవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

సంస్కృతి అనేది ధర్మం జోడించబడిన ధారణ, మతం జోడించబడిన భావనలు... లేదా భావనలు జోడించిన మతం యొక్క ఉత్పత్తి. సమాజం మరి దాని సాంప్రదాయాలు ఈ సంస్కృతి నుంచి సృష్టించబడ్డాయి. మతం అన్నింటికీ ప్రతికూలమైనది అని మీరు చెప్పారు. మతం అన్నింటికీ వ్యతిరేకంగా ఉంటే కనుక, అప్పుడు అది అరాచకాన్నీ, గందరగోళాన్నీ సృష్టించకుండా ఉండడం సాధ్యం అవుతుందా ? దయచేసి వివరించండి ?

ధర్మం నుంచి ఉత్పన్నమైనదిగా ధారణను గురించి మీరు తీసుకుంటున్న అర్థం సరైనది కాదు. ' ధారణ ' అనేది మతం కాదు. ' ధర్మం ' అనే పదం, మతం, అన్నింటికీ ఆసరాను ఇచ్చేది, అన్నింటినీ నిర్వహించేది ' అనే మూలార్థం నుంచి వచ్చింది. అది ఒక భావన (Concept) కాదు, అది అన్నింటినీ నిలిపి వుంచేది. ఈ విస్తారతకు, ఈ జాబిలికి, ఈ తారలకు, ఈ సూర్యుడికి, ఈ వృక్షాలకు మరి పక్షులకు, మానవుడికి మరి అస్తిత్వం యొక్క అంతంలేని విస్తీర్ణానికీ ఆధారాన్ని ఇచ్చేది... దీనంతటికీ ఆలంబనను ఇచ్చేది ధర్మం.

మతం అనేది భావనలకు సంబంధించినది కాదు. మీ భావన హైందవం కావచ్చు, మరెవరిదో మహమ్మదీయం కావచ్చు, మరొకరిది క్రైస్తవం కావచ్చు... కానీ అది మతానికి సంబంధించినది కాదు. ఇవి భావనలు, ఇవి వివేకపూర్వక అభిప్రాయాలు. ఏది లేకపోతే అన్నీ చెల్లాచెదురైపోతాయో, అన్నింటినీ నిలిపివుంచే ఆ ఆవశ్యకమైన సత్యం యొక్క పేరే మతం. అది, అన్నింటినీ కలిపేది, అన్నింటి సంపూర్ణత్వం. అంతటికీ వారధి అయ్యేది.

అది ఓ పూలహారాన్ని తయారు చేయడంలాంటిది. ఇక్కడ ఓ పువ్వుల రాశి వుంది మరి అక్కడ ఓ పూలహారం. వ్యత్యాసం ఏమిటి ? గుట్ట అనేది అస్తవ్యస్తమైనది. ఏ పువ్వూ మరే ఇతర పువ్వుతోనూ అనుసంధానించబడి లేదు, ఆ పువ్వులన్నీ వేరు చేయబడే వున్నాయి. పూలదండ ఒక దారంపై గుచ్చబడి వుంది. ఆ దారం కనిపించడం లేదు, అది పువ్వులలో దాగి వుంది, కానీ అది ఒక పువ్వును మరొక పువ్వుతో కలుపుతుంది.

ఈ సమస్త అస్తిత్వమూ ధర్మం, మతం, అనబడే దారంపై గుచ్చబడి వుంది. ఇది మనల్ని వృక్షాలతోనూ, చంద్రుడు మరి నక్షత్రాలతో కలుపుతున్నది, రాళ్ళనూ మరి శిలలనూ సూర్యుడితో కలిపేది, అన్నింటినీ కలిపేది, అన్నింటికీ అనుసంధానమైనది ... ఇదీ మతం.

సంస్కృతి అనేది ధర్మం నుంచి సృష్టించబడలేదు. సంస్కృతి అనేది సాంస్కృతిక తర్ఫీదు నుంచి రూపొందించబడింది. అన్ని తర్ఫీదులూ త్యజించబడినప్పుడే మతం అనేది తెలుసుకోబడుతుంది. సన్యాసం అంటే తర్ఫీదును త్యజించడమే.

హిందూ సంస్కృతి భిన్నమైనది ; మహమ్మదీయ సంస్కృతి, బౌద్ధ సంస్కృతి, జైన సంస్కృతి ... అన్నీ భిన్నమైనవి, వేరైనవి. ప్రపంచంలో వేలాది సంస్కృతులు ఉన్నాయి ఎందుకంటే వేలాది తర్ఫీదులు ఉన్నాయి. తాను ప్రార్థిస్తున్నప్పుడు ఒకరు తూర్పుకు అభిముఖంగా వుంటారు, మరొకరు ప్రార్థించడానికి పడమరకు తిరుగుతారు... ఇది తర్ఫీదు. ఒకరు ఈ వస్త్రాలను ధరిస్తారు, మరొకరు ఆ వస్త్రాలను ధరిస్తారు; ఒకరు ఈ రకమైన ఆహారాన్ని తింటారు, మరొకరు ఆ రకమైన ఆహారాన్ని తింటారు.... ఇదంతా తర్ఫీదు.

సంస్కృతులు భూమిపై ఉంటాయి, మరి అవి ఉండాలి ఎందుకంటే భిన్నత్వం ఎంత అధికంగా వుంటే, అంత ఎక్కువ అందంగా ఈ భూమి ఉంటుంది. ఈ భూమి కేవలం ఒకే ఒక్క సంస్కృతిని కలిగి వుండాలని నేను కోరుకోను ... అది మూర్ఖంగా, నిస్తేజంగా మరి విసుగు కలిగించేదిగా ఉంటుంది. ఈ అవనిపై హిందూ సంస్కృతి అవసరం ; మహమ్మదీయ, క్రైస్తవ, బౌద్ధ, జైన, చైనీయుల, రష్యన్ల ... వేలాది సంస్కృతులు అవసరం ఎందుకంటే వైవిధ్యం అనేది జీవితాన్ని సౌందర్యభరితం చేస్తుంది. ఒక ఉద్యానవనంలో అనేక రకాల పువ్వులు ఉండడం అవసరం. కేవలం ఒకే రకమైన పువ్వు ఆ తోటను విసుగు కలిగించేదిగా చేస్తుంది.

సంస్కృతులు అసంఖ్యాకంగా ఉండాలి ... అవి అసంఖ్యాకంగా ఉన్నాయి మరి అవి ఆ విధంగానే ఉండాలి. కానీ మతం ఒక్కటే ఉండాలి ఎందుకంటే మతం అనేది ఒక్కటే. ఏ ఇతర సంభావ్యతా లేదు.

కనుక నేను హిందుత్వాన్ని ఓ సంస్కృతి అని పిలుస్తాను, నేను ఇస్లాంను ఒక సంస్కృతి అని పిలుస్తాను ... ఒక మతం అని కాదు. అది మంచిది, సంస్కృతులు అందమైనవి. మసీదులను వాటిదైన అద్వితీయ శైలితో, మందిరాలను ఒక విభిన్నమైన శిల్పశాస్త్రంతో రూపొందించండి. మందిరాలు మనోజ్ఞమైనవి, మసీదులు కూడా అందమైనవే. అవనిపై కేవలం మందిరాలు మాత్రమే ఉండాలనీ, మసీదులు మాయమైపోవాలనీ నేను కోరుకోను ... సౌందర్యం ఎంతగానో తరిగిపోతుంది. కేవలం సంస్కృతం మాత్రమే మనతో ఉండాలనీ మరి అరబిక్ అంతర్ధానమై పోవాలనీ నేను కోరుకోను ... అందం ఎంతగానో తరిగిపోతుంది. కేవలం ఖురాన్ మాత్రమే మనతో ఉండాలనీ, మరి వేదాలు, గీత మరి ఉపనిషత్తులూ మాయమైపోవాలనీ నేను కోరుకోను... అవని ఎంతో నిస్సారమైనది అయిపోతుంది.

ఖురాన్ అందమైనది. అది ఒక అరుదైన సాహితీ కళాఖండం, అది మహోత్కృష్టమైన కవిత్వం - కానీ దానికి మతంతో ఏ నిమిత్తమూ లేదు. వేదాలు ఎంతో మనోహరమైనవి, ఆకాశాన్ని స్పృశించాలనే అవని యొక్క అభిలాషల ఓ అరుదైన ప్రకటన. ఉపనిషత్తులు అతి మధురమైనవి. అంతకన్నా మధురమైన వ్యక్తీకరణ ఎన్నడూ ఇవ్వబడలేదు, వాటిని చేజార్చుకోకూడదు. ఇవన్నీ ఉండాలి ... కానీ ఓ సంస్కృతిగానే.

మతం ఒక్కటే. మనల్ని అందరినీ అనుసంధానం చేసేదే మతం... హిందూవులను, మహమ్మదీయులను మరి క్రైస్తవులను కూడా. జంతువులను, మానవులను, చెట్లను... అన్నింటినీ అనుసంధానించేదే మతం, చెట్లలో హరితమై, మానవుడిలో రక్తధారగా ప్రవహించేది ; మీ అంతరంగంలో శ్వాసగా చరించేదీ, మీ అంతరంగంలో సాక్షిగా ఉన్నదీ. మతం అన్నింటినీ అనుసంధానిస్తుంది.

మతాన్ని సంస్కృతికి పర్యాయపదంగా భావించకండి, మతానికి సంస్కృతితో ఏ నిమిత్తమూ లేదు. మతమే లేని రష్యాలో, సంస్కృతి ఉండవచ్చు ... చైనాలో సంస్కృతి వుంది. అక్కడ ఇప్పుడు మతం అనేది లేదు. నాస్తిక సంస్కృతి ఉండవచ్చు, ఆస్తిక సంస్కృతీ ఉండవచ్చు. మతానికి సంస్కృతితో ఏ నిమిత్తమూ లేదు.

మీ దైనందిన జీవనశైలితో మతానికి ఏ నిమిత్తమూ లేదు. మతం అనేది మీ ఉనికితో నిమిత్తాన్ని కలిగి వుంది. మతం అనేది మీ నిర్మలమైన అస్తిత్వం, మీ స్వభావం.

సంస్కృతి అనేది మీ బాహ్య కవచం, మీ శిష్టాచారం, వీటికి సంబంధించిన అన్నింటి విషయంలో మీ ప్రవర్తన ... ఎలా నిలబడాలి, ఎలా మాట్లాడాలి, ఏమి అనాలి, ఏమి అనకూడదు...

సంప్రదాయం ఎన్నటికీ మతం కాలేదు. మతం అనేది ఓ సంప్రదాయం కాదు. మతం అనేది కాలాతీతమైన, శాశ్వత సత్యం. మానవుడు సంప్రదాయాలను రూపొందిస్తాడు ... మతం ఇప్పటికే వుంది. సంప్రదాయాలు అనేవి మానవుడి యొక్క సృష్టి, అవి మానవుడిచే ఆవిష్కరించబడ్డాయి. మతం అనేది మానవుడి కన్నా ముందు ఉన్నది, మానవుడు మతం చేత రూపొందించబడ్డాడు. ఈ వ్యత్యాసాన్ని అవగాహన చేసుకోండి.

సంప్రదాయం అనేది మతం కాగలదు అని ఎన్నడూ పొరపాటున కూడా అనుకోకండి. మరి ఒక ధార్మిక వ్యక్తి ఎన్నడూ సాంప్రదాయ బద్ధుడు కాలేదు. జీసస్‌ను శిలువ వేయాల్సి వచ్చింది, మన్సూర్‌ను హతమార్చవలసి వచ్చింది, సోక్రటీస్‌కు విషం ఇవ్వాల్సి వచ్చింది – ఎందుకంటే ఒక మతపరమైన వ్యక్తి ఎన్నటికీ శాస్త్ర సమ్మతమైనవాడు కాలేడు. ధార్మిక వ్యక్తి ఓ మహావిప్లవం. అతను శాశ్వతం యొక్క కాలాతీతం యొక్క నిరంతర ప్రకటన. ఎవ్వరైనా శాశ్వతత్వాన్నీ మరి కాలాతీతాన్నీ ఎప్పుడు ప్రకటించినా, సాంప్రదాయవాదులూ, ఆచారవంతులూ, వెర్రెత్తిపోతారు. వాళ్ళు ఎంతో ఆందోళనకు గురి అవుతారు. అతను గందరగోళాన్నీ, అరాచకాన్నీ తెస్తాడని వాళ్ళు అంటారు.

ఇప్పుడు గందరగోళం వుంది. మీరు సక్రమ స్థితి, ఏలుబడి అని పిలిచేది... ఏ నిరర్థకమైన సక్రమ స్థితి ఇది ? ఈ జీవితమంతా కలహంతో నిండి వుంది, ఎన్నో నేరాలతో నిండి వుంది. ఈ జీవితమంతా వేదనతోనే నిండి వుంది... మరి అయినా గానీ గందరగోళం పట్ల ఇంకా మీరు భయంతోనే వున్నారు. నరకం తప్ప మీ జీవితంలో ఇంకేముంది ? అక్కడ ఏ ఆనంద సౌరభం వుంది ? ఏ పరమానంద కుసుమం వికసిస్తోంది ? మీ జీవితంలో ఏ మురళీ రవళి వుంది ? అది కేవలం ఓ బూడిద కుప్ప మాత్రమే. గందరగోళం వస్తుందని ఇంకా మీరు అంటున్నారు.

కనుక ఒక మతపరమైన వ్యక్తి తిరుగుబాటుదారుడు కాగలడు, కానీ ఒక అరాచకవాది కాదు. దీనిని అవగాహన చేసుకోండి.

ఒక మతపరమైన వ్యక్తి నిజంగా సక్రమ స్థితిలో ఉన్నవాడు ఎందుకంటే అతను అనంతంతో అనుసంధానాన్ని ఏర్పరచుకున్నాడు. జీవితపు అత్యంత లోతైన మూలానికి అతను కలుపబడ్డాడు. అతను గందరగోళంగా ఎలా ఉండగలడు ?

అవును, అతను మీతో తన సంబంధాన్ని కోల్పోవచ్చు, మీ నిర్ధారిత నమూనాలకూ, మీ క్రమాలకూ కొద్దిగా ఆవల.అతను ఉండవచ్చు. అతను అత్యున్నతంతో బాంధవ్యాన్ని కలిగివున్నాడు. అతను అసత్యం నుంచి వేరు చేయబడ్డాడు ... అతను సహజ సిద్ధమైన సత్యంతో అనుసంధానించబడి వున్నాడు. కుళ్ళిపోయినదాని నుంచి అతను విడిపోయాడు మరి సరిక్రొత్తదానితో, నిత్య నూతనమైనదానితో అతను అను సంధానించబడ్డాడు.

మీ సంస్కృతి మరి సమాజం కృత్రిమ పుష్పాలవంటివి. ధార్మిక వ్యక్తి యొక్క జీవితం ఓ సజీవ పుష్పంలాంటిది. కృత్రిమ పుష్పాలు పుష్పాలలానే కనిపిస్తాయి, కానీ వాస్తవంలో అవి పుష్పాలు కావు. అవి అలా ఉన్నట్లు కనిపిస్తాయి, దూరం నుంచి అవి వాటిలాగానే కనిపిస్తాయి, కానీ అవి అసత్యమైనవి.

నిజమే చెప్పాలి అనే తర్ఫీదు మీపై విధించబడడం వలన మాత్రమే మీరు సత్యాన్ని చెబితే కనుక, అప్పుడు మీ సత్యానికి అణాకాణీ విలువ కూడా వుండదు. మీరు ఒక జైన కుటుంబంలో జన్మించడం వలన మీరు మాంసాహారం తినకపోతే కనుక మరి మాంసాహారం భుజించడం పాపం అనే తర్ఫీదు మీపై విధించబడితే కనుక ... కేవలం మాంసాన్ని చూస్తూనే మీకు వాంతి వచ్చినట్లుగా అయ్యేంతగా మీరు లోతుగా తర్ఫీదు నివ్వబడితే కనుక అప్పుడు మీరు ధార్మికులు అని అనుకోకండి. అది కేవలం తర్ఫీదు.

ఒక జైన కుటుంబంలో జన్మించిన వ్యక్తి మాంసం చేత భయపెట్టబడతాడు, అతనికి దానిని చూసినప్పుడు వాంతి వచ్చినట్లు ఉంటుంది ... కేవలం దానిని చూడడం మాత్రమే కాదు, అసలు మాంసం అనే పదం అంటేనే అతను భయపడిపోతాడు. మాంసంతో సంబంధం కలిగినది ఏదైనా అతనికి అసహ్యాన్ని కలిగిస్తుంది, రక్తవర్ణంలోని టమోటా సైతం అతనిని భయపెడుతుంది ... ఇది కేవలం తర్ఫీదు. మాంసాహారం భుజించే ఓ కుటుంబంలో అతను జన్మించి వుంటే కనుక అతను మాంసాహారం తినడాన్ని ఆస్వాదించేవాడు, ఎందుకంటే అక్కడ మాంసం తినడం అనే తర్ఫీదు వుంటుంది ; ఇక్కడ, మాంసం తినడం అనేది తర్ఫీదు కాదు.

తర్ఫీదే మీ బానిసత్వం. మాంసాహారం తినడం మొదలు పెట్టండి అని నేను మీకు చెప్పడం లేదు. మహావీరుడి అంతరంగంలోకి వచ్చినట్లుగా ఆ చైతన్యపు సాక్షాత్కారాన్ని మీ అంతరంగంలోనికి రావడానికి అనుమతించండి అని నేను మీకు చెబుతున్నాను. అది శిక్షణ కాదు. ఎవ్వరినైనా బాధపెట్టడం అనేది చిట్టచివరకు ఎవరిని వారు బాధపెట్టుకోవడమేననీ, ఎందుకంటే కలిపి జతచేయబడి, మనమంతా

ఒక్కటే అనేది అతని స్వీయానుభవం. అది ఒకరు తమ స్వంత చెంపను వాయించుకోవడం లాంటిది. ముందు వెనుకలుగా, మరెవరికో మనం చేసినది మన వద్దకు తిరిగి రాబోతోంది. ఈ అనుభవం మహావీరుడికి ఎంత గాఢమైనదయ్యిందంటే, ఈ ఎరుక అతనిలో ఎంత సాకారమయ్యిందంటే, అతను ఇతరులకు వేదన కలిగించడం ఆపేశాడు. మాంసాహారం తినడం పాపం అని అతనికి బోధించబడడం వలన అతను మాంసాహారం తినడం మానెయ్యలేదు, సాక్షీతత్వం ద్వారా అతను మాంసాహారం తినడం మానేశాడు. మతం అంటే ఇదే.

మీరు ఒక జైన కుటుంబంలో జన్మించి మరి మాంసం తినకపోతే కనుక, అది కేవలం తర్ఫీదు మాత్రమే. ఇది ఒక కృత్రిమ పుష్పం, ఒక అసలైన పుష్పం కాదు. ఈ జైనుడిని అమెరికా పంపండి, మరి రెండు లేదా నాలుగు సంవత్సరాలలో అతను మాంసం తినడం ప్రారంభిస్తాడు. అన్నిచోట్లా మాంసం తినబడడం చూసి, మొదట అతను కలత చెందుతాడు, మొదట అది తనకు మంచిది కాదని నిరాకరిస్తాడు, కానీ క్రమక్రమంగా అతను దానికి అలవాటుపడతాడు. అనంతరం అదే బల్ల వద్ద ఇతరులు మాంసాహారం తినడం చూసి క్రమక్రమంగా అతని ముక్కు అతని ముక్కు పుటాలు మాంసం యొక్క వాసనను అంగీకరిస్తాయి.

అప్పుడు మరొక శిక్షణ యొక్క ప్రభావం మొదలవుతుంది. అక్కడ ప్రతి ఒక్కరూ చెబుతారు, " నువ్వు మాంసం తినకపోతే కనుక నువ్వు బలహీనుడివి అవుతావు. విను ! మాంసాహారం తినకుండా ఒలంపిక్స్‌లో నువ్వు ఎలా ప్రదర్శననివ్వగలవు ? నువ్వు ఒక్క స్వర్ణ పతకాన్ని కూడా సాధించలేవు. స్వర్ణ పతకమా ? ... మీరు కాంస్య పతకాన్ని కూడా సాధించలేరు. నీ స్థితిని చూసుకో. వెయ్యి సంవత్సరాలుగా నువ్వు బానిసగా ఉండిపోయావు, నీకు ఏం బలం వుంది ? నీ జీవితకాల ప్రమాణం ఎంత? నువ్వు ఎన్ని వేల వ్యాధులతో బాధపడుతున్నావు ?

నిశ్చయంగానే మాంసాహార దేశాలలో జీవిత కాల ప్రమాణం ఇప్పుడు ఎనభై సంవత్సరాల కన్నా ఎక్కువకు చేరుతుంది ; ఆ సగటు ఎనభై అయిదు, త్వరలోనే అది వంద అవుతుంది. ఇక్కడ మనం ముప్ఫయి నుంచి ముప్ఫయి అయిదు మధ్య ఇరుక్కుపోయాము.

"... మీరు ఎన్ని నోబుల్ బహుమతులను గెలుచుకున్నారు ? శాకాహారం వివేకాన్ని పరిశుద్ధం చేస్తే కనుక అన్ని నోబుల్ బహుయతులనూ మీరే గెలుపొందుతూ ఉండాలి. వివేకం ఉన్నతంగా వృద్ధి చెందినట్లుగా కనిపించడం లేదు. మరి గుర్తుంచుకోండి, నోబుల్ బహుమతిని గెలుపొందిన రవీంద్రనాథ్ ఠాగూర్ శాకాహారి

కాదు. ఒక్క జైన మతస్థుడైనా నోబుల్ బహుమతిని గెలుపొందాడా ? విషయమేమిట ? వాళ్ళు రెండు వేల సంవత్సరాలుగా శాకాహారులై వున్నారు, మరి రెండు వేల సంవత్సరాలలో మీ వివేకం ఇంకా పరిశుద్ధం కాలేదా ?"

కనుక మాంసాహారం తినేవాళ్ళు వాదిస్తారు. వాళ్ళు అంటారు, " మీ వివేకం బలహీనమవుతుంది ఎందుకంటే మీరు సరైన ప్రోటీన్లు, సరైన విటమిన్లు, తగినంత శక్తి పొందడం లేదు. మీ శరీరం బలహీనమవుతోంది ... మీరు ఎంతో కాలం జీవించరు. మీ శక్తి తగ్గిపోతోంది."

తొంభై సంవత్సరాల వ్యక్తి ఎవరో వివాహం చేసుకున్నాడు అనేది అమెరికాలో ప్రతిరోజూ వింటారు, వార్తా పత్రికలలో చూస్తారు. మీరు ఆఘాతానికి గురవుతారు. మీరు అంటారు, " ఇది ఏ రకమైన ఉన్మాదం ?" కానీ ఓ తొంభై సంవత్సరాల మనిషి వివాహం చేసుకుంటాడు ఎందుకంటే అతను ఇప్పటికీ కామపరంగా సమర్థుడే. అది బలం యొక్క నిదర్శనం. ఒక తొంభయ్యేళ్ళ మనిషి ఓ బిడ్డకు తండ్రి కూడా అవుతాడు. అది బలం యొక్క నిదర్శనం.

ఎవరైనా పశ్చిమానికి వెళ్ళి నివసించడం ప్రారంభించగానే అతను ఈ వాదనలు వింటాడు మరి ఈ రుజువులను చూస్తాడు మరి దాని సంస్కృతి యొక్క విస్తారమైన సమృద్ధిని చూస్తాడు. క్రమక్రమంగా అతను మరచిపోతాడు...

మహావీరుడు పశ్చిమానికి వెళ్ళవలసివస్తే కనుక అతను మాంసాహారం తినడు. అతను ఒక సహజ సిద్ధ పుష్పీకరణ. అతను అంటాడు, " సరే, నేను రెండు లేదా నాలుగు సంవత్సరాలు తక్కువ జీవిస్తాను ... హాని ఏమిటి ? దీర్ఘకాలం జీవించడం వలన ఉపయోగమేమిటి ? దీర్ఘకాలం జీవించి నువ్వు ఏం చేస్తావు ? నువ్వు మరికొన్ని జంతువులను తినేస్తావు ... అంతకన్నా ఏముంది ? ఎవ్వరైనా మహావీరుడిని అడిగితే కనుక అతను ఇలా చెప్పి వుండేవాడు, " నీ వెనుక కొద్దిగా చూసుకో ; నువ్వు వంద సంవత్సరాలు జీవిస్తే. కనుక, అప్పుడు నువ్వు తినేసిన జంతువులు మరి పక్షుల యొక్క సుదీర్ఘమైన వరుస వైపు తిరిగి చూడు. నువ్వు ఒక స్మశానాన్నంతటినీ తినేశావు! నువ్వు ఒక జనాభానంతా తినేశావు. నీ చుట్టు ప్రక్కల అంతా ఎముకల గుట్టలు పడి వున్నాయి. ఒక మనిషి తన జీవితంలో ఎన్నో జంతువులను తినేస్తాడు ... వేలాది పక్షులు, జంతువులు కుప్పలుగా పడతాయి. మీరు ఎన్ని జీవితాలను నాశనం చేశారో కేవలం ఆలోచించండి. దేని కోసం ? కేవలం జీవించేందుకా ? మరింత జీవించడం ఎందుకు ? ... మరిన్ని జంతువులను నాశనం చేసేందుకా ?"

మహావీరుడికి ఎవ్వరైనా అతను బలహీనుడు అవుతాడు అని చెబితే కనుక, అప్పుడు అతను అంటాడు, "బలాన్ని నేను ఏం చేసుకుంటాను ? నేను ఎవరికైనా హాని కలిగించాలా ? నేను ఎవరినైనా చంపాలా ? నేను యుద్ధానికి వెళుతున్నానా?"

" చూడు, వెయ్యి సంవత్సరాలుగా నువ్వు బానిసత్వంలో ఉన్నావు," అని ఎవరైనా మహావీరుడికి ఈ అంశాన్ని ఎత్తి చూపితే కనుక, అతను చెబుతాడు, "రెండు స్థితులు ఉన్నాయి : అయితే ఎవరికైనా ఓ యజమానిగా ఉండడం లేదా ఓ బానిసగా ఉండడం," మహావీరుడు అంటాడు, " ఒక యజమానిగా ఉండడం కన్నా ఓ బానిసగా అవ్వడమే మెరుగైనది ... కనీసం మీరు ఎవ్వరినీ హింసించరు, మీరే హింసించబడతారు. మోసగించేవాడిగా ఉండడం కంటే మోసగించబడేవాడిగా ఉండడం మెరుగైనది ... కనీసం మీరు ఎవ్వరినీ మోసగించలేదు. ఒక దొంగగా ఉండడం కన్నా దోపిడీకి గురైనవాడిగా ఉండడం మెరుగైనది."

" చూడూ, నువ్వు ఏ నోబుల్ బహుమతినీ గెలుచుకోలేదు ", అని ఎవరైనా మహావీరుడికి చెబితే కనుక, అతను అంటాడు, " ఒక నోబుల్ బహుమతిని నేను ఏం చేసుకుంటాను ? అది ఒక బొమ్మ... గెంతుతూ దానితో ఆడుకోవడానికి పిల్లలకు అది పనికొస్తుంది. దానిని నేను ఏం చేసుకోగలను ? మరొక బహుమతిని సంపాదించుకోవడానికి నేను వచ్చాను. ఆ బహుమతి కేవలం దివ్యత్వం చేతనే ఇవ్వబడుతుంది, మరెవ్వరూ దానిని ఇవ్వలేరు. ఆ బహుమతి సాక్షీతత్వం యొక్క పరమానందానికి చెందినది. అది సచ్చిదానందానికి, సత్యం – చైతన్యం – ఆనందానికి చెందినది. నీ నోబుల్ బహుమతిని నువ్వే ఉంచుకో. దానిని ఆడుకునేందుకై పిల్లలకు ఇవ్వు. అది ఒక ఆట వస్తువు."

అంతర్గత పరమానందపు బహుమతితో పోల్చదగిన ఏ బహుమతీ ఈ ప్రపంచంలో లేదు. శరీరం పోతే, యవ్వనం మాయమైపోతే, డబ్బు ఖర్చయిపోతే, అంతా పోతుంది కానీ అంతర్గత అమృతం కాపాడబడితే, అప్పుడు అంతా కాపాడబడుతుంది. అంతర్గతాన్ని చేజార్చుకున్నవారు అంతటినీ చేజార్చుకుంటారు. అంతర్గతాన్ని కాపాడుకున్నవారు అంతటినీ కాపాడుకుంటారు.

కానీ సాధారణంగా ఒక జైన మతస్థుడు పశ్చిమానికి వెళ్ళినప్పుడు అతను భ్రష్టుడై తిరిగి వస్తాడు. ఎందుకు ? అతను అప్పటికే భ్రష్టుడై ఉన్నాడు – ఒక కాగితం పువ్వు. అది అసత్యమైనది, తర్ఫీదు ద్వారా తయారు చేయబడినది.

సంస్కృతికీ మరి మతానికీ మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని అవగాహన చేసుకోండి. మతం అనేది మీ అంతర్గత స్వభావం మరి సంస్కృతి అనేది ఇతరులచే మీకు

బోధించబడినది. ఎవ్వరైనా ఎంత జాగ్రత్తగా బోధించినాగానీ, ఇతరుల నుంచి నేర్చుకున్నది ఏదీ మిమ్మల్ని విముక్తం చేయలేదు. అది మిమ్మల్ని బానిసలుగానే చేస్తుంది. కనుక మతం అనేది తిరుగుబాటు, ఎదిరింపు అని నేను చెప్పినప్పుడు, సంప్రదాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు, తర్ఫీదుకు ప్రతికూలంగా తిరుగుబాటు, ఆధ్యాత్మిక బానిసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు అనేది నా ఉద్దేశ్యం.

కానీ ఒక మతపరమైన వ్యక్తి అరాచకవాది కాలేడు. ఒక మతపరమైన వ్యక్తి అరాచకవాది అయితే కనుక, ఇక్కడ క్రమశిక్షణాయుతులుగా ఉండేవారు ఎవరు ? ఒక మతపరమైన వ్యక్తి అత్యున్నత క్రమశిక్షణగలవాడిగా తయారవుతాడు. కానీ అతని క్రమశిక్షణ ఒక విభిన్న రుచిని కలిగివుంటుంది. అది అంతరం నుంచి బాహ్యంలోనికి ప్రవహిస్తుంది. అది మరెవరి చేతనో విధించబడినది కాదు. అది అప్రయత్నమైనది. అది అంతర్గత శక్తి యొక్క చెలమ కట్టలు తెంచుకోవడంలాంటిది. అది నీటి యొక్క శక్తితో ప్రవహిస్తున్న ఓ నదిలాంటిది. దానిని ఎవ్వరూ తొయ్యడం లేదు.

కానీ మీరు ఎలా ఉన్నారంటే ఎవరో మీ మెడ చుట్టూ ఓ పాశాన్ని బిగించినట్లు మరి మీరు ఈడ్చుకుపోబడుతున్నట్లుగా, మీరు సాగుతూనే ఉండేందుకు వెనుక నుంచి ఎవరో మీపై కొరడాను ఝుళిపిస్తున్నట్లుగా ఉన్నారు.

సంస్కృతిలో జీవించే మనిషి బలవంతంగా ఈడ్చుకుపోబడుతాడు, తన ఇష్టానికి వ్యతిరేకంగా అతను ఈడ్చుకుపోబడుతాడు. ఒక మతపరమైన వ్యక్తి నాట్యం చేస్తూంటాడు. అతను మృత్యువును సమీపించినప్పుడు కూడా అతను నర్తిస్తూనే వెళతాడు. జీవితంలో సైతం మీరు ఈడ్చబడుతూనే ఉంటారు. మీరు నిర్బంధంలో ఉన్నారనే అనుభవాన్ని ఎల్లప్పుడూ పొందుతూనే ఉంటారు. ఇతరులు వినోదాన్నంతటినీ పొందుతున్నారనీ, ఇతరులు ఆస్వాదిస్తున్నదేదో మీరు కోల్పోతున్నారనే అనుభవాన్ని మీరు ఎల్లప్పుడూ పొందుతూనే వుంటారు.

ప్రజలు నా వద్దకు వచ్చి అంటూంటారు, " మేము సరళమైన మరి నీతివంతమైన ముక్కు సూటిగా పోయే వ్యక్తులం. ప్రపంచంలో ఇంతటి అన్యాయం వుంది. మోసగాళ్ళు అన్నింటినీ ఆస్వాదిస్తున్నారు, దొంగలు మరి నేరస్థులు అన్నింటినీ కలిగి వున్నారు."

నేను వారికి చెబుతాను," వాళ్ళు ఆస్వాదిస్తున్నారు అని మీలో కలుగుతున్న ఆ భావనే మీరు సరళమైనవారు కాదనీ, నీతివంతులు కాదనీ, ముక్కుసూటిగా పోయేవారు కాదనీ సూచిస్తోంది. మీరు కూడా వాళ్ళలాగే వినోదాన్ని పొందాలని

అనుకుంటున్నారు, కానీ మీరు దానికి మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది మరి చెల్లించడానికి మీరు భయపడుతున్నారు. మీరు కూడా ఒక దొంగే, కానీ దొంగిలించాలంటే ఎవరికైనా ధైర్యం కావాలి మరి మీ ధైర్యం పోయింది. మీరు కూడా మోసగించాలనీ మరి డబ్బును పేర్చాలనీ కోరుకుంటున్నారు, కానీ వంచించినప్పుడు ఒకరు పట్టుబడవచ్చు, బంధించబడవచ్చు, కనుక మీరు ఆగిపోతారు. మిమ్మల్ని ఎవ్వరూ పట్టుకోరనీ, మిమ్మల్ని పట్టుకునేవారు ఎవ్వరూ లేరనీ, బంధింపబడతామనే భయమేమీ లేదనీ మీకు భరోసా ఇవ్వబడితే కనుక ... మీరు వెంటనే ఓ దొంగగా మారుతారు.

ఒక మతపరమైన వ్యక్తి వంచన చేసేవారి పట్ల కరుణను అనుభూతి చెందుతాడు ఎందుకంటే అతను ఇలా భావిస్తాడు, " ఈ దీనులు అత్యున్నత పరమానందాన్ని కోల్పోతున్నారు. నా అనుభవాన్ని వాళ్ళు చేజార్చుకుంటున్నారు." ఒక ధార్మిక వ్యక్తి అధార్మికుల పట్ల అసూయతో ఉండడు, అతను కారుణ్యభావంతో ఉంటాడు. ఈ దీనులు కొన్ని బంగారు మరి వెండి తునకలను సమీకరించుకోవడంలో అంతటినీ చేజార్చుకుంటున్నారని అతన అంతర్గతంగా రోదిస్తాడు. తమ మట్టి ఇళ్ళనూ, తమ ఇసుక మేడలనూ రూపొందిస్తూ వారు అంతమైపోతారు. శాశ్వతత్వపు అనుభవం సాధ్యమై ఉండగా, వాళ్ళు తుచ్ఛమైనవాటి కోసం దారి తప్పి సంచరిస్తూంటారు. అతను కరుణాపూరితుడై ఉంటాడు. అసూయ అనే ప్రశ్నే లేదు, ఎందుకంటే అతను మరింత విస్తారమైనదేదో కలిగి వున్నాడు. మరి ఈ విస్తారత వలన అతని జీవితంలో ఒక క్రమశిక్షణ వుంది. ఈ క్రమశిక్షణకన్నా ఉన్నతమైన క్రమశిక్షణ మరేదీ లేదు.

మతపరమైన ఓ వ్యక్తి తిరుగుబాటుదారుడు, కానీ క్రమశిక్షణారహితుడు కాదు. అతని క్రమశిక్షణ అతని స్వంతమైనది, అది అంతర్గతమైనది. అతని క్రమశిక్షణ స్వీయ-క్రమశిక్షణ.

వ్యవస్థీకృతమైనది అని మీరు పిలిచేది, సక్రమ స్థితి అని మీరు పిలిచేది ... ఆ సక్రమ స్థితి ఏమిచ్చింది ? యుద్ధం, హింస, దుర్మార్గం, ద్వేషం, శత్రుత్వం. అది ఏమిచ్చింది ?

ఒక కవి అంటాడు :

అవని మేఘాల కోసం జ్వలిస్తుంది ;
వేదనలో విలవిలలాడేందుకే ప్రేమ జనిస్తుంది.
ఓ మిత్రుడు నా ప్రాణాన్ని అడిగితే, సమస్యేమీ లేదు ;
నేను శత్రువులకు సైతం నా ప్రాణాన్నిచ్చాను.

పాపులు నన్ను ఎల్లప్పుడూ కాపాడారు ;
మంచివారి కోసమే నేను పాపం చేశాను.
ప్రశ్నలు ఎప్పుడు సంధించబడినా, ముసుగులన్నీ వేయబడే వున్నాయి ;
ఓ చిక్కుముడిగానే జీవితం నాకు ఇవ్వబడింది
బీడైన నగరం కోసం, నిర్జన ప్రదేశాల కోసం,
నేను ఎల్లప్పుడూ ఓ కలల సమూహాన్ని అంకురింపజేస్తాను.
ఏ దోపిడీదారుల ప్రపంచంలోనికి వచ్చాను నేను ?
ఇక్కడ కంకణాల కోసం చేతులు నరికేయబడతాయి.
జీవితం నన్ను ఎంతగానో పిండేసింది :
నేను చూడగలిగేందుకై నా కళ్ళను నేను అమ్మేశాను.

ఇక్కడ ఏమి వుంది ? కళ్ళు సైతం విక్రయించబడుతున్నాయి ... ఏదో ఒకరోజు ప్రియతములను వీక్షించగలుగుతామనే ఆశతో. ఇక్కడ మీరు ఏం సాధించారు ? ఇక్కడ సక్రమ స్థితి ఎక్కడ వుంది ? దీనికన్నా అరాచకమైనది ఇంకేముంటుంది ? అన్ని వైపులా ద్వేషం, శత్రుత్వం, ఊపిరాడానివ్వకుండా చేసే పోటీ, ఈర్ష్య అసుయ. ఎవ్వరూ ఎవ్వరికీ మిత్రులు కాదు, అంతా ఒకరికొకరు శత్రువులే. ఇక్కడ ఏదీ సిద్ధించదు ... మీరు సక్రమ స్థితి అని దేనిని పిలుస్తున్నారు ?

జీవితంలో ఆనందం అనేది ఉన్నప్పుడు మాత్రమే సక్రమ స్థితి అనేది సాధ్యమవుతుంది. ఆనందం ఒక సక్రమ స్థితిని తీసుకొస్తుంది. సక్రమ స్థితి అనేది ఆనందం యొక్క నీడలా వస్తుంది.

గుర్తుంచుకోండి, ఒక దుఃఖితుడైన మానవుడు ఒక అరాజకవాదిగా ఉండగలడు. ఆనందంగా వున్న ఓ మనిషి క్రమంలేని వాడిగా ఉండలేడు ... ఒక దుఃఖితుడైన మనిషి అరాజకవాదిగా తయారవుతాడు. అతని వద్ద ఏముంది ? విరగగొట్టడానికి మరి ధ్వంసం చేయడానికీ అతను ఉత్సుకతతో వుంటాడు. జీవితం నుంచి ఏదీ పొందనివాడు భంగపాటుతో విరగగొట్టడం మరి ధ్వంసం చేయడం మొదలుపెడతాడు. జీవితం నుంచి పొందినవాడు, భాగ్యశాలి అయినవాడు ... అతను దానిని ఎలా ధ్వంసం చేయగలడు ?

ఈ సక్రమసితి సక్రమస్థతి యొక్క ఈ రూపం ... దానిని సక్రమ స్థితిగా తీసుకోకండి. అది రాజకీయవేత్తల యొక్క కుట్ర. మరి మీ నాయకులు అని మీరు భావించేవారు, మీ మార్గదర్శకులు అని మీరు భావించేవారు దారి దోపిడీదారులు. మీ నుంచి దోచుకుంటున్నది వీళ్ళే.

ఇప్పుడు మరేదైనా ఆసరాతో నడచిపో.

తీరాలు స్వీయసేవలో అతిగా మునిగిపోయాయి.

ఇప్పుడు ఓ నదీతరం యొక్క ఆసరాను తీసుకోవడం కూడా సరైనదిగా అనిపించడం లేదు.

ఇప్పుడు మరేదైనా ఆసరాతో నడచిపో.

తీరాలు స్వీయసేవలో అతిగా మునిగిపోయాయి.

ఆశ్రయాలని భావించి నువ్వు క్రింద నిలబడిన గోడలు

ఏ క్షణమైనా కూలిపోతాయి.

నిశ్చయంగానే ఈనాడు ఏదో అద్భుతం సంభవించింది,

శిథిలాల నుంచి శ్రావ్యమైన ప్రతిధ్వనులు వస్తున్నాయి.

ఆశల హద్దులు ధ్వంసమైపోతే కనుక అందులో వింత ఏమీ లేదు ;

కరవాలాలు తమ ఒరల నుంచి బయటకు వచ్చాయి.

ఈ నావకు ఏమవుతుందో, ఎవరికీ తెలియదు ;

గర్జిస్తున్న తుపానుతో తెరచాపలు కుట్ర పన్నుతున్నాయి.

... ఈ నావకు ఏమవుతుందో, ఎవరికీ తెలియదు ;

గర్జిస్తున్న తుపానుతో తెరచాపలు కుట్రపన్నుతున్నాయి.

వేనవేల నిస్సహాయ నిట్టూర్పులు ఇక్కడ పాతిపెట్టబడ్డాయి ;

ఈ శ్మశనాలు కేవలం ఓ రాళ్ళపోగు కాదు.

ఇక్కడ గర్జిస్తున్న తుపానుతో తెరచాపలు కుట్ర పన్నుతున్నాయి. ఇక్కడ, సహాయకులుగా మీరు భావించేవారు మిమ్మల్ని స్వలాభానికి వాడుకుంటున్నారు. మరి మీ నాయకులని మీరు అనుకునేవారు మీ ఛాతీపై కూర్చుని వున్నారు. మీరు గమనించారా ? ఎవరైనా పదవిలోకి వచ్చినప్పుడు వాళ్ళు నియమాలు మరి పద్ధతుల గురించి మాట్లాడడం ప్రారంభిస్తారు. మరి పదవిలో లేనప్పుడు ఒక రాజకీయవేత్త విప్లవం గురించి మాట్లాడడం ప్రారంభిస్తాడు ; కేవలం అతను పదవిలో లేకపోవడం వలనే విప్లవం అనే ప్రశ్న ఉదయిస్తుంది. అప్పుడు ప్రతీదీ అయుక్తమైనదిగానే వుంటుంది, ప్రతీదానినీ మార్చవలసి వస్తుంది. మరి కేవలం పదవిలోకి రాగానే నియమాలు మరి పద్ధతులకు సంబంధించిన ప్రశ్న ఉదయిస్తుంది... అంతా మంచిదే, మార్పు ప్రమాదకరం. ఇప్పుడు దానిని క్రమశిక్షణలో ఉంచడం అవసరం.

ప్రపంచంలో అన్నిచోట్లా అది ఎల్లప్పుడూ ఈ విధంగానే వుంది. రాజకీయవేత్తలు అధికార వ్యామోహం మాత్రమే కలిగి ఉంటారు. వారికి సక్రమ

స్థితి లేదా విప్లవంతో ఏ నిమిత్తమూ లేదు. అవును, సక్రమ స్థితిని ఉంచుతున్నది వారు కానప్పుడు, అధికారం వాళ్ళ చేతులలో లేనప్పుడు, అప్పుడు ప్రతీదీ తప్పే అని వారు అంటారు ; అప్పుడు ఒక విప్లవం అవసరమవుతుంది. మరి వాళ్ళు అధికారంలోకి రాగానే, విప్లవం యొక్క అవసరం ఇక ఎంత మాత్రం లేదు ఎందుకంటే విప్లవం యొక్క పని పూర్తయిపోయింది. దాని పని ఇదే ... అతనిని అధికారంలోకి తీసుకురావడం ... ఆ పని అయిపోయింది. అనంతరం విప్లవం గురించి పేర్కొన్నవారు ఎవరైనా ఒక శత్రువే.

మరి విప్లవం గురించి మాట్లాడేవారికి కూడా దానితో ఏ నిమిత్తమూ లేదు. దానిని గమనించడం అనేది విస్మయాన్ని కలిగించే విషయం ... అది ప్రతి రోజూ జరుగుతోంది, మరి అయినాగానీ మానవుడు అప్రమత్తం కావడం లేదు. విప్లవకారులందరూ తాము అధికారంలోకి వచ్చినప్పుడు విప్లవానికి ప్రతికూలమైనవారుగా తయారవుతారు. మరి పదవీచ్యుతులైన రాజకీయవేత్తలు అందరూ వాళ్ళ పదవి దిగిన వెంటనే విప్లవకారులుగా అవుతారు. రాజకీయ పదవి మహేంద్రజాలాన్ని కలిగి వుంది ! పదవిలో ఉన్నప్పుడు... సక్రమ స్థితి, ఎందుకంటే సక్రమ స్థితి ఇప్పుడు మీకు అనుకూలంగా వుంది. పదవి దిగితే ... విప్లవం ; ఇప్పుడు విప్లవం మీకు అనుకూలంగా వుంది.

మతపరమైన వ్యక్తికి సక్రమ స్థితితో ఏ నిమిత్తమూ లేదు, విప్లవంతో ఏ నిమిత్తమూ లేదు. మతపరమైన వ్యక్తి స్వీయ క్రమశిక్షణతో నిమిత్తాన్ని కలిగివున్నాడు. ఒక ధార్మిక వ్యక్తి మేల్కొనాలని కోరుకుంటాడు. బాహ్య విషయాల సహకారంతో మీరు సుదీర్ఘకాలంగా అన్వేషిస్తున్నారు ; కానీ ఏ సక్రమ స్థితీ, ఏ శ్రావ్యతా కల్పించబడలేదు. ఇక మేల్కొనండి ! మీ స్వయాన్ని అన్వేషించండి. మీకు మీరే వెలుగవ్వండి. బాహ్య దీపాల సహాయంతో మీరు ఎంతో దూరం పయనించారు మరి దారి తప్పిపోయారు... మరి కేవలం దారి తప్పిపోయారు, గుంటలలోనూ మరి శిథిలాలలోనూ పడిపోతూ, గాయపడ్డారు.

మీ స్వంత దీపాన్ని వెలిగించుకోండి, మరి స్వంతంగా సాగిపోండి.

బాహ్యంలోనివారు ఎవ్వరూ మీకు సక్రమ స్థితిని ఇవ్వలేరు. మీ స్వంత సక్రమ స్థితిని సృష్టించుకోండి. అంతరంగంలో నుండి వచ్చిన క్రమశిక్షణతో మీ జీవితాన్ని నిండనివ్వండి.

హరి ఓం తత్ సత్ !

అష్టావక్రుడు అన్నాడు : ఓ కుమారా, నిన్ను నువ్వు శరీరంగా భావించుకోవడమనే బంధనంలో ఎంతోకాలంగా చిక్కుకుని ఉన్నావు. " నేను ఎరుకను " అనే జ్ఞాన ఖడ్గంతో ఈ బంధనాన్ని ఖండించు మరి ఆనందంగా ఉండు.

నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు, స్వయం-ప్రకాశకుడవు మరి నిష్కపటమైనవాడవు. నీ బంధనం ఇదే : నువ్వు సమాధిని సాధన చేస్తావు.

నువ్వు ఈ విశ్వం అంతటా వ్యాపించి ఉన్నావు, నువ్వు దానిలో అంతర్గతంగా ఉన్న సూత్రానివి. స్వాభావికంగా నువ్వు నిర్మల చైతన్యానివి, సంకుచిత మనస్కుడవు కావద్దు. నువ్వు అపేక్షలు లేని వాడవు, నిర్వికారుడవు, స్వయం-సంపూర్ణుడవు, ప్రశాంతతకూ, అపరిమిత వివేకానికీ నిలయానివి, మరి ఆందోళనా రహితుడవు. కనుక కేవలం చైతన్యం పట్ల మాత్రమే విశ్వాసాన్ని ఉంచు.

రూపాన్ని కలిగివున్నది అసత్యమైనది అని తెలుసుకో, మరి రూపరహితమైనదానిని మార్పు లేనిదిగా మరి శాశ్వతమైనదిగా తెలుసుకో. ఈ అసలైన అవగాహన కలిగినవారు ప్రపంచంలో తిరిగి జన్మించడం అనేది ఉండదు. ఒక అద్దం దానిలో ప్రతిబింబించిన రూపంలో ఉన్నట్లుగా, మరి ఆ ప్రతిబింబం నుంచి విడిగా కూడా ఉన్నట్లుగానే, భగవంతుడు ఈ శరీరంలో అంతర్గతంగానూ మరి బాహ్యంగానూ ఉన్నాడు. సర్వత్రా వ్యాపించి వున్న ఒకే ఆకాశం ఒక కుండలోపల మరి బయట ఒకేవిధంగా ఉన్నట్లుగానే, ఆద్యంతరహితమైన బ్రహ్మం అందరిలోనూ ఒకే విధంగా ఉంటుది.

5

అంతర్గత ఆకాశం

మొదటి సూత్రం :

అష్టావక్రుడు అన్నాడు : ఓ కుమారా, నిన్ను నువ్వు శరీరంగా భావించుకోవడమనే బంధనంలో ఎంతోకాలంగా నువ్వు చిక్కుకుని ఉన్నావు. "నేను ఎరుకను" అనే జ్ఞాన ఖడ్గంతో ఈ బంధనాన్ని ఖండించు మరి ఆనందంగా ఉండు.

అష్టావక్రుడి దృష్టిలో ... మరి ఇది అత్యంత స్వచ్ఛమైన దృష్టి, అత్యున్నత దృష్టి ... బంధనం అనేది కేవలం ఒక నమ్మకం, బంధనం అనేది వాస్తవం కాదు.

రామకృష్ణుడి జీవితంలో ఒక ఉపాఖ్యానం వుంది... అతని జీవితమంతా అతను కాళీమాతను పూజిస్తూ వచ్చాడు, కానీ చిట్ట చివరకు అతను ఇలా భావించడం ప్రారంభించాడు, "ఇది ద్వంద్వత్వం ; ఏకత యొక్క అనుభవం ఇంకా సంభవించలేదు. అది ప్రియమైనదే, సంతోషకరమైనదే, కానీ రెండు అనేది రెండుగానే వుంటుంది." కొందరు స్త్రీని ప్రేమిస్తారు, కొందరు డబ్బును ప్రేమిస్తారు, కొందరు రాజకీయాలను ; అతను కాళీని ప్రేమించాడు... కానీ ప్రేమ ఇంకా రెండుగానే విభజించబడి వుంది. అత్యున్నతమైన అద్వైతం ఇంకా సంభవించలేదు మరి అతను తీవ్ర మనోవేదనలో ఉన్నాడు. అతను ఒక అద్వైతి కోసం, ఒక వేదాంతి కోసం... తనకు మార్గాన్ని చూపగల వ్యక్తి ఎవరో వస్తారని ఎదురుచూడడం ప్రారంభించాడు.

తోతాపురి అనే పేరుగల ఒక పరమహంస ఆ మార్గాన వెళుతున్నాడు. తన వద్ద నిలువమని రామకృష్ణుడు ఆయనను ఆహ్వానించాడు మరి అడిగాడు, "దైవంతో ఏకతను సాధించడానికి నాకు సహాయం చెయ్యండి."

తోతాపురి అన్నాడు, "దానిలో సమస్య ఏముంది ? ఇరువురు ఉన్నారు అని నువ్వు నమ్ముతున్నావు, కనుక ఇరువురు ఉన్నారు. ఆ నమ్మకాన్ని వదిలెయ్యి !"

రామకృష్ణుడు బదులిచ్చాడు, " కానీ ఈ నమ్మకాన్ని వదిలెయ్యడం అత్యంత కష్టతరమైనది ... నేను నా జీవితమంతా దానితోనే జీవించాను. నేను నా కళ్ళను మూసుకున్నప్పుడు కాళి యొక్క రూపం అక్కడ నిలిచి వుంటుంది. నేను ఆ అమృతంలో మునిగిపోతాను. నేను ఏకమవ్వాలి అనేది నేను మరచిపోతాను ; నేను నా కళ్ళు మూసుకోగానే అక్కడ ఇరువురు ఉంటారు. నేను ధ్యానించడానికి ప్రయత్నించినప్పుడు అది ద్విత్వం అవుతుంది. నన్ను దీని నుంచి బయటపడెయ్యడానికి సహాయపడండి!"

కనుక తోతాపురి అన్నాడు, " దీనిని ప్రయత్నించు : కాళీ రూపం నీ ముందు ఉన్నప్పుడు ఒక ఖడ్గాన్ని తీసుకో మరి ఆమెను రెండుగా ఖండించు."

రామకృష్ణుడు అన్నాడు, " ఖడ్గాన్ని నేను ఎక్కడ కనుగొనగలను ?" అష్టావక్రుడి యొక్క సూత్రంలో చెప్పబడినదీ తోతాపురి చెప్పినదీ ఒక్కటే. తోతాపురి అన్నాడు, " నువ్వు ఈ కాళీ రూపాన్ని ఎక్కడి నుంచి తీసుకొచ్చావు ? ... కనుక అదే ప్రదేశం నుంచి ఖడ్గాన్ని తీసుకురా ! ఆమె కూడా ఊహాజనితమైనదే. ఆమె కూడా నీ ఊహ యొక్క అలంకరణే. నీ జీవితమంతా దానిని పోషించడం ద్వారా, నీ జీవితమంతా దానిని నిరంతరంగా ప్రసరించడం ద్వారా, అది ఘనీభవించింది. అది కేవలం ఊహ మాత్రమే." తమ కళ్ళను మూసుకున్నప్పుడు ప్రతి ఒక్కరూ కాళిని దర్శించరు...

అనేక సంవత్సరాల ప్రయత్నం తరువాత ఒక క్రైస్తవుడు తన కళ్ళు మూసుకుంటాడు మరి అతనికి క్రీస్తు వస్తాడు. ఒక కృష్ణభక్తుడు తన కళ్ళు మూసుకుంటాడు మరి అతనికి కృష్ణుడు వస్తాడు. బుద్ధుడిని ప్రేమించే వ్యక్తి తన కళ్ళను మూసుకుంటాడు మరి అతనికి బుద్ధుడు వస్తాడు. మహావీరుడి ప్రేమికుడు తన కళ్ళను మూసుకుంటాడు మరి అతనికి మహావీరుడు వస్తాడు. ఒక జైనుడికి క్రీస్తు రాడు, ఒక క్రైస్తవుడికి మహావీరుడు రాడు : కేవలం మీరు ప్రసరించిన రూపం మాత్రమే వస్తుంది. రామకృష్ణుడి యొక్క ప్రయత్నం కాళితోనే, మరి ఆ రూపం దాదాపు గట్టిపడిపోయింది. నిరంతర పునరుక్తి వలన, నిరంతర స్మరణ వలన అది ఎంత వాస్తవమైనదిగా అయ్యిందంటే, కాళీ అతని ముందు నిలబడి వున్నట్లుగా అది కనిపించింది. అక్కడ ఎవ్వరూ నిలబడిలేరు.

చైతన్యం అనేది ఏకాకి. అక్కడ రెండవవారు లేరు, అన్యమైనది లేదు.

" కేవలం నీ కళ్ళను మూసుకో," తోతాపురి చెప్పాడు, " ఆ ఖడ్గాన్ని ఎత్తు మరి ఖండించు."

రామకృష్ణుడు తన కళ్ళను మూసుకున్నాడు, కానీ అతను వాటిని మూసుకోగానే అతని ధైర్యం మాయమైపోయింది. కాళిని ఖండించడానికి తన ఖడ్గాన్ని ఎత్తడమా...? భక్తుడు తన ఖడ్గాన్ని ఎత్తాలి మరి భగవంతుడిని ఖండించాలి !... అది అత్యంత కఠినమైనదై వుంది.

ప్రపంచాన్ని త్యజించడం అత్యంత సులభం. ప్రపంచంలో పట్టుకు వ్రేళ్ళాడదగినది ఏముంది? కానీ మనస్సు లోతుల్లో మీరు ఒక రూపాన్ని నిలుపుకున్నప్పుడు, మనస్సులో మీరు కవిత్వాన్ని సృష్టించుకున్నప్పుడు, మనస్సు యొక్క స్వప్నం సాకారమైనప్పుడు, అప్పుడు దానిని త్యజించడం అత్యంత కష్టతరమైనది. ఈ ప్రపంచం ఒక పీడకలలాంటిది. కానీ భక్తి యొక్క కల, భావన యొక్క కల ఒక పీడకల కాదు, అది ఒక అత్యంత మధురమైన స్వప్నం. దానిని వదిలెయ్యడం ఎలా ? దానిని ధ్వంసం చెయ్యడం ఎలా ?

అతని కళ్ళ నుంచి కన్నీళ్ళు కారడం మొదలయ్యేవి మరి అతను పరవశుడైపోయేవాడు ... అతని శరీరం కంపించడం ప్రారంభించేది. కానీ అతను తన ఖడ్గాన్ని పైకెత్తలేదు ... అతను దాని గురించి పూర్తిగా మరచిపోయేవాడు.

చివరకు తోతాపురి అన్నాడు, " నేను ఇక్కడ ఎన్నో రోజులు వృథా చేశాను. ఏమీ లాభం లేదు. అయితే నువ్వు అది చెయ్యి లేదా నేను వెళ్ళిపోతాను. నా సమయాన్ని వృథా చేయవద్దు. ఈ నిరర్ధకమైనది ఇక చాలు ; ఇప్పుడే !" ఆ రోజు తోతాపురి తనతోపాటు ఒక గాజు ముక్కను తీసుకొచ్చాడు. మరి అతను అన్నాడు, " నువ్వు సంతోషంలో మునిగిపోవడం ప్రారంభించినప్పుడు, నేను నీ నుదుటిని ఈ గాజు ముక్కతో కోస్తాను. నేను నీ నుదుటిని కోసినప్పుడు, అంతరంగంలో ధైర్యాన్ని కూడదీసుకో, నీ ఖడ్గాన్ని పైకెత్తు మరి కాళిని రెండుగా ఖండించు. ఇదే ఆఖరి అవకాశం ... నేను ఇక్కడ ఇక ఉండబోవడం లేదు."

వెళ్ళిపోతాను అని తోతాపురి యొక్క బెదిరింపు... అటువంటి గురువును కనుగొనడం కష్టతరం. తోతాపురి అష్టావక్రుడి లాంటి మనిషి అయివుంటాడు. రామకృష్ణుడు తన కళ్ళను మూసుకున్నాడు, అతనికి కాళి యొక్క రూపం కనిపించింది. అతను పరమానందభరితుడు అయిపోబోతున్నాడు ... అతని కళ్ళ నుంచి కన్నీళ్ళు ప్రవించేందుకు సిద్ధంగా వున్నాయి, ముంచెత్తుతూ, ఆనందం వస్తోంది ... అతను పారవశ్యపూరితుడు అవ్వబోతున్నప్పుడు తోతాపురి అతని నుదురు పట్టుకున్నాడు మరి, మూడవ కంటి చక్రం ఉన్న దగ్గర, పై నుంచి క్రిందకు గాజుముక్కతో గాటు పెట్టాడు. ఆ గాటు నుంచి రక్తం ధారలు కట్టడం ప్రారంభించింది, మరి ఈ పర్యాయం

రామకృష్ణుడు ధైర్యాన్ని చిక్కబట్టుకున్నాడు. అతను ఖడ్గాన్ని పైకెత్తాడు మరి కాళిని రెండు ముక్కలుగా ఖండించాడు. కాళి విడివడిపోయినప్పుడు అతను అద్వైతి అయ్యాడు : కెరటం మహా సాగరంలో కలిసిపోయింది, నది మహాసాగరంలో సంగమించింది.

ఈ అత్యున్నత నిశ్శబ్దంలో అతను ఆరు రోజులు మునిగిపోయి వున్నాడని చెప్పబడుతుంది. అతనికి ఆకలి లేదు దాహమూ లేదు – బాహ్యపు చేతన లేదు, ఎరుక లేదు. అంతా విస్మరించబడింది. మరి ఆరు రోజుల తరువాత అతను తన కళ్ళను తెరచినప్పుడు, అతను అన్న మొదటి విషయం ఏమిటంటే, " ఆఖరి అడ్డంకి తొలగిపోయింది !"

మొదటి సూత్రం చెబుతుంది, **ఓ కుమారా, నిన్ను నువ్వు శరీరంగా భావించుకోవడమనే బంధనంలో ఎంతోకాలంగా నువ్వు చిక్కుకుని ఉన్నావు.** ఈ బంధనమే మీ ఉనికి అని మీరు విశ్వసించడం ప్రారంభించారు. " నేను శరీరాన్ని, నేను శరీరాన్ని, నేను శరీరాన్ని !" ... జన్మ జన్మలుగా, మీరు దీనిని పునరావృతం చేశారు. ఈ పునరుక్తి వలనే మనం శరీరంగా తయారయ్యాం. కానీ మనం ఈ శరీరం కాదు. ఇది మన అజ్ఞానం, ఇది మన అలవాటు. ఇది మన సెల్ఫ్-హిప్నోసిస్, మరి మనం దానిని ఎంత గాఢంగా విశ్వసించామంటే మనం అదే అయ్యాము.

రామకృష్ణుడి జీవితంలో మరొక ఉపాఖ్యానం ఉంది... అతను అన్ని మతాలకూ చెందిన, ఆధ్యాత్మిక సాధనలను చేశాడు. మానవాళి చరిత్రలో అన్ని మతాల యొక్క మార్గాల ద్వారా సత్యాన్ని సిద్ధించుకోవడానికి ప్రయత్నించిన ఒకే ఒక వ్యక్తి అతను. సాధారణంగా ఒక వ్యక్తి ఒకే మార్గం ద్వారా చేరుకుంటాడు. మీరు పర్వత శిఖరాగ్రాన్ని చేరుకున్నప్పుడు, ఇతర మార్గాల గురించి ఎవరు పట్టించుకుంటారు ? మీరు అప్పుడు ఇతర మార్గాలలో కూడా నడుస్తారా ? ఎవరు పట్టించుకుంటారు ? ... మీరు సాధించారు. మీరు వచ్చిన మార్గంపై, మీరు వచ్చారు ; ఇతర మార్గాలన్నింటిపైనా నడవడం వలన ఉపయోగం ఏమిటి ? కానీ రామకృష్ణుడు పర్వత శిఖరాగ్రాన్ని మళ్ళీ మళ్ళీ చేరుకున్నాడు, తరువాత దిగివచ్చాడు. అతను రెండవ మార్గం ద్వారా అధిరోహించాడు, అనంతరం మూడవ మార్గం ద్వారా. అన్ని మతాల సాధనలూ చేసి మరి వాటన్నింటి ద్వారా అదే శిఖరాగ్రాన్ని పొందిన మొదటి వ్యక్తి అతనే.

సంయోగీకరణ గురించి అనేకమంది మాట్లాడారు ... సంయోగీకరణ శాస్త్రాన్ని సృజించిన మొదటి వ్యక్తి రామకృష్ణుడే. అన్ని మతాలూ సత్యమైనవే అని అనేకమంది చెప్పారు, కానీ అవి కేవలం మాటలు మాత్రమే. రామకృష్ణుడు దానిని వాస్తవం

చేశాడు. అతను దానికి అనుభవం యొక్క బలాన్నిచ్చాడు, తన జీవితం ద్వారా అతను దానిని నిరూపించాడు. అతను ఇస్లామిక్ సాధన చేస్తున్నప్పుడు అతను ఒక అసలైన మహమ్మదీయ ఫకీరుగా అయ్యాడు. అతను రాముడిని మరచిపోయాడు మరి 'అల్లాహూ... అల్లాహూ," అని జపించడం ప్రారంభించాడు. అతను ఖురాను యొక్క చరణాలను వినడం ప్రారంభించాడు మరి మసీదు రీతులకు అనుగుణంగా జీవించాడు. అతను ఒక ఆలయం సమీపానికి వస్తే కనుక అతను కన్నెత్తి కూడా చూడలేదు, వంగి నమస్కరించడం అనే సంగతిని వదిలెయ్యండి. అతను కాళి గురించి మరచిపోయాడు.

బెంగాలులో ఒక మతశాఖ వుంది, సఖులు. రామకృష్ణుడు సఖి శాఖ యొక్క సాధనను చేసినప్పుడు..భగవంతుడు ఒక్కడే పురుషుడనీ, మిగిలినవారంతా స్త్రీలేననీ సఖులు విశ్వసిస్తారు ... కృష్ణుడే భగవంతుడు, మిగిలిన వారంతా అతని సఖులే, అతని ప్రేయసులే ... కనుక సఖి సంప్రదాయంలో పురుషులు కూడా తమను తాము స్త్రీలుగానే పరిగణించుకుంటారు. కానీ రామకృష్ణుడి జీవితంలో సంభవించినది సఖి సాంప్రదాయాన్ని అనుసరించే మరెవ్వరి జీవితంలోనూ ఎన్నడూ సంభవించలేదు. ఒక పురుషుడు తాను స్త్రీనని ఉపరితలంపై విశ్వసించవచ్చు, కానీ అతను ఒక పురుషుడిగానే ఉంటాడు, తాను ఓ పురుషుడినే అని అతనికి అంతర్గతంగా తెలుసు. సఖి శాఖలోని సభ్యులు ఒక కృష్ణ విగ్రహాన్ని తమతోపాటు పడకపై ఉంచుకుంటారు ... ఇదే వారి భర్త. కానీ దాని వలన ఏ వ్యత్యాసం ఉంటుంది ? కానీ రామకృష్ణుడు ఈ సాధనను చేసినప్పుడు అపూర్వమైనదేదో సంభవించింది ... అటువంటి విషయం సంభవించింది అని శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోతారు... అతను సఖుల యొక్క సాధనను ఆరు నెలలపాటు చేశాడు మరి మూడు నెలల తరువాత అతని రొమ్ములు ఉబ్బడం ప్రారంభించాయి, అతని స్వరం మారింది, అతను ఒక స్త్రీలా నడవడం మొదలు పెట్టాడు, మరి అతని స్వరం స్త్రీ యొక్క స్వరంలా మధురంగా అయ్యింది. అతని వక్షోజాలు పెరుగుతున్నాయి, స్త్రీ యొక్క వక్షోజాలలా తయారవుతున్నాయి ; అతని శరీరం యొక్క పురుషాకృతి మార్పు చెందడం మొదలయ్యింది.

ఇంతవరకూ సాధ్యమే, ఎందుకంటే వృద్ధి చెందకుండా ఉన్నా కూడా, పురుషుడు సైతం రొమ్ములను కలిగివున్నాడు... స్త్రీ యొక్క రొమ్ములు వృద్ధి చెందివుంటాయి. కనుక వృద్ధి చెందని రొమ్ములు వృద్ధి చెందడమనేది సాధ్యమే ; ఆ విత్తనం అనేది ఉంది. ఈ దశ వరకూ మహత్తరమైనది ఏదీ సంభవించలేదు. అనేక పురుషుల రొమ్ములు పెద్దవవుతూ వుంటాయి ... ఇది అంత గొప్ప ఆశ్చర్యకరమైనదేమీ కాదు. కానీ ఆరు నెలలు దాదాపు అయిపోబోతున్నప్పుడు అతనికి ఋతుస్రావం

మొదలయ్యింది. ఇది ఒక అద్భుతం ! ఋతుస్రావం కావడం అనేది శరీరం యొక్క శాస్త్రానికి పూర్తిగా విరుద్ధమైనది. ఏ పురుషుడికీ ఇది ఎన్నడూ సంభవించలేదు.

ఈ ఆరు నెలల్లో ఏం జరిగింది ? " నేను ఒక స్త్రీని ", అనే నమ్మకం... ఈ భావన ఎంతో దృఢమయ్యింది, ఈ అనుభూతి అతని ఉనికిలో, రోమరోమాలలో ఎంతో లోతుగా ప్రతిధ్వనించింది... శరీరపు ప్రతీ కణంలోనూ అది ప్రతిధ్వనించింది : " నేను ఒక స్త్రీని." ఏ ప్రతికూల భావనా మిగిలి లేదు, ఒక పురుషుడై ఉండడాన్ని గురించి అతను పూర్తిగా విస్మరించాడు ; అప్పుడు అది సంభవించింది.

మనం శరీరాలం కాదు అని అష్టావక్రుడు చెబుతున్నాడు ; మన శరీరాలమని మనం కేవలం విశ్వసించాము మరి మనం శరీరాలమే అయ్యాం. మనం ఏది విశ్వసించామో, మనం అదే అయ్యాం. ఈ ప్రపంచం మన విశ్వాసమే. మరి మనం మన నమ్మకాలను వదిలేసిన క్షణమే మనం అవ్యవధిగా రూపాంతరం చెందవచ్చు. మరి దానిని వదిలెయ్యడానికి వాస్తవానికి ఏదీ మార్చవలసిన అవసరం లేదు, కేవలం ఆ భావనను వదిలెయ్యాలి.

మనం వాస్తవంగానే ఈ శరీరమైతే కనుక, రూపాంతరీకరణ అనేది అత్యంత కష్టతరం. మనం వాస్తవానికి ఈ శరీరం కాదు. వాస్తవంలో మనం ఈ శరీరంలోపల చైతన్యంగా దాగి వున్నాం ... సాక్షిగా, గమనించేవాడిగా.

ఓ కుమారా,.నిన్ను నువ్వు శరీరంగా భావించుకోవడమనే
బంధనంలో ఎంతో కాలంగా నువ్వు చిక్కుకుని ఉన్నావు.
" నేను ఎరుకను" అనే జ్ఞాన ఖడ్గంతో ఈ బంధనాన్ని
ఖండించు మరి ఆనందంగా ఉండు.

ఎరుక యొక్క ఖడ్గాన్ని పైకెత్తండి. " నేను ఎరుకను " ... అవగాహన యొక్క ఈ ఖడ్గాన్ని పైకెత్తండి, " నేను ఈ శరీరాన్ని " అనే భావనను ఖండించండి మరి మీరు ఆనందంగా ఉంటారు.

దుఃఖం అంతా శరీరానికి చెందినదే. జననం, వ్యాధి, వృద్ధాప్యం, మృత్యువు ... అన్నీ శరీరానికి చెందినవే, మరి శరీరంతో అభిన్నత ఉన్నప్పుడు శరీరం యొక్క వేదనలన్నింటితోనూ అభిన్నత ఉంటుంది. ఈ శరీరం శిథిలమైపోయినప్పుడు మనం అనుకుంటాము, " నేను శిథిలమైపోయాను." శరీరం అస్వస్థత చెందినప్పుడు మనం అనుకుంటాము, " నేను అస్వస్థుడిని అయ్యాను." శరీరం మృత్యువును

సమీపించినప్పుడు మనం మరణిస్తున్నామని మనం భయపడతాము. నమ్మకాలు... కేవలం నమ్మకాలు.

నేను విన్నది ఏమిటంటే ఒక రాత్రి ముల్లా నసీరుద్దీన్ మరి అతని భార్య మంచంపై పడుకుని ఉన్నారు... వాళ్ళకు పిల్లలు లేరు, మరి అతని భార్య ఒక బిడ్డను పొందాలని అత్యంత ఆత్రుతతో వుంది. వాళ్ళు నిద్రలోకి జారుకోబోతున్నప్పుడు భార్య అంది, " విను, మనకు ఒక బిడ్డ పుడితే కనుక మనం అతనిని ఎక్కడ పడుకోబెడతాము ? ... ఎందుకంటే కేవలం ఒకే ఒక మంచం వుంది."

కనుక ముల్లా కొద్దిగా ఆ ప్రక్కకు జరిగి, అన్నాడు, " మనం వాడిని ఇక్కడే మన మధ్యన పడుకోబెడతాము."

అతని భార్య అంది, " మరి మనకు రెండోవాడు పుడితే ?"

ముల్లా మరికొంత జరిగి అన్నాడు, " మనం అతనిని కూడా ఇక్కడ పడుకోబెట్టవచ్చు." పిసినారి వెధవ !

భార్య అంది, " మరి మూడవవాడు వస్తే ?"

ముల్లా మరికొంత ముందుకు జరిగి, " వాడిని సరిగ్గా ఇక్కడ పడుకోబెట్టు," అని అనబోతూండగా, అతను గభీలున మంచంపై నుంచి క్రిందకు పడిపోయాడు. అతని కాలు విరిగింది. ఈ సందడి అంతా విని, ఇరుగు పొరుగువాళ్ళు పోగయ్యారు ... అతను గట్టిగా ఏడుస్తున్నాడు ... మరి వాళ్ళు అడిగారు, " ఏం జరిగింది ?"

అతన చెప్పాడు, " ఈ పిల్లాడు ... ఇంకా పుట్టని వాడు ... నా కాలు విరగ్గొట్టాడు. మరి ఉనికిలో లేని ఒక పిల్లాడు ఇంత సమస్యను సృష్టించినప్పుడు, నిజమైన వాడి గురించి ఏం చెప్పాలి ! నన్ను మన్నించండి, కానీ నాకు ఏ పిల్లలూ వద్దు. ఈ అనుభవం చాలు !"

కొన్నిసార్లు... లేదు, కొన్నిసార్లు కాదు, సాధారణంగా మనం ఇలానే జీవిస్తాం... విశ్వసిస్తూ. మనం మన విశ్వాసాన్ని అనుసరిస్తాం, మరి మనం మన విశ్వాసాన్ని అనుసరించినప్పుడు నిజమైన పర్యవసానాలు వస్తాయి, ఆ విశ్వాసం అసత్యమైనదైనా కూడా. అక్కడ ఏ బిడ్డా లేడు, కానీ ఒక నిజమైన కాలు విరిగిపోయింది. అసత్యమైనదాని యొక్క ప్రభావం వాస్తవమైనది కావచ్చు. అసత్యమైనది తగినంత గాఢంగా విశ్వసించబడితే కనుక, దాని పరిణామాలు వాస్తవంగా సంభవిస్తాయి.

మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే మన ప్రపంచపు అనేక అనుభవాలలో చాలా వరకూ వాస్తవం కన్నా విశ్వాసమే అధికంగా అయివుంటాయి.

ఒక మనోవైజ్ఞానికుడు హార్వర్డ్ విశ్వవిద్యాలయం వద్ద ప్రయోగాలు చేస్తున్నాడు. ఒక ప్రయోగంలో అతను ఒక పెద్ద సీసాను గట్టిగా మూసేసాడు. దానిని జాగ్రత్తగా ప్యాక్ చేశాడు. మరి దానిని తన తరగతి గదికి తీసుకువచ్చాడు. అక్కడ యాభైమంది విద్యార్థులు ఉన్నారు. అతను ఆ సీసాను బల్లపై పెట్టాడు మరి విద్యార్థులకు చెప్పాడు, " ఈ సీసాలో అమ్మోనియా గ్యాస్ వుంది. నేను దాని మూతను తీసినప్పుడు ఈ వాయువు యొక్క వాసన వ్యాపించడానికి ఎంత సమయం పడుతుందో కనుగొనడానికి నేను ఓ ప్రయోగాన్ని చేయాలని అనుకుంటున్నాను. కనుక ఆ వాసన వచ్చినప్పుడు మీరు మీ చేతిని పైకెత్తండి. మీరు దానిని కనుగొనగానే మీ చేతిని పైకెత్తండి. చివరి వరుసను చేరడానికి ఎన్ని క్షణాలు పడుతుందో నేను కనుగొనాలనుకుంటున్నాను."

ఆ విద్యార్థులు శ్రద్ధగా కూర్చున్నారు. అతను సీసాను తెరిచాడు. అతను దానిని తెరువగానే అతను వెంటనే తన ముక్కును ఒక రుమాలుతో మూసుకున్నాడు ... అమ్మోనియా వాయువు ! అతను ప్రక్కకు తొలగి నిలబడ్డాడు. రెండు క్షణాలు గడవకముందే మొదటి వరుసలో ఎవరో తన చేతిని పైకెత్తారు, తరువాత రెండవవారు, తరువాత మూడవవారు. అనంతరం రెండవ వరుసలో ఒక చేయి పైకొచ్చింది, తరువాత మూడవ వరుస. పదిహేను క్షణాలలో అమ్మోనియా వాయువు తరగతి అంతటినీ చేరింది మరి ఆ సీసాలో ఏ అమ్మోనియా లేదు ! ఆ సీసా ఖాళీగానే వుంది.

ఒక భావన ... కనుక పరిణామాలు సంభవించాయి. వాళ్ళు దానిని విశ్వసించారు, అది జరిగింది. ఏ అమ్మోనియా వాయువూ లేదని అతను చెప్పినప్పుడు, ఆ విద్యార్థులు అన్నారు, " అది ఉన్నా లేదా లేకపోయినా మేము దాని వాసన చూశాం." ఆ వాసన ప్రసరించబడింది. ఆ వాసన అంతరంగంలో నుంచి వచ్చినట్లుగా వుంది ... బయట ఏమీ లేదు. వాళ్ళు అనుకున్నారు, కనుక అది వచ్చింది.

నేను విన్నాను, ఒక మనిషి వైద్యాలయంలో అస్వస్థుడై వున్నాడు మరి ఒక నర్సు అతని కోసం రసాన్ని తెచ్చింది, కమలా రసం. ఆమె ఆ రసాన్ని తీసుకురావడానికి కొద్దిగా ముందే మరొక నర్సు అతని మూత్రపు నమూనాను ఉంచడానికి అతనికి ఒక సీసాను ఇచ్చింది ... పరీక్షించడం కోసం. అతను ప్రాక్టికల్ జోకులను ఇష్టపడతాడు, కనుక అతను కమలా రసాన్ని ఆ సీసాలో పోశాడు మరి దానిని ప్రక్కన ఉంచాడు.

ఆ నర్సు సీసాను తీసుకోవడానికి వచ్చినప్పుడు అది అలాంటి విచిత్రమైన రంగులో ఉండడం చూసి ఆమె బెదిరిపోయింది. ఆ మనిషి అన్నాడు, " నువ్వు కూడా ఆశ్చర్యపోతున్నావా ... దాని రంగు ఎంతో విచిత్రంగా వుంది. సరే, మరొక్కసారి దానిని శరీరం ద్వారా పునరావృతం చేయనివ్వు, అదే రంగును నిర్ణయిస్తుంది " ... మరి అతను ఆ సీసాను తన నోటి వద్దకు ఎత్తి దానిలోని పదార్థాన్ని త్రాగాడు.

ఆ నర్సు స్పృహ తప్పి పడిపోయిందని చెబుతారు : ఆ మనిషి మూత్రాన్ని తాగుతున్నాడని ఆమె అనుకుంది. మరి అతను అన్నాడు, "... నేను దానిని నా శరీరం ద్వారా మరోసారి పంపుతాను మరి ఆ రంగు సరిచేయబడుతుంది అది తిన్నగా అవుతుంది." ఇతను ఏ రకమైన మనిషి ? కానీ అది కేవలం కమలా రసం మాత్రమే. అది కమలా రసం అని ఆమెకు తెలిసినట్లయితే ఆమె స్పృహ తప్పేది కాదు. కానీ ఆమె అచేతనమవ్వడం అనేది వాస్తవం, అది నమ్మకం నుంచే వచ్చినా కూడా.

నమ్మకం ఏదైనా చేసిన, నమ్మకం ప్రత్యక్షీకరించబడిన అటువంటి వేలాది సంఘటనలను జీవితంలో మీరు మీ చుట్టూ కనుగొనవచ్చు.

" నేను శరీరాన్ని " ... మనం దీనిని అనేక జన్మలుగా విశ్వసించాం, మరి దానిని విశ్వసించడం వలన మనం శరీరమే అయ్యాం. దానిని విశ్వసించడం వలన మనం అల్పులమయ్యాం. దానిని విశ్వసించడం వలన మనం పరిమితులమైపోయాం. అష్టావక్రుడి యొక్క మౌలిక పూర్వ సిద్ధాంతం ఏమిటంటే ఇది ఎవరికి వారు విశ్వాసాల ద్వారా అచేతనాన్ని ప్రభావితం చేసుకోవడమే. మీరు శరీరంగా తయారైపోలేదు, మీరు శరీరంగా తయారవ్వలేరు, దానిని చేయగల మార్గమే లేదు ... మీరు కానిది మీరు ఎలా అవ్వగలరు ? మీరు ఏదై వున్నారో, మీరు ఇప్పుడే అలా వున్నారు ; మీరు కేవలం అసత్యపు విశ్వాసాలను తెంచిపారెయ్యాలి.

" నేను ఎరుకను " అనే జ్ఞాన ఖడ్గంతో ఆ బంధనాన్ని
ఖండించు మరి ఆనందంగా ఉండు.

ఈ క్షణమే ఆనందంలో జాగృతమవ్వండి... ఎందుకంటే మన దైన్యాలన్నీ మనం ఈ శరీరం అనే విశ్వాసంపై ఆధారపడి వృద్ధి చెందుతున్నవే. బుద్ధుడు కూడా మరణిస్తాడు, కానీ మరణ వేదన పొందడు. రామకృష్ణుడు మరణిస్తాడు, కానీ మరణ వేదన పొందడు. రమణ మహర్షి మరణిస్తాడు, కానీ మరణ వేదన పొందడు.

రమణుడు మరణించినప్పుడు అతనికి క్యాన్సర్ ఉంది. వైద్యులు ఎంతో ఆశ్చర్యపోయారు : అది అత్యంత కఠినమైన వ్యాధి మరి అది ఎంతో వేదనను కలిగించింది, కానీ రమణుడు ఎప్పటి వలెనే ఉన్నాడు, ఆ వ్యాధి వలన ఏ వ్యత్యాసమూ లేనట్లుగా. అది ఏ మార్పునూ కలిగించలేదు. ఆ వైద్యులు కలత చెందారు. అది సాధ్యం కాదు ; అది ఎలా సంభవించగలదు ? మృత్యువు ద్వారం వద్ద నిలిచి వుంది మరి ఆ మనిషి విశ్రాంతిగా, ఊగిసలాట అనేది లేకుండా ఉన్నాడు. మనం వైద్యుల అసౌఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు : అంతటి బాధ కానీ ఆ మనిషి ప్రశాంతంగా, ఊగిసలాట లేకుండా వున్నాడు. మనం వాళ్ళ అసౌఖ్యాన్ని, వాళ్ళ తర్కాన్నీ అర్థం చేసుకోవచ్చు ఎందుకంటే మనకు శరీరమే అంతా అయినట్లుగా కనిపిస్తుంది. " నేను ఈ శరీరం కాదు... మృత్యువు వస్తోంది కానీ అది ఈ శరీరం యొక్క మృత్యువు, మరి బాధ కలుగుతోంది, అది కూడా శరీరానికే కలుగుతోంది..." అని తెలిసిన వ్యక్తికి, వెనుకకు నిలబడి మరి వీక్షించే ఒక నూతన చైతన్యం సాక్షాత్కరించింది. శరీరానికి మరి చైతన్యానికి మధ్య ఉన్న ఈ దూరం భూమికీ మరి ఆకాశానికీ మధ్యన ఉన్న దూరం లాంటిదే. దీనిని మించిన దూరం లేనేలేదు. మీ అంతర్గత ప్రపంచంలో అస్తిత్వంలోని అత్యంత సుదూర విషయాలు కలుసుకుంటున్నాయి. భూమి మరి ఆకాశం కలుసుకునే దిజ్మండలమే మీరు.

ఏదైతే జన్మించిందో అది, వుంటుంది, వృద్ధి చెందుతుంది,
మార్పు చెందుతుంది, క్షీణిస్తుంది మరి నశిస్తుంది : నువ్వు అది కాదు.

దీనంతటినీ గమనించేది... మీరు మీ బాల్యాన్ని చూశారు, మరి బాల్యం వెళ్ళిపోవడాన్ని కూడా మీరు చూశారు : మీరు మీ బాల్యమే అయితే కనుక అప్పుడు బాల్యం ఉండేది అని ఇప్పుడు గుర్తుంచుకోగలిగేవారు ఎవరు ? బాల్యంతోనే మీరు మాయమైపోయి ఉండేవారు. మీరు మీ యవ్వనాన్ని చూశారు : అది రావడం మీరు చూశారు, అది వెళ్ళడమూ మీరు చూశారు. మీరు మీ యవ్వనమే అయితే కనుక ఇప్పుడు జ్ఞాపకం చేసుకుంటున్నవారు ఎవరు ? మీ యవ్వనంతోనే మీరు వెళ్ళిపోయి ఉండేవారు. మీ యవ్వనం రావడాన్ని మీరు వీక్షించారు, అది వెళ్ళడాన్నీ మీరు వీక్షించారు ... అవశ్యంగానే మీరు ఈ యవ్వనానికి అన్యమైనవారే. అది ఎంతో సరళమైన విషయం, ఎంతో స్పష్టమైన విషయం. మీరు వేదనను చూశారు, బాధ కలగడం చూశారు, మీ చుట్టూ బాధ మబ్బులు కమ్ముకోవడం చూశారు ... మరి వేదన వెళ్ళిపోవడమూ మీరు చూశారు. మీరు దుఃఖాన్ని చూశారు, మీరు ఆనందాన్నీ చూశారు. మీ చర్మంలో ఒక ముల్లు గుచ్చుకుంది, మీరు నొప్పిని గమనించారు. ఆ ముల్లు తొలగించబడింది, మరి ఇప్పుడు నొప్పి లేదు. మీరు దానిని చూశారు ...

మీరు దర్శించేవారు. మీరు అతీతంగా నిలిచి వుంటారు. మీరు స్పృశించబడరు, ఏ ఘటనా మిమ్మల్ని స్పృశించలేదు. మీరు నీటిపై తేలియాడుతున్న ఒక తామరపువ్వు.

" నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు, స్వయం - ప్రకాశకుడవు మరి నిష్కపటమైనవాడవు. నీ బంధనం ఇదే : నువ్వు సమాధిని సాధన చేస్తావు.

ఇది ఒక విస్మయకారకమైన, విప్లవాత్మకమైన వివరణ. ప్రపంచపు ఏ పవిత్ర గ్రంథంలోనూ ఇటువంటి విప్లవాత్మకమైన వివరణను కనుగొనడం అసాధ్యం. మీరు దానిని సంపూర్ణంగా అవగాహన చేసుకున్నప్పుడు, ఒక గాఢమైన కృతజ్ఞతాభావం ఉదయిస్తుంది.

పతంజలి అన్నాడు, " యోగం అంటే చిత్త-వృత్తుల యొక్క ... మనస్సు యొక్క ప్రసరణల ... నిరోధం," యోగంలో అంగీకరించబడిన భావన ఏమిటంటే మనస్సు ప్రసరించడాన్ని నిలిపివేసేటంతవరకూ ఒక వ్యక్తి తనను తాను తెలుసుకోలేడు. అన్ని మానసిక ప్రసరణలూ నిశ్చలమైపోయినప్పుడు, ఒక వ్యక్తి తనను తాను తెలుసుకోగలుగుతాడు.

పతంజలి యొక్క సూత్రానికి విరుద్ధంగా అష్టావక్రుడు మాట్లాడుతున్నాడు. అష్టావక్రుడు చెబుతున్నాడు :

" నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు, స్వయం-ప్రకాశకుడవు మరి నిష్కపటమైనవాడవు. నీ బంధనం ఇదే: నువ్వు సమాధిని సాధన చేస్తావు."

సమాధిని సాధన చేయలేము, సమాధికై సన్నద్ధం కాలేము, ఎందుకంటే సమాధి అనేది మీ స్వభావం. మనో ప్రసరణలు అనేవి నిమ్నమైన స్థితులు. వాటిని ఆపడానికి ప్రయత్నించడమనేది ఒక చీకటిగా ఉన్న ఇంట్లోకి ప్రవేశించి మరి అంధకారంతో పోరాడడానికి ప్రయత్నించడంలాంటిది.

దీనిని అవగాహన చేసుకోండి. మీ కరవాలాలనూ, ఈటెలనూ, కర్రలనూ తీసుకురండి మరి అంధకారంతో పోరాడండి ; సైనికులను, బలవంతులనూ పిలవండి మరి అంధకారాన్ని బయటకు నెట్టడం మొదలుపెట్టండి. మీరు ఎప్పటికైనా విజయవంతం అవుతారా ? ఒక నిర్వచనంగా ఇది కచ్చితమైనదే ... అంధకారం అనేది లేకపోవడమే కాంతి అనబడుతుంది. కానీ ఈ నిర్వచనాన్ని అవగాహన చేసుకోండి. అంధకారం అనేది లేకపోవడమే కాంతి అనబడుతుంది అనేది నిజమే.

మనో ప్రసరణలు నిశ్చలమైపోవడమే యోగం అనేది నిజమే, కానీ దానిని మరోవిధంగా తీసుకోకండి.

కాంతి అంటే అంధకారం అనేది లేకపోవడమే, కానీ అంధకారాన్ని వదిలించుకోవడానికి ప్రయత్నించడం ప్రారంభించకండి. వాస్తవ పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది : కాంతి యొక్క ఉనికే అంధకారం యొక్క లేమి. ఒక దీపాన్ని వెలిగించండి మరి అంధకారం దానంతట అదే మాయమైపోతుంది. అంధకారం అనేది ఉండదు ... అంధకారం అనేది కేవలం ఒక లేమి.

మనస్సు యొక్క ప్రసరణలను నిశ్చలం చేయమనీ, మీ ఉనికిని మీరు తెలుసుకోగలుగుతారు అనీ పతంజలి చెబుతాడు. మీ ఉనికిని తెలుసుకోమనీ, మరి మనస్సు యొక్క ప్రసరణలు నిశ్చలమైపోతాయనీ అష్టావక్రుడు చెబుతాడు. మీ ఉనికిని తెలుసుకోకుండా, ప్రసరణలు నిశ్చలం చేయబడవు. ఉనికి అనేది తెలియకపోవడం వలనే మనో ప్రసరణలు ఉదయిస్తాయి. మీరు శరీరమేనని మీరు అనుకుంటే కనుక, శరీరం యొక్క కోరికలు కలుగుతాయి. మీరు మనస్సేనని మీరు అనుకుంటే కనుక, మనస్సు యొక్క కోరికలు కలుగుతాయి. మిమ్మల్ని మీరు దేనితో గుర్తించుకొంటే దాని కోరికలు మిమ్మల్ని నీడలా కమ్ముకుంటాయి, మీపై ప్రతిబింబిస్తాయి. మీకు ఏది సమీపంగా ఉంటే, అది మిమ్మల్ని ప్రభావితం చేస్తుంది.

అది ఒక స్ఫటికానికి ప్రక్కన ఒక రంగురాయిని ఉంచడం లాంటిది : ఆ రాయి యొక్క రంగులు స్ఫటికంపై ప్రకాశిస్తాయి. దానిని ఒక ఎరుపు రాయితో ఉంచండి మరి ఆ స్ఫటికం ఎర్రగా కనిపిస్తుంది. ఒక నీలపు రాయితో దానిని ఉంచండి మరి ఆ స్ఫటికం నీలంగా కనిపిస్తుంది, ఇది సామీప్యం వలన వస్తుంది. ఆ స్ఫటికం నీలంగా అవ్వదు, అది కేవలం అలా కనిపిస్తుంది.

అంధకారం కేవలం ఉన్నట్లుగా కనిపిస్తుంది, అది లేదు. కాంతి అనేది లేకపోవడమే అంధకారం అని పిలువబడుతుంది. అంధకారానికి తన స్వంత వాస్తవం లేదు, తన స్వంత ఉనికి లేదు. అంధకారంతో పోరాడడం ప్రారంభించకండి.

యోగం మరి అష్టావక్రుడి యొక్క దృష్టి విరుద్ధమైనవి. అందువలనే నేను చెబుతాను, మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోవాలనుకుంటే కనుక, మీరు కృష్ణమూర్తిని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి ... అష్టావక్రుడి యొక్క నవీన రూపమే కృష్ణమూర్తి. కృష్ణమూర్తి నవీన రీతిలో, ఈనాటి భాషలో చెబుతున్నది, అష్టావక్రుడి సందేశం యొక్క సారాంశమే. కృష్ణమూర్తి అనుచరులు అతను ఏదో నూతనమైనది చెబుతున్నాడని అనుకుంటారు. చెప్పడానికి క్రొత్తదేదీ లేదు,

చెప్పగలిగిదేదైనా ఇప్పటికే చెప్పబడింది. జీవితం ఎన్ని దర్శనాలను కలిగివుండగలదో, అవన్నీ ఏదో ఒక చోట పరిశోధించబడ్డాయి. అనాది కాలం నుంచీ మానవుడు అన్వేషిస్తూనే ఉన్నాడు. చెప్పడానికి క్రొత్తదేదీ ఈ సూర్యుడి క్రింద లేదు ; కేవలం భాష మారుతుంది, అలంకరణ మారుతుంది, వస్త్రాలు మారుతాయి. కాలానుగుణంగా నూతన భావాలు మార్పు చెందుతాయి, కానీ కృష్ణమూర్తి చెబుతున్నది సరిగ్గా ఇదే.

అష్టావక్రుడి భాష అత్యంత సనాతనమైనది, కృష్ణమూర్తి యొక్క భాష అత్యంత నవీనమైనది. కానీ కొద్దిగా అవగాహన చేసుకోగలిగినవారు వాళ్ళు ఒకే విషయాన్ని చెబుతున్నారు అనేది చూస్తారు.

కృష్ణమూర్తి చెప్పేదేమిటంటే యోగా అవసరం లేదు, ధ్యానం అవసరం లేదు, మంత్రాలు మరి తపస్సులు అవసరం లేదు. ఇవన్నీ సాధనలే. మన స్వభావం కాని దానికోసం సాధన చెయ్యాలి. మన అంతర్గత స్వభావాన్ని కనుగొనడానికి ఏ సాధన చేయగలం ? సాధనలన్నింటినీ వదిలెయ్యండి, మీలోనికి మీరు చూసుకోండి, మరి మీ స్వభావం సాక్షాత్కరిస్తుంది.

నువ్వు ఏకాకివి, కర్మశూన్యుడవు, స్వయం-ప్రకాశకుడవు మరి నిష్కపటమైనవాడవు

ఈ ప్రకటన చూడండి, మీరు నిష్కపటమైనవారని అష్టావక్రుడు చెబుతున్నాడు. మీరు ఓ పాపి అని సైతం అనుకోకండి. మీరు ఓ పాపి అనీ, మిమ్మల్ని మీరు పాపాల నుంచి పరిశుద్ధం చేసుకోవాలనీ, పశ్చాత్తాపానికి గురవ్వాలనీ, మీరు చెడు కర్మను చేశారనీ ఈ సాధువులు మరి మతాచార్యులు కొన్ని వేలసార్లు చెప్పనివ్వండి ... దాని నుంచి విడుదల అవ్వండి. అష్టావక్రుడి సూత్రాన్ని గుర్తుంచుకోండి : మీరు కర్మ నుంచి స్వతంత్రులు, మీరు ఏదైనా ఎలా చేయగలరు ?

ఆరు జీవన-తరంగాలు ఉన్నాయని అష్టావక్రుడు చెబుతాడు. ఈ ఆరు తరంగాలు ఏమిటంటే ఆకలి మరి దాహం, దుఃఖం మరి సంతోషం, జననం మరి మరణం. ఆకలి మరి దాహం అనేవి శరీరం యొక్క తరంగాలు. శరీరం అనేది లేనట్లయితే ఆకలీ వుండదు, దాహమూ ఉండదు. ఇవి శారీరక అవసరాలు. శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడు, ఆకలి పెరుగుతుంది. శరీరం అస్వస్థతతో ఉన్నప్పుడు, ఆకలి తగ్గుతుంది. శరీరం బయట ఎండలో ఉంటే కనుక, దాహం పెరుగుతుంది ఎందుకంటే చెమట ఆవిరవుతుంది. వేడి వాతావరణంలో దాహం అధికంగా వుంటుంది, చలిలో దాహం తక్కువగా వుంటుంది. ఇవి శరీరం యొక్క అవసరాలు, ఇవి శరీరం యొక్క తరంగాలు.

ఆకలి మరి దాహం శరీరానికి చెందినవి. దుఃఖం మరి సంతోషం మనస్సుకు చెందినవి. మిమ్మల్ని ఎవరైనా వదిలిపెట్టి వెళ్ళినప్పుడు దుఃఖం ఉంటుంది ఎందుకంటే మనస్సు పట్టును చేజిక్కించుకుంటుంది, అనురాగాలను ఏర్పరచుకుంటుంది. మీరు ఎవరినైనా కలుసుకున్నప్పుడు, ప్రియతములను కలుసుకున్నప్పుడు, సంతోషం ఉంటుంది.

ప్రియమైనవారు వీడి వెళ్ళిపోయినప్పుడు, దుఃఖం ఉంటుంది. మీరు అహితుడిని కలుసుకున్నప్పుడు, దుఃఖం ; ఆ అహితుడు వెళ్ళిపోయినప్పుడు, సంతోషం. ఇది మనస్సు యొక్క క్రీడ, వాత్సల్యం మరి అసహ్యాల యొక్క క్రీడ, ఆకర్షణ మరి వికర్షణల యొక్క క్రీడ.

మనస్సు అనేది ఉండడం నిలిచిపోయిన ఒక వ్యక్తి అంతరంగంలో దుఃఖం ఉండదు, సంతోషం ఉండదు. ఇవి మనస్సు యొక్క తరంగాలు.

మరి జననం – మరణం... జననం మరి మరణం అనేవి జీవ-శక్తి యొక్క తరంగాలు. జన్మించినప్పుడు శ్వాస మొదలవుతుంది ; మరణించినప్పుడు శ్వాస ఆగిపోతుంది. ఒక శిశువు జన్మించగానే అతను శ్వాస తీసుకోవడం మొదలు పెట్టాలనీ, ఏడవడం ప్రారంభించాలనీ వైద్యుడు వ్యాకులపడతాడు ... ఏడవాలి, ఎందుకంటే ఏడవడానికి అతను శ్వాస తీసుకోవాల్సి వస్తుంది. ఏడవడంతో అకస్మాత్తుగా కండరాలు సంకోచించడం వలన శ్వాస నాళాలు తెరుచుకుంటాయి. ఏడవడంతో అకస్మాత్తుగా కండరాలు సంకోచం చెందడం వలన మూసుకున్న ఊపిరితిత్తులు పనిచేయడం ప్రారంభిస్తాయి. కొన్ని క్షణాలలోపే శిశువు ఏడుపు మొదలు పెట్టకపోతే కనుక వైద్యుడు అతనిని తలక్రిందులుగా వ్రేలాడదీస్తాడు మరి శ్వాస మొదలయ్యేలా బలవంతం చేస్తూ అతనిని చరుస్తాడు.

శ్వాసించడమే జననం. శ్వాస అంటే జీవితం యొక్క ప్రక్రియ. ఒక మనిషి మరణించినప్పుడు, శ్వాస అంతమైపోతుంది. జీవితం యొక్క ప్రక్రియ నిలిచిపోతుంది. ఇది క్షణక్షణమూ జరుగుతూనే వుంటుంది. శ్వాస లోపలికి వచ్చినప్పుడు, జీవం లోపలికి వస్తుంది. శ్వాస బయటకు వెళ్ళినప్పుడు, జీవం బయటకు వెళుతుంది.

జననం మరి మరణం అనుక్షణం సంభవిస్తున్నాయి. ప్రతి ఉచ్ఛ్వాసా జీవితమే. ప్రతి నిశ్వాసా మరణమే. కనుక జీవన్మరణాలు ప్రతిక్షణమూ సంభవిస్తున్నాయి. ఇవి జీవశక్తి యొక్క తరంగాలు.

అష్టావక్రుడు అంటాడు, ఇవే ఆ అరు తరంగాలు మరి మీరు ఈ ఆరు తరంగాలకూ అతీతమైనవారు, మీరు వీటిని గమనించేవారు.

బుద్ధుడు తన ధ్యాన విధానమంతటినీ శ్వాసపైనే ఆధారితం చేశాడు. ఒక్క పద్ధతి చాలు అని బుద్ధుడు చెప్పాడు : ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనిస్తూ ఉండండి. శ్వాస రావడం మరి పోవడం గమనించడం వలన ఏమి జరుగుతుంది ? నెమ్మదిగా, నిశ్వాస బయటకు వెళ్ళిపోయి మరి ఉచ్ఛ్వాస ఇంకా లోనికి రాకపోవడం మీరు చూసినప్పుడు, అది బయటకూ వెళ్ళకుండా లోపలికీ రాకుండా వున్న, మధ్యలో శ్వాస నిలిచిపోయే ఒక స్వల్ప ఖాళీని మీరు కనుగొంటారు. ప్రతి అర్ధ శ్వాస మధ్యనా ఒక క్షణికమైన విరామం ఉంటుంది ... శ్వాస ప్రవహించదు, చలించదు, ఆడదు. అది బయటకు వెళుతుంది, ఒక్క క్షణం ఆగుతుంది, అనంతరం లోనికి వస్తుంది. మీరు ఒక ఖాళీని చూడడం ప్రారంభిస్తారు. ఈ ఖాళీలోనే మీరు ఉన్నారు అనేది మీరు కనుగొంటారు : శ్వాస యొక్క ఈ రాకపోకలు అనేవి జీవ-శక్తి యొక్క క్రీడ. మరి మీరు శ్వాస యొక్క రాకపోకలను గమనించగల సమర్థులైతే కనుక, అప్పుడు ఆ ద్రష్ట శ్వాస నుంచి భిన్నమైనవాడు, శ్వాసకు అన్యమైనవాడు.

మన శరీరం మిక్కిలి బాహ్యమైన కైవారం, మనస్సు ఒక లోపలి వృత్తం, మరి జీవం, మరింత లోపల వున్న ఒక వృత్తం. శరీరం వికలమవ్వడం, విరగడం, నాశనమవ్వడం సాధ్యమే, మరి అయినాగానీ మానవుడు జీవిస్తూనే వుంటాడు. మనస్సు చీలిపోవచ్చు. స్థిమితం కోల్పోవచ్చు, నిరుపయోగమైనది కావచ్చు. మరి అయినాగానీ మానవుడు జీవిస్తూనే వుంటాడు. కానీ శ్వాస లేకుండా మానవుడు జీవించడు. ఒక మనిషి యొక్క మస్తిష్కమంతటినీ గాయపరచండి, అయినా అతను జీవిస్తూనే వుంటాడు కోమాలో పడి వుంటాడు, కానీ ఇంకా సజీవుడిగానే ఉంటాడు. కాళ్ళను నరికేయవచ్చు కనుక కేవలం శ్వాసే మిగిలి వుంటుంది ; మానవుడు జీవిస్తూనే వుంటాడు. శ్వాస ఆగిపోతే కనుక, మిగిలినదంతా బాగానే ఉన్నా కూడా, ఆ మనిషి చనిపోతాడు. ఇవే ఆ ఆరు తరంగాలు, మరి గమనించేవాడు ఈ ఆరింటికీ అతీతుడు.

నువ్వు ఏకాకివి... ఎవ్వరూ నీ సహచరులు కాదు. ఈ శరీరం నీ సహచరి కాదు, ఈ శ్వాస నీ సహచరి కాదు, ఆలోచనలు నీ సహచరులు కాదు. **నువ్వు ఏకాకివి...** అంతరంగంలో ఏ సహచరులూ లేరు ... ఇక బాహ్యం గురించి ఏం చెప్పాలి ! భర్త, భార్య, కుటుంబం, మిత్రులు, ప్రియతములు : ఎవ్వరూ సహచరులు కాదు. సన్నిహితులైనవారు ఎవ్వరూ లేరు, బంధుత్వంగలవారు ఎవ్వరూ లేరు. సన్నిహితంగా ఉండడం అనేది కేవలం ఒక బాహ్య దృగ్విషయం. అంతరంగంలో నుంచి, ఎవ్వరితోనూ ఏ కలయికా ఏర్పడదు.

నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు .... మీ కర్మలు, మీ చర్యల యొక్క ప్రశ్నను సైతం లేవదీయకండి. అష్టావక్రుడిని మీరు, " ఈ క్షణమే ఎవ్వరైనా విముక్తులు కావచ్చు అని మీరు చెబుతున్నారు, మరి మా గత కర్మల యొక్క ఫలాలు ఏమవుతాయి ? జన్మ జన్మల పాపాలు ఏమవుతాయి ? వాటి నుంచి విడుదల కావడం ఎలా ?" అని అడిగితే కనుక, అష్టావక్రుడు చెబుతాడు, " మీరు ఎన్నడూ వాటిని చేయలేదు. ఆకలి వలన శరీరం ఏదైనా చేసి వుండవచ్చు. ప్రాణశక్తి వలన జీవం ఏదైనా చేసి వుండవచ్చు. తన అవసరాల వలన మనస్సు ఏదైనా చేసి వుండవచ్చు. మీరు ఎన్నడూ ఏదీ చేయలేదు. మీరు ఎల్లప్పుడూ విడిగా వున్నారు, కర్మ రాహిత్యంలో. కర్మ ఎన్నడూ మీ ద్వారా సంభవించలేదు ; మీరు అన్ని కర్మలనూ గమనించేవారు. విముక్తి అనేది ఈ క్షణమే సాధ్యమవుతుంది."

దానిని పరిగణించండి : మనం గత కర్మల యొక్క అల్లిక అంతటినీ నాశనం చేయాలంటే కనుక, మనం ఎన్నటికీ విముక్తులం కాలేము. అది అసాధ్యం. అనంతకాలంపాటు, మనం ఎన్నో కర్మలు చేశాం ... ఎన్నో కేవలం అంచనా వేయండి. మనం ఈ కర్మలన్నింటి నుంచీ విడుదల చేయబడాలంటే కనుక అప్పుడు ఆ విడుదల అనేది అనంత కాలాన్ని తీసుకుంటుంది, ఈ అనంతకాలంలో మీరు ఊరికే ఖాళీగా కూర్చుని వుండరు, మీరు ఇంకా ఏదో చేస్తూనే వుంటారు, కనుక కర్మలు మళ్ళీ పోగవుతాయి. ఈ చక్రం అంతులేనిది అవుతుంది. ఈ చక్రం ఎన్నటికీ అంతం కాదు, అది ఎన్నటికీ ఏ ముగింపుకూ రాదు.

అష్టావక్రుడు చెప్పేదేమిటంటే స్వతంత్రులు కావడానికి మీరు గత కర్మల యొక్క ముద్రల నుంచి స్వతంత్రులు కావాల్సి వస్తే కనుక, అప్పుడు విముక్తి అనేది ఎన్నటికీ సంభవించదు. కానీ విముక్తి సంభవించింది. మీరు స్వతంత్రులు అవ్వలేరు ... మీరు స్వతంత్రులుగానే **ఉన్నారు.** ఉనికి ఎన్నడూ ఏ కర్మనూ చెయ్యలేదు అనడానికి విముక్తి యొక్క అస్తిత్వమే ఓ నిరూపణ. మీరు పాపాత్ములు కాదు, మీరు మహాత్ములు కాదు ; మీరు నీతివంతులు కాదు, అవినీతిపరులు కాదు. ఎక్కడా ఏ నరకమూ లేదు, స్వర్గమనేదీ లేదు. మీరు ఎన్నడూ ఏమీ చేయలేదు ; మీరు కేవలం కలలనే చూశారు, మీరు కేవలం మీరు చేస్తున్నారని అనుకున్నారు. అంతర్గతంగా మీరు నిద్రావస్థలో ఉన్నారు ... ఈ శరీరం ఛేసింది. ఆ విషయాలను చేసిన ఆ శరీరాలు ఎప్పుడో పోయాయి : వాటి కర్మల యొక్క ఫలం మీది ఎలా అవుతుంది ? మీరు అంతరంగంలో నిద్రావస్థలో ఉన్నారు ... ఆ మనస్సు పని చేసింది. పని చేసిన ఆ మనస్సు అనుక్షణం అంతర్ధానమైపోతుంది.

నేను విన్నది ఏమిటంటే ఓ పూర్వపు మహారాజు తన కచ్చేరి మురికిగా ఉండడం చూశాడు. ఆయన తన సేవకుడైన ఝుంకూను మందలిస్తూ ఇలా అన్నాడు, "కచ్చేరి గది అంతటా సాలెగూళ్ళు ఉన్నాయి. రోజంతా నువ్వు ఏం చేస్తున్నావు ?"

ఝుంకూ అన్నాడు, "మహారాజా, సాలె పురుగేదో ఆ గూళ్ళను తయారు చేసి వుంటుంది ... నేను నా గదిలో కునుకు తీస్తున్నాను."

మీరు అంతరంగంలో కునుకు తీస్తున్నారు, సాలె పురుగేదో ఆ గూళ్ళను తయారు చేసి వుంటుంది ! ఈ శరీరం గూళ్ళను అల్లింది, ఈ మనస్సు గూళ్ళను అల్లింది, ఈ జీవశక్తి గూళ్ళను అల్లింది... మీరు నిద్రపోతున్నారు. మేల్కొనండి ! జాగృతులై, మీరు ఎన్నడూ ఏదీ చేయలేదని మీరు తెలుసుకుంటారు. మీరు ఏదైనా చేయాలని అనుకున్నా కూడా మీరు దానిని చేయలేరు. నిర్వ్యాపారమే మీ స్వభావం. అకర్మే మీ స్వాభావిక స్థితి.

నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు, స్వయం ప్రకాశకుడవు మరి నిష్కపటమైనవాడవు. ఈ ప్రకటనను మీరు విన్నారా ? మీరు నిష్కపటమైనవారు ! పండితులు మరి మతాచార్యులు మీకు బోధించిన దానిని విసిరి పారెయ్యండి ! మీరు నిష్కపటమైనవారు. వారి బోధన ఎంతో హానికరమైనదయ్యింది, వాళ్ళు మిమ్మల్ని ఒక పాపాత్ముడిని చేశారు. మీరు చెడ్డవారు అని వెయ్యి విధానాలలో వాళ్ళు మీకు బోధించారు... వాళ్ళు మిమ్మల్ని అవమానం మరి అపరాధ భావనలతో నింపేశారు. మీరు నిష్కపటమైనవారు, మీరు ఏ తప్పూ చేయలేదు.

నీ బంధనం ఇదే : నువ్వు సమాధిని సాధన చేస్తావు. ఈ విప్లవాత్మక వివరణను చూడండి ! ***నీ బంధనం ఇదే : నువ్వు సమాధిని సాధన చేస్తావు ...*** సమాధి ఫలాన్ని ఇవ్వాలనీ, ధ్యానం పుష్పించాలనీ, విముక్తి సంభవించాలనీ మీరు ప్రయత్నాలు చేస్తున్నారు : సాధనలు, ఆచారాలు, కర్మకాండలు... ***నీ బంధనం ఇదే : నువ్వు సమాధిని సాధన చేస్తావు.*** ఇదే మీ బంధనం. ఎరుక అనే ఖడ్గాన్ని పైకెత్తండి మరి దానిని ఛేదించండి !

ఇప్పుడు ఈ రెండూ మీకు స్పష్టమవుతాయి : యోగ మార్గం మరి ఎరుక యొక్క మార్గం పూర్తిగా విభిన్నమైనవి. ఎరుక యొక్క మార్గానికి సనాతన నామం సాంఖ్య. 'సాంఖ్య' అంటే ఎరుక, 'యోగం' అంటే సాధన, రీతులు. 'సాంఖ్య' అంటే కేవలం మేల్కొనండి, ఏమీ చేయవలసిన అవసరం లేదు అని అర్థం. యోగం అంటే మేల్కొనడం అనేది సంభవించే ముందు చేయవలసినది ఎంతో వుంది అని అర్థం. యోగంలో సాధనాలు ఉన్నాయి ; సాంఖ్యలో కేవలం ఫలాలు మాత్రమే

ఉన్నాయి. ఏ మార్గమూ లేదు, కేవలం గమ్యమే వుంది, ఎందుకంటే మరెక్కడికైనా వెళ్ళడానికి మీరు గమ్యాన్ని ఎన్నడూ వదిలి వెళ్ళలేదు, మీరు కేవలం మీ అంతరంగ ఆలయంలో ఆసీనులై వున్నారు. మీరు వెనుకకు తిరిగి రావలసిన అవసరం లేదు ... కేవలం మీరు ఎన్నడూ ఎక్కడకూ వెళ్ళలేదని తెలుసుకోండి.

నువ్వు ఏకాకివి, కర్మ శూన్యుడవు, స్వయం - ప్రకాశకుడవు

మరి నిష్కపటమైనవాడవు. నీ బంధనం ఇదే:

నువ్వు సమాధిని సాధన చేస్తావు.

మీరు కేవలం దీనివలనే బంధితులై వున్నారు, మీరు విముక్తిని వెతుకుతున్నారు అనేదాని వలన. విముక్తి కోసం చేస్తున్న ఈ అన్వేషణే ఒక క్రొత్త బంధనాన్ని సృష్టిస్తుంది.

ఒక మానవుడు ప్రపంచం చేత బానిసగా చేయబడతాడు. అనంతరం అతను బెదిరిపోతాడు మరి విముక్తి కోసం వెతకడం మొదలుపెడతాడు. ఇక్కడ అతను ఇల్లూ వాకిలిని త్యజిస్తాడు, తన కుటుంబాన్ని త్యజిస్తాడు, వ్యాపారాన్నీ మరి సంపదనూ త్యజిస్తాడు ; అప్పుడు అతను ఒక క్రొత్త బంధనంలో బానిసగా చేయబడతాడు ... అతను ఓ సన్యాసి అవుతాడు. క్రొత్త నిర్బంధాలు : ఎలా నడవాలి మరి కూర్చోవాలి, ఎలా తినాలి మరి తాగాలి ... అతను ఒక నూతన దాస్యాన్ని సృష్టించుకుంటాడు.

ఒక సన్యాసి యొక్క స్థితి ఒక ఖైదీ స్థితిలా ఉండడం మీరు గమనించారా. ఒక సన్యాసి స్వతంత్రుడు కాదు, ఎందుకంటే స్వతంత్రుడిగా అవ్వడానికి మొదట తాను నియమాలను అంగీకరించాలని సన్యాసి అనుకుంటాడు. ఇది ఒక హాస్యాస్పదమైన భావన ! విముక్తి కోసం, మొదట నిర్బంధాలను అంగీకరించాలి ! స్వతంత్రులు కావడానికి ఏ నిర్బంధాలూ అవసరం లేదు.

కృష్ణమూర్తి వద్ద ఒక పుస్తకం వుంది, ‘ ప్రథమ మరి అంతిమ స్వతంత్ర్యం ’ (the first and last freedom) అది అష్టావక్రుడి యొక్క అత్యంత నవీన వ్యక్తీకరణ. మీరు స్వతంత్రులుగా ఉండాలంటే కనుక అప్పుడు మొట్ట మొదటి అడుగులోనే స్వతంత్రులు అవ్వండి. అంతంలో మీరు స్వతంత్రులవుతారని అనుకోకండి. మొట్ట మొదటి అడుగులో మాత్రమే మీరు స్వతంత్రులు అవ్వగలరు, రెండవ అడుగులో కాదు. మొదటి అడుగులో మీరు స్వతంత్రం కోసం సన్నాహాలు చేసుకుంటే కనుక, ఈ సన్నాహాలే బంధనాలను సృష్టిస్తాయి. అప్పుడు ఈ క్రొత్త బంధనాలను వదిలించుకోవడం కోసం మీరు క్రొత్త సన్నహాలను చేసుకోవలసి వస్తుంది. ఈ సన్నాహాలు మళ్ళీ క్రొత్త బంధనాలను తయారు చేస్తాయి. మీరు ఒక దానిని

వదిలించుకుంటారు, మరొక దాని చేత బంధించబడుతారు. మీరు చిన్న నీటి గుంట నుంచి తప్పించుకుంటారు మరి బావిలో పడిపోతారు.

ప్రాపంచికమైనవారూ, సన్యాసులూ ఇరువురూ ఏ విధంగా బంధితులై వున్నారో చూడండి. వాళ్ళ దాస్యాలు భిన్నమైనవి, కానీ ఆ వ్యత్యాసం అసలేమీ కాదు, మౌలికమైన మూర్ఖత్వం విచ్ఛిన్నమైతే తప్ప మీరు చేసినది ఏదైనా మిమ్మల్ని బానిసలుగానే చేసేటట్లుగా కనిపిస్తుంది.

నేను విన్నది ఏమిటంటే ఎవరి మగువో పారిపోయింది, కనుక ఆమెను వెతికేందుకు అతను వెళ్ళాడు. అంతటా అన్వేషిస్తూ అతను ఒక అడవికి చేరుకున్నాడు మరి అక్కడ ఒక చెట్టు కింద ఓ సాధువు కూర్చుని వున్నాడు. ఆ మనిషి అడిగాడు, " నా స్త్రీ ఇటువైపు వెళ్ళడం మీరు చూశారా ? ఆమె ఇంటి నుంచి పారిపోయింది. నేను తీవ్రంగా కలత చెంది వున్నాను."

ఆ సాధువు అడిగాడు, " ఆమె పేరు ఏమిటి ?"

అతను చెప్పాడు, " ఆమె పేరే ఆపద."

ఆ సాధువు అన్నాడు, " ఆపదా ! నువ్వు ఆమెకు గొప్ప పేరే పెట్టావు. మగువలందరూ ఆపదలే, కానీ కేవలం నువ్వే నిజంగా ఆ పేరు పెట్టావు. కనుక నీ పేరు ఏమిటి ?" ఆ సాధువు తెలుసుకోవడానికి ఉత్సుకతతో ఉన్నాడు ... ఈ మనిషి పేర్ల విషయంలో అత్యంత తెలివైనవాడిలా కనిపిస్తున్నాడు.

అతను అన్నాడు, " నా పేరు అవివేకి."

ఆ సాధువు నవ్వడం మొదలుపెట్టాడు. అతను అన్నాడు, " ఈ అన్వేషణ వదిలెయ్యి. నువ్వు ఎక్కడ కూర్చున్నా ' ఆపద ' వస్తుంది. నువ్వు ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదు. నువ్వు 'అవివేకి' అయివుండడమే చాలు. ఆపదే నిన్ను కనుగొంటుంది."

ఎవ్వరైనా ఈ ప్రపంచాన్ని త్యజించి మరి పారిపోయినప్పుడు, ఈ పరిత్యాగం అతని మనోదౌర్బాల్యాన్నీ, అతని అవివేకాన్నీ, అతని మూర్ఖత్వాన్నీ నాశనం చెయ్యదు. అతను ఈ మూర్ఖత్వాన్ని స్వీకరిస్తాడు మరి క్రొత్త బంధనాలను ఏర్పరచుకుంటూ ఆలయంలో కూర్చుంటాడు. ఆ మూర్ఖత్వం క్రొత్త గూళ్ళను అల్లుతుంది. మొదట ప్రపంచం చేత బానిసగా చేయబడ్డాడు, ఇప్పుడు సన్యాసం చేత బానిసగా చేయబడ్డాడు, బంధనం లేకుండా అతను ఉండలేడు.

స్వతంత్ర్యం మొదటి అడుగులోనే వుంది. దానికి ప్రణాళిక వేయడం వుండదు. ప్రణాళిక వేయడం అంటే ప్రణాళికలలో బంధితులవ్వడమే. సన్నాహాలు చేసుకోండి, మరి సన్నాహాలలో మీరు బానిసగా చేయబడతారు. అప్పుడు దీనిని త్యజించాల్సి వస్తుంది. ఇది ఎన్నాళ్ళు కొనసాగబోతోంది ? దానికి అంతం అనేది ఉండదు.

నేను విన్నాను : ఒక మనిషికి శ్మశానంలో ప్రవేశించడమంటే భయం. అతని ఇల్లు శ్మశానానికి ఆవలివైపు వుంది, కనుక అతను ప్రతిరోజూ దానిని దాటాలి. అతనికి ఎంత భయమంటే రాత్రివేళ అతను తన ఇంటి బయటకు రాడు ; చీకటి పడబోతుండగానే అతను ఇంటికి తిరిగి వస్తాడు, వణికిపోతూ.

చివరకు ఒక సాధువు అతనిపై జాలిపడ్డాడు. అతను ఆ మనిషికి చెప్పాడు, " దాని గురించి దిగులు పడడం మానెయ్యి. మరి ఈ మంత్రించిన తాయెత్తును తీసుకో. ఈ తాయెత్తును ఎల్లప్పుడూ నీ చేతి మణికట్టుకు కట్టి ఉంచుకో ; అప్పుడు ఏ దెయ్యం లేదా ప్రేతాత్మ నిన్ను కలతపెట్టలేదు."

అది పనిచేసింది. తన చేతి మణికట్టుకు ఆ తాయెత్తు కట్టుకోవడం ద్వారా దెయ్యాల గురించిన భయం పోయింది. కానీ ఇప్పుడు ఒక క్రొత్త భయం అతనిని చేజిక్కించుకుంది : ఆ తాయెత్తు పోతే ఎలా ? సహజంగానే, ఆ తాయెత్తు అతనిని దెయ్యాల బారినుంచి రక్షించింది... ఇప్పుడు అతను అర్ధరాత్రి ఏ భయమూ లేకుండా శ్మశానాన్ని దాటగలడు. అక్కడ ఎన్నడూ దెయ్యాలు లేవు ... అది కేవలం అతని స్వంత భయమే. తాయెత్తు అతనిని ఆ భయం నుంచి విడుదల చేసింది, కానీ అతను మరొక క్రొత్త భయంలో చిక్కుకున్నాడు, తాయెత్తును పోగొట్టుకోవడమనే భయం, అతను దానిని కలిగే వున్నాడనేది చూడడానికి మళ్ళీ మళ్ళీ తనిఖీ చేస్తూ, స్నానానికి వెళ్ళినప్పుడూ ఆ తాయెత్తును అతను తన వెంట తీసుకువెళ్ళాడు. రాత్రివేళ తాను నిదురిస్తున్నప్పుడు ఎవరైనా ఆ తాయెత్తును విప్పుతారనీ, ఎవరైనా దానిని దొంగిలిస్తారని ఇప్పుడు అతను భయపడుతున్నాడు. ఆ తాయెత్తే అతని జీవితమైపోయింది.

ఆ భయం అలానే కొనసాగింది ... దెయ్యాల గురించినది కాకపోతే కనుక అప్పుడు తాయెత్తును పోగొట్టుకోవడాన్ని గురించినది. ఇప్పుడు ఎవరైనా ఆ తాయెత్తుకు బదులుగా మరేదైనా ఇస్తే కనుక, దాని వలన వ్యత్యాసం ఏముంటుంది ? ఈ మనిషి భయంతో కూడిన స్వభావాన్ని మార్చుకోబోవడం లేదు.

అది దెయ్యాలకు సంబంధించిన ప్రశ్న కాదు, అది భయానికి సంబంధించిన ప్రశ్న. కనుక మీరు భయాన్ని నలుదిక్కులా ఒక చోటు నుంచి మరొక చోటుకు

తోస్తూండవచ్చు. ఎంతోమంది ఈ రకమైన వాలీబాల్ ఆడుతూంటారు. ఆ బంతిని ఇక్కడి నుంచి అక్కడకు, అక్కడ నుంచి ఇక్కడకు విసురుతూ, వాళ్ళు కేవలం విసురుతూ మరి ఆడుతూపోతారు. మరి ఈలోగా జీవితం సమస్తమూ మిమ్మల్ని దాటిపోతుంది.

అష్టావక్రుడు అంటాడు, సమాధి కోసం సాధన చేయడమే బంధనానికి కారణం. మీరు స్వతంత్రులుగా ఉండాలంటే కనుక, అప్పుడు మీ స్వతంత్ర్యాన్ని ప్రకటించండి, సన్నద్ధమవుతూనే వుండకండి. కనుక నేను అంటాను, ఈ విప్లవాత్మక వివరణ వైపు చూడండి. ఈ వివరణ అరుదైనది, ఇది అసమానమైనది.

మీ స్వతంత్ర్యాన్ని ఇక్కడే, ఇప్పుడే ప్రకంటించండి అని అష్టావక్రుడు చెబుతాడు. దాని కోసం సిద్ధం కాకండి. మొదట మీరు సిద్ధం కావాలి, మరి అప్పుడు... అని అనకండి, ఎందుకంటే ఈ సన్నాహాలు మిమ్మల్ని బానిసలుగా చేస్తాయి. అయితే ఈ సన్నాహాలను వదిలెయ్యడం ఎలా? ఒక వ్యాధి వదిలేయబడింది, మరొక వ్యాధి స్వీకరించబడింది. ఇది కేవలం భుజాలు మార్చుకోవడమే.

ప్రజలు దహన వాటికలకు పాడెపై ఒక శరీరాన్ని మోసుకెళ్ళడం మీరు చూశారు: వాళ్ళు భుజాలు మార్చుకుంటూ పోతారు. ఒక భుజంపై బరువును మోయడం వలన అలసిపోయి, వాళ్ళు మరొక భుజానికి మార్చుకుంటారు. వాళ్ళు కొద్ది నిమిషాల ఉపశమనాన్ని పొందుతారు ; తరువాత మరొక భుజం నొప్పి కలగడం ప్రారంభిస్తుంది, మరి మళ్ళీ వాళ్ళు మార్చుకుంటారు. మీరు జన్మ జన్మలుగా ఇదే చేస్తున్నారు. మీరు దీని నుంచి కేవలం స్వల్ప ఉపశమనాన్ని మాత్రమే పొందుతారు, మీరు దీని నుంచి అత్యున్నత విశ్రాంతిని ఎన్నడూ పొందలేరు.

ఈ శవాలను మొయ్యడమనే దానిని వదిలెయ్యండి. మీ ప్రకటన చెయ్యండి ! మీకు స్వతంత్ర్యం కావాలంటే కనుక, అప్పుడు ఒక్క క్షణంలో, రెప్పపాటు కాలంలో, దానిని ప్రకటించవచ్చు.

నేను ప్రతీ ఒక్కరికీ సన్యాసం ఎందుకు ఇస్తానని ప్రజలు నన్ను అడుగుతారు. ప్రతి ఒక్కరికీ ఆ అర్హత వుంది అని నేను చెబుతాను ... అది కేవలం దానిని ప్రకటించడానికి సంబంధించిన ప్రశ్న. మరేదీ అవసరం లేదు, అది కేవలం ప్రకటించబడాలి, ఈ ప్రకటనకు మీ హృదయంలో పట్టాభిషేకం చెయ్యాలి, “ నేను ఒక సన్యాసిని” అని, మరి మీరు ఒక సన్యాసి అయిపోయారు, “ నేను జ్ఞానోదయం పొందాను అని, మరి మీరు జ్ఞానోదయం పొందారు. మీ ప్రకటనే మీ జీవితం.

ప్రకటించేందుకు ధైర్యాన్ని కూడదీసుకోండి. చిన్న ప్రకటనలు చేయడమెందుకు? "**అహం బ్రహ్మాస్మి - నేనే బ్రహ్మాన్ని!**" అని ప్రకటించండి మరి మీరు అత్యున్నమైనదే అయిపోయారు.

తదుపరి సూత్రంలో అష్టావక్రుడు అంటాడు :

నువ్వు ఈ విశ్వం అంతటా వ్యాపించి ఉన్నావు,
నువ్వు దానిలో అంతర్గతంగా ఉన్న సూత్రానివి.
స్వాభావికంగా నువ్వు నిర్మల చైతన్యానివి,
సంకుచిత మనస్కుడవు కావద్దు.

అల్పమైన విషయాలతో కూడి ఉండడమెందుకు ? కొన్నిసార్లు మీరు, "ఈ ఇల్లు నాది, ఈ శరీరం నాది, ఈ డబ్బు నాది, ఈ వ్యాపారం నాది..." అనే వాటితో కూడి వుంటారు. మనస్సు ఎటువంటి అల్ప విషయాలతో కూడివుంటుంది !

నువ్వు ఈ విశ్వం అంతటా వ్యాపించి ఉన్నావు, నువ్వు
దానిలో అంతర్గతంగా ఉన్న సూత్రానివి.

ఈ సమస్త అస్తిత్వమూ మీ ద్వారా ప్రభావితమయ్యింది. బ్రహ్మం యొక్క విస్తీర్ణమంతా మీ ద్వారా వ్యాప్తి చెందింది, ... **స్వాభావికంగా నువ్వు నిర్మల చైతన్యానివి, సంకుచిత మనస్కుడవు కావద్దు.**

అల్పమైన వాటిని హక్కుగా కోరడమెందుకు ? ఒక మహోన్నత ప్రకటనే చెయ్యండి. దీనిని ప్రకటించండి : "నేను శుద్ధ చైతన్యాన్ని, నేను నిర్మలమైన వివేకాన్ని!" ... **సంకుచిత మనస్కుడవు కావద్దు.**

మనం అటువంటి అల్పమైనవాటినే హక్కుగా కోరాము, మరి మనం ఏది ప్రకటించామో మనం అదే అవుతాము. ఈ విషయంలో, ప్రపంచానికి భారతదేశం యొక్క తోడ్పాటు అద్వితీయమైనది ఎందుకంటే భారతదేశం ప్రపంచపు మహోత్కృష్ట ప్రకటనలను చేసింది. మహమ్మదీయ ప్రపంచంలో మన్సూర్ ప్రకటించాడు, "అనల్ హక్ !... నేనే సత్యాన్ని." వాళ్ళు అతనిని హతమార్చారు. వాళ్ళు అన్నారు, "ఈ మనిషి మరీ గొప్పదైన ప్రకటన చేస్తున్నాడు. 'నేనే సత్యాన్ని' ... కేవలం భగవంతుడే దానిని చెప్పగలడు. ఒక మానవుడు దానిని ఎలా చెప్పగలడు ?" కానీ మనం అష్టావక్రుడిని హతమార్చలేదు, "అహం బ్రహ్మాస్మి–నేనే బ్రహ్మాన్ని", అని చెప్పిన ఉపనిషత్తుల ద్రష్టలనూ మనం హతమార్చలేదు, ఎందుకంటే మనం ఒక విషయాన్ని అవగాహన చేసుకున్నాం, మానవుడు తాను ప్రకటించినదే అవుతాడు.

ఒక అల్పమైన ప్రకటన చేయడమెందుకు ? మీ జీవితం యొక్క వికాసం మీ ప్రకటన పైనే ఆధారపడి వున్నప్పుడు, అలాంటప్పుడు అత్యంత విశాలతను ప్రకటించండి, అనంతాన్ని ప్రకటించండి, సర్వ వ్యాపకతను ప్రకటించండి. దివ్య ప్రకటనను చెయ్యండి. అంతకన్నా తక్కువ దానితో సంతృప్తి పడిపోవడం ఎందుకు ? లోభులుగా ఉండడం ఎందుకు ; మీ ప్రకటనలోనే మీరు పిసినారులుగా వుంటున్నారు. అలాంటప్పుడు మీ లుబ్ధత్వపు ప్రకటననే చెయ్యండి మరి మీరు అదే అవుతారు.

అల్పమైనదానికి అవును అని చెప్పండి, మీరు అల్పులే అవుతారు. అనంతమైనదానికి అవును అని చెప్పండి మరి మీరు అనంతమైనవారే అవుతారు. మీ నమ్మకమే మీ జీవితం.

నువ్వు అపేక్షలు లేనివాడవు, నిర్వికారుడవు,

స్వయం-సంపూర్ణుడవు, ప్రశాంతతకూ, అపరిమిత వివేకానికీ

నిలయానివి, మరి ఆందోళనారహితుడవు.

కనుక కేవలం చైతన్యం పట్ల మాత్రమే విశ్వాసాన్ని ఉంచు.

ఈ ఒక్క నిశ్చయం చాలు. సాధన కాదు ... విశ్వాసం, నిశ్చయం. సాధన కాదు ... నమ్మకం, ఈ మాత్రం విశ్వాసం చాలు ... మీరు శుద్ధచైతన్యం అని. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ అద్భుతం.

మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే నువ్వు బుద్ధి హీనుడివి అని మీరు ఎవరికైనా మళ్ళీ మళ్ళీ చెప్పినప్పుడు, అతను బుద్ధిహీనుడే అవుతాడు. ప్రజలు వారు కనిపిస్తున్నంత మూర్ఖులు కాదు. వాళ్ళు అత్యున్నత జీవులు. వాళ్ళు మూర్ఖులుగా పిలువబడ్డారు, వాళ్ళు మూర్ఖులు అని చెప్పబడ్డారు. ఎంతోమంది చేత అది పునరుక్తం చేయబడింది మరి వాళ్ళు దానిని ఎన్నిసార్లు విన్నారంటే వాళ్ళు మూర్ఖులే అయ్యారు. వాళ్ళు బుద్ధుళ్ళు కాగలిగేవారు, కానీ వాళ్ళు బుద్ధిహీనులు అయ్యారు.

మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే చక్కని ఆరోగ్యంతో ఉన్నవారు ఎవరినైనా మీరు వీధిలో కలుసుకుని మరి అతనితో, " ఓహ్ ! నీకు ఏం జరిగింది ? నీ ముఖం పసుపుపచ్చగా కనిపిస్తోంది. నీకు జ్వరం వచ్చినట్లు కనిపిస్తోంది. నీ నాడిని చూడనివ్వు... నువ్వు అస్వస్థుడివై ఉన్నావు ! నీ కాళ్ళు వణుకుతున్నట్లుగా కనిపిస్తోంది," అని మీరు అంటే కనుక, మొదట అతను దానిని నిరాకరిస్తాడు, ఎందుకంటే ఒక్క క్షణం ముందువరకూ అతను అనుకోలేదు... అతను అంటాడు, " లేదు, లేదు ! నేను పూర్తి స్వస్థతతో ఉన్నాను. నువ్వు దేని గురించి మాట్లాడుతున్నావు?"

మీరు అనవచ్చు, " సరే, నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి," అనంతరం కొద్దిసేపటి తరువాత మరొక వ్యక్తి అతని వద్దకు వచ్చి అంటాడు, " ఆగు ! నీ ముఖం పూర్తిగా పాలిపోయినట్లు వుంది. ఏమి జరిగింది ?" తాను పూర్తి ఆరోగ్యంగానే ఉన్నానని ఇప్పుడు అతను అంత ధైర్యంగా చెప్పలేడు. అతను అంటాడు, " అవును, నేను కొంత అస్వస్థుడినై వున్నాను." అతను దానిని అంగీకరించడం ప్రారంభిస్తాడు. అతని ధైర్యం జారిపోవడం మొదలవుతుంది.

తరువాత మూడవ మనిషి వస్తాడు మరి అదే విషయం చెప్పడం మొదలు పెడతాడు. ఇప్పుడు అతను ఈ విధంగా భావిస్తూ ఇంటికి తిరిగివస్తాడు, " నా పరిస్థితి అస్సలు బాలేదు. ఇప్పుడు విపణీవీధికి వెళ్ళడంలో ఏ అర్థమూ లేదు."

మీరు ఇటువంటి కథను వినే ఉంటారు : ఒకసారి ఒక బ్రాహ్మణుడు ఒక మేకను కొన్నాడు మరి దానిని ఇంటికి తీసుకువెళుతున్నాడు. ముగ్గురు లేదా నలుగురు దొంగలు అతనిని చూశారు మరి ఆ మేకను అతని నుంచి లాగేసుకోవచ్చని అనుకున్నారు. కానీ ఆ బ్రాహ్మణుడు బలిష్ఠంగా ఉన్నాడు మరి అతని నుంచి దొంగిలించడం అనేది అంత సులభమైన విషయమేమీ కాదు, కనుక వాళ్ళు యుక్తినీ, కొంచెం మోసాన్నీ ప్రయత్నించాలని అనుకున్నారు.

ఒకడు బాటపై అతని వద్దకు వచ్చి అన్నాడు, " బాగు బాగు ! ఈ కుక్క కోసం ఎంత వెలను చెల్లించావు ?"

ఆ మనిషి, ఆ బ్రాహ్మణుడు అన్నాడు, " కుక్కా ! నువ్వు అంధుడివా ? లేదా కేవలం పిచ్చివాడివా ? ఇది ఒక మేక ! నేను దానిని విపణివీధి నుంచి తీసుకువస్తున్నాను. నేను దానికోసం యాభై రూపాయలు చెల్లించాను."

ఆ దొంగ అన్నాడు, " అది నీ ఇష్టం, కానీ నీకు తెలుసా... ఒక బ్రాహ్మణుడు తన భుజాలపై ఓ కుక్కను మోసుకెళ్ళడాన్ని చూసి.... ప్రియ సోదరా, నాకు అది ఓ కుక్కలాగా కనిపిస్తోంది. ఏదైనా దోషం ఉండుండవచ్చా ?"

అతడు ఏ రకమైన మనిషి అని ఆశ్చర్యపోతూ, ఆ బ్రాహ్మణుడు తన దారిన వెళుతున్నాడు. కానీ " ఇది ఒక మేక," అని తనకు తాను చెప్పుకుంటూ, అతను కేవలం పరీక్షించడానికి ఆ మేక కాళ్ళను తాకాడు. దారి ప్రక్కన ఆ గుంపులోని మరొకడు వేచి ఉన్నాడు. అతను బ్రాహ్మణుడిని పిలిచి చెప్పాడు, " నువ్వు ఎంత చక్కని కుక్కను కొన్నావు !"

ఇప్పుడు అది ఓ కుక్క కాదు అని గట్టిగా చెప్పగల ధైర్యం ఆ బ్రాహ్మణుడికి లేదు : ఎవరికి తెలుసు, అది ఓ కుక్కే కావచ్చు ... ఇద్దరు మనుషులు తప్పు కాలేరు. అయినా అతను అన్నాడు, " లేదు, లేదు, ఇది ఓ కుక్క కాదు." కానీ అది ఇప్పుడు బలహీనంగా వుంది. అతను అది చెప్పాడు, కానీ అంతరంగంలోని పునాదులు కంపించాయి. అతను అన్నాడు, " లేదు, లేదు, ఇది ఒక మేక."

ఆ మనిషి అన్నాడు, " ఇది ఒక మేకా? నువ్వు దీనిని మేక అని పిలుస్తావాం? అయితే, గౌరవనీయ బ్రాహ్మణోత్తమా, మేక యొక్క నిర్వచనాన్ని మార్చాల్సి వస్తుంది. నువ్వు దీనిని మేక అని పిలిస్తే కనుక, అప్పుడు ఓ కుక్కను నువ్వు ఏమని పిలుస్తావ,? కానీ అది నీ ఇష్టం. నువ్వు ఒక పండితుడవు ; నువ్వు కావాలనుకుంటే కనుక నువ్వు దానిని మార్చగలవు. అది కేవలం ఒక పేరు మాత్రమే. బహుశా నువ్వు కుక్క అనవచ్చు, బహుశా నువ్వు మేక అనవచ్చు ... ఒక కుక్కగానే అది ఉంటుంది. కేవలం దానిని ఒక మేక అని పిలువడం వలన ఏదీ మారదు."

ఆ మనిషి వెళ్ళిపోయాడు. ఆ బ్రాహ్మణుడు మేకను క్రిందకు దించి చూశాడు : అది నిశ్చయంగానే ఒక మేక ... ఇతర మేకలు అన్నింటిలాంటి మేక. అతను తన కళ్ళు నలుముకున్నాడు మరి దారి ప్రక్కనున్న కుళాయి నీటిని కళ్ళపై చిలకరించుకున్నాడు. అతను తన స్వంత ప్రాంతాన్ని సమీపిస్తున్నాడు- : ఒక బ్రాహ్మణుడు ఓ కుక్కను తన భుజాలపై మోస్తూండడాన్ని ప్రజలు చూసినట్లయితే అది ఆలయంలో పూజకూ మరి పాండిత్యానికీ వ్యతిరేకంగా ఒక దెబ్బ అవుతుంది. అతని పూజకు ప్రజలు మూల్యాన్ని చెల్లించేవారు ... వాళ్ళు చెల్లించడం ఆపేస్తారు, అతను పిచ్చివాడు అని వాళ్ళు అనుకుంటారు ... అది ఒక మేక అని నిర్ధారించుకుంటూ, అతని ఆ జంతువును నిశితంగా పరిశీలించాడు. కానీ ఆ ఇద్దరు పురుషులకూ ఏమయ్యింది ?

మళ్ళీ అతను మేకను భుజాలకెత్తుకుని బయలుదేరాడు, కానీ ఇప్పుడు అతను కొంత ఆందోళనంగా నడుస్తున్నాడు. మరెవరైనా తనను చూస్తే ఎలా ? అప్పుడు అతను మూడవవాడిని ఎదర్కొన్నాడు. అతను ఆశ్చర్యంగా అన్నాడు, " ఎంత చక్కని కుక్క ! నువ్వు దీనిని ఎక్కడి నుంచి తెచ్చావు? నేను కూడా ఎంతో కాలంగా ఓ కుక్కను కలిగి వుండాలని అనుకుంటున్నాను."

ఆ బ్రాహ్మణుడు అన్నాడు, " మిత్రమా, నువ్వు దీనిని తీసేసుకో ! నీకు ఒక కుక్క కావాలంటే కనుక, దీనిని తీసుకో. ఇది నిజంగానే ఒక కుక్క ఒక మిత్రుడు దీనిని నాకు ఇచ్చాడు, నువ్వు దయచేసి దీని నుంచి నన్ను విడుదల చెయ్యి." మరి

తాను ఒక కుక్కను కొన్నాడు అదేది ఎవ్వరూ కనుగొనక ముందే అతను ఇంటికి పరుగెత్తాడు.

మానవుడు ఈ విధంగానే జీవిస్తాడు. మీరు దేనిని నమ్మారో మీరు అదే అయ్యారు. మరి చుట్టు ప్రక్కలంతా ఎంతో మంది వంచకులు మరి దుర్మార్గులు ఉన్నారు... మీరు అన్ని రకాల విషయాలనూ నమ్మేలా చేయబడ్డారు. వాళ్ళకు వాళ్ళ స్వంత ఉద్దేశ్యాలు ఉంటాయి. మీరు ఒక పాపి అని మతాచార్యుడు మిమ్మల్ని నమ్మించాలనుకుంటాడు, ఎందుకంటే మీరు పాపాత్ములు కాకపోతే కనుక అతను మీ కోసం ప్రార్థించడం ఎలా కొనసాగిస్తాడు ? అతని స్వలాభం కోసమే ఒక మేక ఓ కుక్కగా అంగీకరించబడుతుంది. ఒక పండితుడు... మీరు అజ్ఞానులు కాకపోతే కనుక అతని పాండిత్యం ఏమైపోతుంది ? అతను తన వ్యాపారాన్ని ఎలా నడుపుతాడు ? ఒక మత బోధకుడు... మీరు నిర్వ్యాపారులనీ, కర్మ నుంచి స్వతంత్రులనీ, మీరు ఎన్నడూ ఏ పాపమూ చేయలేదనీ అతను మీకు వివరిస్తే కనుక ... అప్పుడు అతని అవసరం ఏముంటుంది ?

అది మీరు ఒక వైద్యుడి వద్దకు వెళితే అతను మీకు ఏ అస్వస్థతా లేదని, మీరు ఎన్నడూ అస్వస్థులు కాలేదనీ, మీరు అస్వస్థులు కాలేరనీ, స్వస్థత అనేది మీ స్వభావమనీ వివరించినట్లుగా వుంటుంది ... అప్పుడు ఆ వైద్యుడు ఆత్మహత్యను చేసుకుంటున్నాడు. అతని వ్యాపారం ఏమైపోతుంది ? దృఢమైన ఆరోగ్యంతో ఒక వైద్యుడి వద్దకు వెళ్ళండి, మీకు ఏ అస్వస్థతా లేనప్పుడు వెళ్ళండి ; అప్పుడు కూడా అతను ఏదో సమస్యను కనుగొనడం మీరు చూస్తారు. వెళ్ళండి దానిని ప్రయత్నించండి. పూర్తి బేషుగ్గా ఉన్నప్పుడు, మీకు అస్సలు ఏ అస్వస్థలూ లేనప్పుడు వెళ్ళండి ; కేవలం వెళ్ళండి మరి దానిని చెయ్యండి, మీరు కేవలం అతని చేత ఒకసారి పరీక్షించబడాలని కోరుకుంటున్నట్లు ఆ వైద్యుడికి చెప్పండి. మీరు అస్వస్థులై లేరని చెప్పే ఓ వైద్యుడిని కనుగొనడం అంత సులభం కాదు.

ముల్లా నసీరుద్దీన్ యొక్క కుమారుడు వైద్యుడయ్యాడు. నేను ముల్లాను అడిగాను, " నీ కుమారుడి యొక్క వైద్యం ఎలా నడుస్తోంది ?"

అతను అన్నాడు, " నిజంగానే విషయాలన్నీ అతి చక్కగా జరుగుతున్నాయి."

విషయాలు చక్కగా జరుగుతున్నాయని అతను ఎలా భావిస్తున్నాడని నేను అడిగాను. అతను అన్నాడు, " విషయాలు ఎంత చక్కగా జరుగుతున్నాయంటే వాళ్ళు అస్వస్థులుగా లేరని రోగులకు అతను ఎన్నోసార్లు చెబుతున్నాడు. కేవలం ఒక గొప్ప

వైద్యుడు మాత్రమే, తన వృత్తి బాగా నడుస్తున్న వ్యక్తి మాత్రమే అది చెప్పగలడు, ఎంత బాగా నడుస్తోందంటే ఇప్పుడు అతను పట్టించుకోవాలనుకోవడం లేదు, అతనికి సమయం లేదు." ముల్లా అన్నాడు, " ఈ విధంగానే అది చక్కగా నడుస్తోందని నేను భావించాను. వాళ్ళకు ఏ సమస్యా లేదని అతను ప్రజలకు ఎన్నోసార్లు చెబుతాడు !"

అనేక వ్యాపారులు ఉన్నాయి ... అవి వాటి స్వంత ఆసక్తులను కలిగి వుంటాయి. వేలాది వ్యాపారాలు మీ వీపుపై స్వారీ చేస్తున్నాయి... పండితులు, మతాచార్యులు, మత బోధకులు. మీరు ఒక పాపిగా ఉండడమనేది వారికి అవసరం, మీరు చెడు చేసి వుండడమనేది అవసరం. లేదంటే చెడు కర్మ నుంచి విడుదల అవ్వడం ఎలా అనేది వివరించేవారు ఏమైపోతారు ? మిమ్మల్ని రక్షించడానికి వచ్చే రక్షకులు ఏమైపోతారు ? అష్టావక్రుడు చెప్పినది సరైనదైతే కనుక అప్పుడు రక్షకులు అందరూ వ్యర్థమైనవారే. అప్పుడు మీ విడుదల యొక్క అవసరమే ఉండదు ... మీరు రక్షింపబడ్డారు, మీరు విముక్తులయ్యారు.

అష్టావక్రుడికి అటువంటి వృత్తి ఏదీ లేదు. అష్టావక్రుడు మీతో వ్యాపారం చేయాలని అనుకోవడం లేదు. అతను ముక్కు సూటిగా మాట్లాడుతాడు, అతను స్ఫటికంలా స్వచ్ఛమైన సత్యాలను అందిస్తాడు :

నువ్వు అపేక్షలు లేనివాడవు, నిర్వికారుడవు,

స్వయం - సంపూర్ణుడవు, ప్రశాంతతకూ, అపరిమిత వివేకానికీ

నిలయానివి, ఆందోళనారహితుడవు.

కనుక కేవలం చైతన్యం పట్ల మాత్రమే విశ్వాసాన్ని ఉంచు.

కేవలం ఒకే ఒక్క నిశ్చయం అవసరం : " నేను సాక్షిని." అది చాలు. అటువంటి ఆత్మవిశ్వాసంగల వ్యక్తే ధార్మికుడు. మరే ఇతర నిశ్చయమూ అవసరం లేదు. భగవంతుడి పట్ల నమ్మకం అవసరం లేదు, స్వర్గ నరకాల పట్ల నమ్మకం అవసరం లేదు, కర్మ సిద్ధాంతం పట్ల నమ్మకం అవసరం లేదు. ఒక్క నమ్మకం చాలు, మరి ఆ నమ్మకం ఏమిటంటే మీరు సాక్షి, నిర్వికారులు. మరి ఈ నిశ్చయం మీ అంతరంగంలో దృఢమవ్వగానే, మీరు నిర్వికారులుగా, నిశ్చలమైనవారుగా అవ్వడం మీరు కనుగొంటారు.

ఒక మనోవైజ్ఞానికుడు ఓ ప్రయోగాన్ని చేశాడు. అతను తరగతిని రెండుగా విభజించాడు, సగం మంది పిల్లలు ఇక్కడ, సగం అక్కడ ... వేర్వేరు గదులలో. అతను మొదటి బృందానికి చెప్పాడు, " ఈ లెక్క అత్యంత కఠినమైనది, మీలో ఎవ్వరూ దానిని పరిష్కరించలేరు." అతను బోర్డుపై ఒక సమీకరణాన్ని వ్రాశాడు

మరి అన్నాడు, " ఇది మీ సామర్థ్యపు పరిధిలో లేదు. ఇది ఎంత కష్టతరమైనదంటే ఎగువ తరగతి విద్యార్థులు సైతం దానిని చేయలేకపోయారు. కానీ నేను ఒక ప్రయోగం చేస్తున్నాను ... మీలో ఎవ్వరైనా దానిని పరిష్కరించడానికి దగ్గరగా రాగలరేమో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. ఎవ్వరైనా ఒక పద్ధతిని కనుగొనగలిగితే, లేదా సరైన దిశగా రెండు లేదా మూడు అడుగులు వేస్తే కనుక, కానీ అది అసాధ్యం !" అతను మళ్ళీ మళ్ళీ పునరుక్తం చేశాడు, " అది అసాధ్యం. అయినా గానీ మీరు ప్రయత్నించాలి."

అదే తరగతిలోని మిగిలిన విద్యార్థులతో వున్న మరో గదికి అతను వెళ్ళాడు. అతను బోర్డుపై అదే సమీకరణాన్ని వ్రాశాడు మరి అన్నాడు, " ఈ లెక్క ఎంత సులభమైనదంటే మీలో ఎవ్వరైనా దానిని పరిష్కరించలేకపోవడం అనేది జరగదు. దిగువ తరగతి విద్యార్థులు కూడా దానిని పరిష్కరించారు. కనుక నేను మీకు దీనిని ఏ రకమైన పరీక్షగానూ ఇవ్వడం లేదు, అది ఎంత సులభమైనదంటే మీరు దానిని పరిష్కరించి తీరుతారు. నేను కేవలం దానితో ఏ సమస్యయినా వచ్చే వారెవ్వరైనా తరగతి గదిలో వున్నారా అనేది మాత్రమే తెలుసుకోవాలని అనుకుంటున్నాను."

ఆ ప్రశ్న ఒకటే, ఆ తరగతి ఒకటే, కానీ ఫలితాలలో గొప్ప వ్యత్యాసం వుంది. మొదటి సమూహంలోని పదిహేను మందిలో కేవలం ముగ్గురే దానిని పరిష్కరించగలిగారు. రెండవ సమూహంలోని పదిహేను మందిలో పన్నెండు మంది దానిని పరిష్కరించారు ; కేవలం ముగ్గురే పరిష్కరించలేకపోయారు. అంత పెద్ద వ్యత్యాసం. అదే ప్రశ్న ! ఆ లెక్క సమర్పించబడిన వైఖరి అనేదే నిర్ణయాత్మకమైన అంశం అయ్యింది.

అష్టావక్రుడు మతం కఠినమైనది అని చెప్పడం లేదు, అది అత్యంత సులభమైనదని అతను చెబుతున్నాడు. అది కష్టతరమైనది అని చెప్పేవాళ్ళు, దానిని కష్టతరమైనదిగా చేస్తున్నారు. అది దాదాపు అసాధ్యమైనదనీ, ఒక కత్తి అంచులాంటిది అని చెప్పేవాళ్ళు ... వాళ్ళు మిమ్మల్ని భయపెడుతున్నారు. అది హిమాలయాలను అధిరోహించడం లాంటిదే, కేవలం అరుదైన వారే దానిని అధిరోహించగలరు అని వాళ్ళు చెబుతారు ... అప్పుడు మీరు మీ భావనను వదిలేస్తారు, ఇలా అనుకుంటారు, "నేను అటువంటి అరుదైనవాడిని కాదు. అది నాకు అతీతమైనది. అరుదైన వాళ్ళను అధిరోహించనీ, నేను ఈ సమస్యలో చిక్కుకోబోవడం లేదు. ఈ అరుదైనవారిని నేను శ్లాఘినిస్తున్నాను ... వాళ్ళు ముందుకు సాగవచ్చు ! కానీ నేను ఓ సరళమైన వ్యక్తిని; నన్ను ఈ చిన్న గుంటలోనే వదిలెయ్యండి."

అష్టావక్రుడు అది అత్యంత సులభమని చెబుతాడు. అది ఎంతో సులభం, మీరు ఏమీ చేయాల్సిన అవసరం లేదు, కేవలం అప్రమత్తతతో గమనించడమే చాలు.

ఇదే మానవుడి మేధ యొక్క మహోత్కృష్ట ప్రకటన. మానవ జీవితం యొక్క పరమోత్కృష్ట సంభావ్యత పట్ల మానవుడికి ఎరుక కలిగించడానికే ఇది చేయబడింది. మతం అనేది మానవ మేధ యొక్క అత్యుత్తమ అద్భుతం. దీనికి భిన్నంగా, రాజకీయాలు అనేవి మానవ వివేకం యొక్క అత్యంత నిమ్న వ్యక్తీకరణ ; మతం అనేది అత్యంత శ్రేష్ఠమైనది.

ఒకసారి ఒక రాజకీయవేత్త తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వైద్యుడు సూచించాడు, " రెండు లేదా మూడు నెలల వరకూ బుర్రతో చేసే ఏ పనీ చేయకండి."

రాజకీయవేత్త అడిగాడు, " డాక్టర్, నేను కొద్దిపాటి రాజకీయాలు చేయడం పట్ల మీకు ఏదైనా అభ్యంతరం వుందా ?"

ఆ వైద్యుడు బదులిచ్చాడు, " లేదు, ఏ అభ్యంతరమూ లేదు. మీకు కావాల్సినన్ని రాజకీయాలు చేసుకోండి, కానీ బుర్రకు మాత్రం పనిచెప్పకండి."

రాజకీయాలలో మస్తిష్కం అనేది అస్సలు పనిచేయదు. రాజకీయాలలో హింస ఉంటుంది, వివేకం కాదు. చేజిక్కించుకోవడం, పెనుగులాడడం, పోరాడడం ఉంటాయి, శాంతి కాదు. విశ్రాంతి ఉండదు, కేవలం అవిశ్రాంత స్థితే వుంటుంది. ఘనత కోసం కాంక్ష, అసూయ, కలహం వుంటాయి ... ఆత్మ అనేది ఉండదు.

మతం అంటే కలహశూన్యత, అహింస, పోటీ నుంచి ముక్తి. అది పోరాటం కాదు ; అది అధీనత. ఎవ్వరి నుంచీ ఏదీ తీసుకోవాల్సిన అవసరం లేదు ; ఇప్పటికే కలిగివున్న దాని యొక్క ప్రకటనే అవసరం. మనకు ఇంత ఉన్నప్పుడు, ఇతరుల నుంచి దొంగిలించాల్సిన అవసరం ఏముంది ? తమను తాము తెలుసుకోనివారు మాత్రమే దొంగిలించగలరు. భగవంతుడు లోపల సింహాసనారూఢుడై వుండగా వాళ్ళు తునకలు మరి శకలాల కోసం పోరాడుతున్నారు, అంతరంగంలో అత్యున్నత విస్తారత కొలువై వుండగా తునకలు మరి శకలాల కోసం పడి చస్తున్నారు. మహాసాగరం సమక్షంలోనే వుంది, మరి వాళ్ళు ఒక చిన్న నీటి బిందువు కోసం అర్థిస్తున్నారు !

కేవలం తమను తాము తెలుసకోనివాళ్ళు మాత్రమే రాజకీయాలలో ఉండగలరు.

మరి నేను రాజకీయాలు అని అన్నప్పుడు, కేవలం రాజకీయ పక్షాలలో ఉన్నవారు మాత్రమే అనేది నా ఉద్దేశ్యం కాదు. రాజకీయాలు అన్నప్పుడు, ఏదో

విధంగా పెనుగులాడుతున్నవారు అందరూ అని నా ఉద్దేశ్యం : డబ్బు కోసం పెనుగులాట, డబ్బు రాజకీయాలు ; అధికారం కోసం పెనుగులాట, అధికార రాజకీయాలు ; పరిత్యాగం కోసం పెనుగులాట, పరిత్యాగుల యొక్క రాజకీయాలు.

ఏ ఇతర పరిత్యాగీ ముందుకు పోకూడదని పరిత్యజించినవారి మధ్య మహా శత్రుత్వం వుంటుంది. పరిత్యాగుల మధ్య ఒలంపిక్స్ జరుగుతూంటాయి, మీ కన్నా ఏ మహాత్ముడూ అధిక ప్రాధాన్యత కలవాడు కాకూడదు అని. ఒక మహాత్ముడు మరొకరిని ఓడించడానికి ఎంతో ప్రయత్నం చేస్తాడు. ఎప్పుడైనా భారతదేశం ఒలంపిక్స్‌కు ఆతిథ్యమిస్తే కనుక, మహాత్ముల యొక్క పోటీకి కూడా ఒక కార్యక్రమం ఉండాలి.

కానీ పోటీ అనేది ఎక్కడ వున్నా, అక్కడ రాజకీయాలు ఉంటాయి. రాజకీయాల యొక్క మూల సూత్రం ఏమిటంటే, " నాకు లేనిది, మరెవరికో వుంది ; నేను దానిని చేజిక్కించుకోగలను మరి దానిని నా స్వంతం చేసుకోగలను." కానీ మీరు ఇతరుల నుంచి తీసుకున్నది, అది మీది ఎలా అవుతుంది ? దొంగిలించిన వస్తువులు మీవి ఎలా అవుతాయి ? బలాత్కరంగా చేజిక్కించుకున్నది ఏదైనా తీసేసుకోబడుతుంది. ఈరోజు కాకపోతే, రేపైనా మరెవరో దానిని మీ నుంచి తీసేసుకుంటారు. మరి దానిని మీ నుంచి తీసుకోవడంలో ఎవ్వరూ సఫలీకృతులు కాకపోతే కనుక, మృత్యువు దానిని తప్పక తీసుకుంటుంది. మరెవ్వరి నుంచీ మీరు తీసుకోవాల్సిన అవసరం లేనిదే మీదవుతుంది. అప్పుడు మృత్యువు సైతం దానిని తీసుకోలేదు.

మీరు జన్మించక ముందు మీరు కలిగి వున్నదే, మృత్యువు తరువాత కూడా మీరు కలిగి వుండేదే మీది. దానిని వెతకండి.

మరి దానికోసం అన్వేషించడానికి, మీరు సాధన చేయాల్సిన అవసరం లేదని అష్టావక్రుడు అంటాడు : కేవలం అప్రమత్తంగా ఉండండి, కేవలం సాక్షిగా ఉండండి.

ఎన్నోసార్లు మీరు అనవసరంగా పరుగెత్తుతున్నారు, కానీ ఆగడం ఎలా అని మీరు అనుభూతి చెందుతుంటారు. అది ఒక అర్థరహితమైన పరుగు పందెం అని మీరు భావించలేదని కాదు. మీరు అలా భావించారు, కానీ అగడం ఎలా ? మరి ఆ పరుగు పందెం కోసం ఇవ్వబడిన శిక్షణ అత్యంత లోతైనది. ఎలా ఆగాలో మీరు మరచిపోయారు... మీ కాళ్ళు పరుగెత్తడానికి అలవాటు పడిపోయి వున్నాయి, మనస్సే పరుగెత్తడానికి అలవాటు పడిపోయి వుంది. మీ శిక్షణ ఎలాంటిదంటే మీరు కూర్చోలేరు. కూర్చునేందుకు ఇవ్వబడిన శిక్షణ మరుగైపోయుంది.

ఒక కవి అంటాడు :

ఓ ఫిర్యాదు నా పెదవుల దాకా వచ్చింది

కానీ దానిని ఎవరికి చెప్పాలి, అది అర్థరహితమైనదే అవుతుంది.

బాధను దిగమింగుకుంటూ, నేను ముందుకు సాగుతూనే వున్నాను,

కూర్చునేందుకు నిరాకరిస్తూ, ఓటమి పాలయ్యేందుకు నిరాకరిస్తూ.

మరి ఊరికే కూర్చోవడం అనేది ఓటమి అనే ప్రజలు ఇంకా అనుకుంటున్నారు. వాళ్ళు కూర్చుంటే కనుక, తాము ఓడిపోయామని వాళ్ళు అనుకుంటారు. వాళ్ళు కూర్చుంటే కనుక, అది పలాయనవాదమనీ, పారిపోవడమనీ వాళ్ళు అనుకుంటారు. వాళ్ళు కేవలం కూర్చుని వుంటే కనుక, సాగిపోతున్న వేలాదిమంది నిందాపూర్వకంగా చూస్తారు... కనుక ప్రజలు సాగిపోతూనే వుంటారు.

అంతా నిరుపయోగమైనదే అనే ఫిర్యాదులు తరచుగా మదిలోకి వస్తుంటాయి... కానీ ఎవరికి చెప్పాలి ? ఎవరు అర్థం చేసుకుంటారు ? ఇక్కడ ప్రతి ఒక్కరూ మీలానే ఉన్నారు. ఎవ్వరూ ఎవ్వరికీ చెప్పరు. ప్రతివారూ తమ స్వంత గాయాన్ని మరుగుపరచుకుని, ప్రజలు ముందుకు సాగిపోతూనే వుంటారు.

ఓ ఫిర్యాదు నా పెదవుల దాకా వచ్చింది

కానీ దానిని ఎవరికి చెప్పాలి, అది అర్థరహితమైనదే అవుతుంది.

మీరు ఒక అష్టావక్రుడిని లేదా ఓ బుద్ధుడిని కలుసుకుంటే కనుక దానిని చెప్పడం అర్థవంతమైనదే అవుతుంది. ఇక్కడ, మీరు ఎవరికి చెప్పగలరు ?

బాధను దిగమింగుకుంటూ, నేను ముందుకు సాగుతూనే వున్నాను...

ప్రజలు బాధను దిగమింగుతారు మరి ముందుకు సాగిపోతారు.

... కూర్చునేందుకు నిరాకరిస్తూ, ఓటమిపాలయ్యేందుకు నిరాకరిస్తూ.

మరి అహం యొక్క భావన ఇదే అవుతుంది : " ఓడిపోయి కూర్చోవడమంటే అర్థం... అంతమైపోవడం, క్రిందకు పోవడం, మరణించడం. ముందుకు సాగిపోతూనే ఉండు, ఏదో ఒకటి చేస్తూనే ఉండు. ఏదో ఒకటి సాధించడానికి ప్రయత్నిస్తూనే ఉండు. లేదంటే నువ్వు ఓటమి పాలవుతావు."

మరి కేవలం ఊరికే కూర్చునేవారు, సాధిస్తారు. ఆగిపోయినవాళ్ళు సాధిస్తారు. దివ్యత్వం అనేది పరుగెత్తడం ద్వారా సిద్ధించదు, అది ఆగిపోవడం ద్వారా సిద్ధిస్తుంది.

అష్టావక్రుడు చెబుతాడు, అత్యున్నత సౌలభ్యంలో సిద్ధించుకోండి.

కొన్నిసార్లు కేవలం కూర్చోండి. ఏమీ చెయ్యకుండా కేవలం కూర్చుని ఉండడానికి కొంత సమయాన్ని కనుగొనండి. జెన్ సన్యాసులు ఒక ధ్యాన రీతిని కలిగి వున్నారు. జాజెన్. జానెన్ అంటే ఒక్క పని కూడా చెయ్యకుండా, కేవలం కూర్చోవడం. అది ఒక అత్యంత లోతైన ధ్యాన విధానం. దానిని ఒక విధానం అని పిలువడం సరైనది కాదు ఎందుకంటే విధానం అనేది లేదు ; ఏమీ చేయకుండా, కేవలం కూర్చోవడం. అష్టావక్రుడు చెబుతున్నదానినే జెన్ చెబుతుంది : కూర్చోండి! కొంతసేపు కూర్చోండి మరి విశ్రమించండి. ఈ సంక్షోభాన్ని కొద్దిసేపు వదిలెయ్యండి. కాంక్ష అంతటినీ కొంతసేపు వదిలెయ్యండి. నలుదిక్కులకూ మనస్సు పెట్టే పరుగును వదిలెయ్యండి, దాని పరుగు పందేన్ని వదిలెయ్యండి. కొద్దిసేపు కేవలం కూర్చోండి, మరి మీలోకి మీరు మునిగిపోండి.

ఒక కాంతి మీ అంతరంగంలో క్రమక్రమంగా వ్యాపించడం ప్రారంభిస్తుంది. బహుశా మొదట మీరు దానిని చూడకపోవచ్చు. అది ప్రకాశవంతమైన మధ్యాహ్నపు ఎండలో ఇంటికి తిరిగి రావడం లాంటిది, మొదట ఆ ఇంటిలోపల చీకటిగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ కళ్ళు ఎండకు అలవాటు పడ్డాయి. కొద్దిసేపు కూర్చోండి, మరి కళ్ళు కుదురుకుంటాయి, ఆ గది ప్రకాశవంతమవుతుంది. నెమ్మది, నెమ్మదిగా గదిలోకి కాంతి వస్తుంది. అంతరంగంలోనూ ఆ విధంగానే ఉంటుంది. మీరు బయటకు వెళుతూ వున్నారు, ఎన్నో జన్మలుగా బయటకు వెళుతున్నారు, కనుక అంతరంగంలో అంధకారం ఉన్నట్లుగా కనిపిస్తుంది. మొదటిసారి మీరు లోనికి వెళ్ళినప్పుడు ఏమీ కనిపించదు... చీకటి తప్ప ఏమీ కనిపించదు. భయపడిపోకండి. కూర్చోండి. లోపల ఉన్నదానికి కళ్ళను అలవాటు పడనివ్వండి. ఆ కళ్ళ యొక్క కనుపాపలు ప్రకాశవంతమైన ఎండకు అలవాటుపడి వున్నాయి.

మీరు ఎప్పుడైనా ఆలోచించారా : ఎండలో కంటి యొక్క కనుపాప చిన్నదిగా అవుతుంది. ఎండలో నుంచి రాగానే మీరు అద్దంలో చూసుకున్నట్లయితే కనుపాప చాలా చిన్నదిగా కనిపిస్తుంది. ఎందుకంటే అంత సూర్యరశ్మిని లోనికి తీసుకోవడం కుదరదు, అది అవసరాన్ని మించి వుంది, కనుక కనుపాప సంకోచిస్తుంది. సంకోచించడమనేది అప్రయత్నంగా జరిగిపోతుంది. అప్పుడు మీరు చీకటిలోకి వెళ్ళినప్పుడు ఆ కనుపాప వ్యాకోచించాలి, ఆ కనుపాప విస్తరించాలి. కొద్దిసేపు చీకటిలో కూర్చున్న తరువాత, మళ్ళీ అద్దంలో చూసుకోండి మరి ఆ కనుపాప విస్తరించి వుండడాన్ని మీరు చూస్తారు.

మూడవ కన్ను విషయంలోనూ, సరిగ్గా బాహ్యపు కళ్ళ విషయంలో జరిగినట్లే జరుగుతుంది. బయటకు చూడడానికి కనుపాప చిన్నదిగా ఉండాలి ? అంతరంగంలోనికి చూడడానికి కనుపాప పెద్దదిగా ఉండాలి. అది ఒక సుధీర్ఘమైన మరి సనాతన సాధన. కానీ ఆ సాధనను నాశనం చేయడానికి ఏ క్రొత్త సాధనా అవసరం లేదు ... కేవలం కూర్చునే ఉండండి.

ప్రజలు అడుగుతారు, " కూర్చుని వుండి మేము ఏం చేస్తాం ? మాకు ' రాం, రాం ' అనేది ఇవ్వండి, ఉచ్ఛరించడానికి ఏదైనా మంత్రం ఇవ్వండి. మేము దానిని జపిస్తూంటాము ... మాకు చేయడానికి ఏదైనా ఇవ్వండి." ప్రజలు అంటారు, "మాకు ఊతకర్రలు కావాలి, మాకు సహాయం కావాలి." మీరు సాధన చెయ్యగానే, బంధనం మొదలవుతుంది. కేవలం కూర్చోండి !

కూర్చోవడం అంటే నా ఉద్దేశ్యం క్రింద కూర్చోండి అని కాదు ; మీరు నిలబడి ఉండవచ్చు, మీరు పడుకోవచ్చు కూడా. కూర్చోవడం అంటే, ఏమీ చెయ్యవద్దు, ఇరవైనాలుగు గంటలలో కొంత సమయాన్ని కర్మ-రహితంగా ఉండటంలో కూడా గడపండి. కర్మ నుంచి స్వతంత్రులు అవ్వండి. శూన్యంగా ఉండండి. ఏది జరుగుతున్నా, జరగనివ్వండి. ప్రపంచం ప్రవహిస్తోంది, దానిని ప్రవహించనివ్వండి. అది కదులుతోంది, దానిని కదలనివ్వండి. ధ్వనులు వస్తాయి, వాటిని రానివ్వండి. ఒక రైలు అటుగా వెళుతుంది, ఒక విమానం పైన ఎగురుతూంటుంది, కొంత శబ్దం వుంది ... దానిని ఉండనివ్వండి, కేవలం అలా కూర్చునే ఉండండి. ఏకాగ్రతతో ఉండకండి ... మీరు కేవలం కూర్చోండి. మీ అంతరంగంలో సమాధి అనేది క్రమక్రమంగా దృఢమవ్వడం మొదలవుతుంది. మీరు అకస్మాత్తుగా అష్టావక్రుడి భావం ఏమిటి అనేది ... సాధనలు మరి ఆచారక్రియల నుంచి స్వతంత్రులవ్వడం అంటే ఏమిటో అవగాహన చేసుకుంటారు.

రూపాన్ని కలిగి వున్నది అసత్యమైనది అని తెలుసుకో, మరి
రూపరహితమైనదానిని మార్పు లేనిదిగా మరి శాశ్వతమైనదిగా
తెలుసుకో. ఈ అసలైన అవగాహన కలిగినవారు
ప్రపంచంలో తిరిగి జన్మించడం అనేది ఉండదు.

అప్పుడు మీరు బుద్ధుడు *అనాగామి* అని పిలిచినవారు అవుతారు... మరణానంతరం ఎన్నటికీ తిరిగిరాని ఒక వ్యక్తి. మన కోరికల వలన మనం తిరిగి వస్తాం, మన రాజకీయాల వలన మనం తిరిగి వస్తాం ; కోరికలు మరి ఆశల వలన మనం తిరిగి వస్తాం. " నేను తెలుసుకునేవాడిని," అనేది తెలుసుకుని

మరణించినవారు, మళ్ళీ ప్రవేశించరు. ఈ వ్యర్థమైన చక్రం నుంచి ... ఈ రాకపోకల నుంచి అతను విడుదలవుతాడు.

రూపాన్ని కలిగివున్నది అసత్యమైనది అని తెలుసుకో, మరి
రూపరహితమైనదానిని మార్పు లేనిదిగా మరి శాశ్వతమైనదిగా
తెలుసుకో. ఈ అసలైన అవగాహన కలిగినవారు
ప్రపంచంలో తిరిగి జన్మించడం అనేది ఉండదు.

రూపాన్ని కలిగి వున్నది అసత్యమైనది అని తెలుసుకో... మన లోపల రూపాన్ని కలిగి వున్నది భ్రాంతికరమైనది ; రూపం లేనిది సత్యం. కొంతసేపు ఒక నీటిలోని సుడివైపు చూడండి. సుడి అంటే నీటిలో ఎగిసిపడుతున్న అలలు కాక మరేమిటి ? అది నిశ్చలమైపోయినప్పుడు, అది ఎక్కడికి వెళ్ళింది ? అక్కడ ఏ సుడీ లేదు. అది కేవలం నీటిలోని ఒక అల, అది కేవలం నీటిలో ఉత్పన్నమైన ఒక ఆకృతి. అదే విధంగా, మనం కేవలం దివ్యత్వం యొక్క అలలమే. ఆ అల పోయినప్పుడు, ఏదీ వెనుక మిగిలి వుండదు. బూడిద సైతం మిగలదు, ఒక్క జాడ కూడా మిగలదు. అది నీటిపై వ్రాయడం లాంటిది, మీరు వ్రాస్తుండగానే అది మాయమైపోతుంది ... అదే విధంగా మన జీవితంలో జరిగేదంతా అలలు మాత్రమే.

ఒక అద్దం దానిలో ప్రతిబింబించిన రూపంలో ఉన్నట్లుగా,
ఆ ప్రతిబింబం నుంచి విడిగా కూడా ఉన్నట్లుగానే, భగవంతుడు
ఈ శరీరంలో అంతర్గతంగా మరి బాహ్యంగానూ ఉన్నాడు.

మీరు ఒక అద్దం ముందు నిలబడి ఉన్నప్పుడు అది ప్రతిబింబాన్ని ఏర్పరచడం అనేది మీరు చూశారు. అద్దానికి ఏదైనా జరుగుతుందా ? ఒక ప్రతిబింబం సంభవిస్తుంది, దాని భావం ఏమీ సంభవించలేదు అనేదే. ప్రక్కకు జరగండి మరి ఆ ప్రతిబింబం పోతుంది ... అద్దం అది ఉన్న విధంగానే ఉంటుంది. మీరు దాని ముందుకు రావడం వలన మీ ప్రతిబింబం ఏర్పడింది ; ప్రక్కకు తొలగండి మరి అది పోతుంది. కానీ అద్దంలో ఏదీ ఏర్పడదు మరి ఏదీ ప్రక్కకు జరగదు. అద్దం తన స్వీయ స్వభావంతోనే ఉంటుంది.

అష్టావక్రుడి ఈ సూత్రం చెబుతుంది : ఒక అద్దం ముందు నిలబడండి. అద్దంలో ఒక ప్రతిబింబం ఏర్పడుతుంది, కానీ ఒక ప్రతిబింబం నిజంగా ఏర్పడిందా ? అది అలా కనిపిస్తుంది. కానీ ఆ ప్రతిబింబం చేత మోసగించబడకండి. ప్రతిబింబాల చేత ఎంతోమంది మోసగించబడుతుంటారు.

మరి ఈ సూత్రం ఏం చెబుతుందంటే ప్రతిబింబించే అద్దాలు మిమ్మల్ని ఆవరించి వున్నాయి ; బయట, లోపల అద్దాలలో అద్దాలు ప్రతిబింబిస్తున్నాయి, మరి అక్కడ అసలు ఏమీ లేదు. అదే విధంగా ఈ శరీరం లోపల మరి బయట భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు అంతరంగంలోనూ ఉన్నాడు, భగవంతుడు బాహ్యంలోనూ ఉన్నాడు, భగవంతుడు పైనా వున్నాడు, భగవంతుడు క్రిందా వున్నాడు, భగవంతుడు పశ్చిమాన ఉన్నాడు, భగవంతుడు తూర్పున ఉన్నాడు, భగవంతుడు దక్షిణాన ఉన్నాడు, భగవంతుడు ఉత్తరాన ఉన్నాడు. అన్ని వైపులా ఆ ఒక్కడే. మనం చిన్న సుడిగుండాలం, ఆ సువిశాల మహాసాగరంలో ఎగిసిపడుతున్న చిన్ని అలలం.

మిమ్మల్ని మీరు ఒక అలగా భావించుకుంటూ అయోమయానికి గురవ్వకండి ... మిమ్మల్ని మీరు మహాసాగరంగానే భావించండి. కేవలం నమ్మకంలో ఈ మాత్రం వ్యత్యాసం : అదే బానిసత్వానికీ, స్వతంత్ర్యానికీ మధ్యన వున్న వ్యత్యాసం. మిమ్మల్ని మీరు ఒక అలలా చూడండి, మీరు బంధితులవుతారు, మిమ్మల్ని మీరు మహాసాగరంలా చూడండి మరి మీరు విముక్తులవుతారు.

సర్వత్రా వ్యాపించివున్న ఒకే ఆకాశం ఒక కుండలోపల
మరి బయట ఒకే విధంగా ఉన్నట్లుగానే, ఆద్యంతరహితమైన
బ్రహ్మం అందరిలోనూ ఒకే విధంగా ఉంటుంది.

సర్వత్రా వ్యాపించివున్న ఒకే ఆకాశం ఒక కుండ లోపల మరి బయట ఒకే విధంగా ఉన్నట్లుగానే... ఒక కుండను పరిగణించండి : కుండ లోపల అదే ఆకాశం, బయటా అదే ఆకాశం. మీరు ఆ కుండను పగులగొట్టచ్చు. కానీ ఆ ఆకాశం నాశనమవ్వదు. మీరు ఒక కుండను తయారు చేయవచ్చు, కానీ అది ఆకాశాన్ని విరూపం చేయదు. ఆ కుండ ఏ ఆకృతిలో చేయబడినాగానీ ... వంకరగా లేదా గుండ్రంగా ... ఆకాశం ఏ రూపాన్నీ తీసుకోదు. మనమంతా మట్టి పాత్రలం, మట్టి కుండలం. దాని బయట అదే వాస్తవం ఉంటుంది, దాని లోపల అదే వాస్తవం వుంటుంది : పలుచని మట్టి గోడకు మరీ ఎక్కువ విలువను ఇవ్వకండి. ఈ మట్టిగోడ మిమ్మల్ని ఒక పాత్రగా తయారుచేస్తుంది ... దానితో మరీ బిగుతుగా అభేదంతో ఉండకండి. మీరు ఈ మట్టి గోడేనని మీరు నమ్మితే కనుక, మీరు మట్టి కుండలుగానే రూపొందించబడుతూ పోతారు, మీ నమ్మకం మిమ్మల్ని ఇక్కడకు మళ్ళీ మళ్ళీ వెనక్కు లాగుతుంది.

మరెవ్వరూ మిమ్మల్ని ఈ ప్రపంచంలోనికి తీసుకురారు. మీరు ఒక కుండ అనే మీ స్థిరాభిప్రాయమే మిమ్మల్ని వెనక్కు తీసుకొస్తుంది. మీరు ఆ కుండలోపలి శూన్యమేనని ఒకసారి మీరు తెలుసుకుంటే... లావో ట్జు యొక్క వివరణము అర్థవంతమైనదవుతుంది. లావో ట్జు అంటాడు, కుండ యొక్క ప్రక్కల భావం ఏమిటి?

అసలైన భావం కుండ లోపల వున్న శూన్యంలోనే వుంది. మీరు దానిని నీటితో నింపితే కనుక, నీరు ఆ శూన్యాన్ని నింపుతుంది, ప్రక్కలను కాదు."

మీరు ఒక ఇంటిని రూపొందించినప్పుడు మీరు ఆ గోడలను ఇల్లు అని పిలుస్తారా ? అది సరైనది కాదు. లోల వదిలేయబడిన ఖాళీ ప్రదేశమే ఇల్లు. మీరు దేనిలో నివసిస్తారు, మీరు గోడలలో నివసించరు ; ఆ గోడలు కేవలం ఒక సరిహద్దు మాత్రమే. వాస్తవానికి మనం ఆకాశంలో జీవిస్తాము. మనమందరమూ 'దిగంబరులుగా', ఆకాశాన్ని - ధరించినవారుగా ఉంటాము. గోడల వలన ఏమి వ్యత్యాసం వుంది ? మనం ఆకాశంలో ఉంటాము, అంతరంగమైనా లేదా బాహ్యమైనా. ఈ రోజు ఆ గోడ ఉంది, రేపు అది పడిపోతుంది ... ఆకాశం ఎల్లప్పుడూ ఉంటుంది.

మీరు పొరపాటున గోడలను ఇల్లుగా గ్రహిస్తే, మట్టి పొరలను కుండగా అనుకుంటే మరి మిమ్మల్ని మీరు శరీరంగా స్వీకరిస్తే కనుక, ఇదే మీ బంధనం అవుతుంది. జీవితపు సూత్రాన్ని చదవడంలో కేవలం ఒక చిన్న పొరపాటు మరి అంతా అయుక్తమైనది అయిపోతుంది ; ఒక అతి చిన్న పొరపాటు...

ఒకసారి ముల్లా నసీరుద్దీన్ ఒక బస్సు ఎక్కాడు. ఆలోచనలో మునిగిపోయి అతను ఒక సీటులో కూర్చున్నాడు మరి ఒక సిగరెట్ వెలిగించాడు. " బస్సులో పొగ త్రాగడం నిషేధించబడింది అని స్పష్టంగా వ్రాసి వుంది," ఆ కండక్టరు కోపంగా అన్నాడు. " నువ్వు దానిని చదవలేదా? నీకు చదవడం రాదా ?"

" నేను దానిని చదివాను, కానీ ఈ బస్సులో వ్రాసి వున్నది ఎంతో వుంది. నేను వాటిలో ఏది చెయ్యాలి ?" నసీరుద్దీన్ అన్నాడు. " దీనివైపు చూడు : ఇక్కడ వుంది, " ఎల్లప్పుడూ నేత చీరలనే ధరించండి !"

ఇటువంటి పొరపాట్లను నిరోధించడానికి ఎవరైనా కొద్దిపాటి జాగ్రత్తతో ఉంటే చాలు. ఈ శరీరం ఎంతో దగ్గరగా వుంది ... ఈ శరీరం యొక్క భాషను చదవడం అత్యంత సులభం. మరి ఈ శరీరం ఎంత చేరువలో ఉన్నదంటే దాని నీడ అంతరంగ దర్పణంపై పడుతుంది మరి ప్రతిబింబిస్తుంది. మీరు ఈ శరీరంలో ఉన్నారు, కానీ మీరు ఈ శరీరం కాదు. ఈ శరీరం మీది, కానీ మీరు శరీరానికి చెందినవారు కాదు. ఈ శరీరం మీ సాధనం, మీరు ఆ ఫలితం. శరీరాన్ని వినియోగించండి, మీ యాజమాన్యాన్ని కోల్పోకండి. ఈ శరీరంలో జీవిస్తున్నా గానీ, శరీరానికి అతీతులై ఉండండి ... నీటిలోని తామర పుష్పంలా.

హరి ఓం తత్ సత్ !

వేదాంతం మరి అష్టావక్ర గీత లాంటి పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా, పొందదగినది అంతా ఇప్పటికే పొందబడింది అని నేను తెలుసుకున్నాను. దానికోసం ప్రయత్నాలు చేయడమనేది దారి తప్పి సంచరించడమే. నేను లోతుగా ఈ నిశ్చయాన్ని చేసుకున్నాను, మరి ఆత్మ-సాక్షాత్కారం ఎందువలన సంభవించలేదు?

నిన్న సాయం సంధ్యవేళ ఆరుబయట నడుస్తూ ఉన్నప్పుడు, అకస్మాత్తుగా మీ ఉదయపు ప్రసంగమంతా నా దేహంలోని అణవణువులోనూ ప్రతిధ్వనించడం ప్రారంభించినట్లుగా నేను అనుభూతి చెందాను. కానీ అప్పటి నుంచి నేను మరింత ఆందోళన చెందుతున్నాను ఎందుకంటే నేను దీనినంతటినీ అవగాహన చేసుకోలేకపోతున్నాను.

మనం భగవంతుడి యొక్క అంశలం మరి అనశ్వరమైనవారం కూడా. ఈ అంశ ఎప్పుడు, ఎందుకు, ఎలా మూలం నుంచి విడివడిందో దయచేసి వివరించండి? మరి మూలంతో అంశ యొక్క పునరైక్యం ... ఒక అవిభాజ్యమైన ఐక్యం ... సాధ్యమేనా లేక సాధ్యం కాదా?

ఎంతోకాలంగా నేను అడగాలని అనుకున్నాను : దయచేసి మీరు నాకు చెబుతారా, నేను ఏమి అడగాలి ?

6

సత్యం యొక్క గీటురాయి

మొదటి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

వేదాంతం మరి అష్టావక్ర గీతలాంటి పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా, పొందదగినది అంతా ఇప్పటికే పొందబడింది అని నేను తెలుసుకున్నాను. దాని కోసం ప్రయత్నాలు చేయడమనేది దారితప్పి సంచరించడమే. నేను లోతుగా ఈ నిశ్చయాన్ని చేసుకున్నాను, మరి ఆత్మ-సాక్షాత్కారం ఎందువలన సంభవించలేదు ? దయచేసి నాకు మార్గాన్ని చూపండి.

పవిత్ర గ్రంథాల నుంచి మీరు అవగాహన చేసుకున్నది మీ స్వంత అవగాహన అని ఎన్నడూ అనుకోకండి. మీరు మాటల నుంచి అవగాహన చేసుకున్నది మీ స్వంత అనుభవంగా అయిపోయిందని ఎన్నడూ అనుకోకండి.

అష్టావక్రుడు చెప్పేది విని, అనేకమంది భావిస్తారు, " దాదాపు సరైనదే ! సకలమూ ఇప్పటికే సిద్ధించింది." కానీ అది ఈ విధంగా సిద్ధించదు. మీరు అష్టావక్రుడు చెప్పేది వినడానికీ మరి సిద్ధికీ మధ్య ఏమి సంబంధం వుంది ? " అది ఇప్పటికే సంభవించింది " : కానీ ఇది మీ స్వంత అనుభవమే అయివుండాలి. ఈ గుర్తింపు, ఈ సిద్ధి, మీదే అయి వుండాలి. అది ఒక వివేక సంబంధమైన ముక్తాయింపు కాజాలదు.

వివేకం దానిని త్వరగా సమ్మతిస్తుంది. ఇంతకన్నా సులభమైనది ఏముంటుంది, " అది ఇప్పటికే సంభవించింది. మంచిది, మన కష్టాలు తీరిపోయాయి. ఇప్పుడు అన్వేషించాల్సిన అవసరం లేదు, ధ్యానం చేయవలసిన అవసరం లేదు, పూజించడం లేదా ప్రార్థించడం చేయవలసిన అవసరం లేదు ... అది ఇప్పటికే సంభవించింది."

వివేకం అంగీకరించడానికి సిద్ధంగా వుంది ... కానీ అది సత్యాన్ని గ్రహించడం వలన కాదు. అది అంగీకరిస్తుంది ఎందుకంటే అప్పుడు మార్గంలోని కష్టాలను వదిలేయవచ్చు, సాధన యొక్క ప్రయత్నాలను వదిలేయవచ్చు, మరి ధ్యానం చేయాల్సిన అవసరాన్ని వదిలేయవచ్చు. త్వరలోనే మీరు చుట్టూ చూస్తారు మరి మీరు సిద్ధించుకోలేదు అనేది కనుగొంటారు. కేవలం వివేకం దానిని గ్రహించడం ద్వారా అది సంభవించగలిగితే కనుక, ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయాలు ఉండుండేవి. ఆధ్యాత్మిక విద్యాభ్యాసం కోసం ఏ విశ్వవిద్యాలయమూ లేదు. పవిత్ర గ్రంథాల నుండి అది సిద్ధించదు, అది మీ స్వీయ స్వేచ్ఛాపూర్వక, ప్రేరిత ప్రజ్ఞ ద్వారా సిద్ధిస్తుంది.

అష్టావక్రుడు చెప్పేది వినండి, కానీ విశ్వసించాలనే తొందరలో ఉండకండి. మీ అత్యాశ మిమ్మల్ని తొందరపెడుతుంది. మీ అత్యాశ మీకు చెబుతుంది, " ఇది ఎంతో సదుపాయంగా వుంది. మనం ఇప్పటికే ఆ నిధిని కలిగివున్నాం, కనుక దానిని సిద్ధించుకోవడమనే బెంగంతా వదిలిపోయింది. ఇప్పుడు వెళ్ళవలసిన ఏ చోటూ లేదు, ఇప్పుడు చెయ్యవలసినది ఏదీ లేదు."

మీరు ఎల్లప్పుడూ ఏ ప్రయాసా లేకుండా సిద్ధించుకోవాలనే కోరుకున్నారు. కానీ గుర్తుంచుకోండి, దీనంతటి వెనుక పొందాలి అనే కోరిక ఇంకా వుంది : చెయ్యకుండా పొందాలి అనేది ! పూర్వం మీరు సిద్ధించుకోవడానికి గట్టిగా శ్రమపడడం గురించి ఆలోచించారు ; ఇప్పుడు మీరు ఏ ప్రయత్నమూ లేకుండా సిద్ధించుకోవడం గురించి ఆలోచిస్తున్నారు ... కానీ సిద్ధించుకోవాలనే కోరిక అనేది ఇంకా అక్కడ వుంది. ఇందువలనే ఆ ప్రశ్న ఉత్పన్నమవుతుంది, " ఆత్మ-సాక్షాత్కారం ఎందువలన ఇంకా సంభవించలేదు ?"

దానిని అవగాహన చేసుకున్న వ్యక్తి ... అతను అంటాడు, " ఆత్మ-సాక్షాత్కారం గురించి ఎవరు పట్టించుకుంటారు. నేను దానిని ఏం చేసుకుంటాను?" మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకుని వుంటే, మరో ప్రశ్న ఏదీ ఉదయించదు. ఈ వివరణము, " ఆత్మ-సాక్షాత్కారం సంభవించలేదు," సూచిస్తున్నది ఏమిటంటే అష్టావక్రుడు చెబుతున్నదానిని అంగీకరిస్తున్నప్పుడు, మీరు మీ కడగంటితో జాగ్రత్తగా చూస్తున్నారు : అది ఇప్పటికే సిద్ధించిందా లేక సిద్ధించలేదా? మీ కన్ను ఇంకా సిద్ధించుకోవడంపైనే కేంద్రీకృతమై వుంది.

ప్రజలు నా వద్దకు వస్తారు మరి నేను వారికి చెబుతాను, "మీరు కాంక్షించడాన్ని కొనసాగించినంత కాలం ధ్యానం అనేది లోతుగా వెళ్ళలేదు. ఏదైనా పొందాలని మీరు ఆశించినంత కాలం ... బ్రహ్మానందం, భగవంతుడు, ఆత్మ ... ధ్యానం అనేది

లోతుగా వెళ్ళదు, ఎందుకంటే పొందడం గురించి ఆలోచించడం అనేది అత్యాశ. అది తృష్ణ, అది రాజకీయం. అది ఇంకా ఓ మతం కాలేదు." వాళ్ళు అంటారు, "సరే, మేము ఏదీ ఆశించకుండా ధ్యానం చేస్తాం, కానీ మేము సిద్ధించుకుంటాం, మేము అది చేయగలం కదా ?"

ఏ వ్యత్యాసమూ లేదు. వాళ్ళు కాంక్షించడం మానుకోవడానికి సిద్ధంగా ఉన్నారు ఎందుకంటే, "సిద్ధించుకోగల మార్గం ఇదే అని మీరు చెబుతున్నారు, కనుక మేము దాని గురించి ఆలోచించము ... అయినా గానీ, మేము దానిని సిద్ధించుకుంటాం, మేము సిద్ధించుకోగలం కదా ?"

మిమ్మల్ని మీరు అత్యాశ నుంచి వదిలించుకోలేకపోతున్నారు. అష్టావక్రుడు చెప్పేది విని అనేకమంది అది-సంభవించింది అనేది అతి త్వరగా అంగీకరించేస్తారు. అది అంత త్వరగా సంభవించగలిగితే కనుక... మరి అది సంభవించడానికి ఎంతో అడ్డంకి ఉందని కాదు. మీ కోరుకోవడం యొక్క మూర్ఖత్వమే ఏకైక అడ్డంకి. ఆ సంభవం ఎంతో చేరువలో వుంది !

అష్టావక్రుడు సరిగ్గా చెప్పాడు ... అది ఇప్పటికే సంభవించింది. కానీ సిద్ధించుకోవడానికై ఉన్న కోరిక అంతా మాయమైపోయినప్పుడు మాత్రమే ఈ, "అది ఇప్పటికే సంభవించింది," అనేది అవగాహన చేసుకోబడుతుంది. అప్పుడు అది సిద్ధించింది అనేది మీ సంపూర్ణత్వం నుంచి మీరు తెలుసుకుంటారు. కానీ ప్రస్తుతం అది కేవలం ఒక వివేక సంబంధమైన క్రీడ మాత్రమే : " అష్టావక్రుడి లాంటి మహోన్నత గురువు దానిని చెప్పినట్లయితే, అది సరైనదే అయివుంటుంది." మీరు నమ్మడానికి వేగిరపడుతున్నారు. మీ నమ్మకం దుర్బలమైనది. సందేహించకుండా మీరు దానిని త్వరగా అంగీకరించారు. ఈ దేశంలో పవిత్ర గ్రంథాలలో వ్రాయబడి ఉన్నదేనినైనా సందేహించడమనే అలవాటు మరుగైపోయింది. అది పవిత్ర గ్రంథాలలో ఉంటే కనుక, అది సరైనదే అయివుంటుంది.

ఒకరోజు ముల్లా నసీరుద్దీన్ ఒక అత్యంత అంధమైన గొడుగును పట్టుకుని వచ్చాడు. నేను అతనిని అడిగాను, " నువ్వు దానిని ఎక్కడ సంపాదించావు? ఇంత చక్కని గొడుగులు ఇక్కడ తయారు చేయబడవు."

అతను అన్నాడు, " నా సోదరి ఒక బహుమతిగా పంపింది."

నేను అడిగాను, " నసీరుద్దీన్ ! నీకు సోదరీమణులే లేరని నువ్వు ఎల్లప్పుడూ చెబుతూ వచ్చావు కదా."

అతను బదులిచ్చాడు, " అది నిజమే."

అప్పుడు నేను అన్నాను, "అయినాగానీ ఈ బహుమతి నీ సోదరి చేత పంపబడిందా...?"

అతను చెప్పాడు, " నువ్వు నమ్మకపోతే కనుక : ఇదిగో ఈ పిడి పైన అది వ్రాసి వుంది. " నా ప్రియ సోదరుడికి ఓ కానుక, నీ సోదరి నుంచి." నేను ఒక రెస్టారెంటు నుంచి బయటకు వస్తున్నాను మరి గొడుగుపై ఈ అక్షరాలు ... నేను అనుకున్నాను, నాకు కూడా ఒక సోదరి ఉన్నట్లు కనిపిస్తోంది.

"అది వ్రాయబడి ఉన్నప్పుడు అది విశ్వసించబడాలి. మరి బహుశా ఎవరో సోదరి లేదా బంధువు ఉండవచ్చు.... మరి మతపరమైనవారు ఎల్లప్పుడూ చెప్పారు నీ భార్య తప్ప మిగిలిన స్త్రీలందరినీ నువ్వు నీ మాతృమూర్తిగా లేదా సోదరిగా భావించాలి."

ఏదైనా ప్రచురితమై ఉన్నప్పుడు ... మరి పవిత్ర గ్రంథాలలో ... వ్రాయబడి వున్న పదం పట్ల నమ్మకం అతి దృఢంగా ఉంటుంది. మీరు ఎవరికైనా ఏదైనా చెప్పినప్పుడు, అది ఎక్కడ ప్రచురించబడింది అని అతను అడుగుతాడు. మీరు ఎక్కడో చెబితే కనుక, మీరు చెప్పిన దానిని అతను నమ్ముతాడు. వ్రాతలో ఏదో శక్తి ఉన్నట్లుగా అది కనిపిస్తోంది. అది ఎంత సనాతనమైనదో చెప్పండి ... ప్రజలు దానిని సమ్మతిస్తారు. వయస్సుతో సత్యానికి ఏదో సంబంధం ఉన్నట్లుగా అది వుంటుంది. దానిని ఎవరు చెప్పారు ? అష్టావక్రుడా ? బుద్ధుడా ? మహావీరుడా ? ... అయితే అది సరైనదే అయివుంటుంది.

మీవైపు నుంచి మీరు మేల్కొనేందుకు ఏ ప్రయత్నమూ చేయలేదు... స్వల్పమైనది కూడా. ఎవరో దానిని చెప్పారు, మీరు దానిని విశ్వసించారు ... మరి ఎంతటి అనాయాసమైనది : ఏమీ చేయకుండానే మీరు సిద్ధించుకున్నారు !

కృష్ణమూర్తి యొక్క అనుచరులు నలభై సంవత్సరాలుగా వింటున్నారు... హెచ్చు తగ్గులుగా కచ్చితంగా అదే వ్యక్తులు. వాళ్ళు ఏమీ పొందలేదు. కొన్నిసార్లు వాళ్ళలో ఒకరు నా వద్దకు వచ్చి అంటారు, " సకలమూ ఇప్పటికే సిద్ధించిందని నాకు తెలుసు, కానీ అది ఎందుకు సంభవించలేదు ? నేను కృష్ణమూర్తి చెప్పినది వింటాను, కనుక సకలమూ ఇప్పటికే సిద్ధించిందని నేను అవగాహన చేసుకున్నాను."

ఈ ప్రజలు అత్యాశగలవారు. ఏ ప్రయత్నమూ చేయవలసిన అవసరం లేకుండా తాము దానిని ఉచితంగానే పొందాలని వాళ్ళు ఆశించారు. వాళ్ళు కృష్ణమూర్తి చెప్పేదీ

నలేదు అష్టావక్రుడినీ అవగాహన చేసుకోలేదు, వాళ్ళు తమ అత్యాశ చెప్పేది విన్నారు. వాళ్ళు తమ అత్యాశ ద్వారా విన్నారు. అప్పుడు వాళ్ళు తమ స్వంత విధానంలో భాష్యం చెబుతారు.

ఒక మిత్రుడు అడిగాడు, " ధ్యానాలు చేయడమనేది ప్రస్తుతం అసంగతమైనదిగా కనిపిస్తోంది. రోజుకు అయిదు ధ్యానాలు ... మరి అష్టావక్రుడిపై ఈ ప్రసంగాల పరంపర కొనసాగుతోంది... అది మూర్ఖమైనదిగా కనిపిస్తోంది."

ధ్యానాన్ని వదిలేయడమనేది ఎంతో సులభం ... మరి దానిని చేయడమనేది ఎంతో కష్టం. అష్టావక్రుడు దేనిని సిద్ధించుకున్నాడో అది 'చేయడం' ద్వారా సిద్ధించలేదు, మరి అయినాగానీ అతను ఏమీ చేయకపోవడం ద్వారా సిద్ధించుకోలేదు.

అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించండి, ఇది ఒక సూక్ష్మమైన అంశం.

అతను చేయడం అనేదానినంతటినీ వదిలేసినప్పుడే బుద్ధుడు సిద్ధిని పొందాడు అని నేను మీకు చెప్పాను. ఆరు సంవత్సరాల అలుపు లేని ప్రయత్నం, అతను దానికి సర్వస్వాన్నీ ఇచ్చాడు. సర్వస్వాన్ని ఇవ్వడం ద్వారా, చేయడం వలన ఏదీ సిద్ధించదు అనే అనుభవాన్ని అతను పొందాడు. బుద్ధుడి యొక్క కాలంలో అష్టావక్ర గీత అందుబాటులోనే ఉన్నప్పటికీ... అది అష్టావక్ర గీతను చదవడం వలన రాలేదు. అతను దానిని చదవగలిగి ఉండేవాడు ... ఈ ఆరు సంవత్సరాల ప్రయత్నపు అవసరమే లేదు. ఆరు సంవత్సరాలపాటు అతను పట్టువిడువలేదు, మరి ఈ ప్రయత్నం నడుమ అది ప్రయత్నం ద్వారా సిద్ధించదు అనేది అతను తెలుసుకున్నాడు. అంతర్గత ప్రయత్నం ద్వారా దానిని సిద్ధించుకోలేమని తనకు తాను నిరూపించుకుంటూ, అతను ఒక్క ప్రయత్నాన్ని కూడా విడువకుండా చేశాడు. అంతరంగంలో ఏ కోరికా మిగిలిలేదు. అతను సకలమూ చేశాడు, మరి తాను సిద్ధించుకోలేదు అనేది అతను చూశాడు. అతని ప్రయత్నం ఎంత ఘనీభవించిందంటే, ఈ ఘనీభవించడంలోనే, చేయడం అనేది వదిలేయబడింది. అప్పుడు అది సంభవించింది.

నేను మీకు చెబుతున్నాను, మీరు సకలమూ చేసిన తరువాతే కర్మ-రాహిత్య స్థితి వస్తుంది. వేగిరపడకండి, లేదంటే మీరు ఇప్పటికే చేస్తున్న స్వల్ప ధ్యానం చేజారిపోతుంది, మీరు చేస్తున్న కొద్దిపాటి ప్రార్థన చేజారిపోతుంది. అష్టావక్రుడు సుదూరంలోనే ఉండిపోతాడు, మరి ఆ ప్రయాణంలోని మీ స్వల్ప పురోగతి కూడా ఆగిపోతుంది.

ఆగిపోవడానికి ముందు, ఒకరు సంపూర్ణంగా పరుగెత్తాల్సి వుంటుంది. పరుగెత్తడం ద్వారా ఎవ్వరూ దానిని సిద్ధించుకోకపోయినా, ఈ తెలుసుకోవడం అనేది దాని ద్వారా ఘనీభవిస్తుంది. ఒకరోజు ప్రయత్నమనేది వదిలేయబడుతుంది, కానీ కేవలం వివేకపూర్వక అవగాహన ద్వారా కాదు. అది వ్యర్థమైనది అని ప్రతి కణం, ప్రతి అణువు అవగాహన చేసుకున్నప్పుడు ... అది సంభవించే క్షణం ఇదే.

సాధన అనేది బంధనం అని అష్టావక్రుడు చెబుతున్నది సరైనదే. కానీ సాధన చేసినవారు మాత్రమే కనుగొనగలరు.

నేను దీనిని మీకు ఎందుకు చెబుతున్నానంటే నేను సాధన చేశాను మరి అది ఒక బంధనం అనేది తెలుసుకున్నాను. నేను దీనిని మీకు ఎందుకు చెబుతున్నానంటే నేను సాధనను అభ్యాసం చేశాను మరి ఏ సాధనా ఒకరిని ' సాధ్యం ' వైపు, గమ్యం వైపు నడిపించదు అని కనుగొన్నాను. నేను ధ్యానం చేశాను మరి ఏ ధ్యానమూ ఒకరిని సమాధి వద్దకు చేర్చదు అనేది కనుగొన్నాను.

ఇది మీ ప్రగాఢ అనుభవం అయినప్పుడు ... ఈ అనుభవం సంపూర్ణ తీవ్రత యొక్క దశకు చేరుకున్నప్పుడు, మీరు సర్వస్వాన్ని సమర్పించినప్పుడు... ఏదీ మిగిలి వుండకుండా ... మిమ్మల్ని మీరు సంపూర్ణంగా ఆ అగ్నిలోకి విసిరేసుకున్నారు, ఆ ప్రయత్నం సంపూర్ణమైంది, ఆ అంతర్గత అగ్ని సంపూర్ణమైంది, ఆ సాధన పరిపూర్ణమైంది, మీరు ఏదైనా వెనుక వుంచేశారు అని అస్తిత్వం ఇప్పుడు మీకు చెప్పలేదు, అంతా ఇవ్వబడింది ... ఆ రోజు, ఆ ఘనీభవించడంలో, ఆ రగులుతున్న చైతన్యపు స్థితిలో, ఆకస్మికంగా సకలమూ కాలి బూడిదైపోతుంది. సాధన సమస్తం, అభ్యాసాలు అన్నీ, ధ్యానం అంతా, పరిత్యాగమంతా ... ఆకస్మికంగా మీరు మేల్కొంటారు మరి కనుగొంటారు, " ఓహ్ ! నేను దేనిని అన్వేషిస్తున్నానో అది ఇప్పటికే ఇక్కడ వుంది !"

కానీ కేవలం అష్టావక్రుడు చెప్పినది చదవడం ద్వారానే అది సంభవించగలిగినట్లయితే అప్పుడు అది ఎంతో సదుపాయంగా ఉంటుంది. అష్టావక్రుడు చెప్పినది చదవడం కష్టతరమైనదా ? ఆ సూత్రం ఎంతో స్పష్టమైనది మరి సరళమైనది. గుర్తుంచుకోండి, సరళమైన విషయాలను అవగాహన చేసుకోవడం అనేదే ప్రపంచంలోని అత్యంత కఠినమైన విషయం. మరి ఆ కఠినత మీ అంతరంగంలో నుంచే వస్తుంది. మీరు ఏమీ చేయాల్సిన అవసరం ఉండకూడదని మీరు ఆశిస్తారు. ధ్యానం చేయవలసిన అవసరాన్ని అంగీకరించడం అనేది ప్రజలకు అత్యంత కఠినతరమైన విషయం.

ఇదే అగ్ని పరీక్ష ... ఈ అష్టావక్ర గీత. అష్టావక్రుడు చెప్పేది విని మరి ధ్యానం చేయడం కొనసాగించేవారు అవగాహన చేసుకున్నారు. అష్టావక్రుడు చెప్పేది విని మరి ధ్యానం చేయడం ఆపేసినవారు అష్టావక్రుడిని అవగాహన చేసుకోలేదు, మరి వాళ్ళు తమ ధ్యానాన్ని కూడా చేజార్చుకుంటారు.

సాధన చెయ్యండి, మరి సాధన అనేది మిమ్మల్ని ఎక్కడకూ చేర్చలేదు అని మీరు కనుగొంటారు. ఇది సాధన చేయడంలోని చివరి దశ. మరీ తొందరపాటుతో ఉండకండి.

"వేదాంతం మరి అష్టావక్ర గీతలాంటి పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా, నేను తెలుసుకున్నాను..." ఎవ్వరైనా ఎప్పుడైనా అధ్యయనం ద్వారా తెలుసుకున్నారా ? పవిత్ర ప్రతులను నేర్చుకోవడం, మాటలను నేర్చుకోవడం ద్వారా ఎవ్వరైనా ఎప్పుడైనా తెలుసుకున్నారా ? ఇది తెలుసుకోవడం కాదు, ఇది సమాచారం; దాని **గురించి** తెలుసుకోవడం. ఈ సమాచారం తెలిసింది అని మీరు అనవచ్చు : "పొందదగినదంతా ఇప్పటికే పొందబడింది." కానీ మీరు దానిని గ్రహించినప్పుడు, అంతా అయిపోతుంది.

మీకు సమాచారం అందించబడింది, మీరు ఉద్రేకపడిపోయారు, మరి అది అత్యాశలో అంకురించింది ! మీ అత్యాశ చెప్పింది, "చూడూ, నేను నిరర్థకంగా ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాను. "ఏదీ చెయ్యకుండా", అని అష్టావక్రుడు చెబుతున్నాడు, కనుక నేను ఏమీ చెయ్యకుండా కూర్చుంటాను." కనుక మీరు కూర్చుంటారు, ఏమీ చెయ్యకుండా. కొద్దిసేపటి తరువాత మీరు గమనిస్తారు, "ఈ సంభవం ఇంకా సంభవించనే లేదు. ఈ ఆలస్యం ఎందుకు ? మరి అష్టావక్రుడు ఈ క్షణమే అని చెప్పాడు !" మీరు గడియారం వైపు చూస్తూ కూర్చుంటారు, "అయిదు క్షణాలు గడచిపోయాయి, అయిదు నిమిషాలు గడచిపోయాయి, ఒక గంట దాదాపుగా అయిపోతోంది ... మరి అష్టావక్రుడు అవ్యవధిగా, ఈ క్షణమే ! ఒక్క క్షణం కూడా గడవాల్సిన అవసరం లేదు అని అన్నాడు !" అతను అబద్ధమాడాడు అని మీరు అనుకోవడం ప్రారంభిస్తారు, మీ నమ్మకం చెదిరిపోయింది.

ఇది తెలుసుకోవడం కాదు, ఇది సమాచారం. సమాచారానికీ మరి తెలుసుకోవడానికీ మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. సమాచారం అంటే అది అరువు తెచ్చుకున్నది అని అర్థం. మరెవరో తెలుసుకున్నారు. మరి అతను చెప్పినది వినడం ద్వారా మీకు సమాచారం అందింది. ఇది సమాచారమే.

తెలుసుకోవడం అనేది ఒక అనుభవం. మీ కోసం మరెవ్వరూ తెలుసుకోలేరు ; అది అరువు తెచ్చుకోలేనది.

నేను తెలుసుకున్నాను ... దీని నుంచి మీ తెలుసుకోవడం అనేది సంభవించదు. నా జ్ఞానం నాదే అయివుంటుంది, మీ జ్ఞానం మీదే అయివుంటుంది. అవును, మీరు నా మాటలను సేకరిస్తే కనుక అది సమాచారం అవుతుంది. సమాచారం ద్వారా ఒకరు ఓ పండితుడు కావచ్చు, కానీ ఒక జ్ఞాని కాలేడు. ప్రజ్ఞ గురించిన జ్ఞానాన్ని సేకరించవచ్చు, కానీ ప్రజ్ఞ యొక్క విముక్తిని కాదు. మాటల యొక్క క్రమమంతటినీ కల్పించవచ్చు, కానీ సత్యం యొక్క సౌందర్యాన్ని కాదు. ఆ మాటలు మిమ్మల్ని మరింత ఎక్కువగా చెరలో ఉంచుతాయి, మిమ్మల్ని మరింత ఎక్కువగా బానిసలను చేస్తాయి. కనుక పండితులు ఎంతో అణచివేతలో ఉండడాన్ని మీరు కనుగొంటారు. తెరచివున్న ఆకాశం ఎక్కడ వుంది ? "పొందదగినదంతా ఇప్పటికే పొందబడింది," అనేది తెలుసుకుని ... మీరు దానిని తెలుసుకుంటే కనుక అప్పుడు ఇక అడిగేందుకు ఏం మిగిలివుంది ?

"...ప్రయత్నాలు చేయడమనేది దారి తప్పి సంచరించడమే." మీకు ఇది తెలిసివుంటే కనుక ఇక అడిగేందుకు ఏముంది? "నేను లోతుగా ఈ నిశ్చయాన్ని చేసుకున్నాను." అయితే నిశ్చయం అనేది వుంది లేదా అది లేదు ; దానిని లోతుగా చేయగల మార్గమే లేదు. మీరు దానిని లోతైనదిగా ఎలా చేయగలరు ? నమ్మకం వుంటే కనుక నమ్మకం వుంది ; అది లేకపోతే కనుక అది లేదు ... మీరు దానిని లోతైనదిగా ఎలా చేస్తారు ? నమ్మకాన్ని లోతైనదిగా చేయగలిగిన విధానం ఏముంది? మీరు మీ సందేహాలను అణచి వేసుకుంటారా ? మీరు మీ సందేహాలపైకి ఎక్కి కూర్చుంటారా? మీరు మీ సందేహాలను అబద్ధం చేస్తారా ? మనస్సు ప్రశ్నలను రేకెత్తించినప్పుడు మీరు వాటిని నిర్లక్ష్యం చేస్తారా ?

అంతరంగంలో, అనుమానపు పురుగు తినేస్తూ వుంటుంది. అది అంటుంది,"ఇక విను, ఏమీ చేయకపోవడం ద్వారా ఏదైనా సిద్ధించిందా ? కేవలం కూర్చోవడం ద్వారా ఎన్నడైనా ఏదైనా సంభవించిందా? చేయడం ద్వారానే విషయాలు సంభవిస్తాయి. ఊరికే కూర్చుని ఉండడం ద్వారా ఏదైనా సంభవిస్తుందా? మీరు దేనినైనా ఉచితంగా పొందగలరా ? నువ్వు ఏ నిరర్థకమైనదానిలో చిక్కుకుంటున్నావు? నువ్వు ఏ భ్రాంతి బారిన పడ్డావు? లేచి నిలబడు, కదులు, పరుగెత్తు ; లేదంటే జీవితం అంతమైపోతుంది ... జీవితం ఇప్పటికే అంతమైపోతోంది ! ఇక్కడ ఒక మూర్ఖుడిలా కూర్చుని వుండి సమయాన్ని వృథా చేయవద్దు."

ఈ అనుమానాలు ఖచ్చితంగా కలుగుతాయి : మీరు వాటిని ఏం చేస్తారు ? మీరు వాటిని అణచివేయడానికి ప్రయత్నిస్తారా ? మీరు వాటిని అబద్ధాలుగా చేస్తాం ? మీరు దాని గురించి వినాలనుకోవడం లేదని మీరు చెబుతారా ? మీరు వాటిని అచేతనంలోకి తోసేస్తారా? మీరు వాటిని అంతరంగంలో, మీ మూలంలో మరగు పరుస్తారా ? మీరు వాటివైపు చూడడాన్ని నిరోధిస్తారా ?

మీ నమ్మకాన్ని లోతైనదిగా చేయడానికి మీరు ఏం చేస్తారు ? మీరు ఇలాంటిదేదో చేస్తారు ... మీరు ఏవో విధంగా అణచివేస్తారు. ఈ నమ్మకం అసత్యమైనదవుతుంది ; దాని అడుగున అపనమ్మకం రగులుతూ వుంటుంది. ఈ నమ్మకం పైపైన ఉన్నది. పైన ఒక శిథిలమైపోయిన కప్పు వుంది ; దాని అడుగున, అపనమ్మకపు, అనుమానపు బొగ్గులు. త్వరలోనే అవి మీ నమ్మకాన్ని కాల్చేస్తాయి. ఈ నమ్మకం నిరుపయోగమైనది, మీరు దానిని లోతైనదిగా చేయలేరు. నమ్మకం వుంది, లేదా నమ్మకం లేదు.

అది ఎవరైనా ఓ వృత్తాన్ని గీస్తున్నట్లుగా ఉంటుంది. అతను సగం వృత్తాన్ని గీస్తే కనుక మీరు దానిని ఒక వృత్తం అని పిలుస్తారా ? సగం వృత్తాన్ని వృత్తం అని పిలువవచ్చా ? అది వృత్తంలోని ఒక భాగం, వృత్తం కాదు. అది పూర్తి అయినప్పుడే దానిని ఒక వృత్తం అని పిలువవచ్చు. ఒక అసంపూర్ణ వృత్తం అనేది వృత్తం కాదు. అసంపూర్ణమైన నమ్మకం అనేది నమ్మకం కాదు, ఎందుకంటే అసంపూర్ణమైన నమ్మకం అంటే అపనమ్మకం కూడా వుంది అని అర్థం. వృత్తంలోని ఒక శూన్య భాగంలో, ఏమి సంభవిస్తుంది ? అనుమానం వుంటుంది. అనుమానం మరి నమ్మకం కలిసి ముందుకు సాగలేవు. అది ఒక పాదం తూర్పు వైపుకు వెళుతున్నట్లు, మరొక పాదం పశ్చిమానికి వెళుతున్నట్లు ఉంటుంది ... మీరు ఎక్కడికీ చేరుకోరు. అది రెండు పడవలపై ప్రయాణిస్తున్నట్లుగా ఉంటుంది, ఒకటి ఈ తీరానికి వెళ్తోంది మరి ఒకటి ఆ తీరానికి వెళుతోంది ... మీరు ఎక్కడకు వెళతారు ?

అనుమానం మరి నమ్మకాల యొక్క పయనాలు పూర్తి భిన్నంగా ఉంటాయి. మీరు రెండు పడవలలో ప్రయాణిస్తున్నారు. అసంపూర్ణ విశ్వాసం యొక్క భావం ఏమిటి ? సగం నమ్మకం అంటే భావం సగం అపనమ్మకం కూడా వుంది అనేదేనా? విశ్వాసం అనేది దాని సంపూర్ణతలో ఉంటుంది, లేదా అది ఉండదు.

మరి ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోండి : ఉన్నతమైనది ఎప్పుడు అధమమైన దానితో మిశ్రితమైనా, అధమమైనది ఏమీ కోల్పోదు, కానీ ఉన్నతమైనది కోల్పోతుంది. మీరు ఉన్నతమైనదానిని అధమమైనదానితో కలిపినప్పుడు అధమమైన దానికి ఏ హాని వుండదు, కానీ ఉన్నతమైనది హాని చేయబడుతుంది.

ఒక విందు సిద్ధం చేయబడింది, పసందైన ఆహార పదార్థాలు పరచివున్నాయి. దానిపై కేవలం పిడికెడు మురికిని చల్లండి. అది ఒక విస్తారమైన విందు, ఒక చిన్న పిడికెడు మురికి ఏం చేయగలదు అని మీరు అనవచ్చు. కానీ ఒక చిన్న పిడికెడు మురికి విందునంతటినీ నాశనం చేస్తుంది. అయినప్పటికీ ఒక విందు సమస్తమూ ఈ చిన్న పిడికెడు మురికిని సైతం నాశనం చేయలేదు.

ఒక పువ్వుపై ఓ రాయిని విసరండి. మరి ఆ రాయికి ఏమీ జరగదు, కానీ ఆ పువ్వు నాశనమైపోతుంది. రాయి అధమమైనది, జీవం లేనిది. పువ్వు శోభస్కరమైనది, జీవంతో నిండి వున్నది. పువ్వు ఆకాశానికి చెందినది, రాయి అవనికి చెందినది. పువ్వు జీవితపు కవిత్వం. ఆ పువ్వు మరి రాయి ఒకదానినొకటి తాకినప్పుడు పువ్వు పూర్తిగా చిదిమివేయబడుతుంది, రాయి పూర్తిగా చిన్న గీతా కూడా పడకుండా వుంటుంది.

ఒక్క చుక్క విషం చాలు. గుర్తుంచుకోండి, అనుమానం అనేది అధమమైనది. నమ్మకం అనే పువ్వుపై అనుమానం అనే రాయి పడితే కనుక, ఆ పువ్వు చిదిమివేయబడుతుంది మరి మరణిస్తుంది, ఆ పువ్వు హతమార్చబడుతుంది. నమ్మకం అనేవి ఆ రాయిని రూపాంతరం చెందిస్తుంది అని అనుకోకండి. ఆ రాయి పువ్వును నాశనం చేస్తుంది.

అయితే నమ్మకం వుంది లేదా అది లేదు... అక్కడ రెండు సంభావ్యతలు ఉండవు. నమ్మకం అనేది ఉన్నప్పుడు, అది మీ జీవితమంతటినీ పరివేష్టించి వుంటుంది, అది ప్రతీ కణంలోకీ వ్యాపిస్తుంది. నమ్మకం అనేది విస్తరించేది. కానీ అటువంటి నమ్మకం పవిత్ర గ్రంథాలనుంచి రాదు. అది రాలేదు. అటువంటి నమ్మకం జీవితానుభవం నుంచి వస్తుంది. మీరు జీవితపు పవిత్ర గ్రంథాన్ని " చదివినప్పుడు " అది వస్తుంది, అష్టావక్రుడు చెప్పినది చదవడం వలన కాదు.

అష్టావక్రుడిని అవగాహన చేసుకోండి, కానీ ఈ అవగాహనను ప్రజ్ఞ అని అనుకోకండి. అష్టావక్రుడిని అవగాహన చేసుకోండి, మరి దీనిని మీ అంతరంగంలోని ఏదో మూలన భద్రపరచుకోండి. మీరు ఒక గీటురాయిని అందుకున్నారు. మీరు అందుకున్నది ప్రజ్ఞ కాదు, ఒక గీటురాయి. మరి మీరు ప్రజ్ఞను సిద్ధించుకున్నప్పుడు, మీరు అష్టావక్రుని యొక్క గీటురాయితో దానిని సులభంగా పరిక్షించుకోవచ్చు.

ఆ గీటురాయి తానే బంగారం కాదు. మీరు ఒక స్వర్ణకారుడి వద్దకు వెళ్ళినప్పుడు అతను ఒక నల్లటి పరీక్షించే - రాయిని కలిగి వుండడం మీరు చూస్తారు. ఈ నలుపురాయి బంగారం కాదు. అతను బంగారాన్ని అందుకున్నప్పుడు, ఆ

స్వర్ణకారుడు అది బంగారమా లేక కాదా అనేది కనుగొనడానికి దానిని ఈ నలుపురాయిపై రుద్దుతాడు.

మీరు అష్టావక్రుని మాటల గురించిన అవగాహనను కలిగివున్నప్పుడు దానిని ఒక గీటురాయిగా భద్రపరచుకోండి, దానిని మీ అంతరంగంలో లోతుగా వుండనివ్వండి. మరి మీ జీవితానుభవం వచ్చినప్పుడు మీరు దానిని పరీక్షించుకోవచ్చు. అప్పుడు అష్టావక్రుడి యొక్క గీటురాయి సహాయకరం అవుతుంది. ఏమి సంభవించిందో మీరు తెలుసుకోగలుగుతారు. దానిని అవగాహన చేసుకోగల భాషను మీరు కలిగివుంటారు. దానిని అవగాహన చేసుకోగల ఓ విధానాన్ని మీరు కలిగివుంటారు. అష్టావక్రుడు మీకు సాక్షిగా వుంటాడు.

నేను పవిత్ర గ్రంథాలను ఈ విధంగానే తీసుకుంటాను. ఆ పవిత్ర గ్రంథాలు సాక్షులు. సత్యమార్గం అవిదితమైనది. ఆ అవిదిత మార్గంపై మీకు సాక్షులు అవసరమవుతారు. మీరు సత్యంతో మొట్టమొదటిసారి ముఖాముఖిగా వచ్చినప్పుడు, సత్యం ఎంత విస్తారమైనదిగా వుంటుందంటే మీరు వణికిపోతారు, మీరు దానిని అందుకోలేరు. మీరు మీ మూలాలదాకా కంపించిపోతారు. మీరు పిచ్చివారు అయిపోవచ్చుననే భయం వుంటుంది.

జన్మజన్మలుగా ఒక నిధిని అన్వేషిస్తున్న ఓ మనిషి మరి అకస్మాత్తుగా ఆ నిధి తాను నిలబడి వున్న చోటే పాతిపెట్టబడి వుంది అనేది కనుగొన్నప్పుడు ఆ మనిషికి ఏం జరుగుతుందో ఊహించండి ... అతను పిచ్చివాడైపోడూ ? " ఎన్నో జన్మల ఈ అన్వేషణ వ్యర్థమైనది ! ఆ నిధి సరిగ్గా నా పాదాల కిందే పాతిపెట్టబడి వుంది !"

కేవలం ఊహించండి. ఈ మనిషికి అది ఒక భయంకరమైన ఘాతం అవుతుంది. " నేను ఎన్నో సంవత్సరాలు వృధా చేశాను ! ఈ సమయమంతా ఒక నిరర్థక ప్రయత్నం, ఒక దుస్స్వప్నం అయివుంది. నేను అన్వేషిస్తున్నది అంతరంగంలోనే నిరీక్షిస్తోంది." అంతటి ఘాతం వలన ఒక మనిషికి పిచ్చిపట్టిపోదూ ? అలాంటి సమయంలో అష్టావక్రుడి యొక్క మధురమైన మాటలు మీకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. అలాంటి సమయంలో వేదాంతం, ఉపనిషత్తులు, బైబిలు, ఖురాను, బుద్ధుడు, మీకు సాక్షులుగా నిలుస్తారు. ఆ పరిస్థితిలో మీకు సంభవిస్తున్న నూతన అనుభవాలను మీరు గ్రహించలేరు. ఏకాంతంలో అది అత్యంత కష్టతరం.

నేను పవిత్ర గ్రంథాలను గురించి ప్రసంగిస్తున్నాను ... ఆ పవిత్ర గ్రంథాలను వినడం ద్వారా మీరు అప్పుడు జ్ఞానులవుతారు అని కాదు. మీరు ధ్యాన మార్గంపై ముందుకు సాగుతున్నప్పుడు, ఆ సంభవం చోటు చేసుకున్నప్పుడు ... ఈ రోజు

కాకపోతే, అప్పుడు రేపు అది సంభవిస్తుంది. అది సంభవించి తీరాలి ... మీ ముందు బంగారం వున్నా కూడా మరి మీరు గ్రహించలేకపోవడం అనేది జరుగకుండా ఉండేందుకు నేను వాటిపై ప్రసంగిస్తున్నాను.

నేను మీకు ఒక గీటురాయిని ఇస్తున్నాను. ఈ గీటురాళ్ళపైన మీ అనుభవాలను పరీక్షించుకోండి.

అష్టావక్రుడు అత్యంత స్వచ్ఛమైన గీటురాయి. మీరు అష్టావక్రుడిని విశ్వసించనవసరం లేదు, మీరు మీ స్వీయానుభవాల కోసం అష్టావక్రుడిని ఒక గీటురాయిలా వినియోగించుకోవాలి. అష్టావక్రుడిని ఒక సాక్షిగా చేసుకోండి.

జీసస్ తన శిష్యులకు చెప్పాడు, " మీరు వచ్చినప్పుడు నేను మీకు సాక్షిగా వుంటాను." కానీ అతని శిష్యులు అపార్థం చేసుకున్నారు. శిష్యులు అర్థం చేసుకున్నది ఏమిటంటే తాము మరణించి మరి భగవంతుడి యొక్క స్వర్గానికి వచ్చినప్పుడు, తాము అతని శిష్యులేనని జీసస్ సాక్ష్యాన్ని ఇస్తాడు : " వాళ్ళను లోనికి రానివ్వండి... వాళ్ళు నావాళ్ళు, వాళ్ళు క్రైస్తవులు. వాళ్ళ పట్ల ప్రధానంగా కరుణను చూపండి. వాళ్ళపై అనుగ్రహాన్ని అధికంగా వర్షించనివ్వండి."

కానీ జీసస్ ఉద్దేశ్యం పూర్తిగా విభిన్నమైనది. జీసస్ అన్నాడు, "మీరు వచ్చినప్పుడు నేను మీకు సాక్షిగా వుంటాను "... దీని భావం జీసస్ అక్కడ నిలబడి వుంటాడు అని కాదు, కానీ దాని భావం ఏమిటంటే జీసస్ ఏదైతే చెప్పాడో అది ఒక గీటురాయిలా అక్కడ వుంటుంది. మీ అనుభవం సంభవించినప్పుడు, వెంటనే మీరు దానిని పరీక్షించుకోవచ్చు మరి ఆ ముడిని విప్పవచ్చు. ఉన్నది ఉన్నట్లుగా, మీరు అసత్యంలో ఎంత సుదీర్ఘకాలం నలుదిక్కులా సంచరించారంటే మీ కళ్ళు దానికి అలవాటు పడిపోయాయి. సత్యం యొక్క అఘాతం మిమ్మల్ని చీలికలుగా చేయకూడదు, మిమ్మల్ని ఉన్మాదులను చేయకూడదు.

గుర్తుంచుకోండి, అనేకమంది సత్యాన్వేషులు ఉన్మాదులైపోయారు. వాళ్ళు జ్ఞానోదయాన్ని పొందబోయే స్థితికి దగ్గరగా రాగానే అనేకమంది సత్యాన్వేషకులు ఉన్మాదులైపోయారు. వాళ్ళు వెర్రివారైపోయారు. ఇది ఎందువలనంటే ఆ సంభవం ఎంతో విస్తారమైనది, అది అనూహ్యమైనది, అవిశ్వసనీయమైనది. అది మిన్నంతా మీపై విరిగి పడినట్లుగా ఉంటుంది.

మీ నీటి కుండ చిన్నది, మరి ఆ అనంతం దానిలోకి ఒంపబడుతోంది. మీరు తునాతునకలైపోతారు ... మీరు దానిని ఇముడ్చుకోలేరు. మీరు సూర్యుడితో

ముఖాముఖిగా వున్నారు మరి మీ కళ్ళు మిరుమిట్లు గొలుపుబడుతాయి. మరి అనంతరం అంధకారమైపోతాయి. సూర్యుడు మీ ముందు వున్నాడు మరి అంతా అంధకారంగా వుంది, మీ కళ్ళు మూసుకుపోతాయి. ఆ క్షణంలో సూర్యుడిని అవగాహన చేసుకోవడానికి మీరు అష్టావక్రుని యొక్క వివరణములను వినియోగించుకోవచ్చు. ఆ సమయంలో మీ అచేతనంలో దాగి వున్న అష్టావక్రుడి యొక్క స్వరం వెంటనే మాట్లాడుతుంది. ఉపనిషత్తు యొక్క సూత్రాలు ప్రతిధ్వనించడం ప్రారంభిస్తాయి. భగవద్గీత మారుమ్రోగుతుంది, ఖురాన్ మారుమ్రోగుతుంది ... దాని చరణాలు ముందుకు వస్తాయి ! మీరు స్వగృహానికి వచ్చారనీ, భయపడాల్సినది ఏమీ లేదనీ ; ఈ విస్తారతే మీరు అనీ వాటి సౌరభం మీకు అభయానిస్తుంది.

అష్టావక్రుడు చెబుతున్నది ఏమిటంటే మీరే వికాసం, మీరే విస్తారత. మీరు సర్వ వ్యాపకులు. మీరు కర్మశూన్యులు, నిష్కపటమైనవారు. అత్యున్నత వాస్తవమే మీరు.

ఆ సమయంలో ఈ వివరణలు మీకు కొంత అర్థాన్ని కలిగి వుంటాయి. కేవలం వాటి పట్ల నమ్మకాన్ని కలిగివుండడం, కేవలం వాటిని పట్టుకుని వేళ్ళాడడం, మిమ్మల్ని ఎక్కడకూ చేర్చదు. మరి ఆత్మ-సిద్ధి ఇంకా సంభవించలేదు అని అంటూ, మీ అత్యాశ మిమ్మల్ని అంతరంగంలో నుంచి తోస్తూ వుంది.

ఒక కవి అన్నాడు :

కోరికను నియంత్రించుకోవడానికి,
పాములను ఆడించేవాడి పిల్లంగ్రోవి ఒక సంగీత ధారను అల్లుతోంది-
ఆహా ! దీనిలోనే
ఎంత విచిత్రమైన గాఢమోహం కంపిస్తోంది !

దానిని మళ్ళీ వినండి:

కోరికను నియంత్రించుకోవడానికి,
పాములను ఆడించేవాడి పిల్లంగ్రోవి ఒక సంగీత ధారను అల్లుతోంది -
ఆహా ! దీనిలోనే
ఎంత విచిత్రమైన గాఢమోహం కంపిస్తోంది !
అందువలనే చుట్టచుట్టుకున్న ఆ త్రాచు చలనరహితంగా వుంది.
కేవలం శిరస్సు మాత్రమే ముందుకు మరి వెనుకకు ఊగుతోంది.

మీరు కోరిక నుంచి స్వతంత్రులు కావాలనుకుంటారు, అయినాగానీ మీరు కోరికల వలను పరుస్తారు. మీరు పూర్తిగా పరిశుద్ధులు మరి నిర్మలమైనవారుగా కావాలనుకుంటారు, అయినాగానీ మీరు అత్యాశ వలనే అది చేస్తారు, ఇంకా కోరిక మీలో కదలాడుతూనే వుంటుంది.

"విచిత్రమైన ప్రగాఢకాంక్ష ఎలా కంపిస్తోందో చూడండి ... చుట్ట చుట్టుకున్న పాము చలనరహితంగా వుంది, ఇప్పుడు కేవలం శిరస్సు మాత్రమే ముందుకు మరి వెనుకకు ఊగుతోంది.

మీరు దివ్యత్వాన్ని సిద్ధించుకోవడానికి బయలుదేరారు, కానీ మీరు సిద్ధించుకోవాలనుకునే విధానం డబ్బు సంపాదించే విధానంలానే వుంది. మీరు దైవాన్ని అన్వేషించడానికి వెళతారు, కానీ మీ కోరిక, మీ మోహం భౌతిక విషయాల వెంట పడుతున్న వారి లాగానే వుంది. మీ ఉన్మాదం ప్రపంచాన్ని పొందాలనుకునేవారి ఉన్మాదంలానే వుంది. కోరిక యొక్క వస్తువు మారింది, కానీ స్వయంగా ఆ కోరిక అనేది మారలేదు.

అష్టావక్రుడు చెప్పినది విని మీ కోరిక అంటుంది: "ఆహా, ఇది మహత్తరమైనది! నేను దేనిని అన్వేషిస్తున్నానో అది ఇప్పటికే సిద్ధించిందని నాకు ఎన్నడూ తెలియదు. కనుక ఇప్పుడు నేను కేవలం ఊరికే కూర్చుంటాను." అప్పుడు మీరు నిరీక్షిస్తారు : "ఇప్పటికి అది సంభవించిందా ? ఇప్పటికి అది సంభవించిందా? ఇప్పటికి అది సంభవించిందా ?" మీరు అవగాహన చేసుకోలేదు.

అష్టావక్రుడు చెబుతున్నది మళ్ళీ వినండి. అది ఇప్పటికే సిద్ధించింది అని అష్టావక్రుడు చెబుతున్నాడు. కానీ మీరు దానిని ఎలా వినగలరు, మీరు దానిని ఎలా అవగాహన చేసుకోగలరు? మీ కోరిక కంపిస్తూనే వుంటుంది.

మీరు మీ కోరికల వెంటపడి తరిమే వరకూ ... వాటి వెంట పడడంలోని అయోగ్యతను మీరు చూసేంతవరకూ, పరుగెత్తి మరి కింద పడిపోయి మిమ్మల్ని మీరు గాయపరుచుకునేంతవరకూ, మీరు అవగాహన చేసుకోలేరు. కేవలం కోరిక యొక్క అనుభవం ద్వారా మాత్రమే కోరిక అనేది నిస్సారమైనది అవుతుంది. అలసిపోయి, అది బద్దలై నేలరాలిపోతుంది. ఈ కాంక్షారహిత క్షణంలోనే మీరు దేనినైతే అన్వేషిస్తున్నారో అది ఇప్పటికే సంభవించింది అని మీరు అవగాహన చేసుకుంటారు.

లేదంటే మీరు ఒక చిలుకలా పునరుక్తం చేస్తుంటారు. మీరు ఒక హిందూ చిలుకా లేక మహమ్మదీయ చిలుకా లేక ఒక జైన, ఒక క్రైస్తవ, ఒక బౌద్ధ చిలుకా అనేదాని వలన అతి స్వల్ప వ్యత్యాసం కూడా వుండదు ... చిలుక అనేది చిలుకే. ఒక చిలుక బైబిలును అప్పగించవచ్చు. ఒక చిలుక ఖురానును కంఠస్థం చేయవచ్చు. చిలుక అనేది చిలుకే, అది పునరుక్తం చేస్తూ పోతుంది.

ఆలయంలోని వారందరూ స్నానమాచరించి, పైపూతలతో వున్నారు,
పూర్తి స్థాయి స్వరంతో, మునిగిపోయి, తెరువబడి, బిగ్గర ధ్వనులతో,
స్పష్టమైన, హెచ్చు స్వరాలతో,
వాళ్ళు దైవాన్ని ప్రస్తుతిస్తూ పాడుతూనే వుంటారు.
అంతరంగంలో, అందరూ చెవిటివారే, మూగవారే,
అర్థంలేని పిచ్చి మాటలు మాట్లాడేవారే,
అవగాహన లేనివారే ; అజ్ఞానులే మరి సంకుచిత మనస్కులే.
కానీ బాహ్యంలో వాళ్ళు ఢాబులు పలుకుతుంటారు, బుద్ధిహీనులుగా వుంటారు.

ఆలయాలలో చూడండి !

ఆలయంలోని వారందరూ స్నానమాచరించి మరి పైపూతలతో వున్నారు,
పూర్తి స్థాయి స్వరంతో, మునిగిపోయి...

ప్రజలు ఆలయాలలో ఎంతో అమాయకులలా కనిపిస్తారు. మీరు మందిరాలలో చూసే అవే ముఖాలను విపణి వీధిలో చూడండి. వాళ్ళ ముఖాలు మందిరాలలో భిన్నంగా కనిపించాయి.

... బిగ్గర ధ్వనులతో,
స్పష్టమైన మరి హెచ్చు స్వరాలతో,
వాళ్ళు దైవాన్ని ప్రస్తుతిస్తూ పాడుతూనే వుంటారు.

ప్రజలు ఒక జపమాలను పట్టుకుని జపిస్తూండడాన్ని మీరు చూసే వుంటారు. 'రాము, రాము', అని ముద్రించబడివున్న ఒక శాలువాలో చుట్టబడి వుండి, నుదుటి పై గంధంతో ... ఎటువంటి మచ్చలేని, ప్రకాశవంతమైన రూపం ! మీరు అదే మనిషిని విపణి వీధిలో, సమూహాలలో, కలుసుకున్నప్పుడు, మీరు అతనిని గుర్తించలేరు. ప్రజలు విభిన్న ముఖాలను కలిగివుంటారు : వాళ్ళు విపణి వీధిలో ఒక ముఖాన్ని ధరిస్తారు, వాళ్ళు మందిరంలో మరొక ముఖాన్ని తగిలించుకుంటారు.

... మునిగిపోయి, తెరువబడి, బిగ్గర ధ్వనులతో,

స్పష్టమైన మరి హెచ్చు స్వరాలతో,

వాళ్ళు దైవాన్ని ప్రస్తుతిస్తూ పాడుతూనే వుంటారు.

అంతరంగంలో, అందరూ చెవిటివారే, మూగవారే, అర్థంలేని

పిచ్చిమాటలు మాట్లాడేవారే,

అవగాహన లేనివారే, అజ్ఞానులే మరి సంకుచిత మనస్కులే

కాని బాహ్యంలో వాళ్ళు డాబులు పలుకుతుంటారు, బుద్ధిహీనులుగా వుంటారు.

సమాచారం మిమ్మల్ని ఓ చిలుకగా తయారుచేయగలదు, మీకు ఓ పెద్ద నోటిని ఇవ్వగలదు. అది మీకు మతపరమైనవారమనే భ్రాంతిని ఇవ్వగలదు, వంచనలను ఇవ్వగలదు. కానీ అది ప్రజ్ఞ అని అనుకోకండి. మరి సమాచారం ఆధారంగా మీరు కలిగివుండే నిశ్చయం అనేది సందేహంపై కూర్చుని వుంటుంది, సందేహం యొక్క భుజాలపై స్వారీ చేస్తూ వుంటుంది. ఈ నిశ్చయం మిమ్మల్ని సత్యం యొక్క ద్వారాల వద్దకు చేర్చలేదు. ఈ నిశ్చయం పట్ల పెద్దగా నమ్మకం పెట్టుకోకండి ... అది నిరుపయోగమైనది.

మీ స్వీయానుభవం నుంచే నమ్మకం రావాలి. మీ స్వీయ ధ్యానం యొక్క స్వచ్ఛమైన కాంక్షరహిత స్థితిలో నుంచే నమ్మకం ఉద్భవించాలి.

రెండవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

నిన్న, సాయంసంధ్యవేళ ఆరుబయట నడుస్తూ ఉన్నప్పుడు, అకస్మాత్తుగా మీ ఉదయపు ప్రసంగమంతా నా దేహంలోని అణువణువులోనూ ప్రతిధ్వనించడం ప్రారంభించినట్లుగా నేను అనుభూతి చెందాను. గమనించేవాడి స్మృతి ఉదయించినప్పుడు, జరుగుతోన్న సన్నివేశాల యొక్క వైభవాన్ని ఓ వీక్షకుడిలా నేను చూస్తూ వున్నాను. గమనించేవాడి యొక్క ఈ క్రీడ కొంతసేపటివరకూ సాగింది. అనంతరం నా కాళ్ళు తడబడిపోవడం ప్రారంభించాయి మరి పడిపోకుండా ఉండేందుకు నేను బాట పక్కన కూర్చుండిపోయాను. మరి అప్పుడు అకస్మాత్తుగా సన్నివేశమూ మిగిలిలేదు వీక్షకుడూ మిగిలిలేడు, గమనించేవాడు సైతం మిగిలిలేడు. ప్రతీతీ అంతర్ధానమైపోయింది అయినాగానీ ఏదో వుంది ... కొన్నిసార్లు చీకటి, కొన్నిసార్లు వెలుగు దోబూచులాడుతున్నాయి. కానీ అప్పటినుంచి నేను మరింత ఆందోళన చెందుతున్నాను ఎందుకంటే నేను దీనినంతటినీ అవగాహన చేసుకోలేకపోతున్నాను.

నేను చెబుతున్నది సరిగ్గా ఇదే. సత్యం యొక్క ఓ స్వల్ప క్షణ దర్శనం మీ వద్దకు వస్తే కనుక, మీరు కలత చెందుతారు. మీరు అవగాహన చేసుకోలేరు. దానిని అవగాహన చేసుకోలేకపోవడం వలన, ఒక లోతైన అసౌఖ్యం మిమ్మల్ని చేజిక్కించుకుంటుంది : ఉన్మాదం సైతం మిమ్మల్ని వెంటతరిమి పట్టుకోగలదు.

ఇందువలనే నేను ఈ పవిత్ర గ్రంథాల గురించి ప్రసంగిస్తాను. ఇందువలనే నేను ప్రతిరోజూ వివరిస్తూంటాను, ఆ సమాచారం మీ అచేతనంలో ఉండేందుకు, మరి ఆ సంభవం చోటు చేసుకున్నప్పుడు మీరు దానిని అర్థం చేసుకోగలుగుతారు, ఏమి సంభవించిందో మీరు స్పష్టంగా నిర్వచించగలుగుతారు. లేదంటే, మీరు దానిని ఎలా గ్రహించగలుగుతారు ? మీరు ఆ భాషను, ఆ మాటలను కలిగివుండరు ; మీకు దానిని అవగాహన చేసుకోగల మార్గం వుండదు ; ఏ కొలబద్దా లేదు, ఏ కొలమానాలూ లేవు ... మీరు దానిని ఎలా కొలుస్తారు ? మీ వద్ద ఏ గీటురాయీ వుండదు. మీరు దానిని ఎలా వెలకట్టగలరు ?

మీరు అన్నారు : " మీ ఉదయపు ప్రసంగమంతా నా దేహంలోని అణువణువులోనూ ప్రతిధ్వనించడం ప్రారంభించినట్లుగా నేను అనుభూతి చెందాను. గమనించేవాడి స్మృతి ఉదయించినప్పుడు, జరుగుతోన్న సన్నివేశాల యొక్క వైభవాన్ని ఓ వీక్షకుడిలా నేను చూస్తూ వున్నాను. గమనించేవాడి యొక్క ఈ క్రీడ కొంతసేపటి వరకూ సాగింది, అనంతరం నా కాళ్ళు తడబడిపోవడం ప్రారంభించాయి మరి పడిపోకుండా ఉండేందుకు నేను బాట పక్కన కూర్చుండిపోయాను."

నిశ్చయంగానే ఇది సంభవిస్తుంది. ఈ గమనించేవాడి పట్ల మీకు మొదటిసారిగా ఎరుక కలిగినప్పుడు, మీరు తడబడతారు. మీ జీవితమంతా ఊగిపోతుంది, ఎందుకంటే మీ జీవితమంతా ఆ గమనించేవాడు లేకుండానే స్థాపించబడింది. ఈ నూతన సంభవం అన్నింటినీ నాశనం చేస్తుంది. అది అకస్మాత్తుగా కళ్ళు తెరుచుకున్న ఓ గుడ్డివాడిలాగా వుంటుంది : బాటపై అతను నడవగలుగుతాడు అని మీరు అనుకుంటున్నారా ? అతను తడబడిపోతాడు. నలభై, యాభై సంవత్సరాలు అంధుడిగా, అతను తన కర్ర సహాయంతో మార్గాన్ని అనుభూతి చెందాడు. తన అంధతలో అతను క్రమక్రమంగా అంధకారంలో నడవగల సామర్థ్యాన్ని పెంపొందించుకున్నాడు. అతను నైపుణ్యంగలవాడు అయ్యాడు. అతను తన చుట్టు ప్రక్కల ధ్వనులకు అర్థాన్ని అన్వయించుకున్నాడు. అతను ఆ బాటలలోని మలుపులను తెలుసుకున్నాడు. అతను తన చెవులతో చూడగల కళను నేర్చుకున్నాడు. యాభై సంవత్సరాలుగా అంతా చక్కగా జరుగుతోంది.

అంధుడి యొక్క ఈ జీవితం ... దానిని మీరు ఊహించనైనా ఊహించలేరు... కాంతి, వర్ణం, సౌందర్యం, రూపం విహీనపరచబడినవారు ; అది కేవలం ధ్వని యొక్క మాధ్యమంపైనే ఆధారపడి వుంటుంది. అతను కేవలం ఒకే ఒక్క భాషను కలిగి వున్నాడు : ధ్వని. అతను ఈ ఆధారంపైనే తన సమస్త జీవితాన్నీ సృష్టించుకున్నాడు. ఉదయం విపణి వీధికి వెళుతోన్నప్పుడు అకస్మాత్తుగా అతని కళ్ళు తెరుచుకున్నట్లయితే, ఏమి జరుగుతుందో ఊహించండి. అతని ప్రపంచం కుప్పకూలిపోతుంది. అతని ధ్వని ప్రపంచం పూర్తిగా తలక్రిందులైపోతుంది.

ఈ ఘటన ఎంత శక్తివంతమైనదిగా వుంటుందంటే కళ్ళు తెరుచుకోవడం, ప్రజల యొక్క ముఖాలను చూడడం, రంగులను, సూర్యకిరణాలను, ఎండ మరి నీడను, ఈ సమూహాన్ని చూడడం ; ఎంతోమంది ప్రజలు, బస్సులు, కార్లు, సైకిళ్ళు... అతను పూర్తిగా బెదిరిపోతాడు ! అది అతని జీవితానికి ఎంతో పెద్ద అఘాతం అవుతుంది. ధ్వనిపై ఆధారితమై అతను సృష్టించుకున్న చిన్న ప్రపంచం మాయమైపోతుంది, తుడిచిపెట్టుకుపోతుంది, మరణిస్తుంది, అది చిదిమివేయ బడుతుంది. అతను ఆ ప్రదేశంలోనే వణికిపోతూ కూర్చుంటాడు. అతను తడబడి మరి పడిపోవచ్చు. బహుశా అతను ఇంటివరకూ చేరలేడు... బహుశా అతను స్పృహ తప్పి పడిపోవచ్చు.

మరి ఈ ఉదాహరణ అసలేమీ కాదు. మీ జీవితంలోకి గమనించేవాడి ప్రవేశం జరిగినప్పుడు, కేవలం ఆ గమనించేవాడి యొక్క ఒక్క కిరణం మాత్రమే వచ్చినప్పుడు, అప్పుడు ఈ ఉదాహరణ అసలేమీ కాదు ... ఆ ఘటన ఎంతో ఘనమైనది. అంతర్నేత్రం తెరుచుకుంటోంది. అంతర్నేత్రం లేకుండానే మీరు మీ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు, మరి ఆ అంతర్నేత్రం అకస్మాత్తుగా తెరుచుకున్నప్పుడు అది ఇప్పటివరకూ వున్న మీ జీవితమంతటినీ అసంగతమైనదిగా చేస్తుంది. మీరు ఆశ్చర్యంలో నోటమాటరానివారు అయిపోతారు.

మీరు సరిగ్గానే అడిగారు, మరి అనుభవం నుంచి అడిగారు. రెండు రకాల ప్రశ్నలనూ పరిగణించండి. ఒకటి సిద్ధాంతపరమైనది ... దానికి పెద్ద విలువ లేదు. కానీ ఈ ప్రశ్న అనుభవం నుంచి వచ్చినది. అనుభవం అనేది లేకపోతే కనుక ఈ ప్రశ్న ఉదయించి ఉండేది కాదు. ఈ కాళ్ళు తడబడి వుండకపోతే కనుక, ఈ ప్రశ్న ఉదయించి ఉండేదే కాదు. ఈ ప్రశ్న ప్రత్యక్షానుభవం నుంచి వచ్చింది.

"...గమనించేవాడి స్మృతి ఉదయించింది." అష్టావక్రుడి మాటలు మారుమ్రోగి వుంటాయి. నేను ఉదయం చెప్పిన దాని యొక్క ప్రతిధ్వని మిగిలి వుండుంటుంది.

దాని పరిమళం మీలో జనించి వుంటుంది, నేను చెప్పిన దాని యొక్క కొన్ని పోగులు మీలో వేళ్ళాడుతూ ఉండుంటాయి.

"...గమనించేవాడి స్మృతి ఉదయించింది. గమనించేవాడి యొక్క ఈ క్రీడ కొంతసేపటివరకూ సాగింది...." బహుశా అది కేవలం ఒక్క క్షణమే అయివుంటుంది. గమనించేవాడి యొక్క ఒక్క క్షణం అత్యంత సుదీర్ఘమైనదిగా కనిపిస్తుంది, ఎందుకంటే గమనించేవాడు కాలానికి అతీతమైనవాడు. ఇక్కడ మీ గడియారంలో కేవలం ఒక్క క్షణం మాత్రమే గడుస్తుంది ; అక్కడ, గమనించేవాడుగా, శతాబ్దాలు గడిచినట్లుగా ఉంటుంది. అక్కడ ఈ గడియారం ఏ విధంగానూ ఉపయోగపడదు. ఈ గడియారం అంతర్నేత్రం కోసం రూపొందించబడినది కాదు.

"గమనించేవాడి యొక్క ఈ క్రీడ కొంతసేపటి వరకూ సాగింది, అనంతరం నా కాళ్ళు తడబడిపోవడం ప్రారంభించాయి మరి పడిపోకుండా ఉండేందుకు నేను బాట పక్కన కూర్చుండిపోయాను." అది సంభవించింది అనేదానిని ఈ తడబాటు సూచిస్తోంది. ప్రశ్నిస్తున్న వ్యక్తి తను విన్నదాని నుంచి లేదా చదివిన దాని నుంచి ఒక ప్రశ్నను అడగలేదు... ఏదో బహిర్గతమయ్యింది.

"మరి అప్పుడు అకస్మాత్తుగా సన్నివేశమూ మిగిలి లేదు వీక్షకుడూ మిగిలి లేడు, గమనించేవాడు సైతం మిగిలి లేడు." ఆ తడబాటులో ప్రతీదీ చెల్లాచెదురైపోయింది, ప్రతీదీ మాయమైపోయింది. మెల్లనైన సన్నద్ధత లేకపోతే కనుక అటువంటి సమయంలో ఉన్మాదం కలుగవచ్చు. మనం దానిని ఒక్కో బిందువుగా లోనికి గ్రహించలేకపోతే కనుక, అది ఆకస్మికంగా సంభవిస్తే కనుక, ఒక విస్ఫోటనం కలుగవచ్చు.

"ప్రతీదీ అంతర్ధానమైపోయింది అయినాగానీ ఏదో వుంది." నిశ్చయంగానే ఏదో వుంది. వాస్తవానికి ప్రతీదీ మొట్టమొదటిసారిగా వుంది. మీదైన ప్రతీదీ ముగిసిపోయింది, గడ్డి పరకలతో చేసిన మీ చిన్న ఇల్లు పడిపోయింది. ఆకాశం, చంద్రుడు మరి తారలు ... అత్యున్నతమే మిగిలింది. మీరు గీసిన ఆ గీతలు, ఆ సరిహద్దులన్నీ మాయమైపోయాయి... మేఘాలు లేని ఆకాశమే మిగిలింది. ఒక పరిమిత కవచంలో నివసించడమనే మీ తర్ఫీదు దిటవు కోల్పోయింది. ఈ తడబాటు వలన మీరు భయపడిపోయారు మరి బాట ప్రక్కన కూర్చుండిపోయారు. నిశ్చయంగానే ఏదో వుంది. ఆ అనుభవం ఒకరిని మాటలు రానివారుగా చేస్తుంది. దానిని గ్రహించలేరు : అది ఏమిటి, అది ఎవరు ?

మీరు గమనించారా ?... మీరు గాఢనిద్రలో ఉన్నప్పుడు కొన్నిసార్లు ఏదో మిమ్మల్ని అకస్మాత్తుగా మేల్కొలుపుతుంది. ఉదయం అయిదు గంటలకు మీరు గాఢ నిద్రలో వున్నారు, గాఢనిద్రా సమయం, అప్పుడు అకస్మాత్తుగా ఏదో మిమ్మల్ని నిద్రలేపుతుంది. ఏదో ధ్వని, వీధిలో ఏదో బాణసంచా మ్రోగుతుంది, ఒక కారు మీ తలుపులోకి దూసుకొస్తుంది : మిమ్మల్ని వెంటనే నిద్రలేపే ఏదో ధ్వని. తక్షణమే! మీరు అవ్యవధిగా నిద్రలో నుంచి మెలకువలోకి దూకుతారు. నిద్ర లోతుల నుంచి మీరు ఒక బాణంలా దూసుకొస్తారు. సామాన్యంగా మనం గాఢ నిద్రలోనుంచి బయటకు వచ్చినప్పుడు మనం అతి నెమ్మదిగా వస్తాం. మొదట గాఢనిద్ర వదిలిపోతుంది, తరువాత కలలు నెమ్మదిగా తేలుతుండడం ప్రారంభిస్తాయి. అప్పుడు మనం కొద్దిసేపు కలల్లోవుంటాము.

మీ ఉదయపు కలలను మీరు గుర్తుంచుకోగలరు, కానీ మీయ మీ రాత్రి కలలను స్మృతికి తెచ్చుకోలేరు, ఎందుకంటే ఉదయపు కలలు ఎంతో తేలికగా వుంటాయి. మరి నిద్రకూ మెలకువకూ సరిగ్గా మధ్య దారిలో వుంటాయి. అప్పుడు క్రమక్రమంగా కలలు మాయమైపోతాయి. అప్పుడు సగం చెదిరిన నిద్ర వుంటుంది: మీరు ఒక క్షణం మెలకువగా వుంటారు, ఒక క్షణం మళ్ళీ నిద్రావస్థలో వుంటారు ; మేల్కొని వున్నట్లుగా మీరు దొర్లుతూంటారు... మధ్య మీ సతీమణి తేనీరు తయారు చేయడం మీరు వింటారు, ఒక గిన్నె కింద పడుతుంది, పాలవాడు వస్తాడు, వీధిలో ఎవరో వెళుతుంటారు, పనిమనిషి తలుపు కొడుతుంది, పిల్లలు పాఠశాలకు తయారవుతున్నారు. అప్పుడు మీరు మళ్ళీ దొర్లుతారు మరి మరోసారి లోతులలోకి జారిపోవడం మొదలుపెడతారు. ఈ విధంగా మీరు అతి నెమ్మదిగా ఉపరితలంపైకి వస్తారు. అప్పుడు మీరు మీ కళ్ళను తెరుస్తారు.

కానీ అకస్మాత్తుగా ఏదైనా జరిగినట్లయితే, మీరు ఆ లోతుల నుంచి ఒక బాణంలా నేరుగా మెలకువలోకి వస్తారు. మీ కళ్ళు తెరుచుకుంటాయి మరి మీరు ఆశ్చర్యపోతారు : నేను ఎక్కడ వున్నాను ? నేను ఎవరిని ? ఒక క్షణం పాటు ఏదీ స్పష్టంగా వుండదు.

ఏదో ఒకసారి ఇది మీ అందరికీ జరిగే వుంటుంది : మీరు ఆశ్చర్యపోతారు : నేను ఎవరిని ? మీ పేరు మరి చిరునామా సైతం పోయి వుంటాయి. నేను ఎక్కడ వున్నాను ? ఇది కూడా అస్పష్టంగానే వుంటుంది. మీరు అకస్మాత్తుగా ఏదో అన్యలోకానికి వచ్చినట్లుగా అది వుంటుంది. అది కేవలం క్షణకాలమే వుంటుంది, అప్పుడు మీరు కలిసి తిరిగి వస్తారు, ఎందుకంటే ఈ ఆఘాతం అంత పెద్ద

అఘాతమేమీ కాదు. మరి అప్పుడు కూడా మీరు దానికి అలవాటుపడి వున్నారు... అది ప్రతిరోజూ జరుగుతుంది. మీరు ప్రతీ ఉదయం నిద్రలేస్తారు. మీరు కలల ప్రపంచం నుంచి మెలకువ యొక్క ప్రపంచంలోనికి తిరిగి వస్తారు. ఈ వాడుక పురాతనమైనది, అయినా కొన్నిసార్లు అది అకస్మాత్తుగా జరిగినప్పుడు మీరు బిత్తరపోతారు మరి భయపడతారు.

వాస్తవంగా మేల్కొనడం సంభవించినప్పుడు మీరు పూర్తిగా మాటరానివారై పోతారు. ఏమి జరుగుతోందో మీకు అసలేమీ తెలియదు. ప్రతీదీ నిశ్శబ్దం మరి మౌనం అయిపోతుంది.

కానీ అది మంచిది. " సన్నివేశమూ మిగిలి లేదు వీక్షకుడూ మిగిలి లేడు, గమనించేవాడు సైతం మిగిలి లేడు. ప్రతీదీ అంతర్ధానమైపోయింది. అయినాగానీ ఏదో వుంది." మీరు ఈ ' ఏదో ' అనేదానిని గ్రహించేందుకు సహాయపడేందుకే నేను పవిత్ర గ్రంథాల గురించి ప్రసంగిస్తాను. మీరు దానికి తాత్పర్యాన్ని చెప్పుకోగల సమర్థులయ్యేందుకే. లేదంటే, అది మిమ్మల్ని ముంచివేయగలదు. మీరు ఒక వరదలో కొట్టుకుపోతారు. నిలిచేందుకు ఏ తావూ మీకు వుండదు. ఇందువలనే నేను అనేకానేక విషయాల గురించి మాట్లాడుతూ వుంటాను.

"ప్రతీదీ అంతర్ధానమైపోయింది. అయినాగానీ ఏదో వుంది... కొన్నిసార్లు చీకటి, కొన్నిసార్లు వెలుగు, దోబూచులాడుతున్నాయి. కానీ అప్పటి నుంచి నేను మరింత ఆందోళన చెందుతున్నాను ఎందుకంటే నేను దీనినంతటినీ అవగాహన చేసుకోలేకపోతున్నాను."

దానిని పరిరక్షించుకోండి, నేను మీకు చెబుతున్న దానిని కాపాడుకోండి. దానికోసం ఒక రత్నాల భరిణను రూపొందించండి. దానిని ప్రజ్ఞగా కాక కేవలం సమాచారంగానే తీసుకోండి. చైతన్యంతో దానికి ఒక భరిణను రూపొందించండి. అనుభవాలు సంభవించడం ప్రారంభమైనప్పుడు, నా మాటలు మీ అచేతనంలోనుంచి వచ్చి, మరి సంభవించిన అనుభవాలను స్పష్టమైనవిగా, గ్రాహ్యమైనవిగా చేయడాన్ని మీరు క్రమక్రమంగా కనుగొంటారు. నేను మీకు సాక్షిగా ఉంటాను.

కానీ మీరు వింటూన్నప్పుడు మీరు నాతో వాదిస్తే కనుక నేను మీకు సాక్షిని కాలేను ... మీరు వింటారు మరి మీరు నాకు వ్యతిరేకంగా ఒక అంతర్గత పోరాటాన్ని చేస్తున్నారు, నన్ను ప్రతివాదంతో ఖండిస్తున్నారు.

మీరు సానుభూతితో, ప్రేమపూర్వకంగా వినకుండా, వాదిస్తూ పోతే కనుక, అప్పుడు నేను మీకు సాక్షిగా వుండలేను. ఎందుకంటే అప్పుడు మీ భరిణలో మీరు ఏదైనా పెట్టినప్పుడు అది నాది కాదు అది మీదే అవుతుంది.

గత రాత్రి ఆస్ట్రేలియాకు చెందిన ఒక మనోవైజ్ఞానికుడు సన్యాసం తీసుకున్నాడు. నేను అతనికి చెప్పాను, "నువ్వు సన్యాసం స్వీకరించకపోయినా కూడా నీకు ఇక్కడ స్వాగతం లభిస్తుంది. కానీ అప్పుడు నువ్వు నా అతిథివి అవ్వవు. నువ్వు స్వాగతించబడ్డావు. కానీ నువ్వు సన్యాసం స్వీకరించినట్లయితే నువ్వు ఇక్కడకు స్వాగతించబడతావు మరి నువ్వు నా అతిథివి కూడా అవుతావు."

ప్రజలు నన్ను అడుగుతుంటారు, " మేము సన్యాసం స్వీకరించకపోతే కనుక మా పట్ల మీ ప్రేమ తక్కువగా వుంటుందా?" మీ పట్ల నా ప్రేమ సంపూర్ణమైనదిగా వుంటుంది. మీకు స్వాగతం ! కానీ మీరు సన్యాసం తీసుకున్న క్షణమే మీరు నా అతిథి కూడా అవుతారు. మరి అక్కడ ఒక గొప్ప వ్యత్యాసం వుంది. సన్యాసం తీసుకోకుండా మీరు దూరం నుంచి వింటారు. సన్యాసం స్వీకరించి మీరు చేరువకు వస్తారు.

మీరు సన్యాసం స్వీకరించకపోతే మీ వివేకం విశ్లేషిస్తూనే వుంటుంది, నేను చెప్పినదాని నుంచి ఎంపిక చేసుకుంటూనే వుంటుంది. మీ మనస్సుతో ఇమడగల దానిని మీరు స్వీకరిస్తారు. ఇమడనిదానిని మీరు బయటకు విసిరిపారేస్తారు. మరి సంభావ్యత ఏమిటంటే మీలో ఏదైతే ఇమిడిపోదో అదే మీకు ఉపయోగకరమైనది అయి వుంటుంది. మీ మనస్సుతో ఏకీభవించేదేదీ మిమ్మల్ని రూపాంతరం చెయ్యలేదు. అది మీతో ఏకీభవిస్తూంటే కనుక అది మీ గతంతో సమ్మతితో వుంది అనేదే దాని భావం. మీ గతంలో అమరిపోనిది అంతరంగంలో వుంది అనేదే దాని భావం. మీ గతంతో అమరిపోనిది అంతరంగంలో ఒక విప్లవానికి మూలకారణం అవ్వగలదు. మీతో ఇమిడిపోనిది రూపాంతరీకరించగలదు. మీతో పూర్తిగా ఇమిడిపోయినది మీరు ఉన్న విధంగానే మిమ్మల్ని బలోపేతం చేస్తుంది. మిమ్మల్ని రూపాంతరం చెందించదు. మీరు ఎంచుకుంటూ పోతారు. మీరు వివేకవంతులు అని మీరు అనుకుంటారు.

వివేకవంతులు కొన్నిసార్లు అత్యంత మూర్ఖమైన పనులు చేస్తారు. వాళ్ళు ఇక్కడ ఎంపిక చేస్తూ కూర్చుంటారు. వాళ్ళు ఎంచుకుంటూనే ఉంటారు. తమ దురభిమానాలకు తగిన విషయాలను వాళ్ళు పట్టుకు వేళ్ళాడతారు. మరి తమ దురభిమానాలకు ప్రతికూలమై వున్న వేటితోనూ వాళ్ళు ఏ సంబంధాన్నీ కలిగివుండరు. కానీ నేను మీకు మళ్ళీ చెబుదుతున్నది ఏమిటంటే మీలో ఇమిడిపోనట్లుగా కనిపిస్తున్నది

ఏదో ఒక రోజు ఉపయోగకరమైనది అవుతుంది. ఇప్పుడు మీకు దానిని అవగాహన చేసుకోగల మార్గమే లేదు. ఎందుకంటే మీకు దాని అనుభవమనేదే లేదు. అయినాగానీ నేను మీకు చెబుతున్నాను, దానిని మీ వద్ద పదిలపరచుకోండి. ఏదో ఒక రోజు అనుభవం వచ్చినప్పుడు, అది ఆకస్మికంగా మీ అచేతనం నుంచి పైకి వస్తుంది మరి అన్నింటినీ స్పష్టం చేస్తుంది. అప్పుడు మీరు మాటరానివారుగా వుండిపోరు, ఆ విస్మయం మిమ్మల్ని చీల్చదు, మీరు భయపడాల్సిన మరి అసౌఖ్యానికి గురికావాల్సిన అవసరం ఉండదు.

ఒక కవి అన్నాడు :

ఎక్కడో ఎత్తైన ప్రదేశంలో గాలి పాడిన దానిని,
దేవదారు వృక్షాలు ప్రతిధ్వనించాయి,
మంచు శిఖరాగ్రాలపైన మెరిసిన దానిని,
సాయంసంధ్య వేళ ఆకాశం నుంచి చిందిన దానిని,
దీనంతటినీ ఎవరు స్వీకరించారు ?
ప్రార్థనలో తన చేతులను చాచినవాడా ?
కాదు, అది కేవలం అర్పించబడిన నా హృదయంలోకే దిగి వచ్చింది.
స్వాగతించిన నా అశృవులలోకే అది ఒంపబడింది.
అది అవిదితమైనదిగా, అగ్రాహ్యమైనదిగా వచ్చింది.
వీటన్నింటి వలన మరి నా వలన,
అది తన వద్దకు తనను తెచ్చుకుంది.
అది తనలోకి తాను ప్రవేశించింది.
ఏకాంతంగా అది దేదీప్యమానమైవున్నచోట,
కళ్ళు నిస్సహాయంగా దించుకోబడ్డాయి.
కేవలం స్వరం మాత్రమే కాదు,
నిశ్శబ్దం యొక్క ప్రతిధ్వని సైతం అక్కడ ఆగిపోతుంది.

ఒక కవి అన్నాడు.

మీ లోతైన అశ్రువులతో ... నేను చెప్పేది వినండి. హృదయంతో నేను చెప్పేది వినండి. మీ ప్రేమతో ... నేను చెప్పేది వినండి. మీ వివేకంతో కాదు, మీ తర్కంతో కాదు. విశ్వాసం మరి నమ్మకం యొక్క భావం ఇదే.

ఎక్కడో ఎత్తైన ప్రదేశంలో గాలి పాడినదానిని,
దేవదారు వృక్షాలు ప్రతిధ్వనించాయి,
మంచు శిఖరాగ్రాలపైన మెరిసిన దానిని,

సాయంసంధ్య వేళ ఆకాశం నుంచి చిందిన దానిని,

దీనంతటినీ ఎవరు స్వీకరించారు ?

ప్రార్ధనలో తన చేతులను చాచినవాడా ?

కాదు, కోరిక యొక్క హస్తం ఎప్పుడు చాచబడినా, అది కుంచించుకుపోతుంది. కోరిక యొక్క హస్తం కేవలం భిక్షను మాత్రమే కలిగి వుండగలదు, ఓ సామ్రాజ్యాన్ని కాదు. ఒక సామ్రాజ్యాన్ని కలిగి వుండేందుకు ప్రేమ ద్వారా తెరువబడిన హృదయం అవసరం. యాచించే, కోరుకునే ఓ భిక్షాపాత్ర సరిపోదు.

... దీనంతటినీ ఎవరు స్వీకరించారు ?

ప్రార్ధనలో తన చేతులను చాచినవాడా ?

మీరు నేను చెప్పేదానిని ఏ విధంగా వినవచ్చంటే మీ దురభిమానాలకు సరిపోయేదానిని మీరు స్వీకరించి మరి దానిని మీ సంచీలో ఉంచుకోవచ్చు. అప్పుడు మీ భిక్షాపాత్రను చాచి మీరు నా వద్దకు వస్తారు. కోరిక అనేది ఒక యాచకుడు. మీరు కొద్దిగా తీసుకోవచ్చు, కానీ మీరు తీసుకునేది కేవలం కంచంలో నుంచి క్రింద పడిపోయిన మెతుకులు మాత్రమే. మీరు ఒక అతిథి అవ్వలేరు. సన్యాసం మిమ్మల్ని ఒక అతిథిని చేస్తుంది.

కాదు, అది కేవలం అర్పించబడిన నా హృదయంలోకే దిగి వచ్చింది.
స్వాగతించిన నా అశ్రువులలోకే అది ఒంపబడింది.
అది అవిదితమైనదిగా, అగ్రాహ్యమైనదిగా వచ్చింది.
వీటన్నింటి వలన మరి నా వలన,
అది తన వద్దకు తనను తెచ్చుకుంది.
అది తనలోకి తాను ప్రవేశించింది.
ఏకాంతంగా అది దేదీప్యమానమైవున్న చోట,
కళ్ళు నిస్సహాయంగా దించుకోబడ్డాయి.
కళ్ళు వందనాలర్పించే చోట....
కేవలం స్వరం మాత్రమే కాదు,
నిశ్శబ్దం యొక్క ప్రతిధ్వని సైతం అక్కడ ఆగిపోతుంది.

దీని కోసం సంసిద్ధులు అవ్వండి. దీని కోసం హృదయాన్ని ప్రేమతో నింపుకోండి. సానుభూతితో వినడం నేర్చుకోండి. మరి నేను మీకు చెబుతున్న దానిని

ఖజానా పేటికలో పదిలపరచుకోండి. అప్పుడు మీరు వేదన పొందరు. అప్పుడు అపరిచితమైనది, అవిదితమైనది దిగి వచ్చినప్పుడు, మీరు దానిని అవగాహన చేసుకోగలుగుతారు. మీరు దాని మరుగున వున్న సంగీతాన్ని అవగాహన చేసుకోగలుగుతారు. దాని నిశ్శబ్దం వలన మీరు భయపడరు లేదా మునిగిపోరు, మీరు విముక్తులవుతారు. లేదంటే అది మృత్యువులా కనిపిస్తుంది.

మీరు అవగాహన చేసుకోకుండానే భగవంతుడు వస్తే కనుక, ఆయనను అర్థం చేసుకోగల మార్గమేదీ మీ వద్ద లేకపోతే కనుక, అది మృత్యువులా అనిపిస్తుంది, మీరు అంతమైపోయారు అనిపిస్తుంది ! మీరు కొంత అవగాహనను, కొద్దిపాటి సంసిద్ధతను కలిగి వుంటే కనుక, మీరు ఒక గురువు వద్ద ఏదో నేర్చుకుని, అతని సన్నిధిలో కూర్చుని వుండుంటే కనుక, అప్పుడు దైవం ఓ విముక్తి ; లేదంటే అతను మృత్యువులా కనిపిస్తాడు. ఒకసారి మీరు బెదిరిపోతే కనుక, అప్పుడు మీరు ఆ దిశగా వెళ్ళడమే మానేస్తారు. ఒకసారి మీరు అంతగా భయపడిపోతే కనుక, అప్పుడు మీ శరీరంలోని అణువణువూ కంపిస్తుంది. మీరు అన్ని చోట్లకూ వెళతారు. అంతటి భయం ఉన్న చోటికి తప్ప : మీ కాళ్ళూ చేతులూ వణికే చోటు, మీరు బాట ప్రక్కగా కూర్చోవలసిన చోటు, అంతా చీకటిగా అయిపోయి మరి అంతా కోల్పోయినట్లుగా అనిపించే చోటు ; తెలియనిదేదో మిగులుతుంది, మీరు కేవలం బెదిరిపోయారు - మీరు అక్కడకు తిరిగి వెళ్ళరు.

రవీంద్రనాథ్ ఠాగూర్ కవితల్లో ఒకదానిలో అతను అంటాడు, "నేను ఎన్నో జన్మలు భగవంతుని కోసం అన్వేషించాను. అన్వేషించాను కానీ ఎన్నడూ కనుగొనలేదు. కొన్నిసార్లు అత్యంత సుదూర నక్షత్రాల మధ్య ఆయన క్షణదర్శనాన్ని నేను పొందాను. నేను ఆశిస్తూనే వున్నాను, అన్వేషిస్తూనే ఉన్నాను. అప్పుడు ఒకరోజు అదృష్టవశాత్తూ ఆకస్మికంగా నేను ఆయన ద్వారాన్ని చేరుకున్నాను. అక్కడ ఒక ఆనవాలు వుంది : 'ఇది భగవంతుడి గృహం ! నేను ఆ మెట్లు ఎక్కాను, ఒక్క గంతులో ఎన్నో జన్మల ప్రయాణం పూర్తయిపోయింది. ఆశీర్వాదం ! నా చెయ్యి తలుపును తట్టబోతున్నప్పుడు ఒక భయం నన్ను వశం చేసుకుంది : 'నేను ఆయనను కలుసుకుంటే ఏమవుతుంది ? తరువాత నేను ఏం చేస్తాను ? నా కార్యమంతా భగవంతుడిని అన్వేషించడమే అయివుంది. నేను ఈ ఆశతోనే జీవిస్తున్నాను ... ఇది నా జీవితపు ప్రయాణం. కనుక నేను భగవంతుడిని కలుసుకుంటే కనుక అది మృత్యువవుతుంది. నా జీవితానికి, నా ప్రయాణానికి ఏమవుతుంది ? అప్పుడు నేను ఎక్కడకు వెళ్తాను, నేను ఏమి సాధిస్తాను ? నేను ఏమి అన్వేషిస్తాను ? అప్పుడు ఏమీ మిగలదు." కనుక నేను ఆ గడియను వదిలేశాను, ఏ ధ్వనీ రాకుండా నెమ్మదిగా వదిలేశాను, ఆయన ద్వారం

తెరువకుండా ఉండేందుకు. నేను నా పాదరక్షలను నా చేతిలో పట్టుకుని మరి పారిపోయాను, మరి అప్పటి నుంచి నేను పారిపోతూనే వున్నాను.

" ఇంకా నేను అన్వేషిస్తూనే ఉన్నాను " ... అతని కవిత కొనసాగుతుంది. " ఆయన గృహం ఎక్కడ వుందో తెలిసినా గానీ, ఇప్పుడు కూడా నేను భగవంతుడిని అన్వేషిస్తూనే వున్నాను. అక్కడ తప్ప అన్ని ప్రదేశాలలోనూ నేను అతనిని అన్వేషిస్తాను, ఎందుకంటే అన్వేషణే నా జీవితం. దాని సమీపానికి వెళ్ళకుండా నన్ను నేను నిలువరించుకుంటాను. ఆ గృహం వైపు తప్ప ఏ దిశగానైనా నేను వెళ్తాను. నేను అటువైపే వెళ్ళను. 'భగవంతుడు ఎక్కడ వున్నాడు ? " అని మిగిలిన అన్ని ప్రదేశాలలోను నేను అడుగుతాను ... మరి భగవంతుడు ఎక్కడ వున్నాడు అనేది నాకు ఎల్లప్పుడూ తెలిసేవున్నాగానీ."

నేను దానిని చూస్తున్న విధంగా, ఎంతో మంది తమ అంతులేని అన్వేషణలో ఎన్నోసార్లు ఆ గృహానికి దగ్గరగా వచ్చారు, కానీ బెదిరిపోయారు. బెదిరిపోయారు మరి మరచిపోయారు ... కేవలం ఆ భయాన్ని మాత్రమే వాళ్ళు మరచిపోలేక పోతున్నారు. ఇందువలననే ప్రజలు ధ్యానం పట్ల వెంటనే ఆసక్తులు కారు. ప్రజలు భయపడతారు, మరి ధ్యానం లాంటి విషయాలను గురించి మాట్లాడడాన్ని సైతం తప్పించుకుంటుంటారు. వాళ్ళు భగవంతుడు అనే పదాన్ని విద్యుక్తంగా వినియోగిస్తారు, కానీ అయన కోసం లోతైన అన్వేషణలోకి వెళ్ళేందుకు తమను తాము ఎన్నడూ అనుమతించరు. వాళ్ళు మందిరానికి, మసీదుకు వెళ్తారు... అది ఒక సాంఘిక మర్యాద, లోకాచారము, లాంఛనం. వాళ్ళు వెళ్ళాలి కాబట్టి వాళ్ళు వెళ్తారు, కానీ వాళ్ళు ఎన్నడూ మందిరాన్నీ, మసీదునూ తమ హృదయాలలో సుస్థిరమవ్వనీయరు. అంతటి ఆపదను వాళ్ళు స్వీకరించరు. వాళ్ళు భగవంతుడిని దూరంగా ఉంచుతారు. మరి దానికి ఒక కారణం వుంది ... వాళ్ళ స్మృతిలో ఎక్కడో లోతుల్లో దాగిన భయాన్ని కలిగించే అనుభవం వుంది. ఎప్పుడో ఆ ద్వారం ముందు వాళ్ళు సంశయించి వుంటారు.

ఈ అనుభవాన్ని పొందిన మిత్రుడు దానిని సరిగ్గా అవగాహన చేసుకోకపోతే కనుక అతను భయపడిపోవడం మొదలు పెడతాడు. వీధిలో బెదిరిపోయి కూర్చుని, అవయవాలన్నీ వణికిపోతూండగా, వేగంగా కొట్టుకుంటున్న గుండెతో, గుటకలతో వస్తున్న శ్వాసతో, ప్రతీదీ ప్రతీ మార్గమూ ... అటువంటి ధ్యానం నుంచి దూరంగా ఉండడం మంచిది ! అది ఒక ఆపద. మీరు తిరిగి వస్తే కనుక ఫరవాలేదు, కానీ మీరు వెనక్కు తిరిగిరాకపోతే కనుక !

మీరు బాట ప్రక్కనే కూర్చుండిపోతే మీకు పిచ్చి అని ప్రజలు అనుకుంటారు: ఒకటి లేదా రెండు గంటల వరకూ అది ఫరవాలేదు ; ఎక్కువైతే, మరి పోలీసుల వస్తారు. ఎక్కువైతే, ఇరుగు పొరుగువారు మిమ్మల్ని తీసుకెళ్ళిపోతారు, లేదా ఏది జరిగిందో తెలుసుకునేందుకు మిమ్మల్ని వైద్యశాలకు పంపిస్తారు. మీరు చేతనన కోల్పోయారనే చింతతో, మెదడుకు గాయమై ఉండవచ్చుననీ, ఆ వైద్యులు ఇంజెక్షన్లన ఇవ్వడం మొదలు పెడతారు.

ఒక మిత్రుడు ... ఓ సన్యాసి ... ఏమని వ్రాశాడంటే అతను ఇక్కడ నుంచి నాట్యం చేస్తూ, పరమానందంతో వెళ్ళాడు. అతని కుటుంబం అతను ఎన్నడూ నర్తిస్తూ మరి పరమానందభరితుడై ఉండడాన్ని చూడలేదు. అతను నాట్యం చేస్తూ మరి పారవశ్యంతో ఇంటికి వచ్చినప్పుడు, అతనికి పిచ్చి పట్టిందని వాళ్ళు అనుకున్నారు. వాళ్ళు పరుగెత్తుకు వచ్చారు, అతనిని పట్టుకున్నారు, అతనిని కూర్చోబెట్టారు, ఏమి జరిగిందని అడిగారు. " ఆగండి," అతను అన్నాడు, "నాకు ఏమీ జరగలేదు. నేను ఎంతో సంతోషంగా ఉన్నాను, బ్రహ్మానందంలో ఉన్నాను."

అతను ఆధ్యాత్మిక సత్యాల గురించి మాట్లాడిన కొద్దీ ఏదో దోషం ఉందని అతని కుటుంబం మరింతగా భావించింది. వాళ్ళు అతనిని ఇంటి నుంచి తీసుకెళ్ళారు మరి ఒక వైద్యశాలలో ప్రవేశించేందుకు అతనిని బలవంతపెట్టారు.

అతని నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అతను అంటాడు. "నేను ఇక్కడ వైద్యశాలలో నవ్వుకుంటూ పడివున్నాను. ఇది మహా వినోదంగా వుంది. నేను దుఃఖంగా ఉన్నప్పుడు నాకు ఏ వైద్య సహాయాన్నయినా అందించాలని ఎవ్వరూ అనుకోలేదు. ఇప్పుడు నేను ఆనందంగా ఉన్నాను మరి ప్రజలు నన్ను వైద్యశాలకు తీసుకువచ్చారు. నేను ఈ నాటకాన్ని వీక్షిస్తున్నాను. కానీ నేను పిచ్చివాడిని అని వాళ్ళు అనుకుంటున్నారు. మరి నేను పిచ్చివాడినని వాళ్ళు అనుకుంటున్న కొద్దీ నేను మరింతగా నవ్వుతున్నాను ! నేను మరింతగా నవ్విన కొద్దీ నాకు పిచ్చి అని వాళ్ళు మరింతగా అనుకుంటున్నారు !"

మీరు అడగడం మంచిదయ్యింది. భయపడకండి. ఈ అనుభవం నెమ్మదినెమ్మదిగా నిశ్చలమవుతుంది. దానికి సాక్షిగా ఉండండి. ఈ సంభవం సహజమైనది.

మూడవప్రశ్న

ప్రియమైన ఓషో,

మనం భగవంతుడి యొక్క అంశలం మరి అనశ్వరమైనవారం కూడా. ఈ అంశ ఎప్పుడు, ఎందుకు, ఎలా మూలం నుంచి విడివడిందో దయచేసి వివరించండి? మరి మూలంతో అంశ యొక్క పునరైక్యం... ఒక అవిభాజ్యమైన ఐక్యం... సాధ్యమేనా లేక సాధ్యం కాదా ? అది సాధ్యమైతే కనుక, అప్పుడు మళ్ళీ మళ్ళీ ఈ అల్లకల్లోలమైన సంకులస్థితిలోకి వచ్చి అది భయపడకుండా ఉండేందుకు దయచేసి ఈ అంశను మూలంతో ఐక్యం చెయ్యండి.

మీరు ఆ వ్యత్యాసాన్ని చూస్తున్నారా. గత ప్రశ్న అనుభవం నుంచి వచ్చింది. ఈ ప్రశ్న విద్వత్తుకు సంబంధించినది.

" మనం భగవంతుడి యొక్క అంశలం మరి అనశ్వరమైనవారు కూడా." మీకు ఇది తెలుసా ? మీకు ఇది తెలిస్తే కనుక, అడగాల్సిన అవసరమే లేదు. మీకు తెలియకపోతే కనుక, అప్పుడు దానిని వ్రాయడం అనేది అర్థంలేనిది : ఆ ప్రశ్నను అడగడమే చాలు.

" ఈ అంశ ఎప్పుడు, ఎందుకు, ఎలా మూలం నుంచి విడివడిందో దయచేసి వివరించండి ? " ఇది పాండిత్యాన్ని తెలిపే ప్రశ్న. ఎప్పుడు ? మీకు తేదీ మరి సమయం కావాలా ? మీరు దానితో ఏం చేస్తారు. నేను మీకు ఆ తేదీని చెప్పినట్లయితే, అది ఏ వ్యత్యాసాన్ని కలిగించగలదు ? నేను ఆ సంవత్సరాన్నీ మరి సమయాన్నీ ఇస్తే కనుక, ఫలానా ఫలానా రోజు సరిగ్గా ఉదయం ఆరు గంటలకు అని చెబితే కనుక, అది ఏ వ్యత్యాసాన్ని కలిగించగలదు ? మీ జీవితంలో అది ఏ రూపాంతరీకరణను తీసుకురాగలదు ? మీరు ఏమి సాధిస్తారు ?

" ఎప్పుడు మరి ఎందుకు అంశ విడివడింది ?" మీరు భగవంతుడి యొక్క అంశ అనేది మీకు తెలిస్తే కనుక, అప్పుడు మీరు ఎన్నడూ విడివడలేదు అనేది మీకు తెలుసి వుంటుంది. మీరు వేర్పాటు అనే కలను కన్నారు. మీరు ఎన్నడూ విడివడలేదు... ఒక అంశ ఎలా విడివడగలదు? అంశ అనేది కేవలం సమస్తంతోనే ఉంటుంది. మీరు మరచిపోయారు. మీరు విడివడలేరు కానీ మీరు విస్మరించగలరు. విడివడి ఉండగల మార్గమే లేదు. మనం ఏదై వున్నామో ఆ విధంగానే మనం వుంటాము ; మనం దానిని మరచిపోవచ్చు, మనం దానిని జ్ఞాపకం చేసుకోవచ్చు ... వ్యత్యాసమంతా ఏమిటంటే కేవలం మరచిపోవడం మరి జ్ఞప్తికి ఉంచుకోవడాన్ని గురించినదే.

" ఈ అంశ ఎప్పుడు, ఎందుకు, ఎలా మూలం నుంచి విడివడింది...? మీరు విడిగా ఉంటే కనుక ఎప్పుడు, ఎందుకు, ఎలా అనేది నేను చెప్పగలను. మీరు విడివడిలేరు. రాత్రివేళ నిద్రావస్థలో, మీరు ఓ గుర్రం అని మీరు కలగంటారు. ఉదయం మీరు అడుగుతారు, " ఎందుకు, ఎలా, ఎప్పుడు నేను ఒక గుర్రాన్ని అయ్యాను ? అది అత్యంత కష్టతరమైనది... నేను ఒక గుర్రాన్నెందుకు అయ్యాను ? మొదటి విషయం ఏమిటంటే మీరు ఎన్నడూ ఓ గుర్రం అవ్వలేదు. మీరు అయివుంటే కనుక, అడిగేందుకు ఎవరైనా మిగిలివుంటారా ? గుర్రాలు ప్రశ్నలు అడగవు. మీరు ఎన్నడూ ఓ గుర్రం కాదు, మీరు కేవలం దానిని కలగన్నారు. ఉదయం మీరు ఆ కలగంటున్నప్పుడు కూడా మీరు ఒక గుర్రం కాదు. మీరు ఓ గుర్రమే అనే భావనలో మీరు పూర్తిగా మునిగిపోయి వుండవచ్చు. ఇదే అష్టావక్రుడి యొక్క మౌలిక బోధన.

మీ ' నేను ' ను మీరు దేనితో గుర్తించుకుంటారో మీరు అదే అవుతారు అని అష్టావక్రుడు చెబుతాడు. శరీరంతో గుర్తుంచుకుంటే... మీరు ఓ శరీరమే అవుతారు. మీరు ఒక శరీరం అని మీరు అంటే మీరు ఒక శరీరమే. బ్రహ్మంతో గుర్తించుకుంటే ... మీరు బ్రహ్మం అని అనండి మరి మీరు బ్రహ్మమే. మీ ' నేను ' ను మీరు దేనితో గుర్తించుకుంటారో మీరు అదే అవుతారు. ఒక కలలో మీరు ఓ గుర్రంతో మిమ్మల్ని మీరు గుర్తించుకున్నారు, మీరు గుర్రమే అవుతారు. ఇప్పుడు మీరు మానవదేహంతో గుర్తించుకుంటున్నారు, మీరు ఒక మానవుడే అవుతారు. కానీ మీరు ఎన్నటికీ వాస్తవంగా అలా అవ్వరు, మీరు ఏదో అలాగే మీరు ఎల్లప్పుడూ వుంటారు ... కేవలం అదే విధంగా. మీ స్వభావంలో ఎన్నడూ ఏ మార్పూ లేదు.

ఈ రకమైన ప్రశ్నకు అర్థమే లేదు. ఇటువంటి ప్రశ్నలు అడగడంలో సమయాన్ని వృథా చేయకండి. మరి ఇటువంటి ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు మీకన్నా అధిక మూర్ఖులు.

జెన్ సన్యాసి బోకుజు గురించిన ఒక కథ వుంది.

ఒకానొక ప్రభాతవేళ అతను మేల్కొన్నాడు మరి వెంటనే తన ప్రధాన శిష్యుడిని పిలిచి, అతనికి చెప్పాడు, " విను, నాకు ఓ కల వచ్చింది. నువ్వు దానిని నా కోసం విశ్లేషించగలవా ?"

ఆ శిష్యుడు అన్నాడు, " వేచి ఉండండి ! నేను కొద్దిగా నీటిని తీసుకొస్తాను. మొదట మీ ముఖాన్ని కడుక్కోండి."

అతను ఒక కుండ నిండుగా నీటిని తీసుకువచ్చాడు మరి గురువు తన చేతులు మరి కాళ్ళను కడుక్కునేందుకు సహాయం చేశాడు. అతను అది చేస్తూండగా, మరో శిష్యుడు అటుగా వెళుతున్నాడు. గురువు అన్నాడు, " విను, నాకు ఈ కల వచ్చింది. నువ్వు దానిని నా కోసం విశ్లేషించగలవా ?"

అతను అన్నాడు, " కొద్దిగా నిరీక్షించండి ... నేను మీ కోసం ఒక కప్పు తేనీటిని తేవడం మెరుగైనది." అతను ఒక కప్పు తేనీరు తీసుకొచ్చాడు.

ఆ గురువు కడుపుబ్బా నవ్వాడు. అతను అన్నాడు, " మీరు నా కలను విశ్లేషించి వుంటే కనుక నేను మిమ్మల్ని కొట్టి వుండేవాడిని మరి మిమ్మల్ని బయటకు విసిరేసి వుండేవాడిని !"

ఒక కల ఏ విశ్లేషణను కలిగివుండగలదు ? ఇప్పుడు మీరు దానిని చూశారు, మీరు మేల్కొన్నారు, ఇక ఆ సర్కస్ అంతటినీ వదిలెయ్యండి !

ఆ శిష్యులు సరైన సమాధానాన్ని ఇచ్చారు. అది ఒక శోధన, వారికి పరీక్ష - పరీక్షా సమయం ఆసన్నమైంది. ఒక శిష్యుడు గురువు చేతులు మరి కాళ్ళను కడిగేందుకు నీటిని తెచ్చాడు. " ఆ కల వెళ్ళిపోయింది, ఇక దానిని ముగించండి ! ఇంకేమి విశ్లేషణ కావాలి ? – ఆ కల ఓ కలే, అది ముగిసిపోయింది. విశ్లేషణ ఏమిటి. సత్యాన్ని విశ్లేషించవచ్చు కానీ ఒక కలను ? అసత్యమైనది విశ్లేషించబడగలదా ? ఎన్నడూ సంభవించనిది విశ్లేషించబడగలదా ? అది ఒక కల అని తెలుసుకోవడమే చాలు ; ఇక మీ ముఖాన్ని కడుక్కోండి ఇప్పుడు మీరు తిరిగి వచ్చారు, కేవలం దాని నుంచి బయటపడండి." ఒక కప్పు తేనీటిని తెచ్చి, మరొక యువకుడు కూడా చక్కగా చేశాడు : " మీరు మీ ముఖాన్ని కడుక్కున్నారు, కానీ ఇంకా కొద్దిపాటి నిద్ర మిగిలిపోయి వున్నట్లు కనిపిస్తోంది. ఒక కప్పు తేనీటిని ఆస్వాదించండి మరి మీరు పూర్తిగా మేల్కొంటారు."

నేను మీకు చెబుతున్నది ఇదే : మీ ముఖాన్ని కడుక్కోండి, మీ తేనీటిని త్రాగండి ! మీరు ఎన్నడూ విడిగా లేరు ... విడివడి ఉండగల మార్గమే లేదు.

తరువాత మీరు అడుగుతున్నారు, " మరి మూలంతో అంశ యొక్క పునరైక్యం... ఒక అవిభాజ్యమైన ఐక్యం ... సాధ్యమేనా లేక సాధ్యం కాదా ? మీరు విడిగా లేనప్పుడు, ఐక్యం గురించి మాట్లాడడం నిరర్థకమైనది. ఇందువలనే అష్టావక్రుడు చెబుతాడు విముక్తి కోసం చేసే సాధన విముక్తిని నిరోధిస్తుంది. ఆయన ఏం చెబుతున్నాడు ? ఆయన చెబుతున్నాడు, మీరు ఎన్నడూ విడివడి లేనిదానితో

మిమ్మల్ని ఐక్యం చేయడానికి మీకు ఒక విధానం కావాలా ? పిచ్చితనానికి అంతే లేదా ? ఈ విధానమే ఐక్యం కావడాన్ని నిరోధిస్తుంది."

కొద్దిగా ఆలోచించండి. మీరు మీ ఇంటిని ఎన్నడూ విడిచి వెళ్ళకపోతే కనుక, అప్పుడు ఇంటికి తిరిగిరావాలనే మీ ప్రయత్నాలు మిమ్మల్ని మేల్కొనడం నుంచి నిరోధిస్తాయి.

ఒక త్రాగుబోతు ఓ రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. అతను మరీ అతిగా త్రాగాడు. అతను తలుపు కొట్టడం వరకూ నిభాయించగలిగాడు కానీ అది తన స్వంత ఇల్లేనని అతనికి తెలియదు. అతని తల్లి తలుపు తీసింది. అతను అన్నాడు, "ప్రియమైన వృద్ధురాలా, నా ఇల్లు ఎక్కడ వుందో నువ్వు చెప్పగలవా ?"

ఆ వృద్ధ స్త్రీ బదులిచ్చింది, " నువ్వు నా కుమారుడిని, నేను నీ తల్లిని, వెధవా! ఇదే నీ ఇల్లు."

అతను అన్నాడు, "నన్ను మోసగించడానికి ప్రయత్నించవద్దు. నన్ను అయోమయానికి గురిచేయవద్దు. నా ఇల్లు ఇక్కడే ఎక్కడో ఉందని నాకు ఖచ్చితంగా తెలుసు, కానీ ఎక్కడ ?"

ఇరుగు పొరుగువారు చుట్టూ పోగయ్యారు, అతనిని ఒప్పించడానికి వాళ్ళు ప్రయత్నించారు. కానీ త్రాగుబోతులతో వాదించడం వలన ఏ ప్రయోజనమూ ఉండదు, త్రాగుబోతులతో వాదించేవాడు కూడా ఓ త్రాగుబోతే. వాళ్ళు అతనితో చెప్పారు, " ఇదే నీ ఇల్లు !" వాళ్ళు దానిని నిరూపించడం, అతనికి నిదర్శనాన్ని చూపడం ప్రారంభించారు: " దీని వైపు చూడు ", " దానిని చూడు." ఈ మనిషి త్రాగివున్నాడనీ ... ఏ రుజువూ సహాయపడలేదనీ వాళ్ళు అవగాహన చేసుకోలేక పోయారు. అతను ఏమి చూస్తున్నాడో ఎవరికి తెలుసు ; అది మీరు ఊహించలేనిది. మీరు చూస్తున్న దానిని అతను చూడడం లేదు, అతను మరో ప్రపంచం దేనిలోనో ఉన్నాడు. అతను తన స్వంత తల్లిని కూడా గుర్తించలేకపోయాడు ; అతను తన ఇంటినెలా గుర్తించగలడు ? తనను తానే అతను గుర్తించలేకపోతున్నాడు ; అతను మరెవరినైనా ఎలా గుర్తుపట్టగలడు ?

మరొక త్రాగుబోతు అటుగా వచ్చాడు. అతను పైకెత్తబడి వున్న తన ఎడ్లబండితో వచ్చాడు. అతను అన్నాడు, "ఎక్కు, నేను నిన్ను ఇంటికి తీసుకెళ్తాను."

గుర్తుంచుకోండి, మీరు సరికాని ప్రశ్నలను అడిగితే కనుక మీరు సరికాని గురువుల వలలోనే చిక్కుకుంటారు. ఒకసారి మీరు సరికాని ప్రశ్నను అడిగితే మీకు

ఓ సరికాని జవాబునే ఇచ్చేవారు ఎవరో ఒకరిని మీరు కలుసుకుంటారు. అడగండి, మరి జవాబును ఇచ్చేందుకు ఎవరో నిరీక్షిస్తున్నారు. వాస్తవమేమిటంటే మీరు అడుగకపోయినా కూడా, జవాబివ్వడానికి సిద్ధంగా ఎవరో వున్నారు. వాళ్ళు మీ కోసం చూస్తున్నారు. మీరు ఇలాంటి ప్రశ్నను అడిగినప్పుడు కేవలం మిమ్మల్ని మీరు ఆపదలో వుంచుకుంటున్నారు.

"మరి పునరైక్యం..." మీరు ఎన్నడూ విడివడిలేరు, మీరు ఎన్నడూ వీడి వెళ్ళిపోలేదు ... మీరు ఎలా పునరైక్యం చేయబడుతారు ? మరి మీరు అడుగుతున్నారు: "విభజించలేనిదైన ఐక్యత అనేది వుండడం సాధ్యమేనా ?" ఒకవేళ ఐక్యత సంభవించి మరి ఏదో విధంగా అది మళ్ళీ విడిపోతే ఎలా ?" ఈ విషయాలన్నీ వాస్తవమైనవిలా కనిపిస్తాయి ఎందుకంటే మనం ఎవరమనేది మనకు గుర్తులేదు. భగవంతుడు విడిగా ఉంటే కనుక, అప్పుడు ఈ విషయాలన్నీ సత్యమే అవుతాయి.

భగవంతుడు మన స్వభావం, కానీ మనం మన స్వభావాన్ని మరచిపోవచ్చు. ఇది కూడా మన స్వభావానికి అంతరస్థమైనది, మనం మన స్వభావాన్ని మరచిపోగలం అనేది.

ఒక మిత్రుడు అడిగాడు, "ఆత్మ అనేది శుద్ధ చైతన్యం, స్వేచ్ఛ మరి అనంతమైన శక్తి, అత్యున్నత స్వతంత్ర్యం అయితే కనుక, కోరిక అనేది ఎలా జనించింది ?" ఇది కూడా మన ఉనికి యొక్క స్వతంత్ర్యమే ... అది కోరుకోవాలని అనుకుంటే కనుక అది కోరుకోగలదు అనేది. మన ఉనికి కోరుకోలేకపోయినట్లయితే కనుక అది ఆధారపడేది అవుతుంది. దాని గురించి ఆలోచించండి. ఈ ప్రపంచం మీ స్వతంత్రమే. మీరు దానిని కావాలనుకున్నారు. కనుక అది సంభవించింది. మీ కోరిక అనేది స్వేచ్ఛాయుతమైనది. మీరు కోరుకుంటే కనుక, అది ఈ క్షణమే అంతమైపోతుంది. మీరు కోరుకుంటే కనుక, అది వెంటనే తిరిగి వస్తుంది.

కనుక విడదీయలేని ఐక్యత వుంది అని నేను మీకు చెప్పలేను. మీరు ఎన్నడూ విడదీయబడలేదు. కానీ మీ ఉనికి యొక్క అత్యున్నత స్వేచ్ఛ ఏమిటంటే అది కోరుకున్నప్పుడు అది దేనినైనా మరచిపోగలదు మరి, అది కోరుకున్నప్పుడు అది గుర్తుచేసుకోగలదు. ఈ సంభావ్యత ఉండకపోతే కనుక, ఉనికి హద్దుల్లో వుంచబడుతుంది, దాని స్వేచ్ఛ పరిమితమైపోతుంది, దానిపై ఏదో విధించబడుతుంది. అది లక్షణాలను కలిగివుంటుంది.

పశ్చిమంలో ఒక తత్వవేత్త ఉండేవాడు, డిడెరోట్. భగవంతుడు సర్వశక్తివంతుడు కాదని అతను నిరూపించాడు. సరైనవిగా కనిపించే వాదనలను

అతను అందించాడు. ఉదాహరణకు, అతను చెబుతాడు, " రెండును రెండుతో కూడినప్పుడు ఐదు వచ్చేలా భగవంతుడు చేయగలడా ?" రెండును రెండుతో కూడినప్పుడు ఐదు వచ్చేలా చేయడం భగవంతుడికి సైతం కష్టమే అనిపిస్తుంది. కనుక అతను సర్వ శక్తివంతుడు ఎలా కాగలడు ? రెండును రెండుతో కూడితే నాలుగవుతుంది. " భగవంతుడు ఓ త్రికోణాన్ని ఒక దీర్ఘచతురస్రంగా చేయగలడా?" అతను అది ఎలా చేయగలడు ? అతను దానిని ఒక దీర్ఘచతురస్రంగా చేస్తే కనుక అది ఇక ఎంతమాత్రమూ ఓ త్రికోణంగా వుండదు. అది ఒక త్రికోణంగానే ఉండిపోతే కనుక, అప్పుడు అతను దాని నుంచి ఓ దీర్ఘచతురస్రాన్ని తయారు చేయలేకపోయాడు, కనుక భగవంతుడు పరిమితుడే.

భగవంతుడి పట్ల క్రైస్తవ భావనకు డిడెరోట్ ఆఘాతాన్నిచ్చాడు. కానీ భారతీయుల భావాలు డిడెరోట్‌కు తెలిసి వుంటే కనుక అతను చిక్కుల్లో పడేవాడు. వాళ్ళేం చెబుతారంటే సమస్యంతా ఇదేననీ, రెండును రెండుతో కూడితే అయిదు వచ్చేలా, రెండును రెండుతో కూడితే మూడు వచ్చేలా చేయగల స్వతంత్ర్యం భగవంతుడికి ఉందని చెబుతారు. దీనినే మనం మాయ, భ్రాంతి అని పిలుస్తాం. అది రెండును రెండుతో కూడితే అయిదు వచ్చేలా, రెండును రెండుతో కూడితే మూడు వచ్చేలా చేయగలదు. రెండును రెండుతో కూడితే నాలుగు వచ్చినప్పుడు మనం మాయ నుంచి బయటపడిపోయినట్లే.

ఇక్కడ త్రికోణాలు దీర్ఘచతురస్రాలుగా కనిపిస్తాయి. ఇక్కడ మహా మోసాలు జరిగిపోతూంటాయి. ఇక్కడ ఎవరో ఏదో అవగాహన చేసుకుంటారు, మరెవరో మరేదో అవగాహన చేసుకుంటారు. కేవలం ఏదైతే వాస్తవంగా ఉందో, అది ఎవ్వరికీ తెలియదు. ఇంత వరకూ నిశ్చయం, రెండును రెండుతో కూడితే ఏదైనా కావచ్చు, కానీ నాలుగు కాదు. దీనినే మనం మాయ అంటాం.

మనం మాయను భగవంతుడి యొక్క శక్తి అని పిలిచాం. దీని అర్థం ఏమిటో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మనం మాయను భగవంతుడి యొక్క శక్తి అని పిలుస్తాం. దాని అర్థం తనను తాను సైతం మోసగించుకునే శక్తి భగవంతుడికి ఉంది. లేదంటే, అతను పరిమితుడై ఉండేవాడు. అతను స్వప్నించలేకపోతే కనుక అతడు ఏ రకమైన భగవంతుడై వుంటాడు? అప్పుడు అతను పరిమితుడై వుంటాడు. ఎందుకంటే అతనికి స్వప్నించగల సామర్థ్యం లేదు.

లేదు, దైవం స్వప్నాలను చూడగలదు. మీరు కలగంటున్నారు ! కలగంటున్న దైవమే మీరు. మీరు మేల్కొనవచ్చు, మీరు కలగనవచ్చు ... ఈ సామర్థ్యం మీదే.

కనుక మీరు కావాలనుకున్నప్పుడు మీరు కలగనవచ్చు. మీరు కావాలనుకున్నప్పుడు మీరు మేల్కొనవచ్చు. ఇది మీ ఎంపిక. మీరు మేల్కొనే వుండాలని కోరుకుంటే, మీరు మేల్కొనే ఉండవచ్చు. మీరు కలల్లోనే వుండాలని కోరుకుంటే, మీరు కలగనడాన్నే కొనసాగించవచ్చు.

మానవుడి యొక్క స్వేచ్ఛ నిరాటంకమైనది.

మీ ఉనికి యొక్క శక్తి అప్రతిహతమైనది.

సత్యం మరి స్వప్నం ... అవి అత్యున్నతం యొక్క రెండు ప్రవాహాలు. సకలమూ ఈ రెండు ప్రవాహాలలోనే ఇమిడిపోయి వుంటుంది.

పునరైక్యం అన్నది సాధ్యమేనా అని మీరు అడుగుతున్నారా ? మొదట, పునరైక్యం అని అనకండి. ' జ్ఞాపకం చేసుకోవడం ' అని మీరు అన్నట్లయితే, అది సరైన పదం అవుతుంది.

మరి మీరు అడుగుతున్నారు, "...ఒక అవిభాజ్యమైన ఐక్యం "... నేను దానికి హామీ ఇవ్వలేను. ఎందుకంటే అది మీపై ఆధారపడి వుంటుంది, అది మీ ఎంపిక. మీరు త్యజించాలనుకుంటే, మరచిపోవాలనుకుంటే కనుక, అప్పుడు మిమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు. మీరు జ్ఞాపకం చేసుకోవాలనుకుంటే కనుక, మిమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు. మరి దీనివలన కలత చెందకండి. మీ స్వేచ్ఛ అన్నది ఎంత గొప్పదంటే మీరు భగవంతుడిని విస్మరించాలనుకున్నప్పుడు కూడా ఏ అభ్యంతరమూ ఉండదు అనే దానిని ఓ ఆశీర్వాదంగా స్వీకరించండి. భగవంతుడు మిమ్మల్ని ఏ మాత్రమూ వేధించడు. మీరు ఆయనను వ్యతిరేకించాలనుకుంటే కనుక, ఏ అభ్యంతరమూ లేదు. ఆయన ఇంకా మీతోనే వుంటాడు. మీరు ప్రతికూలం అవ్వాలనుకున్నప్పుడు, ఆయన ఇంకా మీకు శక్తిని ఇస్తూనే వుంటాడు.

సూఫీ ఫకీరు, హస్సన్, ఏమని వ్రాశాడంటే, " ఒక రాత్రి నేను భగవంతుడిని అడిగాను, 'ఈ గ్రామంలో అత్యంత ధార్మికుడైన వ్యక్తి ఎవరు ?' నా పొరుగింటి వ్యక్తి అని భగవంతుడు నాకు చెప్పాడు."

హస్సన్ ఎన్నడూ అతని గురించి ఆలోచించనైనా ఆలోచించలేదు. అతను ఒక సరళమైన, ముక్కుసూటిగా వెళ్ళే వ్యక్తి. సామాన్య జనుల గురించి ఎవ్వరూ ఆలోచించరు. సమస్యలు సృష్టించేవాళ్ళ గురించే ఆలోచన వుంటుంది. అతను నిశ్శబ్దంగా జీవిస్తున్న ఒక సామాన్యుడు. ఒక సాధారణ మనిషి, తన స్వీయ

ఆనందంలో... మరెవరితోనూ ఏ నిమిత్తమూ లేకుండా. ఎవ్వరూ అతనిని గమనించలేదు. హస్సన్ అన్నాడు, " ఈ మనిషి అత్యంత ధర్మపరుడా ?"

ఆ మరునాటి ఉదయం అతను శ్రద్ధగా అతనిని పరిశీలించాడు మరి కనుగొన్నాడు, " ఆ మనిషి ఎంతటి తేజస్సుతో ఉన్నాడు !" ఆ తరువాతి రాత్రి అతను భగవంతుడిని అడిగాడు, "ఇప్పుడు మరో ప్రశ్న. మీరు చెప్పినది బాగుంది. నేను ఈ మనిషిని అర్చిస్తాను. నేను అతనికి సాష్టాంగపడతాను. అతను నా గురువు అయ్యాడు. నాకు ఇప్పుడు మరో విషయాన్ని చెప్పండి, ఈ గ్రామంలో అత్యంత అధముడైన మనిషి ఎవరు ? తద్వారా నేను అతనిని తప్పించుకోగలుగుతాను."

భగవంతుడు అన్నాడు, " ఆ పొరుగింటి మనిషే."

హస్సన్ అన్నాడు, " ఇది నిజంగా అయోమయంగా వుంది !"

భగవంతుడు బదులిచ్చాడు, " నేను ఏం చేయగలను ? గతరాత్రి అతను రమణీయమైన మనోస్థితిలో ఉన్నాడు, ఇప్పుడు అతను చెడు మనోస్థితిలో ఉన్నాడు. నేను ఏమీ చేయలేను. ఉదయానికి అతను ఏ స్థితిలో ఉంటాడో నేను చెప్పలేను. అతను మళ్ళీ చక్కని మనోస్థితిలో ఉండవచ్చు."

మీ అస్తిత్వమే అత్యున్నత స్వేచ్ఛ. దానిని ఏదీ పరిమితం చేయదు. ఈ అత్యున్నత స్వేచ్ఛనే మనం మోక్షం, విముక్తి అని పిలుస్తాం. మరచిపోగల స్వేచ్ఛ సైతం మోక్షంలో కలిసి వుంటుంది. మీరు మరచిపోవాలనుకుంటే కనుక మిమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు. మీరు కోరుకున్నప్పుడు మీరు దానిలో నుంచి బయటకు రాగల స్వేచ్ఛను కలిగి వుండకపోతే కనుక అదే మీ విముక్తి ?

నేను విన్నాను : ఒక కాథలిక్ మతాచార్యుడు మరణించాడు. అతను స్వర్గాన్ని చేరుకున్నప్పుడు ఎంతోమంది ఇనుప సంకెళ్ళలో బంధించబడి వుండడం చూసి అతను ఆశ్చర్యానికి గురయ్యాడు. అతను అన్నాడు, " ఏమి జరుగుతోంది ? స్వర్గంలో సంకెళ్ళూ, ఇనుప గొలుసులూనా ?"

అతనికి చెప్పబడింది, " వాళ్ళు తిరిగి వెళ్ళాలనుకుంటున్నారు... వాళ్ళు అమెరికన్లు, మరి వాళ్ళు అమెరికాకు తిరిగి వెళ్ళాలనుకుంటున్నారు. అక్కడ మరింత వినోదకరంగా ఉంటుంది అని వాళ్ళు చెబుతున్నారు. వాళ్ళను సంకెళ్ళతో ఉంచవలసి వచ్చింది ఎందుకంటే స్వర్గానికి ఇది ఒక అపవాదు అవుతుంది. వాళ్ళు అంటారు, మేము స్వర్గంలో వుండాలనుకోవడం లేదు, దాని బదులుగా మేము అమెరికాకు

తిరిగి వెళ్ళిపోతాం. అక్కడ రసవత్తరంగా వుంటుంది. ఈ స్వర్గపు యువతులకన్నా మెరుగైన స్త్రీలు మాకు వున్నారు. మద్యమా ? మేము మెరుగైన మద్యాన్ని కలిగివున్నాం. భవనాలా ?... అవి దీనికన్నా ఎత్తైనవిగా వున్నాయి. ఈ పురాతన భవనాలన్నీ ఎవరికి కావాలి ?"

స్వర్గంలోని భవనాలు ఇప్పుడు పురాతన రీతులలోనివి అయిపోయాయి. అవి పూర్తిగా కాలం చెల్లినవైపోయాయి. ఎన్నో, ఎన్నో వేల సంవత్సరాల క్రితం వాస్తు శాస్త్రజ్ఞులు మరి శిల్ప శాస్త్రజ్ఞులు వాటిని రూపొందించారు మరి ఇంకా అవి నిలిచి వున్నాయి.

" తాము అమెరికాకు వెళ్ళిపోవాలని అనుకుంటున్నామని వాళ్ళు చెబుతున్నారు. మేము వాళ్ళకు సంకెళ్ళు వేయాల్సి వచ్చింది. ఎందుకంటే వాళ్ళు పారిపోయి మరి అమెరికాకు తిరిగి వెళ్ళగలిగితే కనుక అది స్వర్గానికి అత్యంత అవమానకరమైనది అవుతుంది. ఎవరైనా ఇక్కడకు రావాలని ఎలా అనుకుంటారు ?"

కానీ మీరు సంకెళ్ళలో బంధింపబడి ఉండగలిగే చోటు, ఇది ఎలాంటి స్వర్గం? నరకం మెరుగైనదిగా వుంటుంది, కనీసం అక్కడ సంకెళ్ళు ఉండవు. దీనిని గుర్తుంచుకోండి : స్వర్గం అంటే స్వతంత్రం. మోక్షం అంటే స్వేచ్ఛ. విముక్తి అంటే మీరు స్వతంత్రులుగా ఉండడం. మరి ఇదే అత్యున్నత అనుభవం. అది అత్యున్నతమైనది మరి నిర్నిబంధనమైనది. దానిపై ఏ నిబంధనలూ ఉండలేవు.

ఒక విముక్తమైన ఆత్మకు ప్రపంచానికి తిరిగి రావాలనే భావన కలిగితే కనుక, అతనిని ఎవ్వరూ ఆపలేరు. విముక్తి పొందినవాళ్ళు తిరిగిరారు, ఇది మరో విషయం. కానీ ఒక విముక్త జీవి తిరిగి రావాలని కోరుకుంటే కనుక అతనిని ఎవ్వరూ ఆపలేరు. మరి అతనిని ఎవరు ఆపుతారు ? మరి ఒక విముక్త జీవిని ఎవరైనా ఆపగలిగితే కనుక, అప్పుడు ఇదేం విముక్తి ?

మీరు స్వర్గాన్ని వదిలి వెళ్ళడం ప్రారంభిస్తారు మరి ఎవరో అంటారు, " ఆగు ! నువ్వు వెళ్ళలేవు, ఇది స్వర్గం, నువ్వు ఎక్కడకు వెళుతున్నావు ?" ఆ క్షణమే స్వర్గం అంతమైపోతుంది.

విముక్తి పొందినవారు తిరిగి వస్తారు అని నేను చెప్పడం లేదు. వాళ్ళను ఎవ్వరూ ఆపలేరు అని నేను చెబుతున్నాను. కనుక నేను మీకు హామీ ఇవ్వలేను. మీరు తిరిగి రావాలనుకుంటే కనుక, నేను ఏం చెయ్యగలను ? మీరు భగవంతుడిని

తప్పించుకోవాలనుకుంటే కనుక, నేను ఏం చెయ్యగలను ? మీ సంపూర్ణ స్వేచ్ఛ యొక్క ప్రకటనను మాత్రమే నేను చేయగలను.

"అది సాధ్యమైతే కనుక,... దయచేసి ఈ అంశను మూలంతో ఐక్యం చెయ్యకండి.

మీ ఆశ అత్యంత చవుకైనది. మీరు చెబుతున్నది ఏమిటంటే మీరు వాస్తవంగా కలుపబడాలని కోరుకోవడం లేదు, వేరెవరో దానిని చేయడానికి శ్రమపడాలి. ఇది ఎలా జరుగగలదు? కేవలం మీరు దానిని కోరుకున్నప్పుడు మాత్రమే ఐక్యత అనేది సంభవించగలదు. కేవలం అది మీ కోరిక, మీ ఇచ్ఛ, మీ వాంఛ, మీ తృష్ణ అయితేనే... మరెవ్వరూ మిమ్మల్ని ఐక్యం చెయ్యలేరు. మీ ఎంపిక ప్రకారమే మీరు వెళ్తారు.

మరి నేను ఏదో విధంగా మిమ్మల్ని మూలంతో ఐక్యం చెయ్యడాన్ని నిర్వహించినా, అయినప్పటికీ మీరు తప్పించుకుపోతారు. ఎందుకంటే బాహ్యం నుంచి తీసుకురాబడినా ఒక సంభవం మీ అస్తిత్వంతో సంబంధాన్ని కలిగి వుండలేదు. అది బలవంతంగా నిర్బంధించినది అవుతుంది. అది సాధ్యం కాదు. లేదంటే జ్ఞానోదయాన్ని పొందిన ఒక వ్యక్తి సమస్త ప్రపంచానికీ జ్ఞానోదయాన్ని కలిగించగలడు. జ్ఞానోదయం పొందిన వ్యక్తి ఒక్కడు చాలు. అతను ప్రతి ఒక్కరినీ విముక్తులను చేస్తాడు. ప్రతి ఒక్కరినీ దైవంతో ఐక్యం చేస్తాడు. జ్ఞానోదయం పొందివాళ్ళు కరుణ లోపించి వున్నారా? లేదు వాళ్ళకు కరుణ లోపించలేదు. కానీ మీ ఇచ్ఛకు వ్యతిరేకంగా ఏదీ చేయడం సాధ్యం కాదు. మరి మీరు కోరుకుంటే కనుక అది ఇప్పుడే, ఈ క్షణమే సంభవించగలదు. ఆనందంగా ఉండండి ! ఈ క్షణమే!

మికు వున్న ఈ కోరిక, మరెవరో మిమ్మల్ని దైవంతో ఐక్యం చెయ్యాలి అనేది, ప్రపంచానికి తిరిగి రావడానికి ఇది మీ సాధనం. ఇతరుల కోసం ఏ కోరిక అయినా ప్రపంచానికి తిరిగి రావడానికి ఒక మార్గం. మరెవరో మిమ్మల్ని ఆనందపరచాలి. మిమ్మల్ని ప్రేమించాలి, మిమ్మల్ని గౌరవించాలి ... ఇప్పుడు ఆ పాత అలవాట్లు చెబుతున్నాయి వేరెవరో మిమ్మల్ని విముక్తులను చెయ్యాలి, దైవంతో మిమ్మల్ని ఐక్యం చెయ్యాలి-కానీ వెరెవరో. మీరు ఎంతకాలం బలహీనులుగా, శక్తిహీనులుగా, నంపుంసకులుగా ఉండబోతున్నారు ? మీ స్వీయశక్తి పట్ల మీరు ఎప్పుడు జాగృతులవుతారు? మీ పురుషత్వాన్ని మీరు ఎప్పుడు ప్రకటిస్తారు ? మీ స్వంత కాళ్ళపై మీరు ఎప్పుడు నిలబడతారు. కొన్నిసార్లు మీరు మీ భార్య భుజాలపై, కొన్నిసార్లు ప్రభుత్వపు భుజాలపై, కొన్నిసార్లు రాజకీయవేత్తల భుజాలపై వాలిపోతారు.

నేను విన్నాను : ఢిల్లీ సమీపంలో, కొంతమంది కూలీలు వీధిలో ఏదో పని చెయ్యడానికి పంపబడ్డారు. వాళ్ళు అక్కడకు చేరుకుని తాము తమ గునపాలను మరచిపోయామనీ, తాము తమ గునపాలనూ మరి పారలనూ తెచ్చుకోలేదనీ కనుగొన్నారు. వాళ్ళు తాము పనిముట్లు లేకుండానే వచ్చామనీ మరి వాటిని వెంటనే పంపించమనీ చెప్పడానికి ఇంజనీరుకు ఫోను చేశారు.

అతను అన్నాడు, " నేను వాటిని పంపుతాను, అప్పటిదాకా ఒకళ్ళ భుజాలపై ఒకళ్ళు వాలడం ద్వారా మీరు నిర్వహించవలసి వుంటుంది."

కూలీలు చేసేది ఇదే. విశ్రమించడానికి వాళ్ళు తమ గునపాలు మరి పారలపై వాలుతారు. ఆ ఇంజనీరు అన్నాడు, "నాకు వీలైనంత త్వరగా నేను వాటిని పంపుతాను, కానీ అప్పటివరకూ మీరు కేవలం ఒకరి భుజాలపై మరొకరు వాలాల్సి వస్తుంది.

మనం ఎప్పుడూ వాలిపోతుంటాము ; మనం కేవలం భుజాలను మార్చుతూంటాము. అనంతరం మనం ఇదంతా వదిలేసి మరి గురువు యొక్క భుజాలపై వాలిపోతాము. ఇప్పుడు ఏ గురువో మనల్ని దాటించాలి, మనల్ని అతీతంగా తీసుకువెళ్ళాలి.

మీరు మీ స్వంత ప్రకటనను, మీ స్వీయ, వ్యక్తిగత ప్రకటనను ఎప్పుడు చేస్తారు ? మీ ప్రకటనతోనే మీ స్వీయ శక్యత పుష్పీకరణకూ, వికాసానికీ వస్తుంది. మీరు ఎంతకాలం ఆధారపడేవారుగా ఉండబోతున్నారు ? ఒక యాచకుడిగానే ఉండడం పట్ల మీరు ఎంతకాలం పట్టుబట్టబోతున్నారు ? మీరు భగవంతుడిని సైతం భిక్షగా పొందబోతున్నారా ? ఈ నిద్ర నుంచి మేల్కొనండి.

" మళ్ళీ మళ్ళీ ఈ అల్లకల్లోలమైన సంకుల స్థితిలోకి వచ్చి అది భయపడకుండా ఉండేందుకు...."

మీరు ఈ సంకులస్థితిలోకి ప్రవేశించాలని కోరుకున్నారు, కనుక మీరు ప్రవేశించారు. మరి విచిత్రమైన విషయం ఏమిటంటే, మిమ్మల్ని ఏకాంతవాసంలో ఉంచితే కనుక అక్కడ కూడా మీరు భయపడిపోతారు. మిమ్మల్ని ఎవరు ఆపుతున్నారు? హిమాలయాలకు పారిపోండి, ఏకాంతంలో కూర్చోండి. అక్కడ మీరు ఏకాంత వాసం పట్ల భయపడతారు మరి ఈ సంకులస్థితి వద్దకు పరుగెత్తి తిరిగి వస్తారు. మనం ఈ సంకులస్థితిలోనే ఉండిపోతాం. ఎందుకంటే ఒంటరిగా ఉండాలంటే మనం భయపడిపోతాం, మనం ఒంటరిగా జీవించలేం. మరి సమూహంలో ఉన్నప్పుడూ

మనకు బద్ధభావనే కలుగుతుంది. అది అత్యంత కష్టతరమైనది : మనం ఒంటరిగా జీవించలేము, మనం సమూహంలోనూ జీవించలేము.

మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తే ఏమి జరుగుతుందో మీరు గమనించారా ? ఒక చీకటి రాత్రి అరణ్యంలో మీరు ఒంటరిగా ఉన్నప్పుడు మీకు ఏమి జరుగుతుంది ? పరమానందం వస్తుందా ? సంకుల స్థితి మెరుగైనదిగా కనిపిస్తుంది. "నేను కేవలం ఎవరినైనా కలుసుకోగలిగితే, ఎవరితోనైనా మాట్లాడగలిగితే కనుక," ఒంటరిగా మీరు మరణించడం పట్ల ఎంతో భయంతో వుంటారు. ఒంటరిగా మీరు మృత్యువును అనుభూతి చెందుతారు.

మీరు దివ్యత్వంలోకి కరిగిపోయినప్పుడు మీరు పూర్తి ఏకాంతంగా వుంటారు. ఇక్కడ ఇరువురు దైవాలు లేరు ... కేవలం ఒక్కడే వున్నాడు. కరిగిపోండి మరి మీరు ఏకాకి అవుతారు. భగవంతుడిలోకి కరిగిపోతూ మీరు మీరుగా వుండరు, భగవంతుడు భగవంతుడిగా వుండడు ... కేవలం ఒక్కరే మిగులుతారు. ఇందువలనే ధ్యానం యొక్క సన్నద్ధత ఆవశ్యకమవుతుంది, ఏకాంతంగా ఉండడం యొక్క రుచిని మీరు ఆస్వాదించడం ప్రారంభించేందుకు. అత్యున్నత ఏకాంతంలోనికి ప్రవేశించే ముందు, ఏకాంతపు ఆనందాన్ని ఆరంభమవ్వనీయండి, దాని స్వరమాధుర్యాన్ని పలుకనివ్వండి, దాని గీతాన్ని ప్రతిధ్వనించనివ్వండి. ఏకాంతాన్ని ఆస్వాదించడం ప్రారంభించింది. అప్పుడు మీరు అత్యున్నత ఏకాంతంలోకి జారిపోవచ్చు. దైవత్వపు అనుభవాన్ని మీరు సహించగలిగేందుకు అది ఒక శిక్షణ.

మీరు నన్ను అడిగితే కనుక, నేను ఏమి చెబుతానంటే ధ్యానం అనేది భగవంతుడిని సిద్ధించుకోవడానికి ఒక విధానం కాదు, ధ్యానం లేకుండా కూడా భగవంతుడిని సిద్ధించుకోవచ్చు. ధ్యానం అనేది భగవంతుడిని తాళగలిగేందుకు ఒక శిక్షణ. ధ్యానం అనేది మీకు భరించగల సామర్థ్యాన్ని ఇస్తుంది. రేడియో లేదు, టెలివిజన్ లేదు, వార్తాపత్రిక లేదు ... మిత్రుడు లేడు, క్లబ్ లేదు, సమాజం లేదు ... ఏదీ లేదు, మీరు పూర్తి ఏకాంతంగా వుంటారు. ఆ ఏకాంతానికి సన్నద్ధులవ్వండి.

ఈ సంకులస్థితి నుంచి మిమ్మల్ని బయటకు తీసుకెళ్ళడానికి నేను సిద్ధంగా వున్నాను, కానీ మీరు సిద్ధంగా ఉన్నారా? మీరు ఏకాంతంగా కూర్చున్నప్పుడు మీ బుర్ర ఇదే సంకులస్థితిని కల్పించడం ప్రారంభిస్తుంది. తమ ఇళ్ళను త్యజించిన మిత్రులు తమతో తాము మాట్లాడుకుంటూ ఉండడం మొదలు పెడతారు. తమ మస్తిష్కంలో వాళ్ళు తాము వెనుకే వదిలివచ్చిన భార్యతో మాట్లాడడం ప్రారంభిస్తారు. మొత్తం సమూహం మళ్ళీ సమీకరించబడింది. ఊహల అల్లికలు అల్లబడ్డాయి. మీరు ఒంటరిగా ఉండలేరు. కనుక మీరు మళ్ళీ మళ్ళీ తిరిగివస్తారు.

మీరు ప్రపంచానికి కారణరహితంగా తిరిగిరారు. మీరు మీ స్వీయ సమ్మతితోనే తిరిగి వస్తారు. మీరు ఈ సంకులస్థితినే కోరుకుంటారు, కనుక మీరు తిరిగి వస్తారు.

మానవుడి యొక్క జీవితం అసలేమీ కాదు.

విషయమేమిటంటే, ఏ విషయమూ అంత ముఖ్యమైనది కాదు

.... మానవుడి జీవితం అసలేమీ కాదు.

మానవుడి జీవితం జీవితమే కాదు. జీవితం సమస్తానికి చెందుతుంది.

విషయమేమిటంటే, ఏ విషయమూ అంత ముఖ్యమైనది కాదు.

.... మానవుడు కేవలం అర్థరహితమైనవాడు.

నిన్న, ముల్లా నసీరుద్దీన్ మంచం పైనుంచి పడిపోవడం .. కేవలం అర్థరహితమైనది. అతను పడిపోయి మరి తన కాలు విరగ్గొట్టుకున్నప్పుడు అతను ఉనికిలో లేని ఒక శిశువు కోసం స్థలాన్ని ఏర్పరుస్తున్నాడు.

న్యాయస్థానంలో ఒక కేస్ వుంది. ఇరువురు పురుషులు పోట్లాడుకుంటూ ఉన్నారు. ఏమి జరిగింది అని న్యాయమూర్తి అడిగాడు. వాళ్ళిద్దరూ సంశయించారు. వాళ్ళు చెప్పారు, " మేము ఏం చెప్పగలం ? ఏమి జరిగిందో మేము చెబితే కనుక మేము ఎంతో ఇబ్బందికి గురవుతాము. కేవలం మాకు తగిన శిక్షను ఇవ్వండి."

అతను అన్నాడు, " విషయమేమిటో తెలసుకోవాలనే నేను ఇంకా అనుకుంటున్నాను : నేను ఎవరిని శిక్షించాలి?"

వాళ్ళు ఒకరివైపు మరొకరు చూసుకుని అన్నారు, " నువ్వు ఆయనకు చెప్పు."

మీరు నాకు చెప్పబోతున్నారా లేదా ? " అని ఆ న్యాయమూర్తి ఆగ్రహించడం ప్రారంభించినప్పుడు, వాళ్ళు బలవంతాన చెప్పాల్సి వచ్చింది.

వాళ్ళు అన్నారు, " విషయం ఇలా వుంది : మేము మిత్రులం. మేము నదీ తీరాన ఇసుకలో కూర్చుని వున్నాం. తాను ఒక గేదెను కొనబోతున్నానని ఈ మిత్రుడు చెప్పాడు. అప్పుడు నేను అన్నాను, " గేదెను కొనవద్దు ఎందుకంటే నేను ఒక పొలాన్ని కొనబోతున్నాను మరి నీ గేదె నా పొలంలోకి వస్తే కనుక అప్పుడు మన జీవితకాల స్నేహం చెడిపోతుంది."

" అప్పుడు అతను అన్నాడు, " పో ఇక్కడి నుంచి ! నువ్వు పొలాన్ని కొనబోతుండడం వలన నేను గేదెను కొనవద్దా ?... అలాంటప్పుడు పొలాన్ని కొనకు ! మరి ఒక గేదె అనేది గేదే, అది లోపలికి వస్తే కనుక, అది లోపలికి వస్తుంది. దాని వెంటపడి తరుముతూ నేను నా రోజంతటినీ గడుపబోవడం లేదు. మరి ఈ స్నేహానికి విలువేముంది, కేవలం నా గేదె నీ పొలంలోకి ప్రవేశించడం గురించి నువ్వు ఇంత గోల చేస్తున్నావు ? "

" నేను కూడా నా సింహాసనాన్ని అధిష్టించాను మరి అన్నాను, " మంచిది, అయితే నేను నా పొలాన్ని కొన్నాను, కేవలం నువ్వు కొన్న గేదెను నాకు చూపించు."

" అప్పుడు నేను ఇసుకలో ఒక కర్రపుల్లతో ఒక పొలాన్ని గీశాను మరి ఈ వెధవ తన కర్రపుల్ల గేదెను లోపలికి ప్రవేశించేలా చేశాడు. మేము పోట్లాడుకున్నాము, మేము కొట్టుకునేదాకా వచ్చాము. మేము మీకు ఏం చెప్పగలము ? కేవలం మాకు మా శిక్షను విధించండి. మరేదైనా చెప్పాలంటే మాకు ఇబ్బందికరంగా వుంది."

మానవుడి యొక్క జీవితం అసలేమీ కాదు.
విషయమేమిటంటే ఏ విషయమూ అంత ముఖ్యమైనది కాదు.
నువ్వు మానవుడికి సకలమూ ఇచ్చావు.
అయినా మానవుడి యొక్క మూర్తి అసలేమీ కాదు.
హృదయం మరి కాలేయాల యొక్క ఈ కోరిక తప్ప.
ప్రేమ ఘటన అసలేమీ కాదు.
సౌందర్యం యొక్క ప్రపంచమే సకలమూ
ప్రేమ ప్రపంచం అసలేమీ కాదు.
మానవుడు కేవలం వస్త్రాలను మాత్రమే మార్చుతాడు :
ఈ జనన మరణాలు అసలేమీ కాదు.

మానవుడు కేవలం తన వస్త్రాలను మార్చుతూ పోతాడు. జీవితం మనకు తెలిసిన విధంగా ఏదీ కాదు, మృత్యువూ ముఖ్యమైనదేదీ కాదు.

మానవుడు కేవలం వస్త్రాలను మాత్రమే మార్చుతాడు :
ఈ జనన మరణాలు అసలేమీ కాదు.

...మానవుడి యొక్క జీవితం అసలేమీ కాదు.
విషయమేమిటంటే ఏ విషయమూ అంత ముఖ్యమైనది కాదు.

మీరు దీనిని అవగాహన చేసుకుంటే కనుక, అంత ముఖ్యమైనదేమీ కానీ ఓ విషయమే మీరు అనేది, అప్పుడు మీరు అంతటినీ అవగాహన చేసుకున్నారు.

చివరి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

ఎంతో కాలంగా నేను అడగాలని అనుకున్నాను : దయచేసి మీరు నాకు చెబుతారా, నేను ఏమి అడగాలి ? నా ప్రణామాన్ని, నా సాష్టాంగ నమస్కారాన్ని స్వీకరించండి.

ఈ ప్రశ్నను దులారి అడిగింది. అది పూర్తిగా నిజం : ఆమె నాకు కొన్ని సంవత్సరాలుగా తెలుసు, మరి ఆమె ఎన్నడూ ఏదీ అడుగలేదు. అతి కొద్దిమంది మాత్రమే ఎన్నడూ అడుగలేదు. ఇదే మొదటిసారి. మరి అయినాగానీ ఆమె ఏమీ అడుగలేదు : " ఎంతోకాలంగా నేను అడగాలని అనుకున్నాను : దయచేసి మీరు నాకు చెబుతారా, నేను ఏమి అడుగాలి ?"

జీవితం యొక్క వాస్తవ ప్రశ్న ఎలాంటిదంటే దానిని అడుగలేము. మీరు అడగగలిగిన ప్రశ్న అడుగదగినది కాదు. మీరు అడుగలేనిది, అదే అడుగదగినది. జీవితం యొక్క వాస్తవ ప్రశ్న మాటలలో పెట్టలేనిది. వర్షం కోసం దాహార్తితో ఉన్న కనుల ద్వారా, తెలుసుకోవాలనే తపనతో నిండిపోయిన కళ్ళ ద్వారా మాత్రమే జీవితపు ప్రశ్నలు చెప్పబడతాయి.

నాకు దులారీ తెలుసు. ఆమె ఎన్నడూ అడుగలేదు, కానీ ఆమె ప్రశ్నను నేను విన్నాను. మరి ఆమె ప్రశ్న ఆమెది కాదు, ఎందుకంటే మీరు అడుగగలిగినదే మీదవుతుంది. మీరు అడగలేనిది ప్రతి ఒక్కరిదీ అవుతుంది.

ఇదే ప్రశ్న మనలో ప్రతి ఒక్కరి అంతరంగంలోనూ వుంది. మరి ఈ ప్రశ్న ఏమిటంటే : ఇదంతా సంభవిస్తోంది, ఇదంతా జరుగుతోంది, అయినాగానీ ఏదీ వాస్తవమైనదిగా కనిపించడంలేదు. నలుదిశలా ఈ పరుగంతా, ఈ కోలాహలమంతా – కానీ ఏదీ అర్థవంతమైనదిగా కనిపించడంలేదు. ఎంతో సాధించబడింది మరి కోల్పోబడింది – అయినా ఏదీ సాధించబడలేదు, ఏదీ కోల్పోబడలేదు. ఈ సుదీర్ఘ పయనం, జన్మ తరువాత జన్మ, అక్కడ ఏ గమ్యమూ కనిపించదు. మనం ఉన్నాం ... ఎందుకు ? మన యొక్క ఈ ఉనికి ఏమిటి ? మనం ఎక్కడకు వెళుతున్నాం, మరి ఏమి జరుగుతోంది ? మన ఉద్దేశ్యం ఏమిటి ? ఈ సంగీతం యొక్క భావమేమిట ?

ఈ అస్తిత్వపు ప్రశ్న ప్రతి ఒక్కరి అంతరంగంలోనూ వుంది : అస్తిత్వం యొక్క ఉద్దేశ్యం ఏమిటి ? మరి మాటలలో ఏ సమాధానమూ లేదు. మాటలలో అడుగలేని ఒక ప్రశ్న. మాటలలో సమాధానాన్ని కలిగి వుండలేదు. మన అంతరంగంలో ఉన్నది ... దానిని సాక్షి, గమనించేవాడు, జీవననది, చైతన్యం అని పిలువండి, మీ ఇష్టం వచ్చిన పేరుతో దానిని పిలువండి. అది పేరులేనిది, కనుక మీకు ఇష్టం వచ్చిన పేరును దానికి పెట్టండి ... భగవంతుడు, విముక్తి, నిర్వాణం, ఉనికి, ఉనికి లేనిది, మీ ఇష్టం వచ్చినదేదైనా ; పూర్ణత, శూన్యం, ఏదైనాగానీ ; అంతరంగంలో అది పేరు లేనిదిగానే వుంటుంది ... దీనిలో మిమ్మల్ని మీరు ముంచుకోండి. కేవలం దానిలో పడిపోగానే, ప్రశ్నలు క్రమక్రమంగా మాయమవ్వడం ప్రారంభిస్తాయి.

మీరు జవాబులను కనుగొంటారు అని నేను చెప్పడం లేదు, ఆ ప్రశ్నలు కేవలం కరిగిపోతాయి. మరి ఆ ప్రశ్నలు కరిగిపోయినప్పుడు మీ చైతన్యమే సమాధానం అవుతుంది. మీరు సమాధానాన్ని పొందుతారు అని నేను చెప్పడం లేదు. మీరు ప్రశ్న రహితులై ఉన్నప్పుడు జీవితపు ఆనందం, ఆ మహా అనుగ్రహం మరి ఆశీర్వాదం కురుస్తూ వస్తాయి. మీరు నాట్యం చేస్తారు, మీరు ఓ మధుర స్వరాన్ని అవ్యక్తంగా పాడుతూంటారు, మీరు ఆలపిస్తూంటారు. సమాధి పుష్పించింది. అప్పుడు మీరు ఏమీ అడుగరు. అడగడానికి ఏమీ లేదు. అప్పుడు జీవితం ఒక ప్రశ్న కాదు, జీవితం ఒక రహస్యం. పరిష్కరించవలసిన సమస్య కాదు కానీ జీవించాల్సిన, వర్తించాల్సిన, ఆలపించాల్సిన ఓ నిగూఢ రహస్యం. ఉత్సవం చేసుకోవలసిన ఓ నిగూఢ రహస్యం.

లోపలికి వెళ్ళండి. శరీరానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా, భావోద్వేగాలకు అతీతంగా... లోతుగా మరి లోతుగా లోనికి వెళ్ళండి.

జీవితాంతం నేను కనుగొనలేకపోయాను,

అనురాగం అంటే ఏమిటి? ప్రేమ ఎక్కడ వుంది ?

సుమాలు తమ సుగంధాన్ని ఎక్కడ విడుదల చేస్తాయి ?

ఒక పరిమళం పుట్టుకొస్తున్నట్లు కనిపిస్తుంది ... అది ఎక్కడి నుంచి వచ్చింది ? జీవితం ఉంది. దాని నీడ ఇక్కడ పడుతోంది, కానీ దాని వేరు ఎక్కడ వుంది ? నీడలు మెరుస్తున్నాయి, కానీ మూలం ఎక్కడ వుంది ? పర్వతాలలో ప్రతిధ్వనులు మారుమ్రోగుతున్నాయి, కానీ మూలమైన ధ్వని ఎక్కడ వుంది ?

జీవితాంతం నేను కనుగొనలేకపోయాను,

అనురాగం అంటే ఏమిటి ? ప్రేమ ఎక్కడ వుంది ?

సుమాలు తమ సుగంధాన్ని ఎక్కడ విడుదల చేస్తాయి ?

నేను ఒక నిట్టూర్పుల వధువును కలుసుకున్నాను

నాకు ముళ్ళ నవ్వులే ఇవ్వబడ్డాయి.

జీవితాంతం నేను కనుగొనలేకపోయాను :

సౌరభం అంటే ఏమిటి ? పుప్పొడి ఎక్కడ వుంది ?

మరి మేఘాలు ఎక్కడ వర్షిస్తాయి ?

... కానీ మేఘాలు వర్షిస్తున్నాయి ... మీ ప్రగాఢాంతర్గతంలో. సుమాలు తమ సుగంధాన్ని వెదజల్లుతున్నాయి ... మీ అత్యాంతరిక కేంద్రంలో. పరిమళం కస్తూరి మృగం యొక్క నాభిలో వుంది.

మిమ్మల్ని ఆవరించిన మరి ఓ ప్రశ్నగా మారిన ఈ పరిమళం ... అది ఎక్కడ ఉదయిస్తోంది ? ఈ పరిమళం మీదే, అది మరెవ్వరిదీ కాదు. మీరు దానికోసం బాహ్యంలో వెతికితే అది ఒక ఎండమావి అవుతుంది, అది మాయ యొక్క వలను పరుస్తుంది, మిమ్మల్ని అంతమేలేని పయనానికి తీసుకువెళుతుంది. మీరు అంతరంగంలోనికి చూసిన రోజు, ఆలయ ద్వారం తెరుచుకుంటుంది. ఆ రోజు మీరు మీ పరిమళభరిత కేంద్రాన్ని చేరుకుంటారు. అక్కడ ప్రేమ ఉంది. అక్కడ దైవత్వం వుంది.

మనస్సు బాహ్యంలోనే చిక్కుకుపోతుంది. మనస్సు అంటుంది, "నేను అంతరంగంలోనికి వెళ్లాను, కానీ కొద్దికాలం తరువాత."

ఏదో కోరిక చేత నిలువరించబడి, నేను ఎంతో కాలం నిలుచున్నాను,
మౌనంగా, నదీతీరాన ఒంటరిగా
మనోహరమైన సందె చీకటివేళ ... ఆనందాల సంగ్రహం.
ఈ సందె చీకటి మసక వెలుతురు నా ఆలోచనలను ముంచెత్తుతుంది.
నా ఆలోచన కూడా తన సాయంసంధ్యను చేరుకుందని నేను భావిస్తున్నాను.
ఒక మహా అవిశ్రాంతత వుంది,
కానీ జీవితంలో, నిరాశలో సైతం ఆశ పోషించబడుతుంది.
ఓ హృదయమా ! నీ మొండి ఆటలను ఇంకొంతకాలం ఆడు.
రంజిలజేసే మసక వెలుగును చిరునవ్వుతో ఆలింగనం చేసుకో,
రాత్రి దిగివచ్చేందుకు ఇంకా సమయం వుంది.

మనస్సు సూచననిస్తూనే వుంటుంది : కేవలం ఇంకొంత, మరి కొంత కాలం... కేవలం కలల్లో మిమ్మల్ని మీరు మరచిపోండి... ఎండమావుల వెంట పరుగెత్తుతూనే ఉండండి. ఎంత అందమైన కలలు ! మృత్యువు రావడానికి ఇంకా చాలా సమయం వుంది.

ప్రజలు అనుకుంటారు : మేము సన్యాసం స్వీకరిస్తాం, మేము ప్రార్థిస్తాం, మేము ధ్యానం చేస్తాం ... వృద్ధాప్యంలో, మృత్యువు వచ్చి మరి ద్వారం వద్ద నిలిచి వున్నప్పుడు. ఒక పాదం అప్పటికే శ్మశానంలో ఉన్నప్పుడు మేము మరొక పాదంతో ధ్యానం కోసం అడుగు వేస్తాం.

ఓ హృదయమా ! నీ మొండి ఆటలను ఇకొంతకాలం ఆడు,

రంజిలజేసే మసక వెలుగును చిరునవ్వుతో ఆలింగనం చేసుకో,

రాత్రి దిగివచ్చేందుకు ఇంకా సమయం వుంది.

మనం వాయిదా వేస్తూనే వుంటాం. రాత్రి దగ్గరకు వచ్చేస్తోంది. పుష్కలమైన సమయం లేదు. రాత్రి ఇప్పటికే కమ్మేసింది. ఎన్నోసార్లు ఈ జన్మను, ఈ జీవితాన్ని మనం వృథా చేశాం. మనం మృత్యువు కోసం నిరీక్షిస్తున్నాం ... మరి ధ్యానం వచ్చే కన్నా ముందే మృత్యువు వచ్చేస్తుంది. మరొక జన్మ నాశనమైపోయింది. మరొక అవకాశం వృథా అయిపోయింది. ఈసారి అది జరుగనివ్వకండి. ఈసారి వాయిదా వేయకండి. ఈ పరిమళం మీ స్వంతం. ఈ జీవితం మీ అంతరంగంలోనే దాగి వుంది. మీ అంతరంగంలోనే ఆ ముసుగు తీయబడాలి.

ప్రశ్నలు అడుగవద్దు. అక్కడ నుంచి ఏ సమాధానమూ రాబోవడం లేదు. ప్రశ్న ఎక్కడి నుంచి ఉదయిస్తోందో, ఆ అంతరంగంలోకి ప్రవేశించండి. ప్రశ్న అస్పష్టంగా ఉంటే కనుక బెంగపడకండి. ప్రశ్నించడం యొక్క ఈ అస్పష్టమైన సగం వెలుగులోకి ప్రవేశించండి. క్రమక్రమంగా ఈ మసకైన సందెచీకటి వెలుతురులోకి ప్రవేశించండి. ప్రశ్న ఏమిటి అనేది పెద్దగా పట్టించుకోకండి ... కేవలం అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో గమనించండి. ఆ ప్రదేశాన్ని, ప్రశ్నించడం యొక్క బీజాలు అంకురించే, ప్రశ్నలు చిగురించే అంతరంగంలోని ఆ లోతైన ప్రదేశాన్ని అన్వేషించండి. అక్కడే మూలం వుంది, అక్కడ మీరు సమాధానాన్ని కనుగొంటారు. 'సమాధానం' అంటే అర్థం మీరు ఒక స్థిరమైన సమాధానమేదో, ముక్తాయింపేదో కనుగొంటారని కాదు. సమాధానం అంటే మీరు పరమానందపు అనుభవాన్ని, కృతజ్ఞతను, జీవితాన్ని అనుభవిస్తారని అర్థం. అక్కడ జీవితం ఓ సమస్య కాదు, అక్కడ జీవితం ఓ ఉత్సవం అవుతుంది.

మృదువైన, గాఢ నిశ్శబ్దంలో
రగులుతున్న మరి కేకలు పెడుతున్న కోరికలు
నిప్పు రాజుకుంటాయి మరి కరిగిపోతాయి.
దానిలో నీ శబ్దరహిత గీతం కొట్టుకుంటుంది,
సత్యం వెల్లడి అవుతుంది.
... మృదువైన, గాఢ నిశ్శబ్దంలో
రగులుతున్న మరి కేకలు పెడుతున్న కోరికలు
నిప్పరాజుకుంటాయి మరి కరిగిపోతాయి.

లేదు, అంతరంగంలో ఒక నిశ్శబ్దం వుంది, కోరిక యొక్క జ్వాల సమస్తమూ క్రమంగా దానిలో మాయమైపోయి మరి నిశ్చలమైపోయే ఒక ప్రశాంతత వుంది.

దానిలో నీ శబ్ద రహిత గీతం కొట్టుకుంటుంది,
సత్యం వెల్లడి అవుతుంది.

ఇక్కడ జీవితం యొక్క సత్యం సాక్షాత్కరిస్తుంది, విదితమవు తుంది.

ఒక నల్లని కరిగించే రాత్రిలో
రూపాలు, శిలావిగ్రహాలు, ప్రతిమలు అన్నీ కరిగిపోతాయి.
కలలకు అతీతంగా, రూపాలకు అతీతంగా
పవిత్రమైన, గాఢనిద్రలోకి అందరూ ఆశ్రయం పొందుతారు.
దాని లోపలి నుంచి నువ్వు నీ చేతిని చాచి,
అకస్మాత్తుగా నన్ను చెంతకు లాక్కుంటావు మరి నన్ను కౌగిలించుకుంటావు.

భగవంతుడు మీ అంతరంగంలోనే దాగి ఉన్నాడు. మీ విగ్రహాలను, మీ ఆలోచనలు, ప్రతిమలు, నమ్మకాలను వదిలెయ్యండి... అవి మనస్సు యొక్క సబ్బు నురగలే ! ఏ తరంగాలూ, ఏ మాటలూ లేని లోతులలోకి ప్రవేశించండి ; అక్కడ నిశ్శబ్దం వుంది. అక్కడ అత్యున్నత నిశ్శబ్దం స్వరం విప్పుతుంది. అక్కడ కేవలం నిశ్శబ్దమే ప్రతిధ్వనిస్తుంది.

దానిలోనే శబ్ద రహిత గీతం కొట్టుకుంటుంది
సత్యం వెల్లడి అవుతుంది.
అక్కడ ప్రవేశించండి.

దాని లోపలి నుంచి నువ్వు నీ చేతిని చాచి,

అకస్మాత్తుగా నన్ను చెంతకు లాక్కుంటావు మరి నన్ను కౌగిలించుకుంటావు.

ఇదే ఆ కలయిక, ఆ ఐక్యత.

మీరు అన్వేషిస్తున్నది మీ అంతరంగంలోనే దాగి వుంది. మీరు అన్వేషిస్తున్న ప్రశ్న, దాని సమాధానం మీ అంతరంగంలోనే దాగి వుంది. మేల్కొనండి ! దానిని ఈ క్షణమే వేడుక చేసుకోండి ! అష్టావక్రుడి యొక్క సూత్రాలన్నీ ఈ ఒక్క సందేశాన్నే ఇస్తాయి: అది సిద్ధించుకోవలసినది కాదు, అది ఇప్పటికే సిద్ధించింది. మేల్కొనండి మరి వేడుక చేసుకోండి.

హరి ఓం తత్ సత్ !

జనకుడు అన్నాడు : అద్భుతం ! నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను, నేను శాంతిని, నేను ఎరుకను, నేను ప్రకృతికి అతీతుడను. అయ్యో, ఇంతకాలమూ భ్రమ చేత నేను మోసగించబడ్డాను !

నేను ఒక్కడినే ఈ దేహాన్ని ప్రకాశింపజేస్తున్నట్లుగానే, ఈ విశ్వాసాన్ని సైతం నేను ప్రకాశింపజేస్తున్నాను. అయితే ఈ సమస్త విశ్వమూ నాదే లేదా అసలేదీ నాది కాదు.

ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి, ఇప్పుడు మీ ప్రబోధం యొక్క నైపుణ్యం ద్వారా నేను కేవలం దివ్యత్వాన్ని మాత్రమే చూస్తున్నాను.

అలలు, నురగలు మరి బుడగలు నీరే తప్ప మరేదీ కాని విధంగానే, ఈ ఏకాత్మ ఆ విశ్వాత్మే తప్ప మరేదీ కాదు.

పరిశీలించినప్పుడు వస్త్రం అనేది దారం తప్ప మరేదీ కానట్లుగానే, పరిశీలించినప్పుడు ఈ విశ్వం సైతం ఆత్మ తప్ప మరేదీ కాదు.

చెరకురసం నుంచి ఉత్పత్తి చేయబడిన చక్కెర దానితో పూర్తిగా నిండి వున్నట్లుగానే, నా నుంచి ఉత్పత్తి అయిన ఈ విశ్వం నా చేత అన్ని విధాలుగా వ్యాప్తి చెందుతుంది.

ఆత్మ యొక్క అజ్ఞానం ద్వారా ఈ ప్రపంచం అప్పుడు కనిపిస్తుంది. ఆత్మను తెలుసుకోవడం ద్వారా అది కనిపించదు. తాడు గురించిన అజ్ఞానం ద్వారా ఒక పాము కనిపిస్తుంది. తాడును తెలుసుకోవడం ద్వారా అది కనిపించదు.

⑦

నేను మోసగించబడ్డాను!

అకస్మాత్తుగా అంధకారంలో కాంతి యొక్క మెరుపు మెరిసినట్లు లేదా ఒక అంధుడు అకస్మాత్తుగా చూసినట్లు ... జనకుడికి సంభవించినది ఇదే. తాను ఇంతకుముందు ఎన్నడూ చూసి వుండని దానిని అతను చూశాడు. తాను ఇంతకుముందు ఎన్నడూ విని వుండని దానిని అతను విన్నాడు. అతని హృదయం ఒక నూతన లయతో, ఒక నూతన అభిరుచితో నిండిపోయింది. అతని జీవం ఒక నూతన దృష్టిని పొందింది. నిశ్చయంగానే జనకుడు సంసిద్ధుడుగా మరి లభ్యమై వున్నాడు.

పర్వతాలపై వర్షం కురిసినప్పుడు, అవి అప్పటికే నిండిపోయి ఉన్నందున, పర్వతాలు శూన్యంగానే ఉంటాయి. సరస్సులపై వర్షం కురిసినప్పుడు, ఖాళీ సరస్సులు నిండుతాయి.

శూన్యంగా ఉన్నవారు లభ్యమై ఉంటారు ... నిండిపోయి వున్నవారు అలభ్యమై వుంటారు.

అహం ఎవరినైనా శిలలా తయారు చేస్తుంది. అహంకార రాహిత్యం ఎవరికైనా విశాలతను, శూన్యతను ఇస్తుంది.

జనకుడు ఒక ఖాళీ పాత్రగా ఉండి వుంటాడు. ఆశ్చర్యం, భక్తి భావం, అప్రమేయంగా కలిగాయి. అతను దానిని విన్నాడు మరి జాగృతుడయ్యాడు. అతను విన్నప్పటికి ఆ పిలుపు దాదాపు ఇవ్వబడనే లేదు. కొరడా యొక్క నీడే చాలు ; దానిని ఝుళిపించవలసిన అవసరమే లేదు, మరి కొరడాతో కొట్టడం అనే ప్రశ్నే లేదు.

జనకుడిలాంటి యోగ్యుడైన శ్రోతను కలిగి వుండడంలో అష్టావక్రుడు అత్యంత భాగ్యశాలి. అష్టావక్రుడంతటి భాగ్యశాలి అయిన గురువు మానవ చరిత్ర అంతటిలోనూ మరెవ్వరూ లేరు. జనకుడిలాంటి ఒక శిష్యుడిని కనుగొనడం అత్యంత అరుదైనది ... తన నిద్రను భంగపరచడానికి కొద్దిపాటి గాలి స్పర్శే చాలు అన్నట్లుగా, అతను

కేవలం నిరీక్షిస్తున్నట్లుగా కేవలం స్వల్పమాత్రపు సూచనకే జాగృతమయ్యేవాడు. ఆ నిద్ర గాఢమైనది కాదు ; ఎన్నో కలల భారంతో లేదు, కేవలం కాబోతూ వుంది. ప్రాతఃకాలపు ఆరంభ దశ వచ్చింది, అరుణోదయం వేగంగా అరుదెంచుతోంది.

బౌద్ధ జాతక కథలలో ఒక వృత్తాంతం ఏమిటంటే బుద్ధుడు జ్ఞానోదయం పొందినప్పుడు అతను ఏడు రోజుల పాటు మౌనంగా ఉన్నాడు. బుద్ధుడు అనుకున్నాడు, "నన్ను అవగాహన చేసుకోగలిగినవాళ్ళు, నేను మాట్లాడకపోయినా కూడా నన్ను అవగాహన చేసుకోగలరు, మరి నన్ను అవగాహన చేసుకోలేనివాళ్ళు, నేను ఎంతగా వివరించినప్పటికీ అవగాహన చేసుకోలేరు. కనుక ఉపయోగం ఏమిట ?... నేను ఎందుకు మాట్లాడాలి ? నిరుపయోగంగా నన్ను నేను శ్రమకు గురిచేసుకోవడం ఎందుకు? మేల్కొనడానికి సంసిద్ధతతో ఉన్నవారిని ఏదైనా మేల్కొల్పగలదు. వాళ్ళ కోసం పిలువవలసిన మరి అరువవలసిన అవసరం లేదు. ఒక పక్షి తన పాటను పాడుతుంది, వృక్షాల మధ్య నుంచి ఓ పవనం వీస్తుంది ... అది చాలు."

మరి అది జరిగింది ... లావో ట్జు ఒక వృక్షం కింద కూర్చుని ఉన్నాడు : ఆ వృక్షం నుంచి ఒక ఎండుటాకు రాలింది మరి వృక్షం నుంచి ఎండుటాకు రాలడాన్ని చూస్తూ అతను జ్ఞానోదయాన్ని సిద్ధించుకున్నాడు. ఆ ఎండుటాకు అతని గురువు అయ్యింది. అతను కేవలం సకలాన్నీ వీక్షించాడు... ఆ ఎండుటాకులో అతను తన జననాన్ని చూశాడు, అతను తన మరణాన్ని చూశాడు. ఆ ఎండుటాకు యొక్క మరణంలో సకలమూ మరణించింది. ఒకరోజు అతను కూడా ఒక ఎండుటాకులా గాలిపోతాడు. ప్రతీదీ అంతమైపోయింది.

బుద్ధుడికీ అదే జరిగింది. బాటపై ఒక అస్వస్థుడైన వృద్ధుడిని చూసినప్పుడు అతను అఘాతానికి గురయ్యాడు. మరి అతను ఒక శవాన్ని చూసినప్పుడు అతను అడిగాడు, " ఈ మనిషికి ఏమి జరిగింది ?"

అతని రథ సారథి చెప్పాడు, " మీకూ, మరి ప్రతి ఒక్కరికీ కూడా ఇదే జరుగుతుంది. ఒకరోజు మృత్యువు వస్తుంది."

బుద్ధుడు అన్నాడు, " అయితే రథాన్ని వెనక్కు మళ్ళించు మరి నన్ను ఇంటికి తీసుకువెళ్ళు. ఇక వెళ్ళేందుకు ఏ తావూ లేదు. మృత్యువు సమీపిస్తూంటే కనుక, జీవితానికి ఏ అర్థమూ లేదు."

దహనం గావించడానికి వీధుల వెంట మోసుకెళ్ళబడే మృతదేహాలను మీరు చూశారు. మీరు కూడా బాట పక్కన నిలబడి వున్నారు మరి ఒక్క క్షణం సానుభూతి చెందారు. మరి మీరు అని వుంటారు, " ఈ దీనుడు మరణించాడు ... ఎంతటి దుఃఖకరమైన విషయం ! అతను ఇంకా యువకుడే, అతను యవ్వనవతి అయిన తన భార్యను మరి పిల్లలను వదిలిపోయాడు. ఎంత విచారకరం !" ఆ మృత వ్యక్తి పట్ల మీరు జాలి పడ్డారు ... మీ పట్ల మీరు ఏ జాలినీ అనుభూతి చెందలేదు.

మరణిస్తున్న వ్యక్తి మీ మృత్యువు యొక్క సందేశాన్ని తీసుకువచ్చాడు : ఈరోజు అతను పాడెపై మోసుకుపోబడుతున్నాడు, రేపు లేదా ఆ మరునాడు మీరు పైకెక్కించబడి మరి మోసుకుపోబడతారు. దారి పక్కన నిలబడి మీరు అతని పట్ల సానుభూతి చెందుతున్న విధంగానే, మీ కోసం సానుభూతి చెందుతూ ఇతర ప్రజలు కూడా దారి పొడవునా నిలిచి వుంటారు. మీరు ఎంత నిస్సహాయులుగా ఉంటారంటే మీరు కనీసం వారికి ధన్యవాదాలైనా చెప్పలేరు. దారి వెంబడి వెళుతూండగా మీరు చూసే ఆ మృతదేహం మీదే.

మీకు కళ్ళు, దృష్టి, గాఢత, ప్రగాఢమైన ఎరుక ఉంటే కనుక, అప్పుడు ఒక మనిషి మరణించినప్పుడు, సమస్త మానవాళి మరణిస్తుంది మరి జీవితం అర్థరహితమైనది అవుతుంది. బుద్ధుడు సకలమూ పరిత్యజించాడు మరి వెళ్ళిపోయాడు. కానీ అతను జ్ఞానోదయాన్ని పొందినప్పుడు అతను అనుకున్నది ఏమిటంటే ఎవరైతే జాగృతుడవ్వబోతున్నాడో అతను ఎలాగైనా జాగృతుడవ్వబోతున్నాడు, అతనిని ఎవ్వరూ జాగృతపరచకుండానే. ఆ వ్యక్తికి ఏ సాకు అయినా సరిపోతుంది.

ఒక జెన్ సన్యాసిని బావి వద్ద నుంచి నీటిని మోసుకొస్తున్నప్పుడు ఆమె కర్ర విరిగిపోయి మరి ఆ కుండలు క్రిందపడి పగిలిపోయాయని చెప్పబడుతుంది. అది ఒక పౌర్ణమి రాత్రి, మరి ఆ నీటి కుండల్లో చంద్రుడు ప్రతిబింబిస్తున్నాడు. కావడి కుండలను భుజంపై మోస్తూ, ఆమె ఆశ్రమానికి తిరిగి వస్తోంది మరి ఆ కుండలలో చంద్రుడి యొక్క ప్రతిబింబాన్ని వీక్షిస్తోంది. ఆ కుండలు పడిపోయాయి. ఆమె అక్కడ అద్భుతంలో నిలబడి వుంది. ఆ కుండలు పడిపోయాయి. నీరు బయటకు ప్రవహించింది ... చంద్రుడు కూడా బయటకు ప్రవహించాడు. అప్పుడే మరి అక్కడే జ్ఞానోదయం జరిగింది అని చెప్పబడుతుంది ; సమాధి సంభవించింది. ఆమె నాట్యం చేస్తూ తిరిగి వచ్చింది. ఈ ప్రపంచం ఓ ప్రతిబింబమే తప్ప మరేదీ కాదు అనేది ఆమె చూసింది.

మనం ఇక్కడ రూపొందిస్తూపోయేదంతా ఏ క్షణంలోనైనా బద్దలైపోతుంది. ఈ చంద్రుళ్ళన్నీ మాయమైపోతాయి. ఈ అందమైన కవితలన్నీ అంతర్ధానమైపోతాయి. ఈ మనోహరమైన ముఖారవిందాలన్నీ మరుగైపోతాయి. అవి అన్నీ నీటిపై ప్రతిబింబాలే. ఆమె దీనిని చూసింది అంతా అంతమైపోయింది.

బుద్ధుడు అనుకున్నాడు, " ఉపయోగం ఏమిటి ? నేను ఎవరితో మాట్లాడుతాను ? జాగృతలవ్వబోతున్నవాళ్ళు నేను లేకుండానే ముందు వెనుకలుగా జాగృతులవుతారు, అది కేవలం స్వల్ప కాలానికి సంబంధించిన ప్రశ్న. మరి జాగృతులు అవ్వాలనుకోనివాళ్ళు, నేను అరచినా మరి కేకలు పెట్టినా కూడా వాళ్ళు కేవలం దొర్లుతారు మరి తిరిగి నిద్రలోకి జారుకుంటారు. వాళ్ళు తమ కళ్ళను తెరిస్తే కనుక వాళ్ళు కోపంతో చూస్తారు మరి అడుగుతారు, " నువ్వు నా నిద్రను ఎందుకు భంగపరుస్తున్నావు ? నీకు చేసేందుకై ఇంతకన్నా మెరుగైనదేదీ లేదా ? నిద్రపోవాలని అనుకుంటున్నవారిని, నువ్వు ప్రశాంతంగా నిద్రపోనీయవా ? నేను గాఢనిద్రలో ఉన్నాను మరి నన్ను మేల్కొల్పడానికి నువ్వు వెంట వచ్చావు."

మిమ్మల్ని పెందలకడ నిద్రలేపమని మీరు ఎవరికో చెబుతారు, మరి అతను మిమ్మల్ని మేల్కొలిపినప్పుడు, మీకు కోపం వస్తుంది. మీరు అతనికి చెప్తారు, "నేను రైలును అందుకోవాలి : నన్ను పెందలకడ, నాలుగింటికి నిద్రలేపు," కానీ అతను మిమ్మల్ని మేల్కొల్పినప్పుడు మీరు చంపెయ్యడానికి సిద్ధంగా వుంటారు !

ఇమ్మాన్యుయెల్ కాంత్ ఒక గొప్ప జర్మన్ చింతనాపరుడు. అతను ప్రతిరోజూ ఉదయం మూడు గంటలకు నిద్రలేస్తాడు. అతను గడియారాన్ని అనుసరించేవాడు, గడియారపు ముళ్ళనే అనుసరించేవాడు. అతను బోధించేందుకై విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు, దారిపొడవునా ప్రజలు అతని ప్రకారం తమ గడియారాలను సరిచేసుకునేవాళ్ళు అని చెప్పబడుతుంది... ఎందుకంటే సంవత్సరాల తరబడి, ముప్ఫయ్యేళ్ళు నిరంతరంగా, అతను సరిగ్గా అదే నిమిషం, అదే క్షణం బయటకు బయలుదేరేవాడు.

కానీ చలి మరీ అతిగా ఉన్నప్పుడు అతను తన. సేవకుడికి చెప్పేవాడు, "ఏమి జరిగినా గానీ, ఉదయం మూడింటికి నువ్వు నన్ను నిద్రలేపాలి. నేను నిన్ను కొట్టినా మరి పోరాడినా గానీ, ఏమాత్రం పట్టించుకోవద్దు. నువ్వు కూడా నన్ను కొట్టు, కానీ నన్ను మేల్కొలుపు. " ఇది ఎంతటి పెద్ద ఉపద్రవమంటే అతని వద్ద సేవకులు ఎక్కువ కాలం నిలిచేవారు కాదు. మూడింటికి మేల్కొల్పబడి, అతను ఎంతో ఆగ్రహంతో వుంటాడు. అతను మేల్కొల్పబడకపోతే కనుక, ఉదయం అతను

నిద్రలేచినప్పుడు అతను ఆగ్రహిస్తాడు. మరి అతను కేవలం ఆగ్రహంతో ఉండడం మాత్రమే కాదు, నిజానికి వాళ్ళు కొట్టుకునేదాకా వస్తారు. అతను ఆ సేవకుడికి చెప్పాడు, " దాని గురించి బెంగపడవద్దు ... నువ్వు నన్ను మూడింటికి నిద్రలేపాలి. నువ్వు నన్ను మంచంపై నుంచి బలవంతంగా ఈడ్చాల్సివచ్చినా కూడా, నువ్వు నన్ను మూడింటికి పడక పైనుంచి లేపాలి. నేను చేసే దాని గురించి దిగులు పడవద్దు. ఆ సమయంలో నేను చెప్పే దానిని వినవద్దు, ఎందుకంటే నేను అప్పుడు నిద్రావస్థలో ఉంటాను. నేను చెప్పేది వినాల్సిన అవసరం లేదు."

ఇటువంటి మనుషులు కూడా వుంటారు !

బుద్ధుడు అనుకున్నాడు. " ఉపయోగం ఏమిటి ? నేను కేకలు వేస్తున్నా కూడా నిదురించాలని అనుకునేవారు నిదురిస్తూనే వుంటారు. మరి మేల్కొనడానికి సిద్ధంగా ఉన్నవారు నేను కేకలు వేయకపోయినా కూడా మేల్కొంటారు."

అతను ఏడు రోజులపాటు మౌనంగా ఉన్నాడు. అప్పుడు దేవుళ్ళు అతనికి మనవి చేశారు, "నువ్వు ఏం చేస్తున్నావు ? కేవలం అరుదుగా మాత్రమే ఎవరైనా బుద్ధత్వాన్ని సిద్ధించుకుంటారు... భూమి తీవ్ర వాంఛతో వుంది, దాహార్తితో వున్న ప్రజలు పరితపిస్తున్నారు : మేఘాలు ఏర్పడ్డాయి, ఇప్పుడు అవి వర్షించాలి. నువ్వు మౌనంగా ఉన్నావా ? ఆ వర్షాన్ని కురవనివ్వు ! పుష్పం వికసించింది ; ఆ పరిమళాన్ని ఎగిసిపోనివ్వు ! రస తరంగిణులను ప్రవహించనివ్వు ... అనేక మంది ఎన్నో జన్మలుగా దాహార్తితో ఉన్నారు.

" మరి మేము నీ వాదనను విన్నాము. ఈ ఏడురోజులూ నీ మనస్సును మేము నిరంతరంగా గమనిస్తున్నాము. నువ్వు మాట్లాడకుండానే మేల్కొనే ప్రజలు వున్నారు, మరి నువ్వు ఎంత మాట్లాడినాగానీ మేల్కొనని ప్రజలు ఉన్నారు అని నువ్వు అంటున్నావు. ఇందువలనే నువ్వు మౌనంగా ఉంటున్నావా? అయినాగానీ దాని గురించి సుదీర్ఘంగా ఆలోచించి మేము నిన్ను సమీపిస్తున్నాము. ఈ ఇరువురికీ మధ్య నిలిచి వున్నవారు కొందరు లేరా? నువ్వు వారిని అలక్ష్యం చేయలేవు. వాళ్ళను ఎవరైనా మేల్కొల్పితే కనుక వాళ్ళు మేల్కొంటారు. వాళ్ళను ఎవ్వరూ మేల్కొల్పకపోతే కనుక వాళ్ళు జన్మ తరువాత జన్మ నిద్రనే కొనసాగిస్తారు. ఈ కొద్దిమందిని పరిగణించు తొంభై-తొమ్మిది శాతం నువ్వు పేర్కొంటున్నవాళ్ళే వుంటారు, కానీ సరిగ్గా అంచుపై నిలిచి వున్న ఆ ఒక్క శాతాన్నీ పరిగణించు...వాళ్ళను ఎవరైనా మేల్కొల్పితే కనుక వాళ్ళు మేల్కొంటారు, మరి వాళ్ళను ఎవ్వరూ మేల్కొల్పకపోతే కనుక వాళ్ళు నిదురిస్తూనే ఉంటారు.

బుద్ధుడు వాళ్ళ వాదమును ఖండించలేకపోయాడు, కనుక అతను మాట్లాడాల్సి వచ్చింది. దేవుళ్ళు అతనిని ఒప్పించారు... వాళ్ళు అతనిని అంగీకరింపజేయగలిగారు. బుద్ధుడి యొక్క అభిప్రాయం సరైనదే, మరి దేవుళ్ళ యొక్క భావన కూడా సరైనదే.

మూడు రకాల శ్రోతలు ఉన్నారు. మొదటివారు, మళ్ళీ మళ్ళీ మేల్కొల్పేందుకు మీరు ప్రయత్నించండి కానీ మీరు వాళ్ళను మేల్కొల్పలేరు. ఈ రకమైన ప్రజలు అధిక భాగం వుంటారు. వాళ్ళు వింటారు కానీ వాళ్ళు ఆలకించరు. వాళ్ళు చూస్తారు. కానీ వాళ్ళు వీక్షించరు. వాళ్ళు అవగాహన చేసుకుంటారు కానీ తమ స్వంత భాష్యాలను రూపొందించుకుంటారు : అంతటికీ అతుకులు వేస్తారు మరి సున్నం కొడతారు. వాళ్ళు అవగాహన చేసుకుంటారు అయినాగానీ వాళ్ళు తమ దురవగాహననే పట్టుకుని వుంటారు. వాళ్ళకు దురవగాహన పట్ల ఒక స్థిరమైన ఆసక్తి వుంది. తమ పురాతనమైన, సుపరిచిత విశ్వాసాలను వదిలెయ్యడానికి వాళ్ళు భయపడతారు.

రెండవ రకమైన శ్రోతలు వున్నారు ; మధ్యలో ఎవరైనా ఒక ప్రయత్నం చేస్తే కనుక ... ఒక బుద్ధుడు, ఒక అష్టావక్రుడు, ఒక కృష్ణుడు ... వాళ్ళు మేల్కొంటారు. అర్జునుడు ఈ రకమైన శ్రోత. కృష్ణుడు కష్టించి పని చేయాల్సి వచ్చింది. అతనిపై ఎంతోకాలం మరి కఠినమైన ప్రయత్నం చేయాల్సి వచ్చింది. ఈ ప్రయత్నం నుంచే గీత జనించింది. చిట్టచివరిలో అర్జునుడు భావించాడు, " నా భ్రమలు దూరమయ్యాయి, నా అనుమానాలు తొలగిపోయాయి. నీ పాదాల చెంత నేను అధీనుడినవుతున్నాను. నేను చూశాను !" కానీ ఒక మహా ప్రయత్నం, ఒక మహా పోరాటం చోటు చేసుకున్న తరువాత ఇది జరిగింది.

మరి ఇంకా అధిక శ్రేష్ఠుడైన శ్రోత వున్నాడు ... జనకుడిలాంటివాడు ... అది ఇంకా చెప్పబడకముందే వినేవాడు. అష్టావక్రుడు మాట్లాడడం ప్రారంభించగానే, జనకుడు దర్శించడం ప్రారంభించాడు. ఈనాటి సూత్రాలు జనకుడి యొక్క మాటలే. అష్టావక్రుడు చెబుతున్నది పూర్తిగా నిజమేనని, ఎంతో త్వరగా, ఎంతో అవ్యవధిగా జనకుడు గ్రహించాడు. సత్యం స్వగృహాన్ని కనుగొంది.

కనుక నేను చెబుతాను, వర్షాలు కురుస్తాయి, కానీ కొన్నిసార్లు అవి వర్షించే నేల రాతిమయమై వుంటుంది. వర్షం పడుతోంది, కానీ బీజాలు అంకురించవు. మరి కొన్నిసార్లు కొద్దిగా రాళ్ళతో కూడినదైన నేలపై అది వర్షిస్తుంది. విత్తనాలు మొలకెత్తుతాయి, కానీ మొలకెత్తగలిగినన్ని ఎక్కువ కాదు. మరి కొన్నిసార్లు పూర్తి సన్నద్ధతతో ఉన్న నేలపై అది వర్షిస్తుంది, సారవంతమైన మరి ఏ రాళ్ళూ లేని నేల ... మహత్తరమైన పంట పండుతుంది.

జనకుడు ఆ రకమైన మట్టి. ఒక సూచనే చాలు.

జనకుడు యొక్క స్థితిని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించడం యోగ్యమైనదే ఎందుకంటే మీరు ఈ ముగ్గురిలోనే ఎక్కడో వుంటారు. మరి ఈ ముగ్గురిలోనూ మిమ్మల్ని మీరు ఏ స్థానంలో ఉంచుకోదలచుకున్నారు అనేది మీపై ఆధారపడి వుంటుంది. వినకుండా ఉండేందుకు పట్టుబడుతూ, సత్యానికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిన చేసినవాడుగా ; ఆలకిస్తూ, మరిదేనినో వినేవాడుగా ; తాను వింటూండగా భాష్యాలు చెప్పుకునేవాడుగా ; వింటున్నప్పుడు తాను విన్న ఇతర విషయాలను దానిపై ప్రసరిస్తూ ... దానికి రంగులు పూసి, దానిని వక్రీకరించి, తన ఇష్టం వచ్చినదానిని వినే ఒక సామాన్య వ్యక్తిగానే మీరు ఉండవచ్చు.

చెప్పబడుతున్నదానిని మీరు వినరు. మీరు వినాలని కోరుకున్నదే మీరు వింటారు.

నేను విన్నది ఏమిటంటే ఒకరోజు ముల్లా నసీరుద్దీన్ యొక్క భార్య క్రోధావేశంతో ఇంటికి వచ్చింది, మరి యాచకులు మహా మోసగాళ్ళు అని ముల్లాకు చెప్పింది.

" ఎందుకు, ఏం జరిగింది ?" నసీరుద్దీన్ అడిగాడు.

"విను, 'జన్మతః అంధుడు' అని తెలియజేస్తున్న ఒక సూచికను తన మెడ చుట్టూ వ్రేళ్ళాడదీసుకున్నాడు ఒక యాచకుడు. నేను అతనిపై జాలిపడ్డాను మరి నా పర్సు నుంచి పదిపైసలు తీసి అతని భిక్షాపాత్రలో దానిని వేశాను. అది విన్నప్పుడు అతను అన్నాడు, " ఓ అందమైన వనితా, భగవంతుడు నీకు ఆనందాన్ని కలిగించాలి." ఇప్పుడు నువ్వు నాకు చెప్పు : నేను అందంగా ఉన్నాను అని అతను ఎలా తెలుసుకోగలడు ?"

ముల్లా నసీరుద్దీన్ నవ్వడం మొదలుపెట్టాడు మరి అన్నాడు, " అతను నిజంగానే అంధుడు మరి పుట్టుకతోనే అంధుడు." అనంతరం ముల్లా జోడించాడు, " నేను ఒక్కడినే అంధుడిని కాదు, మరొక అంధుడు కూడా ఉన్నాడు. లేదంటే, అతనికి కళ్ళు ఉన్నట్లయితే నువ్వు అందగత్తెవని అతను ఎలా అనగలడు ?"

భార్య ఒక విషయం చెబుతోంది, ముల్లా మరేదో వింటున్నాడు. తాను వినాలని అనుకుంటున్నదే ముల్లా వింటున్నాడు.

గుర్తుంచుకోండి, రోజుకు ఇరవైనాలుగు గంటలూ ఇది జరుగుతూనే వుంటుంది. మీరు వింటున్నది కేవలం మీదేనా లేదా అది నిజంగా చెప్పబడిందా అనేది ఎన్నడూ ఆలోచించకుండా, మీరు వినాలనుకున్నదే మీరు వింటూ ఉంటారు.

ముల్లా ఎక్కడో పనిచేస్తున్నాడు మరి బాస్ అతనికి చెప్పాడు,“ నువ్వు మంచిగా పనిచేయడం లేదు, నసీరద్దీన్. తప్పనిసరి పరిస్థితులల్లో ఇప్పుడు నేను మరొకరిని పనిలోకి తీసుకోవాల్సి వస్తోంది.”

నసీరుద్దీన్ అన్నాడు, “ నిశ్చయంగా మీరు తీసుకోవాలి, బాస్, ఇక్కడ ఇద్దరు మనుషులకు సరిపడినంత పని వుంది.”

ఆ యజమాని చెబుతున్నాడు, “ నేను నీపై వేటు వేయబోతున్నాను మరి మరొక మనిషిని పనిలోకి తీసుకోబోతున్నాను.” ముల్లా అంటున్నాడు, “ ఇద్దరికి సరిపడా పని వుంది, మీరు మరెవరినైనా పనిలోకి తీసుకోవాలి.”

శాంతంగా వుండండి మరి మీరు విన్నదాని గురించి మరొక్కసారి ఆలోచించండి : చెప్పబడినది అదేనా ? ఒక వ్యక్తి సరిగ్గా వినగలిగిన సామర్థ్యంగలవాడైతే అతను రెండవ రకం శ్రోత అవుతాడు ; అతను మూడవ రకం, అధమ రకం కన్నా ఉన్నతుడవుతాడు. మూడవ రకం కేవలం తనను తాను మాత్రమే వింటాడు, తన స్వంత ప్రతిధ్వనులనే అతను వింటాడు. అతని దృష్టి స్పష్టంగా లేదు, అతను ప్రతిదాన్నీ వక్రీకరిస్తాడు.

రెండవ రకపు శ్రోత ఏది చెప్పబడిందో అదే వింటాడు. రెండవ రకపు శ్రోత కొద్దిపాటి సమయాన్ని తీసుకుంటాడు, ఎందుకంటే చెప్పబడిన దానిని విన్న తరువాత కూడా, దానిని కర్మలోకి అనువదించే ధైర్యం ఇంకా కొరవడే వుంది. కానీ అతను వింటే కనుక, ధైర్యం వస్తుంది ఎందుకంటే సత్యాన్ని విన్న తరువాత అసత్యంలోనే దీర్ఘకాలం ఉండిపోవడం అనేది అసాధ్యం అవుతుంది. ఒకసారి సత్యం దర్శించబడితే, అప్పుడు అలవాటు ఎంత పాతదైనాగానీ దానిని వదిలేయాల్సి వస్తుంది. రెండును రెండుతో కూడితే నాలుగుకు సమానం అవుతుంది అనే మీ శిక్షణ ఎంత పురాతనమైనది అయినాగానీ, దానిని వదిలేయాల్సి వస్తుంది. ద్వారం ఎక్కడ ఉంది అనేది మీరు ఒక్కసారి తెలుసుకుంటే, గోడలోనుంచి బయటపడాలని ప్రయత్నించడం అనేది అసాధ్యం అవుతుంది. మీ తలను గోడకేసి కొట్టుకుంటూనే వుండడం అనేది ఇక సాధ్యం కాదు. సత్యం అవగాహన చేసుకోబడినప్పుడు, ఆ గంతు వేసి మరి తనను తాను రూపాంతరం చెందించుకునేందుకు ముందు వెనుకలుగా ధైర్యం వస్తుంది.

ఇక మొదటి రకం శ్రోత ఉన్నాడు. మీరు అవగాహన మరి ధైర్యం రెండింటినీ కలిగి వుంటే కనుక మీరు మొదటి రకం శ్రోత అవుతారు. మొదటి రకపు శ్రోత భావం ఏమిటంటే అవగాహన మరి ధైర్యం ఏకకాలంలో సంభవిస్తాయి... అవగాహన కలుగుతుంది మరి ధైర్యం సంసిద్ధంగా వుంది. అవగాహన మరి ధైర్యానికి మధ్యన ఏ ఖాళీ లేదు. అది ఈ రోజు మీరు అవగాహన చేసుకుంటారనీ మరి రేపు మీరు ధైర్యాన్ని కలిగివుంటారనీ, మీరు ఈ జీవితకాలంలో అవగాహన చేసుకుంటారనీ మరి మరుజన్మలో మీరు ధైర్యాన్ని కూడదీసుకుంటారనీ కాదు. మీరు అవగాహన చేసుకుంటారు, మరి ధైర్యం ఇక్కడే వుంది. ఈ క్షణమే మీరు అవగాహన చేసుకుంటారు, మరి ఈ క్షణమే ధైర్యం వుంది. అప్పుడు ఒక అప్రయత్న సంభవం జరుగుతుంది. అప్పుడు సూర్యుడు ఆకస్మికంగా ఉదయిస్తాడు. జనకుడు మొదటి రకం శ్రోత.

దీనికి సంబంధించిన మరొక విషయాన్ని అవగాహన చేసుకోవాలి. జనకుడు ఒక చక్రవర్తి. అతనికి అన్నీ ఉన్నాయి. అతనికి అవసరమైనదానికన్నా అతను ఎక్కువే కలిగి వున్నాడు. అతను ప్రపంచాన్ని ఆస్వాదించాడు. ఈ ప్రపంచాన్ని అనుభవించిన మనిషి యొక్క జీవితంలో చైతన్యం యొక్క విప్లవం సులభంగా సంభవిస్తుంది. ఎందుకంటే ఆ జీవితానుభవం అతనికి చెబుతుంది : “ జీవితం అని నాకు తెలిసినది అర్థరహితమైనది.” సగం పని జీవితం చేత చేయబడింది ; అతనికి తెలిసిన జీవితం అర్థరహితమైనది.

అతని మనస్సులో ప్రశ్నలు ఉత్పన్నమవ్వడం మొదలయ్యింది : మరింత జీవితం ఎక్కడ వుంది ? మరో జన్మ వుందా? అసలైన జీవితం ఎక్కడ వుంది ? కానీ ప్రపంచాన్ని ఆస్వాదించని వాడికి, కేవలం ఆస్వాదించాలని కోరుకున్నవాడికి, కేవలం పొందాలనుకుని కానీ ఏమీ పొందని వాడికి ... అతనికి అపారమైన సమస్యలు వుంటాయి. కనుక భారత దేశపు మహోన్నత పరమగురువులందరూ, గొప్ప ద్రష్టలందరూ జైనులైనా లేదా బౌద్ధులైనా లేదా హిందువులైనా ... వాళ్ళంతా రాకుమారులే అయివుంటే కనుక, ఆఘాతానికి గురికాకండి. అది యాదృచ్ఛికమైనది కాదు. అది సూచించేది ఏంటంటే ప్రపంచాన్ని ఆస్వాదించడం ద్వారానే ఎవరైనా ప్రపంచం నుంచి స్వతంత్రులు అవుతారు. సంపదలో ఏమీ లేదు అనేదానిని ఒక చక్రవర్తి చూడగలడు ఎందుకంటే అతనికి ఐశ్వర్యరాశులు ఉన్నాయి కానీ అంతరంగంలో రిక్తత, శూన్యం వుంది. అతను సౌందర్యవంతులైన స్త్రీలతో కూడిన అంతఃపురం వుంది మరి అతని అంతరంగంలో ఏమీలేదు. అతనికి రమణీయ సౌధాలు ఉన్నాయి, అయినాగానీ అంతరంగం అంతా పాడుబడినదిగా, ఒక ఎడారిలా వుంది.

ఒకరు సకలమూ కలిగి వున్నప్పుడు, వాటిలో వేటిలోనూ ఏమీ లేదు అనేది స్పష్టం కానడం మొదలవుతుంది. ఏమీ కలిగి లేనప్పుడు ఒకరు ఆశలలో జీవిస్తారు.

ఆశలను వదిలించుకోవడం కష్టతరమైనది ఎందుకంటే వాస్తవానికి ప్రతిగా ఆశలను సరిచూసుకోగల మార్గమే లేదు. రేపు తనకు డబ్బు వస్తే కనుక తాను సంతోషంగా జీవించగలనని పేదవాడు అనుకుంటాడు. ధనికుడు ఇప్పటికే సంపదను కలిగి వున్నాడు ; అతనికి ఆశించే మార్గమే లేదు. కనుక ఒక సమాజం సుసంపన్నమైనది అయినప్పుడు అది మతపరమైనది అవుతుంది. అమెరికాలో మత సంబంధమైన గాలులు బలంగా వీస్తూండడం మొదలైతే కనుక ఆశ్చర్యానికి గురికాకండి. ఇది ఎల్లప్పుడూ జరిగింది ... భారతదేశం సంపన్నంగా ఉన్న తరుణంలో... అష్టావక్రుడి రోజుల్లో నిశ్చయంగా అది ఉన్నట్లుగా ; బుద్ధుడి రోజులలో అది సంపన్నంగా వుంది, మహావీరుడి రోజులలో అది సంపన్నంగా వుంది... భారతదేశం తన సుసంపన్నత యొక్క పరాకాష్ఠలో ఉన్నప్పుడు అది యోగం యొక్క మహోన్నత స్థాయిని చేరుకుంది. అది ఆధ్యాత్మికతలోని అత్యున్నత సోపానాలను చేరింది. ఎందుకంటే అప్పుడు ప్రజలు సంపదలో ఏమీ లేదు అనేదానిని చూశారు ; వారికి అన్నీ ఉన్నాయి మరి అయినాగానీ దేనికీ అర్థం లేదు. ఒక దేశం పేదదైతే కనుక అప్పుడు దీనిని చూడడం అత్యంత కష్టతరం.

ఒక నిరుపేద మనిషి విముక్తుడు కాలేడు అని నేను చెప్పడం లేదు ; ఒక నిరుపేద వ్యక్తి విముక్తిని సాధించగలడు. ఒక నిరుపేద మనిషి మతపరమైనవాడు కాగలడు, కానీ ఒక నిరుపేద సమాజం మతపరమైనది కాలేదు. ఒక వ్యక్తి ఓ మినహాయింపు కాగలడు కానీ అతనికి మహాతీవ్రత అవసరమవుతుంది.

దాని గురించి ఆలోచించండి. మీరు ధనం ఉంటే కనుక, ధనం విలువలేనిది అనేది మీరు చూడగలరు ; అది అత్యంత సులభం. మీకు ధనం లేకపోతే కనుక, ధనం విలువలేనిది అనేది చూడడం కష్టం, అతి కష్టం. మీకు లేని దాని యొక్క నిరర్థకతను మీరు ఎలా చూడగలరు ? మీ చేతిలో బంగారం ఉంటే కనుక అప్పుడు మీరు అది అసలైన బంగారమా కాదా అనేది పరీక్షించగలరు. మీ చేతిలో బంగారం లేకపోతే కనుక, అది కేవలం మీ కలలోనే ఉంటే కనుక...కానీ కలలోని బంగారాన్ని ఏ పరీక్షా చేయలేము. కేవలం అసలైన బంగారాన్ని మాత్రమే పరీక్షించగలము.

పేదవాడి యొక్క మతం అసలైన మతం కాలేదు. ఒక పేదవాడు గుడికి వెళ్ళినప్పుడు అతను డబ్బును అడుగుతాడు, అతను అధికారాన్ని అడుగుతాడు, అతను ఉపాధిని అడుగుతాడు. అతను అస్వస్థుడై ఉంటే కనుక స్వస్థత కోసం అతను

ప్రార్థిస్తాడు. అతని కుమారుడికి ఉద్యోగం లేకపోతే కనుక అతను పనిని కనుగొనగలగాలి అని అతను ప్రార్థిస్తాడు. ఆలయం కేవలం ఒక ఉపాధికల్పన కేంద్రంగా ఉంటుంది. ఆలయంలో సైతం ప్రార్ధన లేదా ప్రేమ యొక్క పరిమళం ఉదయించదు. అతను వైద్యశాలలకు వెళ్ళాల్సి వుంది, దాని బదులుగా అతను ఆలయానికి వచ్చాడు. అతను ఉపాధి కల్పన కార్యాలయానికి వెళ్ళాల్సింది. దాని బదులుగా అతను ఆలయానికి వచ్చాడు.

తన జీవితంలో తాను పొందని వాటికోసం మందిరంలో పేదమనిషి యాచిస్తూ ఉంటాడు. మన జీవితంలో వేటి కొరత వుందో వాటికోసమే మనం అడుగుతాము. కానీ మీకు అన్నీ వుంటే కనుక లేదా మీరు తగినంత వివేకవంతులైతే కనుక, కేవలం అవగాహన ఒక్కదానితోనే మీరు జాగృతం అవ్వగలిగి మరి మీకు అన్నీ ఉన్నా, అప్పుడు కూడా మీకు ఉన్నదేమిటి...? అనేది చూడగలిగిన మేధ మీకు ఉంటే కనుక... ఇతరులకు ధనం వుంది ; వారికి ఏం సంభవించింది ? మీకు అది లేకపోతే కనుక అప్పుడు చూడడానికి మీకు వివేకం అవసరమవుతుంది. సౌధాలలో నివసించేవారికి ఏమి సంభవించింది ? వాళ్ళ కళ్ళలో ఆనంద తరంగాలు ఉన్నాయా? వాళ్ళ పాదాలలో ఒక నర్తన వుందా ? వాళ్ళ చుట్టూ దివ్యత్వం యొక్క సౌరభం వుందా ? అది వాళ్ళకు సంభవించకపోతే కనుక, అది మీకు ఎలా సంభవించగలదు ? కానీ ఈ అవగాహన ఎంతో కష్టతరమైనది. వాళ్ళు దానిని కలిగివున్నప్పుడు సైతం అనేకమంది డబ్బు నిరుపయోగమైనది అనేదానిని చూడలేరు, కనుక డబ్బును కలిగిలేనప్పుడు దానిని చూడడం గురించి ఆలోచించడం... అది సంభవించగలదు, సంభావ్యత వుంది, కానీ సుదూరమైన సంభావ్యత. బుద్ధుడికి జాగృతమవ్వడం అనేది సులభం. జనకుడికి జాగృతమవ్వడం అనేది సులభం. అర్జునుడికి కూడా జాగృతమవ్వడం అనేది సులభం. కానీ కబీరుకి అది అత్యంత కష్టతరం. దాదూకు, సహజోకు అది అత్యంత కష్టతరం ; జీసస్‌కు, మహమ్మద్‌కు అది అత్యంత కష్టతరం ఎందుకంటే వారి వద్ద ఏమీ లేదు ... మరి అయినాగానీ వాళ్ళు జాగృతులయ్యారు. మనకు లేని దానికై కోరిక మన చుట్టూప్రక్కలంతా వుంది. ఈ కోరిక మనను దేదీప్యమానంగా వుంచుకుంటూ వుంటుంది.

గత రాత్రి నేను ఒక కవితను చదువుతూ వున్నాను :

నేను మరొక జన్మను ఎత్తాలనుకుంటున్నాను.
ప్రేమను ఎలా అందించాలో తెలిసిన
ఒక సహచరిని అందులో నేను కలుసుకోవచ్చు.

తను ఉదయం నన్ను చూసి నవ్వుతూ నిదురలేస్తుంది.
నా హృదయం మరి ఆత్మలోనికి లోతుగా మునకవేస్తూ తను నావైపు చూస్తుంది.
ఆమె, మధ్యాహ్నవేళల్లో, తన అనేకానేక పనుల మధ్య,
నేను లేకపోవడం వలన బాధపడుతుంది,
నిరీక్షణలోనే తన రోజును గడుపుతుంది.
ఆమె, సాయంసంధ్యవేళ, ఎలాంటి స్వాగతమిస్తుందంటే,
అది అన్ని కోరికలు మరి కాంక్షల నుంచి నన్ను విడుదల చేస్తుంది,
జనన మరణాల యొక్క చింతల నుంచి నన్ను విడుదల చేస్తుంది...
ఆమె నన్ను కాలానికి అతీతం చేస్తుంది.
నేను ఎటువంటి సహచరి కోసం పరితపిస్తున్నానంటే,
ఆమె నా ఆనందానికి విశ్వాసపూర్వకమైన ప్రేమ యొక్క జ్వాలను జోడిస్తుంది,
మరి ఆమె నా వేదనకు తన వెచ్చని కన్నీటి ముత్యాల వర్ణాన్ని జోడిస్తుంది ;
ఆమె, ఇంటివద్ద పేదరికం ఉన్నప్పుడు,
పయనం కఠినతరమై ఉన్నప్పుడు కలత చెందదు,
తన కనుబొమను ముడుచుకోదు.
బహుశా మరుజన్మలో నేను ఎటువంటి సహచరిని కనుగొంటానంటే
ప్రేమను ఎలా అందించాలో ఆమెకు తెలుసు.
ఇందుకే, నేను మరొక జన్మను ఎత్తాలనుకుంటున్నాను.

మనం దేనినైతే పొందలేదో ... ఎవరో ఓ ప్రేయసిని కలుసుకోలేదు, ఎవరో సంపదను కనుగొనలేదు, ఎవరో ప్రముఖులుగా అవ్వలేదు...మనం మరొక జన్మను ఎత్తాలనుకుంటాము. మనం అసంఖ్యాక జీవితాలు జీవించాము. కానీ ప్రతీసారీ ఏదో ఒకటి మిగిలిపోతుంది. ఏదో ఒక అల్పమైనది అసంపూర్తిగా ఉండిపోతుంది, ఏదో ఒకటి ... మరి ఈ మరొక జన్మకు, మరి ఇంకా మరో జన్మకు....

కోరికలకు అంతం లేదు. అవసరాలు అతి కొన్ని మాత్రమే, కోరికలకు హద్దు లేదు. ఈ ఆశలు మరి కోరికల ఆధారంగా మానవుడు జీవిస్తూంటాడు.

గుర్తుంచుకోండి, డబ్బు మిమ్మల్ని బానిసలుగా చేయలేదు, డబ్బు పట్ల కోరిక మిమ్మల్ని బానిసలను చేస్తుంది. పదవి మిమ్మల్ని బంధించదు, పదవి పట్ల కోరిక మిమ్మల్ని బంధిస్తుంది. కీర్తి మిమ్మల్ని బంధించదు, కీర్తి పట్ల కోరిక మిమ్మల్ని బంధిస్తుంది.

జనకుడికి అన్నీ ఉన్నాయి, అతను అన్నింటినీ చూశాడు. అది ఎలా ఉందంటే సూచన ఇచ్చేవారి కోసం అతను కేవలం నిరీక్షిస్తున్నాడు మరి అతను జాగృతమవుతాడు. అన్ని ఆశలు మరి కోరికలు నిరుపయోగమైనవి అయ్యాయి ; అతని నిద్ర భంగమవ్వబోతూ వుంది. కనుక నేను చెబుతున్నాను, అష్టావక్రుడికి ఒక గొప్ప శిష్యుడు అనుగ్రహించబడ్డాడు.

జనకుడు అన్నాడు : అద్భుతం ! నేను స్వచ్ఛమైనవాడను,

దోషరహితుడను, నేను శాంతిని, నేను ఎరుకను, నేను ప్రకృతికి అతీతుడను.

అయ్యో, ఇంతకాలమూ భ్రమ చేత నేను మోసగించబడ్డాను !

కాంతి కిరణాలు దిగిరావడం మొదలుపెట్టాయి. **నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను...** " ఎంత అద్భుతం !"

" నువ్వు స్వచ్ఛమైనవాడవు, నీకు ఏదీ అంటుకోదు," అని అష్టావక్రుడు చెప్పగా విని... అతను దానిని వినగానే ఆ కిరణాలు, ఒక బాణంలా నేరుగా దూసుకుపోతూ అతని లోతుల్లోనికే చేరాయి.

అద్భుతం ! నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను,

నేను శాంతిని, నేను ఎరుకను, నేను ప్రకృతికి అతీతుడను.

" అద్భుతం ... మీరు ఏం చెబుతున్నారు ? నేను స్వచ్ఛమైనవాడను మరి దోషరహితుడనా ? నేను శాంతినా ? నేను ఎరుకనా ? నేను ప్రకృతికి అతీతుడనా ? ఆశ్చర్యం, ఇంతకాలమూ భ్రమ చేత నేను మోసగించబడ్డాను !" జనకుడు ఆఘాతానికి గురయ్యాడు. అతను విన్నది, అతను ముందెన్నడూ వినలేదు. అతని చెవులు వినలేదు, అతని కళ్ళు చూడలేదు ... అపూర్వమైనదేదో బహిర్గతం చేయబడింది. అష్టావక్రుడు ప్రకాశవంతుడయ్యాడు. అతని తేజస్సులో, అతని తేజోవలయంలో, అతని ఆరాలో, జనకుడు విస్మయం పొందాడు, " అద్భుతం, నాకు ఏదీ అంటుకోలేదు అనే ఎరుక ఇప్పుడు నాకు కలుగుతోంది !" అతను దానిని నమ్మలేకపోయాడు, దానిని సమ్మతించలేకపోయాడు.

సత్యం ఎంతో అవిశ్వసనీయమైనదిగా వుంటుంది, ఎందుకంటే మనం ఎన్నెన్నో సుదీర్ఘ జన్మల పాటు అసత్యాన్ని విశ్వసించాము. ఆలోచించండి : ఒక అంధుడి యొక్క కళ్ళు అకస్మాత్తుగా తెరుచుకున్నప్పుడు, కాంతి వుందనీ, రంగు ఉందనీ అతను విశ్వసించగలడా, ఈ వేలాది వర్ణాలు ; ఈ హరివిల్లులు, ఈ పువ్వులు, ఈ వృక్షాలు, ఈ చంద్రుడు మరి నక్షత్రాలను అతను నమ్మగలడా ?

అతని కళ్ళు తెరుచుకున్న వెంటనే అంధుడు అంటాడు, " ఇది అద్భుతం, ఇదంతా ఉంది అని నేను ఆలోచించనైనా ఆలోచించలేకపోయాను. మరి ఇది వుంది! నేను దీనిని ఎన్నడూ చూడలేదు, కలల్లో కూడా !"

వెలుగు గురించి మరచిపోండి, అంధుడికి చీకటి సైతం తెలియదు, సాధారణంగా మీరు అనుకునేది ఏమిటంటే ఒక అంధుడు అంధకారంలో జీవిస్తాడు, కానీ మీరు పొరబడ్డారు. అంధకారాన్ని చూడడానికి కూడా కళ్ళు కావాలి. మీరు మీ కళ్ళను మూసుకున్నప్పుడు మీరు అంధకారాన్ని చూస్తారు ఎందుకంటే మీ కళ్ళు తెరిచి వున్నప్పుడు మీరు వెలుగును చూస్తారు. కానీ ఎన్నడూ కళ్ళు తెరుచుకోని వ్యక్తికి చీకటి సైతం తెలియదు. వెలుగును విస్మరించండి, అతనికి అంధకారంతో సైతం పరిచయమే లేదు. ఒక అంధుడు హరివిల్లుల గురించి స్వప్నించగల మార్గమే లేదు. కానీ అతను తన దృష్టిని పొంది మరి చూస్తే కనుక, ఈ ప్రపంచమంతా అవిశ్వసనీయమైనదిగా కనిపిస్తుంది ; అతను దానిని నమ్మలేడు ; జనకుడు కూడా ఆఘాతానికి గురయ్యాడు. అతను మంత్ర ముగ్ధుడైపోయాడు. అతను అద్భుతం, మరి భక్తి భావంతో నిండిపోయాడు అతను అన్నాడు. **అద్భుతం ! నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను...**

మనం ఎల్లప్పుడూ మనను మనం అపరాధులుగా పరిగణించుకున్నాం, మరి మనం పాపులమని మతాచార్యులు ఎల్లప్పుడూ చెప్పారు. మనం మన పాపాలను కడిగేసుకోవాలని పండితులు మరి మతాచార్యులు ఎల్లప్పుడూ బోధించారు. మీరు నిష్కపటమైనవారనీ, మీ నిష్కాపట్యం ఎలాంటిదంటే దానిని నాశనం చేయగల మార్గమే లేదనీ, పది లక్షల పాపాలైనా మిమ్మల్ని ఒక పాపిగా చేయలేవనీ ఎవ్వరూ ఎన్నడూ చెప్పలేదు. మీరు చేసిన పాపాలన్నీ కేవలం మీరు కన్న కలలు మాత్రమే... కేవలం మేల్కొనండి మరి అవి పోతాయి. పుణ్యమూ మీది కాదు పాపమూ మీది కాదు, అసలు కర్మ అనేదే మీది కాదు, ఎందుకంటే మీరు కర్త కాదు ... మీరు కేవలం గమనించేవారు, సాక్షి.

నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను... ఆశ్చర్యంతో జనకుడు అన్నాడు, నేను శాంతిని.....ఎందుకంటే అతనికి కేవలం సంక్షోభం మాత్రమే తెలుసు.

మీరు ఎన్నడైనా శాంతిని తెలుసుకున్నారా ? సాధారణంగా మీరు అవును అని చెబుతారు. కానీ మీరు లోతుగా చూస్తే కనుక మీరు కనుగొనేది ఏమిటంటే మీరు శాంతి అని పిలిచేది కేవలం రెండు సంక్షోభ సమయాల మధ్యన ఉన్న ఒక

స్వల్ప విరామం మాత్రమే. ' కోల్డ్‌వార్ ' అనే ఆంగ్ల వ్యక్తీకరణ ఎంతో చక్కనైనది. రెండు యుద్ధాల మధ్య ఒక ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్‌వార్) కొనసాగుతుంది ; రెండు వేడి యుద్ధాల మధ్య ఒక ప్రచ్ఛన్న యుద్ధం ... కానీ యుద్ధం కొనసాగుతూనే వుంటుంది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిపోయింది, అనంతరం రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యింది. ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. దాదాపు ఇరవై సంవత్సరాలు, కానీ ఆ ఇరవై సంవత్సరాలు ప్రచ్ఛన్న యుద్ధం. ఆ విరోధం కొనసాగింది, యుద్ధ సన్నాహాలు కొనసాగాయి. అవును, ఆ విరోధం ఇప్పుడు ప్రత్యక్షమవ్వలేదు ; అది అంతర్గతమైనది, అది గుప్తమై వుంది, ఉపరితలం క్రింద ఉంచబడింది.

ప్రపంచంలో ప్రస్తుతం ప్రచ్ఛన్న యుద్ధం వుంది ... యుద్ధ సన్నాహాలు జరుగుతున్నాయి. సైనికులు శిక్షితులవుతున్నారు. బాంబులు తయారుచేయబడు తున్నాయి, తుపాకులు మెరుగుపెట్టబడుతున్నాయి, కరవాలాలు సానబెట్టబడుతున్నాయి. ఇది ప్రచ్ఛన్న యుద్ధం. యుద్ధం కొనసాగుతుంది. ఏ రోజైనా అది రాజుకోవచ్చు, ఏ రోజైనా అది బద్దలు కావచ్చు

మీరు శాంతి అని పిలిచేది కేవలం ' ప్రచ్ఛన్న సంక్షోభం '. అది ఎప్పుడు వేడెక్కినా అది ' ప్రత్యక్ష సంక్షోభం ' అవుతుంది. రెండు సంక్షోభ సమయాల మధ్య స్వల్ప సమయం గడుస్తుంది. దానినే మీరు శాంతి అని పిలుస్తున్నారు. అది శాంతి కాదు, అది కేవలం ప్రచ్ఛన్న సంక్షోభమే. పాదరసం ఎక్కువ పైకి రాలేదు, ఆ వేడి మరీ అధికంగా లేదు... ఈమాత్రం మీరు నియంత్రించగలరు. కానీ మీరు శాంతిని తెలుసుకోలేదు. రెండు సంక్షోభ సమయాల మధ్య శాంతి ఉండగలదా ? రెండు యుద్ధాల మధ్య శాంతి ఉండగలదా ?

శాంతిని తెలుసుకున్న వ్యక్తికి, అతని సంక్షోభం శాశ్వతంగా ముగిసిపోయింది. మీరు శాంతిని తెలుసుకోలేదు, మీరు కేవలం ఆ పదాన్నే విన్నారు. సంక్షోభం మీ అనుభవం ; శాంతి మీ అభిలాష, శాంతి మీ ఆశ.

జనకుడు అంటాడు, *నేను శాంతిని, నేను ఎరుకను...* ఎందుకంటే అతనికి కేవలం అచేతనమే తెలుసు. మీరు ఏమి చేస్తున్నా అది ఎరుక లేకుండానే చేయబడింది. నిద్రలో ఉన్నట్లుగా. ఎవరైనా మిమ్మల్ని కూలంకషంగా ప్రశ్నిస్తే కనుక మీరు ఒక్క విషయానికి కూడా సమాధానం చెప్పలేరు. మీరు ఈ స్త్రీతో ఎందుకు ప్రేమలో పడ్డారని మిమ్మల్ని ఎవరైనా అడిగితే కనుక మీరు చెబుతారు, " నాకు తెలియదు, నేను పడిపోయానంతే ... అది కేవలం అలా జరిగిపోయింది." ఇదీ ఒక సమాధానమేనా ? ప్రేమలాంటి విషయానికి ఇదా సమాధానం ? ... అది జరిగి

పోయిందనీ, అది కేవలం జరిగిపోయిందనీ ? మొదటి చూపులోనే ప్రేమ ! మరొకరని చూడడంతోనే ప్రేమ సంభవించింది ! మీ అంతర్గతంలో ఎక్కడి నుంచి ఈ ప్రేమ ఈ ప్రేమ సంభవించింది ! మీ అంతర్గతంలో ఎక్కడి నుంచి ఈ ప్రేమ ఉదయించిందో మీకు తెలుసా ? అది ఎలా వచ్చింది. మీకు దాని గురించి ఏమీ తెలియదు, అయినాగానీ ఈ ప్రేమ మీకు ఆనందాన్ని తీసుకురావాలని మీరు కోరుకుంటారు. ఈ ప్రేమ ఎక్కడి నుంచి వస్తుంది, ఏ అచేతనపు పొర నుంచి అది ఉదయిస్తుంది, దాని బీజం ఎక్కడ ఉంది, అది ఎక్కడి నుంచి అంకురిస్తుంది అనేది మీకు తెలియదు ; అయినా గానీ మీరు అంటారు ఈ ప్రేమ ద్వారా మీ జీవితం ఆనందమయం అవుతుంది ! అది ఆనందాన్ని ఇవ్వదు; అది దుఃఖాన్ని, విరోధాన్ని శత్రుత్వాన్ని, అసూయను ఇస్తుంది. మీరు వేదన పొందుతారు, తరువాత మీరు అంటారు, " ఏం జరిగింది ? ... ఈ ప్రేమ అంతా అసత్యమైనదిగా మారింది." మొట్టమొదటి నుంచే మీరు అచేతనస్థితిలో ఉన్నారు.

మీరు పరుగెత్తుతున్నారు ... డబ్బు సంపాదించబడాలి. ఎందుకు అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే కనుక, బహుశా మీరు ఏదో తుచ్ఛమైన సమాధానాన్ని ఇస్తారు. మీరు అంటారు, " డబ్బు లేకుండా ఎవరైనా ఎలా జీవించగలరు ? " కానీ జీవించడానికి పుష్కలంగా ఉన్నవారు ఉన్నారు మరి వాళ్ళు డబ్బు వెనుక పరుగెత్తడాన్ని కొనసాగిస్తూనే ఉంటారు. మీ నిశ్చయం ఏమిటంటే మీరు అంత మొత్తాన్ని కూడబెట్టిన తరువాత మీరు ఆగగలుగుతారు, కానీ మీరు ఆగలేరు ; మీరు పరుగెత్తుతూనే ఉంటారు.

ఆంద్రూ కార్నెగీ మరణించినప్పుడు అతను లక్ష కోట్ల డాలర్లను వదిలివెళ్ళాడు, మరి అతని మరణ సమయంలో అతను మరింత సంపాదిస్తూనే వున్నాడు. అతను మరణించడానికి రెండు రోజుల ముందు అతని కార్యదర్శి అడిగాడు, " మీరు సంతృప్తి చెందారా ? లక్ష కోట్లు !"

అతను బదులిచ్చాడు, " సంతృప్తి చెందడమా ? నేను అత్యంత దుఃఖ స్థితిలో మరణిస్తున్నాను, ఎందుకంటే పది లక్షల కోట్ల డాలర్లు సంపాదించాలని నేను ప్రణాళిక వేశాను."

పది లక్షల కోట్లు సంపాదించాలని ప్రణాళిక వేసిన వ్యక్తికి, ఒక లక్ష కోట్లు... అది తొమ్మిది లక్షల కోట్ల కొరత. అతని కొరతను చూడండి ! మీరు లక్ష కోట్ల వైపు చూస్తున్నారు. లక్ష కోట్లు అతనికి రెండు పైసల విలువ కూడా చేయదు. లక్ష కోట్లు ఇక ఏ విలువనూ కలిగి లేదు. మీరు లక్ష కోట్ల డాలర్లను తినలేరు, మీరు దానిని

తాగలేరు ... అది నిరుపయోగమైనది. కానీ ఒకసారి ఈ పరుగు మొదలయ్యిందంట, అది కొనసాగుతూనే వుంటుంది.

మీరు ఎందుకు పరుగెత్తుతున్నారని మిమ్మల్ని మీరు అడగండి. మీ వద్ద ఏ సమాధానమూ ఉండదు. మీరు అచేతనులై ఉన్నారు. మీరు ఎందుకు పరుగెత్తుతున్నారో మీకు తెలియదు, మీరు ఎక్కడకు వెళుతున్నారో, ఎందుకు వెళుతున్నారో మీకు తెలియదు. మీరు ఎక్కడికో అక్కడికి వెళ్ళకపోతే కనుక మీరు ఏం చేస్తారు ? ఆగుతాం ? ... కానీ ఆగడం ఎలా ? ఆగడమా ? ... ఆగడం దేనికోసం ? ఆగడం గురించి కూడా మీకు ఏమీ తెలియదు.

మానవుడు మైకంలో ఉన్నట్లుగా, మత్తు ఇవ్వబడినట్లుగా జీవిస్తూంటాడు. మన జీవితం యొక్క అనేక పరిధులు మన చేతుల్లో లేవు. మనం పూర్తి అచేతనంగా ఉన్నాం.

మనం హెచ్చుతగ్గులుగా నిద్రలో నడుస్తున్నామని గుర్జీఫ్ చెప్పేవాడు. మన కళ్ళు తెరిచేవున్నాయి, నిజమే, కానీ మన నిద్ర భంగం కాలేదు. మన కళ్ళు నిద్రతో నిండి వున్నాయి. ఏదో జరుగుతుంది, మనం విషయాలను చేస్తూనే వుంటాం, విషయాలు కొనసాగుతాయి ... ఎందుకు ?

ఎందుకు అని అడగాలంటే మనకు భయం, ఎందుకంటే మన దగ్గర జవాబు లేదు. అలాంటి ప్రశ్నలను రేకెత్తించడం మనల్ని అసౌఖ్యానికి గురి చేస్తుంది.

జనకుడు అన్నాడు, **అద్భుతం ! నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను, నేను శాంతిని, నేను ఎరుకను...** " మరి కేవలం ఇది మాత్రమే కాదు, మీరు నాకు చెబుతున్నారు, " నువ్వు ప్రకృతికి అతీతుడవు." ప్రకృతికి అతీతం ! " నువ్వు శరీరం కాదు, నువ్వు మనస్సు కాదు. ఈ కనబడుతున్నది నువ్వు కాదు, నువ్వు గమనించబడుతున్నవాడివి కాదు. నువ్వు గమనించేవాడవు, ఎల్లప్పుడూ అతీతుడవు, బాహ్య ప్రపంచానికి అతీతుడవు. నువ్వు ఎల్లప్పుడూ అధిగమించినవాడవే."

దానిని అవగాహన చేసుకోండి. దానిని విధానం అని పిలువగలిగితే కనుక, ఇది అష్టావక్రుడి యొక్క మౌలిక సాధనం, అతని మౌలిక విధానం : ప్రపంచానికి అతీతంగా ఉండండి ! నేను చూస్తున్నదేదీ నేను కాదు, అనుభవంగా వస్తున్నదేదీ నేను కాదు, ఎందుకంటే నేను ఏమి చూస్తున్నా, నేను దీనికి అతీతంగా ఉన్నాను, ఎందుకంటే ఆ అనుభవాన్ని గమనిస్తున్నవాడినే నేను : నేను అనుభవంగా ఎలా ఉండగలను ? అందువలన నేను శరీరం కాదు. మనస్సు కాదు, భావోద్వేగం కాదు;

హిందువును కాదు, మహమ్మదీయుడను కాదు, క్రైస్తవుడను కాదు, బ్రాహ్మణుడను కాదు, నీచ కులస్థుడను కాదు; బాలుడిని కాదు, యువకుడను కాదు, వృద్ధుడను కాదు ; అందమైనవాడను కాదు, కురూపిని కాదు ; వివేకవంతుడిని కాదు, మూర్ఖుడిని కాదు ... నేను అసలు ఎవ్వరినీ కాదు. ప్రకృతి సమస్తాన్నీ నేను అధిగమించాను !

ఈ కాంతి కిరణం జనకుడి యొక్క హృదయంలోకి ప్రవేశించింది. అతను భక్తి భావంతో నిండిపోయాడు, అతను ఆశ్చర్యపోయాడు, ఆఘాతానికి గురయ్యాడు. మొదటిసారిగా అతని కళ్ళు తెరుచుకున్నాయి. **అద్భుతం... ఇంతకాలమూ భ్రమ చేత నేను మోసగించబడ్డాను !** నేను నిర్మించుకున్నవి అన్నీ, నేను ప్రేమించినదంతా, నేను కన్న అందమైన కలలన్నీ... అదంతా అజ్ఞానంలో కునుకు తీస్తోంది. అవి కలలే తప్ప మరేమీ కాదు ! ఏదైనాగానీ ఏ వాస్తవమూ లేకుండా అవి కేవలం నిద్రలో కలిగిన భావనలే."

అద్భుతం... ఇంతకాలమూ భ్రమ చేత నేను మోసగించబడ్డాను ! " మీరు నన్ను ఆఘాతానికి గురిచేశారు, మీరు నన్ను కంపింపజేశారు. నేను నిర్మించుకున్న సౌధాలన్నీ కూలిపోయాయి, మరి నేను సృష్టించుకున్న ఈ సామ్రాజ్యం సమస్తమూ నా అజ్ఞానం యొక్క ప్రసరణే."

అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరు వినగలిగితే కనుక, అదే సంభవిస్తుంది. మీరు వినగలిగితే కనుక, సరిగ్గా అదే మీకు సంభవిస్తుంది. మీ చర్య మరి ఏర్పాటు సమస్తమూ అర్థరహితమైనది అవుతుంది. విజయం లేదా వైఫల్యం, అంతా అర్థరహితమైనదే అవుతుంది.

ముల్లా నసీరుద్దీన్ నిద్రలో మాట్లాడుతున్నాడు. అతను తన కళ్ళు తెరిచాడు మరి తన భార్యతో అన్నాడు, " త్వరగా ! నా కళ్ళద్దాలు తీసుకురా !"

అతని భార్య అంది, "అర్ధరాత్రి మంచంపై వుండి నీ కళ్ళజోడుతో నువ్వు ఏం చేస్తావు ?"

అతను అన్నాడు, " సమయాన్ని వృథా చేయవద్దు, త్వరగా నా కళ్ళజోడు తీసుకురా. నేను నా కలలో ఒక అందమైన వనితను చూస్తున్నాను. ఆమెను మరింత స్పష్టంగా చూసేందుకు నాకు నా కళ్ళజోడు కావాలి. ఆ కల కొద్దిగా అస్పష్టంగా, చెదిరినట్లుగా వుంది."

మీరు మీ కలలను నిజం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ వుంటారు : ఏదో విధంగా ఆ కల నిజమవ్వాలి ! మీ కల ఓ కలే అని ఎవ్వరూ అనాలని మీరు అనుకోరు : మీరు ఆగ్రహిస్తారు. ఏ కారణమూ లేకుండానే మనం మర్మయోగులపై విషప్రయోగం, వాళ్ళను రాళ్ళతో కొట్టడం చెయ్యలేదు. వాళ్ళు మనల్ని ఎంతో ఆగ్రహానికి గురిచేశారు. మనం కలలు కంటున్నాము మరి వాళ్ళు మనల్ని కుదిపెయ్యడం ప్రారంభించారు. మనం ఓ గాఢనిద్రలో ఉన్నాం మరి వాళ్ళు మనల్ని మేల్కొల్పడం ప్రారంభించారు. మనల్ని అడగకుండానే వాళ్ళు మన నిద్రను నాశనం చెయ్యడం, గంటను మ్రోగించడం ప్రారంభించారు. సహజంగానే, మనం ఆగ్రహంతో వున్నాం. కానీ మీరు వింటే కనుక మీరు కృతజ్ఞులై వుంటారు, శాశ్వత కృతజ్ఞతను అనుభూతి చెందుతారు.

గుర్తుంచుకోండి, కృష్ణుడి యొక్క గీతలో, కృష్ణుడు మాట్లాడుతున్నప్పుడు, అర్జునుడు ప్రశ్నలు వేస్తూనే వుంటాడు. అష్టావక్రుడి యొక్క గీతలో, అష్టావక్రుడు మాట్లాడినప్పుడు, జనకుడు ఏ ప్రశ్ననూ వెయ్యలేదు. జనకుడు కేవలం తన కృతజ్ఞతనే వ్యక్తీకరించాడు. జనకుడు కేవలం చెప్పబడిన దానిని స్వీకరించాడు. జనకుడు కేవలం అన్నాడు, “ మీరు నన్ను ఆఘాతానికి గురిచేశారు, మీరు నన్ను మేల్కొలిపారు ! ఇక అడగడానికి ఏమీ లేదు.” జనకుడు అనుభవాన్ని పొందడం ప్రారంభించాడు : **నేను స్వచ్ఛమైనవాడను, దోషరహితుడను, నేను శాంతిని, నేను ఎరుకను, నేను ప్రకృతికి అతీతుడను.** అది మనకు అసాధ్యంగా కనిపిస్తుంది, అది ఎంతో వేగంగా సంభవించింది ! అది కొంత సమయాన్ని తీసుకోవాలని మనకు అనిపిస్తుంది. మనం ఎంతో ఆశ్చర్యపోయాం: ఇంతటి ఆకస్మికతతో, ఎంతో వేగంగా అది జరిగింది.

జెన్ గురువుల యొక్క జీవితాలలో ఇలాంటి వృత్తాంతాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు జెన్ గురించిన పుస్తకాలు ప్రాగ్దిశలో, పశ్చిమంలో, అన్ని దిశల్లోనూ వ్యాపించడం మొదలయ్యింది, మరి వాటిని చదవడం ద్వారా ప్రజలు ఎంతో ఆశ్చర్యపోతున్నారు ఎందుకంటే ఒక్క క్షణంలోనే సన్యాసి జాగృతుడయ్యి మరి జ్ఞానోదయాన్ని సిద్ధించుకునే కథలు వేలాదిగా ఉన్నాయి. మనం దానిని విశ్వసించము. మనం ఎన్నో సాధనలు చేస్తాం కానీ జ్ఞానోదయం సంభవించదు. మనం ప్రయత్నాలు చేస్తాం, అయినాగానీ ధ్యానం సంభవించదు. మనం జపిస్తూ కూర్చుంటాం, అతి బాధాకరమైన సాధనలలో కూర్చుంటాం, కానీ మనస్సు అవిశ్రాంతంగానే వుంటుంది. మరి ఈ జనకుడు ఒక్క క్షణంలోనే జాగృతుడయ్యాడు !

కొన్నిసార్లు అది సంభవించింది. అది స్వీకృతితో ఉండగల మీ సామర్థ్యంపై ఆధారపడి వుంటుంది. మీలో గ్రహించే గుణం ఎంత తక్కువగా వుంటే, అంత ఎక్కువ కాలాన్ని అది తీసుకుంటుంది. జ్ఞానోదయం వలన ఆ ఆలస్యం కావడం లేదు, అది ఈ క్షణమే సంభవించగలదు. అష్టావక్రుడు మళ్ళీ మళ్ళీ చెప్పినట్లుగా, " ఆనందంగా వుండు, ఈ క్షణమే ఆనందంగా వుండు ! విముక్తుడవై ఉండు ! సరిగ్గా ఇప్పుడే, ఈ క్షణమే స్వతంత్రుడవై ఉండు."

ఈ క్షణమే అది సంభవిస్తోంది ; ఏదైనా ఆలస్యం వుంటే అది మన గ్రహణ గుణం వలనే. మనకు గ్రహించగల సామర్థ్యం లేదు. అది తీసుకునే సమయమంతా మధ్యలో వచ్చిన రాళ్ళను తొలగించేందుకే.

ఆ ఏరు ఈ క్షణమే పారగలదు ; ఏరు సిద్ధంగా వుండి, ఆ ఏరు పొంగుతోంది. అది ప్రవహించగలిగేందుకు, సాగరం వద్దకు పరుగులెత్తగలిగేందుకై రాళ్ళు తొలగించబడడం కోసం ఆ ఏరు నిరీక్షిస్తోంది ! కానీ మధ్యలో ఎన్ని రాళ్ళు వున్నాయి, మధ్యలో ఎన్ని గుండ్రాయిలు ఉన్నాయి అనేదానిపై అది ఆధారపడి ఉంటుంది. ఆ ఏరు బయటకు రావడానికి ఎంతో సమయం పట్టదు ... దాని దారి మూయబడి లేదు, అది తెరువబడి వుంది, నిరీక్షిస్తోంది. కొన్నిసార్లు ఎక్కడో కొంత త్రవ్వడం అనేది అవసరం అవుతుంది. కొన్నిసార్లు డైనమెట్ అవసరం వున్న పెద్ద గండశిలలు ఉండవచ్చు. కానీ మూడు స్థితులలోనూ ... ఆ ఏరు ఇప్పుడే కట్టలు తెంచుకున్నా లేదా కొద్దిసేపటి తరువాతైనా లేదా ఎన్నో జన్మల అనంతరమైనా ... ఆ ఏరు ఎల్లప్పుడూ ఉనికిలోనే వుంది. ఆ ఏరు కట్టలు తెంచుకుని ప్రవహించడానికి సిద్ధంగా లేదు అనేది ఆటంకం కాదు, దానిపై పడివున్న బండరాళ్ళ వలనే ఆటంకం కల్పించబడుతోంది.

జనకుడి యొక్క చైతన్యంపై ఏ గండశిలలూ ఉండి వుండవు ... ధన్యవాదాలు ఉదయించాయి, కృతజ్ఞత ప్రకటించబడింది. అతను నాట్యం చేయడం ప్రారంభించాడు ! అతను పరమానందభరితుడైపోయాడు.

నేను ఒక్కడినే ఈ దేహాన్ని ప్రకాశింపజేస్తున్నట్లుగానే,
ఈ విశ్వాన్ని సైతం నేను ప్రకాశింపజేస్తున్నాను.
అయితే ఈ సమస్త విశ్వమూ నాదే లేదా అసలేదీ నాది కాదు.

విశ్వాసం అంటే ఇదే. భగవద్గీతలో అర్జునుడికి విశ్వాసం లేదు, అతను సందేహిస్తాడు. అతను ప్రశ్న తరువాత ప్రశ్న రేకెత్తుతాడు... అతనికి వెయ్యి అనుమానాలు ఉన్నాయి. అతను మొదట ఈ కోణం నుంచి తరువాత ఆ కోణం

నుంచి ప్రశ్నిస్తాడు. జనకుడు ఏమీ అడుగలేదు. ఇందువలనే ఈ గీతాన్ని నేను మహాగీత అని పిలుస్తాను. అర్జునుడి యొక్క విశ్వాసలేమి అనేది చివరిలో నాశనమైంది, చిట్టచివరకు అతను స్వగృహానికి తిరిగి వస్తాడు. జనకుడికి అవిశ్వాసం లేదు. అది ఎలా ఉందంటే అతను తన స్వగృహం యొక్క ద్వారం వద్ద నిలిచి వున్నాడు మరి ఎవరో ఇలా అంటూ అతనిని కుదిపేశారు, " జనకా, నువ్వు ఇప్పటికే నీ స్వగృహం వద్ద నిలిచి వున్నావు ", వెళ్ళేందుకు ఏ ప్రదేశమూ లేదు."

మరి అతను అన్నాడు, **" ఓహో! " నేను ఒక్కడినే ఈ దేహాన్ని ప్రకాశింపజేస్తున్నట్లుగానే, ఈ విశ్వాన్ని సైతం నేను ప్రకాశింపజేస్తున్నాను.** అష్టావక్రుడు అన్నాడు మీ అత్యున్నత అస్తిత్వం ... సాక్షీతత్వం... కేవలం మీది మాత్రమే కాదు, అది మీ కేంద్రం మాత్రమే కాదు, అది సమస్త సృష్టి యొక్క కేంద్రం. ఉపరితలంపై మనం విడిగా ఉంటాం, అంతరంగంలో మనం ఒకటే. బాహ్యంగా మనం విడిగా ఉంటాం, మనం లోపలికి వెళ్ళినప్పుడు మనం ఒకటే ... సాగరపు ఉపరితలంపై తరంగాలు విడిగా ఉంటాయి కానీ సాగర గర్భంలో అన్ని ఒకటే అయివున్నట్లుగానే. ఉపరితలంపై ఒక అల చిన్నదిగా వుంటుంది, మరొకటి పెద్దదిగా ఉంటుంది ; ఒక అల అందంగా ఉంటుంది, మరొకటి అసహ్యంగా ఉంటుంది ; ఒక అల మలినంగా ఉంటుంది, మరొకటి స్వచ్ఛంగా ఉంటుంది... ఉపరితలంపై అవి అత్యంత విభిన్నమైనవిగా ఉంటాయి, కానీ సాగరాంతర్భాగంలో అన్నీ కలిసివుంటాయి. కేంద్రాన్ని జ్ఞప్తి చేసుకున్నవాడు తన వ్యక్తిత్వాన్ని కోల్పోతాడు, అతను ఒక వ్యక్తిత్వంగా ఉండడం అంతమైపోతుంది.

కనుక జనకుడు అంటాడు, **నేను ఒక్కడినే ఈ దేహాన్ని ప్రకాశింప జేస్తున్నట్లుగానే, ఈ విశ్వాన్ని సైతం నేను ప్రకాశింపజేస్తున్నాను.** " మీరు చెబుతున్నదేమిటి ? అది విశ్వసించలేనట్లుగా ఉంది !" గత రాత్రి ఒక యువకుడు నా వద్దకు వచ్చి అన్నాడు, "ధ్యానంలో సంభవించినదానిని నేను నమ్మను." నిజమే! ఏదైనా సంభవించినప్పుడు, అది ఇలానే ఉంటుంది : అది నమ్మశక్యం కానిదిగా ఉంటుంది. మనం మన నమ్మకాన్ని చిన్న విషయాలలో, అల్పమైన వాటిలో ఉంచుతాం. విస్తారమైనది సంభవించినప్పుడు మనం దానిని ఎలా నమ్మగలం ? దైవం మీ ఎదుట నిలిచి ఉన్నప్పుడు, మీరు భక్తి భావంతో నిండిపోయి, నిశ్చేష్టులై మరి నోటమాటరానివారు అయిపోతారు.

పశ్చిమంలో ఒక గొప్ప మార్మికుడు ఉండేవాడు, టెర్టలియన్. అతను చెప్పినది ఏమిటంటే... ఎవరో అతనిని అడిగారు, " భగవంతుడిని గురించిన రుజువు ఏదైనా వుందా ?"

అతను అన్నాడు, "కేవలం ఏకైక రుజువు వుంది ; భగవంతుడు ఉన్నాడు ఎందుకంటే ఆయన అసంగతమైనవాడు. భగవంతుడు ఉన్నాడు ఎందుకంటే ఆయన నమ్మశక్యంకానివాడు. భగవంతుడు ఉన్నాడు ఎందుకంటే ఆయన అసాధ్యమైనవాడు."

టెర్టలియన్ అత్యంత అద్వితీయమైనదేదో చెబుతున్నాడు. " భగవంతుడు ఉన్నాడు ఎందుకంటే ఆయన అసంగతమైనవాడు ! ప్రపంచం అర్థవంతమైనదిగా కనిపిస్తుంది, భగవంతుడు అసంగతమైనవాడు. అల్పమైనది సాధ్యమవుతుంది, కానీ విస్తారమైనది అసాధ్యమైనదవుతుంది. కానీ ఆ అసాధ్యం కూడా సంభవిస్తుంది," అంటాడు టెర్టలియన్. అసాధ్యాన్ని అంగీకరించండి మరి ఆ అసాధ్యం కూడా సంభవిస్తుంది. అది సంభవించినప్పుడు అది పూర్తిగా నమ్మశక్యంకానిదిగా ఉంటుంది. మీ వేర్లన్నీ పెరికివేయబడతాయి ; మీరు దానినెలా నమ్మగలరు ? అది సంభవించినప్పుడు మీరు ఉండరు, కనుక దానిని ఎవరు నమ్ముతారు ? అది సంభవించినప్పుడు మీరు పవనాల వద్దకు వ్యాపిస్తారు. ఇప్పటివరకూ మీరు అంధకారంలాగా ఉన్నారు. సూర్యుడు బయటకు వచ్చినప్పుడు, మీరు మాయమైపోతారు.

జనకుడు అంటున్నాడు, **అయితే ఈ సమస్త విశ్వమూ నాదే లేదా అసలేదీ నాది కాదు.** ఉన్న రెండు సంభావ్యతలూ ఇవే. ఈ రెండింటికీ మధ్య ఏ స్థితి అయినా భ్రమతో కూడినదే. అయితే సమస్త విశ్వమూ నాదే ఎందుకంటే నేను భగవంతుడి యొక్క అంశను, ఎందుకంటే నేను భగవంతుడిని, ఎందుకంటే నేను సమస్త విశ్వం యొక్క కేంద్రాన్ని, ఎందుకంటే నా సాక్షి సమస్త విశ్వం యొక్క సాక్షి ... కనుక అయితే సమస్త విశ్వమూ నాదే ... ఇది ఒక సంభావ్యత. లేదా నా వద్ద అసలేమీ లేదు, ఎందుకంటే నేను ఉనికిలోనే లేను. సాక్షీతత్వంలో నేను ఇక ఎంత మాత్రమూ ఉనికిలో ఉండను, కేవలం సాక్షీతత్వమే మిగిలి వుంటుంది. హక్కుదారుడే లేనప్పుడు అంతా తమదేనని ఎవరు హక్కుగా కోరుతారు ?

కనుక రెండు సంభావ్యతలు ఉన్నాయని జనకుడు అంటాడు... ఇవి మతం యొక్క రెండు వ్యక్తీకరణలు ... అయితే సంపూర్ణత లేదా శూన్యత. కృష్ణుడు సంపూర్ణతను ఎంచుకున్నాడు. ఉపనిషత్తులు సంపూర్ణతను ఎంచుకున్నాయి. సకలమూ ఆ సమస్తం నుంచే వస్తుంది, కానీ ఆ సమస్తం అనేది సమస్తంగానే మిగిలి వుంటుంది. సకలమూ ఆ సంపూర్ణతలోనికి ఐక్యమైపోతుంది, కానీ ఆ సంపూర్ణత పెరగదు, తరగదు. ఉపనిషత్తులు, కృష్ణుడు, హిందువులు మరి సూఫీలు అందరూ సంపూర్ణతను ఎంపిక చేసుకున్నారు.

జనకుడు చేసిన వివరణను చెబుతుంది, " అయితే సకలమూ నాదే ... నేను అఖండమైన సంపూర్ణతను, నేను పూర్ణ బ్రహ్మన్ని... లేదా అసలేదీ నాది కాదు, నేను అత్యున్నత శూన్యతను, నేను శూన్యాకాశాన్ని ! " ఈ రెండూ కలిసినదే సత్యం.

బుద్ధుడి యొక్క వివరణము అసంపూర్ణమైనది, కృష్ణుడి యొక్క వివరణము కూడా అసంపూర్ణమైనదే. జనకుడి యొక్క వివరణలో సత్యం సమస్తం కలుపబడింది. రెండింటినీ అనవచ్చు అని జనకుడు చెబుతాడు. ఎందుకు? ఎందుకంటే నేను సకల విశ్వం యొక్క కేంద్రం అయితే కనుక, సకల విశ్వమూ నాదే. కానీ నేను సకల విశ్వం యొక్క కేంద్రమైనపుడు నేను ఇక లేను. నా 'నేను' అనేది ఎప్పుడో వదిలిపోయింది. ఒక ధూళి మేఘంలాగా అది వెనుక వదిలివేయబడింది. యాత్రికుడు ముందుకు వెళతాడు, ధూళి వెనుక మిగిలిపోతుంది. అప్పుడు, ఏది నాది కాగలదు? అప్పుడు ఏదీ నాది కాదు. **అయితే ఈ సమస్త విశ్వమూ నాదే లేదా అసలేదీ నాది కాదు.**

ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి,
ఇప్పుడు మీ ప్రబోధం యొక్క నైపుణ్యం ద్వారా
నేను కేవలం దివ్యత్వాన్ని మాత్రమే చూస్తున్నాను.

ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి....

" ఇది ఒక అద్భుతం, నా దేహం పోయింది మరి ఆ దేహంతోనే ఈ సమస్త ప్రపంచమూ పోయింది." వదిలివేయడం సంభవించింది ! పరిత్యజించడం అనేది చేసేది కాదు, పరిత్యజించడం అనేది ఒక చైతన్య స్థితి. వదిలివేయడం అనేది ఒక కర్మ కాదు. తాను పరిత్యజించానని ఎవరైనా అంటే కనుక, అది పరిత్యజించడం కాదు. మరొక ప్రాపంచిక అనుభవంలోకి అతను వదిలివేయడం చేశాడు. "నేను ఒక పరిత్యాగిని," అని ఎవరైనా అంటే కనుక, అతనికి పరిత్యజించడం గురించి ఏమీ తెలియదు, ఎందుకంటే 'నేను' అనేది ఉన్నంతకాలమూ పరిత్యాగం అనేది ఎలా ఉండగలదు?

వదిలివేయడం అంటే అర్థం వస్తువులను విసర్జించడం కాదు. వదిలివేయడం అంటే మేల్కొనడం మరి చూడడం, "ఏదీ నాది కాదు ... నేను దానిని ఎలా విసర్జించగలను ? దేనిని విసర్జించాలి? నేను దానిని పట్టుకుని ఉంటే కనుక, నేను వదిలేయగలను. నా వద్ద అది ఉంటే కనుక, నేను వదిలివేయగలను."

ఉదయం మీరు నిద్ర లేచినప్పుడు, " సరే, ఇప్పుడు నేను నా కలలను త్యజించబోతున్నాను, " అని మీరు అనరు. ఉదయం నిద్ర మేల్కొని, " నేను ఒక

చక్రవర్తిని అని రాత్రి నేను కలగన్నాను. గొప్ప స్వర్ణ సౌధాలు, రత్న ఖచిత ఆభరణాలు ఉన్నాయి ; నా సామ్రాజ్యం దూరదూరాలకు విస్తరించి వుంది, మరి నాకు అందమైన కుమారులు మరి రాణి ఉన్నారు" అని మీరు అనరు ... ఉదయం మేల్కొని, "ఇప్పుడు నేను వీటన్నింటినీ త్యజిస్తున్నాను," అని మీరు అనరు. మీరు అలా అంటే కనుక మీరు పిచ్చివారిలా కనిపిస్తారు. మీరు ప్రొద్దున నిద్రలేచి మరి ఊరంతా కవాతు చేస్తూ ఒక డప్పును వాయిస్తూ, "నేను అన్నింటినీ త్యజించాను ... నా సామ్రాజ్యం సంపద, విలాసాలు, మహారాణి, రాకుమారులు : నేను సకలమూ వదిలిపెట్టాను," అని ప్రకటిస్తూంటే కనుక ... ప్రజలు నిశ్చేష్టులవుతారు. వాళ్ళు అంటారు, "ఏ సామ్రాజ్యం ? నీకు ఒక సామ్రాజ్యం ఉన్నదని మాకు ఎన్నడూ తెలియదు."

మీరు జవాబు చెబుతారు, "రాత్రివేళ నేను కలగన్నాను..."

ప్రజలు నవ్వుతారు మరి మీకు పిచ్చి పట్టిందని అంటారు. ఒక స్వప్న సామ్రాజ్యాన్ని పరిత్యజించాల్సిన అవసరం లేదు.

కనుక గ్రహణకు తాళం చెవి ఇదే : ఈ ప్రపంచం అసలేమీ కాదు అనేది మీరు చూసినప్పుడు, అక్కడ త్యజించవలసిన అవసరం ఏముంది ? కానీ తాము ఎంత పరిత్యజించాము అనేదానిని జాగ్రత్తగా గుర్తుంచుకునే జనాలు ఉన్నారు.

ఒక మిత్రుడు నన్ను చూసేందుకు వచ్చాడు. అతని భార్య కూడా అతనితో ఉంది. ఈ మిత్రుడు తన దాతృత్వానికి ప్రసిద్ధుడు. అతని భార్య చెప్పింది, "బహుశా నా భర్తతో మీకు పరిచయం ఉండుండకపోవచ్చు, అతను అత్యంత దాతృత్వం గలవాడు, అతను లక్ష రూపాయలు దానంగా ఇచ్చాడు."

వెంటనే భార్య చెప్పిన దాంట్లో భర్త కల్పించుకున్నాడు, "లక్ష కాదు, లక్షా పదివేలు."

ఇది దాతృత్వం కాదు, ఇది గణన. ఇది వ్యాపారం. ప్రతి పైసా జాగ్రత్తగా గుర్తుంచుకోబడుతుంది. అతను ఎప్పుడైనా భగవంతుడిని కలుసుకుంటే కనుక, "నేను లక్షా పదివేలు ఇచ్చాను ; బదులుగా నువ్వు ఏమిస్తున్నావో నాకు చెప్పు," అని అతను ఆయన పీక పట్టుకుంటాడు. అతను దానిని ఇచ్చాడు ఎందుకంటే పవిత్ర గ్రంథాలు చెబుతాయి నువ్వు ఇక్కడ ఒకటి ఇస్తే కనుక, అక్కడ నువ్వు పదిలక్షల రెట్లు పొందుతావు. అటువంటి ఒప్పందాన్ని ఎవరు వదిలేసుకుంటారు ? పదిలక్షల రెట్లు ! మీరు ఆ వడ్డీ శాతాన్ని విన్నారా ? మీరు ఇలాంటి వ్యాపారాన్ని చూశారా ?

జూదరులు సైతం అంత మహా జూదరులు కాదు ! జూదమాడి మీరు పదిలక్షల రెట్లు పొందరు. ఇది పూర్తిగా జూదమే. అది పదిలక్షల రెట్లుగా తిరిగి ఇవ్వబడుతుంది అనే ఆశతో లక్ష ఇవ్వండి. ఇది కేవలం మీ అత్యాశ యొక్క విస్తరణ మాత్రమే.

మరి లక్షను లెక్కించడం... ఈ రూపాయల యొక్క విలువ ఇంకా పోలేదు. ఇంతకు ముందు ఆ రూపాయలు భద్రంగా పెట్టెలో దాచి వుంచబడ్డాయి ; ఇప్పుడు ఆ పెట్టె స్థానంలో, ఎంత త్యజించబడింది అనే దానిని గురించి ఒక పుస్తకంలో వ్రాసి ఉంచబడుతోంది. కానీ ఆ కల భంగమవ్వలేదు.

అత్యంత సనాతనమైన చైనీయుల గాథ ఒకటి వుంది :

ఒక చక్రవర్తికి ఒకే ఒక్క కుమారుడు ఉన్నాడు మరి ఆ కుమారుడు తన మరణశయ్యపై ఉన్నాడు. " అతనిని రక్షించేందుకు మేము ఏమీ చేయలేం. అతను బ్రతకడు. అతనిని కాపాడడం సాధ్యం కాదు," అని అంటూ వైద్యులు చేతులెత్తేశారు. ఆ వ్యాధికి నివారణ లేదు. అది కేవలం ఒకటి లేదా రెండు రోజుల విషయమే, " ఏ క్షణమైనా అతను మరణిస్తాడు."

అతని శయ్య ప్రక్కనే కూర్చుని ఆ తండ్రి రాత్రంతా మేల్కొనే వున్నాడు. వీడ్కోలు చెప్పవలసిన సమయం వచ్చింది. అతని కళ్ళ నుంచి కన్నీళ్ళు స్రవిస్తున్నాయి. కూర్చుని మరి కూర్చుని, సుమారు ఉదయం మూడు గంటలకు ఆ తండ్రి కునుకు తీయడం ప్రారంభించాడు. అతను నిద్రించినప్పుడు తాను ప్రభువైన ఒక మహా సామ్రాజ్యం గురించి అతను కలగన్నాడు. అతనికి పన్నెండుమంది కుమారులు ఉన్నారు ... అందరూ అత్యంత రూపవంతులు, యువకులు, ప్రతిభాశాలురు, వివేకవంతులు...గొప్ప యోధులు ! సమస్త ప్రపంచంలోనూ సరితూగగలవారు ఎవ్వరూ లేరు. అతనికి విస్తారమైన సంపద వుంది, అపరిమితమైనది. అతను ప్రపంచాన్ని పరిపాలించేవాడు ... అతని పాలన పృథ్వి అంతటా వ్యాపించి ఉంది.

కుమారుడు తన ఆఖరి శ్వాస తీసుకుంటున్నప్పుడు అతను ఈ కలగంటున్నాడు. అతని భార్య కేకవేసింది మరి విలపించడం ప్రారంభించింది. అతను తన కళ్ళు తెరిచాడు. అతను పూర్తి ఆఘాతానికి గురయ్యాడు. అతను అక్కడ కూర్చుని ఉన్నాడు, ఏమీ తోచనివాడిలా, ఎందుకంటే కేవలం ఒక క్షణం క్రితం మరో సామ్రాజ్యం ఉంది, పన్నెండు మంది కుమారులు, గొప్ప సంపద అదంతా పోయింది. మరి ఇక్కడ ఈ కుమారుడు మరణించాడు ! అతను 'పూర్తిగా దిగ్భ్రమ చెందాడు. అతని మనస్సు దెబ్బతిన్నదేమోనని అతని భార్య కలత చెందింది, ఎందుకంటే అతనికి తన కుమారుడి పట్ల అత్యంత అనురాగం ఉండేది, మరి అతని కళ్ళ నుంచి ఒక్క కన్నీటి

బొట్టు కూడా రావడం లేదు. కుమారుడు జీవించి వున్నప్పుడే అతని కోసం విలపించాడు. ఇప్పుడు ఆ కుమారుడు మరణించాడు మరి ఆ తండ్రి విలపించడం లేదు? అతని భార్య అతనిని కుదిపింది మరి అంది, "మీకు ఏమైనా జరిగిందా ? మీరు ఎందుకు విలపించడం లేదు ?"

అతను అన్నాడు, " నేను ఎవరి కోసం విలపించాలి ? పన్నెండుమంది పుత్రులు అక్కడ ఉండేవారు, వాళ్ళు మరణించారు. ఒక మహాసామ్రాజ్యం ఉండేది, అది పోయింది. నేను వాళ్ళ కోసం విలపించాలా లేదా నేను ఇతని కోసం విలపించాలా? ఎవరి కోసం విలపించాలని నేను ఆశ్చర్యపోతున్నాను. పన్నెండుమంది పుత్రులు పోయినట్లుగానే పదమూడుమంది పోయారు. " అంతా ముగిసిపోయింది" అన్నాడు అతను. "అది ఒక స్వప్నం మరి ఇది కూడా ఒక స్వప్నమే. నేను ఆ కలను కంటూన్నప్పుడు, నేను ఈ కుమారుడిని, ఈ సామ్రాజ్యాన్ని పూర్తిగా విస్మరించాను ... ప్రతీదీ విస్మరించబడింది. ఆ కల చెదిరిపోయినప్పుడు నేను మిమ్మల్ని అందరినీ జ్ఞాపకం చేసకున్నాను. ఈ రాత్రికి నేను నిదురిస్తాను మరి మళ్ళీ మీ అందరినీ నేను మరచిపోతాను.

" కనుక అది వస్తుంది మరి పోతుంది, ఇప్పుడు అది ఉంది, ఇప్పుడు అది లేదు : మరి ఇప్పుడు రెండు కలలూ పోయాయి. ఇప్పుడు నేను స్వప్నించడం నుంచి మేల్కొన్నాను. ఇక నేను కలల్లో సంచరిస్తూ ఉండను. ఇది చాలు, ఆ సమయం ఆసన్నమైంది. ఫలం పరిపక్వమయ్యింది, ఇక అది రాలిపోవలసిన సమయం వచ్చింది!"

జనకుడు అంటాడు, **ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి... వదిలివేయడం సంభవించింది !** అతను కనీసం ఒక్క అంగుళమైనా కదలలేదు, అతను ఎక్కడ ఉన్నాడో అతను అక్కడే వున్నాడు, అతను అష్టావక్రుడిని ఆహ్వానించి, మరి అతనిని సింహాసనంపై ఆసీనుడిని చేసిన ఆ సౌధంలోనే ... అతను అష్టావక్రుడికి అభిముఖంగా అక్కడ కూర్చుని ఉన్నాడు. అతను ఎక్కడకూ వెళ్ళలేదు, ఆ సామ్రాజ్యం కొనసాగుతోంది, దర్బారు యొక్క సమృద్ధి అక్కడే వుంది, ద్వారం వద్ద ద్వారపాలకులు ఉన్నారు, సేవకులు వింజామరలను వీస్తూనే ఉన్నారు. సకలమూ ఉన్నది ఉన్నట్లుగానే కొనసాగుతోంది, ఆ కోశాగారం తన స్థానంలోనే వుంది. కానీ జనకుడు అంటాడు, " ఆశ్చర్యం, వదిలివేయడం సంభవించింది !"

పరిత్యాగం అనేది అంతర్గత అస్తిత్వానికి సంబంధించినది. పరిత్యజించడం అనేది అవగాహన ద్వారా సంభవిస్తుంది.

ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి ఇప్పుడు మీ ప్రబోధం యొక్క నైపుణ్యం ద్వారా... "మరి అది ఏ నైపుణ్యం ద్వారా, ఒక్క ఆకు అయినా కదలకుండానే మరి ఆ రూపాంతరీకరణ సంభవించింది ? ఒక్క చిన్న కోత కూడా పెట్టకుండానే మరి ఆ శస్త్ర చికిత్స పూర్తయ్యింది ! ఎంతటి ప్రావీణ్యం ! మీ యొక్క ఈ బోధన ఏమిటి ? ఇప్పుడు నేను దివ్యత్వాన్ని చూస్తున్నాను, ఈ ప్రపంచం ఇక ఎంతమాత్రం కనిపించడంలేదు. నా దృష్టి సమస్తం రూపాంతరీకరించబడింది !"

ఇది ఒక అపారంగా భావగర్భితమైన సూత్రం : మీరు ఎక్కడున్నారో అక్కడే మీరు ఉంటారు, కేవలం మీరు ఉన్న విధంగానే మీరు ఉంటారు ... ఆ రూపాంతరీకరణ సంభవించగలదు. హిమాలయాల వద్దకు పారిపోవలసిన అవసరం లేదు. సన్యాసం అంటే తప్పించుకోవడం కాదు, పారిపోవడం కాదు. ప్రతీదీ అది ఉన్న విధంగానే ఉంటుంది ... భార్య, పిల్లలు, ఇల్లూ వాకిలి. దాని గురించి ఒక్క మాట కూడా ఎవ్వరూ వినలేదు ... మరి ఆ విప్లవం సంభవిస్తుంది. అది ఒక ఆంతరంగిక విషయం. మీరు ఆశ్చర్యచకితులవుతారు, సంభవించినది ఏమిటి ? ఇప్పుడు భార్య మీకు చెందిన దానిలా అనిపించదు, కుమారుడు మీకు చెందినవాడిలా అనిపించదు, ఇల్లు మీకు చెందినదానిలా అనిపించదు. మీరు ఇంకా అక్కడే జీవిస్తారు, కానీ ఇప్పుడు మీరు ఒక అతిథిలా జీవిస్తారు. ఆ ఇల్లు అదే కానీ అది రాత్రి మజిలీకై ఓ ప్రదేశంలా అయ్యింది. అంతా అలాగే వుంది ... మీరు పని చేస్తారు, మీరు మీ దుకాణానికి వెళ్తారు, మీ కార్యాలయానికి వెళతారు ; మీరు పనిచేస్తారు, కానీ ఇప్పుడు మిమ్మల్ని ఏ చింతా చేజిక్కించుకోదు.

ఒకసారి మీరు ఇక్కడ సకలమూ కేవలం ఒక క్రీడ, ఒక మహా నాటకం మాత్రమే అనేది చూసినప్పుడు, ఆ విప్లవం సంభవిస్తుంది.

ఒక నటుడు నన్ను అడిగాడు, "నేను నటనలో మరింత నైపుణ్యంగలవాడుగా ఎలా అవ్వగలనో నాకు చెప్పండి."

కనుక నేను చెప్పాను : కేవలం ఒకే ఒక్క నిబంధన వుంది. జీవితంలో నైపుణ్యంతో ఉండాలని అనుకునేవారికి, నిబంధన ఏమిటంటే వాళ్ళు జీవితాన్ని నటనలా తీసుకోవాలి. మరి నటనలో నైపుణ్యంతో ఉండాలని అనుకునేవారికి, నిబంధన ఏమిటంటే నటనను వాస్తవ జీవితంలా తీసుకోవాలి. మరొక తాళంచెవి ఏదీ లేదు. ఒక నటుడు తన నటనను నిజ జీవితంలా తీసుకుంటే కనుక, అతను నైపుణ్యంగలవాడు అవుతాడు. అప్పుడు అతను నాటకాన్ని నిజజీవితంగా తీసుకుంటాడు.

అవాస్తవమైనది అతనికి వాస్తవమయ్యేంత లోతైన నైపుణ్యంగల ఒక నటుడు మీపై తన ముద్రను వేస్తాడు. ఊహాజనితమైనదానిని వాస్తవమైనదిగా ఒక నటుడు చూడలేకపోతే కనుక అతను ఒక గొప్ప నటుడు కాలేడు. అతను బయటే ఉండిపోతాడు. అతను తన పాత్రలోకి లీనమైపోలేడు ... అతను చాలా పైపైనే ప్రదర్శిస్తూ ఉంటాడు. కానీ అతని ఆత్మ దానిలోకి ప్రవేశించలేదనీ, అతను దానిలోకి మాయమైపోలేదనీ మీరు కనుగొంటారు.

ఒక నటుడు నటనలో తనను తాను పూర్తిగా మరచిపోతాడు. అతను రాముడిగా నటిస్తున్నప్పుడు, అతను పూర్తిగా మరచిపోతాడు మరి అతను రాముడే అయిపోతాడు. అతని సీత అపహరించబడినప్పుడు, " దీనితో ఏ విధంగానైనా నాకు సంబంధమేముంది ? కొద్దిసేపటిలో ఈ నాటకమంతా అయిపోతుంది, మేము అందరం ఇళ్ళకు వెళ్ళిపోతాం ; ఊరికే విలపించడమెందుకు ? నా సీత ఎక్కడకు వెళ్ళిందని ఈ వృక్షాలను అడగడమెందుకు ? అరవడం మరి కేకలు పెట్టడం ఎందుకు ? ఉపయోగం ఏమిటి ? నాకు ఏ సీత అయినా వుందా ? మరి ఇక్కడ ఏ సీతా లేదు, మరొక పురుషుడు సీత పాత్రను పోషిస్తున్నాడు. నాకు అతనితో ఏ పనీ లేదు," అని అతను అనడు. అతను తనను తాను దానిలో కోల్పోనట్లయితే అతను ఒక గొప్ప నటుడు కాలేడు. నటనలో నైపుణ్యం అనేది నటనను జీవితంలా తీసుకోవడంలో, దానిని పూర్తి వాస్తవమైనదిగా తీసుకోవడంలో ఉంటుంది. అతని స్వంత సీతే తప్పిపోయింది. ఆ కన్నీళ్ళు అసత్యమైనవి కావు, అవి వాస్తవమైనవి. తన ప్రేయసినే కోల్పోయినట్లుగా అతను విలపిస్తాడు... అతను అదే విధంగా పోరాడుతాడు. అతని నటన నిజ జీవితంలా వుంటుంది.

మీరు నైపుణ్యంతో జీవించాలనుకుంటే కనుక, మీ జీవితాన్ని నటనలా తీసుకోండి. ఇది కూడా ఒక నాటకమే. ముందు వెనుకలుగా ఆ తెర పడిపోతుంది. ముందు వెనుకలుగా ప్రతి ఒక్కరూ వెళ్ళిపోతారు. ఆ వేదిక విస్తారమైనది కావచ్చు, కానీ ఎంత విస్తారమైనది అయినాగానీ అది ఇంకా ఓ వేదిక మాత్రమే. ఇక్కడ మీ ఇంటిని రూపొందించుకోకండి. ప్రయాణికులు విశ్రమించే గుడారంలో ఉన్నట్లుగానే ఇక్కడ ఉండండి. అది ఒక ప్రయాణికుల విశ్రాంతి గది. ఇక్కడ అందరూ వరుసకట్టి ఉన్నారు. మృత్యువు ఇక్కడకు వస్తుంది మరి ప్రజలు వెళ్ళిపోతూనే వుంటారు. మీరూ వెళ్ళిపోబోతున్నారు. ఇక్కడ వ్రేళ్ళూని ఉండవలసిన అవసరం లేదు : అలా చేసినవాళ్ళు వేదన పొందుతారు.

ఈ ప్రపంచంలో వ్రేళ్ళూని లేని వ్యక్తే ఓ సన్యాసి. ఇక్కడ వ్రేళ్ళూని లేనివాడే, కాళ్ళు పాతుకుపోయి లేనివాడే, ఓ సన్యాసి. ముందుకు సాగిపోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నవాడు... అతను ఒక దేశదిమ్మరి, ఒక జిప్సీ, ఒక ఖానా-బదోష్ (నిలువనీడ లేనివాడు)

ఈ పదం ' ఖానా-బదోష్ ' ఎంతో చక్కనిది. దాని అర్థం తన ఇంటిని తన భుజాలపై మోసుకెళ్ళేవాడు. ' ఖానా ' అంటే ఇల్లు, ' బదోష్ ' అంటే భుజాలపై అని అర్థం ... తన ఇంటిని తన భుజాలపై ఉంచుకున్నవాడు. ఆ ఖానా-బదోష్ ఓ సన్యాసి. మహా అయితే ఇక్కడ ఓ గుడారాన్ని వేసుకోండి, ఇక్కడ ఓ ఇంటిని తయారు చేసుకోకండి. ఒక గూడారాన్ని ఏ సమయంలోనైనా, ఒక్క క్షణమైనా ఆలస్యం లేకుండా తీసేయవచ్చు. ప్రయాణికులు విశ్రమించే ఓ గుడారం !

సూఫీ అయిన ఇబ్రహీం గురించి చెప్పబడుతుంది...

పూర్వం అతను భాల్ఖ్ యొక్క చక్రవర్తిగా ఉండేవాడు. ఒక రాత్రి అతను తన రాజప్రాసాదంలో నిదురిస్తున్నప్పుడు ఎవరో పైకప్పుపై నడుస్తూండడం అతను విన్నాడు. అతను అడిగాడు, " అర్ధరాత్రి ఏ అనాగరిక మూర్ఖుడు పైకప్పుపై నడుస్తున్నాడు ? నువ్వు ఎవరు ?"

ఒక స్వరం బదులిచ్చింది, "నేను అనాగరికుడిని కాదు, నా ఒంటె తప్పిపోయింది. నేను దాని కోసం వెతుకుతున్నాను.

ఇబ్రహీం నవ్వడం ప్రారంభించాడు. అతను అన్నాడు, " పిచ్చివాడా ! నీకు పిచ్చి ! తప్పిపోయిన ఒక ఒంటె పైకప్పుపై దొరుకుతుందా ? దాని గురించి ఆలోచించు: ఒక ఒంటె పైకప్పును ఎలా ఎక్కగలదు ?"

పై నుంచి ఒక స్వరం వినిపించింది: " ఇతరులను అనాగరికులు మరి పిచ్చివారు అని అనేముందు, నీ గురించి నువ్వు ఆలోచించు. ఆనందం అనేది సంపదలలో, విలాసాలలో, మధిరలో మరి మధురగానంలో దొరుకుతుందా ? ఆనందం అనేది సంపదలలో, విలాసాలలో, మధిరలో మరి మధురగానంలో దొరికితే కనుక, అప్పుడు ఒంటెలు సైతం పైకప్పు మీద దొరకవచ్చు."

ఇబ్రహీం నిశ్చేష్టుడయ్యాడు. అది అర్ధరాత్రి కానీ అతను పైకి లేచాడు మరి ఆ మనిషిని పట్టుకునేందుకు తన మనుషులను అవ్యవధిగా పరుగెత్తించాడు : ఆ వ్యక్తికి ఏదో తెలిసి వున్నట్లుగా కనిపిస్తోంది. కానీ అప్పటికి ఆ మనిషి జారుకున్నాడు. ఆ వ్యక్తి ఎవరు అనేది కనుగొనేందుకు రాజధాని అంతటా ఇబ్రహీం తన మనుషులను

పంపాడు అతను ఒక జ్ఞాన సిద్ధుడైన ఫకీరులా కనిపిస్తున్నాడు. అతను చెప్పినది ఏమిటి ? ఏ ఉద్దేశ్యంతో అతను అది చెప్పాడు ?

మిగిలిన రాత్రి ఇబ్రహీం నిదురించలేకపోయాడు. మరునాటి ఉదయం అతను దర్బారు నిర్వహిస్తున్నప్పుడు అతను వ్యాకులతతో నిండిన మనోస్థితిలో ఉన్నాడు. ఆ మాటలు అతనిని బలంగా తాకాయి.

అతను జనకుడిలాంటివాడు అయివుంటాడు : చెప్పబడిన దాని యొక్క సత్యం చేత అతను బలంగా తాకబడ్డాడు. " ఈ మనిషి పిచ్చివాడైతే కనుక, నేను వివేకవంతుడినా ? ఈ ప్రపంచంలో ఆనందాన్ని ఎవరు కనుగొనగలిగారు ? నేను కూడా దానికోసం అన్వేషిస్తున్నాను. ఆనందం అనేది ఈ ప్రపంచంలో లభించదు, మరి అది లభిస్తే కనుక, పైకప్పు మీద ఒంటెను సైతం కనుగొనవచ్చు. అప్పుడు అసాధ్యమైనది సంభవిస్తుంది, ఏ సమస్యా లేదు. కానీ ఆ వ్యక్తి ఎవరు ? అతను పైకప్పు మీదకు ఎలా ఎక్కాడు ? అతను ఎలా తప్పించుకున్నాడు, అతను ఎక్కడకు వెళ్ళాడు ? అతను ఆలోచనల్లో మునిగిపోయి కూర్చున్నాడు. అతను సభను నిర్వహిస్తున్నాడు ... సభ తీర్చబడి వుంది, వ్యాపారం చర్చించబడుతోంది ... కానీ ఈ రోజు అతని మనస్సు అక్కడ లేదు. అతని మనస్సు ఎక్కడికో ఎగిరిపోయింది. అతని మనస్సు అనే పక్షి అప్పటికే మరో ప్రపంచం దేనిలోకో ఎగిరిపోయింది... వదిలివేయడం అనేది అప్పటికే సంభవించినట్లుగా. కేవలం ఒక చిన్న సంఘటన ... స్వయంగా అష్టావక్రుడే అతని మేడ పైకప్పు మీదకు ఎక్కి మరి మాట్లాడినట్లుగా.

కేవలం అప్పుడే ద్వారం వద్ద ఏదో సమస్య ఉంది అనేది అతను గమనించాడు. ఒక మనిషి లోపలికి రావాలనుకుంటున్నాడు మరి తాను ప్రయాణికులు బసచేసే ఈ సత్రంలో ఉండాలనుకుంటున్నానని అతని ద్వారపాలకుడికి చెబుతున్నాడు. మరి ఆ ద్వార పాలకుడు అంటున్నాడు, " నువ్వు పిచ్చివాడివి... ఇది ఒక గుడారం కాదు, ఇది చక్రవర్తి యొక్క రాజ ప్రాసాదం. నగరంలో అనేక సత్రాలు ఉన్నాయి ... వెళ్ళు మరి అక్కడ ఉండు."

కానీ ఆ మనిషి అంటున్నాడు, " నేను ఇక్కడే ఉంటాను ... నేను ఇంతకుముందు ఇక్కడ ఉన్నాను. ఇది ఒక సత్రం. మరెవరికైనా ఈ అర్థరహితమైనది చెప్పు ... నువ్వు నన్ను మోసగించలేవు."

అకస్మాత్తుగా, అతని స్వరం వినడంతోనే, ఇది అదే స్వరమనీ మరి ఇతను అదే మనిషి అనీ ఇబ్రహీం గుర్తించాడు. అతను అన్నాడు, "అతనిని లోపలికి తీసుకురండి ... అతనిని తరిమేయకండి."

అతను లోనికి తీసుకురాబడ్డాడు. ఇబ్రహీం అడిగాడు, " నువ్వు చెబుతున్నది ఏమిటి ? ఇది ఏ రకమైన దురహంకారం ? ఇది నా రాజసౌధం. నువ్వు దీనిని ఒక సత్రం అని అంటావా ? ఇది అవమానకరం."

ఆ మనిషి అన్నాడు, " అది అవమానం అయినా లేదా ప్రశంస అయినా, నేను ఒక విషయం అడుగుతాను : నేను ఇదివరకు ఇక్కడకు వచ్చాను, కానీ అప్పుడు మరొకరెవరో ఇక్కడ కూర్చుని ఉన్నాడు. అతను ఎవరు ?"

ఇబ్రహీం బదులిచ్చాడు, " ఆయన నా తండ్రి."

ఫకీరు అన్నాడు, " మరి అంతకన్నా ముందు కూడా నేను ఇక్కడకు వచ్చాను ; మరొక మనిషి ఇక్కడ ఉన్నాడు."

ఆ రాజు బదులిచ్చాడు, "ఆయన నా తండ్రి యొక్క తండ్రి."

కనుక ఫకీరు అన్నాడు, " ఇందువలనే నేను దీనిని ఒక సత్రం అని పిలుస్తున్నాను. ప్రజలు ఇక్కడ కూర్చుంటారు తరువాత వెళ్ళిపోతారు, వాళ్ళు వస్తారు మరి వెళ్ళిపోతారు. నువ్వు ఎంతకాలం ఇక్కడ కూర్చుంటావు ? నేను మళ్ళీ ఇక్కడకు వచ్చినప్పుడు మరొకరెవరో ఇక్కడ కూర్చుని ఉండడం నేను చూస్తాను. అందువలనే ఇది ఒక సత్రం అని నేను పిలుస్తాను. ఇది ఒక గృహం కాదు. ఒకసారి మీరు అక్కడ ఉంటే, మీరు అక్కడే ఉండే ప్రదేశమే స్వగృహం ... అక్కడి నుంచి మిమ్మల్ని ఎవ్వరూ వెళ్ళగొట్టలేరు, వెళ్ళగొట్టబడడం అనేది అక్కడ సాధ్యం కాదు."

చెప్పబడేది ఏమిటంటే, ఇబ్రహీం తన సింహాసనం నుంచి దిగివచ్చాడు మరి ఆ ఫకీరుతో అన్నాడు, " నేను మీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. ఇది ఒక సత్రమే. మీరు ఇక్కడ ఉండండి, నేను వెళ్ళిపోతున్నాను. ఒక సత్రంలో ఉండడం వలన ప్రయోజనం ఏముంది ? "

ఇబ్రహీం ఆ రాజమహలును వదిలివెళ్ళాడు. అతను సమర్థుడూ, సంసిద్ధుడూ అయివుంటాడు.

జనకుడు అంటాడు, " ఒక్క క్షణంలో నేను ఈ ప్రపంచాన్ని మరి ఈ దేహాన్ని పరిత్యజించాను అనేది నేను చూశాను. నేను ఒక సన్యాసిగా అయ్యాను. ఏ నైపుణ్యంతో మీరు దీనిని చేశారు ? మీరు అందించిన ఈ బోధన ఏమిటి ? మీరు ఎంతటి నైపుణ్యాన్ని కలిగి వున్నారు ! మీరు ఎంతటి కళను కలిగి వున్నారు !"

ఆశ్చర్యం, ఈ దేహాన్ని మరి ఈ ప్రపంచాన్ని పరిత్యజించి,

ఇప్పుడు మీ ప్రబోధం యొక్క నైపుణ్యం ద్వారా...

" ఎంతటి నైపుణ్యం ! నేను ఎటువంటి గురువును కలుసుకున్నాను."

... నేను కేవలం దివ్యత్వాన్ని మాత్రమే చూస్తున్నాను.

" ఇప్పుడు నేను కేవలం దివ్యత్వాన్ని మాత్రమే చూస్తున్నాను. మరేదీ నాకు కనిపించడంలేదు. ఇప్పుడు ఇదంతా కేవలం దివ్యత్వం యొక్క సాక్షాత్కారాలుగానే, కేవలం ఆయన అలలుగానే కనిపిస్తోంది."

అలలు, నురగలు మరి బుడగలు నీరే తప్ప మరేదీ కాని విధంగానే, ఈ ఏకాత్మ ఆ విశ్వాత్మే తప్ప మరేదీ కాదు.

" నీటిలో అలలు ఎగిసినట్లుగానే, బుడగలు ఏర్పడినట్లుగానే, నురగ కనిపించినట్లుగానే... మరి అవి నీటి నుంచి వేరుగా లేవు. అవి దాని నుంచే పుడతాయి, అవి తిరిగి దానిలోకే మాయమైపోతాయి. అదే విధంగా దివ్యత్వం నుంచి భిన్నంగా ఉన్నది ఇక్కడ ఏదీ లేదు. అంతా ఆయన బుడగలే, అంతా ఆయన నురగలే, అంతా ఆయన అలలే. అవి ఆయనలో జనిస్తాయి, అవి తిరిగి ఆయనలోకే మాయమై పోతాయి... **అలలు, నురగలు మరి బుడగలు నీరే తప్ప మరేదీ కాని విధంగానే....** మనం కేవలం ఈ విధంగానే ఉంటాం. నేను దీనిని చూడడం ప్రారంభిస్తున్నాను, స్వామీ."

తాను దానిని నేరుగా చూస్తున్నానని జనకుడు అష్టావక్రుడికి చెబుతున్నాడు. ఇది ఒక తత్త్వవేత్త యొక్క వివరణము కాదు. ఇది ఒక అనుభవం, అతను పొందుతున్న ఒక ప్రగాఢానుభవం నుంచి జనిస్తున్న ఓ వ్యక్తీకరణ.

మీరు కూడా ఒకసారి చూడండి. అది కేవలం దృష్టిలో స్వల్ప మార్పునకు సంబంధించిన విషయం, దీనినే పశ్చిమంలో గెస్టాల్ట్ యొక్క మార్పు (Change of gestalt) అని పిలుస్తారు. ' గెస్టాల్ట్ ' అనే పదం ఎంతో అర్థవంతమైనది. పిల్లల పుస్తకాలలో ప్రచురించబడిన ఒక చిత్రాన్ని మీరు ఎప్పుడో చూసేవుంటారు... ఏక చిత్రంలోనే, మీరు శ్రద్ధగా చూస్తే కనుక, కొన్నిసార్లు మీరు ఒక వృద్ధ మహిళను చూస్తారు, కొన్నిసార్లు మీరు ఒక యువతిని చూస్తారు. మీరు దానిని చూస్తూనే వుంటే అవి ఒకదాని తరువాత ఒకటి కనిపించడం ప్రారంభిస్తాయి : కొన్నిసార్లు వృద్ధురాలు కనిపిస్తుంది, కొన్నిసార్లు యువతి కనిపిస్తుంది. ఒకే రేఖల నుంచి వాళ్ళు రూపొందించబడ్డారు. కానీ ఒక్క విషయం ... మీరు ఆశ్చర్యపోతారు. అది మీరు ఎన్నడూ ఆలోచించి వుండనిదై ఉంటుంది ... మీరు వారిద్దరినీ ఏకకాలంలో చూడలేరు.

మీరు వాళ్ళిద్దరినీ చూసినా కూడా ... ఆ చిత్రంలో మీరు వృద్ధ మహిళను చూసారు, మరి మీరు యువతినీ చూశారు ; ఇరువురూ ఆ చిత్రంలో ఉన్నారని మీకు ఇప్పుడు తెలుసు ... అయినాగానీ మీరు వాళ్ళను ఏకకాలంలో చూడలేరు. మీరు యువతిని చూసినప్పుడు వృద్ధురాలు మాయమైపోతుంది. మీరు వృద్ధురాలిని చూసినప్పుడు, యువతి మాయమైపోతుంది... ఎందుకంటే అవే గీతలు ఇద్దరికీ వినియోగించబడ్డాయి. జర్మన్ భాషలో దీనిని ' గెస్టాల్ట్ ' అంటారు. గెస్టాల్ట్ యొక్క అర్థం ఏమిటంటే : ఒక విధంగా చూస్తే అది ఒకలా కనిపిస్తుంది, మరో విధంగా చూస్తే అది మరోలా కనిపిస్తుంది. అది ఒకే విషయం, కానీ మీరు చూసే విధానం అర్థాన్నంతటినీ మార్చేస్తుంది.

ప్రపంచం అదే విధంగా ఉంది. అజ్ఞాని దాని వైపు చూసినప్పుడు అతను అసంఖ్యాక విధములైన విషయాలను చూస్తాడు : ఒక గెస్టాల్ట్, చూసే ఒక విధానం. మరి ఒక జ్ఞాని దాని వైపు చూసినప్పుడు అసంఖ్యాక విధములు మాయమైపోతాయి ... వేలాది రూపాలు మాయమైపోతాయి. ఏక సువిశాల విస్తారత దర్శించబడుతుంది.

జనకుడు చెబుతాడు, **... నేను కేవలం దివ్యత్వాన్ని మాత్రమే చూస్తున్నాను.** "నేను అత్యున్నత వాస్తవాన్ని చూస్తున్నాను." ఈ పచ్చని వృక్షాలు దాని యొక్క హరితమే. ఈ పుష్పాలతో వర్ణమై విరబూస్తున్నది అదే. సుమాల పరిమళాలలో గాలితో తుళ్ళి పడుతున్నది అదే. ఆకాశంలో కమ్ముతున్న మేఘాలలో ఉన్నది అదే. మీ అంతరంగంలో నిద్రావస్థలో ఉన్నది అదే, అష్టావక్రుడు మరి బుద్ధుడి యొక్క అంతరంగంలో జాగృతుడై ఉన్నది అదే.

గాఢ నిద్రలోనున్న ఒక శిల యొక్క సాంద్రతలో ఉన్నది అదే. ఒక మనిషిలో కొద్దిగా అప్రమత్తంగా వున్నది అదే, కొద్దిపాటి జాగృతి మొదలైనది : కానీ అది అదే.

అన్ని రూపాలూ దాని రూపాలే. తలక్రిందులుగా ఉన్నప్పుడు అది అదే, సరైన విధంగా నిలిచి వున్నప్పుడూ అది అదే. మానవ దృష్టికోణం నుంచి చూస్తే వృక్షాలు తలక్రిందులుగా ఉన్నాయి... కొద్దిరోజుల క్రితం నేను వృక్ష జాతి గురించిన ఒక పుస్తకాన్ని చదువుతూ వున్నాను. నేను ఆశ్చర్యపోయాను, కానీ అది సరైనదిగానే అనిపించింది. ఈ శాస్త్రవేత్త వ్రాసినది ఏమిటంటే వృక్షాల యొక్క శిరస్సులు నేలలో పాతబడి ఉన్నాయి. ఎందుకంటే వృక్షాలు తమ ఆహారాన్ని నేల నుంచి గ్రహిస్తాయి, వాటి నోళ్ళు భూమిలో ఉన్నాయి. అవి నేల నుంచే ఆహారం తీసుకుంటాయి మరి నీళ్ళను త్రాగుతాయి, కనుక వాటి నోళ్ళు నేలలోనే ఉన్నాయి. మరి వాటి పాదాలు

ఆకాశంలో ఉన్నాయి... అవి శీర్షాసనాలు వేస్తున్నాయి. అవి అత్యంత సనాతనమైన యోగులలా కనిపిస్తున్నాయి.

దీని ఆధారంగా మనం మానవుడి యొక్క వికాసం అంతటినీ నెమ్మదిగా అవగాహన చేసుకోగలం అనేది నిరూపించడానికి ఆ శాస్త్రవేత్త ప్రయత్నిస్తున్నాడు. అనంతరం వానపాములు ఉన్నాయి, చేపలు ఉన్నాయి... అవి సమతలంగా ఉన్నాయి. అవి ఉపరితలానికి సమంగా, భూమికి సమాంతరంగా ఉన్నాయి. వాటి తోకలు మరి నోళ్ళు ఉపరితలానికి సమంగా ఒక తిన్ననైన గీతలా ఉంటాయి. అవి వృక్షాలను కొద్దిగా అధిగమించి వికసించాయి. అనంతరం కుక్కలు, పిల్లులు, సింహాలు, చిరుతపులులు ఉన్నాయి ... వాటి తలలు కొద్ది పైకి ఎత్తబడి ఉంటాయి. భూమి ఉపరితలానికి సమంగా ఉండడం నుంచి కొద్దిగా మార్పు అక్కడ వుంటుంది, తల కొద్దిగా పైకెత్తబడి ఉంటుంది. ఆ కోణం మార్పు చెందింది. అనంతరం కోతులు ఉన్నాయి ... అవి కూర్చోగలవు. అవి భూమితో హెచ్చు తగ్గులుగా తొంభై డిగ్రీల కోణంగా వుంటాయి, కానీ అవి నిలబడలేవు. అవి కూర్చున్న మానవులు ; వృక్షాలు శీర్షాసనాలు వేస్తున్న మానవులు. అనంతరం మానవుడు ఉన్నాడు : అతను నిటారుగా నిలబడతాడు, అతను సమకోణంగా వుంటాడు ... వృక్షాలకు పూర్తి వ్యతిరేకంగా. శిరస్సు పైన వుంది, పాదాలు కింద ఉన్నాయి.

ఈ భావన నాకు నచ్చింది : అంతా ఒక్కదాని యొక్క క్రీడే. కొన్నిసార్లు ఆ ఒక్కటి తలక్రిందులుగా నిలబడి వున్నది, కొన్నిసార్లు అది సరైన విధంగా నిలబడి వుంది, కొన్నిసార్లు అది పడుకుని వుంది ; కొన్నిసార్లు నిద్రపోతోంది, కొన్నిసార్లు మేల్కొని వుంది. కొన్నిసార్లు అది దైన్యంలో మునిగిపోయింది, కొన్నిసార్లు అది ఆనందంలో మునిగిపోయింది, కొన్నిసార్లు అది సంక్షోభంలో ఉంది, కొన్నిసార్లు శాంతిలో ఉంది ... కానీ ఆ అలలు అన్నీ ఒక్కదానికి చెందినవే.

అలలు, నురగలు మరి బుడగలు నీరే తప్ప మరేదీ కాని విధంగానే... అదే విధంగా ఆత్మ నుంచి భిన్నంగా ఉన్నది ఏదీ లేదు. అంతా ఒక అవిభాజ్య సమస్తమే.

దానిని చూడండి, కేవలం వినకండి ! అది గెస్టాల్ట్‌ను మార్చడానికి సంబంధించిన ప్రశ్న. దానిని ఒక్క కడగంటి చూపుతో దర్శించవచ్చు. ఒక్క క్షణ దర్శనంలో అది అలా ఉండగలదు. మీరు లోతుగా చూస్తే కనుక సకలమూ నెమ్మదిగా ఒకదానిలోకే ఐక్యమైపోయి మరి మాయమైపోతుందని మీరు కనుగొంటారు. ఒక సువిశాల మహాసాగరం అలలను ముందుకు తోస్తోంది. ఈ అనుభవం ఎంతో కాలం నిలిచివుండదు, ఎందుకంటే అది నిలువగలిగేందుకు మీ సామర్థ్యాన్ని

పెంపొందించుకోవలసిన అవసరం ఉంది. కానీ ఈ విస్తారతే అలలను ముందుకు తోస్తోందనీ, మరి మనమందరమూ ఆయన అలలమేననీ ; ఒక సూర్యుడే ప్రకాశిస్తున్నాడనీ మరి మనమంతా దాని కిరణాలమేననీ ; ఒక సంగీతమే ఇక్కడ ధ్వనిస్తోందనీ, మరి మనమంతా దాని రాగాలమేననీ ఒక్క క్షణమైనా చూడబడితే కనుక ... అప్పుడు రూపాంతరీకరణ సంభవిస్తుంది. క్రమక్రమంగా ఆ క్షణకాలపు అనుభవం మీ అస్తిత్వంలోనికి నెమ్మదిగా చొచ్చుకుపోతుంది.

మీరు కావాలనుకుంటే కనుక మీరు దానిని చేజిక్కించుకోవచ్చు, లేదా మీరు దానిని చేజార్చుకుంటారు. జనకుడు దానిని చేజిక్కించుకున్నాడు.

రాత్రివేళ నేను మేల్కొన్నాను.
చీకటి పరదా వెనుక నుంచి వస్తున్న
ప్రగాఢ నిశ్చలత యొక్క గుసగుసలను
నేను ఆకస్మికంగా విన్నట్లుగా అనిపించింది...
ఒక మృదువైన, నిగూఢ శ్రావ్యతగల, అత్యున్నత గీతం లాగా.
మరి ఆ గీతం నాకు చెప్పింది :
అజేయుడా ! ఓహో, నువ్వు ఇంకా మేల్కొనలేదా ?
మరి అపరిమిత మూలం నుంచి వస్తున్న, ఈ కాంతి, వెల్లువవుతోంది.
ఓహో, అభాగ్యుడా,
ఎన్ని పర్యాయాలు నీ పాత్ర నింపబడింది
మరి, గమనించబడక, ఒంపివేయబడింది మరి ఖాళీ చేయబడింది.

మీరు ఈ మాటలను మొట్టమొదటిసారిగా వినడం లేదు. మీరు వాటిని ఇప్పటికే ఎన్నోసార్లు విన్నారు. మీరు అత్యంత సనాతనులు. మీరు వాటిని అష్టావక్రుడి వద్ద నుంచి వినడం కూడా జరిగి వుండవచ్చు. అతను చెబుతున్నప్పుడు విన్నవారు మీరు కొంతమంది నిశ్చయంగా ఉన్నారు. కొంతమంది బుద్ధుడు చెప్పినది, కొంతమంది కృష్ణుడు, కొంతమంది జీసస్, కొంతమంది మహమ్మద్, కొంతమంది లావోట్జు, కొంతమంది జరాతుస్త్రా చెప్పినది విన్నారు. ఈ అవనిపై అటువంటి మానవులు నిరంతరంగా ఉంటూనే వున్నారు ; మీరు వాళ్ళందరి దగ్గరగానూ వెళ్ళారు మరి ఇక్కడ సమావేశమయ్యారు. ఎన్నో దీపాలు వెలిగించబడి ఉన్నాయి, ఏదో ఒక దీపం యొక్క కాంతి మీ కళ్ళ వద్దకు చేరకపోవడం అనేది అసాధ్యం. మీ పాత్ర ఎన్నోసార్లు నింపబడింది.

ఓహో, అభాగ్యుడా,
ఎన్ని పర్యాయాలు నీ పాత్ర నింపబడింది
మరి, గమనించబడక, ఒంపివేయబడింది మరి ఖాళీ చేయబడింది ?

మీ పాత్ర నింపబడుతూనే ఉంటుంది అయినాగానీ అది ఖాళీగానే ఉంటుంది. మీరు దానిని నిలిపి ఉంచుకోలేకపోతున్నారు.

మరి ఆ గీతం నాకు చెప్పింది :
అజేయుడా ! ఓహో, నువ్వు ఇంకా మేల్కొనలేదా ?
మరి అపరిమిత మూలం నుంచి వస్తున్న, ఈ కాంతి వెల్లువవుతోంది.

మరి ప్రాతఃకాలం సమీపిస్తోంది. ఎన్నోసార్లు ఉదయం వచ్చింది మరి సూర్యుళ్ళు బయటకు వచ్చాయి, కానీ మీ చీకటిని గట్టిగా పట్టుకుని, మీరు కూర్చునే వుంటారు. మీ పేదరికాన్ని మీరు వదిలేస్తే కనుక అది పోతుంది.

జనకుడు అంటాడు, " నేను కేవలం ఒకదానినే చూస్తున్నాను. ఆ ఒకటిలోకి నేను కరిగిపోయాను. ఆ ఒకటి నాలోకి కరిగిపోయింది."

వేదాలు చెబుతాయి
అన్నింటినీ పరిత్యజించినవాడే, ఒక సన్యాసి,
అతను వేదాలకన్నా ఉత్కృష్టమైనవాడు.
అతని ప్రకాశం ప్రపంచ ప్రకాశం కన్నా ప్రశస్తమైనది.
అతను విశ్వేశ్వరునిలో నివసిస్తాడు,
విశ్వేశ్వరుడు అతనిలో నివసిస్తాడు.

" వేదాలు చెబుతాయి, అన్నింటినీ పరిత్యజించినవాడే ఒక సన్యాసి, అతను వేదాలకన్నా ఉత్కృష్టమైనవాడు " ... అతను వేదాలకన్నా ఉన్నతమైనవాడు, ఎందుకంటే ... " అతను విశ్వేశ్వరునిలో నివసిస్తాడు, విశ్వేశ్వరుడు అతనిలో నివసిస్తాడు."

ఆ క్షణంలో జనకుడి యొక్క చైతన్యం విశ్వాత్మ నుంచి భిన్నంగా లేదు. అది ఏకమైపోయింది. స్వయంగా అతనే నిశ్శేష్టుడయ్యాడు.

పరిశీలించినప్పుడు వస్త్రం అనేది దారం తప్ప మరేది కానట్లుగానే, పరిశీలించినప్పుడు ఈ విశ్వం సైతం ఆత్మ తప్ప మరేదీ కాదు.

మెలకువగా, వివేచనతో చూస్తూ, చైతన్యంతో చూస్తూ... మీరు వస్త్రాన్ని పరిశీలనగా చూస్తే కనుక మీరు ఏమి కనుగొంటారు ? మీరు కేవలం అల్లబడిన

దారాలను మాత్రమే కనుగొంటారు ... ఒక దారం ఈ వైపు వెళుతుంది, ఒక దారం ఆ వైపు వెళుతుంది. వాటిని మళ్ళీ మళ్ళీ ఈ విధంగా అల్లడం ద్వారా వస్త్రం రూపొందించబడుతుంది ... వస్త్రం అనేది దారాల యొక్క వల. కానీ చిత్రమైన విషయం ఏమిటంటే మీరు దారాలను ధరించలేకపోయినా, మీరు వస్త్రాలను ధరించగలరు. మీరు ఒక దారపు గుట్టను సేకరిస్తే కనుక మీరు దానిని ధరించలేరు. వస్త్రం సైతం దారపుగుట్ట యొక్క సమీకరణ మాత్రమే అయినాగానీ, అది కేవలం అమర్చడానికి సంబంధించిన వ్యత్యాసం మాత్రమే. దారాలను ఒకదానిపై ఒకటి అల్లడం ద్వారా వస్త్రం రూపొందించబడుతుంది ; అప్పుడు మిమ్మల్ని మీరు వస్త్రంతో కప్పుకోవచ్చు. కానీ వ్యత్యాసం ఏమిటి ?... అది ఇప్పటికీ దారమే. మీరు వాటిని ఎలా అమర్చారు అనేదాని వలన ఏం వ్యత్యాసం ఉంటుంది ?

జనకుడు చెబుతున్నది ఏమిటంటే అస్తిత్వం కొన్నిసార్లు ఓ వృక్షంలో హరితమవుతుంది, కొన్నిసార్లు ఒక గులాబిపువ్వులోని ఎరుపు అవుతుంది, కొన్నిసార్లు అది నీరు, కొన్నిసార్లు అది కొండలు మరి పర్వతాలు, కొన్నిసార్లు చంద్రుడు మరి నక్షత్రాలు అవుతుంది. ఇవన్నీ చైతన్యం యొక్క వివిధ సాక్షాత్కారాలు. వస్త్రం దారాల నుంచి నేయబడుతుంది, మరి మీరు దాని నుంచి ఎన్నో రకాల వస్త్రాలను నేయవచ్చు ... వేడి వాతావరణంలో ధరించేందుకు నాజూకైన, పలుచని వస్త్రం, చలికాలంలో ధరించేందుకు మందపాటి వస్త్రం. మీరు దాని నుంచి అన్ని రకాల వస్త్రాలనూ నేయవచ్చు : అందమైనవి మరి వికారమైనవి, ధనికుల కోసం మరి పేదల కోసం. మీరు దాని నుంచి వేలాది రకాల వస్త్రాలను సృష్టించవచ్చు.

శాస్త్రవేత్తలు చెప్పేదేమిటంటే ఈ విశ్వమంతా ఒకే శక్తి నుంచి రూపొందించబడింది. శక్తిని వారు పెట్టే పేరు విద్యుచ్ఛక్తి. పేరు వలన ఏ వ్యత్యాసం ఉంటుంది ? కానీ శాస్త్రవేత్తలు అంగీకరించే ఒక విషయమేమిటంటే ఈ సమస్త విశ్వమూ ఒక పదార్థం నుంచే రూపొందించబడింది. ఇది ఆ ఒక్క పదార్థం యొక్క అసంఖ్యాక రూపాలే. అది కేవలం బంగారం నుంచి వివిధ బంగారు ఆభరణాలు తయారు చేయబడినట్లుగా ఉంటుంది. అవి కరిగించబడితే కనుక కేవలం బంగారం మాత్రమే మిగులుతుంది. రూపాలు అనేకం, కానీ ఆ రూపం దేని నుంచి తయారు చేయబడిందో అది ఒకేలాంటిది.

పరిశీలించినప్పుడు వస్త్రం అనేది దారం తప్ప మరేదీ కానట్లుగానే, పరిశీలించినప్పుడు ఈ విశ్వం సైతం ఆత్మ తప్ప మరేదీ కాదు. వస్త్రం అనేది దారం తప్ప మరేదీ కానట్లుగానే, ఖచ్చితంగా అదే విధంగా ఈ అస్తిత్వం సైతం జీవం నుంచి అల్లబడింది. మరి

'విద్యుచ్ఛక్తి' అని అనడం కన్నా ' జీవం ' అని అనడం నిశ్చయంగా మెరుగైనది ... ఎందుకంటే విద్యుచ్ఛక్తి కూడా పదార్థంలోని భాగమే, మరి చైతన్యం అనేది విద్యుచ్ఛక్తి నుంచి రాగల సంభావ్యతే లేదు. మరి చైతన్యం అనేది విద్యుచ్ఛక్తి నుంచి రావడం సంభవమైతే కనుక, అప్పుడు విద్యుచ్ఛక్తిని మూలం అని పిలువడం అర్థరహితమైంది, ఎందుకంటే దాని నుంచి రాగలిగినది దాని అంతర్భాగంలోనే దాగి వుండాలి. చైతన్యం గోచరమైనది, చైతన్యం సాక్షాత్కరించింది. మరి ఏదైతే సాక్షాత్కరించిందో అది మూలంలో సైతం దాగి వుండాలి, లేదంటే అది ఎలా కనిపిస్తుంది ? మీరు ఒక మామిడి విత్తనం నాటారు, ఒక మామిడి వృక్షం వచ్చింది. దానికి మామిడి కాయలు కాసాయి. మీరు ఒక వేప విత్తనం నాటారు, మరి ఒక వేప చెట్టు వచ్చింది. చిన్న వేప కాయల్లు దానిపై పెరగడం మొదలుపెట్టాయి. కనిపిస్తున్నది, జనించిన ఆ ఫలం, ఆ విత్తనంలో అప్పటికే ఉంది.

చైతన్యం ఈ ప్రపంచంలో గోచరమవుతుంది, కనుక చైతన్యం కనిపించింది, చైతన్యం యొక్క వివిధ రూపాలు కనిపించాయి ... కనుక చైతన్యం అనేది అస్తిత్వం యొక్క మౌలిక పదార్థంలోనే దాగి ఉండుండాలి. కనుక ' విద్యుచ్ఛక్తి ' అని అనడం సరైనది కాదు, ' జీవం ' అని అనడం ఎంతో తగినదై వుంటుంది. 'జీవ విద్యుచ్ఛక్తి' అని అనండి, కానీ చైతన్యం దానిలో కలుపబడాలి. మన చుట్టూ మనం చూస్తున్నదేదైనా ఆ మూలంలోనే దాగి ఉండుండాలి.

పరిశీలించినప్పుడు వస్త్రం అనేది దారం తప్ప మరేదీ కానట్లుగానే,
పరిశీలించినప్పుడు ఈ విశ్వం సైతం ఆత్మ తప్ప మరేదీ కాదు.
చెరకురసం నుంచి ఉత్పత్తి చేయబడిన చక్కెర దానితో పూర్తిగా
నిండి వున్నట్లుగానే, నా నుంచి ఉత్పత్తి అయిన ఈ విశ్వం
నా చేత అన్ని విధాలుగా వ్యాప్తి చెందుతుంది.

మీరు చెరకుగడ నుంచి చక్కెరను తీసినప్పుడు, ఆ చెరకురసం చక్కెరలో నిండి వున్నట్లుగానే, అదే విధంగా దివ్యత్వం చైతన్యమంతటిలో నిండివుంటుంది దివ్యత్వం మీలో నిండి వుంటుంది. మీరు దివ్యత్వంలో నిండి వుంటారు.

ఆత్మ గురించిన అజ్ఞానం వలన ఈ ప్రపంచం అప్పుడు కనిపిస్తుంది...

దీనిని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించండి. ఇది అత్యంత భావగర్భితమైనది. "ఆత్మ గురించిన అజ్ఞానం వలన ప్రపంచం అప్పుడు కనిపిస్తుంది, ఆత్మను తెలుసుకోవడం వలన అది కనిపించదు". ఆ గెస్టాల్ట్ మారుతుంది. చూసే విధానం మారుతుంది.

తాడు గురించిన అజ్ఞానం వలన ఒక పాము కనిపిస్తుంది,

తాడును తెలుసుకోవడం వలన అది కనిపించదు.

రాత్రి యొక్క చీకటిలో మీరు ఒక తాడును చూస్తారు మరి అది ఒక పాము అని అనుకుని భయపడతారు. మీరు పారిపోతారు. మీరు కర్రలను తీసుకువస్తారు మరి దానిని కొట్టడం మొదలుపెడతారు. అప్పుడు ఎవరో ఒక దీపాన్ని తెస్తారు మరి మీ చేతుల నుంచి కర్రలు జారిపోతాయి, ఆ భయం అంతర్ధానమైపోతుంది. వెలుతురులో అది ఒక పాము కాదు, అది కేవలం ఒక తాడు అనేది మీరు చూస్తారు. కేవలం మీరు ఒక తాడును తాడుగా చూడలేకపోవడం వల్లనే ఆ పాము అనేది ఉంది. అక్కడ ఏ పామూ లేదు ... అది కేవలం ఒక ప్రసరణ మాత్రమే.

ఉనికిని ఉనికిలా చూడకపోవడం వలనే ఈ ప్రపంచం అనేది ఉంటుంది. ఒకరు తనను తాను తెలుసుకున్నప్పుడు, అతని ప్రపంచం మాయమైపోతుంది. ద్వారాలు మరి గోడలు, పర్వతాలు మరి శిలలు మాయమైపోతాయనేది కాదు దీని అర్థం. లేదు, ఇవి అక్కడ వుంటాయి కానీ అవన్నీ ఏకం లోనికి ఐక్యమైపోతాయి. ఇవన్నీ ఏకం యొక్క వివిధ అలలు, నురగలు, బుడగలు అయివుంటాయి.

తనను తాను తెలుసుకున్న వ్యక్తికి ఈ ప్రపంచం అంతమైపోయింది. తనను తాను తెలుసుకోని వ్యక్తికి ప్రపంచం అంతమవ్వలేదు. ప్రపంచాన్ని విసర్జించడం ద్వారా మిమ్మల్ని మీరు తెలుసుకోలేరు. కానీ మిమ్మల్ని మీరు తెలుసుకోవడం ద్వారా, ప్రపంచం విసర్జించబడుతుంది.

పరిత్యాగానికి రెండు సామీప్యాలు ఉన్నాయి. ఒక సామీప్యం చెప్పేదేమిటంటే ప్రపంచాన్ని పరిత్యజించడం ద్వారా మిమ్మల్ని మీరు తెలుసుకోగలరు. మరొక సామీప్యం చెబుతుంది, మిమ్మల్ని మీరు తెలుసుకోండి మరి ఈ ప్రపంచం ఇప్పటికే విసర్జించబడింది. మొదటి సామీప్యం తప్పు. ప్రపంచాన్ని వదిలేయడం ద్వారా మిమ్మల్ని మీరు తెలుసుకోలేరు. ఎందుకంటే ప్రపంచాన్ని వదిలేయడంలో ప్రపంచం గురించిన భ్రమను మీరు కల్పిస్తూపోతారు.

కొద్దిగా అవగాహన చేసుకునేందుకు ప్రయత్నించండి. నేలపై ఒక తాడు పడివుంది కానీ మీరు ఒక పామును చూస్తారు. ఎవరైనా మిమ్మల్ని కలుసుకుని, "కేవలం పాము అనే భావనను వదిలెయ్యి మరి నువ్వు తాడును చూస్తావు", అని అంటే కనుక, మీరు అంటారు, "పాము అనే భావన ఎలా వదిలివేయబడుతుంది ? నేను ఒక పామును చూస్తున్నాను, నేను ఒక తాడును చూడడం లేదు." "రామ, రామ" అని జపించడం ద్వారా మీరు కొంత ధైర్యాన్ని పొంది మరి ఎలాగో నిటారుగా

నిలబడి, " సరే, ఇది ఒక పాము కాదు, ఇది ఒక తాడు," అని అన్నప్పటికీ మీ అంతరంగంలో మీకు తెలుసు. " ఇది ఒక పాము, ఎవరు ఎవరిని మోసగిస్తున్నారు ? ఏ ఆపదా రాకుండా ఉండేందుకు దాని దగ్గరకు వెళ్ళకు." మీరు తప్పించుకుంటారు. మీరు అంటారు, " ఇది ఒక తాడు. ఇది ఒక తాడు అని నేను నమ్ముతున్నాను, కానీ దాని దగ్గరకు వెళ్ళడమెందుకు ?"

ప్రపంచాన్ని తప్పించుకునే వ్యక్తి ... అతను ఈ ప్రపంచం మాయేనని అంటాడు, అయినాగానీ అతను తప్పించుకునిపోతాడు ... అతనిని కొద్దిగా ప్రశ్నించండి: " అది మాయ అయితే కనుక, నువ్వు ఎందుకు తప్పించుకు పోతున్నావు ? అది లేనట్లయితే కనుక, నువ్వు ఎందుకు పారిపోతున్నావు ? నువ్వు విసర్జిస్తున్న మరి వెనుక వదిలి వెళ్ళిపోతున్నది ఏమిటి ?

డబ్బు అనేది కేవలం మలినమే అని అతను అంటాడు. అలాంటప్పుడు అతనికి డబ్బు పట్ల భయం ఎందుకు ? అప్పుడు బెదిరిపోవడం ఎందుకు ? డబ్బు అనేది మలినమైతే మరి అతనికి మలినం పట్ల భయం లేకపోతే కనుక, అలాంటప్పుడు అతనికి డబ్బు పట్ల భయం ఎందుకు ? అది మలినం, అతను కేవలం మలినాన్నే చూస్తే కనుక, అది ఫరవాలేదు. డబ్బు అక్కడ పడి వుంటే కనుక ఫరవాలేదు ; అది లేకపోతే కనుక ఫరవాలేదు. కొన్నిసార్లు మలినం అవసరమవుతుంది. కనుక మానవుడు మలినాన్ని కూడా వినియోగిస్తాడు. డబ్బు అవసరమైతే కనుక, డబ్బును ఉపయోగించండి. కానీ ఇప్పుడు అదంతా స్వప్న సదృశమైనది, ఆటల్లోని డబ్బులాంటిది.

రెండవ సామీప్యం లోతైనది మరి సత్యానికి దగ్గరగా ఉంటుంది ... మీరు ఒక దీపాన్ని వెలిగించి మరి ఆ తాడును ఒక తాడుగానే చూస్తే కనుక అప్పుడు ప్రపంచం పోతుంది, ఆ పాము పోతుంది.

ఆత్మ గురించిన అజ్ఞానం వలన ఈ ప్రపంచం అప్పుడు కనిపిస్తుంది,
ఆత్మను తెలుసుకోవడం వలన అది కనిపించదు.

మీరు ఉనికివైపు చూస్తే కనుక, ఈ ప్రపంచం గోచరం కాదు. ప్రపంచం వైపు చూడండి, మరి ఈ ఉనికి గోచరం కాదు. ఆ రెండింటిలో కేవలం ఒక్కటి మాత్రమే కనిపిస్తుంది. రెండింటినీ ఏకకాలంలో చూడలేము. మీరు ప్రపంచాన్ని చూస్తే కనుక, అప్పుడు మీరు మీ ఉనికిని చూడరు. మీరు మీ ఉనికిని చూడడం ప్రారంభించినప్పుడు, ఈ ప్రపంచం కనిపించదు. రెండింటినీ ఏకకాలంలో చూడగా ఏ మార్గమూ లేదు.

అది ఎలా ఉంటుందంటే మీరు ఒక గదిలో కూర్చుని ఉన్నారు మరి మీకు చీకటి తప్ప ఏదీ కనిపించడం లేదు. అనంతరం చీకటిని మరింత దగ్గరగా చూసేందుకు, మీరు దానిని వెలుతురులో మరింత స్పష్టంగా చూడగలిగేందుకు మీరు వెలుగును తీసుకురండి : అప్పుడు మీరు దానిని చూడరు. మీరు వెలుగును తెచ్చినప్పుడు, చీకటి కనిపించదు. మీరు చీకటిని చూడాలనుకుంటే కనుక వెలుగును తీసుకురావడమనే పొరపాటును చేయకండి. మీరు చీకటిని చూడాలనుకోకపోతే కనుక వెలుగును తీసుకురండి ... ఎందుకంటే చీకటి మరి వెలుగు ఏకకాలంలో కనిపించవు. అవి ఏకకాలంలో ఎందుకు కనిపించవు ? ఎందుకంటే వెలుతురు లేకపోవడమే చీకటి. వెలుగు ఉన్నప్పుడు, దాని లేమి కూడా అక్కడ ఎలా ఉండగలదు ?

మీ ఉనికి గురించిన జ్ఞానం లేకపోవడమే ఈ ప్రపంచం. మీ ఉనికిని తెలుసుకునే ఉదయం వచ్చినప్పుడు, ఈ ప్రపంచం మాయమైపోతుంది. సకలమూ కేవలం ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది మరి అయినాగానీ ఏదీ ఉన్నది ఉన్నట్లుగానే ఉండదు. సకలమూ కేవలం ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది ... మరి సకలమూ రూపాంతరం చెందుతుంది.

ప్రజలు నన్ను అడుగుతారు, “ మీరు సన్యాసం ఇస్తారు కానీ ఇంటిని వదిలేయమనీ, భార్యను వదిలేయమనీ. పిల్లలను వదిలేయమనీ మీరు చెప్పరు.”

నేను బదులిస్తాను, “ నేను వాళ్ళకు ఏదీ వదిలేయమని చెప్పను, ఏది ఉందో వాళ్ళు చూడగలిగేందుకు కేంద్రీకృతులై ఉండమని వాళ్ళ ఉనికిలో కేంద్రీకృతులై ఉండమనీ నేను వాళ్ళకు చెబుతాను. ఏది ఉందో, అది విసర్జించబడదు. ఏది లేదో, దానిని విసర్జించాల్సిన అవసరం లేదు.”

న్యాయస్థానంలో ఒక కేసు ఆలకించబడుతోంది. న్యాయమూర్తి ముల్లా నసీరుద్దీన్‌ను అడిగాడు, “ ఒకే విధంగా కనిపిస్తున్న ఈ వందలాది నీటి దున్నల మధ్యన నీ స్వంత దున్నను నువ్వు ఎలా గుర్తించావు ?”

నసీరుద్దీన్ బదులిచ్చాడు, “ దానిలో పెద్ద కష్టమైనది ఏముంది గౌరవనీయ న్యాయమూర్తీ ? మీ న్యాయస్థానంలో నల్లకోటులను ధరించిన వందలాది న్యాయవాదులు చుట్టూ నిలబడి ఉన్నారు. అయినాగానీ నేను నా స్వంత న్యాయవాదిని గుర్తించగలను. నేను గుర్తించలేనా ?”

మనం గుర్తించాలనుకున్నది మనం గుర్తించగలం అని అతను చెబుతున్నాడు. ఒక మనిషి తన స్వంత దున్నను గుర్తిస్తాడు. దున్నలు అన్నీ ఒకేలా కనిపించినాగానీ... న్యాయవాదులలానే.

మనం తెలుసుకోవాలనుకున్నది, మనం తెలుసుకుంటాం. మనం గుర్తించాలనుకున్నది, మనం గుర్తిస్తాం. మన ఉద్దేశ్యమే మన జీవితం యొక్క వాస్తవంగా మారుతుంది.

మీరు ఈ ప్రపంచం నుంచి మేల్కొనాలని కోరుకుంటే కనుక, దానితో పోరాడకండి. మీరు ఈ ప్రపంచం నుంచి మేల్కొనాలని కోరుకుంటే కనుక, మేల్కొనడానికి కేవలం అంతరంగంలో ప్రయత్నాలను చేయండి.

ముల్లా నసీరుద్దీన్ మరి అతని భార్య తమ చురుకైన పసిబిడ్డను తమతోపాటు ఒక నృత్య కార్యక్రమాన్ని చూసేందుకు తీసుకువెళ్ళారు. తలుపు వద్ద ఉన్న మనిషి వాళ్ళను హెచ్చరిస్తూ అన్నాడు, “ నసీరుద్దీన్, ఈ బిడ్డ కార్యక్రమం జరుగుతున్నప్పుడు ఏడిస్తే కనుక మీరు బయటకు వెళ్ళవలసి వస్తుంది. మీకు కావాలంటే కనుక మేము మీ టికెట్ల ధరను తిరిగి ఇస్తాము, కానీ మీరు కార్యక్రమానికి తిరిగి వచ్చేందుకు అనుమతించబడరు, కనుక అప్రమత్తంగా ఉండండి.”

కార్యక్రమం మధ్యలో నసీరుద్దీన్ తన భార్యను అడిగాడు, “ ఈ నృత్యం నీకు నచ్చిందా ?”

“ అది పూర్తి భయంకరంగా వుంది,” అతని భార్య బదులిచ్చింది.

కనుక అతను అన్నాడు, “అయితే నువ్వు దేనికోసం నిరీక్షిస్తున్నావు ? ... బిడ్డను ఒకసారి గట్టిగా గిల్లు.”

ఈ ప్రపంచం పూర్తిగా నిరుపయోగమైనది అని మీరు తెలుసుకున్నప్పుడు, నిరీక్షించకండి. మిమ్మల్ని మీరు గట్టిగా గిల్లుకోండి. మిమ్మల్ని మీరు అంతరంగంలో కుదుపుకోండి, మిమ్మల్ని మీరు జాగృతం చేసుకోండి. అవసరమైనదంతా మీరు జాగృతులవ్వడమే. జాగృతమవ్వడమే ఉత్కృష్ట మంత్రం... ఏకైక మంత్రం.

హరి ఓం తత్ సత్ !

నా శరీరం ఒక పంజరం లేదా ఒక సీసాలాంటిది అని నాకు అనిపిస్తోంది, దానిలో ఒక అత్యంత శక్తివంతమైన సింహం బంధించబడి వుంది మరి ఎన్నో జన్మలుగా అది అక్కడ నిదురిస్తూ ఉంది, కానీ ఇప్పుడు మీ వేధింపుల వలన అది మేల్కొల్పబడింది. అనంతరం కీర్తనలో, లేదా మిమ్మల్ని జ్ఞాపకం చేసుకోవడంలో, అది పరమానందంతో నర్తిస్తుంది కూడా. దయచేసి వివరించండి.

గురుదేవా, నేను ఒక నిజమైన సన్యాసిగా ఎలా అవ్వగలను ? నేను మీకు మరింత దగ్గరగా ఎలా రాగలను ? ఆ యోగ్యత నాలో ఎక్కడ వుంది ? ఆ విశ్వాసం మరి అధీనత నాలో ఎక్కడ వుంది ?

మీరు అన్నారు, " మీరు ఇక్కడే మరి ఇప్పుడే, ఈ క్షణమే విముక్తులయ్యారు." కానీ ఈ "నేను" అనేదాని నుంచి నేను ఎలా స్వతంత్రుడిని అవ్వగలను?

మీ అనుగ్రహం వలన నేను ఆకాశాన్ని చూడగలుగుతున్నాను. నేను ప్రకాశాన్ని అనుభవిస్తున్నాను మరి అంతర్గత ప్రవాహంతో ఏకమవుతున్నాను కూడా. కానీ కామం నన్ను అధిగమించినప్పుడు, ధ్యానంలో ఉన్నంతగానూ నేను దానిలో మునిగిపోవాలని కోరుకుంటున్నాను.

ఏ బంధనంలోకీ పడిపోకండి, ప్రశాంతంగా ఉండండి మరి ఆనందంగా ఉండండి అని మీరు చెప్పారు. సన్యాసం సైతం ఓ బంధనమే కదా? మరి రీతులు, సాధనాలు మరి సాధన సైతం బంధనాలే కదా? దయచేసి వివరించండి.

ఓ మనోహర ప్రియతమా, నా కృతజ్ఞతను సమ్మతించండి. ఈ అశ్రువులకు వాటి గమ్యాన్ని అందించండి. మీరు ఈ భిక్షాపాత్రను నింపారు, అయినాగానీ నేను ఎప్పటిలానే రిక్తంగానే ఉన్నాను... శూన్యంగా, అలిఖితంగా. ఓ మనోహర ప్రియతమా, మా సఖా, ఈ శిరస్సు, సమర్పించేందుకై ఉన్న ఓ ఫలంలా, మీ చరణాల వద్ద వుంది.

⑧

అస్తిత్వం యొక్క బహుమానం

మొదటి ప్రశ్న

ప్రియమైన ఓషో,

నా శరీరం ఒక పంజరం లేదా ఒక సీసాలాంటిది అని నాకు అనిపిస్తోంది, దానిలో ఒక అత్యంత శక్తివంతమైన సింహం బంధించబడి వుంది మరి ఎన్నో జన్మలుగా అది అక్కడ నిదురిస్తూ ఉంది, కానీ ఇప్పుడు మీ వేధింపుల వలన అది మేల్కొల్పబడింది. అది ఆకలితో వుంది మరి పంజరం నుంచి స్వేచ్ఛను పొందడానికై ఎంతో అసహనంతో వుంది. పగటివేళ ఎన్నోసార్లు అది ఆగ్రహిస్తుంది మరి గర్జిస్తుంది, అది గర్జిస్తూ పైకి దూకుతుంది. ఈ గర్జన మరి పైకి దూకడం వలన నా శరీరంలోని ప్రతికణమూ వణికిపోతుంది, నుదురు మరి తల యొక్క పైభాగం శక్తితో బద్దలైపోవడం ప్రారంభిస్తుంది. దీని తరువాత నేను ఒక అసాధారణమైన మైకం మరి పరవశంలోకి లోతుగా పడిపోతాను. అప్పుడు ఆ సింహం కొద్దిగా శాంతిస్తుంది, లోలోపల కదులుతూ వుంటుంది, పైకీ క్రిందకూ అడుగులు వేస్తుంది మరి గుర్రుమంటూనే ఉంటుంది. అనంతరం కీర్తనలో, లేదా మిమ్మల్ని జ్ఞాపకం చేసుకోవడంలో, అది పరమానందంతో నర్తిస్తుంది కూడా. ఏమి జరుగుతోందో దయచేసి వివరించండి.

ఈ ప్రశ్నను అడిగినది యోగ చిన్మయ.

సంభవిస్తోన్నది మంచిదే. అది జరుగవలసిన విధంగానే జరుగుతోంది. దానివలన భయపడవద్దు ... దానిని సంభవించనివ్వండి. దానికి అన్ని విధాలుగా సహకరించండి. ఒక అద్వితీయ ప్రక్రియ ప్రారంభమైంది, దాని అంతిమమైన స్థాయి విముక్తి.

మనం నిశ్చయంగానే ఈ శరీరంలో బంధింపబడి ఉన్నాం... పంజరంలో బంధించబడిన ఓ సింహం, ఎంత సుదీర్ఘకాలంగా అది పంజరంలో పరిమితమై వుందంటే అది తన స్వంత గర్జనను మరచిపోయింది, ఎంత సుదీర్ఘకాలంపాటు అది

పంజరానికే పరిమితమైపోయిందంటే ఆ పంజరమే తన స్వగృహమని అది భావించడం మొదలుపెట్టింది. ఇది మాత్రమే కాదు, అతను అనుకోవడం ప్రారంభించాడు, "నేను ఈ పంజరాన్ని. నేను ఈ శరీరాన్ని !"

ఒక దెబ్బ వేయడం అవసరం. నేను దెబ్బ వేయగలిగేందుకే, మీరు నాతో ఉన్నారు ... మరి మీరు మేల్కొంటారు.

నేను మీతో చెబుతున్న ఈ మాటలు కేవలం వట్టి మాటలు కావు. వాటిని బాణాలు అని అనుకోండి. అవి మీకు గుచ్చుకుంటాయి. కొన్నిసార్లు నా పట్ల కూడా మీకు కోపం వస్తుంది... ఎందుకంటే అంతా ప్రశాంతంగా, సుఖవంతంగా సాగిపోతోంది, మరి అకస్మాత్తుగా అయోమయం కలుగుతోంది. కానీ మిమ్మల్ని మేల్కొలిపేందుకు మరో మార్గం లేదు ... మీరు వేదన ద్వారానే పయనించాలి.

అంతర్గతంగా శక్తి వృద్ధి చెందినప్పుడు, ఈ శరీరం దానిని భరించలేదు. దానిని సహించగలిగేలా ఈ శరీరం రూపొందించబడలేదు. ఈ శరీరం యొక్క సామర్థ్యం అతి స్వల్పమైనది. శక్తి విస్తారమైనది...ఒకరు ఆకాశమంతటినీ ఒక చిన్న ఆవరణములో ఉంచాలని ప్రయత్నించినట్లుగా అది ఉంటుంది. కనుక శక్తి మేల్కొన్నప్పుడు శరీరంలో ఎన్నో అలజడులు కలుగుతాయి. బాధతో తల బద్దలైపోతూ వుంటుంది.

కొన్నిసార్లు ఏం జరుగుతుందంటే జ్ఞానోదయం పొందిన తరువాత కూడా శరీరంలో అలజడులు కొనసాగుతాయి. జ్ఞానోదయానికి ముందు అది పూర్తిగా సహజమైనదే, ఎందుకంటే శరీరం సిద్ధంగా లేదు. కేవలం వంద క్యాండిల్ పవర్‌ను భరించగల సామర్థ్యం మాత్రమే ఉన్న ఒక తీగలోకి మీరు వెయ్యి క్యాండిల్ పవర్ విద్యుచ్ఛక్తిని పంపినట్లుగా అది ఉంటుంది ... అది అతిగా భారం మోపబడుతుంది మరి కాలిపోతుంది !

మీ అంతరంగంలో గాఢ నిద్రావస్థలో ఉన్న శక్తి మేల్కొన్నప్పుడు అలానే అవుతుంది ... అది విశదమవుతుంది మరి మీ శరీరం అందుకు సిద్ధంగా లేదు. మీరు ఓ యాచకుడిగా ఉండడాన్ని సమ్మతించేందుకు మీ శరీరం సిద్ధంగా వుంది, మీరు ఓ చక్రవర్తిగా ఉండడాన్ని అది సమ్మతించజాలదు. శరీరానికి పరిమితులు ఉన్నాయి. మీకు ఏ పరిమితులూ లేవు. అది కుదపబడుతుంది, తుఫానులు జనిస్తాయి. జ్ఞానోదయం సంభవించే ముందు, సమాధికి ముందు, ఆఘాతాలు పూర్తి సహజమైనవి.

కొన్నిసార్లు ఏమి జరుగుతుందంటే సమాధి సంభవిస్తుంది మరి ఆ ఆఘాతాలు కొనసాగుతాయి, ఆ తుఫానులు కొనసాగుతాయి, ఎందుకంటే ఈ శరీరం సిద్ధపడలేకపోయింది.

కృష్ణమూర్తి విషయంలో ఇదే జరిగింది. అత్యున్నతమైనదానిని సిద్ధించుకున్న తరువాత ఆ ప్రక్రియ నలభై సంవత్సరాలపాటు కొనసాగింది. శరీరం ఆ ఆఘాతాన్ని గ్రహించుకోలేకపోయింది. అరుస్తూ మరి కేకలు పెడుతూ మధ్యరాత్రివేళ కృష్ణమూర్తి మేల్కొంటాడు. అతను గుర్రుమనడం మొదలుపెడతాడు ... నిజంగానే గుర్రుమని అంటాడు. మరి నలభై సంవత్సరాలపాటు తలనొప్పి అతనిని వదలలేదు ; అది వస్తుంది మరి పోతుంది కానీ అది ఎన్నడూ పూర్తిగా అతనిని వదలదు. కొన్నిసార్లు ఆ నొప్పి ఎంత బలంగా ఉంటుందంటే అతని తల పగిలిపోతుందేమో అని అనిపిస్తుంది.

శరీరం యొక్క దృష్టి నుంచి, ఈ చివరి నలభై సంవత్సరాలు కృష్ణమూర్తికి అత్యంత కష్టమైన సంవత్సరాలు. కొన్నిసార్లు అది ఈ విధంగా జరుగుతుంది. కానీ సామాన్యంగా సమాధి సంభవించినప్పుడు శరీరం సిద్ధమవుతుంది. కానీ కృష్ణమూర్తి విషయంలో శరీరం సర్దుబాటు చేసుకోలేకపోయింది. ఎందుకంటే సమాధి బలవంతంగా పెట్టబడింది. కృష్ణమూర్తిని పెంచిన చింతనాపరులు, ఆ థియోసాఫిస్టులు, ఎంతో శ్రమించారు, సమాధిని తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలను చేశారు. ఒక ప్రపంచ బోధకుడికి జన్మనివ్వడం అనేదే వాళ్ళ అభిలాష. ప్రపంచానికి అది అవసరం ... ఒక బుద్ధుడిని అవతరింపజేయగలిగితే కనుక...

కృష్ణమూర్తి కేవలం తన స్వంత ప్రయత్నాల ద్వారా మాత్రమే పని చేసి వుంటే కనుక, బహుశా అప్పుడు అతనికి మరో ఒకటి లేదా రెండు జన్మలు అవసరమై వుండేవి. కానీ అప్పుడు ఈ సమస్య ఉత్పన్నం అయివుండేది కాదు. ఆ పని బలవంత పెట్టబడింది : సంభవించేందుకు రెండు జన్మలు అవసరమైనది, తక్షణమే సంభవించింది. అది సంభవించింది, కానీ శరీరం సన్నద్ధం కాలేకపోయింది. శరీరం సిద్ధంగా లేనప్పుడు, అది ఆకస్మికంగా సంభవించింది. కనుక నలభై సంవత్సరాల పాటు శారీరక వేదన వుంది. ఇప్పుడు కూడా కృష్ణమూర్తి రాత్రివేళ గుర్రుమంటాడు మరి తన నిద్ర నుంచి మళ్ళీ మేల్కొంటాడు. ఆ శక్తి అతనిని నిద్రపోనివ్వదు. అతను కేకలు వేస్తాడు !

అత్యున్నతమైనదానిని సిద్ధించుకున్న వ్యక్తి రాత్రివేళ కేకలు వేయడమనేది ఆశ్చర్యకరమైనదిగా కనిపిస్తుంది. కానీ కారణం స్పష్టంగా వుంది. సంభవించేందుకు రెండు జన్మలు పట్టి వుండే జ్ఞానోదయం మరీ త్వరగా బలవంతపెట్టబడింది. దీనివలన ఆ శరీరం సిద్ధంగా లేదు మరి ఆ ప్రక్రియ కొనసాగుతుంది.

సమాధి సంభవించింది, కానీ ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అతను స్వగృహాన్ని చేరుకున్నాడు, కానీ ఇంకా వెంట ఈడ్చబడుతూ శరీరం వెనుకే ఉండిపోయింది. ఉనికి స్వగృహాన్ని చేరుకుంది, కానీ శరీరం చేరుకోలేదు. ఈ ఈడ్చబడడానికి సంబంధించిన వేదన మరి బాధ కొనసాగుతుంది.

సంభవిస్తునదాని గురించి భయపడకండి. ఇవి సమాధి యొక్క తొలి సూచనలు, సమాధి యొక్క తొలి అడుగులు. వాటిని పవిత్రమైనవిగా స్వీకరించండి, సంతోషంగా వాటిని సమ్మతించండి. మీరు వాటిని ఆశీర్వాదాలుగా స్వీకరించేందుకు సంసిద్ధులై ఉంటే కనుక, అప్పుడు అతి త్వరలోనే అవి నెమ్మదిగా నిశ్చలమవుతాయి. శరీరం సమ్మతించడం మొదలుపెట్టగానే, సహకరించడం ప్రారంభించగానే, శరీరం యొక్క సంసిద్ధత మరి సామర్థ్యం వృద్ధి చెందుతాయి.

మీరు అనంతాన్ని బిగ్గరగా పిలిచారు, కనుక మీరు అనంతమే అయిపోవాల్సి వస్తుంది. మీరు విస్తారతను సవాలు చేశారు, కనుక మీరు విస్తారం అయిపోవాల్సి వస్తుంది.

పాత శాసనం (Old Testament) లో ఒక అత్యంత అద్వితీయ గాథ వుంది... జాకోబ్ యొక్క గాథ. జాకోబ్ భగవంతుడిని అన్వేషిస్తున్నాడు. అతను తన సంపదనంతటినీ పంచిపెట్టాడు. అతను తన ప్రియ మిత్రులను, తన భార్యను, తన పిల్లలను, తన సేవకులను అందరినీ పంపేశాడు ... అతను వారందరినీ చాలా దూరంగా పంపేశాడు. ఒక నది యొక్క నిర్జన తీరంపై అతను భగవంతుడి కోసం నిరీక్షిస్తున్నాడు. భగవంతుడు అరుదెంచాడు.

కానీ అది అత్యంత విచిత్రమైనది ... జాకోబ్ భగవంతుడితో కుస్తీ పట్టడం ప్రారంభించాడు. ఎవ్వరైనా భగవంతుడితో కుస్తీ పడతారా? కానీ జాకోబ్ భగవంతుడితో పోరాడడం ప్రారంభించాడు. వాళ్ళు ఆ రాత్రంతా యుద్ధం చేశారని చెప్పబడుతుంది. ప్రాతఃకాలం సమీపిస్తూండగా, అరుణోదయం కాబోతున్నప్పుడు, జాకోబ్ ఓడించబడ్డాడు. భగవంతుడు అతనిని వీడి వెళ్ళబోతున్నప్పుడు, జాకోబ్ ఆయన పాదాలపై పడ్డాడు మరి అన్నాడు, "దయచేసి నాకు మీ ఆశీర్వాదాన్ని ఇవ్వండి."

భగవంతుడు అన్నాడు, " నీ పేరు ఏమిటి ?" జాకోబ్ ఆయనకు తన పేరు చెప్పాడు. భగవంతుడు అన్నాడు, " ఈ రోజు నువ్వు ఇజ్రాయెల్ అయ్యావు "... యూదులు ఆ పేరుతోనే ప్రసిద్ధులు. " ఈనాటి నుంచీ నువ్వు ఇజ్రాయెల్‌వు. నువ్వు ఇక ఎంతమాత్రం జాకోబ్‌వు కాదు, జాకోబ్ మరణించాడు " ... నేను మీకు సన్యాస ఉపదేశాన్ని ఇచ్చినప్పుడు నేను మీ పేరు మార్చినట్లుగానే. ఆ పురాతనమైనది పోయింది. భగవంతుడు జాకోబ్‌తో అన్నాడు : " జాకోబ్ మరణించాడు, ఇప్పటి నుంచి నువ్వు ఇజ్రాయెలువు."

ఈ కథ పాత శాసనం లోనిది. ఎవరైనా భగవంతుడితో యుద్ధం చేసే మరో కథ ఏదీ లేదు, కానీ ఈ కథలో ఒక గొప్ప సత్యం ఉంది. ఆ అత్యున్నత శక్తి దిగి వచ్చినప్పుడు, జరిగేది దాదాపు ఒక యుద్ధంలానే ఉంటుంది. ఆ అత్యున్నత అనుభవం సంభవించినప్పుడు మరి మీరు భగవంతుడి చేత ఓడించబడినప్పుడు మరి ఈ శరీరం జయించబడినప్పుడు మరి మీరు ఓటమిని అంగీకరించినప్పుడు ... అప్పుడు మీ అంతిమ ఉపదేశం సంభవిస్తుంది. ఆ క్షణంలో దివ్య ఆశీర్వాదాలు మీపై వర్షిస్తాయి. అప్పుడు మీరు నూతనులు. అప్పుడే ఆద్యంతరహితమైనదాని యొక్క అమృతాన్ని మొట్టమొదటిసారిగా మీరు రుచి చూస్తారు.

జాకోబ్ ఎక్కడ ఉండుంటాడో దాదాపు అక్కడే యోగ చిన్మయ ఉన్నాడు. ఆ రాత్రి ఎంతకాలం ఉండవచ్చో చెప్పడం కష్టం. ఆ పోరాటం ఎంత కాలం నిలుస్తుంది అనేది చెప్పడం కష్టం. ముందుగానే ఏదీ చెప్పలేము. కానీ ఈ పోరాటం శుభకరమైనది.

ఈ శక్తితో సహకరించండి. స్వేచ్ఛను కోరుకుంటున్న అంతరంగంలోని ఈ సింహం ... అది మీరే. శిరస్సు వైపు వృద్ధి చెందుతున్న, కామ కేంద్రం నుంచి సహస్రార చక్రం వైపు వెళ్ళాలనుకుంటున్న, ఒక మార్గాన్ని సృష్టించాలనుకుంటున్న ఆ శక్తి... అది మీరే. ఎన్నో జన్మలుగా అది అణచివేయబడింది మరి చుట్ట చుట్టుకుని పడుకుని వుంది : ఇప్పుడు అది తన శిరస్సును లేపడం ప్రారంభిస్తోంది. మీరు భాగ్యశాలి, మీరు అదృష్టవంతులు. దీనితో మీరు అంతిమ అనుగ్రహాన్ని సమీపిస్తున్నారు. మీ అసలైన రూపాంతరీకరణ సంభవిస్తుంది.

కృష్ణమూర్తి తన నోటు పుస్తకంలో వ్రాశాడు, " నా తల బద్దలైపోయినప్పుడల్లా, రాత్రివేళ నేను నిద్రపోలేకపోయినప్పుడు మరి ఆ అరుపులు, కేకలు వచ్చినప్పుడు మరి నా లోపల ఏదో గుర్రుమన్నప్పుడు... ఇదంతా ముగిసిపోయినప్పుడు ఒక అద్వితీయ అనుభవం కలుగుతుంది. దీని తరువాత ఒక మహాప్రశాంతత దిగి వస్తుంది.

అన్ని దిశలా అనుగ్రహం వర్షిస్తుంది. అంతటా కమలాలు మరి మరిన్ని కమలాలు వికసిస్తాయి."

చిన్మయకు ఖచ్చితంగా ఇదే సంభవించడం మొదలవుతోంది. అది మంచిది.

"దీని తరువాత నేను ఒక అసాధారణ మైకం మరి పరవశంలోకి లోతుగా పడిపోతాను. దాని పోరాటం అయిపోయిన తరువాత శక్తి ఉదయించినప్పుడు, మరి శరీరం కొద్దిగా సిద్ధమైనప్పుడు, అప్పుడు ఒక నూతన పరవశం వస్తుంది : అభివృద్ధి ఉంటుంది. మీరు కొద్దిగా పైకి వచ్చారు, మీరు కొద్దిగా అతీతులయ్యారు. మీరు చెరసాల నుంచి కొద్దిగా బయటకు వచ్చారు, మీరు తెరచి వున్న ఆకాశాన్ని కనుగొన్నారు. మీరు సంతృప్తులవుతారు. మీరు నర్తిస్తారు, మీరు ఆనంద నర్తనం చేస్తారు.

"అప్పుడు ఆ సింహం కొద్దిగా శాంతిస్తుంది, లోలోపల కదులుతూ వుంటుంది, పైకీ క్రిందకూ అడుగులు వేస్తుంది మరి గుర్రుమంటూనే ఉంటుంది. అనంతరం కీర్తనలో, లేదా మిమ్మల్ని జ్ఞాపకం చేసుకోవడంలో, అది పరమానందంతో నర్తిస్తుంది."

ఆ సింహం నాట్యం చేయాలనుకుంటోంది. శరీరంలో నాట్యం చేసేందుకు తగినంత స్థలం లేదు. నర్తించడానికి మరింత స్థలం అవసరమవుతుంది ... శరీరంలో ఏ స్థలం అందుబాటులో వుంది ? శరీరపు బాహ్యంలో మాత్రమే నాట్యం అనేది సంభవించగలదు. ఇందువలనే మీరు సంపూర్ణంగా నర్తిస్తే కనుక మీరు ఓ శరీరంగా ఇక ఎంతమాత్రమూ ఉండరనేది మీరు కనుగొంటారు. నాట్యం యొక్క అత్యున్నత సొగసులో, అత్యున్నత ఔన్నత్యంలో, మీరు శరీరం నుంచి బయటకు వస్తారు. శరీరం మెలికలు తిరుగుతూ వుంటుంది, లయబద్ధంగా కదులుతూ వుంటుంది, కానీ మీరు బయట వుంటారు, మీరు ఇక ఎంతమాత్రమూ లోపల లేరు.

ఇందువలనే నేను నా ధ్యానరీతులలో నృత్యాన్ని తప్పనిసరిగా కలిపాను, ఎందుకంటే ధ్యానానికి నాట్యంకన్నా అద్భుతమైనది మరేదీ లేదు. మీరు పూర్తిగా నర్తిస్తే కనుక, మీరు సంపూర్ణంగా నాట్యం చేస్తే కనుక, అప్పుడు ఆ నాట్యంలో మీ ఉనికి శరీరం నుంచి బయటకు వస్తుంది. శరీరం లయగా కదులుతూనే వుంటుంది కానీ మీరు శరీరం బయట ఉన్నారు అనేది మీరు అనుభవం పొందుతారు. మరి అప్పుడు మీ వాస్తవ నృత్యం ప్రారంభమవుతుంది. దిగువన, ఆ శరీరం నర్తిస్తూ వుంటుంది ; ఎగువన, మీరు నర్తిస్తారు. ఆ శరీరం అవనిపై ఉంటుంది, మీరు ఆకాశంలో ఉంటారు. ఆ శరీరం భువికి సంబంధించినదై ఉంటుంది, మీరు స్వర్గానికి

సంభంధించినవారై ఉంటారు. ఆ శరీరం పదార్థం యొక్క నృత్యాన్ని నర్తిస్తుంది, మీరు చైతన్యం యొక్క నృత్యాన్ని నర్తిస్తారు. మీరు నటరాజు అవుతారు.

మీరు అడుగుతున్నారు, "ఏమి జరుగుతోందో దయచేసి వివరించండి."

అపూర్వమైనది సంభవిస్తోంది, అద్భుతమైనది సంభవిస్తోంది, అరుదైనది సంభవిస్తోంది ! ఏదైతే సంభవిస్తోందో అది వివరించాల్సినది కాదు, అది అనుభవించాల్సినది. నేను చెప్పినదేదైనా ఈ అనుభవాన్ని మీరు అవగాహన చేసుకోగలిగేందుకు దోహదపడదు, మహా అయితే దానిని మరింత సులభంగా సమ్మతించగల సమర్థులయ్యేందుకు అది మీకు సహాయపడుతుంది. దానిని ఆనందంగా అంగీకరించండి. దానిని అణచివేయకండి.

సహజంగానే దానిని అణచివేయాలనే భావన కలుగుతుంది ; మీరు అనుకుంటారు, " ఇదేమి పిచ్చి ? ... నేను ఒక సింహంలాగా గుర్రుమని అంటున్నాను. ఈ గర్జించడం ఏమిటి ? నేను పిచ్చివాడినని ప్రజలు అనుకుంటారు !" కనుక సహజంగానే దానిని అణచివేయాలనే, ఎవ్వరికీ తెలియనివ్వకుండా దానిని మరుగుపరచాలనే భావన కలుగుతుంది. వాళ్ళు ఏమంటారు ?

దిగులు పడకండి. ఎవరేమంటారు అనే దాని గురించి పట్టించుకోకండి. మీరు పిచ్చివారు అని ప్రజలు అంటే కనుక, అలాంటప్పుడు పిచ్చివారైపోండి ! పిచ్చివారు కాకుండా జ్ఞానోదయాన్ని ఎవరైనా పొందారా ? మీ ధ్యాసను మీ అంతర్గతంపై ఉంచండి. దీని నుంచి పరమానందం వస్తూంటే కనుక, పరవశం వస్తుంటే కనుక, మధిర కురుస్తోంటే కనుక, అప్పుడు దిగులు పడకండి. మీకు ఇచ్చేందుకై ఇంత విలువైనదేదీ ఈ ప్రపంచం వద్ద లేదు. కనుక ప్రపంచంతో ఏ రాజీ కుదుర్చుకోకండి. బదులుగా ఈ సమస్త విశ్వాన్నీ మీ సామ్రాజ్యంగా మీరు పొందగలిగినా కూడా, మీ ఉనికిని రవంత కూడా అమ్మేసుకోకండి. జీసస్ అన్నాడు, "మీరు ఈ సమస్త ప్రపంచాన్నీ గెలుపొందినా కూడా మీ స్వంత ఆత్మను కోల్పోతే కనుక ఉపయోగమేముంది?" మీరు మీ ఆత్మను కాపాడుకుంటే కనుక, మీరు సమస్త విశ్వాన్నీ కోల్పోయినా కూడా, మీరు అన్నీ కలిగి వుంటారు.

ధైర్యాన్ని కలిగి వుండండి, సాహసోపేతంగా ఉండండి. మీ విశ్వాసాన్ని, మీ నమ్మకాన్ని మీలో పెంపొందనివ్వండి. త్వరలోనే మీ శరీరం క్రమేణా దానిని సమ్మతించడం ఆరంభిస్తుంది. అప్పుడు ఆ గర్జించడం అనేది మాయమైపోతుంది. అప్పుడు కేవలం నృత్యం మాత్రమే మిగిలి వుంటుంది. అప్పుడు ఆ సింహం వేదన

పొందదు, ఎందుకంటే ఆ సింహం ఒక మార్గాన్ని కనుగొని వుంటుంది. అది బయటకు వెళ్ళాలనుకున్నప్పుడు అది బయటకు వెళ్ళగలదు, అది లోపలికి రావాలనుకున్నప్పుడు అది లోపలికి రాగలదు. అప్పుడు ఈ శరీరం ఇక ఓ చెరసాల కాదు, అప్పుడు ఈ శరీరం ఓ విశ్రమించే ప్రదేశం అవుతుంది. మీరు లోనికి రావాలనుకున్నప్పుడు, లోపలకు రండి ; మీరు బయటకు వెళ్ళాలనుకున్నప్పుడు, బయటకు వెళ్ళండి.

మీరు మీ ఇంటి నుంచి వచ్చి వెళ్ళినంత సులభంగా మీరు బయటకు మరి లోపలికి వెళ్ళగలిగినప్పుడు.... చలిగా వుంది, మీరు చల్లదనాన్ని అనుభూతి చెందుతారు, మీరు బయటకు వెళతారు మరి సూర్యరశ్మిలో కూర్చుంటారు. అనంతరం ఎండ వేడి పెరుగుతుంది. సూర్యుడు పైకెక్కుతాడు, వేడి మొదలవుతుంది, మీరు చెమటలు కక్కుకోవడం ప్రారంభిస్తారు ; మీరు పైకి లేచి లోపలికి వస్తారు. మీరు మీ ఇంట్లోకి వచ్చినట్లుగా మరి బయటకు వెళ్లినట్లుగానే అది ఉంటుంది : అప్పుడు ఇల్లు ఒక చెరసాల కాదు. మీరు చెరసాలలో కూర్చుని వుంటే కనుక మీ మనోభీష్టానికి అనుగుణంగా బయటకు రాగల లేదా లోపలకు వెళ్ళగల సంభావ్యత మీకు ఉండదు. జైలులో మీరు ఒక ఖైదీ, ఇంటి వద్ద మీరు ఓ యజమాని.

మీ సింహం బయట నర్తించగలిగినప్పుడు, ఆకాశంలో ఎగురగలిగినప్పుడు, జాబిలి మరి తారలతో ఆటలాడగలిగినప్పుడు ... అప్పుడు ఏ సమస్యా ఉండదు. అప్పుడు శరీరంలో ఏ పోరాటమూ ఉండదు. అప్పుడు శరీరం అనేది ఒక విశ్రాంతి ప్రదేశం. మీరు అలసిపోయినప్పుడు మీరు లోపలికి తిరిగి రావచ్చు మరి విశ్రమించవచ్చు. అప్పుడు శరీరంతో సైతం ఏ శతృత్వమూ ఉండదు. అప్పుడు ఈ దేహం ఒక దేవాలయమవుతుంది.

రెండవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

మీరు ఎల్లప్పుడూ మాతోనే ఉన్నారనీ, మరి మేము సన్యాసం స్వీకరించినప్పుడు మేము కూడా మీతో ఉండడం ప్రారంభిస్తామనీ నిన్న మీరు చెప్పారు. నేను సన్యాసం తీసుకున్నప్పటి ఏ క్షణమూ నాకు జ్ఞాపకం లేదు : ఎప్పుడు అనేదీ జ్ఞాపకం లేదు, ఎక్కడ అనేదీ జ్ఞాపకం లేదు. మీరు కేవలం దానిని ఇచ్చారు అంతే. ఇప్పటికైనా, నేను మీ సమీపానికి వచ్చానా ? అప్పుడు నాకు సన్యాసం గురించి ఏమీ తెలియదు. ఇప్పుడు కూడా నాకు ఏమీ తెలియదు. గురుదేవా, నేను ఒక నిజమైన సన్యాసిగా ఎలా అవ్వగలను ? నేను మీకు మరింత దగ్గరగా ఎలా రాగలను ? ఆ యోగ్యత నాలో ఎక్కడ వుంది? ఆ విశ్వాసం మరి అధీనత నాలో ఎక్కడ వుంది ?

ఎన్నోసార్లు జరిగినది ఏమిటంటే సన్యాసం గురించి ఏమీ తెలియనివారికి నేను ఉపదేశాన్ని ఇచ్చాను. సన్యాసం స్వీకరించేందుకై రాని వాళ్ళకు నేను సన్యాసాన్ని ఇచ్చాను. తమ దిగ్భ్రమ కలిగించే స్వప్నాలలో సైతం సన్యాసం గురించి ఎన్నడూ ఆలోచించని వాళ్ళకు నేను ఉపదేశాన్నిచ్చాను... ఎందుకంటే నేను కేవలం మీ మనస్సు వైపు చూడడం మాత్రమే కాదు, నేను మీ అచేతనంలో అణచివేయబడి వున్న అనేక విషయాల వైపు కూడా చూస్తాను.

గతరాత్రి ఒక యువతి నన్ను చూసేందుకు వచ్చింది మరి నేను ఆమెను అడుగనైనా అడుగలేదు. " నీ కళ్ళను మూసుకో మరి సన్యాసాన్ని స్వీకరించు," అని నేను ఆమెకు చెప్పాను. ఆమె సన్యాసం తీసుకోవాలని కోరుకుంటోందా అనేది కూడా నేను అడుగలేదు. ఆమె తన కళ్ళను మూసుకుంది మరి ఉపదేశాన్ని స్వీకరించింది. సన్యాసం స్వీకరించమని అడుగబడితే కనుక సాధారణంగా ఎవరైనా ఆశ్చర్యపోతారు మరి దాని గురించి ఆలోచించాలని అనుకుంటారు. కొంతమంది సన్యాసం స్వీకరించడం గురించి నెలల తరబడి, సంవత్సరాల తరబడి ఆలోచిస్తారు. కొంతమంది దాని గురించి ఆలోచిస్తూనే ఉన్నారు మరి దానిని స్వీకరించకముందే మరణించారు. ఆమె దానిని సౌమ్యతతో స్వీకరించింది. చైతన్యస్థాయిలో దాని గురించి ఆమెకు ఏమీ తెలియదు.

కానీ మనం ఇక్కడకు క్రొత్తగా రాలేదు ... మనం అత్యంత సనాతునులం ! ఈ అమ్మాయి ఎన్నో జన్మలుగా అన్వేషిస్తోంది. ఆమె ధ్యానం యొక్క నిధులను కలిగివుంది. కేవలం ఈ నిధిని చూడడంతోనే నేను అన్నాను, " నీ కళ్ళను మూసుకో మరి అంతరంగంలోనికి వెళ్ళు," నేను ఆమెకు చెప్పాను, " నువ్వు సన్యాసం స్వీకరించాలని అనుకుంటున్నావా లేదా అని నేను నిన్ను అడుగబోవడం లేదు. అడగాల్సిన అవసరం లేదు."

నేను దయాళ్‌కు అదే విధంగా సన్యాసాన్ని ఇచ్చాను. ఈ ప్రశ్న దయాళ్ నుంచి వచ్చింది. నేను దయాళ్‌ను అడగలేదు. దయాళ్‌కు కూడా తెలియదు.

మీ గురించి మీకు ఏం తెలుసు ? మీరు ఎక్కడి నుంచి వచ్చారో మీకు తెలియదు. మీరు సమీకరించిన నిధుల గురించి మీకు తెలియదు. ఈ అనేకానేక జన్మలలో మీరు ఏం చేస్తూ వున్నారో మీకు తెలియదు. మీ అన్వేషణలో మీరు ఏం కనుగొన్నారు మరి ఏది అసంపూర్ణంగా మిగిలి వుంది అనేది మీకు తెలియదు. ప్రతిసారీ మృత్యువు వచ్చింది మరి మీరు చేసినదంతా తుడిచిపెట్టింది. అనేక

పర్యాయాలు సన్యాసాన్ని స్వీకరించినవాళ్ళు మీలో అనేకమంది ఉన్నారు : ప్రతీసారీ మృత్యువు వచ్చింది మరి అంతటినీ చెరిపేసింది, దానిని తిరిగి జ్ఞాపకం చేసుకోగల సామర్థ్యం మీకు లేదు.

దానిని ఈ విధంగా అవగాహన చేసుకోండి : మీరు ఏదో సృష్టిస్తున్నారు ... మృత్యువు వచ్చినప్పుడు మీరు ఒక చిత్తరువును చిత్రిస్తున్నారు, మరి అది అసంపూర్ణంగా మిగిలిపోయింది. మృత్యువు వచ్చింది మరి మీరు మరచిపోయారు. మీరు మళ్ళీ జన్మించారు. అప్పుడు ఆ అసంపూర్ణ చిత్రలేఖనం గురించిన సందేశాన్ని మీరు పొందినా కూడా ... ఆ అసంపూర్ణ చిత్రలేఖనం మీ ముందు ఉంచబడినా కూడా, మీకు జ్ఞాపకం ఉండదు, ఎందుకంటే ఈ జన్మలో మిమ్మల్ని మీరు ఓ చిత్రకారుడిగా ఎన్నడూ అనుకోనైనా అనుకోలేదు. " ఈ చిత్తరువును పూర్తి చెయ్యి అది అసంపూర్ణంగా వదిలేయబడింది. నువ్వు దానిని గొప్ప ఆశలతో రూపొందించావు, ఒక అత్యంత ప్రగాఢ దాహార్తితో నువ్వు దానిని సృష్టించావు ... ఇప్పుడు ఇక దానిని కానివ్వు మరి దానిని పూర్తి చెయ్యి. మధ్యలో మృత్యువు వచ్చింది మరి అది అసంపూర్ణంగా వదిలివేయబడింది," అని నేను మీకు చెబితే కనుక, మీరు అంటారు, " నాకు ఏమీ తెలియదు. ఆ కుంచెను నేను తీసుకునేలా మీరు చేయవచ్చు కానీ దానిని ఎలా పట్టుకోవాలో నాకు తెలియదు. మీరు రంగులను నా ముందు ఉంచవచ్చు మరి నేను చిత్రిస్తాను, కానీ ఎలా చిత్రించాలి అనేదాని గురించి నాకు ఏమీ తెలియదు." అయినాగానీ, మొదలుపెట్టమని నేను మీకు చెబుతాను, మరి కేవలం మొదలు పెట్టడం ద్వారానే ఆ జ్ఞాపకం వస్తుంది. కేవలం కుంచెను మీ చేతిలోకి తీసుకోండి మరి బహుశా మీరు జ్ఞాపకం చేయబడతారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో అది జరిగింది, ఒక సైనికుడు గాయపడ్డాడు మరి పడిపోయాడు, అతను తన స్మృతిని కోల్పోయాడు. అతని తలపై బలంగా దెబ్బ తగిలింది మరి అతని స్మృతి కణాలు అస్తవ్యస్తమైపోయాయి. అతను అంతా మరచిపోయాడు. అతను తన స్వంత పేరును కూడా మరచిపోయాడు, తాను ఎవరో అతను మరచిపోయాడు, యుద్ధ క్షేత్రం నుంచి అతను తీసుకురాబడినప్పుడు అతను స్పృహ కోల్పోయి ఉన్నాడు. అతని గుర్తింపు ఎక్కడో పడిపోయింది, అతని సంఖ్య కూడా పడిపోయింది.

అది ఒక పెద్ద సమస్య : అతనికి స్పృహ వచ్చినప్పుడు అతని సంఖ్య అతనికి తెలియదు, అతని పేరు అతనికి తెలియదు, అతని హోదా అతనికి తెలియదు. ఆ మనో వైజ్ఞానికులు ఎంతో శ్రమించారు ; అతనికి జ్ఞాపకం చెయ్యడానికి వాళ్ళు అన్ని

విధాలుగా ప్రయత్నించారు కానీ ఏమీ కనుగొనలేకపోయారు. ఆ మనిషి పూర్తి శూన్యంగా అయిపోయాడు... అతని స్మృతితో వున్న సంబంధమంతా అకస్మాత్తుగా తెగిపోయినట్లుగా. ఇక ఇప్పుడు కేవలం ఒకే ఒక్క మార్గం ఉందని ఎవరో సూచించారు : అతనిని ఇంగ్లాండ్ అంతటా త్రిప్పేందుకు తీసుకెళ్ళాలి. అతను బ్రిటీష్ సైన్యంలోని సైనికుడు, మరి అతనిని ఇంగ్లాండ్ అంతా త్రిప్పితే, బహుశా అతను తన స్వగ్రామం వద్దకు వచ్చినప్పుడు అతను జ్ఞాపకం చేసుకుంటాడు.

కనుక అతను రైళ్ళలో ఇంగ్లాండ్ అంతా త్రిప్పబడ్డాడు... ఇద్దరు మనుషులు అతనిని అన్నివైపులా తీసుకెళ్ళారు. ఆ రైలు ప్రతీ స్టేషను వద్దా ఆగింది మరి వాళ్ళు అతనిని క్రిందకు దించారు మరి అతను నిలబడి చుట్టూ చూశాడు. ఇంగ్లాండ్ ఒక చిన్న దేశం, కనుక అతనిని అన్ని చోట్లకూ తీసుకెళ్ళడం అంత కష్టమైనదేమీ కాదు. చివరిలో, ఆ రైలు సాధారణంగా ఆగని ఒక చిన్న స్టేషను వద్ద, ఏదో కారణానికి అది ఈసారి ఆగింది, ఆ మనిషి దిగిపోయాడు, ఆ స్టేషను వద్ద సూచన చదివాడు మరి అన్నాడు, " ఇది నా స్వగ్రామం !"

అతను పరుగెత్తడం మొదలుపెట్టాడు. తనతో ఇద్దరు మనుషులు ఉన్నారని అతను మరచిపోయాడు. ఆ ఇద్దరు మనుషులు అతని వెనుక పరుగెత్తడం ప్రారంభించారు. అతను స్టేషను బయటకు మరి గ్రామంలోనికి పరుగెత్తాడు... అతను అన్నీ జ్ఞాపకం చేసుకున్నాడు. అతను ఆ వీధులు మరి సందులను గుర్తించాడు. అతను ఎవ్వరినీ అడుగనైనా అడగలేదు. అతను ఆ వీధులు మరి ప్రక్కదారుల వెంట పయనించాడు మరి తన ఇంటి ముందుకు వచ్చాడు. అతను అన్నాడు, " ఓహో ! ఇది నా ఇల్లు... ఇది నా పేరు... నా పేరు వ్రాసి వున్న ఫలకం ఇక్కడ వేళ్ళాడుతోంది." అతను మొత్తం జ్ఞాపకం చేసుకున్నాడు. కేవలం ఒక చిటికెలో అతని స్మృతి అంతా తిరిగి వచ్చింది. విస్మృతి మాయమైపోయింది, జ్ఞాపక వ్యవస్థ మళ్ళీ గాడిలో పడింది.

నేను మిమ్మల్ని కాషాయ వస్త్రాలలో అన్ని దిక్కులకూ పంపితే కనుక, మీరు ఇంతకుముందు కాషాయ వస్త్రాలను ధరించారు అనేది మీరు బహుశా జ్ఞాపకం చేసుకోగలుగుతారు అనే ఆశతో నేను దయాళ్‌కు ఇచ్చినట్లుగా కొన్నిసార్లు నేను సన్యాసాన్ని ఇస్తాను. " నర్తించండి !" అని నేను చెప్తే కనుక బహుశా ఒక రోజు మీరు నాట్యం చేస్తున్నప్పుడు మీ గత జన్మలలోని మీ నాట్యాన్ని మీరు జ్ఞాపకం చేసుకోగలిగే మనోసంబంధిత ప్రదేశానికి మీరు చేరుకుంటారు. "ధ్యానం చెయ్యండి," అని నేను చెబుతాను. మీరు ధ్యానం చేస్తున్నప్పుడు బహుశా అచేతనంలోని ద్వారమేదో తెరుచుకుంటుంది మరి జ్ఞాపకాల వెల్లువ వస్తుంది.

ఇందువలనే నేను ప్రసంగిస్తూనే ఉంటాను...కొన్నిసార్లు గీత పైన, కొన్నిసార్లు అష్టావక్రుడి పైన, కొన్నిసార్లు జరాతుస్ట్రా పైన, కొన్నిసార్లు బుద్ధుడి పైన, కొన్నిసార్లు జీసస్ పైన, కొన్నిసార్లు కృష్ణుడి పైన : ఏ మాటలు మీ హృదయాన్ని పురికొల్పుతాయో ఎవరికి తెలుసు ? ఏ మాటలు మీ అంతర్గత లోతులకు ఓ తాళం చెవి అవుతాయో ఎవరికి తెలుసు ? ఏ మాటలు మిమ్మల్ని మీ కునుకు నుంచి మేల్కొలుపుతాయో ఎవరికి తెలుసు ? నేను అన్నింటినీ ప్రయత్నిస్తూనే ఉంటాను. దేనితో అయితే మృత్యువులు బద్దలయ్యాయో మరి చెల్లాచెదురైపోయాయో ఆ అవిచ్ఛిన్నతను, ఆ సమ్మతిని, ఆ అనుసంధానాన్ని కల్పించేందుకే నా ప్రయత్నమంతా. ఈ అవిచ్ఛిన్నతతో మీ గమ్యం మీ ముందు పరచుకోవడం మొదలవుతుంది. ఎన్నోసార్లు మీరు ఇంటిని రూపొందించారు ... అది మళ్ళీ మళ్ళీ వదిలివేయబడింది.

అందువలనే దయాళ్ సరిగ్గా చెప్పాడు : " నేను సన్యాసం తీసుకున్నప్పటి ఏ క్షణమూ నాకు జ్ఞాపకం లేదు..." అతను దానిని తీసుకోలేదు, నేను దానిని ఇచ్చాను.

" ఎప్పుడు అనేదీ జ్ఞాపకం లేదు, ఎక్కడ అనేదీ జ్ఞాపకం లేదు. ఇప్పటికైనా, నేను మీ సమీపానికి వచ్చానా ?" మిమ్మల్ని మీరు చేరుకున్నప్పుడు, మీరు నా సమీపానికి వస్తారు. నా సమీపానికి రాగల మార్గం మరేదీ లేదు. మిమ్మల్ని మీరు చేరుకోండి మరి మీరు నన్ను చేరుకుని వుంటారు. మిమ్మల్ని మీరు తెలుసుకోండి మరి మీరు నన్ను తెలుసుకుని వుంటారు. నా దిశగా ఏ బాహ్య తీర్థయాత్రనూ మీరు చేయవలసిన అవసరమే లేదు .... అంతరంగంలోకి లోతుగా మరింత లోతుగా దిగండి.

" అప్పుడు నాకు సన్యాసం గురించి ఏమీ తెలియదు, ఇప్పుడు కూడా నాకు ఏమీ తెలియదు." అది త్వరలోనే సంభవిస్తుంది ... త్వరలోనే మీరు తెలుసుకుంటారు. " అప్పుడు నాకు ఏమీ తెలియదు, ఇప్పుడు కూడా నాకు ఏమీ తెలియదు. ఇది నిజం. కానీ మీకు తెలియదు అనేది మీకు తెలిసినప్పుడు, మీరు అనుకున్నప్పుడు ఈ వైఖరి మంచిది. తమకు తెలియకపోయినాగానీ తమకు తెలుసు అని అనుకునేవాళ్ళు అభాగ్యులు. మీరు సరైన స్థితిలో ఉన్నారు. " నాకు తెలియదు ", నిష్కపటమైన మనస్సు యొక్క వైఖరి ఇదే. మీరు శూన్యంగా ఉన్నారు. మీరు నింపబడవచ్చు. ఏమీ తెలియనివారు కొందరున్నారు ... మరి వాళ్ళ సంఖ్య విస్తారమైనది ... కానీ తమకు తెలుసు అని వాళ్ళు అనుకుంటారు. ఈ అయుక్త భావన వలన తాము తెలుసుకోగలిగివున్న దానిని సైతం వాళ్ళు చేజార్చుకుంటారు.

జ్ఞానం నిరోధిస్తుంది ... అసలైన తెలుసుకోవడం నుంచి మిమ్మల్ని నిరోధిస్తుంది. మీకు ఏమీ తెలియదు అనేది మీకు తెలిసి వుంటే కనుక, అప్పుడు మీరు సరైన దిశలో పయనిస్తున్నారు. అటువంటి అమాయక మనోస్థితిలోనే అత్యున్నతమైనది సంభవిస్తుంది. " నాకు తెలియదు," అనేది తెలిసివుండడమే తెలుసుకునే దిశగా మొదటి అడుగు.

" ఆ యోగ్యత నాలో ఎక్కడ వుంది ? ఆ విశ్వాసం మరి అధీనత నాలో ఎక్కడ వుంది ? " ఒక యోగ్యుడైన వ్యక్తి యొక్క హృదయంలోనే ఈ అనుభూతి కలుగుతుంది. "ఆ యోగ్యత నాలో ఎక్కడ వుంది ?" అయోగ్యుడు అనుకుంటాడు, "నాకన్నా యోగ్యులు ఎవరున్నారు ?"

స్వయంగా ఈ వినమ్రతా భావమే యోగ్యత, "నేను దేనికి అర్హుడను ? నేను ఏ అధీనతను, ఏ విశ్వాసాన్ని కలిగి వున్నాను ?" అనేది ... ఇదే విశ్వాసానికి సూచన. ఆ విత్తనం ఉనికిలో వుంది. కేవలం నిరీక్షించాలంతే : యుక్త సమయంలో, సరైన ఋతువులో, అది అంకురిస్తుంది, రూపాంతరీకరణ సంభవిస్తుంది.

మరి ఈ ప్రయాణం ఒక అరుదైన ప్రయాణం. ఈ ప్రయాణం అవిదితమైనదాని యొక్క తెలుసుకోలేనిదాని యొక్క ప్రయాణం.

ఒక కవి అంటాడు :

శాశ్వత నిశ్శబ్దం యొక్క ఈ రహస్యం.
ఈ రహస్యాన్ని తెలుసుకోవడం వ్యర్థం.
నీ పట్ల నాకున్న పిచ్చిలో నేను నా ప్రశాంతతను పోగొట్టుకున్నాను.
నీకై నా వేదనలో నేను ఆనందంతో నిండిన ఒక జ్వాలనయ్యాను.
కాలం చేతులలో నేను ఎంత వంగిపోయానంటే
ఒకప్పుడు ఓ బాణంలా ఉన్న నేను, ఇప్పుడు విల్లునైపోయాను.
ఈ పయనానికి ఏ సహచరులూ, ఏ మార్గదర్శీ లేరు.
నేను బయలుదేరిన ఈ మార్గమేమిటి?
ఈ పరవశంలో నేను మహదానందాన్ని పొందుతున్నాను.
అంతర్ధానమైపోయి, నేను గమ్యాన్ని సూచించే
ఓ దీపాన్నయ్యాను.

ఈ గమ్యం ఎటువంటిదంటే మిమ్మల్ని మీరు కోల్పోవడం ద్వారానే అది చేరుకోబడుతుంది. మీరు ఉన్నంతకాలమూ, మీరు చేరుకోరు ; మీరు మాయమైపోయినప్పుడు, మీరు పొందుతారు.

ఈ పరవశంలో నేను మహదానందాన్ని పొందుతున్నాను.

మీరు లేనప్పుడు, మీ అహం అంతర్ధానమైపోయినప్పుడు, పరవశం వచ్చినప్పుడు...

ఈ పరవశంలో నేను మహదానందాన్ని పొందుతున్నాను.
అంతర్ధానమైపోయి, నేను గమ్యాన్ని సూచించే
ఓ దీపాన్నయ్యాను.

" నేను మాయమైపోవడం వలన, నేను చేరుకున్నాను.". ఈ మార్గం మిమ్మల్ని మీరు కోల్పోయే మార్గం. " అధీనమయ్యే యోగ్యత నాకు ఎక్కడ వుంది ?" అని మీరు భావిస్తే కనుక, మీరు అంతర్ధానమైపోవడం ఆరంభించారు, పరమానందం ఉదయిస్తోంది. " ఆ విశ్వాసం నాలో ఎక్కడ వుంది ?" అని మీరు భావిస్తే, అప్పుడు మీరు మాయమైపోవడం మొదలుపెట్టారు, మిమ్మల్ని మీరు కోల్పోవడం మొదలుపెట్టారు.

దివ్యత్వం ఉండగలిగేలా, మీరు అంతర్ధానమైపోవడమే సన్యాసం.

ఈ పయనానికి ఏ సహచరులూ, ఏ మార్గదర్శీ లేరు.

ఇది మహోత్తమ ఏకాంతపు పయనం.

ఈ పయనానికి ఏ సహచరులూ, ఏ మార్గదర్శీ లేరు.

అక్కడ ఏ సహచరులూ లేరు, మార్గంపై మీకు ఏ మార్గదర్శీ లేరు. చివరిగా, గురువును కూడా వదిలేయాలి, ఎందుకంటే అక్కడ స్థలం లేదు. కబీరు అంటాడు :

ప్రేమమార్గం అత్యంత ఇరుకైనది.
అక్కడ ఇరువురు నడవలేరు !

ముగ్గురు ఉండేందుకు తగినంత స్థలం ఎక్కడ వుంది ? ఇద్దరు సైతం ఉండలేరు. శిష్యుడు, గురువు, దివ్యత్వం ; ముగ్గురు ఉన్నారు ! అక్కడ ఇద్దరు సైతం ఉండలేరు. అక్కడ, గురువు వదిలివేయబడ్డాడు, మీరు కూడా వదిలివేయబడ్డారు. అక్కడ, కేవలం దివ్యత్వమే మిగిలి వుంటుంది.

ఈ పయనానికి ఏ సహచరులూ, ఏ మార్గదర్శీ లేరు.

నేను బయలుదేరిన ఈ మార్గమేమిటి ?

సన్యాసం అనేది ఓ అవిదితమైన పయనం. మహత్తర ధైర్యం, మహోన్నత సాహసాలతో కూడిన పయనం. అవిదితమైనదానిలోకి వెళ్ళడమనే ప్రమాదాన్ని సమ్మతించేందుకు సిద్ధంగా వున్నవారు ... అది వారికోసమే. తెలివైనవారు, ప్రతిదాన్నీ గణించేవారికోసం కాదు అది ఉన్నది. అది గణితశాస్త్రం కాదు, అది ప్రేమ యొక్క గంతు.

మూడవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

మీరు అన్నారు, " మీరు ఇక్కడే మరి ఇప్పుడే, ఈ క్షణమే విముక్తులయ్యారు." కానీ ఈ "నేను " అనేదాని నుంచి నేను ఎలా స్వతంత్రుడిని అవ్వగలను ?

' ఎలా ' అని మీరు అడిగితే కనుక మీరు చేజార్చుకున్నారు. మీరు దానిని అర్థం చేసుకోలేదు. అష్టావక్రుడి యొక్క సందేశం సమస్తం ఇదే : సాధన చెయ్యడం... ' ఎలా ' అంటే అర్థం సాధనం చెయ్యడం. ' ఎలా ' అంటే ఏ విధానంలో, ఏ క్రియలు మరి ఆచారాల ద్వారా అని అర్థం. ' ఎలా ' అని మీరు అడిగితే కనుక, మీరు చేజార్చుకున్నారు. అప్పుడు మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోలేరు. అప్పుడు మీరు వెళ్ళి పతంజలి యొక్క తలుపును తట్టాల్సి వస్తుంది : ' ఎలా ' అనేది అతను మీకు చెబుతాడు. ఈ ' ఎలా ' అనేదానిపై మీరు పట్టుబడితే కనుక, అప్పుడు పతంజలి మీ మార్గమవుతాడు. యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అభ్యసించమని అతను మీకు చెబుతాడు. అతను దానిని ఎంత విపులమైనదిగా తయారు చేస్తాడంటే మీరు సైతం అంటారు : ఓ భగవంతుడా, దానిని కొంచెం తగ్గించు, నాకు ఏదైనా సులభ విధానాన్ని చెప్పు. ఇది మరీ సుదీర్ఘమైనది, ఇది ఎన్నో జన్మల సమయం తీసుకుంటుంది.

అనేకమంది యోగులు కేవలం యమాన్ని మాత్రమే సాధన చేస్తున్నారు, వారు ఎన్నటికీ నియమం వద్దకు చేరుకోనైనా చేరుకోలేరు. ఆసనాలలో ... యోగ భంగిమలలో ప్రవీణులయ్యేందుకు ఇంకా ప్రయత్నిస్తూండగానే అనేకమంది యోగులు మరణిస్తారు. ధారణ అనేది సుదూరంలోనిది, ధ్యానం అనేది సుదూరంలోనిది. యోగ భంగిమలు ఎన్ని ఉన్నాయంటే వాటిలో శిక్షణను పూర్తి చేసుకోవడమనేది ఎన్నటికీ అసాధ్యమైనదిగానే కనిపిస్తుంది. మహా అయితే అత్యంత లోతుగా అన్వేషించేవాళ్ళు ధారణాస్థితిని చేరుకుంటారు ... మరి అసలైన సంభవం అనేది కేవలం సమాధిలో

మాత్రమే జరుగగలదు. మరి సమాధిని సైతం పతంజలి రెండుగా విభజిస్తాడు : సబీజ సమాధి, మనస్సుతో కూడి వుండడం, మరి నిర్బీజ సమాధి, మనస్సు లేకుండా ఉండడం. అతను విభజిస్తూనే వుంటాడు, మరిన్ని మరిన్ని మెట్లను అతను రూపొందిస్తూనే వుంటాడు. అతను నేల నుంచి నింగి దాకా మెట్లను ఏర్పరుస్తూనే వుంటాడు.

'ఎలా' అనేదీ, సాధన చేయడమనేదీ మీకు సరిపడితే కనుక, అలాంటప్పుడు పతంజలిని అడగండి... అయినా కూడా చివరిలో పతంజలి సైతం అన్నింటినీ వదిలేయమనీ, ఈ 'చేయడం' అనేది ఇక చాలు అనీ చెబుతాడు. కానీ చేయడాన్ని ఆపలేనివారు ఉంటారు, కనుక వాళ్ళు చేయాల్సి వస్తుంది.

దాని గురించి ఈ విధంగా ఆలోచించండి : ధ్వనులను చేస్తూ మరి అల్లరి చేస్తున్న ఒక బాలుడు ఇంట్లో ఉన్నాడు. "నిశ్శబ్దంగా కూర్చో", అని మీరు అతనికి చెబుతారు, కానీ అతను అలా కూర్చున్నా కూడా, అతను, ఉత్సాహంతో పొంగులెత్తుతూనే ఉంటాడు. అతని చేతులు మరి కాళ్ళు అటూ ఇటూ ఆడుతుంటాయి. అతని తల కదులుతూ వుంటుంది... అతను ఏదో చేయాలని అనుకుంటున్నాడు. అతనిలో శక్తి బద్దలయ్యేలా వుంది. అతనిని నిశ్చలంగా కూర్చోబెట్టడానికి ఇది మార్గం కాదు. ఇది ప్రమాదకరమైనది ... ఒక విస్ఫోటనం జరుగవచ్చు. ఈ విధంగా అయితే అతను ఏదో ఒకటి చేయబోతున్నాడు. "వెళ్ళి ఇంటి చుట్టూ ఏడుసార్లు తిరిగి రా," అని మీరు అతనికి చెప్పడం మెరుగైనదవుతుంది. అప్పుడు అతను రొప్పుతూ, నిట్టూరుస్తూ తిరిగి వస్తాడు మరి తనంతట తాను నిశ్శబ్దంగా కూర్చుంటాడు ; "నిశ్శబ్దంగా వుండు", అని మీరు చెప్పవలసిన అవసరం కూడా ఉండదు. ఇంతకు ముందు అతను నిశ్శబ్దంగా కూర్చోలేకపోయిన కుర్చీలోనే అతను నిశ్శబ్దంగా కూర్చుంటాడు.

నేరుగా నిశ్చలం కాలేని వారి కోసమే పతంజలి ఉన్నది. అతను చెబుతాడు, "ఏడుసార్లు చుట్టూ పరుగెత్తండి. ఎక్కువసేపు మరి కఠినంగా పరుగెత్తండి. మీ శరీరాన్ని వంకర చేసి మరి మెలి తిప్పండి ? మీ శిరస్సుపై నిలబడండి ; ఇది చెయ్యండి, అది చెయ్యండి."

ఈ సాధనలు అన్నీ చేస్తూ, చివరకు ఒకరోజు మీరు అంటారు, "ఓ భగవంతుడా, ఈ చేయడం అనేదానితో నేను అలసిపోయాను !"

అతను చెబుతాడు, " నువ్వు ప్రారంభంలోనే ఇలా చెప్పి ఉండాల్సింది, అప్పుడు మనం ఇరువురమూ ఈ ప్రయాస నుంచి రక్షింపబడేవాళ్ళు. ఇప్పుడు వెళ్ళు మరి నిశ్శబ్దంగా కూర్చో !"

మానవుడు చెయ్యాలని అనుకుంటాడు, ఎందుకంటే చేయకుండా ... చేయడం అనేది లేకుండా ఏదైనా సంభవించగలదు అనేది మీ తర్కానికి సరిపోదు. అష్టావక్రుడు మీ తర్కానికి అతీతుడు. మీరు విముక్తులేనని అష్టావక్రుడు అంటాడు ! కానీ మీరు ఇంకా అపార్థమే చేసుకుంటున్నారు. మీ ప్రశ్న ఏమిటంటే " మీరు అన్నారు, ' మీరు ఇక్కడే మరి ఇప్పుడే, ఈ క్షణమే విముక్తులయ్యారు '. కానీ ఈ " నేను " అనేదాని నుంచి నేను ఎలా స్వతంత్రుడిని అవ్వగలను ?"

తాను స్వతంత్రుడిని కాదని ఎవరైనా భావించినప్పుడు మాత్రమే ' ఎలా ' అనేది ఉంటుందని అష్టావక్రుడు అంటాడు. మొదట, మీరు బంధించబడి ఉన్నారని మీరు అంగీకరించారు. ఇప్పుడు, మీరు అంటున్నారు, " నేను ఎలా స్వతంత్రుడిని అవ్వగలను ?" ఏ బంధనమూ లేదు ... కేవలం బంధనం అనే భ్రమ మాత్రమే వుంది అని అష్టావక్రుడు చెబుతాడు.

కానీ మీరు ఇంకా అంటూనే ఉంటారు, " ఈ భ్రమ నుంచి నేను ఎలా స్వతంత్రుడిని అవ్వాలి ?" మీరు ఇంకా దానిని అర్థం చేసుకోలేదు. భ్రమ అంటే ' లేనిది ' అని అర్థం : కనుక దేని నుంచి స్వతంత్రులవుతారు ? కేవలం వీక్షిస్తూండడంతో, కేవలం జాగృతులై ఉండడంతో మీరు స్వతంత్రులై వుంటారు. మీరు రీతులలో మమేకమైపోయి వుంటే కనుక, మీరు గొప్ప చిక్కులో పడతారు.

అన్ని రీతులూ అసత్యమైనవిగానే నిరూపితమయ్యాయి.

చివరకు స్వయానా జీవితమే అతి చిన్నదిగా నిరూపితమయ్యింది.

మీరు రీతులలో చిక్కుకుపోతే కనుక కేవలం ఈ జన్మ మాత్రమే కాదు అనేక జన్మలు సైతం సరిపోవు అనేది మీరు కనుగొంటారు. రీతులు అనేకం ఉన్నాయి ... మరి జన్మ తరువాత జన్మ మీరు వాటిని సాధన చేస్తూపోయారు. మీరు చెయ్యడం అనేదాని పట్ల విశ్వాసాన్ని ఉంచుతారు ఎందుకంటే చెయ్యడం అనేది మీ అహాన్ని పెంపొందిస్తుంది.

ఏమీ చెయ్యకండి అని అష్టావక్రుడు చెబుతున్నాడు. సమస్తమే ఏకైక కర్త. ఏది సంభవిస్తుందో అది సంభవిస్తోంది... కేవలం దానితో ఏకమవ్వండి. " ఈ

' నేను ' అనేదాని నుంచి స్వతంత్రుడిని అవ్వడం ఎలా ?" అని అడగనైనా అడగవద్దు. ఈ ' నేను ' అనేది సంభవిస్తోంటే కనుక, దానిని సంభవించనివ్వండి. దాని నుంచి స్వతంత్రులయ్యేందుకు ప్రయత్నించడానికి మీరెవరు ? మీరు కూడా దానిని అంగీకరించవచ్చు : మంచిది, ఇది సంభవిస్తోంటే కనుక, అలాంటప్పుడు సంభవిస్తోన్నది ఇదే. మీరు దానిని సృజించలేదు. దానిని సృజించినట్లు మీకు జ్ఞాపకముందా ? మీరు దానికి ఆకృతిని ఇవ్వలేదు. మీరు దానిని తీసుకురాలేదు. మీరు తీసుకురాని దానిని మీరు ఎలా వదిలేయగలరు ? మీరు సృష్టించనిదానిని మీరు ఎలా నాశనం చేయగలరు? " మేము ఏం చేయగలం ? " అని మీరు అడుగుతున్నారు. మీకు రెండు కళ్ళు మరి ఓ ముక్కు ఉన్నాయి ; మీకు అహం కూడా వుంది. మీరు వీటన్నింటినీ స్వీకరించారు. మీ చేతులలో ఏమీ లేదు.

ఉన్నది ఏదైనా మంచిదే. ' నేను ' అనేది ఉన్నట్లయితే, అది కూడా మంచిదే. దాని గురించి కొంచెం కూడా ఫిర్యాదు చేయకండి. ఫిర్యాదు రహితమైన ఈ వైఖరిలో, ఈ సంపూర్ణ సమ్మతిలో, ' నేను ' అనేది పోవడాన్ని మీరు ఆకస్మికంగా కనుగొంటారు... ఎందుకంటే ఈ ' నేను ' అనేది కర్మ నుంచే సృష్టించబడింది. మీరు ఏదైనా చేసినప్పుడు ' నేను ' అనేది సృష్టించబడుతుంది.

ఇప్పుడు మీరు నూతనమైనదేదో అడుగుతున్నారు : " ఈ ' నేను ' అనేదానిని నేను ఎలా నాశనం చేయగలను ?" నాశనం చేసేవాడే ఆ 'నేను' అనేది అవుతాడు. మీరు తప్పించుకోలేరు. ఇందువలనే ఒక వినమ్రుడైన మనిషి కూడా అహాన్ని కలిగివుంటాడు ... మరి కొన్నిసార్లు అది ఓ అహంకారిలో వున్నదాని కన్నా అధికంగా వుంటుంది.

వినమ్రత గల మనిషి యొక్క అహాన్ని మీరు చూశారా ? ఆ వినమ్రుడు అంటాడు, " నేను కేవలం నీ పాదాల వద్ద ఉన్న ధూళిని మాత్రమే." కానీ అతని కళ్ళలోకి చూడండి ... అతను చెబుతున్నది ఏమిటి ? " నువ్వు సరిగ్గానే చెబుతున్నావు, నువ్వు కేవలం నా పాదాల వద్ద ఉన్న ధూళివి మాత్రమేనన్నది నాకు ఇప్పటికే తెలుసు," అని మీరు అంటే కనుక, అప్పుడు అతను పోట్లాడడం ప్రారంభిస్తాడు. మీరు సమ్మతించేందుకు అతను దానిని చెప్పడం లేదు. "నువ్వు ఎంతటి వినమ్రుడవంటే... నిన్ను కలుసుకోవడం నా అదృష్టం," అని మీరు అనేందుకు అతను దానిని చెబుతున్నాడు." నువ్వు నా పాదాల వద్ద ఉన్న ధూళివా ? లేదు, నువ్వు స్వచ్ఛమైన బంగారానివి. ఆలయ శిఖరానివే నువ్వు," అంటూ, మీరు దానిని ఖండించేందుకే అతను దానిని చెబుతున్నాడు. మీరు అతని గురించి ఉన్నతంగా

మాట్లాడినకొద్దీ, లేదు అనీ, తాను కేవలం ధూళి మాత్రమేననీ అతను మరింతగా చెబుతాడు. కానీ తాను కేవలం ధూళి మాత్రమే అని అతను చెప్పినప్పుడు, మీరు అంగీకరిస్తే కనుక, " నువ్వు సరిగ్గానే చెబుతున్నావు. నువ్వు కేవలం వారి పాదాల వద్ద ఉన్న ధూళివి మాత్రమే అని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు ", అప్పుడు అతను ఎన్నడూ మళ్ళీ మీ వైపు చూడనైనా చూడడు. అది వినమ్రత కాదు ; అది ఓ క్రొత్త రంగును పులుముకున్న అహం, నూతన వస్త్రాలలో అలకంరింపబడి వున్న అహం, వినమ్రతను ధరించి వున్న అహం.

కనుక, ' నేను ' అనేదానిని విడనాడేందుకు మీరు ప్రయత్నిస్తే కనుక, దానిని వదిలేస్తున్నవాడు ఒక క్రొత్త ' నేను ' ను సృష్టిస్తాడు. మానవుడు వస్త్రాలను మార్చుతూనే వుంటాడు. వస్త్రాలు మారుతాయి కానీ మీరు అలానే వుంటారు.

అష్టావక్రుడు చెబుతున్నదానిని అవగాహన చేసుకునేందుకు ప్రయత్నించండి. ఏమి చెయ్యాలి, ఈ అహాన్ని ఎలా వదిలించుకోవాలి అని అడిగేందుకు తొందరపడకండి. చెయ్యడానికి వేగిరపడకండి. విశ్రమించండి మరి అవగాహన చేసుకునేందుకు కొద్ది సమయాన్ని తీసుకోండి. అష్టావక్రుడు చెబుతున్నాడు, " ఈ 'నేను ' అనేది ఎలా సృష్టించబడిందో అవగాహన చేసుకోండి " ... అది కర్మ ద్వారా సృష్టించబడింది, శ్రమపడడం మరి ప్రయత్నించడం నుంచి అది సృష్టించబడింది, విజయం నుంచి అది సృష్టించబడింది. కనుక మీరు ప్రయత్నమనేది ఎక్కడ చేసినా, అది సృష్టించబడుతుంది. అప్పుడు ఒక విషయం స్పష్టమవుతుంది : మీరు అహం నుంచి స్వతంత్రులు అవ్వాలని కోరుకుంటే కనుక, అప్పుడు ఏ ప్రయాసా చేయకండి, ప్రయత్నించకండి. కేవలం అది ఉన్న విధంగానే, ఉన్నదానిని అంగీకరించండి. ఈ అంగీకారంలోనే అది ఎన్నడూ లేనే లేనట్లుగా అహం అనేది అంతర్ధానమైపోవడం మీరు కనుగొంటారు, ఎందుకంటే దానికి శక్తిని అందిస్తున్న మూల పదార్థం తెలియకుండానే వెళ్ళిపోయింది, ఆ పునాది కూలిపోయింది కనుక ఆ ఇల్లు ఎంతో కాలం నిలిచి ఉండలేదు.

ఒక కర్తగా ఉండడం అనే భావన తొలగిపోతే కనుక, అప్పుడు జీవితపు రుగ్మతలన్నీ తొలగిపోతాయి ; లేదంటే జీవితంలో అనేక వలలు ఉంటాయి. డబ్బు వెనుక పరుగెత్తడం కూడా కర్త యొక్క పరుగే. అధికారం వెనుక పరుగెత్తడం కూడా కర్త యొక్క పరుగే. కీర్తి వెనుక పరుగెత్తడం కూడా కర్త యొక్క పరుగే. మీరు ప్రపంచానికి ఏదో ప్రదర్శించాలనుకుంటున్నారు.

అనేకమంది నా వద్దకు వచ్చి అంటారు, " ఈ ప్రపంచానికి ఏదైనా చూపేందుకు మాకు ఓ మార్గాన్ని చెప్పండి." మీరు చూపాలని అనుకుంటున్నది ఏమిటి ? వాళ్ళు అంటారు," లేదు, అది కేవలం ఏమిటంటే మేము పేరు గడించాలనుకుంటున్నాం. మేము వెళ్ళిపోతాం, కానీ మా పేరు మిగిలి వుండాలి !" మీ పేరు మిగిలి వుండడం వలన ప్రయోజనం ఏమిటి ? మరెవరికీ మీ పేరు పట్ల ఆసక్తి లేదు. స్వయానా మీరే పోయినప్పుడు, ఎవరు పట్టించుకోబోతున్నారు ? మీరే మృత్యువు నుంచి రక్షింపబడలేనప్పుడు, మరణించడం నుండి మీ పేరు రక్షింపబడుతుందా ? మీరు సజీవంగా ఉంచబడలేరు ; కేవలం ఓ సూచిక మాత్రమే అయిన ఈ పేరు ఎలా రక్షించబడుతుంది ? మీ పేరు గురించి ఎవరు పట్టించుకుంటారు ? కనుక మీ పేరు ఉన్నా కూడా ఏమవుతుంది ? ఏదో పాత పుస్తకాలలో అది మరుగున వుంటుంది, అది అక్కడ దుఃఖిస్తూ వుంటుంది. అలెగ్జాండర్ యొక్క పేరు అక్కడ వుంది, నెపోలియన్ యొక్క పేరు అక్కడ వుంది ... అయితే ఏంటి ? కానీ లేదు, ఈ రుగ్మతలు చిన్నతనం నుంచే మనకు బోధించబడ్డాయి. బాల్యం నుంచే మనకు చెప్పబడింది, " నువ్వు చనిపోయే ముందు ఏదైనా చెయ్యి. ఏమీ చేయకుండా మరణించవద్దు. నువ్వు చేయగలిగితే కనుక ఏదైనా మంచిని చెయ్యి ; లేకపోతే కనుక, ఏదైనా చెడును చెయ్యి ... కానీ నీకై పేరు గడించుకో. ప్రజలు చెబుతారు, " నీకు చెడ్డపేరు వస్తే మాత్రం ఏమవుతుంది ? ... కనీసం నీ పేరు ప్రఖ్యాతమవుతుంది. నువ్వు సరైన మార్గాన్ని కనుగొనకపోతే కనుక, అప్పుడు ఏదైనా వెర్రిపని చెయ్యి, కానీ నీకై పేరును గడించుకో ! "

ప్రజలు ఎంత వెర్రివారంటే వాళ్ళు పర్వతాల వద్దకు వెళ్ళినప్పుడు ఆ శిలల మీద వాళ్ళు తమ పేర్లను చెక్కుతారు. వాళ్ళు వెళ్ళి ఓ పురాతన కోటను సందర్శించినప్పుడు ఆ గోడలపై వాళ్ళు తమ పేర్లను వంకరటింకరగా వ్రాస్తారు. తన పేరును వ్రాసుకుంటున్న మనిషి తన పేరును వ్రాసేందుకై మరొకరి పేరును చెరిపేస్తున్నాడు అనేది చూసుకోడు : మరెవరో వస్తారు మరి అతనిది చెరిపేసి దానిపై వ్రాస్తారు. మీరు మరెవరిదో చెరిపేశారు. ఇతరుల యొక్క వ్రాతపై మీరు వ్రాస్తున్నారు మరి అది కూడా పెద్ద అక్షరాలలో. ఇంకెవరైనా వస్తే కనుక వాళ్ళు మరింత పెద్ద అక్షరాలలో వ్రాస్తారు. మీరు ఎలాంటి ఉన్మాదంలో పడిపోయారు ?

అందమైన కోరికలు అనేక కలల గూళ్ళను అల్లాయి,
త్రొక్కివేయబడిన అనేక భావనలు ఓ కాంతితో పైకి లేచాయి.
సౌందర్యం యొక్క మైకం, ప్రేమ యొక్క మత్తు,
పేరు యొక్క ఖ్యాతి, సంపద యొక్క గర్వం,

మానవుడి కోసం భ్రాంతి యొక్క వలలు అనేకం పరచి వున్నాయి.
ప్రతి ఒక్కరూ తమ స్వంత గమ్యానికి మరి ప్రతి ఒక్కరూ తమ స్వీయస్వభావానికి,
ఆనందం చేత త్రొక్కివేయబడి అనేకమంది ఉన్నారు,
దుఃఖం చేత సమృద్ధమై అనేకమంది వున్నారు.
మానవుల యొక్క క్షామం వుంది, ప్రపంచం యొక్క సమయం కఠినంగా గడుస్తోంది.
గడచిపోయిన క్షామాలు అనేకం,
కానీ ఇంతటి కఠిన సమయాలు ఎప్పుడు వచ్చాయి.
హృదయం యొక్క సంపద అరుదుగా కనిపిస్తోంది,
సంపద పుష్కలంగా కనిపించినా కూడా,
హృదయాలు రిక్తంగా ఉన్న సంపన్నులు అనేకమందిని నేను చూశాను.
అచేతనపు లోతులలో ఎన్ని దృశ్యాలు అంతర్గర్భితమై వున్నాయి...
చైతన్యపు ప్రపంచం ఒకటే,
అచేతనపు అడుగున వున్న ప్రపంచాలు అనేకం.

... అచేతనపు లోతులలో ఎన్ని దృశ్యాలు అంతర్గర్భితమై వున్నాయి ?

మన అచేతనం ఇదే : అందులో అనేక దృశ్యాలు దాగి వున్నాయి... దృశ్యం తరువాత దృశ్యం, పరదాల వెనుక పరదాలు, కథల లోపల కథలు ! మన అచేతనం ఇదే : దానిలో ఎన్నో నరకాలు దాగి వున్నాయి... సంపదకు చెందినవి, అధికారానికి చెందినవి, కీర్తికి చెందినవి, కలలకు చెందినవి... ఆ వలలు సిద్ధం చేయబడి వున్నాయి ?

అచేతనపు లోతులలో ఎన్ని దృశ్యాలు అంతర్గర్భితమై వున్నాయి...
చైతన్యపు ప్రపంచం ఒకటే,
అచేతనపు అడుగున వున్న ప్రపంచాలు అనేకం.

కానీ జాగృతుడైన వ్యక్తి ... అతని ప్రపంచం ఒకటే, అతని స్వభావం ఒకటే, అతని ఉనికి ఒకటే, అతని రుచి ఒకటే. బుద్ధుడు చెప్పాడు, " మీరు మహాసాగరాన్ని ఎక్కడ రుచి చూసినా అది ఉప్పగానే వుంటుంది ... అదే విధంగా, మీరు నన్ను రుచి చూస్తే కనుక, నేను నిలువెల్లా పూర్తి చైతన్యంతోనే వుంటాను. నేను కేవలం ఒకే రుచిని కలిగి వున్నాను : చైతన్యం."

అష్టావక్రుడి యొక్క రుచి కూడా ఇదే. కర్త కాదు, అనుభవించే మరి వేదన పొందేవాడు కాదు ... ఓ సాక్షి.

కనుక " ఎలా ?" అని అడుగవద్దు... ఎందుకంటే " ఎలా " అనేదానితో కర్త లోనికి వస్తాడు, ఆస్వాదించేవాడు లోనికి వస్తాడు... అప్పుడు మీరు కోల్పోతారు, అష్టావక్రుడి సందేశాన్ని మీరు చేజార్చుకుంటారు. అష్టావక్రుడు చెబుతున్నాడు, " ఏదైతే ఉందో, దానిని గమనించండి. ఓ సాక్షిగా ఉండండి. కేవలం వీక్షించండి. అహం ఉంటే కనుక అప్పుడు అహాన్ని వీక్షించండి. చేసేందుకు ఇంకేముంది ? కేవలం వీక్షించండి ... మరి వీక్షించడం ద్వారా, ఆ రూపాంతరీకరణ సంభవిస్తుంది."

మీరు అవగాహన చేసుకుంటున్నారా ? అది కొద్దిగా సూక్ష్మమైనది, కానీ మీరు దానిని అవగాహన చేసుకోలేనంత సూక్ష్మమైనది కాదు. అది ముక్కుసూటిగానూ వుంటుంది. కేవలం గమనించమని అష్టావక్రుడు చెబుతున్నాడు, మరి మీరు గమనించినప్పుడు కర్త అనేవాడు కనుమరుగైపోతాడు, కేవలం సాక్షి మాత్రమే మిగిలి వుంటాడు. కర్త వెళ్ళిపోవడంతో కర్త నుంచి శక్తిని పొందిన, దాని నుంచి బలం పొందిన ప్రతీదీ తొలగిపోతుంది. కర్త లేకుండా ఎవరైనా డబ్బు వెనుక పరుగెత్తడం, అధికారం వెనుక పరుగెత్తడం ఎలా చేయగలరు ? కర్త లేకుండా అహం ఎక్కడ వుంటుంది ? ఇవన్నీ తమంతట తామే తొలగిపోతాయి.

కేవలం ఒక్క విషయంలో ప్రవీణులవ్వండి ... సాక్షిగా ఉండడం. చేయవలసినది ఇంకేమీ లేదు. సకలమూ తనంతట తానే సంభవిస్తుంది. మిగిలినదంతా కొనసాగుతూనే వుంటుంది, ఎల్లప్పుడూ : అనవసరంగా మీరు దారిలో అడ్డుపడడం ఎందుకు ?

నేను విన్నాను : ఒక ఏనుగు ఓ వంతెనను దాటుతోంది. దాని బరువు వలన ఆ వారధి కంపించడం ప్రారంభించింది. ఒక ఈగ దాని తొండంపై కూర్చుని వుంది. అవి రెండూ ఆ ఒడ్డుకు చేరుకున్న తరువాత, ఆ ఈగ అంది, " బాబూ ! మనం నిజంగానే ఆ వారధిని కంపించేలా చేశాం ! "

ఆ ఏనుగు అంది, " తల్లీ, నువ్వు మాట్లాడేంతవరకూ నువ్వు ఇక్కడ ఉన్నావు అనేది కూడా నేను గమనించలేదు."

మీరే ఆ వారధిని కంపింపజేస్తున్నారని మీరు అనుకుంటారు, కానీ ఆ వారధిని కంపింపజేస్తున్నది మీరు కాదు, అది జీవశక్తి. మీరు జీవశక్తిపై కూర్చుని వుండి మరి " బాబూ ! నేను దానిని ఎలా కంపింపజేశానో చూడు !" అని అంటున్న ఈగ లాంటివారు.

ఈ అహం కేవలం మీపై కూర్చుని వుంది. మీ అపరిమిత శక్తి నుంచే సకలమూ సంభవిస్తోంది. అది అస్తిత్వం యొక్క శక్తి ... మీకు దానితో ఏ నిమిత్తమూ లేదు. ఇదే శక్తి మీలో శ్వాసిస్తుంది, మీలో మేల్కొంటుంది, మీలో నిదురిస్తుంది. మరి దీనంతటి మధ్య మీరు అక్కడ అహంభావంతో నిలబడి వుంటారు. ఇంతవరకూ నిశ్చయం, మీ దురభిమానానికి అది అభ్యంతరం చెప్పదు. కనీసం ఆ ఏనుగు అభ్యంతరం చెప్పింది. ఆ ఏనుగు అంది, " తల్లీ, నువ్వు నాపై కూర్చుని ఉన్నావు అనేది కూడా నేను గమనించలేదు." కనీసం ఆ ఏనుగు ఈ మాత్రమైనా అంది. అస్తిత్వం ఇది కూడా అనదు ... అది మౌనంగా వుంటుంది. మీరు అహంభావులైతే కనుక, అది మిమ్మల్ని అలానే ఉండనిస్తుంది. అది చేసిన పనిని మీరే చేసినట్లు మీరు వాదిస్తే కనుక, అది మిమ్మల్ని అలా అననిస్తుంది. వాస్తవానికి మీరు దానిని చేయకపోయినాగానీ ఏదైనా పనిని మీరే చేస్తున్నట్లుగా మీరు చెబితే కనుక, అప్పుడు సైతం అది జోక్యం చేసుకోదు మరి, " లేదు, నేను దానిని చేస్తున్నాను," అని చెప్పదు. దానికి ' నేను ' అనేది లేదు ; " నేను దానిని చేస్తున్నాను," అని అది మీకు ఎలా చెప్పగలదు ? కనుక మీ భ్రాంతి కొనసాగుతూనే వుంటుంది.

కానీ దగ్గరగా చూడండి, మీ కళ్ళను కొద్దిగా తెరువండి మరి చూడండి. మీరు ఏమీ చేయడం లేదు. ప్రతీదీ తనంతట తానే జరుగుతోంది.

ఇదే విధి యొక్క అసమానమైన కల్పన, గతి యొక్క అసదృశమైన కల్పన : ప్రతీదీ తనంతట తానే జరుగుతోంది. ప్రజలు దానికి అయుక్తమైన అర్థాలను ఇచ్చారు. అది వాళ్ళ తప్పు. లేదంటే, విధి అంటే కేవలం ఏమిటంటే ... మీరు విధి యొక్క భావనను సవ్యంగా అవగాహన చేసుకుంటే కనుక, మీరు ఓ సాక్షిగా వుంటారు మరి చేయడానికి మరింకేమీ వుండదు. కానీ ప్రజలు ఓ సాక్షిగా తయారవ్వరు, వాళ్ళు సోమరులుగా తయారవుతారు. వాళ్ళు అకర్తలుగా తయారవ్వరు. వాళ్ళు బద్ధకస్తులుగా తయారవుతారు.

అకర్మ మరి సోమరితనాల మధ్య వ్యత్యాసం వుంది. సోమరితనం అనేది బద్ధకం, ఒళ్ళు వంగకపోవడం, మృతమైనది. అకర్మ అనేది శక్తితో నిండి వుంటుంది ... " నేను చేస్తున్నాను " అని ఒకరు ఆలోచించరు, " అస్తిత్వం చేస్తోంది, నేను కేవలం వీక్షిస్తున్నాను. ఈ క్రీడ కొనసాగుతోంది, నేను గమనిస్తున్నాను," అని అనుకుంటారు.

మానవుడు అత్యంత వంచకుడు. అతను అత్యంత సుందరమైన సత్యాలను సైతం అసహ్యకరమైన విధానంలో ఉపయోగిస్తాడు. విధి అనేది ఓ అత్యంత సుందరమైన

సత్యం. దాని అర్థం ఏమిటంటే సకలమూ తనంతట తానే సాగిపోతూంటుంది, మీరు ఏదీ చేయడం లేదు. అంతా నిర్ణయించబడివుంటుంది : ఏది ఉంటుందో, అది ఉంటుంది; ఏది ఉండాలో, వుంది ; ఏది సంభవించాల్సి వుందో, సంభవించింది. మీరు ఒడ్డున నిశ్శబ్దంగా కూర్చోవచ్చు మరి ఆ క్రీడను వీక్షించవచ్చు. దాని మధ్యలోకి దూకాల్సిన అవసరం మీకు లేదు. మీరు ముందుకూ వెనుకకూ పరుగెత్తడం వలన ఏ వ్యత్యాసమూ ఉండదు. ఏది సంభవించాలో అది సంభవిస్తోంది, ఏది ఉంటుందో, అది ఉంటుంది. అప్పుడు మీరు ఓ సాక్షి అవుతారు.

మిమ్మల్ని సాక్షీతత్వం వద్దకు చేర్చేందుకే విధి అనే భావన కల్పించబడింది. కానీ ప్రజలు సాక్షీతత్వంలోనికి కదలలేదు. వాళ్ళు సోమరులుగా తయారయ్యారు. వాళ్ళు అంటారు, ‘ ఏదీ జరగాలో, అదే జరుగుతున్నప్పుడు, మంచిది, మేము ఏదైనా చెయ్యడమెందుకు ? విధి అంటే మాకు చేసే అధికారం లేదు అని అర్థం ; మేము ఎందుకు చెయ్యాలి ?" తాము ప్రపంచానికి చూపుతామని వాళ్ళు ఇంతకుముందు చెప్పారు ; చెయ్యడంలో ఏమీ లేదని వాళ్ళు ఇప్పుడు చెబుతున్నారు ! కానీ కర్త యొక్క భావన అనేది పోలేదు, అది అదే స్థానంలో నిలిచి వుంటుంది.

మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకుంటే కనుక అప్పుడు ఏ రీతీ వుండదు, ఏ సాధనా వుండదు : సాధన అనేది బంధనమనీ, రీతులు అనేవి బంధనమనీ, కర్మ అనేదే స్వయంగా బంధనమనీ అష్టావక్రుడు చెబుతాడు.

నాలుగవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

మీ అనుగ్రహం వలన నేను ఆకాశాన్ని చూడగలుగుతున్నాను. నేను ప్రకాశాన్ని అనుభవిస్తున్నాను మరి అంతర్గత ప్రవాహంతో ఏకమవుతున్నాను కూడా. కానీ కామం నన్ను అధిగమించినప్పుడు, ధ్యానంలో ఉన్నంతగానూ నేను దానిలో మునిగిపోవాలని కోరుకుంటున్నాను. దయచేసి నా యొక్క ఈ పరిస్థితిని వివరించండి ?

మొదటి విషయం : కామానికి కూడా ఓ సాక్షిగా ఉండండి. దానిని నియంత్రించేవారుగా ఉండకండి. దానిని బలవంతంగా నియంత్రణలోనికి తేవడానికి ప్రయత్నించకండి ; దానికి కూడా ఓ సాక్షిగా ఉండండి. మిగిలిన అన్నింటికీ మీరు ఓ సాక్షిగా ఉన్నట్లుగానే, కామానికి కూడా ఓ సాక్షిగా ఉండండి.

అది కష్టతరమైనది, ఎందుకంటే కామం అనేది ఒక పాపం అని శతాబ్దాల తరబడి మీకు బోధించబడింది. కామం గురించిన ఆ భావన మీ మనస్సులో స్థిరపడిపోయింది.

ఈ విశ్వంలో పాపం అనేది లేదు ... కేవలం దైవత్వం మాత్రమే వుంది. ఆ భావనను వదిలెయ్యండి. ఈ విశ్వంలో కేవలం ఒక్కటి మాత్రమే వుంది ... అది అంతటా వ్యాపించి వుంది... అదే దైవత్వం. సూక్ష్మమైనవాటన్నింటిలోకీ సూక్ష్మమైన దానిలోనూ, విస్తారమైనవాటన్నింటిలోకీ విస్తారమైనదానిలోనూ అది వుంది. అధమమైనదానిలోనూ, అత్యున్నతమైనదానిలోనూ అది వుంది. కామంలో అది వుంది. సమాధిలో సైతం అది వుంది. ఇక్కడ ఏ పాపమూ లేదు.

మీరు కామంలోనే చిక్కుబడిపోయి వుండిపోండి అని నేను సూచిస్తున్నాను అనేది దీని భావం కాదు. నేను కేవలం చెబుతున్నది ఏమిటంటే : దానిని సైతం దైవత్వం యొక్క ఓ రూపంగానే అవగాహన చేసుకోండి. ఇతర రూపాలూ వున్నాయి. బహుశా, కామం అనేది దాని రూపాల యొక్క మొదటి స్థాయి. కామపు అనుభవంలో సమాధి యొక్క స్వల్ప రుచి ప్రతిబింబిస్తుంది, అందువలనే అంత ఆకర్షణ. దానికన్నా ఉత్తమమైన సమాధులు సంభవించడం మొదలైనప్పుడు, ఆ ఆకర్షణ దానంతట అదే మాయమైపోతుంది.

ఈ మిత్రుడు చెప్పినదేమిటంటే, ధ్యానంలో మునిగిపోయి, " అంతర్గత ప్రవాహంతో నేను ఏకమవుతాను. కానీ కామం నన్ను అధిగమించినప్పుడు, అంతగానూ నేను దానిలో మునిగిపోవాలని కోరుకుంటున్నాను..." మునిగిపోండి ! ఆగవలసిన అవసరం లేదు. మీరు మునిగిపోతూండగా కేవలం ఓ సాక్షిగా వుండండి. మీరు దిగువకు వెళుతున్నారు అనేది గమనిస్తూ ఉండండి. కామం మిమ్మల్ని పరివేష్ఠించిందని గమనిస్తూ ఉండండి.

నిజానికి కామం అనే పదం నిందను మనస్సులోకి తెస్తుంది. దాని గురించి ఈ విధంగా ఆలోచించండి : ఒక విధమైన దైవత్వం మిమ్మల్ని పరివేష్ఠించింది, ఈ దివ్యశక్తి మిమ్మల్ని పరివేష్ఠించింది, ఈ దివ్య ప్రకృతి మిమ్మల్ని పరివేష్ఠించింది, దివ్య మాయ మిమ్మల్ని పరివేష్ఠించింది. కానీ కామం అనే పదాన్ని వినియోగించకండి. ఆ పదంతో అనుసంధానమైవున్న సనాతన సహవాసాలు అయుక్తమైనవి ; దానిని పాపంలా కనిపించేలా చేస్తాయి. అప్పుడు ఓ సాక్షిగా ఉండడం కష్టతరమవుతుంది ... అయితే మీరు అచేతనంగానైనా అయిపోతారు లేదా మీరు నియంత్రిస్తారు. ఓ సాక్షిగా ఉండడం

అనేది అచేతనమైపోవడమూ కాదు, నియంత్రించడమూ కాదు ... అది ఈ రెండింటికీ మధ్య స్థిరంగా నిలబడడం. ఈ వైపు మీరు ఓ గుంటలో పడిపోతారు, మరో వైపు మీరు బావిలో పడిపోతారు ... మధ్యలో ఉండండి ; దీనిలో ప్రవీణులవ్వండి... అనంతరం సమాధి.

రెండూ సులభమైనవే : కామంలో అచేతనమైపోవడం, ఏమి జరుగుతోంది అనేది పూర్తిగా విస్మరించడం ఎంతో సులభం. మైకంలో పడిపోవడం సులభం. కామాన్ని నియంత్రించడం, ఆగిపోయేలా దానిని బలవంతపెట్టడం, మిమ్మల్ని మీరు నిరోధించడం కూడా సులభమే. కానీ రెండింటిలోనూ మీరు చేజార్చుకుంటారు. మమేకమైపోయినవారు చేజార్చుకుంటారు ; బ్రహ్మచారులు సైతం చేజార్చుకుంటారు. మీరు ఈ రెండింటికీ మధ్యన నిలిచి వున్నప్పుడు మాత్రమే వాస్తవమైన బ్రహ్మచర్యం సంభవిస్తుంది ; అప్పుడు మీరు కేవలం గమనిస్తూ వుంటారు. అప్పుడు కామం శరీరంలో జనిస్తుంది మరి శరీరంలోనే ప్రతిధ్వనిస్తుంది అనేది మీరు కనుగొంటారు; మనస్సులో ఓ నీడ సంక్షిప్తంగా పడుతుంది మరి వెళ్ళిపోతుంది. మీరు సుదూరంలో నిలబడి వుంటారు. కామపరమైన కాంక్ష మీలో ఎలా వుండగలదు ? ఏ కాంక్ష అయినా మీలో ఎలా ఉండగలదు ? మీరు గమనించేవారే తప్ప మరేమీ కాదు.

సాధారణంగా జరిగేది ఏమిటంటే ధ్యానం చక్కగా సాగడం మొదలైనప్పుడు మీ కామపరమైన కాంక్ష బలపడుతుంది. దీనిని అవగాహన చేసుకోండి, ఎందుకంటే అనేకమందికి ఇది జరుగుతుంది. ధ్యానం చక్కగా సాగుతున్నప్పుడు, మీ జీవితం యొక్క లయలోకి మీరు విశ్రమించడం ఆరంభించినప్పుడు, ఆందోళన తక్కువగా వుంటుంది. అప్పుడు ఎన్నో జన్మలుగా మీరు కామంపై బలవంతంగా ప్రయోగిస్తున్న అణచివేత పోతుంది. అప్పుడు నిరోధించబడిన కాంక్ష ఒక అగ్నిపర్వతంలా లేస్తుంది. కనుక ధ్యానంతో కామపరమైన కాంక్ష వృద్ధి చెందితే కనుక, దిగులు పడకండి ; అది ఓ చక్కని సంజ్ఞ, అది ధ్యానం చక్కగా పురోగమిస్తోంది అనేదానికి సూచిక. ఆ ధ్యానం చక్కని పని చేస్తోంది. ధ్యానం మీ ఆందోళనలను వదిలిస్తోంది, మీ నియంత్రణను తొలగిస్తోంది, మీ అణచివేతలను వదిలిస్తోంది. మీ సహజత్వం దిశగా ధ్యానం మిమ్మల్ని తీసుకువెళ్తోంది.

మొదట ధ్యానం మిమ్మల్ని సహజమైనవారుగా చేస్తుంది, మరి అప్పుడు అది మిమ్మల్ని దైవత్వం వద్దకు తీసుకువస్తుంది... ఎందుకంటే ఇంకా సహజం కాని దానిని దాని ప్రగాఢ స్వభావం వద్దకు తీసుకురావడం అసాధ్యం. ఇంకా సహజం కానిది దైవత్వాన్ని చేరుకోలేదు. కనుక ధ్యానం మొదట మిమ్మల్ని సహజత వద్దకు

తీసుకొస్తుంది, అనంతరం మిమ్మల్ని దైవత్వం వద్దకు తీసుకొస్తుంది. ప్రకృతి అనేది దైవత్వం యొక్క బయట ముసుగు. మీరు దానితో మేళనంలో లేకపోతే కనుక, అత్యాంతరిక దైవత్వంతో మీరు మేళనంలో ఎలా ఉండగలరు ? ప్రకృతి అనేది ఆలయం యొక్క సోపానాలు. మీరు సోపానాలను అధిరోహించకపోతే కనుక, అప్పుడు మీరు ఆలయపు గర్భగుడిలో ఎలా ప్రవేశిస్తారు ?

నేను చెబుతున్నదానిని మీరు అవగాహన చేసుకోగలిగితే కనుక, ఇక ఎంతమాత్రం అణచుకోకండి. ఇప్పుడు దానిని నిశ్శబ్దంగా సమ్మతించండి. ఈ అస్తిత్వం మీకు ఏదైతే చూపుతుందో అది మంచిదే అయివుంటుంది. అస్తిత్వం దానిని సమర్పిస్తోంది, కనుక అది మంచిదే అయివుండాలి. నియంత్రించకండి, నిర్ణయించేవాడితో ఏకమవ్వకండి, " ఇది మంచిది మరి అది చెడ్డది " ; " నేను దీనిని చెయ్యాలనుకుంటున్నాను మరి దానిని చెయ్యాలనుకోవడం లేదు." అని అనకండి. కేవలం గమనించండి.

వయస్సు మీద పడుతోంది,
కోరికల క్రొవ్వొత్తి కరిగిపోతోంది,
నెమ్మది నెమ్మదిగా ఆ జ్వాల ఆరిపోతోంది.
వాంఛలన్నీ సర్దుకుంటున్నాయి,
వ్యామోహాల వరద తగ్గిపోతోంది,
సుఖాలు క్షీణిస్తున్నాయి.
నిశ్శబ్దపు రంగు గాఢమవుతోంది,
ఆ జ్వాల ఆరిపోతోంది.

అది చక్కగా సాగిపోతోంది. కానీ ఆ జ్వాల ఆరిపోయే ముందు చివరిగా ఒక్కసారి అది భగ్గుమంటుంది. మీరు వైద్యులను అడుగవచ్చు... మరణించబోయే ముందు ఒక మనిషి కొద్దిసేపు పూర్తి ఆరోగ్యంగా అవుతాడు. అన్ని లక్షణాలూ మాయమవుతాయి. మంచంపైన ఓ శవంలా పడివున్నవాడు లేచి కూర్చుంటాడు, తన కళ్ళను తెరుస్తాడు మరి తిరిగి బలం పుంజుకున్నట్లు కనిపిస్తాడు. కేవలం మరణించడానికి కొద్దిగా ముందు అన్ని లక్షణాలు మాయమైపోతాయి ఎందుకంటే జీవితం తన చివరి గంతును వేస్తోంది, జీవశక్తి మరొక్కసారి పైకిలేస్తుంది.

ఓ మట్టిదీపం ఆరిపోబోయే ముందు అది చివరిగా ఒక్కసారి భగ్గుమనడం మీరు చూశారు. చివరి చమురు మండిపోగానే, అది అఖరి చమురు బిందువును త్రాగుతుంది మరి భగ్గుమంటుంది. దాని జ్వాల చివరి సారిగా బద్దలవుతుంది. ప్రాతః

కాలానికి ముందు రాత్రి ఎంత చీకటిగా వుంటుందో మీరు చూశారు. అది అంధకారం యొక్క చివరి విస్ఫోటనం.

మీరు ధ్యానంలోకి లోతుగా వెళ్ళినప్పుడు అదే అవుతుంది. ఆ జ్వాల ఆరిపోబోయే ముందు జ్వాల యొక్క చివరి విస్ఫోటనం... కామ శక్తి ఉదయించడం మీరు కనుగొంటారు.

వయస్సు మీద పడుతోంది,
కోరికల క్రొవ్వొత్తి కరిగిపోతోంది...

కోరికల దీపం కరిగిపోతోంది, జీవితం ఆరిపోతోంది...

... నెమ్మది నెమ్మదిగా ఆ జ్వాల ఆరిపోతోంది.
వాంఛలన్నీ సర్దుకుంటున్నాయి,
వ్యామోహాల వరద తగ్గిపోతోంది...

జీవితం యొక్క ప్రవాహం ఆగిపోతోంది ...

సుఖాలు క్షీణిస్తున్నాయి
నిశ్శబ్దపు రంగు గాఢమవుతోంది...

ధ్యానం యొక్క రసం వృద్ధి చెందుతోంది. నిశ్శబ్దం యొక్క రసం గాఢమవుతోంది.

నిశ్శబ్దపు రంగు గాఢమవుతోంది,
ఆ జ్వాల ఆరిపోతోంది.

ఈ స్థితిలో జ్వాల యొక్క విస్ఫోటనం ఏ క్షణమైనా భగ్గుమంటుంది. అటువంటి జ్వాల మీలో భగ్గుమంటోంది... దానిని గమనించండి. దానిని అణచివేయకండి, లేదంటే అది మళ్ళీ మీలోకి వెళ్ళిపోతుంది. దాని నుంచి స్వతంత్రులవ్వడానికి మీరు అతి చేరువలో ఉన్నారు ; దానిని అణచివేయకండి, లేదంటే ఆ దాస్యం మళ్ళీ మొదలవుతుంది. ఏదైతే అణచివేయబడిందో అది మళ్ళీ మళ్ళీ భగ్గుమంటుంది. మీరు నిర్బంధంగా క్రిందకు తోసేసినది మళ్ళీ మళ్ళీ వస్తుంది. దానిని వెళ్ళిపోనివ్వండి, దానిని బయటకు రానివ్వండి, దానిని బయటకు ప్రవహించనివ్వండి. అది ఎంత ఎత్తుగా భగ్గుమన్నా, మీరు ప్రశాంతంగా వీక్షిస్తూ వుండండి. అది మీ ధ్యానంలో జోక్యం చేసుకోదు. మీరు సాక్షీతత్వాన్ని కొనసాగించండి.

అయిదవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

ఏ బంధనంలోకీ పడిపోకండి, ప్రశాంతంగా ఉండండి మరి ఆనందంగా ఉండండి అని మీరు చెప్పారు. సన్యాసం సైతం ఓ బంధనమే కదా ? మరి రీతులు, సాధనాలు మరి సాధన సైతం బంధనాలే కదా ? దయచేసి వివరించండి.

మీరు అవగాహన చేసుకుంటే కనుక, అడుగకండి. మీరు అడిగితే కనుక, అప్పుడు మీరు అవగాహన చేసుకోలేదు. ఏ బంధనంలోనూ ఇరుక్కోవద్దనీ, ప్రశాంతంగా ఉండాలనీ మరి ఆనందంగా ఉండాలనీ మీరు అవగాహన చేసుకుంటే కనుక, అప్పుడు కేవలం ఈ అవగాహన ద్వారానే మీరు ఆనందం పొందుతారు మరి ప్రశాంతంగా వుంటారు. అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎక్కడినుంచి వచ్చింది ? ప్రశాంతంగా మరి ఆనందంగా ఉన్న వ్యక్తులు ప్రశ్నలు అడుగుతారా ? అన్ని ప్రశ్నలూ అసౌఖ్యం నుంచి, వేదన నుంచి, దైన్యం నుంచి జనిస్తాయి. మీరు ఇంకా ప్రశ్నలను అడుగుతున్నట్లయితే కనుక మీరు ఇంకా ప్రశాంతతో లేరు ; మీకు సన్యాస దీక్ష అవసరం. మీరు ప్రశాంతంగా అయితే కనుక, సన్యాసం యొక్క అవసరం ఏముంది ? మీరు ఓ సన్యాసి అయిపోయారు.

కానీ మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. మీకు సన్యాసాన్ని స్వీకరించే ధైర్యం లేకపోతే కనుక, అష్టావక్రుడిని ఓ సాకుగా వినియోగించుకోకండి. అవును, మీరు ప్రశాంతతను సిద్ధించుకుంటే కనుక సన్యాసం యొక్క అవసరమే లేదు. ప్రశాంతత యొక్క అన్వేషణలోనే ఎవరైనా సన్యాసాన్ని స్వీకరిస్తారు. మీరు ఆనందాన్ని పొందితే కనుక, మీరు ఆనందాన్ని పొందుతున్నారని మీరు అనుకుంటే కనుక, మీరు జనకుడంతటి యోగ్యులైతే కనుక, అప్పుడు విషయం ముగిసిపోయినట్లే, కానీ అప్పుడు ఈ ప్రశ్న జనించి వుండేది కాదు. జనకుడు ప్రశ్నలు అడుగలేదు, జనకుడు అన్నాడు, " అద్భుతం, గురుదేవా ! అయితే నేను విముక్తుడినైపోయాను ! ఇప్పటి దాకా నేను మాయ యొక్క వశంలో ఎలా ఉన్నాను అనేది ఆశ్చర్యకర విషయం !" మీరు జనకుడిలా సంసిద్ధులై ఉంటే కనుక మీరు అంటారు, " నేను ఆశీర్వదింపబడ్డాను ! నేను విముక్తుడనయ్యాను ! ఇప్పటివరకూ నేను మాయ యొక్క వశంలో ఉన్నాను !" మీరు మీ ప్రశ్నను అడుగుతూ ఉండరు.

సత్యం ఏమిటంటే, మీ మనస్సులో మీకు సన్యాసం తీసుకోవాలనే కోరిక వుంది, కానీ మీకు ఆ ధైర్యం లేదు. అష్టావక్రుడు చెప్పినది వింటూన్నప్పుడు మీరు అనుకున్నారు, " సన్యాసం అనేది ఓ బంధనం అనేది తెలుసుకోవడం బావుంది ;

ఇప్పుడు దానిలోకి వెళ్ళాల్సిన అవసరమేలేదు." మీరు మీ ఇతర బంధనాలన్నూ వదిలేస్తారా ; లేక కేవలం సన్యాసపు బంధనాన్ని మాత్రమేనా ? మరి మీరు ఇంకా ఓ సన్యాసి కాలేదు ... మీరు అసలు కలిగి లేనిదానిని వదిలేయగల మార్గమే లేదు. ఏ ఇతర బానిసత్వాలను మీరు విసర్జిస్తారు ? మీరు మీ భార్యను వదిలేస్తారా ? మీ ఇంటినా ? మీ డబ్బునా ? మీ అధికారాన్నా ? మీ మనస్సునా ? కర్తనా ? మీరు మీ అహాన్ని విసర్జిస్తారా ? మీకు ఉన్నవాటిలో, మీరు ఇంకేమి విసర్జిస్తారు ?

నిశ్చయంగానే మీరు కలిగివున్నదానినే మీరు విసర్జించడం సాధ్యమవుతుంది. సన్యాసులుగా తయారైనవాళ్ళను, సన్యాసులను ఈ ప్రశ్న అడుగనివ్వండి. మీరు ఇంకా సన్యాసాన్ని స్వీకరించనేలేదు. ఇప్పుడు తాను సన్యాసాన్ని విసర్జించవచ్చా అని ఓ సన్యాసి అడిగితే కనుక దానిని అవగాహన చేసుకోవచ్చు. అతను సన్యాసాన్ని కలిగివున్నాడు, మీరు దానిని కలిగిలేరు. మీకు లేనిదానిని మీరు ఎలా విసర్జిస్తారు? మీకు ఉన్నదాని గురించి అడుగండి. మీరు మీ ఇల్లూ వాకిలిని పరిత్యజించవచ్చా అని అడగండి.

అష్టావక్రుడు చెబుతున్నది సకలమూ వింటూ, మీరు అవగాహన చేసుకోగలిగినది ఇదేనా, సన్యాస దీక్ష అనేది ఓ బంధనం అనేదేనా ? మరేదీ బంధనం కాదా?

మానవుడు జిత్తులమారి. మనస్సు వంచించేది, మనస్సు అతిగా గణించేది : నాకు కావలసిన అర్థాన్ని నేను తీసుకోగలిగితే కనుక అది ఎంతో మంచిది, అప్పుడు నేను కష్టాన్ని తప్పించుకోవచ్చు. సన్యాసం స్వీకరించడం గురించి నేను ఎంతో సందేహించాను ; మార్గ మధ్యంలో నేను అష్టావక్రుడిని కలుసుకోవడం మంచిదయ్యింది. ఆయన చక్కగా వివరించాడు, ఆయన నన్ను సరిచేశాడు ; ఇప్పుడు సన్యాసాన్ని స్వీకరించడం అనే పొరపాటు చేయాల్సిన అవసరమే లేదు."

మీరు అష్టావక్రుడి నుంచి మరేదైనా నేర్చుకుంటారా ?

ప్రజలు నా వద్దకు వచ్చి అంటారు, " మేము ఇప్పుడు ధ్యానాన్ని వదిలెయ్యవా? ... ఎందుకంటే ధ్యానంలో బంధనం వుంది అని అష్టావక్రుడు చెబుతున్నాడు." మీరు సంపదను వదిలేస్తారా ; మీరు అధికారాన్ని వదిలేస్తారా ? లేదా కేవలం ధ్యానాన్ని మాత్రమేనా ? ధ్యానం అనేది ఇంకా సంభవించనేలేదు... కానీ మీరు దానిని వదిలేస్తారా ? ధ్యానం సంభవించి వుంటే మరి మీరు, " నేను దానిని వదిలెయ్యాలా ? " అని అడిగితే కనుక, నేను చెబుతాను, " దానిని వదిలెయ్యండి."

కానీ ధ్యానం చేస్తున్న వ్యక్తి ఎన్నడూ వదిలెయ్యడం గురించి అడుగడు, అతను వదిలెయ్యడం మరి పట్టుకుని వేలాడడం అనేవాటికి అతీతుడై వుంటాడు. అతను అష్టావక్రుడిని అవగాహన చేసుకుంటాడు, అతను పరవశంతో వుంటాడు, ఆనందంతో నిండి వుంటాడు. అతన అంటాడు, "ఉత్తమం, అది పూర్తిగా సత్యం : ధ్యానంలో, స్వయానా ధ్యానమే వీడిపోతోంది. సన్యాసంలో, బంధనాలు తమంతట తామే పోతున్నాయి. సన్యాసం బంధనం కాదు. బంధనాలన్నింటినీ వదిలేందుకు అది ఓ సాధనం మాత్రమే. చివరిలో అది కూడా విసర్జించబడుతుంది."

దానిని ఈ విధంగా అవగాహన చేసుకోండి : మీ పాదంలో ఒక ముల్లు గుచ్చుకుంది, అప్పుడు మీరు మొదటిదానిని బయటకు తీసేందుకై మరొక ముల్లును ఓ సూదిలా వినియోగిస్తారు. రెండవ ముల్లు కూడా ఒక ముల్లే, కానీ అది మొదటి ముల్లును తొలగించేందుకు ఉపయోగపడుతుంది. అప్పుడు మీరు ఆ రెండింటినీ విసిరిపారేస్తారు. మొదటి ముల్లును తొలగించడంతో అది గొప్ప మేలును చేసింది అని అనుకుంటూ మీరు రెండవ ముల్లును ఉంచుకోరు. లేదా అది ఎంత ప్రియమైనదో అని అనుకుంటూ, మొదటి ముల్లు గుచ్చుకున్న ప్రదేశంలోనే మీరు రెండవ ముల్లును మళ్ళీ అక్కడ పెట్టుకోరు.

సన్యాసం అనేది ఒక సూది. ప్రపంచపు ముల్లు మీలో దిగబడి వుంది... దానిని బయటకు తీసేందుకు ఇది ఓ మార్గం. ఒక సూది లేకుండా మీరు దానిని బయటకు లాగగలిగితే కనుక, అది మరింత మెరుగైనదవుతుంది. మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోవడం కన్నా ఉన్నతమైన ఆశీర్వాదం మరేముంటుంది? అప్పుడు సన్యాసం యొక్క ఆవశ్యకత అనేదే ఉండదు. కానీ మిమ్మల్ని మీరు మోసగించుకోవడం లేదు అని రూఢీ చేసుకోండి ! అది వంచన అయితే కనుక, అప్పుడు ధైర్యస్థులవ్వండి మరి సన్యాసంలోనికి దూకండి. మీరు సన్యాసాన్ని సైతం విసర్జించగల యోగ్యులై వుండే ఆ క్షణం కూడా వస్తుంది.

కానీ వదిలేయడానికి ఏమి వుంది ? మీరు అవగాహన చేసుకున్నప్పుడు, వదిలేయడానికి ఏమీ లేదు ... ప్రతీదీ పడిపోయింది. జనకుడు చెప్పినది ఇదే, "ఓ స్వామీ, ఈ శరీరం కూడా విసర్జించబడింది." జనకుడు ఇంకా ఆ శరీరంలోనే ఉన్నాడు, ఆ శరీరం పడిపోలేదు, కానీ జనకుడు అంటాడు, "ఈ శరీరం కూడా విసర్జించబడింది. ఈ సమస్త ప్రపంచం విసర్జించబడింది. సకలమూ విసర్జించబడింది. నేను పూర్తిగా నిస్సంగుడనై, భావోద్వేగాలకు అతీతుడనై ఉన్నాను. మీ బోధనలో ఎంతటి మహోత్కృష్ట నైపుణ్యం వుంది. ఏమి కళ. ఏమీ సంభవించలేదు, నేను

రాజసౌధాన్ని వదిలివెళ్ళలేదు, ప్రపంచాన్ని వీడిపోలేదు, శరీరాన్ని వదిలేయలేదు ... మరి అయినాగానీ నేను అన్నింటినీ వదిలేశాను !"

మీరు దానిని అవగాహన చేసుకున్న రోజు, వదిలేసేందుకు ఏమీ లేదు... ప్రపంచమూ లేదు మరి సన్యాసమూ లేదు. పట్టుకుని వేళ్ళాడేందుకు ఏదో వుంది అని అనుకునే మనిషికి మాత్రమే వదిలేయడం అనే భావన కలుగుతుంది.

పరిత్యజించడం అనేది కేవలం మమేకమైపోయి ఉండడం అనేదాని యొక్క నీడ. పరిత్యాగి అనేవాడు తన శిరస్సుపై నిలబడి వున్న ఓ లౌకిక వ్యక్తి మాత్రమే. ప్రపంచం అనేది పోయినప్పుడు, పరిత్యాగం అనేది కూడా పోతుంది. ఈ రెండూ కలిసే జీవిస్తాయి మరి కలిసే సెలవు తీసుకుంటాయి. ఇందువలనే మీరు పరిత్యజించినవారి పాదాల వద్ద ప్రాపంచికులను చూస్తారు... వాళ్ళు కలిసే వుంటారు. పరిత్యాగి సగం పనిని చేస్తాడు. ప్రాపంచికుడు మిగిలిన సగం చేస్తాడు ... అవి ఒకటిగా కలుపబడతాయి. పరిత్యాగులు లేకుండా ప్రాపంచికులు జీవించలేరు. ప్రాపంచికులు లేకుండా పరిత్యాగులు జీవించలేరు. ఈ కుట్రను మీరు చూశారా ?

ఒక మనిషి నా వద్దకు వచ్చి అన్నాడు, " నేను ధ్యానం చెయ్యడం నేర్చుకోవాలనుకుంటున్నాను."

అతను ఓ సన్యాసి, ఒక పురాతన తరహా సన్యాసి. కనుక నేను అన్నాను, " మంచిది ... ఉదయపు ధ్యానానికి రండి "

అతను అన్నాడు, " అది కొంచెం కష్టం."

నేను అన్నాను, " ఎందుకు, దానిలో కష్టతరమైనది ఏముంది ?"

అతను అన్నాడు, " సమస్య ఏమిటంటే, నాతో వచ్చిన ఈ మనిషి లేకుండా నేను రాలేను, ఎందుకంటే డబ్బును అతను ఉంచుకుంటాడు, నేను డబ్బును ముట్టుకోను. అతను ఉదయం మరెక్కడికో వెళ్ళాలి, కనుక రేపు ఉదయం నేను రాలేను."

ఇది కేవలం హాస్యాస్పదమైనది ! మీకు డబ్బు అవసరమైతే కనుక, అది మీ జేబులో ఉన్నా లేదా మరెవరి జేబులోనో ఉన్నా దాని వలన ఏం వ్యత్యాసం వుంటుంది ? ఇది మరొక బంధనం అవుతుంది ... తన జేబులో డబ్బును ఉంచుకునే వ్యక్తి మీకన్నా మెరుగైన స్థితిలో ఉన్నాడు, కనీసం తన ఇష్టం వచ్చిన చోటుకు

అతను వెళ్ళగలడు. ఇది ఒక విశేషమైన పరిస్థితి : ఈ మనిషి వెంట వస్తే తప్ప, మీరు రాలేరు ఎందుకంటే టాక్సీ కోసం మీకు డబ్బు ఉండడం అవసరం ... కానీ మీరు డబ్బును ముట్టుకోరు ! కనుక మీరు ఈ మనిషి మీ కోసం పాపం చేసేలా చేస్తున్నాం ? మీ స్వంత పాపాలకు నిబద్ధులై వుండండి ! ఇది మహా వినోదకరమైనది... మీరు టాక్సీ ఎక్కి తిరుగుతారు మరి అందుకోసం అతను నరకానికి వెళ్తాడు ! అతని పట్ల కొద్దిగా కరుణను కలిగివుండండి. ప్రాపంచికులు మరి పరిత్యజించినవారికి మధ్య ఉన్న గొప్ప సంబంధం ఇదే !

మీ పరిత్యాగులందరూ ప్రాపంచిక ప్రజలకు బంధితులై జీవిస్తారు. మీ ప్రాపంచిక ప్రజలు కూడా పరిత్యాగులకు బంధితులై జీవిస్తారు, ఎందుకంటే వాళ్ళు పరిత్యాగుల పాదాలు స్పృశిస్తూ అనుకుంటారు, " ఈరోజు నేను ఓ పరిత్యాగిని కాను, కానీ నేను కనీసం అటువంటి వ్యక్తి పాదాలను స్పృశించగలుగుతున్నాను. ఏదైనా చేసిన సంతృప్తిని నేను పొందగలను ! ఈ రోజు కాకపోతే, రేపు నేను సైతం ఓ పరిత్యాగిని అవుతాను. కానీ ప్రస్తుతం నేను అతనిని పూజించగలను."

మీరు ఎక్కడికి వెళుతున్నానని మీరు జైనులను అడిగితే కనుక తాము సాధువును సేవించడానికి వెళుతున్నామని వాళ్ళు చెబుతారు. అతనిని సేవించడం, ఓ లాభం ... కొంత పుణ్యాన్ని సంపాదించుకోవడం అని వాళ్ళు అనుకుంటారు. అక్కడ ఆ సాధువు కూర్చుని వుండి, ప్రాపంచికులు ఎప్పుడు వస్తారా అని దారి వైపు చూస్తుంటాడు. ఇక్కడ ఆ సాధువు నగరానికి ఎప్పుడు వస్తాడా అని చూసేందుకు ప్రాపంచికులు ఎదురు చూస్తూ వుంటారు. లౌకికులు మరి సాధువులు... ఒకే నాణెం యొక్క రెండు దిశలు.

కొద్దిగా ఆలోచించండి : లౌకికులు సాధువుల వద్దకు వెళ్ళడం మానేస్తే కనుక, ఎంతమంది సాధువులు మిగులుతారు ? వాళ్ళంతా పారిపోవడం మొదలుపెడతారు. విషయాలన్నింటినీ ఎవరు క్రమబద్ధీకరిస్తారు, ఏర్పాట్లన్నింటినీ ఎవరు చేస్తారు ? వాళ్ళంతా వెళ్ళిపోతారు. కానీ ప్రాపంచికులు సాధువు పట్ల శ్రద్ధ వహిస్తుంటారు, మరి సాధువులు ప్రాపంచికుల పట్ల శ్రద్ధ వహిస్తుంటారు ... అది పరస్పరమైనది.

అసలైన జ్ఞాని ఒక పరిత్యాగీ కాదు లోలుడూ కాదు. " నేను సాక్షిని ", అనేది మాత్రమే అతనికి తెలుసు. డబ్బు తన జేబులో ఉందా లేక మరెవరి జేబులోనైనా ఉందా అనేదాని వలన ఇప్పుడు ఏ వ్యత్యాసం వుంటుంది ? అతను సాక్షి. అది ఉంటే కనుక, అతను ఓ సాక్షిగా వుంటాడు, అది లేకపోతే కనుక, అతను ఓ సాక్షిగా

వుంటాడు. నిరుపేద, అతను ఓ సాక్షిగా వుంటాడు ; సంపన్నుడు, అతను ఓ సాక్షిగా వుంటాడు. సాక్షీతత్వంలో పేదరికానికీ మరి సంపన్నతకూ వ్యత్యాసమేముంది ? ఒక యాచకుడు సాక్షిగా అయితే కనుక అతని సాక్షీతత్వం కొంచెం తక్కువగా వుంటుందనీ, మరి ఓ చక్రవర్తి సాక్షిగా అయితే కనుక అతని సాక్షీతత్వం కొంచెం ఎక్కువగా వుంటుందనీ మీరు అనుకుంటున్నారా ? సాక్షీతత్వం అనేది ఎప్పుడైనా తక్కువ లేదా ఎక్కువ అయివుండగలదా ? నిరపేద లేదా సంపన్నుడు, స్వస్థుడు లేదా అస్వస్థుడు, బాగా చదువుకున్నవాడు లేదా నిరక్షరాస్యుడు, అందమైనవాడు లేదా కురూపి, ప్రఖ్యాతి చెందినవాడు లేదా అపఖ్యాతి పొందినవాడు... దాని వలన ఏ వ్యత్యాసమూ ఉండదు.

సాక్షీతత్వం అనేది ప్రతి ఒక్కరి అంతరంగంలోనూ సమానమైన పరిమాణంలో ఉన్న నిధి, దానికి ఎక్కువ లేదా తక్కువ అనేది లేదు.

మీరు ప్రతీ స్థితికీ ఒక సాక్షిగా ఉండఎచ్చు... విజయం, వైఫల్యం ; గౌరవం, అగౌరవం.

ఒక సాక్షిగా ఉండండి, అష్టావక్రుడు చెబుతున్నదంతా ఇదే.

కాని ఒక సాక్షిగా ఉండడమనేది మీకు కష్టతరమైనదిగా అనిపించి మరి మీరు ఏదైనా విధానాన్ని వినియోగించాలని కోరుకుంటే కనుక, అప్పుడు ఓ విధానాన్ని వినియోగిరచండి, భయపడకండి. ఆ విధానాన్ని వినియోగించడాన్ని కొనసాగించడం అనేది ఆ విధానానికి సైతం మీరు ఓ సాక్షిగా అయ్యేందుకు దోహదపడుతుంది. ఇందువలనే నేను చెబుతాను, ధ్యానం చెయ్యండి, మరి దాని గురించి దిగులు పడకండి. ఎందుకంటే మీరు ధ్యానం చేయకపోతే కనుక మీరు ఎన్నటికీ సాక్షీతత్వాన్ని చేరలేరు, ధ్యానం చేయకపోతే మీరు కేవలం ఆలోచించడాన్నే కొనసాగిస్తారని నాకు తెలుసు. కనుక ఎంపిక అనేది ధ్యానం మరి సాక్షీతత్వాల మధ్య లేదు, ఎంపిక అనేది ఆలోచించడానికీ మరి సాక్షీతత్వానికీ మధ్యన వుంది.

నేను చెబుతున్నది ఏమిటో మీరు అవగాహన చేసుకుంటున్నారా ? మీరు ధ్యానం చేయకపోతే కనుక... మీరు అష్టావక్రుడు చెప్పినది విన్నారు, ధ్యానం మరి రీతులు అనేవి బంధనాలు అని అష్టావక్రుడు చెప్పాడు. అతను పూర్తిగా సరైనదే చెప్పాడు, నూటికి నూరు శాతం సరైనది ! కనుక మీరు ధ్యానం చేయడం ఆపేస్తారు. అది ఏం చేస్తుంది ? మీరు ఇప్పుడు ఓ సాక్షి అవుతారా ? లేదు. మీరు కేవలం అవే పురాతనమైన కుళ్ళిపోయిన ఆలోచనలను పునరావృతం చేస్తూ పోతారు. అది ఎంతో

హాస్యాస్పదమైనది : అష్టావక్రుడి వలన మీరు ప్రపంచంలోకి మరింత లోతుగా పడిపోయారు. ఈ నిచ్చెన మీరు పైకి ఎక్కడం కోసం వుంది ! మీరు దానిని క్రిందకు దిగిపోవడం కోసం ఉపయోగించడం ప్రారంభించారు. అవే సోపానాలు !

నేను మీకు ధ్యానం చెయ్యమని చెబుతాను ఎందుకంటే మీ ముందు వున్న ప్రత్యామ్నాయాలు ధ్యానం మరి ఆలోచించడం : ప్రస్తుతం మీకు సాక్షీతత్వం అనేది ఓ ప్రత్యామ్నాయం కాదు. అవును, మీరు ధ్యానం చేయడం కొనసాగిస్తే కనుక మీ ఆలోచనలు అంతమైపోతాయి, అప్పుడు ఒక నూతన ఎంపిక చేసుకోవచ్చు, మరి ధ్యానం చేయడాన్ని విసర్జించవచ్చు.

కానీ మీరు సన్యాసం స్వీకరించకూడదు అని నిర్ణయించుకుంటే కనుక మీరు లోలతలోనే ఉండిపోతారు. ఇప్పుడు ఎంపిక అనేది సన్యాసానికి మరి ప్రపంచానికి మధ్యన వుంది. నేను చెబుతాను, ఇప్పుడు సన్యాసాన్ని స్వీకరించండి, ఒకరోజు ప్రపంచానికి మరి సన్యాసానికీ మధ్యన ఎంపిక అనేది ఇక ఎంత మాత్రమూ ఉండని క్షణం వస్తుంది. ప్రపంచం పోయింది ; సన్యాసం మిగలి వుంటుంది. అప్పుడు ఎంపిక అనేది సన్యాసానికీ మరి అత్యున్నత సన్యాసానికీ మధ్యన వుంటుంది. అప్పుడు నేను మీకు చెబుతాను : సన్యాసం గురించి మరచిపోండి, ఇప్పుడు అత్యున్నత సన్యాసంలోనికి మిమ్మల్ని మీరు ముంచేసుకోండి. అవును, మీరు అవ్యవధిగా వెళ్ళగలిగితే కనుక, జనకుడిలాగా, అప్పుడు నేను అభ్యంతర పెట్టబోవడం లేదు. ఉల్లాసంగా వుండండి ! ఆనందంగా ఉండండి ! మీరు అలా ఉండలేకపోతే కనుక, అప్పుడు మీ కోసం మరెవ్వరూ నిర్ణయించలేరు. మీరు ఆనందంగా ఉండలేకపోతే కనుక, మీరు ఏమి చేయాలనేది మీరు నిర్ణయించుకోవాల్సి వస్తుంది.

మీరు సత్యాన్ని అసత్యంగా మార్చవచ్చు, మరి మీరు పువ్వులను ముళ్ళుగా కూడా మార్చవచ్చు ... అదంతా మీపై ఆధారపడి వుంటుంది.

మూసిన కళ్ళతో వెలుగులో పరుగు తీయకు,
నా సరళ హృదయమా !
దారులన్నీ అవిదితమైనవే.
మార్గంపై నువ్వు ముళ్ళనూ మరి రాళ్ళనూ ఎదుర్కొంటావు.
కేవలం ఓ సుకోమల సుగంధాన్ని ఆఘ్రాణించి,
పువ్వులు మాత్రమే ఉన్నాయని విశ్వసించకు.

జ్ఞాపకం వుంచుకోండి, మీ అడుగులను జాగ్రత్తగా వేయండి. మీరు వేసే అడుగు కేవలం ఓ సుకోమల సుగంధ మాధుర్యం వలనే ఎంచుకోబడకూడదు.

మార్గంపై నువ్వు ముళ్ళనూ మరి రాళ్ళనూ ఎదుర్కొంటావు.
కేవలం ఓ సుకోమల సుగంధాన్ని ఆఘ్రాణించి,
పువ్వులు మాత్రమే ఉన్నాయని విశ్వసించకు.

ఒక సుకోమల సుగంధం మీ వద్దకు వచ్చినప్పుడు, అది కేవలం మీ ప్రసరణ కాదనీ, అది కేవలం మీ అత్యాశ కాదనీ, అది కేవలం మీ భయం కాదనీ, మీరు ప్రసరిస్తున్నది కేవలం మీ బలహీనత కాదనీ జాగ్రత్తగా వుండండి. ఆ మధురమైన, మృదువైన సౌరభం వలన దారి తప్పిపోకండి.

అది ఎంతో సులభమైనదిగా కనిపిస్తుంది ... ఏమీ చేయకపోవడం అనేది. మీరు దానిని విన్నప్పుడు అది సులభమైనదిగా అనిపిస్తుంది, కానీ మీరు ఏమీ చేయకపోవడం అనేదాని వద్దకు వచ్చినప్పుడు, అంతకన్నా కఠినమైనది మరేదీ ఉండదు. సాక్షీతత్వం గురించి వింటున్నప్పుడు అది ఎంతో సులభమైనదిగా అనిపిస్తుంది ... చేయడానికి ఏమీ లేదనీ, మీరు కేవలం వీక్షించాలి అనేది. మీరు దానిని చేయాల్సి వచ్చినప్పుడు మీరు కనుగొంటారు, " ఓహో ! ఇది అత్యంత కఠినమైనది !"

దీనిని ప్రయత్నించండి : మీ గడియారాన్ని మీ ముందు ఉంచుకుని కూర్చోండి. రెండవ ముల్లు తన పరిభ్రమణాన్ని ఒక నిమిషంలో చేస్తుంది. ఆ రెండవ ముల్లును చూడండి, దాని కదలికకు సాక్షిగా వుండండి మరి దానికి సాక్షిగా ఉండడం కొనసాగించేందుకు ప్రయత్నించండి. అది రెండు నుంచి నాలుగు క్షణాలు కదలడం మీరు కనుగొంటారు ... మరి సాక్షి వెళ్ళిపోయి వుంటాడు. మరేదో ఆలోచన వచ్చింది. మీరు మరచిపోయారు. ఆ రెండవ ముల్లు ముందుకు జరిగిపోయిందని మీరు ఆఘాతానికి గురవుతారు. అనంతరం మీరు రెండు నుంచి నాలుగు క్షణాలు ఓ సాక్షిగా వుంటారు, మరి మళ్ళీ మరచిపోతారు. ఒక నిమిషాన్ని పూర్తి చేయడంలో మీరు దానిని రెండు, నాలుగు లేదా పదిసార్లు కోల్పోతారు. ఒక్క నిమిషమైనా మీరు ఓ సాక్షిగా ఉండలేరు.

కనుక ప్రస్తుతం సాక్షి అనే ప్రశ్నే లేదు. ఇప్పుడు మీరు ఆలోచించడం లేదా ధ్యానం చెయ్యడాన్ని ఎంపిక చేసుకోవచ్చు. అప్పుడు, తుదకు, ధ్యానం మరి సాక్షీతత్వాల మధ్య ఎంపిక చేసుకోవడం అనేది సాధ్యమవుతుంది.

మీరు సన్యాసం గురించి అడుగుతున్నారు. సన్యాసం అనేది మీరు నాతో ఉండాలని కోరుకుంటున్నారు అనేదానికీ ఓ సంజ్ఞ మాత్రమే. అది ఓ నిబద్ధత కాదు, మీరు నాకు బంధితులై లేరు. నేను మీకు ఏ క్రమశిక్షణనూ ఇవ్వను. నేను ఏ ప్రవర్తనా నియమావళినీ ఇవ్వను. ఎప్పుడు నిద్ర లేవాలి, ఏమి తినాలి, ఏమి త్రాగాలి ; ఏమి చెయ్యాలి, ఏమి చేయకూడదు అనేది నేను మీకు చెప్పను. ఒక సాక్షిగా ఉండండి అని మాత్రమే నేను మీకు చెబుతాను. నా చేయి అందుబాటులో వుంది, నా చేతిని మీ చేతిలోకి తీసుకోండి అని మాత్రమే నేను మీకు చెబుతాను. బహుశా నాతో కొన్ని అడుగులు వేస్తే, నా వ్యాధి మీకు కూడా అంటుకుంటుంది. ఈ వ్యాధి ఓ అంటువ్యాధి. బుద్ధుడితో కొద్ది దూరం నడవండి మరి అతని రంగు చేత మీరు కొద్దిగా చాయ అద్దబడతారు. మీరు దానిని నిరోధించలేరు. అతని పరిమళంలో కొంత మీ నుంచి కూడా ప్రసరిస్తుంది. మీరు ఒక ఉద్యానవనంలో నుంచి వెళితే కనుక, ఆ పువ్వుల యొక్క పరిమళం మీ వస్త్రాలకు పడుతుంది ... మీరు ఆ పువ్వులను స్పృశించకపోయినా కూడా !

సన్యాసం అనేది కేవలం నాతో తిరగడానికి కొద్దిగా ధైర్యాన్ని చూపడమే, నాతో ఉండాలని కోరుకోవడం యొక్క ఓ వ్యక్తీకరణ మాత్రమే. అది నాతో ప్రేమలో పడడం. ఈ ప్రేమ వెనుక ఉన్న భావన అంతా ఏమిటంటే మీరు స్వతంత్రులుగా ఉండేందుకై నేను ఏర్పాట్లు చేస్తున్నాను. నాతో కలిసి తిరగండి ... నేను మీకు విముక్తి యొక్క సౌరభాన్ని ఇవ్వాలనుకుంటున్నాను.

నేను శ్వాస యొక్క తోలుబొమ్మను.
నేను వృద్ధాప్యానికి బంధింపబడి వున్నాను.
మరి మృత్యువుకు నేను ధారాదత్తం చేయబడ్డాను.
కానీ ప్రేమ అనబడే ఈ విషయం వుంది, తెలుసా నీకు !
దాని వలన, నేను విముక్తుడనయ్యాను.
అనంతకాలం యొక్క ఈ ఆయుధం, భరించేందుకు అసాధ్యమైన భారం,
అద్భుతమైన పసివాడిలాంటి ఒక్కక్షణం చేత సమతులనం చేయబడుతుంది.

మీరు ఏమిటి ?

నేను శ్వాస యొక్క తోలుబొమ్మను.
నేను వృద్ధాప్యానికి బంధింపబడి వున్నాను.
మరి మృత్యువుకు నేను ధారాదత్తం చేయబడ్డాను.

జననం మరి మరణం, మీరు అయివున్నదంతా ఇదే. శ్వాస లోపలికి వస్తుంది మరి బయటకు వెళుతుంది, మధ్యలో ఒక సంక్షిప్త గాథ, ఓ చిన్న నాటకం వుంది. జనన మరణాలకు అతీతంగా మిమ్మల్ని తీసుకెళ్ళగలిగేది ఇక్కడ ఏదైనా ఉంటే కనుక...

కానీ ప్రేమ అనబడే ఈ విషయం వుంది, తెలుసా నీకు !

దాని వలన, నేను విముక్తుడనయ్యాను.

జనన మరణాలకు మధ్యన ప్రేమ సంభవిస్తే కనుక...

సన్యాసం అంటే నాతో ప్రేమలో పడడం అని అర్థం, ఇంతకన్నా ఏమీ లేదు. ఇది చాలు. ఇదే నిర్వచనం. మీరు నాతో ప్రేమలో వుండి మరి నాతో కొంత దూరం పయనించాలని అనుకుంటే కనుక, అప్పుడు ఆ కొంతదూరం పయనించడం అనేది మిమ్మల్ని గొప్ప దూరానికి తీసుకెళ్తుంది.

మిగిలినదంతా ఉపరితలంపైన ఉన్నదే : మీ వస్త్రాల రంగును మార్చడం, మాలను ధరించడం. ఇవి కేవలం ధైర్యాన్ని మేల్కొల్పడానికి మరి మీ ఉనికిని మీరు జ్ఞప్తికి తెచ్చుకునేందుకు సహకరించడానికి మాత్రమే ఉన్నాయి. ఇవి కేవలం బాహ్య ఆరంభాలు మాత్రమే, అప్పుడు అంతరంగంలో ఎంతో సంభవిస్తుంది. ఈ కాషాయ వర్ణం అద్దబడిన వస్త్రాలలో మీరు చూస్తున్నవారిని, కేవలం వాళ్ళ వస్త్రాల వైపు మాత్రమే చూడకండి, వాళ్ళ హృదయాలలోకి కూడా చూడండి ... ప్రేమ యొక్క ఒక నూతన తరంగిణి జనించడం ప్రారంభమవ్వడం మీరు కనుగొంటారు.

కానీ ప్రేమ అనబడే ఈ విషయం వుంది, తెలుసా నీకు !

దాని వలన, నేను విముక్తుడనయ్యాను.

నన్ను మీపై వర్షించనివ్వండి. మీరు ప్రస్తుతం ఓ శిలగానే ఉన్నా కూడా, దిగులు పడకండి : నీటి యొక్క ఈ ప్రవాహం మీ రాతిని కోసేస్తుంది.

కాంతి కిరణం నాపై కురిసినప్పుడు,
నేను అన్నాను...
" నేను శాశ్వత శిల అయిన వజ్రం అంత కఠినమైనవాడను."
ఆ కిరణం అంది, " అలాగా ?
నిజంగా నీ కోసమే నేను అన్వేషిస్తున్నాను.
నేను నీలో నుంచి ఓ మందిరాన్ని మలుస్తాను.
నీ అంతర్భాగం నుంచి నేను ఓ కాంతి విగ్రహాన్ని తొలుస్తాను."

నేను మాటరానివాడనయ్యాను.
ఆ కిరణం తన ప్రగాఢ ప్రేమలో నన్ను ఊయలూపింది.
కాంతి కిరణం నాపై కురిసినప్పుడు,
నేను అన్నాను ...
" నేను శాశ్వత శిల అయిన వజ్రం అంత కఠినమైనవాడను."

మీరు కూడా దీనిని నాతో చెబుతారు, " లేదు, మీరు మమ్మల్ని మార్చలేరు. మేము శిలలం, అతి పురాతనమైన వాళ్ళం ... రూపాంతరం చెందకూడదు అనే ప్రతిజ్ఞను మేము చేశాం."

కానీ నేను మీకు చెబుతున్నాను.

ఆ కిరణం అంది, " అలాగా ?
నిజంగా నీ కోసమే నేను అన్వేషిస్తున్నాను.
నేను నీలో నుంచి ఓ మందిరాన్ని మలుస్తాను.
నీ అంతర్భాగం నుంచి నేను ఓ కాంతి విగ్రహాన్ని తొలుస్తాను."
నేను మాటరానివాడనయ్యాను.
ఆ కిరణం తన ప్రగాఢ ప్రేమలో నన్ను ఊయలూపింది.

ఈ కాషాయ వస్త్రాలు కేవలం నా ప్రేమకు ఓ సూచిక మాత్రమే ... నా పట్ల మీ ప్రేమ, మీ పట్ల నా ప్రేమ. ఇది ఓ ప్రేమ బంధం.

చివరి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

ఓ మనోహర ప్రియతమా, నా కృతజ్ఞతను సమ్మతించండి. ఈ అశ్రువులకు వాటి గమ్యాన్ని అందించండి. మీరు ఈ భిక్షాపాత్రను నింపారు, అయినాగానీ నేను ఎప్పటిలానే రిక్తంగానే ఉన్నాను. శూన్యంగా, అలిఖితంగా. ఓ మనోహర ప్రియతమా, మా సఖా, ఈ శిరస్సు సమర్పించేందుకై ఉన్న ఓ ఫలంలా, మీ చరణాల వద్ద ఉంది.

జయ దీనిని అడిగింది...

జయ అనేక సంవత్సరాలుగా నాకు చేరువై వుంది. సరిగ్గా మీరా యొక్క హృదయం ఆమెకు వుంది. ఆమె హృదయంలో మీరా యొక్క గీతం లాంటిదే పరిక్షిస్తోంది. ఆమె హృదయంలో మీరా యొక్క నృత్యంలాంటిదే దాగి వుంది. అది దర్శనమిచ్చినప్పుడు, తన ఔన్నత్యాన్ని ఆమె సాకారం చేసుకుంటుంది ; అప్పుడు

మరొక మీరా దర్శనమిస్తుంది. కేవలం సరైన క్షణం కోసం నిరీక్షణ... ఏ క్షణమైనా ఆ కాంతిరేఖ దిగి వస్తుంది మరి అంధకారాన్ని తరిమేస్తుంది. ఆమె ధైర్యస్థురాలు... ఇందువలనే అది సంభవిస్తుంది అని ముందుగానే ఊహించవచ్చు.

కానీ ముందుకు సాగిపోతున్న బహుమానమైన ఈ పొగమంచులోనే కదా
మేఘంలాంటి నీ దయ
పగలూ రాత్రీ వర్షిస్తోంది.
అప్పుడప్పుడూ లోనికి తొంగిచూసే నీడే
అత్యున్నత భాష, సాధ్యమైన ఏకైక నామం...
ఓ, దయా నిలయమా.
ఇదే మూల మంత్రం,
ఇదే సారాలన్నింటి యొక్క సారం,
ఇదే లోకుల యొక్క కొలతకు ఏకైక కొలబద్ద,
ఇదే మా కృతజ్ఞతాపూర్వక సాష్టాంగ ప్రణామం.
ఎంతో లోతైనది పొగమంచు కప్పబడిన నీ బావి...
ఎంతో చిన్నవి మా చేతులు.

దైవానికి అభిముఖంగా ఉన్నప్పుడు మన చేతులు ఎల్లప్పుడూ చిన్నవిగానే కనిపిస్తాయి ! మన దోసిలి ఎంతో చిన్నది.

జయ అడిగింది : " ఓ మనోహర ప్రియతమా, నా కృతజ్ఞతను సమ్మతించండి. ఈ అశ్రువులకు వాటి గమ్యాన్ని అందించండి మీరు ఈ భిక్షాపాత్రను నింపారు, అయినాగానీ నేను ఎప్పటిలానే రిక్తంగానే ఉన్నాను ... శూన్యంగా, అలిఖితంగా."

ఈ రకమైన పూరణ అనేది ఒకరిని మరింత మరింతగా రిక్తమయ్యేలా చేస్తుంది. ఇది శూన్యత యొక్క పూరణ. ఇది శూన్యతతో నింపడం. నా ప్రయత్నం మిమ్మల్ని శూన్యం చేయడమే. మీరు శూన్యంగా అయితే కనుక అప్పుడు నేను సఫలీకృతమయ్యాను. మీరు నిండుగా ఉంటే కనుక అప్పుడు నేను విఫలమయ్యాను. మీరు పూర్తి శూన్యంగా అయినప్పుడు మరి మీ అంతరంగంలో ఇంకేమీ మిగిలి లేనప్పుడు ... ఏ జాడ, ఏ పదమూ, ఏ చెత్తా లేనప్పుడు ... ఈ శూన్యతలో దివ్యత్వం సాక్షాత్కరిస్తుంది.

నేను జయకు చెప్పాలనుకుంటున్నాను :

వెళ్ళు, ఓ ఆత్మా వెళ్ళు,

కన్యామణీ, ఓ వధువుగా,

అతని సహచరిగా మారిపో.

ఇప్పుడు ఆ మహాశూన్యమే నీ ఏకైక పథం

నీ గమ్యస్థానం : ధాన్యాలనూ మరి నీటినీ కాపాడేవాడు.

పెళ్ళికుమారుడు : కాంతి యొక్క స్వభావం.

అది మాత్రమే నిన్ను ఆనందింపజేస్తుంది, పులకరింపజేస్తుంది.

ఓ ఆత్మా ! నువ్వు ఎంచుకోబడ్డావు.

ఓ ఏకమైనదానా

ఓ వివాహితా,

మహాశూన్యంతో నీ వివాహ వేడుక జరిగింది.

"**మహా శూన్యంతో నీ వివాహ వేడుక జరిగింది.**" ఈ రిక్తంగా ఉండడమనేది, ఈ శూన్యంగా ఉండడమనేదీ, మహా శూన్యంతో నీ వివాహ వేడుకను జరిపేందుకే ఉంది. నర్తిస్తూ, ఆ మహదానందాన్ని సాక్షాత్కరించనిస్తూ, ఆలపిస్తూ, పరవశమైపోతూ ... నిన్ను నువ్వు కోల్పోవాలి !

ఉండేందుకు కేవలం ఒకే ఒక మార్గం వుంది ... మరింత మరింతగా మాయమైపోవడమే.

నువ్వు పూర్తి శూన్యంగా అయిపోయిన క్షణం, అవ్యవధిగా తన పరిపూర్ణత్వంతో దివ్యత్వం దిగివస్తుంది. నువ్వే ఏకైక అడ్డంకి. కనుక భయపడవద్దు. నువ్వు శూన్యమై పోయినప్పుడు, నువ్వు అంతా పొందావు.

మహారాష్ట్రకు చెందిన ఓ కథ :

ఒకసారి నివృత్తినాథ్‌కు ఏక్‌నాథ్ ఒక ఉత్తరం వ్రాశాడు. దానిపై ఏమీ వ్రాసి లేని, ఒక ఖాళీ కాగితాన్ని అతను పంపించాడు. నివృత్తినాథ్ దానిని అతి క్షుణ్ణంగా చదివాడు ... దానిపై చదవడానికి ఏమీ లేని ఒక ఖాళీ కాగితం. అతను నిజంగా అందులోకి మమేకమైపోయాడు, మళ్ళీ మళ్ళీ మళ్ళీ దానిని చదువుతూనే వున్నాడు.

ముక్తాబాయి దగ్గరలోనే కూర్చుని వుంది, అతను దానిని ఆమెకు ఇచ్చాడు మరి ఆమె దానిని చదివింది. ఆమె కన్నీళ్ళు స్రవించడం ప్రారంభించాయి... ఆమె పూర్తిగా నశించిపోయింది ! ఇతర ప్రజలు అక్కడ వున్నారు, మరి వాళ్ళు అనడం ప్రారంభించారు, " ఇది ఒట్టి పిచ్చి ! మొదట, ఒక ఖాళీ కాగితాన్ని పంపిన ఏకనాథ్

పిచ్చివాడు. ఒక ఉత్తరం అంటే ఏదైనా వ్రాయబడి వుంది అని అర్థం ! తరువాత దానిని చదువుతూ వున్న ఈ నివృత్తినాథ్ పిచ్చివాడు, కేవలం ఒక్కసారి కాదు అనేక పర్యాయాలు. అనంతరం అన్నింటికన్నా విచిత్రమైనది, ఈ ముక్తాబాయి, ఆమె పూర్తిగా అంతమైపోయింది మరి ఆమె కన్నీళ్ళు ప్రవహించడం మొదలయ్యాయి !"

అన్ని పవిత్ర గ్రంథాలూ ఖాళీ కాగితాలే, మరి ఖాళీ కాగితాన్ని ఎలా చదవాలో మీరు నేర్చుకుంటే కనుక, అప్పుడు అన్ని పవిత్ర గ్రంథాలనూ ... వేదాలు, ఖురాన్, గురుగ్రంథ్, గీత, ఉపనిషత్తులు, బైబిలు, ధమ్మపదం ... ఎలా చదవాలో మీకు తెలిసి వుంటుంది.

ఖాళీ కాగితాన్ని చదవగలిగినవాళ్ళు అన్నింటినీ పొందుతారు. ఇక్కడ నా ప్రయత్నమంతా ఏమిటంటే మీరు ఖాళీ కాగితాలలా తయారవ్వాలి. నేను మిమ్మల్ని తుడిచివేయాలని ప్రయత్నిస్తున్నాను, ఎందుకంటే మీరే ఏకైక అడ్డంకి.

వెళ్ళు, ఓ ఆత్మా వెళ్ళు,
నిష్కపటమైన మరి కన్యయైన యువతీ,
మహా శూన్యంతో నీ వివాహ వేడుక జరిగింది.

హరి ఓం తత్ సత్ !

జనకుడు అన్నాడు : కాంతి అనేది నా స్వీయ ... స్వభావం. నేను దానికి అన్యం కాదు. ఈ విశ్వం ప్రకాశించినప్పుడు, నా కాంతి ద్వారానే అది ప్రకాశిస్తుంది.

ఆశ్చర్యకరమైనది ఏమిటంటే అజ్ఞానం వలన ఊహాత్మక ప్రపంచం నాలో కనిపిస్తుంది, ముత్యపు చిప్పలో వెండి, ఒక తాడులో పాము, లేదా సూర్యరశ్మిలో ఎండమావి కనిపించినట్లుగానే.

నా నుంచి జనించిన విశ్వం నాలోనే కలిసిపోతుంది. మట్టిలోనికి ఒక కుండ, నీటిలోకి ఓ అల, లేదా బంగారంలోకి ఒక కంకణం కలిసిపోయినట్లుగానే.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. బ్రహ్మ నుండి గడ్డిపోచ వరకూ సమస్త ప్రపంచం నశించిపోయినా నేను నశించను. నేను శాశ్వతమైనవాడను.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. సశరీరుడనై ఉన్నప్పటికీ, నేను అద్వైతుడనే. నేను ఎక్కడకూ పోను, ఎక్కడ నుంచీ రాను ; నేను కేవలం ఉంటాను, ఈ విశ్వంలో నేను వ్యాపించి ఉన్నాను.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. నా అంతటి సమర్థులు ఇక్కడ ఎవ్వరూ లేరు, శరీరంతో దానిని స్పృశించకుండానే అనంతకాలం నుంచే ఈ విశ్వాన్ని నిర్వహిస్తున్నాను.

అద్భుతమైనవాడను.నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. నా వద్ద అసలేమీ లేదు, లేదా మాట లేక ఆలోచన ద్వారా పరివేష్టింపబడగల దానినంతటినీ నేను కలిగివున్నాను.

⑨

నాకు నేనే ప్రణమిల్లుతున్నాను

మతం అనేది అనుభవం, ఆలోచించడం కాదు. ఆలోచన అనేది కనీసం మతం యొక్క నీడ కూడా కాజాలదు. ఆలోచనలలో చిక్కుబడి వున్న వ్యక్తి ఎల్లప్పుడూ మతం నుంచి ఎంతో దూరంలోనే ఉండిపోతాడు. ఒక చింతనాపరుడి కన్నా ఎక్కువగా మతం నుంచి దూరంగా మరెవ్వరూ లేరు.

ప్రేమ అనేది ఒక అనుభవం అయివున్నట్లుగానే, దైవత్వం అనేది కూడా ఒక అనుభవమే. మీరు దాని అనుభవాన్ని పొందాలనుకుంటే కనుక, అది ఒకరి సంపూర్ణత ద్వారానే సాధ్యమవుతుంది.

ఆలోచనా ప్రక్రియ అనేది కేవలం మానవుడి యొక్క ఒక చిన్న తునక మాత్రమే, మరి అత్యంత పైపై విషయమది. దానికి లోతు లేదు. మానవుడి యొక్క అంతర్గతత్వంలో అది భాగం కాదు, కేంద్రానికి చెందినది కాదు, అది కైవారం పైనే ఉంది. ఆలోచించడం ఆగిపోయినా కూడా, మానవుడు జీవించగలడు. ఇప్పుడు ఆలోచించే యంత్రాలు వృద్ధి చేయబడ్డాయి. ఒక యంత్రం కూడా ఆలోచించగలదనీ, అది మానవుడి యొక్క ప్రత్యేక విభవమేమీ కాదనీ అవి స్పష్టం చేస్తున్నాయి.

అరిస్టాటిల్ మరి అతనిలాంటి చింతనాపరులు మానవుడిని ఆలోచించే జంతువు, హేతుబద్ధమైన జంతువు అని పిలిచారు. ఈ నిర్వచనాన్ని మార్చాలి, ఎందుకంటే ఇప్పుడు కంప్యూటర్లు కూడా ఆలోచించగలవు... మరి మానవుడి కన్నా అత్యుత్తమ సామర్థ్యంతో, అత్యుత్తమ నైపుణ్యంతో. మానవుడు పొరపాట్లు చేస్తాడు, కానీ కంప్యూటర్ల విషయంలో పొరపాట్లకు ఆస్కారమే లేదు. మానవుడి యొక్క ఔన్నత్యం అతను ఆలోచించడంలో లేదు. మానవుడి యొక్క ఔన్నత్యం అనేది అనుభవం పొందగల అతని సామర్థ్యంలో వుంది.

మీరు ఏదైనా రుచి చూసినప్పుడు ఉన్నట్లుగానే, ఆ రుచి అనేది కేవలం ఒక ఆలోచన మాత్రమే కాదు ... అది సంభవిస్తుంది, మీ కణాలలోనే అది సంభవిస్తుంది. రుచి చూడడమనే ఆనందంలో మీరు మునిగిపోయి వున్నారు. మీరు మద్యం సేవించినప్పుడు, త్రాగుడు యొక్క ప్రభావాలు కేవలం మీ ఆలోచనల్లోనే కాదు ఉండేది, మీ కాళ్ళు తడబడడం ప్రారంభిస్తాయి.

ఒక త్రాగుబోతు నడుస్తూండడాన్ని మీరు చూశారా ? ఆ మద్యం అతని కణాలలోకి చేరుకుంది. దూరంగా పడుతున్న అతని అడుగులలో, అతని కళ్ళలో అది కనిపిస్తోంది ; అతని ప్రతి కదిలికలోనూ అది కనిపిస్తోంది. అది కేవలం అతని ఆలోచనల్లో మాత్రమే కనబడడం కాక అతని సంపూర్ణతను అది పరివేష్టిస్తుంది.

మతం అనేది మద్యం లాంటిది ... దానిని త్రాగినవాడికి తెలుస్తుంది. దాన్ని త్రాగి మరి సంతోషపడినవారు దాని అనుభవాన్ని పొందుతారు.

అతను ఈ మధిరతో నిండిపోయివున్న క్షణంలోనే జనకుడి యొక్క మాటలు ఉచ్ఛరించబడ్డాయి. రుచి చూడకుండానే మీరు వాటిని పరిగణిస్తే కనుక, అపార్థం చేసుకోగల సంభావ్యత వుంది మరి అతని భావం పూర్తిగా విభిన్నమైనదిగా కనిపిస్తుంది. అప్పుడు మీరు మీ స్వంత వ్యాఖ్యానాలను జోడిస్తారు.

ఉదాహరణకు, " అన్నింటినీ వదిలెయ్యి, అర్జునా, మరి నా చరణాల వద్ద అధీనుడవవ్వు," అని గీతలో కృష్ణుడు చెప్పినప్పుడు... మీరు దానిని చదివినప్పుడు ఈ ప్రకటన అత్యంత అహంకారపూరితమైనది అని మీరు భావిస్తారు. " అన్నింటినీ వదిలెయ్యి. అర్జునా, మరి నా పాదాల వద్దకు రా." **నా పాదాల వద్దకు !**

ఈ ' నా ' అనేదానికి మీరు ఇచ్చే భావం మీ భావమే, కృష్ణుడి యొక్క భావం కాదు. కృష్ణుడిలో 'నేను' అనేది మిగిలి వుండదు, అది కేవలం ఒక అన్వయము, అది కేవలం ఒక సంకేతం. మీకు ఆ సంకేతం ఎంతో అధికమైనది. భ్రాంతితో కూడిన మీ స్థితిలో ఆ సంకేతమే సత్యమైపోయింది. కృష్ణుడికి అది కేవలం అనుభవసిద్ధమైనది, మరింక దేనినీ సూచించేది కాదు.

మీరు చూశారు : జాతీయ పతాకంపై ఎవరైనా ఉమ్మితే కనుక అది ఒక పోట్లాటకు కారణమవుతుంది, అవి రక్తపాతానికి దారితీస్తుంది, అది ఒక యుద్ధానికి కారణభూతమవ్వచ్చు. " అతను జాతీయ పతాకంపై ఉమ్మివేశాడు !" కానీ జాతీయ పతాకం అనేది జాతి యొక్క సంకేతం అనీ మరి దేశంపై మీరు ప్రతిరోజూ ఉమ్ముతారు,

కానీ ఎవ్వరూ పోట్లాడడం ప్రారంభించరనీ మీరు ఎప్పుడైనా ఆలోచించారా ? నేలపై మీరు ఉమ్మితే కనుక ఎవ్వరూ కలహించడం మొదలుపెట్టరు. మీరు ఎప్పుడు ఉమ్ముతున్నాగానీ మీరు దేశంపైనే ఉమ్ముతున్నారు ... మీరు ఎక్కడ ఉమ్మినాగానీ, మీరు దేశంపై ఉమ్మివేస్తే కనుక ఎవ్వరూ ఓ పోట్లాటను ప్రారంభించరు. దేశం యొక్క సంకేతం, కేవలం ఒక సూచిక, కేవలం ఒక సామాన్య గుడ్డ పీలిక... కానీ ఎవరైనా దానిపై ఉమ్మేస్తే కనుక అప్పుడు యుద్ధం సైతం సంభవించగలదు.

మానవుడు సంకేతాలకు అతి ప్రాముఖ్యతను ఇస్తాడు ... వాటికి ఉన్నదానికంటే అధిక ప్రాముఖ్యత. తన గుడ్డితనంలో మానవుడు సంకేతాలలో జీవిస్తాడు.

కృష్ణుడు ‘ నేను ’ అనే పదాన్ని వినియోగించినప్పుడు అది కేవలం అనుభవసిద్ధమైనది. అతను మాట్లాడాలి కనుక అతను దానిని వినియోగిస్తాడు. అతను సంభాషించాలనుకుంటున్నాడు కనుక అతను దానిని వినియోగిస్తాడు. కానీ మాట్లాడిన తరువాత ‘నేను’ అనేది లేదు. మీరు కృష్ణుడి కళ్ళలోకి చూస్తే కనుక మీకు ఏ ‘నేను’ అనేదీ కనిపించదు. అక్కడ కేవలం అత్యున్నత నిశ్శబ్దమే, కేవలం శూన్యమే వుంటుంది. ‘ నేను ’ అనేది మాయమైపోయింది. ఇందువలనే కృష్ణుడు సులభంగా అనగలడు, “ రా, నా పాదాల చెంతకు రా !” తన పాదాల చెంతకు రమ్మని అతను చెప్పినప్పుడు, అది అత్యంత అహంకారపూరితమైనది అని మనం భావిస్తాము, ఎందుకంటే మనకు తెలిసిన విధంగా ‘నేను’ అనే దానికి మనం తాత్పర్యం చెబుతాము.

జనకుడి యొక్క ఈ మాటలు మిమ్మల్ని మరింత ఎక్కువగా విస్మయానికి గురిచేస్తాయి. ఈ అవనిపై ఆ వివరణలు అద్వితీయమైనవి. “ నా పాదాల వద్దకు రా ”, అనైనా కృష్ణుడు కనీసం అన్నాడు. జనకుడి యొక్క ఈ స్థిరవచనాలు ఎటువంటి వంటే మీరు వాటిని విశ్వసించలేరు.

జనకుడు వాటిలో అంటాడు, “ అద్భుతం, నా స్వభావం ! అద్భుతం, నా ప్రకాశం ! ఆశ్చర్యకరం ! నేను ఏమిటి ? నా స్వంత పాదాల వద్దకు నేను చేరుతున్నాను ! నాకు నేను ప్రణమిల్లుతున్నాను ! ” అది మిమ్మల్ని ఆఘాతానికి గురిచేస్తుంది.

ఈ వివరణములలో జనకుడు తనకు తానే ప్రణమిల్లుతాడు ; ఇతరం అనేది ఇక ఎంత మాత్రం ఉండదు. అతను మళ్ళీ మళ్ళీ చెబుతాడు, ***అద్భుతమైనవాడను నేను, నాకు నేను ప్రణమిల్లుతున్నాను. నేను శాశ్వతమైనవాడను.*** “ నేను భక్తి భావంతో ఎంతగానో నిండిపోయాను, స్వయంగా నేనే ఆశ్చర్యంలో ఉన్నాను. నాకు నేనే

ప్రణమిల్లుతున్నాను, ఎందుకంటే అన్నీ నశించిపోతాయి, అయినాగానీ నేను మిగిలి వుంటాను. బ్రహ్మం నుంచి సూక్ష్మమైన అణువుల దాకా అంతా నాశనమైపోతుంది, అయినాగానీ నేను మిగిలి వుంటాను. నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. నా అంతటి సమర్థుడు ఎవరున్నారు ? నేను ప్రపంచంలోనే ఉన్నాను మరి అయినాగానీ నిస్సంగుడనై ఉన్నాను "... నీటిలో తామరాకులాగా. "నాకు నేనే ప్రణమిల్లుతున్నాను."

మానవాళి ఎన్నడూ అటువంటి ప్రకటనను వినలేదు : "స్వయానా నాకు నేనే ప్రణమిల్లుతున్నాను." మీరు అనుకుంటారు, "ఇది అతి గొప్ప అహంకారం. అతను ఇతరులతో అది చెప్పినట్లయితే కనుక అది సరైనదే అవుతుంది,కానీ అతను తన స్వంత పాదాలను స్పృశిస్తున్నాడు...!"

రామకృష్ణుడి గురించి చెప్పబడేది ఏమిటంటే ఒక చిత్రకారుడు వచ్చాడు మరి అతని చిత్తరువును చిత్రించాడు. అతను పూర్తయిన చిత్తరువును తీసుకువచ్చినప్పుడు, రామకృష్ణుడి యొక్క భక్తులకు అతి విచిత్ర భావన కలిగింది ఎందుకంటే రామకృష్ణుడు ఆ చిత్తరువును చూశాడు మరి దానిలోని పాదాలను స్పృశించడం ప్రారంభించాడు. అది అతని స్వంత చిత్రం. మరి అతను దానికి ప్రణమిల్లడం ప్రారంభించాడు. ఒక భక్తుడు అన్నాడు, "పరమహంసా, మీకు పిచ్చిపడుతోందా ? ఇది మీ స్వంత చిత్తరువు."

రామకృష్ణుడు చెప్పాడు, "నువ్వు నాకు గుర్తు చెయ్యడం మంచిదైంది ... నేను సమాధి యొక్క చిత్తరువును చూస్తున్నాను. నేను సమాధిలో ఉన్నప్పుడు అది చిత్రించబడి వుంటుంది. నువ్వు నాకు గుర్తు చెయ్యడం మంచిదయ్యింది, లేదంటే నేను పిచ్చివాడినని ప్రజలు అనుకుంటారు. నేను కేవలం సమాధికి నా వందనాలను అర్పించడం ప్రారంభిస్తున్నాను. ఇది సమాధి యొక్క చిత్తరువు, నాది కాదు." కానీ దానిని చూసినవాళ్ళు ఆ మనిషికి పిచ్చి పట్టిందని అనుకుని వుంటారు. తన స్వంత చిత్తరువు యొక్క పాదాలను స్పృశించడం ! ఇంతకన్నా ఉన్మాదం ఇంకేమి వుంటుంది ?" అహంకారంలో ఇది ఆఖరి మాట, దీనికన్నా ఉన్నతమైన అహం ఉండనే ఉండదు."

జనకుడు పరమానందంలో ఈ వివరణలు చేస్తున్నాడు. ఆ రుచి జనించింది మరి అతను మిగిలినవాటినన్నింటినీ మరచిపోయాడు. అతను నాట్యం చేయగలిగితే కనుక అతను మీరాలాగా నర్తిస్తాడు. అతను చైతన్యుడిలాగా పాడగలిగితే కనుక అతను పాడతాడు. అతను మురళిని వాయించగలిగితే కనుక, కృష్ణుడిలాగా అతను

తన మురళిపై రాగాలు పలికిస్తాడు. ప్రతి వ్యక్తీ వ్యక్తీకరణ యొక్క తన స్వీయ అద్వితీయ సంభావ్యతలు కలిగి వుంటాడు. జనకుడు ఒక చక్రవర్తి, సంస్కారవంతుడు, చక్కగా విద్యను అభ్యసించినవాడు, అతను తెలివైనవాడు, తెలివితేటల యొక్క సారమే అతను ... మానవ చరిత్రలో సువర్ణాక్షరాలలో లిఖించదగిన యోగ్యత అతని వివరణములకు ఉంది. ఈ మాటలను అవగాహన చేసుకోవడానికి, మీ స్వంత భాష్యాలను ప్రక్కన పెట్టేయండి.

ఒక కవి అంటాడు :

కొన్నాళ్ళపాటు ఈ ప్రపంచంలోని వినోదాలు చూడడానికి నేను వెలుతున్నాను,
మానవుడి జీవితం అనేది చూసేందుకై ఓ గవాక్షం.
ఏ రకమైన విషయం ఈ వివేకం
అది అన్ని చర్యలలోనూ ఉల్లాసంతో వున్న నా హృదయాన్ని నిలువరిస్తుంది,
అది అన్నింటిలోనూ జోక్యం చేసుకుంటుంది.
భావంతో సౌందర్యాన్ని సృష్టించడమే కవి యొక్క ప్రేరణ.
పదాలలో చిక్కుబడిపోయి ఉన్నది
కేవలం అంత్యప్రాసల కళ మాత్రమే.
ఏ రకమైన విషయం ఈ వివేకం
అది అన్ని చర్యలలోనూ ఉల్లాసంతో వున్న నా హృదయాన్ని నిలువరిస్తుంది,
అది అన్నింటిలోనూ జోక్యం చేసుకుంటుంది.

హృదయంలో అలలు ఎప్పుడు పైకి లేచినా, వివేకం వెంటనే వాటిని నిలువరిస్తుంది. ఏదైనా అనుభూతి ఎప్పుడు లోతుగా వెళ్ళినా, వివేకం వెంటనే అనవసర జోక్యం కలిగించుకోవడం ప్రారంభిస్తుంది.

ఏ రకమైన విషయం ఈ వివేకం
అది అన్ని చర్యలలోనూ ఉల్లాసంతో వున్న నా హృదయాన్ని నిలువరిస్తుంది.
అది అన్నింటిలోనూ జోక్యం చేసుకుంటుంది.

ఈ వివేకాన్ని కొద్దిగా ప్రక్కన పెట్టండి ... కేవలం కొద్దిసేపు, కేవలం ఒక్క క్షణం. ఈ క్షణాలలో మేఘాలు చెదిరిపోతాయి మరి సూర్యుడు కనిపిస్తాడు. మీరు ఈ వివేకాన్ని ప్రక్కన పెట్టలేకపోతే కనుక అది జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. దానికి ప్రశ్నించడమనే అలవాటు వుంది. జోక్యం చేసుకోవడమే దాని స్వభావం, అనవసరంగా కలుగజేసుకోవడంలోనే దానికి రసం వుంటుంది. మరి మతం అనేది

హృదయం ద్వారా వస్తుంది ... ఆ హృదయ తరంగాలు నాశనమవుతాయి. మనస్సు వాటిని ప్రభావితం చేస్తుంది మరి అవి చేజారిపోతాయి. మీ అవగాహన పూర్తిగా అయుక్తమైనది అవుతుంది.

భావంతో సౌందర్యాన్ని సృష్టించడమే కవి యొక్క ప్రేరణ.

ఒక అసలైన కవి, ఓ ద్రష్ట, ఓ ఋషి, వాళ్ళు భావం పట్ల తమ శ్రద్ధనంతా చూపుతారు : " భావంతో సౌందర్యాన్ని సృష్టించడమే కవి యొక్క ప్రేరణ "... అతని ఊహలో భావం యొక్క పుష్పాలు వికసిస్తాయి, భావం యొక్క పరిమళం జనిస్తుంది.

పదాలలో చిక్కుబడిపోయి ఉన్నది
కేవలం అంత్యప్రాసల కళ మాత్రమే.

కాని కేవలం పద్యాలను ప్రాసతో చెబుతున్న వ్యక్తి పదాలలో చిక్కుబడిపోయి వుంటాడు... అతను ఒక కవి కాదు. ప్రాసలను తయారు చేసేవాడు కేవలం పదాలకు పదాలను జోడిస్తూ పోతాడు. అతనికి భావంతో పని లేదు, ఫదాలను అమరిపోయేలా చేయడమే చాలు.

వివేకం అనేది ప్రాసలను రూపొందించేది, అంత్యప్రాసలను సృష్టిస్తుంది. భావం యొక్క రహస్యం, భావం యొక్క నిగూఢత హృదయంలో దాగి వుంది. మీరు మనస్సును ప్రక్కన పెట్టినప్పుడు మాత్రమే మీరు వినగలుగుతారు.

నేను విన్నది ఏమిటంటే ముల్లా నసీరుద్దీన్ ఓ వస్త్రాల దుకాణానికి వెళ్ళాడు మరి ఒక నిర్ణీత వస్త్రాన్ని గురించి అడిగాడు, " సోదరా, ఈ వస్త్ర యొక్క ధర ఎంత ?"

దుకాణాదారుడు చెప్పాడు, "ముల్లా, అది మీటరుకు అయిదు రూపాయలు."

ముల్లా అడిగాడు, " నువ్వు దానిని నాకు నాలుగున్నర రూపాయలకు ఇస్తావా ?"

ఆ దుకాణాదారుడు చెప్పాడు, " అయ్యా, నేను దానిని ఇంటికి తీసుకువెళితే కనుక అది నాకు నాలుగున్నర రూపాయలు పడుతుంది."

కనుక ముల్లా అన్నాడు, "మంచిది, బాగుంది, నేను దానిని ఇంటికే తీసుకువెళతాను."

మానవుడు విషయాలపై తన స్వంత భాష్యాలను చేర్చుతూ వుంటాడు.

ఒక రోగి ఓ దంత వైద్యుడిని అడిగాడు, " మీరు నెప్పి లేకుండా ఒక పంటిని పీకగలరా ? "

ఆ దంత వైద్యుడు చెప్పాడు, " ప్రతీసారీ కాదు. కేవలం నిన్నే ఎవరి పంటినో మెలిపెడుతూ నా మణికట్టు బెణికించుకున్నాను."

దంత వైద్యుడికి తన స్వంత వేదన వుంది. ఒక పన్ను పీకించుకోవడానికి వచ్చిన వ్యక్తికి ఇతర బెంగలు వున్నాయి, అతని స్వంత వేదన.

ముల్లా నసీరుద్దీన్‌కు ఎక్కడో ఉద్యోగం ఇవ్వబడింది. ఆ యజమాని అన్నాడు, "నీకు ఈ ఉద్యోగం ఇవ్వబడినప్పుడు నువ్వు ఎన్నడూ అలసిపోలేదని నువ్వు చెప్పావు ... మరి ఇప్పుడు బల్లపై కాళ్ళు చాపుకుని నువ్వు నిద్రపోతున్నావు."

ముల్లా అన్నాడు, " అయ్యా, నేను అలసిపోకపోవడానికి రహస్యం ఇదే."

మనం మన స్వంత విధానంలో భాష్యం చెప్పుకుంటూ వుంటాం. మనం భాష్యం చెబుతూనే ఉన్నంత కాలం, ఈ సూత్రాల యొక్క భావం స్పష్టమవ్వదు. సూత్రాలను చదివేందుకు ఒక ప్రత్యేక కళ అవసరమవుతుంది. సూత్రాలను చదవడానికి ప్రసరణల నుంచి స్వతంత్రమైన మనస్సు, ప్రసరణలు శూన్యమైన మనస్సు అవసరమవుతుంది. సూత్రాలను చదివి, తాత్పర్యాన్ని చెప్పేందుకు తొందరపడకండ : వినగల, రుచి చూడగల, ఆనందంగా మరి సహనంగా ఇష్టపడగల సామర్థ్యం అవసరమవుతుంది.

ఈ సూత్రాలను వినండి :

కాంతి అనేది నా స్వీయ-స్వభావం. నేను దానికి అన్యం కాదు.
ఈ విశ్వం ప్రకాశించినప్పుడు,
నా కాంతి ద్వారానే అది ప్రకాశిస్తుంది.

ఈ సమస్త విశ్వమూ "నా కాంతి" ద్వారా ప్రకాశిస్తోంది అని జనకుడు అంటున్నాడు. నిశ్చయంగానే జనకుడు మాట్లాడుతున్న ఈ కాంతి అనేది ' నేను ' యొక్క కాంతి కాజాలదు. ఈ కాంతి కేవలం 'నేను' అనేది శూన్యమైనదాని యొక్క కాంతి. కనుక భాషను చూడకండి, ప్రాసల-రూపకర్తగా ఉండకండి, వివేకాన్ని

అనవసరంగా జోక్యం చేసుకోనివ్వకండి. ఆ అర్థం సరళమైనది మరి సామాన్యమైనది ; దానిని వక్రీకరించకండి.

కాంతి అనేది నా స్వీయ - స్వభావం.

ఎవరైనా మాట్లాడాల్సివస్తే కనుక, ఈ విధంగానే మాట్లాడాలి, ఎందుకంటే భాష అనేది అజ్ఞానికి సంబంధించినది. జ్ఞానోదయం పొందినవారికి భాష అనేదే లేదు. జ్ఞానోదయం పొందినవారు ఇరువురు కలుసుకుంటే కనుక వాళ్ళు మౌనంగా ఉండిపోతారు. చెప్పడానికి ఏముంది ? చెప్పడానికి భాష లేదు, మరేమీ లేదు ; మాట్లాడేందుకు ఏ విషయమూ లేదు, దానిని చెప్పేందుకు ఏ భాషా లేదు.

ఫరీద్ మరి కబీర్ కలుసుకున్నప్పుడు, రెండు రోజులపాటు వాళ్ళు మౌనంగా ఉండిపోయారని చెప్పబడుతుంది. వాళ్ళు ఒకరి చేతిని మరొకరు తమ చేతిలోకి తీసుకున్నారు, వాళ్ళు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు, కన్నీళ్ళు నదులై ప్రవహించాయి, వాళ్ళు మహా పరవశంలో ఊగిపోవడం ప్రారంభించారు. వాళ్ళ శిష్యులు బెదిరిపోయారు. ఆ శిష్యులు ఎంతో గొప్పది ఆశించారు : " వాళ్ళు కలిసి మాట్లాడుకుంటే కనుక అది మనపై కూడా వర్షిస్తుంది. వాళ్ళు ఏదైనా చెప్తే కనుక మనం కూడా దానిని వినవచ్చు. మనం ఒక్క పదాన్ని అందుకున్నా సరే, అది జీవితానికి ఓ అర్థాన్నిస్తుంది."

కానీ వాళ్ళు మాట్లాడలేదు. రెండు రోజులు గడిచిపోయాయి.... ఆ రెండు రోజులూ అత్యంత సుదీర్ఘమైనవయ్యాయి. కబీర్ మరి ఫరీద్ మౌనంగా కూర్చుని వుండగా శిష్యులు నిరీక్షిస్తున్నారు. తుదకు, వాళ్ళు వెళ్ళిపోయినప్పుడు, కబీరు ఫరీదుకు వీడ్కోలు పలికినప్పుడు, ఫరీద్ యొక్క శిష్యులు అడిగారు, " ఏం జరిగింది ? మీరు ఎందుకు మాట్లాడలేదు ? సాధారణంగా మీరు ఎల్లప్పుడూ మాట్లాడుతూనే వుంటారు. మేము ఏదైనా అడిగితే కనుక మీరు మాట్లాడుతారు. మేము మిమ్మల్ని కబీరుతో కలిపినది ఎందుకంటే మీ ఇరువురి మధ్యన ఏదైనా సంభాషణ జరుగుతుంది, ఏదో రసం ప్రవహిస్తుంది, అభాగ్యులమైన మేము కూడా దానిని కొద్దిగా పానం చేయవచ్చు అని ఆశించాము. మేము రెండు నదీతీరాలనూ ఒక దగ్గరకు చేర్చాం. ఎందుకంటే గంగ ప్రవహిస్తే కనుక దానిలో మేము స్నానమాచరించవచ్చునని, కానీ ఆ గంగ ప్రవహించలేదు. ఏం జరిగింది ?"

ఫరీద్ వివరించాడు, " కబీరుకూ మరి నాకూ మధ్య చెప్పవలసినది ఏమీ లేదు, దానిని చెప్పేందుకు భాష కూడా లేదు. అడిగేందుకు ఏమీ లేదు. అక్కడ

ఎంతో వుంది, ఒక వెల్లువ ప్రవహిస్తోంది, గంగ ప్రవహించింది కానీ మాటలలో కాదు ... మౌనంలో."

కబీరు యొక్క శిష్యులు అతనిని అదే విషయం అడిగారు : " ఏం జరిగింది ? మీరు మౌనంగా ఎందుకు ఉన్నారు ? మీరు చెవిటి...మూగ వారిలా కనిపించారు !"

కబీరు అన్నాడు, " మూర్ఖులారా ! నేను ఫరీదు ముందు మాట్లాడితే కనుక నన్ను నేను అజ్ఞానిగా నిరూపించుకుంటాను. ఎవరు మాట్లాడినా తనను తాను అజ్ఞానిగా నిరూపించుకుంటారు. మాట్లాడకపోవడం అనేది ఎక్కడ పని చేస్తుందో, అక్కడ మాట్లాడడం అనే ప్రశ్నే ఉండదు. ఒక సూది చేత పని జరిగిపోయే చోట, కేవలం ఒక పిచ్చివాడు మాత్రమే ఖడ్గాన్ని ఎత్తుతాడు. మాట్లాడకుండానే అది అప్పటికే సంభవిస్తోంది. ఒక అపారమైన తరంగిణి ప్రవహిస్తోంది. కన్నీళ్ళు ఎలా స్రవిస్తున్నాయో, అక్కడ ఎటువంటి పరమానందం ఉందో మీరు చూడలేదా ?"

జ్ఞానోదయాన్ని పొందిన ఇరువురి మధ్యన మాటలు అవసరం లేదు. జ్ఞానోదయం పొందనివారైన ఇరువురి మధ్య మాటలపై మాటలు పోగుపడి ఉంటాయి. కానీ ఏ అర్థమూ ఉండదు. జ్ఞానోదయాన్ని పొందినవారు ఇరువురి మధ్య అర్థాలలో అంతరార్థాలు వుంటాయి, కానీ ఏ మాటలూ ఉండవు. జ్ఞానోదయాన్ని పొందిన వ్యక్తికీ మరి జ్ఞానోదయాన్ని పొందని వ్యక్తికీ మధ్యన మాటలు మరి అర్థం రెండూ వుంటాయి. సంభాషణకు, జ్ఞానోదయం పొందిన వ్యక్తి మరి జ్ఞానోదయం పొందని వ్యక్తి అవసరం.

జ్ఞానోదయాన్ని పొందని వారైన ఇరువురి వ్యక్తుల మధ్య వాదన వుంటుంది. సంభాషణ అనేది సాధ్యం కాదు, మాటలు సాధ్యం కాదు : కేవలం మనస్సుల యొక్క సంఘర్షణ మాత్రమే సాధ్యం అవుతుంది.

జ్ఞానోదయాన్ని పొందిన ఇరువురు వ్యక్తుల మధ్య వాచిక సంభాషణ ఉండదు. ఏదో లోతైన ప్రపంచంలో వాళ్ళ కేంద్రాలు కలుసుకుంటున్నాయి, సంయోగం సంభవిస్తోంది, సంభాషణ యొక్క ఆవశ్యకత ఏముంది ? మాట్లాడకుండానే అది తెలియజేయబడుతుంది, దాని గురించి పలుకకుండానే వాళ్ళిద్దరూ దానిని చూస్తారు.

జ్ఞానోదయం పొందిన వ్యక్తికీ మరి జ్ఞానోదయం పొందని వ్యక్తికీ మధ్యన సంభాషణ యొక్క సంభావ్యత ఉంటుంది. జ్ఞానోదయం పొందిన వ్యక్తి మాట్లాడేందుకు

సిద్ధంగా ఉంటే మరి జ్ఞానోదయం పొందని వ్యక్తి వినేందుకు సిద్ధంగా ఉంటే కనుక, అప్పుడు సంభాషణ సాధ్యమవుతుంది.

ఒక అర్ధంలో పవిత్ర గ్రంథాల యొక్క భావం ఎల్లప్పుడూ విరుద్ధమైనదిగా కనిపిస్తుంది... ఎందుకంటే పవిత్ర గ్రంథం దేనినైతే చెబుతుందో అది చెప్పలేనిది, చెప్పలేనిదానిని చెప్పేందుకు అది ఓ ప్రయత్నం. చెప్పలేనిదానిని చెప్పేందుకై జ్ఞానోదయాన్ని పొందిన అసంఖ్యాక వ్యక్తులు ప్రయత్నించడం అనేది మహోత్తమ కరుణ. మనం మన కళ్ళు ఎత్తి చూడడాన్ని ఎప్పుడో మరచిపోయిన చోటుకు మనం కళ్ళెత్తి చూడాలని వాళ్ళు కోరుకున్నారు. వాళ్ళు మనకు ఆకాశం యొక్క స్వల్ప క్షణదర్శనాన్ని అందించారు. మనం నేలపై పాకుతూ మరి ఇటూ అటూ కదులుతూ ఉంటాము ... మన తలలను ఎత్తడం మనం మానేశాం.

మన్సూర్ పట్టుబడి మరి బందించబడినప్పుడు అతను నవ్వడం ప్రారంభించాడని చెప్పబడుతుంది. లక్షమంది వున్న గుంపు పోగయ్యింది మరి ఎవరో అడిగారు, "మన్సూర్, నువ్వు ఎందుకు నవ్వుతున్నావు?"

మన్సూర్ అన్నాడు, " నేను నవ్వుతున్నది ఎందుకంటే, అవును, నేను ఇక్కడ బంధింపబడడం మంచిదే అయ్యింది ... కనీసం మీరు మీ కళ్ళను కొద్దిగానైనా పైకెత్తారు !"

అతను ఎత్తుగా వేళ్ళాడదీయబడ్డాడు కనుక చూడడానికి ప్రజలు తమ ముఖాలను పైకెత్తాల్సి వచ్చింది. కనుక మన్సూర్ అన్నాడు, "కనీసం ఇప్పుడైనా మీరు మీ కళ్ళను ఆకాశం వైపు ఎత్తవలసి వచ్చింది ... నా మృత్యువు అనేది ఒక సాకు అయినా కూడా. కనుక నేను ఆనందంగా వున్నాను ... ఈ హింస సరైనదే. బహుశా పైకి నా వైపు చూస్తున్నప్పుడు నా అంతరంగంలో దాగి వున్నదానిని మీరు చూస్తారు. బహుశా ఈ మరణ సమయంలో, ఈ మరణం యొక్క అభిఘాతం వలన, మీ ఆలోచనా ప్రక్రియలు ఆగిపోతాయి మరి ఒక క్షణకాలం ఆ ఆకాశం తెరుచుకుంటుంది మరి నేను అయివున్నదాని యొక్క ఓ క్షణదర్శనాన్ని మీరు పొందుతారు."

కాంతి అనేది నా స్వీయ - స్వభావం. నేను దానికి అన్యం కాదు.

" ఈ కాంతి నుంచి నేను భిన్నంగా లేను." ' నేను ' అనేది పోయినప్పుడే కాంతి యొక్క ఈ అంతర్గత మూలం సిద్ధిస్తుంది. కానీ దానిని ఎవరైనా ఎలా

చెప్పగలరు ? దానిని వివరించాల్సి వచ్చినప్పుడు 'నేను' అనేదానిని మళ్ళీ లోనికి తీసుకురావలసి వస్తుంది.

" ఈ విశ్వం ప్రకాశించినప్పుడు, నా కాంతి ద్వారానే అది ప్రకాశిస్తుంది." నిశ్చయంగానే జనకుడు ఇక్కడ జనకుడు అనే పేరుగల వ్యక్తి గురించి మాట్లాడడం లేదు. ఆ మనిషి మాయమైపోయాడు, ఆ ప్రత్యేక తరంగం వెళ్ళిపోయింది ... కేవలం మహాసాగరమే మిగిలి వుంటుంది. ఈ మహాసాగరం ప్రతీ ఒక్కరిదీ. జనకుడి యొక్క ఈ ప్రకటన కేవలం తన గురించి మాత్రమే కాదు, అది మీ గురించినది కూడా. అది ఎప్పుడైనా ఉన్న వాళ్ళందరి గురించినదీ, అది ఎప్పుడైనా ఉండే వాళ్ళందరి గురించినదీ. ఈ ప్రకటన సమస్త అస్తిత్వం కోసం చేసినది.

తుడిచివేయబడి వుండడాన్ని నేర్చుకోండి. అప్పుడు దీని యొక్క రుచి రావడం మొదలవుతుంది. మరి ఈ రుచి వచ్చినప్పుడు, ఇటువంటి ప్రకటనలు మీ నుంచి కూడా ఉద్భవిస్తాయి. వాటిని నిలువరించడం కష్టం.

మన్సూర్‌కు తాను ఈ విధమైన వివరణమును చేస్తే కనుక " అనల్‌హక్ ... నేను సత్యాన్ని, నేనే దివ్య అస్తిత్వాన్ని " ... అప్పుడు తాను హతమార్చబడతాను అని తెలుసు. మహమ్మదీయ సమూహం అతనిని సహింపజాలదు. ఈ గుడ్డివాళ్ళ గుంపు అతనిని చూడజాలదు. అయినాగానీ అతను దానిని ప్రకటించాడు. అటువంటి చాటింపులు చేయవద్దనీ, ఈ ప్రకటనలు ప్రమాదకరమైనవి అవుతాయనీ అతని మిత్రులు అతనికి చెప్పారు. అది ప్రమాదకరంగా పరిణమిస్తుందని మన్సూర్‌కు సైతం తెలుసు. కానీ అటువంటి ప్రకటనలు చేయడాన్ని అతను నిలువరించలేకపోయాడు.

పుష్పం వికసించినప్పుడు దాని పరిమళం పంచుకోబడి తీరాలి. దీపం వెలిగించబడినప్పుడు దాని వెలుగు వ్యాపించి తీరాలి. అనంతరం జరిగేది ఏదైనా, జరుగుతుంది.

రహీమ్ చేత చెప్పబడిన వాటిలో ఒకటి ఏమిటంటే : " పోకచెక్క రసం, రక్తం, దగ్గడం, ఆనందం, శత్రుత్వం, ప్రేమ, మత్తు : రహీమ్ చెబుతాడు, వీటిని దాచలేము, ప్రపంచమంతటికీ తెలిసిపోతుంది."

అణచివేయలేని విషయాలు కొన్ని ఉన్నాయి. సాధారణ మద్యాన్ని త్రాగడంలో దాని ప్రభావాలను మీరు ఎలా అణచివేయగలరు ? సాధారణంగా జరిగేది ఏమిటంటే తన మత్తును మరుగుపరచడానికి ఓ త్రాగుబోతు ఎంత ఎక్కువగా ప్రయత్నిస్తే అంత

ఎక్కువగా అది కనిపిస్తుంది. ఎవ్వరూ తెలుసుకోకుండా నిరోధించేందుకు ఒక త్రాగుబోతు ఎంతగానో ప్రయత్నించడాన్ని మీరు ఎప్పుడైనా గమనించారా ? అతను అత్యంత జాగ్రత్తగా మాట్లాడుతారు, మరి ఈ జాగ్రత్తే అతను దొరికిపోయేలా చేస్తుంది. అతను అత్యంత జాగ్రత్తతో నడిచేందుకు ప్రయత్నిస్తాడు మరి ఇదే అతను తడబడేలా చేస్తుంది. ఎవ్వరూ తెలుసుకోకుండా ఉండేందుకు అతను తన అప్రమత్తతను ప్రదర్శించాలనుకుంటాడు.

ముల్లా నసీరుద్దీన్ ఒక రాత్రి త్రాగి ఇంటికి వచ్చాడు. అతను తిరిగి వస్తున్నప్పుడు తన భార్యకు తెలియకుండా చేయడమెలా అని అతను తీవ్రంగా ఆలోచించాడు ? అతను ఏం చెయ్యాలి ? అతను అనుకున్నాడు, " నేను ఖురాన్ చదువుతాను. ఖురాన్ చదువుతున్న ఓ త్రాగుబోతు గురించి ఎవరైనా విన్నారా ? నేను ఖురాను చదివితే కనుక అప్పుడు నేను త్రాగిలేను అనేది స్పష్టమవుతుంది. త్రాగుబోతులు ఎన్నడైనా ఖురాను చదివారా ?"

అతను ఇంటికి చేరాడు, ఒక దీపాన్ని వెలిగించాడు మరి ఖురాను చదువుతూ కూర్చున్నాడు. చివరకు అతని భార్య వచ్చింది మరి అతనిని చురుక్కున ఒక దెబ్బ వేసి, అంది," ఈ బుద్ధిహీనమైనది ఆపు ! ఈ పెట్టెను తెరిచి పెట్టుకుని ఇక్కడ కూర్చుని నువ్వు ఏం చేస్తున్నావు ?"

ఒక త్రాగుబోతు ఖురానును ఎలా కనుగొనగలడు ?

అతను ఆ పెట్టెను తీసుకున్నాడు, దానిని తెరిచాడు మరి చదవడం ప్రారంభించాడు !

దానిని మరుగుపరచడం అసాధ్యం. మరి సాధారణ మద్యాన్నే దాచలేనప్పుడు, దివ్య మధిర ఎలా మరుగుపరచబడుతుంది ? పరవశం అనేది కళ్ళలో ప్రతిబింబిస్తుంది, ఆ కళ్ళు మైకంతో వుంటాయి. మరో లోకం యొక్క రుచి వారి మాటలను వర్ణరంజితం చేస్తుంది. ఆ మాటలు హరివిల్లుల వలే అవుతాయి, సప్త వర్ణాలన్నింటిపై వ్యాపిస్తూంటాయి. మాట్లాడుతోంటే, సాధారణ వచనం అనేది స్వచ్ఛమైన కవిత్వం అయిపోతుంది. మాట్లాడండి, మరి అది కేవలం ఓ పాటలానే ధ్వనిస్తుంది. కదలండి, మరి అది ఒక నాట్యంలా అనిపిస్తుంది. లేదు, దానిని మరుగుపరచలేము, అది బహిర్గతమవుతూనే వుంటుంది. సత్యం ఎల్లప్పుడూ బహిర్గతం చేయబడింది, అది దాని స్వభావం. మీ అంతరంగంలో సత్యం సంభవించగానే తెలియకుండానే మీ ప్రకటన బహిరంగం కావడం మొదలవుతుంది.

జనకుడు దానిని ఆలోచించిన తరువాత ఈ మాటలను చెప్పలేదు : దాని గురించి అతను ఆలోచించి వుంటే కనుక వాటిని చెప్పడానికి అతను సంశయించి ఉండేవాడు. అతను కేవలం అష్టావక్రుడిని అక్కడకు తీసుకువచ్చాడు. అష్టావక్రుడు కొన్ని విషయాలను చెప్పాడు మరి జనకుడి యొక్క జ్ఞానోదయం సంభవించింది !

అతను దానిని వివేకపరంగా పరిగణించివున్నట్లయితే కనుక, ఇలా అనుకుంటూ అతను దానిని అడ్డగించి ఉండేవాడు, " అష్టావక్రుడు ఏమనుకుంటాడు : నాలాంటి అజ్ఞాని ఇలాంటి విషయాలు మాట్లాడడమా ? జ్ఞానసిద్ధి పొందినవాళ్ళకు మాత్రమే ఇవి సరిపోతాయి. అది ఇంత త్వరగా ఎన్నడైనా సంభవించిందా ? కేవలం దాని గురించి వినడం ద్వారా, అది సంభవించగలదా ? అది ఈ విధంగా ఎప్పుడైనా సంభవించిందా ? దానికి సమయం పడుతుంది, దానికి ఎన్నో జన్మలు పడతాయి, అది అత్యంత కఠినమైన ప్రయాణం. అది ఒక ఖడ్గపు అంచుపై నడవడంలాంటిది." అతను ఇదంతా గుర్తు చేసుకునేవాడు మరి తనలో తాను అనుకునేవాడు, " ఎంతో ప్రభావాన్ని చూపగల అటువంటి ప్రకటనను చేయవద్దు !"

కానీ నేను మీకు జ్ఞాపకం చేయాలనుకుంటున్నది ఏమిటంటే ఈ ప్రకటన తనంతట తానే సంభవిస్తోంది. జనకుడు మాట్లాడుతున్నాడు అని అనడం సరైనది కాదు, అది జనకుడి ద్వారా చెప్పబడుతోంది అని అనడం మరింత సరైనది వుంటుంది.

ఆశ్చర్యకరమైనది ఏమిటంటే అజ్ఞానం వలన ఊహాత్మక ప్రపంచం నాలో కనిపిస్తుంది, ముత్యపు చిప్పలో వెండి, ఒక తాడులో పాము, లేదా సూర్యరశ్మిలో ఎండమావి కనిపించినట్లుగానే.

... ముత్యపు చిప్పలో వెండి ఉన్నట్లు భ్రాంతి కలిగినట్లుగానే, చీకటిలో ఒక తాడుపై పాము ప్రసరించబడినట్లుగానే మరి సూర్యరశ్మి వలన ఎడారిలో ఎండమావి అనే భ్రాంతి కనిపించినట్లుగానే... ఇలానే మరీచికలు జనిస్తాయి.

అద్భుతం ! ఆ సంభవం ఎంతో ఆకస్మికంగా సంభవించింది, అది ఎంతో శీఘ్రంతంగా సంభవించింది ... అతని జ్ఞానోదయం ఎంత వేగంగా సంభవించిందంటే జనకుడు దానిని ఇముడ్చుకోలేకపో యాడు. అతను విస్మయంతో నిండిపోయాడు... ఒక చిన్నపిల్లవాడు గంధర్వుల లోకంలో ప్రవేశించినట్లుగా. ప్రతీదీ అతనిని వశపరచుకుంటుంది మరి ప్రతీదీ నమ్మశక్యంకానిదిగా ఉంటుంది.

టెర్టలియన్ చెప్పాడు : " నేను భగవంతుడిని చూడనంతకాలం అవిశ్వాసమే వుండేది. మరి నేను భగవంతుడిని చూశాక, అప్పుడు కూడా అవిశ్వాసమే వుంది."

అతని శిష్యులు అన్నారు : " మాకు అర్థం కావడం లేదు. ఎవరైనా భగవంతుడిని దర్శించినప్పుడు నమ్మకం వస్తుందని మేము విన్నాం."

టెర్టలియన్ అన్నాడు, " ఎవరైనా చూడనంతకాలం అవిశ్వాసం వుంటుంది : భగవంతుడు ఎలా ఉండగలడు ? అసాధ్యం ! అనుభవం అనేది లేకుండా నమ్మకం ఎలా వుండగలుగుతుంది ? భగవంతుడి యొక్క అనుభవం సంభవించినప్పుడు అంతటి పరమానందం సాధ్యమనేది విశ్వసించలేరు. అంతటి ప్రకాశం, అంతటి అమృతం ... అది ఇంకా అసాధ్యమైనదిగానే కనిపిస్తుంది.

అది సంభవించకముందు అది అసాధ్యమైనదిలా కనిపిస్తుంది, మరి అది సంభవించినప్పుడు అది మరింత ఎక్కువ అసంగతమైనదిగా కనిపిస్తుంది."

జనకుడు సరిగ్గా అదే స్థితిలో ఉన్నాడు : " అద్భుతం ! ప్రతి ఒక్కటీ కేవలం ఊహించుకోబడినదే. కేవలం నేను మాత్రమే సత్యం, కేవలం సాక్షి మాత్రమే సత్యం. మిగిలినదంతా భ్రాంతిమయమైనదే. మిగిలిన ప్రతి ఒక్కటీ మాయ మాత్రమే."

నా నుంచి జనించిన విశ్వం నాలోనే కలిసిపోతుంది,
మట్టిలోకి ఒక కుండ, నీటిలోకి ఓ అల,
లేదా బంగారంలోకి ఒక కంకణం కలిసిపోయినట్లుగా.

ఆ రూపాంతరీకరణను మీరు చూస్తున్నారా? జనకుడి యొక్క మానవ రూపం మాయమైపోతోంది మరి అతని దివ్యరూపం సాక్షాత్కరిస్తోంది.

స్వామి రామతీర్థ అమెరికాకు వెళ్ళాడు. ఈ విశ్వాన్ని ఎవరు సృష్టించారని అతనిని ఎవరో అడిగారు. రామతీర్థ ఒక ఆనందభరితుడైన వ్యక్తి. మరి అతను బ్రహ్మానందంలో ఉండి వుంటాడు. అది సమాధి యొక్క క్షణం అయివుంటుంది. అతను అన్నాడు, " నేనే సృష్టించాను ". అమెరికాలో అలాంటి విషయాన్ని ఎవ్వరూ వినబోవడం లేదు. ఇక్కడ అది ఫరవాలేదు, భారతదేశంలో అది సమ్మతించబడుతుంది. ఈ విధమైన వ్యక్తీకరణ సైతం సమ్మతించబడుతుంది. అక్కడ అది ఒక మహా సంచలనాన్నే సృష్టించింది.

ప్రజలు అడిగారు, " నువ్వు స్పృహలోనే ఉన్నావా ? చంద్రుడిని మరి నక్షత్రాలనూ నువ్వు సృష్టించావా ?"

రామతీర్థ అన్నాడు, " వాటిని నేనే రూపొందించాను. నేనే వాటికి భ్రమణాన్ని ఏర్పరిచాను, మరి అప్పటి నుంచీ అవి పరిభ్రమిస్తూనే ఉన్నాయి."

ఈ వివరణమును అవగాహన చేసుకోవడం కష్టం. అతని అమెరికన్ శ్రోతలు అవగాహన చేసుకోలేకపోవడమనేది ఆశ్చర్యకరమైనదేమీ కాదు. అది సహజం. ఈ వివరణము రామతీర్థుడిది కాదు, లేదా అది అయితే కనుక, అది అసలైన రాముడిది ... రామతీర్థుడిది కాదు. ఈ క్షణాన రామతీర్థుడు ఓ అలలాగా మాట్లాడడం లేదు, అతను ఒక మహాసాగరంగా మాట్లాడుతున్నాడు. అతను శాశ్వతమైనవాడుగా, అమర్త్యుడుగా మాట్లాడుతున్నాడు ; క్షణభంగురమైనవాడుగా మాట్లాడడం లేదు. శరీరం మరి మనస్సు చేత పరిమితుడైన మరి హద్దులు ఏర్పరచబడినవాడుగా మాట్లాడడం లేదు ... శరీరం మరి మనస్సుకు అతీతమైనవాడుగా, అనిర్వచనీయుడుగా, అవిదితమైనవాడుగా మాట్లాడుతున్నాడు. స్వయంగా రామతీర్థుడు మాట్లాడడం లేదు, రామతీర్థుడి ద్వారా రాముడు మాట్లాడుతున్నాడు. ఈ ప్రకటన స్వయానా అస్తిత్వం నుంచే వచ్చింది. కానీ దానిని అంగీకరించడం అత్యంత కష్టం, అతి కఠినం.

రామతీర్థుడు భారతదేశానికి తిరిగి వచ్చాడు మరి గంగానది యొక్క మూలం వద్దకు తీర్థయాత్రకై వెళ్ళాడు. అతను గంగలో స్నానమాచరించాడు, మరి అనంతరం అతను ఒక పర్వతాన్ని అధిరోహించి ఆ నదిలోకి దూకి మరణించాడు. అతను వదిలి వెళ్ళిన ఒక చిన్న కాగితంలో ఇలా వుంది, " ఇప్పుడు రామతీర్థుడు తన వాస్తవ రూపాన్ని కలుసుకునేందుకు వెళుతున్నాడు. ఆ పిలుపు వచ్చింది ... ఇక నేను ఈ శరీరంలో వుండలేను. ఆ విశ్వం నన్ను పిలిచింది !"

వార్తాపత్రికలు అతను ఆత్మహత్య చేసుకున్నాడు అనే వార్తను ప్రచురించాయి. అదీ నిజమే, ఆ వార్తాపత్రికలు కూడా సరైనదే వ్రాశాయి. అతను నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ ఎవ్వరైనా రామతీర్థుడిని అడుగగలిగితే కనుక అతను అంటాడు, " నేను ఆత్మహత్య చేసుకున్నానని మీరు అంటున్నారా ? నేను కేవలం సరిహద్దులను కలిపేశాను మరి విశ్వంతో ఏకమైపోయాను. నేను మధ్యలో ఉన్న అడ్డంకిని తొలగించాను. నేను మరణించలేదు. మరణించినవాడిలా నేను ఉండేవాడిని; ఇప్పుడు నేను సజీవుడనయ్యాను, ఇప్పుడు నేను విశ్వంతో ఐక్యం అయ్యాను. ఇప్పుడు జీవత్వం యొక్క ఆ చిన్న నది మహాసాగరంగా మారింది. నేను పరిమితిని వదిలేశాను.

జీవితాన్ని కాదు. పరిమితిని వదిలేయడం ద్వారా, ఇప్పుడు నేను వాస్తవ జీవితాన్ని పొందాను."

కనుక ఎల్లప్పుడూ గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, మీ అంతరంగంలో సమాధి దృఢతరమైనప్పుడు, మీ అంతర్భాగంలో సమాధి యొక్క మేఘాలు కమ్ముకున్నప్పుడు, ఆ వర్షం మీ అహానికి మీ నేను-తనానికి చెందినది కాదు. ఆ వర్షం మీకు అతీతమైన దాని నుంచి వస్తోంది, అది మిమ్మల్ని అధిగమిస్తుంది.

ఈ క్షణంలో జనకుడి యొక్క మూర్తిమత్వం కరిగిపోతోంది.

నా నుంచి జనించిన విశ్వం నాలోనే కలిసిపోతుంది,
మట్టిలోకి ఒక కుండ, నీటిలోకి ఓ అల,
లేదా బంగారంలోకి ఒక కంకణం కలిసిపోయినట్లుగానే.

ఏదీ లేనప్పుడూ, భగవంతుడు ఉండేవాడు.
ఏదీ సృష్టించబడకపోయినాగానీ, భగవంతుడు ఉంటాడు.
నన్ను ముంచేసినది నా స్వంత అస్తిత్వమే.
నేను ఉండుండకపోతే, నేను ఏదై ఉండేవాడిని ?

... నన్ను ముంచేసినది నా స్వంత అస్తిత్వమే.

రామతీర్థుడు ఆత్మహత్య చేసుకున్నాడని మనం అంటాము. రామతీర్థుడు అంటాడు, " నన్ను ముంచి వంచేసినది నా స్వంత అస్తిత్వమే... నేను గంగలో మునిగిపోయినప్పుడే మొదటిసారిగా నేను ఉండడం ప్రారంభించాను. ' నేను ' ఉన్నంత కాలమూ, నేను మునిగిపోయాను."

గాలిబ్ చెప్పినట్లుగా :

ఏదీ లేనప్పుడూ, భగవంతుడు ఉండేవాడు.
ఏదీ సృష్టించబడకపోయినాగానీ, భగవంతుడు ఉంటాడు.
నన్ను ముంచేసినది నా స్వంత అస్తిత్వమే.
నేను ఉండుండకపోతే, నేను ఏదై ఉండేవాడిని?

... భగవంతుడు ఉండుండేవాడు ! అస్తిత్వం ఉండుండేది !

ఈ 'నేను', ఉనికి యొక్క ఈ పరిమితి ... అతని వస్త్రాలను తొలగిస్తున్నట్లుగా ఎవరైనా దానిని తొలగిస్తే కనుక, అతను సత్యాన్ని దర్శిస్తాడు. ఒక పాము ముందుకు జారిపోతూ తన పాత చర్మపు కుబుసాన్ని విడుస్తున్నట్లుగా ... సరిగ్గా ఈ విధంగానే జనకుడికి జరిగింది. అష్టావక్రుడు అక్కడ ఓ ఉత్ప్రేరకంలా ఉన్నాడు.

శాస్త్రవేత్తలు ఉత్ప్రేరకాలను కనుగొన్నారు. వాళ్ళు చెప్పేదేమిటంటే కొన్ని పదార్థాలు నిర్ణీత ప్రతిచర్యలలో చురుకైన పాత్ర పోషించవు, కానీ అవి లేకపోతే ఆ ప్రతిచర్య చోటు చేసుకోదు.

ఋతుపవనాల వర్షాలలో మెరుపులు మెరవడం మీరు చూశారు. శాస్త్రవేత్తలు చెప్పేదేమిటంటే నీరు అనేది ప్రాణవాయువు మరి జలధాతువు యొక్క మేళనం వలన తయారవుతుంది. కానీ విద్యుత్తు ఉన్నప్పుడు మాత్రమే అవి మేళవిస్తాయి. అయినాగానీ విద్యుత్తు దానిలో నేరుగా పాలుపంచుకోదు, జలధాతువును మరి ప్రాణవాయువును కలపడంలో విద్యుత్తు భాగం పంచుకోదు... కేవలం దాని సమక్షం... ఈ రకమైన సమక్షాన్ని శాస్త్రవేత్తలు ఉత్ప్రేరకం అని పిలుస్తారు.

గురువు ఒక ఉత్ప్రేరకం. అతను ఏమీ చెయ్యడు, కానీ అతని ఉనికి లేకుండా ఏమీ సంభవించదు. అతని సమక్షంలో ఏదో సంభవిస్తుంది, అతను ఏమీ చేయకపోయినా కూడా. కేవలం అతని సమక్షం... దానిని ఈ విధంగా అవగాహన చేసుకోండి : అతని శక్తి మిమ్మల్ని ఆవరిస్తుంది. ఈ శక్తి క్షేత్రంలో ముంచివేయబడి మీలో శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తి మీదే. గీతాలు విస్ఫోటించడం ప్రారంభిస్తాయి ... ఆ గీతాలు మీవే. ప్రకటనలు సంభవించడం ప్రారంభిస్తాయి ... ఆ ప్రకటనలు మీవే. కానీ గురువు యొక్క సమక్షం లేకుండా బహుశా అవి సంభవించి వుండేవి కాదు.

అష్టావక్రుడి యొక్క సమక్షం ఓ ఉత్ప్రేరకంలా పని చేసింది. అష్టావక్రుడి యొక్క ప్రశాంత, నిశ్శబ్ద, మహోన్నత స్థితిని చూసి, జనకుడికి మరచిపోయిన తన స్వగృహం జ్ఞప్తికి వచ్చి ఉంటుంది. ఆ కళ్ళలోకి లోతుగా చూస్తూ, ఆ అనంతమైన విస్తారతను వీక్షిస్తూ, అతను తాను కోల్పోయిన మరి విస్మరించిన తన స్వంత శక్యతను జ్ఞాపకం చేసుకుని వుంటాడు. అష్టావక్రుడి మాటలను విని... సత్యంలో ముంచబడినవి, అనుభవంలో ముంచబడినవి ... అతని స్వంత రుచి జ్ఞానం ప్రేరేపించబడి వుంటుంది.

ఒక సింహాన్ని పెంపుడు జంతువుగా పెంచుకున్న ఓ మనిషి గురించి నేను విన్నాను. ఇంకా కళ్ళు కూడా తెరువని పసికూనగా ఉన్నప్పుడు అతను దానిని

ఇంటికి తీసుకువచ్చాడు. ఆ సింహం ఎన్నడూ మాంసం తినలేదు, ఎన్నడూ రక్తం రుచి చూడలేదు. అది ఒక శాకాహార సింహం ... అది కూరగాయలు మరి రొట్టెను తినేది. దానికి ఏమీ తెలియదు, దానికి తెలుసుకోగల కారణం లేదు...

కానీ ఒకరోజు ఆ మనిషి తన కుర్చీలో కూర్చుని వున్నప్పుడు అతను తన కాలును గోక్కున్నాడు మరి కొద్దిగా రక్తం బయటకు వచ్చింది. ఆ సింహం దగ్గరలోనే కూర్చుని వుంది. అక్కడ కూర్చుని అది తన నాలుకతో ఆ రక్తాన్ని నాకింది. అది చాలు ! ఒక్క క్షణంలో, అది మారిపోయింది : ఆ సింహం గర్జించింది. ఆ గర్జనలో హింస వుంది. అప్పటివరకూ అది ఒక నిష్కళంకమైన జైనుడిగా వుండేది ... అకస్మాత్తుగా అది ఓ సింహం అయిపోయింది. అప్పటివరకూ అది ఒక శాకాహారి, మరి అది కేవలం ఓ స్వచ్ఛమైన శాకహారి యొక్క ధ్వనులనే చేసింది. అది ఇంకా ఏ మాంసాన్నీ తినకపోయినా కూడా ... కేవలం కొన్ని రక్తపు బిందువులను మాత్రమే రుచి చూసింది ... దానికి జ్ఞాపకం చేయబడింది. సింహం అయివుండడమనే ప్రచ్ఛన్న సామర్థ్యం ప్రతి కణంలోనూ నిద్రావస్థలో నుంచి మేల్కొంది. ఏదో మేల్కొంది, ఏదో తన అవయవాలను చాచుకోవడం మొదలుపెట్టింది. నిదురిస్తూ వున్నది తన కళ్ళను తెరిచింది. అది గుర్రుమంటూ నిలబడింది, మరి త్వరలోనే అది దాడి చేయడం ప్రారంభించింది. దానిని ఇంటి వద్ద ఉంచడం అసాధ్యమైపోయింది ; దానిని అడవిలో స్వేచ్ఛగా వదిలేయాల్సి వచ్చింది. ఎంతో సుధీర్ఘ కాలం నుంచీ అది నిద్రావస్థలో వుంది ... తాను ఎవరు అనేది అది గుర్తు చేసుకోవడం అదే మొదటిసారి.

అష్టావక్రుడి యొక్క ప్రభావం వలన తాను ఎవరు అనేది జనకుడు జ్ఞాపకం చేసుకున్నాడు. దాని గురించి ముందుగానే ఆలోచించిన తరువాత జనకుడు ఈ మాటలను చెబుతున్నట్లయితే కనుక, అతను మాట్లాడి వుండేవాడు కాదు, అతను సంశయించేవాడు. చెప్పడానికి సులువైనదా ఇది : **నా నుంచి జనించిన విశ్వం నాలోనే కలిసిపోతుంది, మట్టిలోకి ఒక కుండ, నీటిలోకి ఓ అల, లేదా బంగారంలోకి ఓక కంకణం కలిసిపోయినట్లుగానే.**

అష్టావక్రుడి యొక్క ప్రభావంలో, అష్టావక్రుడి యొక్క సమక్షంలో, అతను మేల్కొన్నాడు. ఆ సింహం, జన్మ జన్మలుగా నిదురిస్తూ వున్నది, గర్జించడం ప్రారంభించింది ! అతను తన స్వీయ స్వభావాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు, అతను తన అస్తిత్వాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. సత్సంగం యొక్క అర్థం ఇదే.

ప్రాగ్దిశలో సత్సంగానికి మహత్తర ప్రాధాన్యత ఇవ్వబడింది. పాశ్చాత్య భాషలలో దానికి సరితూగగల పదం లేదు, ఎందుకంటే సత్సంగం యొక్క ప్రాధాన్యతను పశ్చిమం అవగాహన చేసుకోలేదు. ' సత్సంగం ' యొక్క అర్థం ఏమిటంటే, తెలుసుకున్నవారి వద్ద కేవలం కూర్చోవడం, మరి ఆ రుచి వ్యాపిస్తుంది. తెలుసుకున్నవారి యొక్క తరంగాలలో మునిగిపోవడం వలన, మీ అంతరంగంలో నిద్రావస్థలో వున్న విస్మృత తరంగాలు చలింపజేయబడతాయి, అవి ప్రకంపించడం ప్రారంభిస్తాయి.

' సత్సంగం ' యొక్క అర్థమేమిటంటే కేవలం మీకు అతీతంగా వెళ్ళిన వ్యక్తిని దర్శించడం ద్వారా, అతను ముందుకు వెళ్ళాడు అనేది చూడడం ద్వారా, మీ అంతరంగంలో ఒక సవాలు రేపబడుతుంది. మీరు కూడా వెళ్ళాల్సి వస్తుంది ! అప్పుడు నిలువరించడం కష్టం.

' సత్సంగం ' అనేదాని అర్థం గురువు యొక్క మాటలను అధికంగా వింటూండడం కాదు ఎందుకంటే అది గురువు యొక్క సమక్షాన్ని గ్రోలడం, గురువును మీరు అంతరంగంలోకి లోతుగా రావడానికి అనుమతించడం. అది గురువుతో సమ లయలో ప్రకంపించడం.

గురువు ఒక నిర్ణీత ప్రకంపనలో జీవిస్తున్నాడు. మీరు గురువు సమీపంలో ఉన్నప్పుడు ఆయన ప్రకంపన అదే రకమైన ప్రకంపనను మీలో రేపుతుంది. కేవలం కొద్దిసేపు మాత్రమే అయినాగానీ, మీరు కూడా మరో లోకంలోకి ప్రవేశిస్తారు, మీరు చూసే తీరు మారుతుంది. మీరు విషయాలను చూసే విధానం మారుతుంది. కొద్దిసేపు మీరు గురువు యొక్క కళ్ళ ద్వారా చూస్తారు, గురువు యొక్క చెవుల ద్వారా వింటారు.

నేను మీకు స్పష్టం చేయాలనుకుంటున్నది ఏమిటంటే జనకుడు ఈ మాటలను అన్నప్పటికీ, ఈ మాటలు ఇంకా అష్టావక్రుడివే. అది చెబుతుంది, " జనకుడు అన్నాడు," కానీ నేను మీకు జ్ఞాపకం చేయాలనుకుంటున్నది ఏమిటంటే అది వాస్తవంగా " అష్టావక్రుడు అన్నాడు " అష్టావక్రుడి యొక్క సన్నిధి మరి అతనికి అష్టావక్రుడు చెప్పినది ఎంత దృఢమైనదయ్యిందంటే జనకుడు వెళ్ళిపోయాడు, ఆ వరదలో జనకుడు కొట్టుకుపోయాడు. అతని నివాసం జాడ అనేది లేకుండా పోయింది, ఆ ఇల్లు కూలిపోయింది. మరెవరో మాట్లాడడం మొదలుపెట్టారు : ***నా నుంచి జనించిన విశ్వం నాలోనే కలిసిపోతుంది, మట్టిలోకి ఒక కుండ, నీటిలోకి ఓ అల, లేదా బంగారంలోకి ఒక కంకణం కలిసిపోయినట్లుగానే.***

తన స్వంత గమ్యం తానే అయిన,
ఆ దారి తప్పి సంచరిస్తున్న ప్రయాణికుడినే నేను
నేను అస్తిత్వం నుంచి ఏం పొందగలను?
స్వయానా నేనే అస్తిత్వం యొక్క అత్యున్నత బహుమానాన్ని.

"ఆ దారితప్పి సంచరిస్తున్న ప్రయాణికుడినే నేను..." దారి తప్పిపోయిన ఒక తీర్థయాత్రికుడిని నేను, తప్పిపోయిన ఓ ప్రయాణికుడిని నేను, 'తన స్వంత గమ్యం తానే అయిన...' నాకు అది తెలియదు, కానీ నేనే నా స్వంత గమ్యస్థానం. ఆ గమ్యస్థానం బయట ఎక్కడో లేదు. నేను దారి తప్పిపోయాను ఎందుకంటే నేను అంతరంగంలోకి చూడలేదు ; లేదంటే సంచరించవలసిన అవసరమే లేదు. నేను త్రోవ తప్పిపోయాను ఎందుకంటే నేను నా కళ్ళను మూసుకుని అంతరంగంలోకి చూడలేదు. నేను దారి తప్పిపోయాను ఎందుకంటే నన్ను నేను తెలుసుకొనడానికి నేను ఏ ప్రయత్నమూ చేయలేదు. నేను లక్ష్యం కోసం అన్వేషిస్తున్న చోట, లక్ష్యం అనేది సాధ్యం కాదు."

"తన స్వంత గమ్యం తానే అయిన, ఆ దారి తప్పి సంచరిస్తున్న ప్రయాణికుడు..." త్రోవ విడిచిపోవడానికి కారణం ఇదే : లక్ష్యం అంతరంగంలో వుంది మరి మనం బాహ్యంలో చూస్తున్నాము. ఆ దీపం అంతరంగంలో వెలుగుతోంది, కానీ ఆ కాంతి బాహ్యంలో పడుతుంది. బాహ్యంలో పడే ఆ కాంతిని చూసి, కాంతి యొక్క మూలం కూడా బాహ్యంలోనే ఉంది అని అనుకుంటూ, మనం పరుగెత్తడం ప్రారంభిస్తాం. బాహ్యంలో పడుతున్న ఆ కాంతి మన స్వంత కాంతి. బాహ్యంలో వస్తున్న ఆ పరిమళం మనం విడుదల చేసిన పరిమళమే, అది ప్రతిబింబించింది, అది ఒక ప్రతిధ్వని. మనం ఈ ప్రతిధ్వని వెనుక పరుగెత్తుతున్నాం.

నార్సిసస్ గురించి, ఒక గ్రీకు కథ వుంది ; అతను ఒక అత్యంత అందమైన మనిషి. అతను పెద్ద సమస్యలో చిక్కుకున్నాడు. అతను ఒక సరస్సు ఒడ్డున కూర్చుని ఉన్నాడు ... ఒక ప్రశాంతమైన, ఏ అలలూ లేని అందమైన సరస్సు ... మరి అతను దానిలో తన ప్రతిబింబాన్ని చూశాడు. తన స్వంత ప్రతిబింబంతో అతను మోహితుడయ్యాడు, అతను దానితో ప్రేమలో పడ్డాడు. అతను ఎంత పిచ్చివాడైపోయాడంటే అతను ఎన్నడూ ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్ళలేదు. అతను ఆకలిదప్పులను మరచిపోయాడు. అతను ఓ మజ్నూ అయిపోయాడు మరి తన స్వంత ప్రతిబింబాన్నే తన ప్రేయసి లైలాగా భావించాడు. ఆ ప్రతిబింబం అందంగా వుంది ... దానిని చేజిక్కించుకోవడానికి అతను మళ్ళీ మళ్ళీ సరస్సులోకి వెళ్ళాడు.

కానీ అతను నీళ్ళలోకి వెళ్ళినప్పుడు ఆ సరస్సు అలజడికి గురయ్యింది, అలలు లేచాయి మరి ఆ ప్రతిబింబం మాయమైపోయింది. అతను మళ్ళీ ఒడ్డున కూర్చునేవాడు. ఆ సరస్సు నిశ్చలమైనప్పుడు అది మళ్ళీ కనిపిస్తుంది. అతను పిచ్చివాడైపోయాడు అని చెప్పబడుతుంది. అతను ఆ సరస్సు తీరాన మరణించాడు.

నార్కిసస్ మొక్కను మీరు చూసే వుంటారు. అది నదీ తీరాలలో కనిపించే, ఓ పాశ్చాత్య మొక్క. నార్కిసస్ జ్ఞాపకార్థం దానికి ఆ పేరు పెట్టారు. అది నదీ తీరాన పెరుగుతుంది. మరి తన ప్రతిబింబాన్ని చూసుకుంటుంది, నీటిలో తన స్వంత పుష్పాల వైపు చూసుకుంటూనే వుంటుంది.

ప్రతి ఒక్కరూ ఓ నార్కిసస్.

మనం దేని కోసం అన్వేషిస్తున్నామో అది మన అంతరంగంలోనే వుంది. కానీ మనం అన్వేషిస్తున్న చోట కేవలం ప్రతిబింబాలు, కేవలం ప్రతిధ్వనులు మాత్రమే ఉన్నాయి. ప్రతిధ్వనులలో ఏదైనా కనుగొనగల మార్గం లేదు. మనం వాస్తవమైన మూలం వైపు తిరగాలి.

తన స్వంత గమ్యం తానే అయిన,
ఆ దారి తప్పి సంచరిస్తున్న ప్రయాణికుడినే నేను.
నేను అస్తిత్వం నుంచి ఏం పొందగలను ?

" జీవితంతో నాకు పనేముంది ?"

స్వయానా నేనే అస్తిత్వం యొక్క అత్యున్నత బహుమానాన్ని.

" స్వయానా నేనే జీవితం యొక్క ముక్తాయింపును. జీవితం నుంచి నేను పొందవలసినది లేదా జీవితానికి నేను ఇవ్వవలసినది ఏమీ లేదు. నేను జీవితంలో ఏదైనా అర్థం కోసం అన్వేషించడం లేదు ... స్వయానా నేనే జీవితం యొక్క అర్థాన్ని. జీవితం యొక్క ముక్తాయింపు, జీవితం యొక్క సారం నేనే. దాని అత్యుత్తమ పుష్పం, దాని చిట్టచివరి దశ, దాని అత్యున్నత శిఖరాగ్రం నేనే."

కానీ జీవితంలో అర్థం కోసం అన్వేషిస్తున్న వ్యక్తి నిరంతరం నిరర్థకతనే అనుభవిస్తాడు. నవీన ప్రపంచంలో ఇది జరిగింది ... అర్థం అనేది అంతర్ధానమై పోయింది. ప్రజలు అంటారు, "జీవితంలో అర్థం ఏముంది ? " ఇటువంటి విపత్తు ఇంతకు ముందు ఎన్నడూ సంభవించలేదు. ఇంతకు ముందు వివేకవంతులు లేరని

కాదు ... అత్యంత వివేకవంతులైనవారు ఉండేవారు, వారితో పోల్చదగిన వారెవరినైనా కనుగొనడం కష్టం. బుద్ధుడు, జరాతుస్ట్రా, లావో ట్జు, అష్టావక్రుడి వంటి వ్యక్తులు ఉన్నారు. ఇంతకన్నా ఉన్నత శిఖరాగ్రంలోని వివేకం ఎక్కడ వుండగలదు ? ఇంతకన్నా ఉన్నతమైన తెలివితేటలు ఎక్కడ వుండగలవు ? కానీ వారిలో ఎవ్వరూ జీవితంలో ఏ అర్థమూ లేదు అని ఎన్నడూ చెప్పలేదు.

నవీన యుగంలోని వివేకవంతులు ... అది సార్త్రే అయినా లేదా కామస్ లేదా కాఫ్కా అయినా ... అందరూ జీవితంలో ఏ అర్థమూ లేదని చెబుతారు. అర్థరహితమైనది, వక్రబుద్ధిగలది, " ఒక మూర్ఖుడిచే చెప్పబడిన గాథ "... ఒక మూర్ఖుడి యొక్క అర్థరహిత ప్రేలాపన, అసందర్భ ప్రేలాపన. " ఒక మూర్ఖుడిచే చెప్పబడిన ధ్వని మరి ఉన్మత్తతతో నిండి దేనినీ సూచించని ఓ గాథ ! " ఏ అర్థమూ లేదు, ఏ సారాంశమూ లేని, కేవలం వ్యర్థమైన నిరర్థకభాషణం ... ఇదే జీవితం !

ఏం జరిగింది ? జీవితం అకస్మాత్తుగా అర్థరహితమైనదిగా ఎందుకు అయిపోయింది ? మనం అయుక్త దిశలో అర్థం కోసం అన్వేషిస్తూండడం వలన అయివుండవచ్చా ?... ఎందుకంటే జీవితం అపారంగా అర్థవంతమైనదని కృష్ణుడు చెబుతాడు. కృష్ణుడు చెప్పేదేమిటంటే జీవితం అత్యున్నత భావం మరి శోభ తో నిండి వుంది. మరి బుద్ధుడు చెప్పేదేమిటంటే అత్యున్నత శాంతి, అత్యున్నత పరమానందం జీవితంలో దాగి వున్నాయి. జీవితం అనేది నిర్మలమైన దైవత్వం అని అష్టావక్రుడు చెబుతాడు. ఏదో పొరపాటు ఉండుండాలి, మనం దేనినో చేజార్చుకుంటూ ఉండుండాలి. ఏదోవిధంగా మనం అయుక్తమైన దిశలో అన్వేషిస్తున్నాం. " నేను అస్తిత్వం నుంచి ఏం పొందగలను ? అస్తిత్వం యొక్క బహుమానాన్ని నేనే."

మనం బాహ్యంలో అన్వేషించినప్పుడు, మన జీవితం అర్థరహితమైనదిగా కనిపిస్తుంది. మనం అంతరంగంలో అన్వేషించినప్పుడు మన జీవితం అర్థంతో నిండిపోతుంది : జీవితం యొక్క అర్థం స్వయానా మనమే.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
బ్రహ్మ నుంచి గడ్డిపోచ వరకూ సమస్త ప్రపంచం నశించిపోయినా
నేను నశించను. నేను శాశ్వతమైనవాడను.

ఇంతటి అద్భుతమైన వివరణము ఇంతకు ముందెన్నడూ ఉచ్ఛరించబడలేదు! ఆ తరువాత ఎన్నడూ అది చెప్పబడలేదు. ఈ వివరణము ఎంత మహాద్భుతమైనదో

మీరు చూస్తున్నారా : **నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.** నిశ్చయంగానే ఇది జనకుడి యొక్క వివరణము కాదు, చోటు చేసుకున్న అత్యున్నత సంభవం యొక్క వ్యక్తీకరణే ఇది. సమాధిలో ఉన్న వ్యక్తి యొక్క స్వరం ఇది, సమాధి యొక్క సంగీతమే ఇది.

... నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. బ్రహ్మ నుంచి గడ్డిపోచ వరకూ
సమస్త ప్రపంచం నశించిపోయినా
నేను నశించను.

"సర్వమూ నాశనమైపోతుంది, నేను నాశనమవ్వను. అంతా జన్మించారు, అంతా మరణిస్తారు ... నేను జన్మించలేదు, నేను మరణించను. నేను విస్మయానికి గురయ్యాను. స్వయంగా నేనే భయభక్తులతో నిండిపోయాను."

.... నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. బ్రహ్మ నుంచి గడ్డిపోచ
వరకూ సమస్త ప్రపంచం నశించిపోయినా...

"వాటి సమయం వస్తుంది మరి పోతుంది. అవన్నీ సంఘటనలు, కాలంతో పాటు వచ్చే అలలు మాత్రమే. నేను సాక్షిని ! అవి సృష్టించబడడం నేను వీక్షిస్తాను మరి అవి నాశనమవ్వడం నేను వీక్షిస్తాను. అవి ఒక నాటకాన్ని ఆడుతున్నాయి. ఈ నాటకం నా కళ్ళ ముందే జరుగుతోంది. నా కళ్ళ యొక్క కాంతి చేత అవి ప్రకాశింపజేయబడుతున్నాయి మరి అదే అత్యున్నత వాస్తవంలోనికి తిరిగి గ్రహించబడుతున్నాయి."

... బ్రహ్మ కూడా ! మీరు ఆలయంలో అర్చించేవాళ్ళు ... బ్రహ్మ, విష్ణువు, శివుడు ... వాళ్ళు వస్తారు మరి వెళతారు. ఈ విశ్వంలో రానిది మరి పోనిది కేవలం ఒకే ఒక్క విషయం వుంది. అది మీరే ...మీ నుంచి మీరు స్వతంత్రులయ్యారు. మీ నుంచి మీరు స్వతంత్రులైనప్పుడు, మీ స్వీయ చరణాల వద్ద మీరు ప్రణమిల్లారు అనేది మీరు కనుగొంటారు. మీ అంతరంగంలో దైవత్వం సంపూర్ణంగా బహిర్గతమవ్వడం మీరు కనుగొంటారు. మీరు అన్వేషిస్తున్నది ఎల్లప్పుడూ మీ అంతరంగంలోనే నిరీక్షిస్తూ ఉంది అనేది మీరు కనుగొంటారు.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను ...
అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
సశరీరుడనై ఉన్నప్పటికీ, నేను అద్వైతుడనే.

" రెండు కనిపిస్తాయి, అయినాగానీ నేను అద్వైతుడను," ఈ రెండుగా కనిపించడం అనేది కేవలం బాహ్యంలోనే వుంటుంది, ఒక వృక్షం యొక్క శాఖలను చూస్తున్నట్లుగానే. మీరు ఆ కొమ్మలను లెక్కిస్తే కనుక అనేకం ఉంటాయి. మీరు ఆ వృక్షం యొక్క బోదె వద్దకు వస్తే కనుక అవన్నీ ఏకమవుతాయి. ఈ ప్రపంచంలో కూడా అదే విధంగా వుంటుంది : అనేకం కనిపిస్తాయి, కానీ మూలం వద్దకు తిరిగి వచ్చినప్పుడు అవి ఏకమవుతాయి. అది ఏకం యొక్క విశాలత.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
సశరీరుడనై ఉన్నప్పటికీ, నేను అద్వైతుడనే. నేను ఎక్కడకూ
పోను, ఎక్కడ నుంచీ రాను ; నేను కేవలం ఉంటాను, ఈ
విశ్వంలో నేను వ్యాపించి ఉన్నాను.

వినండి ! తాను ఈ విశ్వంలో వ్యాపించి ఉన్నాననీ, తాను ఈ ప్రపంచాన్ని పరివేష్టించి ఉన్నాననీ జనకుడు అంటున్నాడు. ప్రపంచం యొక్క నిర్వచనమే అతడు. అతను అపరిమితుడు... ఈ ప్రపంచం అతని లోపల వుంది. సాధారణంగా మనల్ని మనం ప్రపంచం లోపల ఉన్నట్లుగా చూస్తాము. ఇది ఒక అసమానమైన రూపాంతరీకరణ ... చూసే విధానమంతా మారిపోయింది.

ఈ ప్రపంచం తన లోపల వుంది అని జనకుడు అంటున్నాడు. ఆకాశంలో మేఘాలు ఏర్పడుతూ మరి అంతర్ధానమైపోతున్నట్లుగానే, సమస్త యుగాలూ అతనిలో ఉద్భవిస్తాయి మరి కలిసిపోతాయి. అతను రూపరహితుడు, అతను సాక్షి, అతను కేవలం గమనించేవాడు... అతను అంతటినీ పరివేష్టించి వుంటాడు.

దానిని ఈ విధంగా అవగాహన చేసుకోండి : మీరు ఒక బాలుడిగా ఉన్నప్పుడు మీ ఆకాశంలో ఒక రూపం ఇమిడి వుండేది... బాల్యం. అనంతరం మీరు ఒక యువకుడయ్యారు, ఆ రూపం మాయమైపోయింది మరి మరొక మేఘం మిమ్మల్ని ఆవరించింది. మీరు ఒక నూతన రూపాన్ని సంతరించుకున్నారు, మీరు ఒక యువకుడయ్యారు. మీరు ఒక బాలుడిగా ఉన్నప్పుడు మీకు కామం గురించి ఏమీ తెలియదు. ఎవరైనా వివరించినా కూడా మీరు అవగాహన చేసుకోలేరు. మీరు ఓ యువకుడిగా అయినప్పుడు, క్రొత్త కోరికలు జనించాయి. కోరిక క్రొత్త వస్త్రాలను ధరించింది. నూతన పర్ణాలు వికసించాయి, మీ జీవితం ఒక నవీన శైలిని అవలంబించింది.

అనంతరం మీరు వృద్ధులవ్వడం ప్రారంభించారు. మీ యవ్వనం కూడా వెళ్ళిపోయింది. మీ యవ్వనం యొక్క అల్లరి మరి సందడి కూడా వెళ్ళిపోయింది, కోరికలు కూడా కొట్టుకుపోయాయి. ఆ కోరికలలో మీరు ఎలా దారి తప్పిపోయారని మీరు ఇప్పుడు విస్మయం చెందుతారు. మీరు అటువంటి మూర్ఖులుగా ఉండేవారనీ, మీరు అంతటి తెలివి తక్కువవారుగా ఉండేవారనీ అనుకోవడం మిమ్మల్ని ఆఘాతానికి గురి చేస్తుంది.

ఏదో ఒకరోజు ప్రతీ వృద్ధుడూ ... అతను జీవితాన్ని కొద్దిగా చూడడంలో నిజంగా సఫలీకృతుడై వుంటే కనుక ... ఆశ్చర్యంతో నిండిపోతాడు : " నేను ఎటువంటి విషయాల వెనుక పరుగెత్తుతూ ఉండేవాడిని ... డబ్బు, అధికారం, మోహాలు, స్త్రీలు లేదా పురుషులు, అన్ని రకాలైన విషయాల వెనుకా పరుగెత్తుతూ ఉండేవాడిని. నేను వేటిని వెంటతరిమాను ? నిజంగానే నేను అలా నలుదిక్కులా వెంట తరుముతూ తిరిగానా ? నేను అటువంటి కలల్లో ఉండేవాడిని అనేది నేను నమ్మలేకుండా వున్నాను."

అరేబియాలో ఉన్న ఒక సామెత ఏమిటంటే ఒక యువకుడు విలపించలేకపోతే కనుక అతను నిజంగా యువకుడు కాదు, మరి ఒక వృద్ధుడు నవ్వలేకపోతే కనుక అతను నిజంగా వృద్ధుడు కాదు. విలపించలేని ఒక యువకుడు నిజంగా యువకుడు కాదు ఎందుకంటే విలపించలేని వ్యక్తి, కన్నీళ్ళను స్రవించనివ్వలేనివాడు ... అతని అనుభూతులు మొద్దుబారిపోయాయి. అనుభూతి యొక్క అలలు లేవు, ఆస్వాదన లేదు. దైన్యంలో వేదన పొందలేనివాడు యువకుడు కాదు, అతను కఠిన హృదయం గలవాడు. అతని హృదయం పుష్పించలేదు, అది ఇంకా పుష్పించనిదిగానే వుంది. మరి ఒక వృద్ధుడు నవ్వలేకపోతే ... ఈ సమస్త జీవితాన్ని మరి తనను తాను చూసి, ఏమి మూర్ఖత్వం, ఏమి అవివేకం అనేది చూసి నవ్వలేకపోతే... అతను నిజంగా వృద్ధుడు కాదు. ఒక వృద్ధుడంటే ఈ ఉన్మాదమంతటినీ చూసి, తన స్వంతదీ మరి ఇతరులందరి ఉన్మాదాన్నీ చూసి నవ్వగలవాడు మరి "ఎంత మహా మూర్ఖత్వం ! " అని అనగలిగినవాడు. ఏ ఆవశ్యకతా లేని విషయాల వెనుక ప్రజలు పిచ్చివారిలా పరుగెత్తుతున్నారు. అసలైన విలువ అనేది లేదని అతను ఇప్పుడు చూడగలుగుతున్నాడు.

కొన్నిసార్లు మీరు యువకుడిలా వుంటారు, కొన్నిసార్లు మీరు వృద్ధుడిలా ఉంటారు. కొన్నిసార్లు మేఘాలు ఒక రూపం దాల్చుతాయి, తరువాత మరొకటి, మరి అనంతరం ఇంకొకటి. కానీ అంతరంగంలో మీరు ఒకటే అని మీరు ఎన్నడైనా

భావించారా ? బాల్యాన్ని చూసిన వ్యక్తే యవ్వనాన్ని కూడా చూశాడు. యవ్వనాన్ని చూసిన వ్యక్తే వృద్ధాప్యాన్ని కూడా చూశాడు. మీరు గమనించేవారు : వెనుక నిలిచివుండి మరి వీక్షించేవాడు సరిగ్గా అదే వ్యక్తి.

మీరు రాత్రివేళ నిదురించినప్పుడు మీ గమనించేవాడు స్వప్నాలను వీక్షిస్తాడు. ఏ కలలూ లేనప్పుడు, కేవలం గాఢనిద్ర, కలలు లేని నిద్ర వున్నప్పుడు ... అప్పుడు మీ గమనించేవాడు కలలు లేని నిద్రను వీక్షిస్తాడు, ఎంత చక్కని గాఢ నిద్ర...! ఇందువలనే, కొన్నిసార్లు మీరు ఉదయం మేల్కొన్నప్పుడు, మీకు చక్కని గాఢ నిద్ర పట్టిందని మీరు అంటారు. దానిని గమనించినది ఎవరు ? మీరు పూర్తిగా నిద్రావస్థలో వుంటే కనుక, మీ అంతరంగంలో ఏ ద్రష్టా మిగిలి లేనప్పుడు, దానిని చూసినది ఎవరు ? ఎవరికి తెలుసు ? ఎవరు కనుగొన్నారు ? దానిని ఎవరు చెబుతున్నారు ?

ఉదయం నిద్ర లేచి, " గత రాత్రి నేను ఎంతో గాఢంగా నిద్రపోయాను ", అని అనేది ఎవరు ? మీరు గాఢ నిద్రలో వుంటే కనుక, అది తెలిసినది ఎవరికి ? నిశ్చయంగానే మీ అంతరంగంలో ఎవరో మేల్కొని వుంటారు, ఏదో మూలన ఒక దీపం వెలుగుతూ వుంటుంది మరి నిద్ర గాఢమైనదిగా, అత్యంత విశ్రాంతికరమైనదిగా, అత్యంత ఉల్లాసకరమైనదిగా, అత్యంత ప్రశాంతమైనదిగా, కలల తరంగం లేకుండా, ఆందోళన లేకుండా, ఆలోచన లేకుండా ఉంది అనేది చూస్తూంటారు. ఎవరో చూస్తుంటారు. ఉదయాన ఆ ద్రష్ట చెబుతాడు, " గత రాత్రి నా నిద్ర అత్యంత గాఢమైనదిగా వుంది." ఆ రాత్రి కలలతో నిండిపోయి వుంటే కనుక, అప్పుడు ఉదయం మీరు అంటారు, " నేను రాత్రిని కలల్లో గడిపాను ; నాకు ఎన్ని దుస్స్వప్నాలు వచ్చాయో ఎవరికి తెలుసు." నిశ్చయంగానే ఆ ద్రష్ట కలల్లో మమేకమైపోలేదు. నిశ్చయంగానే ఆ ద్రష్ట ఒక స్వప్నమైపోలేదు. ఆ ద్రష్ట దూరంగా నిలబడి వున్నాడు.

అనంతరం పగటివేళ మీరు ప్రపంచాన్ని తెరచిన కళ్ళతో చూస్తారు. మీ పని దగ్గర మీరు ఒక వ్యాపారవేత్తగా వుంటారు. మీ స్నేహితుడితో మీరు ఒక స్నేహితుడిగా, మీ శత్రువుతో మీరు ఒక శత్రువుగా ఉంటారు. అనంతరం మీరు ఇంటికి వస్తారు... మీ భార్యతో మీరు ఒక భర్తగా, మీ కుమారుడితో మీరు ఒక తండ్రిగా మరి మీ తండ్రితో మీరు ఒక కుమారుడిగా వుంటారు. వేనవేల రూపాలు...!

మీరు వీటన్నింటినీ దర్శిస్తారు, కానీ వీటన్నింటికీ అతీతమైన ద్రష్ట మీరు. కొన్నిసార్లు మీరు విజయాన్ని చూస్తారు, కొన్నిసార్లు అపజయాన్ని ; కొన్నిసార్లు అనారోగ్యం, కొన్నిసార్లు మంచి రోజులు, కొన్నిసార్లు చెడ్డరోజులు ... కానీ ఒక

విషయం స్థితమైనది. ఇవన్నీ వస్తాయి మరి పోతాయి : మీరు రావడం వుండదు, పోవడం వుండదు.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను. సశరీరుడనై ఉన్నప్పటికీ, నేను అద్వైతుడనే. నేను ఎక్కడకూ పోను, ఎక్కడ నుంచీ రాను... పోవడం కాదు, రావడం కాదు, కేవలం ఉండడం. ఈ ' కేవలం ఉండడం ' అనేదే మీ స్వభావం ... **నేను కేవలం ఉంటాను, ఈ విశ్వంలో నేను వ్యాపించి ఉన్నాను...** మరి ఈ విశ్వాన్ని నేను పరివేష్టిస్తున్నాను." ఇది మీ ప్రపంచం. ఈ ప్రపంచం మీ లోపల వుంది, మీరు దాని లోపల లేరు, మీరు దాని యజమాని, మీరు దాని బానిస కాదు. మీరు అలా చేయాలని నిర్ణయించుకున్న క్షణమే, మీరు మీ రెక్కలను చాచి ఎగిరి పోవచ్చు ! మీరు దాని లోపల ఉంటే కనుక, అది మీ స్వంత ఎంపిక, మిమ్మల్ని ఎవ్వరూ నిర్బంధించలేదు. మీరు ఈ మాత్రం గుర్తుంచుకుంటే కనుక అప్పుడు ఏ సమస్యా లేదు. అప్పుడు మీ స్వీయ స్వతంత్రేచ్ఛ యొక్క ఏ పరిమితినైనా మీరు అంగీకరిస్తే కనుక, బంధనం అనేది ఇక ఎంత మాత్రమూ ఓ బంధనం కాదు. అప్పుడు మీరు ఏమి ఎంచుకున్నా, మీరు ఏమి చేయాలనుకున్నా మీరు చేయవచ్చు. కానీ ఒక విషయాన్ని ఎన్నడూ విస్మరించవద్దు, మీరు కర్త కాదు, కర్త అనేది మళ్ళీ ఒక రూపమే. అనుభవించేవారు మీరు కాదు, అనుభవించేవాడూ ఒక రూపమే. మీరు సాక్షి. ఇదే మీ అమృతత్త్వం.

తూర్పులో మా అత్యున్నత అన్వేషణ యొక్క లక్ష్యం కాలానికి అతీతమైనదానిని కనుగొనడమే అయివుంది, కాలం చేత బంధించబడినది కాదు. ఏదైతే సృష్టించబడిందో మరి నశించిపోతుందో, ఏదైతే కాలప్రవాహంలో నాశనం అయిపోతుందో అది ఒక ప్రతిబింబం. కేవలం కాలానికి అతీతంగా ఓ సాక్షిలా నిలిచివున్నదే సత్యం.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
నా అంతటి సమర్థులు ఇక్కడ ఎవ్వరూ లేరు.

మీరు విన్నారా ? తనంతటి సమర్థులు ఎవ్వరూ లేరు అని జనకుడు చెబుతున్నాడు !

శరీరంతో దానిని స్పృశించకుండానే
అనంతకాలం నుంచీ ఈ విశ్వాన్ని నిర్వహిస్తున్నాను.

ఇది కళ, నైపుణ్యం. " నా అంతటి నిపుణులు ఎవరున్నారు ? నా అంతటి సమర్థులెవరు ? నేను ఈ శరీరాన్ని స్పృశించలేదు, నేను ఎన్నడూ దానిని స్పృశించలేదు !" దానిని స్పృశించగల మార్గం లేదు ఎందుకంటే మీ స్వభావం మరి

శరీరం యొక్క స్వభావం ఎంత విభిన్నమైనవంటే స్పృశించడం అనేది సాధ్యం కాదు, స్పృశించడం అనేది జరుగదు. మీరు కేవలం సాక్షి మాత్రమే, మీరు కేవలం దర్శించగలరు. ఈ శరీరం అనేది గమనించబడేది, అది కేవలం దర్శించబడుతుంది. మీరు మరి ఈ శరీరం కలుసుకోలేరు. మీరు ఈ శరీరంలో ఉంటారు, ఈ శరీరం మీలో వుంటుంది ... కానీ స్పృశించకుండా ... అనంతమైన దూరంలో ఉన్నట్లుగా వాటి స్వభావాలు ఎంత విభిన్నమైనవంటే మీరు వాటిని కలుపలేరు.

మీరు నీటితో పాలను కలుపవచ్చు, కానీ మీరు నీటిని నూనెతో కలుపలేరు. వాటి స్వభావాలు విభిన్నమైనవి. నీళ్ళు పాలతో కలిసిపోతాయి. ఎందుకంటే పాలు అనేవి మొదటగా నీళ్ళే, తొంభై శాతం కన్నా ఎక్కువ నీరే. కనుక నీళ్ళు పాలతో కలిసిపోతాయి ... కానీ మీరు నీళ్ళను నూనెతో కలుపలేరు, అవి కలువవు. అవి కలువలేవు, వాటి స్వభావాలు విభిన్నమైనవి. అయినాగానీ శాస్త్రవేత్తలు బహుశా నూనెను మరి నీటిని కలుపగల విధానమేదైనా కనుగొనడం జరుగవచ్చు, ఎందుకంటే అవి ఎంత భిన్నమైనవి అయినాగానీ, ఆ రెండూ పదార్థాలే.

కానీ చైతన్యాన్ని జడపదార్థంతో కలుపగల మార్గమే లేదు ఎందుకంటే జడం అనేది పదార్థం మరి చైతన్యం అనేది పదార్థం కాదు. గమనించేవాడినీ మరి గమనించబడేదానినీ కలుపగల మార్గమే లేదు. గమనించేవాడు గమనించేవాడుగానే ఉంటాడు, మరి గమనించబడేది గమనించబడేదిగానే వుంటుంది.

కనుక జనకుడు అంటాడు, " నేను విస్మయంతో నిండిపోయాను. స్వయానా విస్మయమే నేనైపోయాను ! నా యొక్క ఈ సామర్థ్యం ఏమిటి ? ... నేను ఎన్నో కర్మలు చేశాను మరి అయినాగానీ నేను నిస్సంగుడనే అయివున్నాను. నేను ఎంతగానో ఆస్వాదించాను అయినాగానీ అనురాగం యొక్క ఏ ఆనవాలూ నన్ను ఆకర్షించడం లేదు !"

మీరు నీటిపై వ్రాస్తూ ఉన్నట్లుగా ; మీరు వ్రాస్తూనే ఉంటారు మరి ఏదీ వ్రాయబడలేదు ... సాక్షితో మీరు పనులు చేస్తూనే వుంటారు, విషయాలను ఆస్వాదిస్తూనే ఉంటారు, కానీ ఏదీ వ్రాయబడిలేదు, ప్రతి ఒక్కటీ నీటిపై గీతలలాగా మాయమైపోతూనే వుంటుంది. మీరు వ్రాయడాన్ని ముగించనైనా ముగించలేదు మరి అప్పటికే అవి అదృశ్యమైపోయాయి.

నా అంతటి సమర్థులు ఇక్కడ ఎవ్వరూ లేరు,
శరీరంతో దానిని స్పృశించకుండానే

అనంతకాలం నుంచీ ఈ విశ్వాన్ని నిర్వహిస్తున్నాను.

ఆయన నీ హృదయంలోనే నివసిస్తాడు,
ఆయన నీ హృదయం నుంచి విభిన్నమై లేడు.
ఆయన ఎంత విభిన్నుడిగా కనిపించినా గానీ,
ఆయన విభిన్నమై లేడు.

మనం ఈ శరీరంతో ఏకమై వున్నామని మనకు మనం చెప్పుకుంటూనే ఉండవచ్చు, కానీ మనం అలా ఉండజాలము. మనం దైవత్వం నుంచి భిన్నంగా ఉన్నామని మనకు మనం చెప్పుకుంటూనే ఉండవచ్చు, కానీ మనం అలా ఉండజాలము. మనం ఈ రెండింటినీ కలిపి అవగాహన చేసుకున్నప్పుడు మాత్రమే మనం అవగాహన చేసుకోగలం. మీరు శరీరంతో ఏకమై వున్నారని మీరు అనుకున్నంత కాలం, మీకు దివ్యత్వంతో ఏ సంబంధమూ లేదు అని కూడా మరో వైపు మీరు అనుకుంటారు.

మీరు దివ్యత్వంతో జోడించబడి వున్నారు అనేది మీరు తెలుసుకున్న రోజు, ఆ రోజు మీరు తెలుసుకుంటారు : " ఓహో, అద్భుతాల్లోనే అద్భుతం ! నేను శరీరంతో ఎన్నడూ ఏకమై లేను !"

ఆయన నీ హృదయంలోనే నివసిస్తాడు;
ఆయన నీ హృదయం నుంచి విభిన్నమై లేడు.

ఆ అత్యున్నత వాస్తవం నీ హృదయంలోనే నివసిస్తుంది.

ఆయన నీ హృదయంలోనే నివసిస్తాడు...

ఆయన తన గృహాన్ని అక్కడ నిర్మించుకున్నాడు...

ఆయన నీ హృదయం నుంచి విభిన్నమై లేడు.
ఆయన ఎంత విభిన్నుడిగా కనిపించినా గానీ,
ఆయన విభిన్నమై లేడు.

ఎందుకు ? ఎందుకంటే విభిన్నంగా ఉండగల మార్గమే లేదు. దివ్యత్వం నుంచి విభిన్నమై ఉండగల సంభావ్యతే లేదు మరి ప్రపంచంతో ఏకమై ఉండగల మార్గమే లేదు. అది సాధ్యం కాకపోయినప్పటికీ, మనం జన్మజన్మలుగా దీనిని సంభాళించడానికి ప్రయత్నిస్తున్నాము.

మీరు మేల్కొన్నరోజు ... మరి నిశ్చయంగానే ఒకరోజు మీరు మేల్కొంటారు, ఎందుకంటే ఎవరైనా నిద్రావస్థలో ఉంటే కనుక, వాళ్ళు ఎంతకాలం నిదురిస్తూనే ఉండగలరు ? ఎందుకంటే మేల్కొనడం అనేది నిదురించేవాడి యొక్క స్వభావం ... నిద్రపోవడం అనేదాని అర్థం అదే. ఒకరు మేల్కొనగలరనీ, ఆ మేల్కొనడమే ఒకరి యొక్క శక్యత అనీ నిద్ర సూచిస్తుంది. మేల్కొనలేనివారు ఎలా నిదురించగలరు ? కేవలం మేల్కొనగలిగినవారు మాత్రమే నిద్రపోగలరు.

ఏదో ఒకరోజు మీరు మేల్కొంటారు. మీరు మేల్కొన్నప్పుడు మీరు కూడా అనుకుంటారు : **నా అంతటి సమర్థులు ఇక్కడ ఎవ్వరూ లేరు.** శరీరంతో దానిని స్పృశించకుండానే అనంత కాలం నుంచే ఈ విశ్వాన్ని నిర్వహిస్తున్నాను. "... మరి ఈ విశ్వానికి ఊతమిస్తున్నది నేనే, మరెవ్వరూ దానికి ఆసరాను ఇవ్వడం లేదు. నేను దానిని స్పృశించలేదు మరి అయినాగానీ నేను దానికి ఆసరా ఇస్తున్నాను."

జెన్ గురువులు చెబుతారు : " నదిని దాటండి కానీ ఆ జలం మిమ్మల్ని స్పృశించజాలదని జ్ఞాపకం ఉంచుకోండి." వాళ్ళు చెబుతున్నది ఏమిటంటే సాక్షీతత్వం అంటే ఏమిటి అనేది మీరు అవగాహన చేసుకుంటే కనుక, అప్పుడు మీరు ఆ నదిని దాటుతారు కానీ ఆ జలం ఈ శరీరాన్ని స్పృశిస్తుంది, అది మిమ్మల్ని స్పృశించజాలదు. మీరు సాక్షీతత్వంలోనే ఉంటారు.

సాధారణ జీవితంలో ఓ సాక్షిగా ఉండడం నేర్చుకోండి. కొద్దిగా ప్రయత్నాన్ని చేయండి. కొన్నిసార్లు మీరు నడుస్తోన్నప్పుడు, మీరు నడవడం లేదు, కేవలం ఈ శరీరమే నడుస్తోంది అన్న విధంగా నడవండి. మీరు " ఎక్కడకూ పోరు, ఎక్కడ నుంచీ రారు." మిమ్మల్ని మీరు బాటపై నడుస్తూండగా వీక్షించండి మరి ఒక సాక్షిగా ఉండండి. భోజనాల బల్ల వద్ద భుజిస్తున్నప్పుడు, మిమ్మల్ని మీరు భుజిస్తూండగా వీక్షించండి. ఈ శరీరం భుజిస్తోంది, ఈ చేతులు ఒక చెంచా నిండుగా తీసుకుని, దానిని నోటి వద్దకు తీసుకువస్తాయి : మీరు నిశ్శబ్దంగా వీక్షిస్తూ నిలిచి వుంటారు. సంయోగిస్తూండగా మిమ్మల్ని మీరు వీక్షించండి. ఆగ్రహంతో ఉండగా మిమ్మల్ని మీరు వీక్షించండి. ఆనందంలో వీక్షించండి, ఆవేదనలో వీక్షించండి.

నెమ్మది, నెమ్మదిగా మీరు సాక్షికి సహకరిస్తారు మరి సమర్థిస్తారు. ఒకరోజు ఆ ప్రకటన మీ అంతరంగంలో కూడా సంభవిస్తుంది, ఆ అత్యున్నత వర్షం వస్తుంది, అమృతం కురుస్తుంది. అది మీ హక్కు, అది మీ జన్మహక్కు, మీ అంతర్జాత స్వభావం యొక్క హక్కు మీరు ఎప్పుడు కోరుకున్నాగానీ మీరు దానిని ప్రకటించవచ్చు.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
నా వద్ద అసలేమీ లేదు, లేదా మాట లేక ఆలోచన ద్వారా
పరివేష్టింపబడగల దానినంతటినీ నేను కలిగి వున్నాను.

ఒక విధంగా ఏదీ తనది కాదు అని జనకుడు చెబుతున్నాడు ఎందుకంటే అతను లేడు. అతను ఇక లేడు, ' అతనిది ' ఎలా ఉండగలదు ? కనుక ఒక అర్థంలో ఏదీ అతనిది కాదు మరి మరొక అర్థంలో సకలమూ అతనిదే. ' అతను ' ఇక ఎంతమాత్రం లేకపోవడంతో, కేవలం అస్తిత్వం మాత్రమే అతనిలో మిగిలి వుంటుంది ; దైవత్వం మిగిలి వుంటుంది, మరి సకలమూ దానికే చెందుతుంది. ఏదీ అతనిది కాదు మరి సకలమూ అతనిదే అన్నట్లుగా కనిపించే చోట, ఈ విరుద్ధమైనది సంభవించింది.

అద్భుతమైనవాడను నేను, నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.
నావద్ద అసలేమీ లేదు, లేదా మాట లేక ఆలోచన ద్వారా
పరివేష్టింపబడగల దానినంతటినీ నేను కలిగి వున్నాను.

కళ్ళకు ఏది గోచరమవుతుందో, ఇంద్రియాల ద్వారా ఏ అనుభవమైతే వస్తుందో అది అతనిది కాదు, ఎందుకంటే అతను గమనించేవాడు. కానీ అతను గమనించేవాడుగా మారగానే అంతా తనదే అని అతను కనుగొంటాడు, ఎందుకంటే సమస్త అస్తిత్వం యొక్క కేంద్రం అతనే.

గమనించేవాడు మీ వ్యక్తిగత రూపం కాదు, గమనించేవాడు మీ విశ్వరూపం. అనుభవించేవారుగా మనం అందరం విభిన్నమైనవారుగా ఉంటాము, కర్తగా మనం అందరం విభిన్నులై ఉంటాము ... కానీ గమనించేవారుగా మనం ఏకమై ఉంటాము. నాలోని గమనించేవాడు మరి మీలోని గమనించేవాడూ ఒకరే. మీలోని గమనించేవాడు మరి అష్టావక్రుడిలోని గమనించేవాడూ విభిన్నమైనవారు కాదు, మీ గమనించేవాడు మరి అష్టావక్రుడి యొక్క గమనించేవాడు ఒకరే. మీ గమనించేవాడూ మరి బుద్ధుడి యొక్క గమనించేవాడు విభిన్నులు కాదు.

మీరు ఓ గమనించేవాడుగా అయిన రోజు మీరు బుద్ధుడు, అష్టావక్రుడు, కృష్ణుడు అయిన రోజు... ఆ రోజు మీరు సర్వమూ అవుతారు. మీరు గమనించేవారుగా అయినప్పుడు మీరు విశ్వం యొక్క కేంద్రం అవుతారు. ఈ వైపు నుంచి మీరు మాయమైపోతారు, ఆ వైపు నుంచి మీరు సిద్ధించుకుంటారు. ఈ చిన్న ' నేను '

అనేదానిని, ఈ చిన్న బిందువును మీరు కోల్పోతారు ... మరి అనంతమైన మహాసాగరాన్ని పొందుతారు.

ఈ సూత్రాలు మీ స్వంత ఉనికిని పూజించేందుకు సూత్రాలు. స్వయంగా మీరే భక్తులు, స్వయంగా మీరే దివ్యత్వం అని ఈ సూత్రాలు చెబుతున్నాయి. ఆరాధింపబడిన యోగ్యతగలవారు మీరే అనీ మరి ఆరాధించేవారూ మీరే అనీ ఈ సూత్రాలు చెబుతాయి. ఆ ఇరువురూ మీలోనే ఉనికిలో ఉన్నారని ఈ సూత్రాలు చెబుతున్నాయి : వాళ్ళను కలుసుకోనివ్వండి ! ఈ సూత్రాలు అత్యంత అద్వితీయమైనదేదో చెబుతున్నాయి: మీ స్వంత పాదాల వద్ద ప్రణమిల్లండి, మీలోని మిమ్మల్ని కోల్పోండి, మీ లోపల మీరు మునిగిపోండి ! మీ భక్తుడు మరి మీ భగవంతుడు మీ అంతరంగంలోనే ఉన్నారు. అక్కడ ఆ ఐక్యతను సంభవించనివ్వండి, ఆ మిశ్రమాన్ని సంభవించనివ్వండి.

మీ అంతరంగంలో మీ భక్తుడు మరి మీ దైవత్వం కలుసుకున్నప్పుడు మరి ఏకమైనప్పుడు ఆ విప్లవం సంభవిస్తుంది. భగవంతుడూ మిగిలి ఉండడు, భక్తుడూ మిగిలి ఉండడు. ఏదో మిగిలి వుంటుంది... రూపరహితంగా, గుణరహితంగా, పరిమితులకు అతీతంగా, మృత్యువుకు అతీతంగా, కాలానికి అతీతంగా, స్థలానికి అతీతంగా. ద్వితం అనేది మాయమైపోతుంది, అద్వైతం మిగిలి వుంటుంది.

ఈ అద్వైత క్షణాల యొక్క మొదటి క్షణదర్శనాలనే మనం ధ్యానం అని పిలుస్తాం. ఈ అద్వైత క్షణాలు స్థిరపడడం ప్రారంభించినప్పుడు దానినే మనం 'సబీజ సమాధి' అని పిలుస్తాం. మరి ఈ అద్వైత క్షణం శాశ్వతమైపోయినప్పుడు, దానిని తొలగించగల మార్గమే లేనంతగా అది స్థిరమైపోయినప్పుడు..., దీనినే మనం 'మనోరహితమైన, నిర్బీజ సమాధి' అని పిలుస్తాం.

ఇది రెండు విధాలుగా సంభవించవచ్చు ... కేవలం ఎరుక ద్వారా, జనకుడికి సంభవించినట్లుగా, కేవలం అవగాహన ద్వారా.... కానీ మహోన్నత వివేకం అవసరమవుతుంది, పదునైన వివేకం అవసరమవుతుంది, మహా తీవ్రత అవసరమవుతుంది. మీ అంతరంగంలో ఒక అత్యంత పదునుతేరిన ఎరుక అవసరమవుతుంది. అది అవ్యవధిగా సంభవించగలదు ! ఈ సంభవాన్ని మీరు కనుగొంటే కనుక, మంచిది. ఇది సంభవించడం లేదని మీరు కనుగొంటే కనుక అప్పుడు ఈ సూత్రాలను వల్లె వేస్తూ కూర్చోకండి. వాటిని వల్లె వేయడం ద్వారా అది సంభవించదు. ఈ సూత్రాలు ఎటువంటివంటే వాటిని వింటూండగా అది సంభవిస్తే కనుక, అది సంభవిస్తుంది ; వింటూండగా మీరు దానిని చేజార్చుకుంటే

కనుక, అప్పుడు మీరు వాటిని పదిలక్షలసార్లు వల్లెవేసినా అది సంభవించదు. ఎందుకంటే పునరుక్తం చేయడం ద్వారా అది సంభవించదు, మీ మస్తిష్కపు పదును వల్లె వేయడం ద్వారా రాదు ; వల్లె వేయడం ద్వారా దాని వాడిమి పోతుంది.

ఒక మార్గమేమిటంటే మీరు ఈ సూత్రాలను విన్నప్పుడు అది సంభవిస్తుంది. అది సంభవిస్తే కనుక అది సంభవిస్తుంది, మీరు ఏమీ చేయలేరు. అది సంభవించకపోతే కనుక, అప్పుడు నెమ్మది, నెమ్మదిగా మీరు ధ్యానంతో మొదలు పెట్టాల్సి వస్తుంది, ధ్యానం నుంచి మనస్సుతో కూడిన సమాధి వరకూ, మనస్సుతో కూడిన సమాధి నుంచి మనోరహిత సమాధి వరకూ... మీరు పయనించాల్సి వస్తుంది. ఆ గంతు సంభవిస్తే కనుక, మంచిదే ; లేదంటే మీరు ఆ మెట్లపై వెళ్ళాల్సి వస్తుంది. ఆ గంతు సంభవిస్తే కనుక, అది సంభవిస్తుంది. కొందరికి అది సంభవించవచ్చు. అన్ని అద్భుతాలూ సాధ్యమే, ఎందుకంటే మీరు అద్భుతాలకే అద్భుతం. దానిలో అసాధ్యమైనది ఏమీ లేదు. నేను చెప్పేది వింటూ ఇక్కడ కూర్చుని ఉండగా ఆ గంతు ఎవరికైనా సంభవించవచ్చు. మీరు మధ్యలో రాకుండా ఉంటే కనుక ; మీ ' నేను ' అనేదానిని మీరు భిన్నమైనదిగా ఉంచితే కనుక ; మీ పాదరక్షలు మరి దుస్తులను తీసేసి మరి వాటిని ప్రక్కన పెట్టేసినట్లుగా మీరు మీ వివేకాన్ని ప్రక్కన పెట్టినట్లయితే కనుక ; నా ముందు మీరు ఒక స్వచ్ఛమైన, దిగంబరమైన చైతన్యంగా తయారైతే కనుక, ఈ గంతు సంభవించగలదు. అది జనకుడికి సంభవించినట్లుగానే మీకు సంభవించగలదు. అది సంభవిస్తే మంచిదే. అప్పుడు దానిలో ఏ విధానమూ లేదు. అది సంభవించేలా సన్నద్ధం కావడం ఎలా అని మీరు అడుగలేరు.

మీరు ఏర్పాట్ల గురించి అడిగితే కనుక అది సంభవించదు. అప్పుడు మరొక మార్గం వుంది. అప్పుడు పతంజలి మీ మార్గమవుతాడు... లేదా మహావీరుడు లేదా బుద్ధుడు. అష్టావక్రుడు మీ మార్గం కాదు. ఇందువలనే అష్టావక్ర గీత అంధకారంలోనే పడి వుంది. అంతటి అత్యావశ్యకత, అంతటి తీవ్రత, అంతటి ప్రకాశం అరుదైనది. తనను తాను అనేక జన్మలుగా సన్నద్ధం చేసుకున్న వ్యక్తికి ఇది సంభవించగలదు. కానీ అది సంభవిస్తుంది ! వందమందిలో కేవలం ఒకరికి లేదా ఇద్దరికి, కానీ అది సంభవిస్తుంది. అప్రధానమైన సంఘటనేదో ఎవరినైనా రూపాంతరం చెందించిన అనేక చారిత్రక గాథలు వున్నాయి.

బెంగాల్‌లోని ఒక సాధువు గురించి నేను విన్నాను. అతను న్యాయస్థానంలో ఒక గుమస్తాగా, ఓ హెడ్ గుమాస్తాగా ఉండేవాడు, అనంతరం అతను పదవీ విరమణ చేశాడు. అతని పేరు రాజాబాబు. అతను బెంగాలీవాడు, కనుక అవశ్యంగానే అతను

కొద్దిగా అధికారపూర్వకమైనవాడు, ఒక **బాబు.** అతను అరవైయేళ్ళపైబడినవాడు. ఒక ఉదయం అతను నడుస్తూ బయటకు వెళ్ళాడు. అది తెల్లవారుఝాము, సూర్యుడు ఇంకా ఉదయించలేదు. మూసి వున్న తలుపుల వెనుక ఎవరో స్త్రీ తన గుడిసెలో ఎవరినో మేల్కొలుపుతోంది. అది ఆమె కుమారుడు లేదా సోదరుడు అయివుండవచ్చు... ఆమె ఎవరినో నిద్ర లేపుతోంది. ఆమె అంది, " రాజాబాబూ మేలుకో, చాలా ఆలస్యమైపోయింది !"

రాజాబాబు తన చేతికర్రతో కేవలం బయటకు వెళుతన్నాడు. తన ఉదయపు వ్యాహ్యాళికి వెళుతున్నాడు. అకస్మాత్తుగా, ఈ ప్రాతఃకాల సమయంలో, సూర్యుడు ఉదయించబోతున్నాడు, ఆకాశమంతటా గులాబి వర్ణం వ్యాపిస్తోంది, పక్షులు పాడడం ప్రారంభించాయి, ప్రకృతి సమస్తం జాగృతితో నిండివుంది ... అది సంభవించింది !

ఆ స్త్రీ మరెవరినో మేల్కొల్పుతోంది, ఈ రాజాబాబుకు ఆమె ఏమీ చెప్పనైనా చెప్పలేదు. ఈ రాజాబాబు ఇటుగా వెళుతున్నాడనైనా ఆమెకు తెలియదు. అతను నడుస్తూ వెళుతున్నాడు మరి లోపల ఎవరికో ఆమె చెబుతోంది, " రాజాబాబు మేలుకో, తెల్లవారింది, చాలా ఆలస్యమైపోయింది. మేలుకో, మేలుకుంటావా నువ్వు ? నువ్వు ఎంత కాలం నిదురిస్తూనే ఉండబోతున్నావు ? "

అతను విన్నాడు ... అది సంభవించింది. అతను ఇంటికి తిరిగి వెళ్ళలేదు, అతను వెళుతూనే ఉన్నాడు మరి అరణ్యానికి చేరుకున్నాడు. అతని కుటుంబం కనుగొంది : అతని కోసం అన్వేషిస్తూ వాళ్ళు వచ్చారు మరి అరణ్యంలో అతనిని కనుగొన్నారు. వాళ్ళు అడిగారు, " ఏం జరిగింది ? "

అతను నవ్వడం మొదలు పెట్టాడు. అతన అన్నాడు, " ఇక చాలు ! రాజాబాబు మేల్కొన్నాడు, ఇక మీరు వెళ్ళవచ్చు ! "

వాళ్ళు అన్నాడు, " నీ ఉద్దేశ్యం ఏమిటి ? నువ్వు ఏం చెబుతున్నావు ? "

అతను అన్నాడు, " ఇక చెప్పేందుకు ఏమీ లేదు, వినేందుకు ఏమీ లేదు, ఇప్పటికే ఎంతో ఆలస్యమైపోయింది ... ఎంతో కాలం ఇప్పటికే చేజారిపోయింది. ఇప్పుడు నేను అవగాహన చేసుకున్నాను. ఇది ప్రభాత సమయం, ప్రకృతి సమస్తం మేల్కొంటోంది ... మరి ఈ మేల్కొనడంలో చిట్టచివరకు నేను కూడా మేల్కొన్నాను. ఒక స్త్రీ అంటోంది, " మేలుకో, ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది." ఆమె మాటలు చేరవలసిన చోటుకు చేరాయి.

ఈ స్త్రీ అష్టావక్రుడు కాదు, స్వయంగా ఆమే జాగృతం కాలేదు. కనుక కొన్నిసార్లు అది సంభవిస్తుంది. మీ వివేకం ఘనీభవిస్తే కనుక, మీ ఫలం పరిపక్వమైతే కనుక, అప్పుడు ఒక పవనం వీచినా... లేదా ఏ పవనమూ వీస్తూండకపోయినా కొన్నిసార్లు పక్వమైతే ఫలం తనంతట తానే రాలిపోతుంది. అది సంభవిస్తే కనుక, అది సంభవిస్తుంది ! కానీ అది సంభవించకపోతే కనుక, అధైర్యపడకండి, దుఃఖపడకండి ... అది ఆకస్మికం కానట్లయితే, అప్పుడు అది దశలవారీగా జరుగవచ్చు. కొన్నిసార్లు అది ఆకస్మికంగా సంభవిస్తుంది ... ఒక మినహాయింపుగా. కనుక అష్టావక్ర గీత ఒక మినహాయింపు. దానిలో ఏ విధానమూ లేదు, ఏ మార్గమూ లేదు.

జపాన్‌లో జెన్ యొక్క రెండు సంప్రదాయాలు ఉన్నాయి. ఒక సంప్రదాయం ఆకస్మిక జ్ఞానోదయానికి చెందినది. వాళ్ళు చెప్పేది అష్టావక్రుడు చెప్పినదానిలానే వుంటుంది. ఆ గురువు ఏమీ బోధించడు. ఆయన వస్తాడు మరి కూర్చుంటాడు. అతను ఆ మనోస్థితిలో ఉంటే కనుక అతను ఏదైనా చెబుతాడు. అది సంభవిస్తే కనుక, అది సంభవిస్తుంది.

ఒకసారి ఓ చక్రవర్తి ఒక జెన్ గురువును తన రాజప్రాసాదానికి ఆహ్వానించాడు. ఆ గురువు వచ్చాడు మరి వేదికపై ఆశీనుడయ్యాడు. ఆ చక్రవర్తి అతని కోసం ఎంతో ఆత్రుతతో నిరీక్షిస్తున్నాడు. అతను ఆయన ముందు ఓ శిష్యుడివలే కూర్చున్నాడు. వేదికపై కొద్దిసేపు కూర్చున్న తరువాత ఆయన ఎడమ వైపు మరి కుడి వైపు చూశాడు, తన పిడికిలితో బల్ల మీద కొట్టాడు, లేచి నిలబడ్డాడు మరి వెళ్ళిపోయాడు !

ఆ చక్రవర్తి విస్మయానికి గురయ్యాడు, మరి ఏం జరిగిందని ఆశ్చర్యపోయాడు. అతను తన మహా మంత్రిని అడిగాడు. ఆ మంత్రి చెప్పాడు, " నాకు ఆయన తెలుసు... ఆయన ఇంతకన్నా భావగర్భితమైన వ్యాఖ్యానాన్ని ఎన్నడూ చేయలేదు. కానీ మీరు దానిని అర్థం చేసుకోగలిగితే కనుక మీరు దానిని అర్థం చేసుకుంటారు, మీరు దానిని అర్థం చేసుకోలేకపోతే కనుక మీరు దానిని అర్థం చేసుకోలేరు."

ఆ చక్రవర్తి అన్నాడు, " ఇది ఒక వ్యాఖ్యానమా ? బల్లపై తన పిడికిలితో మూడుసార్లు గుద్దడం మరి వెళ్ళిపోవడం ... ఇదేనా అది ? "

ఆ మంత్రి చెప్పాడు, " ఆయన మనల్ని మేల్కొల్పడానికి ప్రయత్నించాడు మరి అనంతరం వెళ్ళిపోయాడు, అది సాధ్యమైతే కనుక మనం మేల్కొనగలిగేలా. ఆయన కేవలం గంటను మ్రోగించాడు మరి వెళ్ళిపోయాడు."

...." రాజాబాబూ, మేలుకో, తెల్లవారిపోయింది."

ఆ మంత్రి అన్నాడు, " ఈ గురువు యొక్క ఇతర ప్రసంగాలను నేను విన్నాను, కానీ ఇంతకన్నా అధిక శక్యతగల, అధిక జాగృతిగలదైన ... రెచ్చగొట్టే ప్రసంగాన్ని అతను చేయడం నేను ఎన్నడూ వినలేదు. కానీ దిగులు పడకండి, ఎందుకంటే ఆయన చెప్పేది నేను అనేక పర్యాయాలు విన్నాను మరి అయినాగానీ నేను ఇంకా మేల్కొనలేదు. మీరు కేవలం మీ మొదటి ప్రసంగాన్ని మాత్రమే విన్నారు. వింటూ ఉండండి, బహుశా అది సంభవిస్తుంది."

అది ఒక తక్షణమైన ఘటన, దానికి కార్యకారణాలతో సంబంధం లేదు. అది పూర్తిగా నూతనమైనది, మీ గతంతో దానికి ఏ సంబంధమూ లేదు ... అది సంభవిస్తే కనుక అది సంభవిస్తుంది. మీరు నీటిని వంద డిగ్రీలదాకా వేడి చేసినప్పుడు అది ఆవిరిగా మారిపోయినట్లుగా, ఇది ఒక విజ్ఞానశాస్త్ర ప్రయోగం కాదు. ఈ సంఘటన అనేది నీటిని వేడి చేయకుండానే ఆవిరి పుడుతున్నట్లుగా ఉంటుంది. దానికి ఏ శాస్త్రీయ వివరణా ఉండదు.

అష్టావక్రుడు విజ్ఞాన శాస్త్రానికి అతీతుడు. మీరు వైజ్ఞానిక మస్తిష్కాన్ని కలిగి వుండి మరి మీరు, " ఆ విధంగా అది ఎలా సంభవించగలదు ? ... ఏదైనా చేయడం ద్వారా మాత్రమే అది సంభవించగలదు," అని అంటే కనుక, అప్పుడు మీ వైజ్ఞానిక మస్తిష్కాన్నే అనుసరించండి. అప్పుడు బుద్ధుడిని అష్టాంగ మార్గం గురించి అడగండి. అప్పుడు పతంజలిని అతని యోగం గురించి అడగండి. అప్పుడు విధానాలు ఉంటాయి. ఇది యోగం కాదు, భారతీయ తత్త్వశాస్త్రం **సాంఖ్య** అని పిలిచేదాని యొక్క స్వచ్ఛమైన వ్యక్తీకరణే ఇది.

అష్టావక్రుడు అనేకులను మేల్కొలపగలడని కాదు. ఒక జనకుడు లేదా ఇద్దరు మేల్కొనగలిగితే కనుక అదే తగినంత అద్భుతం. జనకుడు మేల్కొనగలిగాడు అనేదే చాలు. మరి అష్టావక్రుడు మరెవరినైనా మేల్కొల్పగలిగాడని ఎక్కడా పేర్కొనబడలేదు.

బుద్ధుడు అనేకులను మేల్కొలిపాడు. ఇప్పటికీ పతంజలి ప్రజలను మేల్కొల్పుతూనే వున్నాడు. అష్టావక్రుడు కేవలం ఒకే ఒక వ్యక్తిని మేల్కొలిపాడు ... మరి ఈ ఒక్కడినైనా ఆయన మేల్కొలిపాడు అనేది చెప్పడం కష్టం. జనకుడు మేల్కొనేందుకు సిద్ధంగా ఉన్నాడు, అష్టావక్రుడు కేవలం ఒక పరికరం మాత్రం కాదు. ఓ కారణం కాదు ... ఓ ఉత్ప్రేరకం.

ఆకస్మిక జ్ఞానోదయం యొక్క సాధనాలతో గురువు కేవలం ఒక ఉత్ప్రేరకం మాత్రమే. ఆయన ప్రయత్నిస్తాడు ... అది సంభవిస్తే కనుక అది సంభవిస్తుంది.

అది ఓ విజ్ఞాన శాస్త్రం కాదు. అది సంభవించకపోతే కనుక, అధైర్యపడవద్దు. అది మీకు సంభవిస్తుంది అని గురువు నమ్మకాన్ని కలిగి వుండలేడు. అది కొందరికి సంభవిస్తుంది, మరి అది ఈ విధంగా సంభవించని వారికి కనీసం వాళ్ళ దాహార్తి ప్రేరేపించబడుతుంది. అప్పుడు వాళ్ళు ఒక పద్ధతి కోసం అన్వేషిస్తారు, వాళ్ళు ఈ మార్గంపై పురోగమిస్తారు.

సాధారణ నియమం ఏమిటంటే అది కేవలం విధానాల ద్వారానే సంభవించగలదు. అది ఏ విధానాలూ లేకుండా సంభవిస్తే కనుక అది ఒక మినహాయింపు. అది అసాధారణమైనది.

కనుక ఇక్కడ శ్రద్ధగా వినండి. అది సంభవిస్తే కనుక, అనుగ్రహింపబడి ఉండండి ... అది సంభవించకపోతే కనుక, అధైర్యపడకండి.

హరి ఓం తత్ సత్!

ఆకస్మిక జ్ఞానోదయం అనేది కార్యకారణాల యొక్క నియమం చేత బంధింపబడి లేదు అని నిన్న మీరు చెప్పారు. కానీ అస్తిత్వంలో ఏదీ ఆకస్మికమై లేకపోతే ... ఏదీ యాదృచ్ఛికంగా జరుగకపోతే కనుక అలాంటప్పుడు జ్ఞానోదయంలాంటి మహోన్నత అనుభవం ఈ విధంగా ఎలా సంభవించగలదు ?

నిన్న మీరు అన్నారు మీ హృదయానుభూతులను మీ వివేకం నియంత్రించేందుకు అనుమతించకండి. కానీ ఓషో, మీ ప్రసంగాలు పూర్తి తార్కికమైనవిగా నాకు అనిపిస్తాయి.

వేల జన్మలలో కూడా మీరు అనాయాసంగా నాకు అందించినంత నేను సాధించలేకపోయేవాడిని. దయచేసి నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి !

మద్యం చేదుగా ఉంటుందనీ మరి గుండెను మండిస్తుందనీ నేను విన్నాను ; కానీ మీ మధువు యొక్క రుచి మరోవిధంగా వుంది.

విశ్వాసం మరి స్వయం సూచన అనేవి ఒకటే మరి ఒకే విషయమేనా ? విశ్వాసానికి మరి అంతర్గత-స్వభావం, లేదా ఎరుకకు మధ్యన ఉన్న వ్యత్యాసం ఏమిటి ?

రామకృష్ణ పరమహంస యొక్క కాళీమాత పూర్తిగా అతని విశ్వాసం, అతని ప్రసరణేనా, లేదా ఆమె తనదైన స్వీయ వాస్తవాన్ని కలిగి వుందా ?

అలౌకికుడు లేదా భగవంతుడితో సంభాషణ అనేది సాధ్యం కాదా?

నా జీవితం ఒక కృతజ్ఞతగా, ఒక ఆశీర్వాదంగా పరిణమించింది. ఏ ప్రశ్నా రావడం లేదు, కనుక నేను ఒకదానిని రూపొందిస్తున్నాను.

దయచేసి, నా భిక్షాపాత్రలోకి ఈ రోజు కేవలం రెండు పువ్వులను వెయ్యండి.

10

కార్య కారణాలకు అతీతంగా ...

మొదటి ప్రశ్న :

ప్రియమైన ఓషో,

ఆకస్మిక జ్ఞానోదయం అనేది కార్యకారణాల యొక్క నియమం చేత బంధింపబడి లేదు అని నిన్న మీరు చెప్పారు. కానీ అస్తిత్వంలో ఏదీ ఆకస్మికమై లేకపోతే ... ఏదీ యాదృచ్ఛికంగా జరుగకపోతే కనుక అలాంటప్పుడు జ్ఞానోదయంలాంటి మహోన్నత అనుభవం ఈ విధంగా ఎలా సంభవించగలదు ?

అస్తిత్వంలో కారణం లేకుండా ఏదీ సంభవించదు అనేది సత్యమే, కానీ స్వయంగా అస్తిత్వమే కారణరహితమైనది. అస్తిత్వానికి ఏ కారణమూ లేదు... జ్ఞానోదయం అంటే అస్తిత్వం. మిగిలినదంతా సంభవిస్తుంది. అస్తిత్వం సంభవించదు ... అది ఉంది. అది లేని క్షణం ఎన్నడూ లేదు, అది ఉండని క్షణం ఎన్నడూ రాదు. మిగిలినదంతా సంభవిస్తుంది : మానవుడు సంభవిస్తాడు, వృక్షాలు సంభవిస్తాయి, పక్షులు మరి జంతువులు సంభవిస్తాయి. అస్తిత్వం అనేది ఓ సంభవం కాదు, అస్తిత్వం ఉంది. జ్ఞానోదయం అనేది ఓ సంభవం కాదు, అది అలా వున్నట్లయితే కనుక మరి అది కారణరహితంగా సంభవిస్తే కనుక, అప్పుడు అది ఒక ఆకస్మిక ఘటన అవుతుంది. జ్ఞానోదయం సంభవించదు, ఎందుకంటే జ్ఞానోదయం అనేది మీ స్వభావం; మీరే జ్ఞానోదయం. ఇందువలనే అది ఆకస్మికంగా సంభవించగలదు మరి అది కారణం లేకుండా సంభవిస్తుంది.

మీరు అడిగారు, "... జ్ఞానోదయంలాంటి మహోన్నత అనుభవం ఈ విధంగా ఎలా సంభవించగలదు ?" ఎందుకంటే అదే మహోన్నతమైనది. అధమమైన ప్రతిదీ కారణత్వం ద్వారా సంభవిస్తుంది. మిగిలిన విషయాలలాగా సమాధి కారణత్వం ద్వారా సంభవిస్తే కనుక, అప్పుడు అది అధమమైనది మరి సాధారణమైనది అవుతుంది.

నీటిని వంద డిగ్రీల దాకా వేడి చెయ్యండి మరి అది ఆవిరిగా మారుతుంది : అదే రీతిగా మీరు వంద డిగ్రీల తపోసాధనను చేసి మరి సమాధి సంభవిస్తే కనుక, అప్పుడు అది ఒక వైజ్ఞానిక ప్రయోగశాలలో వశం చేసుకోబడి మరి అతి త్వరలోనే మతాన్ని కాపాడగల మార్గమేదీ ఉండదు... ఎందుకంటే కారణంతో సంభవించేది ఏదైనా విజ్ఞాన శాస్త్రం పట్టులోకి వస్తుంది. ఒక కారణాన్ని కలిగి వున్నది ఏదైనా విజ్ఞాన శాస్త్రం యొక్క పరిధులలోకే వస్తుంది.

మతం అనేది మతంగానే ఉంటుంది ఎందుకంటే జ్ఞానోదయం అనేది కారణరహితమైనది. విజ్ఞాన శాస్త్రం దానిని ఎన్నటికీ ఇముడ్చుకోలేదు. కారణభూతమైనదంతా తుదకు విజ్ఞాన శాస్త్రంగా తయారవుతుంది. ఎన్నటికీ విజ్ఞాన శాస్త్రంగా పరిణమించనిది కేవలం ఒకే ఒక విషయం మిగిలి వుంటుంది, అది స్వయానా అస్తిత్వమే, ఎందుకంటే అస్తిత్వం కారణరహితమైనది, అది కేవలం వుంది. విజ్ఞాన శాస్త్ర వద్ద దానికి వివరణ లేదు. ఈ విస్తారతకు, ఈ సమస్తానికీ కారణం అనేది ఎలా ఉండగలదు ? ... ఎందుకంటే ఉన్న ప్రతి ఒక్కటీ, దానిలో మమేకమై వుంది, దానికి బాహ్యంగా ఏదీ లేదు.

ఇందువలనే సమాధి అనేది కార్య కారణ నియమం ద్వారా సంభవించదు ... ఎందుకంటే అది పరిమితమైనది కాదు, అది విస్తారమైనది.

మీరు అడిగారు, "... జ్ఞానోదయంలాంటి మహోన్నత అనుభవం..." అది ఖచ్చితంగా మహోన్నతమైనది ఎందుకంటే అది మీ కార్య కారణాల యొక్క పరిమితి నియమంపై ఆధారపడి లేదు. ఇన్ని పుణ్యకార్యాలు చెయ్యండి మరి సమాధి సంభవిస్తుంది ; అంత దానాన్ని చెయ్యండి మరి సమాధి సంభవిస్తుంది. అప్పుడు సమాధి మీ లెక్కలను అనుసరిస్తుంది. జమా ఖర్చుల పుస్తకంలోకి వస్తుంది ; అది తన ఉన్నతత్వాన్ని నిలుపుకోదు. అది కారణరహితంగా సంభవిస్తుంది.

ఇందువలనే అది కటాక్షంలా సంభవిస్తుంది అని భక్తులు చెబుతారు. మీరు దానిని సంభవింపజేయడం ద్వారా అది సంభవించదు. అది మీపై కురుస్తుంది ... అకస్మికంగా ఓ బహుమతిలా, ఓ కటాక్షంలా.

అలాంటప్పుడు మన ప్రయాస మరి ప్రయత్నాల యొక్క ఫలితమేమిటి ? మీరు అష్టావక్రుడిని అవగాహన చేసుకోగలిగితే కనుక, అప్పుడు ఏ ప్రయత్నమైనా వ్యర్థమైనదే అవుతుంది ; అప్పుడు మీరు నిరుపయోగంగా క్రతువులు మరి ఆచారాలను అవలంబిస్తున్నారు. సాధన చేయాల్సిన అవసరమే లేదు, అవగాహన చేసుకోవడమే

చాలు. కేవలం అస్తిత్వమే ఉంది అని అవగాహన చేసుకోండి, మరి అన్వేషణను వదిలెయ్యండి.

దీనిని అవగాహన చేసుకోండి : మనం ఏదైె ఉన్నామో అది మూలంతో అనుసంధానించబడి వుంది, అందువలన విషయాలను చేస్తూ నలుదిక్కులకూ పరుగెత్తడాన్నీ మరి పునరైక్యం కావడం కోసం ప్రయత్నాలను చేయడాన్నీ వదిలేయాలి ... మరి ఆ ఐక్యత సంభవిస్తుంది. ఆ ఐక్యత అనేది ప్రయత్నం చేయడం వలన కాక ప్రయత్నాన్ని వదిలేయడం వలన సంభవిస్తుంది.

పునరైక్యతకై చేసే ప్రయత్నాలు ఆ ఖాళీను పెంచుతాయి... మీరు ఐక్యత కోసం ఎంత ఎక్కువగా కాంక్షిస్తే, అంత ఎక్కువగా దూరం పెరుగుతుంది. మీరు ఎంత ఎక్కువగా అన్వేషిస్తే, అంత ఎక్కువగా మీరు దారి తప్పిపోతారు ఎందుకంటే మీరు అన్వేషిస్తూ వుండేది అన్వేషింపదగినది కాదు. మేల్కొనడం మరి చూడడం ద్వారా అది సంభవిస్తుంది. అది ఉంది, అది ద్వారం వద్ద నిలిచి వుంది. అది ఆలయం లోపల సాక్షాత్కరించి వుంది, మీ అంతరంగంలో సాక్షాత్కరించి వుంది. అది ఎన్నడూ ఒక్క క్షణమైనా మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళలేదు, అది ఎన్నడూ ఒక్క క్షణం కూడా వేరుగా లేదు. వేరుగా లేనిదాని కోసం, మీరు ఎన్నడూ విడివడని దాని కోసం, మీరు విడదీయబడనిదాని కోసం అన్వేషించడం ద్వారా మీరు దారి తప్పి పోయే వుంటారు.

మీ సాధనల నుంచి కేవలం ఒకే ఒక ఫలితం సాధ్యమవుతుంది. మీరు అలసిపోతారు, మీరు ప్రయత్నంతో విసిగిపోయే చోటుకు ఒకరోజు మీ ప్రయత్నమంతా చేరుతుంది. ఆ అలసట యొక్క క్షణంలో మీరు వదిలేస్తారు, మరి మీరు ఎంత మూర్ఖులై ఉండేవారో మీరు అవ్యవధిగా చూడగలుగుతారు.

నిన్న నేను ఎవరిదో ఆత్మకథ చదువుతూ వున్నాను. అతను వ్రాసినది ఏమిటంటే అతను ఒక విదేశీ నగరానికి ప్రయాణించాడు మరి దారి తప్పిపోయాడు. అతనికి ఆ భాష అర్థం కాలేదు మరి అతను ఎంతో ఆందోళనకు గురయ్యాడు. తన ఆందోళనలో అతను తన హోటల్ పేరును మరచిపోయాడు, మరి ఆ ఫోన్ నెంబరును కూడా మరచిపోయాడు. అప్పుడు అతని భయం పెరిగిపోయింది : ఇప్పుడు అతను ఎలా విచారించగలడు ? అతను బాటపై నడుస్తూ అత్యంత ఆందోళనతో వెతుకుతున్నాడు, తన భాషను అర్థం చేసుకోగలవారి కోసం అతను వెతుకుతున్నాడు. అది ఒక ప్రాచ్య దేశం, సుదూర ప్రాచ్య దేశం, మరి ఈ అమెరికన్...! తన భాషను అర్థం చేసుకోగల శ్వేత జాతీయుడు ఎవరైనా కనిపిస్తారేమోనని, లేదా తను వెళ్ళి అడుగగలిగేలా ఆంగ్ల

సూచికలు ఉన్న దుకాణం ఏదైనా తాను కనుగొనగలుగుతానేమో అని అతను వెతుకుతూనే ఉన్నాడు.

అతను ఎంత తీవ్రతతో వెతుకుతూ, చెమటలు కక్కుతూ నడుస్తున్నాడంటే తన వెనుక వస్తున్న పోలీసు కారు మళ్ళీ మళ్ళీ హారను మ్రోగించడం అతను వినలేదు. ఆ మనిషి దారి తప్పిపోయాడని పోలీసులు అనుమానించడం ప్రారంభించారు. కానీ అతను రెండు నిమిషాల తరువాత మాత్రమే ఆ హారను విన్నాడు ; అనంతరం అతను ఆఘాతానికి గురై ఆగిపోయాడు. పోలీసు క్రిందకు దిగి అన్నాడు, "నువ్వు స్పృహలో ఉన్నావా లేదా ? మేము రెండు నిమిషాల నుంచీ హారను మ్రోగిస్తూనే వున్నాం ! నువ్వు దారి తప్పిపోయావేమోనని మేము అనుమానించాం ... రా, కారులో ఎక్కు."

అతను అన్నాడు, " ఇది చిత్రంగా వుంది ! నాకు మార్గం చూపగలవారి కోసం నేను నా ముందు వెతుకుతున్నాను, మరి ఆ మార్గదర్శకుడు నా వెనుక ఉన్నాడు. కానీ నేను నా అన్వేషణలో ఎంత లీనమైపోయి వున్నానంటే నా వెనుక మ్రోగుతున్న హారను నేను వినలేదు. నేను వెనుకకు తిరిగి చూడనైనా చూడలేదు."

మీరు అన్వేషిస్తోన్నది మిమ్మల్ని అనుసరిస్తోంది. అవశ్యంగానే అస్తిత్వం హారను మ్రోగించదు లేదా అరచి మిమ్మల్ని పిలువదు, బిగ్గరగా పిలువడం అనేది మీ స్వాతంత్ర్యాన్ని భంగపరచడమే అవుతుంది. అది గుసగుసలాడుతుంది, అది మీ చెవిలో దేనినో రహస్యంగా చెబుతుంది. కానీ మీరు ఎంతగా తలమునకలైపోయి ఉన్నారంటే, ఈ గుసగుసను మీరు ఎప్పుడు వింటారు ? మీరు ధ్వనితో ఎంతగా నిండిపోయారంటే, ఈ మనస్సు ఎంత ప్రతిబింబిస్తోందంటే, అనుకూలంగా మరి ప్రతికూలంగా ; మీరు అన్వేషణలో ఎంతో మమేకమైపోయారు.

స్వామీ రామతీర్థ ఒక చిన్న కథ చెప్పారు : ఒక ప్రేమికుడు సుదూర ప్రాంతానికి వెళ్ళిపోయాడు మరి తిరిగి రాలేదు. అతని ప్రేయసి నిరీక్షించీ మరి నిరీక్షించీ ఆమె అలసిపోయేంతవరకూ, ఆ బాటవైపు చూస్తూనే వుంది. " నేను ఇప్పుడు వస్తున్నాను ", " నేను త్వరలోనే వస్తున్నాను ... ఈ నెల, మరుసటి నెల..." అని మళ్ళీ మళ్ళీ చెబుతూ, అతను ఉత్తరాలు వ్రాశాడు. సంవత్సరాలు గడిచిపోయాయి మరి చివరకు అతని ప్రేయసి కలత చెందింది. నిరీక్షణకు కూడా ఒక హద్దు వుంది. తన ప్రియుడు ఉన్న సుదూర నగరానికి ఆమె పయనించింది. ఆ దారిని ఆమె విచారించింది మరి అతని ఇంటికి చేరుకుంది.

ఆ ద్వారం తెరచే వుంది. అది సాయంత్రం, సూర్యుడు అస్తమించాడు, ఆమె తలుపు వద్ద ఆగింది మరి లోపలికి చూసింది. ఎన్నో రోజులుగా ఆమె తన ప్రియుడిని చూడలేదు. అతను ఆమె ఎదురుగా కూర్చుని వున్నాడు, కానీ అతను గాఢమైన ఏకాగ్రతలో లీనమైపోయి వున్నాడు. అతను ఏదో వ్రాస్తున్నాడు. అతను ఎంతగా లీనమైపోయాడంటే ఆ ప్రేయసి కొద్దిసేపు వేచి వుండాలని, అతనికి అడ్డుపడకూడదనీ అనుకుంది : ఏ ఆలోచనల పోగులు చేజారిపోతాయో ఎవరికి తెలుసు ? అతను భావోద్వేగంతో ఎంతగా ముంచివేయబడ్డాడంటే అతని కళ్ళ నుంచి కన్నీళ్ళు కాలువలు కట్టాయి. అతను ఏదో వ్రాస్తున్నాడు.

ఒక గంట గడిచింది, రెండు గంటలు గడిచిపోయాయి. అప్పుడు అతను కళ్ళను పైకెత్తాడు మరి చూశాడు : అతను దానిని నమ్మలేకపోయాడు, అతను ఆఘాతానికి గురయ్యాడు. అతను తన ప్రేయసికి ఉత్తరం వ్రాస్తున్నాడు. తన ఎదురుగా రెండు గంటలు కూర్చున్న ఈ వ్యక్తి కోసం అతను ఉత్తరాన్ని వ్రాస్తున్నాడు. మరి అతను తన కళ్ళెత్తి చూడడం కోసం ఆమె వేచివుంది.

అతను దానిని నమ్మలేకపోయాడు, అతను అనుకున్నాడు, ఇది ఓ భ్రమ కావచ్చు, ఇది ఒక భ్రాంతి కావచ్చు, బహుశా ఒక రకమైన ఆటో హిప్నోసిస్ కావచ్చు. నాకు ప్రేయసి పట్ల ఎంత అపారమైన అనుభూతి ఉందంటే, బహుశా అందువలనే ఆమె ఒక స్వప్నంలా గోచరిస్తోంది. ఇది ఒక భ్రాంతే అయివుండవచ్చు." అతను తన కళ్ళు నులుముకున్నాడు.

అతని ప్రేయసి నవ్వడం మొదలు పెట్టింది. ఆమె అంది, " నువ్వు ఏం ఆలోచిస్తున్నావు ? నేను ఓ మరీచికనని నువ్వు అనుకుంటున్నావా ? "

అతను కంపించడం ప్రారంభించాడు. అతను అన్నాడు, " కానీ నువ్వు ఎలా వచ్చావు ? నేను నీకు ఉత్తరం వ్రాస్తున్నాను. పిచ్చిదానా... నువ్వు నన్ను ఎందుకు ఆపలేదు? నేను నీకు ఉత్తరాన్ని వ్రాస్తూండగా నువ్వు నా ఎదురుగానే కూర్చుని ఉన్నావు !

అస్తిత్వం ఇక్కడే మన ఎదురుగా వుంది మరి మనం దానితో ఏకమయ్యేందుకు ప్రార్థిస్తున్నాం ... " ఓ ప్రభూ నువ్వు ఎక్కడ వున్నావు ? " మన కళ్ళ నుంచి కన్నీళ్ళు కారుతున్నాయి, కానీ మన కన్నీటి గోడల వలన మన ముందు ఉన్నదేమిటో మనం చూడం. మనం దాని కోసం అన్వేషిస్తున్నాం. మన అన్వేషణ వలనే మనం చేజార్చుకుంటాం.

అష్టావక్రుడి మాటలు అత్యంత స్పష్టమైనవి. అతను అంటాడు, " ఈ ఉత్తరం వ్రాయడాన్ని ఆపెయ్యండి. ఈ సాధనను ఆపెయ్యండి ".

సమాధి సంభవించదు. అవును, సమాధి కూడా ఓ సంభవమే అయితే కనుక అప్పుడు అది కార్యకారణాల వలన సంభవిస్తుంది. అది కార్యకారణాల వలన సంభవిస్తే కనుక అది విపణి వీధిలో ఓ వస్తువుగా తయారైపోతుంది. సమాధి అనేది కన్య, అస్పృక్త ... అది విపణివీధిలో విక్రయించబడదు.

మీ విపణిప్రధానమైన మనస్సు జ్ఞానోదయాన్ని కూడా విపణివీధిలోకి తెస్తుంది అనేది మీరు ఎప్పుడైనా గమనించారా ? మీరు ఇంత చేస్తే కనుక మీరు జ్ఞానోదయాన్ని పొందుతారని మీరు అనుకుంటారు... అదేదో ఒక వ్యాపార సంబంధమైన ఒప్పందం అయినట్లుగా. మీరు మంచి పనులు చేస్తే కనుక మీరు స్వయానా ఆ దైవత్వాన్నే సిద్ధించుకుంటారు. మీ ధార్మిక వ్యక్తులు అనబడేవారు మీకు ఇదే చెబుతూ వుంటారు : మీరు దివ్యత్వాన్ని సిద్ధించుకోవాలనుకుంటే కనుక మంచి పనులు చెయ్యండి. దివ్యత్వాన్ని సిద్ధించుకోవడానికి ఏదైనా చేయాలన్నట్లుగా ... ఏదైనా చేయకుండా దైవత్వాన్ని ఎన్నటికీ సిద్ధించుకోలేనట్లుగా. దివ్యత్వాన్ని కొనడానికి ధరను చెల్లించాలి అన్నట్లుగా–ఇన్ని మంచి పనులను, ఇంత తపోసాధన , ఇంత ధ్యానం, ఇంత ప్రార్థనలు చెయ్యండి ... కేవలం అప్పుడు మాత్రమే మీరు పొందుతారు.

మీరు దానిని విపణి వీధిలోకి తెచ్చారు. మీరు దానిని విక్రయానికై ఉన్న వస్తువుగా తయారు చేశారు. వినియోగదారులు దానిని కొనుక్కుంటారు. పుణ్యం ఉన్నవారు కొనుగోలు చేస్తారు. పుణ్యం లేనివారు అది నిరాకరించబడతారు. పుణ్యం యొక్క నాణెం అవసరమవుతుంది. పుణ్యం యొక్క నాణేలను మీరు చూపిస్తే కనుక మీరు దానిని పొందుతారు.

అష్టావక్రుడు చెబుతున్నాడు, మీరు సూచిస్తున్నది ఉన్మాదమే ! పుణ్యం ద్వారా దివ్యత్వం సిద్ధిస్తుందా ? ... అప్పుడు అది ఒక వ్యాపార లావాదేవీగా తయారైపోయి వుంటుంది. ప్రార్థన ద్వారా మీరు దివ్యత్వాన్ని సిద్ధించుకుంటారా ? అప్పుడు మీరు దానిని కొనుగోలు చేశారు. దాని అనుగ్రహానికి ఏం జరిగింది ? మరి ఒక కారణం ద్వారా ఏదైనా పొందబడితే కనుక, ఆ కారణం మాయమైపోయినప్పుడు అది కూడా మాయమైపోతుంది. ఒక కారణం ద్వారా సాధించబడినది ఏదైనా ఆ కారణం అనేది నాశనమైపోయినప్పుడు కోల్పోబడుతుంది.

మీరు సంపదను సమీకరించారు ; మీరు కష్టపడి పని చేశారు, మీరు విపణి వీధిలో చక్కగా పోటీ పడ్డారు మరి మీరు డబ్బు సంపాదించారు. కానీ మీరు సంపాదించిన ఈ ధనం నిలిచి వుంటుందని మీరు అనుకుంటున్నారా ? దొంగలు దానిని దొంగిలించగలరు. ఒక దొంగ అంటే తన ప్రాణాన్ని పణంగా పెట్టేందుకు మీకన్నా ఎక్కువ సంసిద్ధతతో ఉన్న వ్యక్తి అని అర్థం. ఒక వ్యాపారవేత్త శ్రమిస్తాడు, కానీ దొంగ తన ప్రాణాన్నే పణంగా పెడతాడు. అతను అనుకుంటాడు, " నేను చావడానికి మరి చంపడానికి సిద్ధంగా ఉన్నాను, కానీ నేను దానిని తీసుకుంటాను." కనుక అతను దానిని దొంగిలిస్తాడు.

ఒక కారణం ద్వారా పొందబడినది చేజారిపోవచ్చు. జ్ఞానోదయం అనేది కారణ రహితంగా సిద్ధిస్తుంది. కానీ మన అహం దానిని విశ్వసించదు. మన అహం అంటుంది, "కారణరహితంగా దానిని పొందడం అంటే ఏమీ చేయనివారు కూడా పొందుతారు అనేగా అర్థం ?" ఏమీ చేయనివారు కూడా పొందుతారు అనేది మింగుడుపడడం చాలా కష్టం.

అరూప్ ఇక్కడ ముందు వరుసలో నవ్వుతూ కూర్చుని వున్నాడు. తనకు ఏమీ చేయాలనిపించడం లేదని నిన్న అతను నాకు చెప్పాడు. నేను అన్నాను సరే, అకర్మలోనికి కరిగిపో, జ్ఞానోదయం కోసం ఏదైనా చేయాల్సిన అవసరం ఉందా ? నేను దానిని చెప్పినప్పటికీ, దానిని నమ్మడం కష్టం ఎందుకంటే మన మనస్సు చెబుతుంది, " ఏమీ చేయకుండానా ? " కర్మ లేకుండా సామాన్య విషయాలను పొందలేరు ... మీరు ఒక ఇంటిని, ఒక కారు, ఒక వ్యాపారం, సంపద ... అధికారం పొందలేరు. మీరు కీర్తి పొందలేరు ... ఏమీ చేయకుండానే జ్ఞానోదయం సంభవిస్తుందా ? మీరు దానిని విశ్వసించరు. " ఒకరు ఏదైనా చేయాలి. దానికి ఏదో యుక్తి ఉండుండాలి. ఈ అకర్మ అనేదానిని కూడా చేయాలి." ఇందువలనే మనం ' అకర్మలో కర్మ,' ' కర్మలో అకర్మ ' లాంటి వ్యక్తీకరణలను నొక్కివక్కాణిస్తాం. 'చెయ్యకపోవడంలోని చెయ్యడం ' ... ఈ విధంగా పనులు చెయ్యండి, కానీ చేస్తూనే ఉండండి. " ఏమీ చేయకుండా ఎవరైనా సిద్ధించుకున్నారా ?"

నేను మీకు చెబుతున్న విషయాన్నే అష్టావక్రుడు చెబుతున్నాడు : అది ఇప్పటికే సిద్ధించింది. ' సిద్ధి ' అనే భాషే అయుక్తమైనది. సిద్ధించుకోవడం యొక్క భాషలోనే దూరం అనేది ఒక భాగం ... అస్తిత్వం మీ నుంచి భిన్నంగా ఉన్నట్లుగా, అది భిన్నమై ఉంటే కనుక, మీరు ఒక్క క్షణమైనా జీవించగలరా ? అస్తిత్వం నుంచి మీరు విడిగా ఎలా జీవించగలరు ? అస్తిత్వం నుంచి వేరైపోతే మీ పరిస్థితి నీటిలో నుంచి

బయటపడిన చేపలా వుంటుంది. ...అయినప్పటికీ ఒక చేపను సముద్రం నుంచి వేరు చేయవచ్చు ఎందుకంటే సముద్రం కాక ఇతర ప్రదేశాలు ఉన్నాయి. కానీ మీరు అస్తిత్వం నుంచి ఎలా వేరు చేయబడగలరు ? అది ఉంది మరి కేవలం అది వుంది; ప్రతీ చోటా అది ఇదే, ప్రతి ప్రదేశమూ దీనిలోనే వుంది. మీరు ఎక్కడ విడదీయబడతారు ? ... మీరు ఎక్కడకు వెళతారు ? అస్తిత్వానికి ఏ తీరమైనా వుందా? అది ఒక అంతం లేని మహాసాగరం. దానికి బయటకు వెళ్ళగల మార్గమే లేదు.

అష్టావక్రుడు చెబుతున్నది ఏమిటంటే మీరు జ్ఞానోదయం నుంచి ఎన్నడూ దూరంగా వెళ్ళిపోలేదు. అందువలన అది కారణరహితంగా సంభవించగలదు. అది కోల్పోబడనిదైతే కనుక అలాంటప్పుడు కారణరహితంగా దానిని సిద్ధించుకోవచ్చు.

జ్ఞానోదయం అనేది ఒక సంఘటన కాదు ... అది మీ స్వభావం. కానీ ఏమీ చేయకుండానే అనుగ్రహం వర్షించడమనేది ఎప్పుడైనా సంభవించిందా ?

మనం అత్యంత దీనులమైపోయాం, మన జీవితానుభవం ద్వారా దీనులైపోయాం. ఇక్కడ చేయకుండా ఏదీ పొందబడదు, కనుక మనం అత్యంత సంకుచిత-మనస్కులుగా తయారయ్యాం. ఏమీ చేయకుండానే జ్ఞానోదయం సిద్ధించగలదని మనం అనుకోము. మన దారిద్ర్యం దానిని ఊహించనైనా ఊహించలేదు,

కానీ మనం దీనులం కాదు. ఇందువలనే జనకుడు అంటాడు, " ఓహ్ ! " **నేను ఆశ్చర్యపోతున్నాను ! నాకు నేనే ప్రణమిల్లుతున్నాను.** " నాకు నేనే ప్రణమిల్లుతున్నాను;" అంటే భావం ఏమిటంటే భక్తుడు మరి దైవం ఇరువురూ నా అంతరంగంలోనే ఉన్నారు. ' ఇరువురు ' అని చెప్పడం సరైనది కాదు ; నా అంతరంగంలో కేవలం ఒక్కరే ఉన్నారు, మరి అతను ఓ భక్తుడు అని నేను పొరపాటున అనుకుంటాను. నేను ఈ పొరపాటును గ్రహించినప్పుడు, నేను అతనిని దైవంగా తెలుసుకుంటాను.

దానిని ఈ విధంగా ఆలోచించండి : మీ వద్ద రెండు కుర్చీలు ఉన్నాయి మరి మీరు వాటిని ఒక గదిలో వేస్తారు, అప్పుడు మీరు ఆ గదిలో మరో రెండు కుర్చీలను వేయండి మరి వాటిని లెక్కించండి, పొరపాటున ఐదు వచ్చింది. కానీ ఆ గదిలో కేవలం నాలుగే ఉన్నాయి. మీరు పొరపాటున ఐదు, లేదా ఆరు లేదా యాభై లెక్కిస్తే కనుక, ఆ గదిలోని కుర్చీల సంఖ్య అయిదు, లేదా ఆరు లేదా యాభై అవ్వదు. అక్కడ నాలుగు కుర్చీలు వున్నాయి, మీరు మూడు అని లెక్కించినా లేదా అయిదు లెక్కించినా. మీ మూడు లేదా అయిదు గురించి కేవలం మీకు మాత్రమే తెలుసు ;

కుర్చీలకు దాని వలన ఏ వ్యత్యాసమూ వుండదు. అవి ఇంకా ఖచ్చితంగా నాలుగే ఉంటాయి.

దివ్యత్వాన్ని అన్వేషించాలని మీరు అనుకోవడమే మీ మూడు లేదా అయిదు అనే లెక్కలు. దివ్యత్వం ఇప్పటికే సిద్ధించింది, ఆ కుర్చీలు ఖచ్చితంగా నాలుగే ! మీరు సరైన లెక్కను కనుగొన్నప్పుడు మీరు అనుకుంటారు, " ఓహో, కానీ ఇంతకు ముందు అయిదు కుర్చీలు ఉన్నాయి, ఇప్పుడు అవి నాలుగైపోయాయి " ... మీరు ఈ విధంగా ఆలోచిస్తారా ? లేదు, మీరు అనుకుంటారు, " నేను పొరబడ్డాను : అక్కడ ఎల్లప్పుడూ నాలుగే ఉన్నాయి, నేను అయిదుగా లెక్కించాను. పొరపాటు అనేది కేవలం కూడికలోనే వుంది."

ఆ పొరపాటు ప్రస్తుతం లేదు, ఆ పొరపాటు కేవలం ఒక జ్ఞాపకమే. ఈ అయిదు కుర్చీలను నాలుగుగా చెయ్యడానికి ఒకదానిని తీసేయాల్సిన అవసరం లేదు. లేదా, మీరు మూడు లెక్కిస్తే కనుక దానిని నాలుగు చేసేందుకై బయట నుంచి ఒకదానిని తీసుకురావాల్సిన అవసరం లేదు ... ఇప్పటికే అక్కడ నాలుగు కుర్చీలు ఉన్నాయి. అది కేవలం కూడికకు సంబంధించిన పొరపాటు మాత్రమే. దానిని సరిగ్గా కూడండి. కూడిక సరిగ్గా ఉన్నప్పుడు ఆ మూడు కుర్చీలు నాలుగుగా అవ్వడమనేది కారణరహితమైనదని మీరు అనుకుంటారా ? కారణరహితంగా అయిదు కుర్చీలు నాలుగయ్యాయా ? లేదు, మీరు నవ్వుతారు. మీరు అనుకుంటారు, " అది అవ్వడానికి సంబంధించిన ప్రశ్న కాదు, అవి అప్పటికే ఉన్నాయి, కేవలం ఆలోచనలోనే పొరపాటు వుంది. ఆ దోషం కేవలం మానసికపరమైనది. అది లేదు."

మిమ్మల్ని మీరు ఓ భక్తుడిగా భావిస్తే కనుక అది కూడికకు సంబంధించిన పొరపాటు. ఇందువలనే జనకుడు అనగలుగుతున్నాడు, " ఆహా ! " **నాకు నేనే ప్రణమిల్లుతున్నాను !** నేను ఎంత మూర్ఖుడిలా ఉండేవాడిని ! నా స్వీయ భ్రమల్లోనే నేను దారి తప్పిపోవడం ఎంత ఆశ్చర్యకరమైనది. ఎల్లప్పుడూ ఉన్నది నాకు తెలియదు, కానీ ఎన్నడూ లేనిది నాకు తెలుసు. ఒక తాడులో నేను ఓ పామును చూశాను. ముత్యపు చిప్పలో నేను వెండిని చూశాను. వెలుగు యొక్క క్రీడలో నేను ఎడారిలో ఫలవంతమైన ప్రదేశం యొక్క భ్రమను చూశాను ! లేని దానిని నేను చూశాను 'ఏది ఉందో ' అది ఈ భ్రాంతిలో, ఈ మాయలో దాగి వుంది, మరి నేను దానిని చూడలేదు.

జ్ఞానోదయం అనేది మహోన్నత అనుభవం, ఎందుకంటే అది సంభవించదు

జ్ఞానోదయం అనేది మహోన్నత అనుభవం ఎందుకంటే అది కార్య కారణాలక

అతీతమైనది. జ్ఞానోదయం అనేది ఇప్పటికే సంభవించింది. మీరు సంసిద్ధులైన క్షణం, మీరు ధైర్యాన్ని కూడదీసుకుని మరి మీ మనో దారిద్ర్యాన్ని వదిలేయడానికి సిద్ధంగా ఉన్న క్షణం, మీరు మీ అహాన్ని వదిలేయడానికి సిద్ధంగా ఉన్న క్షణం ... ఆ క్షణమే అది సంభవిస్తుంది.

మీ తపసితనంపై అది ఆధారపడిలేదు, మీ ప్రార్థనపై అది ఆధారపడిలేదు ... తపసితనం మరి ప్రార్థనలో మునిగిపోయి ఉండిపోకండి.

ఒకసారి ఒక ఇంట్లో నేను అతిథిగా ఉన్నాను. ఆ ఇల్లంతా పుస్తకాలతో నిండిపోయి వుంది. నేను అన్నాను, " ఇది ఒక పెద్ద గ్రంథాలయం ! "

నా అతిథేయి అన్నాడు, "ఇది ఓ గ్రంథాలయం కాదు. నేను ఈ పుస్తకాలన్నింటిలో రామనామం వ్రాస్తూ వున్నాను. నా జీవితమంతా నేను చేస్తున్నది ఇదే. నేను పుస్తకాలు కొంటాను మరి రోజంతా రామ,రామ, రామ,రామ అని వ్రాస్తాను. నేను దానిని ఎన్నో కోట్లసార్లు వ్రాసి వుంటాను. బహుశా మీరు నాకు చెప్పగలరు, దానిని చేయడంలో నేను ఎంత పుణ్యాన్ని గడించాను అనేది."

" దానిలో పుణ్యం ఏముంది ? అది ఒక పాపం కావచ్చు... పాఠశాల విద్యార్థులచే వినియోగించదగిన ఎన్నో పుస్తకాలు, నువ్వు వాటిని నాశనం చేశావు. నువ్వు పుణ్యం గురించి అడుగుతున్నావా ? నోటు పుస్తకాలలో రామ, రామ అని వ్రాయడం ద్వారా నీ మస్తిష్కం పనిచేయడం ఆగిపోయిందా...?"

అతను ఎంతో ఆఘాతానికి గురయ్యాడు, ఎందుకంటే మతపరమైన ఇతర వ్యక్తులు అతనిని సందర్శించారు మరి వాళ్ళు అన్నారు, " నువ్వు ఎంతో పుణ్యాత్ముడవు. నువ్వు అనేకసార్లు రామనామాన్ని వ్రాసావు, నువ్వు నీ జపమాలలోని పూసలను అనేక మార్లు లెక్కించావు. నువ్వు రామనామాన్ని ఎంతగానో స్మరించావు ... కేవలం ఒక్కసారి స్మరించడం ద్వారానే ఒకరు స్వర్గాన్ని చేరుకుంటారు, నువ్వు దీనిని అనేక పర్యాయాలు చేశావు ! " అతను నా పట్ల కోపం తెచ్చుకున్నాడు, అతను మళ్ళీ ఎన్నడూ నన్ను ఆహ్వానించలేదు: " అది ఒక పాపం అని చెప్పే ఈ మనిషి వలన ఉపయోగమేమిటి ? " అతను ఎంతో ఆఘాతానికి గురయ్యాడు. అతను అన్నాడు, " నా మతపరమైన భావాలను మీరు కించపరుస్తున్నారు."

మీ మతపరమైన భావాలను నేను కించపరచడం లేదు, నేను కేవలం అడుగుతున్నాను, ఇది ఏ రకమైన మూర్ఖత్వం ? రామ, రామ అని వ్రాయడంలో

అర్థమేముంది ? వ్రాస్తున్న వాడిని తనను తాను తెలుసుకోనివ్వండి : అతడే రాముడు. రామ రామ అని వ్రాయడంలో అతను ఎలా మమేకమయ్యాడు. నాకు చెప్పండి : ఆ చారిత్రక రాముడు బంధింపడి, కూర్చోబెట్టబడి, ఇప్పుడు అతని విల్లు మరి బాణాలను వదిలేయమని మరి తన ప్రియసతి సీతను అన్వేషించేందుకు వెళ్ళే బదులుగా, ఒక కలాన్ని తీసుకుని రామ, రామ అని వ్రాయమని చెప్పబడితే కనుక, అది పాపం అవుతుందా లేక పుణ్యమా ? మరి చారిత్రక పురుషుడైన రాముడు, ఒక మంచి మనిషి అయినవాడు, అంగీకరిస్తాడు, ఇలా అనుకుంటాడు, " ఈ మనిషి నా వెంట పడుతున్నాడు. నేను వ్రాయకపోతే కనుక అతను బాధపడతాడు," కనుక రామ, రామ అని వ్రాస్తూ కూర్చుంటాడు రాముడు... అప్పుడు మీరు అతని జీవితాన్ని నాశనం చేసి వుంటారు.

మీరు వ్రాస్తూన్నప్పుడు, అది రాముడు కూడా వ్రాస్తుననట్లే. వ్రాస్తున్నది ఎవరు ? అతడిని తెలుసుకోండి. రామ,రామ అని స్మరిస్తున్నది ఎవరు ? భగవంతుడి నామాన్ని స్మరించడమనేది ఎక్కడ నుంచి ఉద్భవిస్తోంది. ఆ లోతులోకి దిగండి. మీరు అక్కడ రాముడిని కనుగొంటారని అష్టావక్రుడు చెబుతున్నాడు.

రెండవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

నిన్న మీరు అన్నారు మీ హృదయానుభూతులను మీ వివేకం నియంత్రించేందుకు అనుమతించకండి. కానీ ఓషో, మీ ప్రసంగాలు పూర్తి తార్కికమైనవిగా నాకు అనిపిస్తాయి. కనుక తర్కం యొక్క సంతృప్తి చేత మనస్సు పోషింపబడుతుందా ? వాదనచే పోషింపబడే మనస్సు హృదయాన్ని నియంత్రణలోకి తీసుకుని మరి అనుభూతుల యొక్క అనుభవాన్ని అణచివేయడం అనేది నాకు ప్రమాదకరమైనది కాదా? దయచేసి నాకు మార్గాన్ని చూపండి.

నేను చెబుతున్నది నిశ్చయంగా తార్కిమైనదే, కాని కేవలం తార్కికమైనది మాత్రమే కాదు ... మరింత అధికమైనది కూడా. మీ కోసం నేను తార్కికంగా మాట్లాడుతాను, మరి మరింత అధికమైనవి నా కోసం. నేను తార్కికంగా మాట్లాడకపోతే కనుక మీరు అవగాహన చేసుకోలేరు. మరి నేను ' దానిని ' చెప్పకపోతే కనుక, తర్కానికి అతీతమైవున్నది, అప్పుడు నేను మాట్లాడనే మాట్లాడను. మాట్లాడడం వలన ప్రయోజనం ఏముంది ?

నేను మాట్లాడుతున్నప్పుడు, మీకు చెబుతున్నప్పుడు, ఇరువురు ఉంటారు : మీరు మరి నేను. వక్త మరి వినేవార్లు ఇరువురూ అక్కడ వున్నారు. నా ఇష్టానుసారమైతే కనుక నేను తర్కానికి అతీతంగా మాట్లాడుతాను, నేను వాదనలను పూర్తిగా వదిలేస్తాను, కానీ మీరు అప్పుడు నేను పిచ్చివాడినని అనుకుంటారు. అప్పుడు మీరు ఏమీ అవగాహన చేసుకోరు ; అది ఏ అర్థమూ లేని ధ్వని మాత్రమేనని మీరు భావిస్తారు.

మీ తార్కిక ఆలోచనా విధానం యొక్క నమూనాలో ఇమిడిపోయేందుకే నేను తార్కికంగా మాట్లాడుతాను. కానీ మీరు అవగాహన చేసుకున్నదంతా ఇదే అయితే కనుక, అలాంటప్పుడు ఇక్కడికి మీ సందర్శన అనేది నిరుపయోగమైనదే అయ్యింది.

అది ఒక చెంచాను ఔషధంతో నింపి మరి దానిని మీ నోటిలోకి పోసుకోవడం లాంటిది... మనం చెంచాను లోనికి పోసుకోము. తర్కం అనే చెంచాతో నేను తర్కానికి అతీతమైన దానిని పోస్తుంటాను. ఆ చెంచాను మింగెయ్యకండి, లేదంటే మీరు చిక్కులో పడతారు. ఆ చెంచాను వినియోగించుకోండి. ఆ చెంచాలో వున్న ద్రవాన్ని పానం చెయ్యండి.

తర్కం అనేది ఒక చెంచా, తర్కం అనేది ఒక సహాయం, ఎందుకంటే ప్రస్తుతం తర్కానికి అతీతమైనదానిని వినగలిగేందుకు తగిన ధైర్యం మీకు లేదు. తర్కానికి అతీతమైనదానిని మీరు వినాలనుకుంటే కనుక, అప్పుడు పక్షుల యొక్క పాటలను వినడమనేది అష్టావక్రుడి యొక్క పాటను వినడంలానే వుంటుంది. అవి తర్కానికి అతీతమైనవి.

వృక్షాల మీదుగా సాగిపోతున్న గాలి యొక్క గుసగుస సవ్వడి, దారిపై ఎగిరిపోతున్న ఎండుటాకుల యొక్క పెళపెళలు, ప్రవహిస్తున్న నీటి యొక్క ధ్వని, మేఘాల యొక్క ఉరుములు ... అవన్నీ తర్కానికి అతీతమైనవే. అష్టావక్రుడు మీతో అష్టదిక్కుల నుంచీ, అన్ని వైపుల నుంచీ మాట్లాడుతున్నాడు ! కానీ మీరు ఏమీ అవగాహన చేసుకోరు. ఈ పక్షుల కిలకిలలను మీరు ఎంతకాలం వినగలరు ? అది నిరర్థకమైనదని మీరు అంటారు. కొద్దిగా వినడమనేది ఫరవాలేదు కానీ ఈ కిలకిలల్లో ఏ అర్థమూ లేదు.

తర్కానికి అతీతమైనది పక్షుల యొక్క కిలకిలరవాలలానే ఉంటుంది. అది మిమ్మల్ని చేరగలిగేందుకు నేను తర్కం యొక్క వారధిని తయారు చేస్తాను. మీరు ఆ వారధినే పట్టుకు వేళ్ళాడి మరి గమ్యస్థానాన్ని విస్మరిస్తే కనుక, మీరు మాటలను పట్టుకుని మరి ఆ మాటల ద్వారా అందించబడినదానిని మరచిపోతే కనుక, అప్పుడు

మీరు మీ సంచిని వజ్రాలు మరి రత్నాలతో నింపుకోగలిగిన చోట మీరు కేవలం గులకరాళ్ళనే సేకరిస్తున్నారు.

ఈ మిత్రుడు అడిగాడు, "మీరు చెప్పారు... హృదయానుభూతులను మీ వివేకం నియంత్రించేందుకు అనుమతించకండి."

నిశ్చయంగా. వివేకంతో అవగాహన చేసుకోండి కానీ హృదయాన్ని యజమానిగా ఉండనివ్వండి. వివేకాన్ని ఓ బానిసగా చెయ్యండి మరి హృదయాన్ని యజమాని యొక్క సింహాసనంపై అధిష్టింపజేయండి. ఆ సేవకుడు సింహాసనంపై మరీ సుదీర్ఘకాలం పాటు కూర్చున్నాడు. మీరు వివేకం కోసం జీవించడం లేదు, మీరు హృదయం కోసం జీవిస్తారు. ఇందువలనే మనస్సు నుంచి ఎన్నడూ సిద్ధి అనేది రాదు. మీరు ఎంత గొప్ప గణితశాస్త్రజ్ఞుడైనాగానీ, హృదయం ఎప్పుడైనా ప్రశాంతంగా అవుతుందా ? మరి మీరు ఎంత గొప్ప తార్కికులైనాగానీ, సిద్ధి అనేది ఎప్పుడైనా కలిగిందా ? మరి మీరు ఎన్ని పవిత్ర గ్రంథాలను సమీకరించినాగానీ, ఇది సమాధి అవుతుందా ? హృదయం ప్రేమ కోసం అడుగుతుంది, హృదయం ప్రార్థన కోసం అడుగుతుంది. హృదయం యొక్క చివరి కోరిక సమాధి కోసమే : సమాధిని తీసుకురండి, సమాధిని తీసుకురండి ! మహా అయితే వివేకం సమాధికై తార్కిక వాదనలు తేగలదు, సమాధి గురించిన సిద్ధాంతాలను తేగలదు. కానీ సిద్ధాంతాలు ఏమి చేయగలవు ?

అక్కడ ఎవరో ఆకలితో కూర్చుని వున్నారు మరి మీరు అతనికి ఓ వంటల పుస్తకాన్నిస్తూ అంటారు, " సకలమూ ఇక్కడ వ్రాసి వుంది, దానిని చదువు మరి ఆస్వాదించు !" మరి అతను దానిని చదువుతాడు ఎందుకంటే అతను ఎంత ఆకలితో ఉన్నాడంటే అది సహాయకరం కావచ్చునని అతను ఆశిస్తాడు. అత్యంత రుచికరమైన ఆహారాల యొక్క చర్చలు ... ఎలా అమర్చాలి, వాటిని ఎలా తయారు చేయాలి అనే వివరణలను ... కానీ ఇది ఏం చేయగలదు ? అతను అడుగుతాడు, " ఒక వంటల పుస్తకం వలన ఏం సహాయం అందగలదు ? నాకు ఆహారం కావాలి." ఆకలిగొన్న వాడికి ఆహారం అవసరం. దాహార్తితో ఉన్నవాడికి నీరు అవసరం.

మీరు వ్రాయవచ్చు మరి ఒక దప్పికగొన్న వ్యక్తికి ఇవ్వవచ్చు... అతను దప్పికతో ఉన్నాడు మరి మీరు 'H_2O' అని, నీటి యొక్క సూత్రాన్ని వ్రాస్తారు. అతను ఆ కాగితాన్ని పట్టుకుని కూర్చుంటాడు, కానీ ఏం జరుగుతుంది ? ప్రజలు కూర్చుని రాము, రాము అని జపిస్తున్నట్లుగానే అది ఉంటుంది. అన్ని మంత్రాలూ 'H_2O'లాంటివే.

నిశ్చయంగానే ప్రాణవాయువు మరి జలవాయువుల యొక్క మేళనం ద్వారానే నీరు రూపొందుతుంది, కానీ ఓ కాగితంపై 'H_2O' అని వ్రాయడం ద్వారా దాహం తీరదు.

తర్కంతో అవగాహన చేసుకోండి, కానీ హృదయంతో పానం చెయ్యండి. తర్కాన్ని వినియోగించండి, కానీ అది కేవలం ఉపయోగకరమైనది మాత్రమేనని అవగాహన చేసుకోండి; అదే అంతా అని అనుకోకండి. హృదయాన్ని యజమానిగా ఉండనివ్వండి. మరి గుర్తుంచుకోండి, ప్రేమ మరి ప్రార్థనలో, పూజ మరి సమర్పణలో, ధ్యానం మరి సమాధిలో వివేకాన్ని జోక్యం చేసుకోనివ్వకండి. అది ఎంత సహాయకరంగా ఉండగలిగితే, అంత మంచిది. ఇందువలనే నేను తర్కాన్ని ఉపయోగించి మీతో మాట్లాడుతాను, మీ వివేకాన్ని నేను సమ్మతింపజేసి మరి ఒప్పించగలిగేలా, హృదయం దిశగా రెండు అడుగులు వేసేలా మిమ్మల్ని ఒప్పించగలిగేందుకు. మీరు కొద్దిగా రుచి చూస్తే కనుక దాని ఆనందంతో మీరు ఆక్రమించబడతారు. అప్పుడు వివేకం గురించి బెంగపడడాన్ని మీ అంతట మీరే వదిలేస్తారు. అసలైన రుచి వచ్చినప్పుడు, పదాల గురించి ఎవరు పట్టించుకుంటారు ?

“ కానీ ఓషో, మీ ప్రసంగాలు పూర్తి తార్కికమైనవిగా నాకు అనిపిస్తాయి.” అవి తార్కికమైనవే. మీరు నాతో నడవడానికి సిద్ధమయ్యేందుకు నేను మీకు చెబుతున్నది తార్కికంగా ఉండేలా చెయ్యడానికే నా ప్రయత్నమంతా. ఒకసారి మీరు ఒప్పించబడితే అప్పుడు మీరు వలలో పడినట్లే, అప్పుడు బయటకు వెళ్ళగల మార్గమే లేదు. ఒకసారి మీరు ఒప్పించబడితే, ఒకసారి మన చేతులు కలిస్తే, అప్పుడు దిగులనేదే లేదు. ఒకసారి మీ చేయి నా చేతిలోనికి వస్తే మీరు నా చేయి దాటిపోయి ఎంతో కాలం వుండరు. మొదట నేను మణికట్టును పట్టుకుంటాను, తరువాత ముంజేతిని, తరువాత... మీరు కేవలం మాయమవుతారు !

కనుక నేను తర్కంతో మొదటి సంబంధాన్ని ఏర్పరుస్తాను ఎందుకంటే మీరు అక్కడే జీవిస్తూంటారు. అక్కడ సంప్రదించవచ్చు ... మీరు ఉన్నది అక్కడే. ఇందువలనే నాస్తికులు కూడా నా వద్దకు వస్తారు. నాస్తికులు కూడా నన్ను అంగీకరించగలరు. నాస్తికులకు నాతో ఏ వాదనలూ లేవు ఎందుకంటే నేను నాస్తికుల యొక్క భాషను మాట్లాడుతాను. కానీ అది ఒక వల, ఆ భాష ఒక వల. అది చేపలు పట్టేందుకు వెళ్ళి మరి గాలానికి ఎరను తగిలించడంలాంటిదే. అది ఒక ఎర. ఎవరైనా ఆ కొక్కేన్ని తప్పించుకోవాలనుకుంటే కనుక, అతను ఆ ఎరను తప్పించుకోవాలి, ఎందుకంటే ఒకసారి ఆ ఎర నోట్లో ఉంటే అది ఒక కొక్కెం అనేది వారు కనుగొంటారు.

తర్కం అనేది ఎర, అతీతం అనేది కొక్కెం. నేను మిమ్మల్ని సమ్మతింపజేస్తాను : మీకు చేదు ఔషధాన్ని ఇచ్చేందుకై ఆ మాత్రకు నేను చక్కెరపూత పూస్తాను. మానవుడి యొక్క స్థితి పసిపిల్లల్లానే వుంది. చక్కెరను ఆస్వాదిస్తూ అతను చేదు మాత్రను మింగుతాడు ... మీరు విషాన్ని సైతం మింగగలరు... కానీ తర్కానికి అతీతమైనదాన్ని నేరుగా మీ ముందు ఉంచినట్లయితే మీరు పారిపోవడం ప్రారంభిస్తారు : " లేదు, నా మనస్సు దీనిని విశ్వసించడంలేదు." కనుక నేను మీ వివేకాన్ని ఒప్పించాలనుకుంటున్నాను. కానీ మీరు అక్కడ ఆగిపోయి మరి వివేకం ఒప్పించబడింది అని అనుకుంటే కనుక, ఇప్పుడు మీరు ఇంటికి వెళ్ళిపోవచ్చు... అది ఎలా ఉంటుందంటే మీరు ఆ ఔషధాన్నుంచి చక్కెర పూతను తీసేసారు, దానిని తిన్నారు, మరి ఆ ఔషధాన్ని పారేశారు.

" వాదన యొక్క ఆస్వాదన ద్వారా మనస్సు పోషింపబడుతుందా ? " అదంతా మీపై ఆధారపడి ఉంటుంది. మీరు తర్కం తప్ప ఏదీ వినకపోతే కనుక, అప్పుడు మనస్సు పోషింపబడుతుంది. కానీ వాదనలకు మధ్య కొద్దిపాటి అతార్కికాన్నీ, నిరాక్షేపణీయమైన దానినీ మీరు లోనికి అనుమతిస్తే కనుక, ఒకసారి కేవలం ఒక బిందువును అనుమతిస్తే అప్పుడు మీ మస్తిష్కంలోని ఆ బిందువు హృదయం యొక్క విప్లవాన్ని సృష్టిస్తుంది. అది మీపై ఆధారపడి వుంటుంది.

తార్కికమైన వాదనలు తప్ప మరేదీ విననివారు కొంతమంది వుంటారు. తర్కానికి బయట ఉన్నదేదైనా వాళ్ళు పక్కకు నెట్టేస్తారు. అలాంటప్పుడు వాళ్ళు నాకు చేరువకాలేదు... అప్పుడు ఇక్కడకు రావడం మరి ఇక్కడకు రాకపోవడం సమానమైనవవుతాయి. ఖచ్చితంగా వాళ్ళు వచ్చిన విధంగానే వాళ్ళు తిరిగి వెళతారు... వాళ్ళు బలపరచబడిన నమ్మకాలతో వెళతారు. తమ ఆలోచనా విధానంలో ఇమిడిపోయే దానిని వాళ్ళు ఎంచుకున్నారు, తమ స్వీయ అవగాహన ద్వారా చేసుకున్న ఎంపిక. తమ అవగాహనలో అమరిపోయేదానిని వాళ్ళు ఎంచుకున్నారు. ఇమడనిదానిని వాళ్ళు వదిలేస్తారు. మీ అవగాహనలో ఏదైతే ఇమిడిపోదో అది మీ అంతరంగంలో రూపాంతరీకరణ యొక్క మూలం అవుతుంది. మీ అవగాహనలో ఏదైతే ఇమిడి పోతుందో అది మీరు ఉన్న విధంగా మిమ్మల్ని బలోపేతం చేస్తుంది: మీ అస్వస్థత, మీ దిగులు, మీ ఆందోళన బలపడతాయి ... మీ అహం బలపరచబడుతుంది.

కనుక కొద్దిగా నైపుణ్యాన్ని కలిగి వుండండి. ఇందువలన జనకుడు అష్టావక్రుడితో అంటాడు : " ఏమి నైపుణ్యం, నేను తక్షణమే చూశాను ! ఎంతటి

నేర్పు, ఎంతటి సామర్థ్యాన్ని నేను కలిగి వున్నాను ! " ఆ నైపుణ్యాన్ని జ్ఞాపకం చేసుకోండి, ఆ సామర్థ్యాన్ని జ్ఞాపకం చేసుకోండి.

అది మీపై ఆధారపడి ఉంటుంది. నేను ఇక్కడ మాట్లాడుతున్నప్పుడు, మాట్లాడడమనేది నా బాధ్యత, కానీ వినడం అనేది మీపైనే ఆధారపడి ఉంటుంది. మాట్లాడిన తరువాత, నేను చెప్పినదానిపై నాకు నియంత్రణ ఉండదు. నేను మాట్లాడగానే అది నా చేతులు దాటిపోతుంది ... విడువబడిన ఓ బాణం. అప్పుడు అది ఎక్కడ వాలుతుంది, అది ఎక్కడ స్వస్థలాన్ని చేరుతుంది అనేది మీ ఇష్టం. అది మిమ్మల్ని తాకేందుకు మీరు అనుమతిస్తారా లేదా మిమ్మల్ని మీరు కాపాడుకుంటాం? అది వివేకాన్ని చేరుతుందా ? ... అప్పుడు మీరు మరింత పెద్ద పండితుడుగా, మీ వాదనా పటిమలో బలోపేతులై, వాదనలో మరింత నైపుణ్యంగలవారై తిరిగి వెళతారు. కానీ మీరు చేజార్చుకున్నారు. మీరు హృదయాన్ని తాకేందుకు దానిని అనుమతిస్తే కనుక మీరు మరింత బ్రాహ్మానందభరితులవుతారు, మీరు కృతజ్ఞతతో నిండిపోతారు. అప్పుడు అనుగ్రహపు ద్వారం తెరుచుకుంటుంది. అప్పుడు కృప యొక్క సంభావ్యత వృద్ధి చెందుతుంది. అప్పుడు మీరు అమరత్వం వైపు కొద్దిగా వచ్చారు. మీరు తుది మజిలీ దిశగా రెండు అడుగులు వేశారు.

ఒక పండితుడిగా తిరిగి వెళ్ళకండి. ఓ ప్రేమికుడిగా తిరిగి వెళ్ళండి. కబీరు అంటాడు :

ప్రేమ అనే పదం రెండున్నర అక్షరాలతో కూడి వుంటుంది,
దీనిని నేర్చుకున్నవాడే జ్ఞాని.

ప్రేమ యొక్క ఈ అక్షరాలను విస్మరించకండి.

నా వాదనలను వినండి, నా వాదనల చేత సమ్మతింపజేయబడండి ... కానీ ఒక సాధనంలానే. ముగింపు ఏమిటంటే ఒకరోజు మీరు ధైర్యాన్ని కూడదీసుకుంటారు మరి తర్కానికి అతీతమైనదాని లోనికి దూకుతారు. తర్కం అనే సాధనం ద్వారా నేను మిమ్మల్ని మీ వివేకం వెళ్ళగలిగినంత దూరం తీసుకెళతాను. అప్పుడు ఒక పొలిమేర వస్తుంది, అప్పుడు సరిహద్దు చేరబడుతుంది : అనంతరం బాధ్యత మీదే. మీరు ఆ అంచు వద్ద నిలబడి మరి మీ గతం వైపు మరి మీ భవిష్యత్తు వైపు ... రెండింటినీ చూడవచ్చు. అప్పుడు మీరు చూస్తారు... మీరు పయనించి వచ్చిన వివేకంలోకి వెనుదిరిగి, మరి తెరుచుకుంటున్న శక్యత దిశగా ముందుకు చూస్తారు. భవిష్యత్తు హృదయానికి చెందినదే.

ఆలోచించడం ద్వారా ఎవ్వరూ జీవితం యొక్క అసలైన సంపదను ఎన్నడూ సిద్ధించుకోలేదు. కానీ ఒకరు ధ్యానం ద్వారా, సాక్షీతత్వం ద్వారా, ప్రేమ ద్వారా, ప్రార్థన ద్వారా, భక్తిరసం ద్వారా సిద్ధించుకోవచ్చు. అప్పుడు మీరు ఓ నిస్సారమైన ఎడారిలో ఉండిపోవాలనుకుంటే కనుక అది మీ చేతిలోనే వుంది, అది మీ ఇష్టం, మీకు మీరే యజమాని. కానీ ఒకసారి మీరు అందమైన అరణ్యాలు, పచ్చదనం, లోయలు మరి కనుమలు మరి పర్వతాలు, మంచుతో కప్పబడిన శిఖరాగ్రాలను చూడడం ప్రారంభించే అంచు వద్దకు నేను మిమ్మల్ని తీసుకువస్తే ... మీకు దీనిని ఒకసారి చూపించనివ్వండి, అనంతరం ఇక మీ ఇష్టం. అప్పుడు మీరు వెనక్కు వెళ్ళాలనుకుంటే, వెనుకకు వెళ్ళండి. కానీ అప్పుడు మీ స్వీయ ఎంపిక వలన మీరు తిరిగి వెళుతున్నారని మీరు తెలుసుకుంటారు. అప్పుడు ఆ బాధ్యత మీదే అవుతుంది.

కనుక మీరు బంగారు శిఖరాల యొక్క మొదటి క్షణదర్శనాన్ని పొందే, మొదటిసారి మీరు తెరచి వున్న వినీలాకాశాన్ని చూసే దశకు నేను మీ తర్కాన్ని తీసుకువెళతాను ; అప్పుడు ఆ క్షణదర్శనం మిమ్మల్ని అనుసరించడం ప్రారంభిస్తుంది. అప్పుడు అది మీ లోపల చుట్టూ తిరుగుతూ వుంటుంది. అప్పుడు ఆ పిలుపు బిగ్గర మరి బిగ్గరగా అవుతుంది. అప్పుడు నెమ్మది, నెమ్మదిగా బొట్టు బొట్టుగా పడుతున్నది ఓ మహా వెల్లువగా ప్రవహించడం ప్రారంభిస్తుంది. మిమ్మల్ని మీరు కాపాడుకోలేక పోతారు. ఎందుకంటే ఒకసారి హృదయం యొక్క స్వల్ప క్షణదర్శనాన్ని మీరు పొందినాగానీ, వివేకం అనేది కేవలం పనికిమాలినదే అవుతుంది. ఆ క్షణదర్శనానికి పూర్వం, ఈ పనికిమాలినిది వజ్రాలు మరి రత్నాలలా కనిపిస్తుంది.

" వాదనచే పోషింపబడే మనస్సు హృదయాన్ని నియంత్రణలోకి తీసుకుని మరి అనుభూతుల యొక్క అనుభవాన్ని అణచివేయడం అనేది నాకు ప్రమాదకరమైనది కాదా ? "

అది ఓ ప్రమాదమే. అప్రమత్తంగా ఉండండి. మనం అది జరగాలని కోరుకుంటే కనుక, మార్గంపై పడి వున్న ఓ రాయి ఒక అడ్డంకి కావచ్చు మరి మనం అక్కడే ఆగిపోవచ్చు. మరి మనం కోరుకున్నట్లయితే, ఆ రాతిని ఒక సోపానంగా తయారు చేసుకోవచ్చు మరి అతీతానికి వెళ్ళవచ్చు. మీరు తర్కంచే పోషించబడిన మనస్సును ఓ అడ్డంకిగా చేసుకుంటారా లేక ఓ సోపానంగా మలచుకుంటారా అనేది మీపై ఆధారపడి వుంటుంది. దానిని ఓ సోపానంగా మలచుకున్నవాళ్ళు ఓ మహోన్నత ప్రయాణంలోకి ప్రవేశించారు. ధానిని ఒక అడ్డంకిగా తయారు చేసుకున్నవాళ్ళు చిన్న తటాకాలుగా మిగిలిపోయారు.

ఒక నాస్తికుడు ఓ తటాకంలాంటివాడు. విశ్వసించేవాడు మహాసాగరం వైపు ప్రవహిస్తున్న ఓ నదిలాంటివాడు. ఒక నాస్తికుడు ప్రవహించకుండా నిలిచిపోతాడు. ప్రవహించడం నుంచి నీరు ఆపబడగానే అది నిలువ వుండిపోవడం ప్రారంభిస్తోంది. ప్రవహిస్తున్నప్పుడు నీరు స్వచ్ఛంగా ఉంటుంది. కానీ ప్రవహించేందుకు సాగరం అవసరమవుతుంది, లేదంటే, నీరు ఎందుకు ప్రవహిస్తోంది ? ప్రవహించేందుకు, దివ్యత్వం అవసరమవుతుంది... లేదంటే సాధించేందుకు మరేమీ ఉండదు, అయ్యేందుకు మరేమీ ఉండదు, అప్పటికే సంభవించినది సరిపోతుంది...

గుర్తుంచుకోండి, ప్రపంచంౘ రెండు రకాల ప్రజలు ఉన్నారు, ప్రపంచాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక రకం బాహ్య విషయాలతో ఎన్నడూ సంతృప్తి చెందనివారితో కూడినది : మాకు ఈ ఇల్లు వుంది, మాకు మరొకటి కావాలి ; మాకు ఇంత డబ్బు వుంది, మరింత ఎక్కువ కావాలి ; అతనికి ఒక స్నేహితురాలు లేదా ఒక భార్య వుంది, మరో రకమైన స్త్రీ కావాలి. బాహ్య విషయాలతో అతను ఎన్నటికీ సంతృప్తి చెందాడు, కానీ అతనికి అంతరంగం విషయంలో ఏ అసంతృప్తీ లేదు. అంతర్గత అసంతృప్తి లేనివాడు, కేవలం బాహ్య అసంతృప్తులు... ఇతనే ప్రాపంచిక మనిషి.

తరువాత రెండవ రకపు మనిషి ఉన్నాడు. బాహ్యంలో ఉన్నదాని పట్ల అతను సంతృప్తితో ఉన్నాడు, కానీ అంతరంగంలో సంతృప్తితో లేడు. అతని అంతరంగంలో ఓ జ్వాల రగులుతోంది... ఓ దివ్య అసంతృప్తి. అతను ఓ నిరంతర ప్రక్రియలో, నిరంతర మార్పులో, నిరంతర రూపాంతరీకరణలో జీవిస్తాడు.

హేతుబద్ధంగా ఉండడంలోని నైపుణ్యాన్ని మీ అంతర్గత విప్లవంలో, మీ రూపాంతరీకరణలో సహాయకారిగా ఉండనివ్వండి... దీనిని జ్ఞాపకం వుంచుకోండి. తర్కం అనేది మీ రూపాంతరీకరణకు ఓ అడ్డంకిగా మరి ఓ రాయిగా మారినప్పుడు, తర్కాన్ని వదిలెయ్యండి ; రూపాంతరీకరణను వదిలెయ్యకండి. నేను చెబుతున్నది ఏమిటంటే చిట్టచివరకు ఎంపిక అనేది మీ చేతుల్లోనే వుంది.

ఒకరు వివేకం కన్నా ఉన్నతంగా ఎదగాలనే భావించబడుతుంది.
ప్రేమ అనేది గమ్యంతో కూడిన వ్యామోహానికి అతీతంగా వెళ్ళాలనే భావించబడుతుంది.
అయినాగానీ నేను ఎక్కడి నుంచి బయలుదేరుతున్నాననేది అవిదితమైనదే.
ఓ మిత్రమా, ఇక దిశ గురించి ఏం చెప్పాలి.

అది ఎక్కడకు వెళ్ళాలి అనేదాని గురించి వివేకానికి ఏమీ తెలియదు. ఇందువలనే వివేకం ఎన్నడూ ఎక్కడకూ వెళ్ళదు. అది గానుగెద్దులాగా గుండ్రంగా తిరుగుతూనే ఉంటుంది. కళ్ళకు గంతలు కట్టబడిన ఓ ఎద్దు, గుండ్రంగా తిరుగుతూనే ఉండడం మీరు చూశారు. తన కళ్ళకు కట్టబడిన గంతలతో తను ముందుకు వెళుతున్నట్లుగా, తాను ఎక్కడికో వెళుతున్నట్లుగా, ఏదో జరుగుతున్నట్లుగా అది భావిస్తుంది.

మీరు ఎలా గుండ్రంగానే తిరుగుతుంటారో మీరు గమనించారా ? అదే ఉదయం, అదే చర్యలు, అదే రోజువారీ పనులు, అదే సాయంత్రం, అదే రాత్రి, మళ్ళీ అదే ఉదయం, మళ్ళీ అదే సాయంత్రం, జీవితం ఇలానే గడిచిపోతూ వుంటుంది మరి ఓ గానుగెద్దులాగా మీరు గుండ్రంగా తిరుగుతూనే ఉంటారు.

మీరు వివేకం యొక్క దశ నుంచి కొద్దిగా పైకెదిగితే మీరు అవనిని వెనుకే వదిలేసి, ఆకాశంలోకి ఎదుగుతారు. పరిమితులు పోతాయి, అనంతం ఆరంభమవుతుంది. బంధనం వదిలిపోతుంది ... ఒకరు విముక్తి యొక్క స్వల్ప క్షణదర్శనాన్ని పొందుతారు.

అప్పుడు ఓ క్షణం కూడా వస్తుంది ... మొదట మీరు వివేకం నుంచి హృదయం వైపు పురోగమిస్తారు, అనంతరం మీరు హృదయం కన్నా లోతుగా వెళ్ళే ఓ క్షణం వస్తుంది. అప్పుడు ప్రేమ యొక్క వస్తువు అనే దాని నుంచి ప్రేమ స్వతంత్రమవుతుంది. అప్పుడు భగవంతుడి ప్రేమను ఓ వస్తువుగా భావించడం నుంచి భక్తుడు విముక్తుడవుతాడు. అప్పుడు పూజించేవాడు పూజ నుంచి విముక్తుడవుతాడు.

కనుక మొదట తర్కంతో ప్రేమ దిశగా వెళ్ళండి మరి తరువాత ప్రేమతో మౌనం దిశగా వెళ్ళండి. ఆ మహామౌనమే మన స్వగృహం.

మీరు మనస్సులో ఉన్నారు ; మీరు హృదయంలో ఉండాల్సినవారు. మిమ్మల్ని హృదయం వైపు తీసుకువచ్చేందుకు నేను వివేకం నుంచి ప్రారంభిస్తాను. కానీ హృదయంలోకి ప్రవేశించినవారు నిశ్చలంగా కూర్చునేందుకు కూడా నేను అనుమతించను. నేను అతనికి చెబుతాను : వెళుతూనే ఉండు, వెళుతూనే ఉండు.

ప్రతి నూతన క్షణమూ పూర్వపు క్షణంలానే,
మీ హృదయంలో ప్రతిధ్వనిస్తున్న
ఒక సుపరిచితమైన ప్రేమ గీతమే...

వాటిని రాగం తరువాత రాగం నాటుతూనే ఉండండి.
వీడివెళ్ళిపోతున్న మధురగీతం ఎన్నటికీ ఆగిపోకుండా ఉండేలా
ప్రతీ రాగానికీ చెంది ఉండండి.

అవిదితంలోకి, అపరిచితమైనదానిలోకి ఒక అడుగు వేయాల్సి వుంది. పరిచితమైనదానిలోనే ఇరుక్కుని ఉండిపోకండి.

వివేకం అంటే ఏమిటని మీరు ఎప్పుడైనా ఆలోచించారా ?... మీకు తెలిసిన దాని యొక్క సంకలనం. దాని భావం ఏమిటి ? కేవలం మీ గతం యొక్క ప్రోగు మాత్రమే. మీరు విన్నది, చదివినది, అధ్యయనం చేసినది లేదా అనుభవించినది మీ వివేకంలో ప్రోగై వుంటుంది. ఇప్పటికే సంభవించినదంతా ప్రోగై వుంటుంది. సంభవించబోతున్నదాని గురించి వివేకానికి ఏమీ తెలియదు. వివేకం అనేది గతానికి చెందినది ... ముగిసిపోయినది, మృతమైనది ! వివేకం అనేది బూడిదే. మీరు వివేకంలో చిక్కుబడిపోయి ఉంటే కనుక మీరు గతం యొక్క చిన్న సందుల్లో సంచరిస్తూనే ఉంటారు ; తెలిసినదానిలోనే తిరుగుతూ వుంటారు.

ఏ గమనమైనా అవిదితంలోనికే ఉంటుంది. తెలిసినదానిలో ఏ గమనమూ ఉండదు, అది కేవలం గానుగెద్దులా గుండ్రంగా తిరిగిన చోటే తిరుగుతూ ఉండడమే అవుతుంది.

హృదయంలో ఉండడమంటే భావం : అవిదితమైనది, అపరిచితమైనది, ఓ సాహసం. ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు ? అది నిశ్చితం కాదు ఎందుకంటే అది ఎన్నడూ తెలియలేదు, కనుక అది నిశ్చయమైనది ఎలా కాగలదు ? మార్గాన్ని సూచించే పటం మీ చేతుల్లో లేదు, అది ఒక అవిదితమైన పయనం. మీరు మార్గం చెప్పడానికి ఆ దారిలో పోలీసులు లేదా మైలురాళ్ళు లేవు. కానీ అవిదితమైనదాని దిశగా ప్రయాణం చేసే ఓ వ్యక్తి జ్ఞానోదయం దిశగా పయనిస్తాడు.

జ్ఞానోదయం అనేది ఈ ప్రపంచంలో అత్యంత అవిదితమైన సంభవం. మనం దానిని తెలుసుకున్నప్పుడు సైతం, మనకు ఇంకా అది తెలియనిదే ; అది ఎల్లప్పుడూ అవిదితమైనదిగానే ఉండిపోతుంది. తెలుసుకుంటూనే ఉండండి, తెలుసుకుంటూనే ఉండండి : అయినాగానీ అది అవిదిదమైనదిగానే ఉంటుంది. .మీరు ఎంతగా తెలుసుకుంటే, తెలుసుకోవడానికి మరింత మిగిలివుందని అంతగా అనిపిస్తుంది. ఆ సవాలు పెద్దది మరి పెద్దది అవుతుంది. శిఖరం తరువాత శిఖరం ఉద్భవిస్తూనే వుంటుంది. ఒక శిఖరాగ్రాన్ని అధిరోహిస్తున్నప్పుడు గమ్యం చేరబడినట్లుగానే

కనిపిస్తుంది ; మీరు పైకి చేరుకున్నప్పుడు ముందు మరిన్ని శిఖరాగ్రాలు కనిపిస్తాయి. ఒక ద్వారం ప్రవేశించబడింది మరి మన ముందు మరిన్ని క్రొత్త ద్వారాలు కనిపిస్తాయి.

ఇందువలనే మనం జ్ఞానోదయాన్ని ఓ అంతులేని రహస్యం అని పిలుస్తాం. రహస్యం అంటే అర్థమేమిటంటే మనకు తెలిసినది మరి అయినాగానీ మనం తెలుసుకోలేనిది. ఇందువలనే వివేకం ద్వారా జ్ఞానోదయం ఎన్నడూ సిద్ధించలేదు అని మనం అంటాము ... ఎందుకంటే అది తెలుసుకోవడం ముగిసినదాన్ని మాత్రమే వివేకం తెలుసుకోదు ; జ్ఞానోదయం అనేది ఎన్నటికీ ముగిసిపోదు.

కనుక మనస్సుతో చేజార్చుకోకండి, మృతమైన గతంతో బంధితులై ఉండిపోకండి. మీకు మీరు ఓ మృతదేహాన్ని కట్టుకుంటే కనుక, మనస్సు ఏమిటి అనేది మీరు అవగాహన చేసుకుంటారు. మీకు ఓ శవాన్ని కట్టుకోండి మరి మీరు నలువైపులా కదలలేకపోతారు. ఆ శవం కుళ్ళిపోతోంది, క్షీణించిపోతోంది, మరి ఓ భారంగా తయారయ్యింది. వివేకం అనేది ఓ మృతకళేబరం, హృదయం అనేది ఓ క్రొత్త అంకురం... జీవితం యొక్క క్రొత్త అంకురం. మరి ఒకరు హృదయానికి సైతం అతీతులవ్వాలి. ప్రతి క్రొత్త అడుగుతో నూతనంగా కదలండి, మరి అందుబాటులోనున్న ప్రతి సంభావ్యత కోసమూ హృదయాన్ని తెరచి వుంచండి ... స్వాగతిస్తూ !

హృదయాన్ని సంసిద్ధంగా ఉంచండి. అవిదితమైనది పిలిచినప్పుడు వెనక్కు పట్టి వుంచకండి. అపరిచితమైనది సంజ్ఞ చేసినప్పుడు సంశయించకండి. తెలుసుకోలేనిది తలుపు తడుతున్నప్పుడు భయపడకండి, దానితో సాగిపోండి. ఓ ధార్మికుడి యొక్క లక్షణం ఇదే.

మూడవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

నేను మీకు ప్రణమిల్లుతున్నాను ! వేల జన్మలలో కూడా మీరు అనాయాసంగా నాకు అందించినంత నేను సాధించలేకపోయేవాడిని. దయచేసి నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి !

మీరు స్వీకరిస్తే కనుక, అప్పుడు మీరు ఓ శిష్యుడిగా అయ్యారు.

ఓ శిష్యుడిగా అవ్వడమనేది నా సమ్మతిపై ఆధారపడి లేదు. ఓ శిష్యుడిగా అవ్వడమనేది మీ సమ్మతిపై ఆధారపడి వుంది. ఒక శిష్యుడు అంటే నేర్చుకోవడానికి సంసిద్ధతతో ఉన్నవాడు అని అర్థం. ఒక శిష్యుడు అంటే ప్రణమిల్లడానికీ, తన

భిక్షాపాత్రను నింపుకోవడానికీ సిద్ధంగా ఉన్నవాడు అని అర్థం. ఒక శిష్యుడు అంటే వినమ్రతతో వినేందుకు ఉత్సుకతతో వున్నవాడు, గాఢంగా మరి నిశ్శబ్దంగా యోచించేందుకు ఉత్సుకతతో, ధ్యానించేందుకు ఉత్సుకతతో ఉన్నవాడు అని అర్థం.

నువ్వు ఓ శిష్యుడివయ్యావు. నువ్వు దానిని స్వీకరిస్తే కనుక, అప్పుడు నీ స్వీకృతిలోనే నువ్వు ఓ శిష్యుడివైపోయావు. ఒక శిష్యుడిగా ఉండడమనేది నా సమ్మతిపై ఆధారపడి లేదు. నేను మిమ్మల్ని అంగీకరించి మరి మీరు దానిని స్వీకరించకపోతే కనుక నేను ఏం చేయగలను ? నేను మిమ్మల్ని అంగీకరించకపోయినాగానీ మీరు ముందుకు వెళ్ళి మరి ఎలాగైనా దానిని స్వీకరిస్తే కనుక నేను ఏం చేయగలను ?

శిష్యరికం అనేది మీ స్వతంత్ర్యం. అది ఎవ్వరి యొక్క దాన ధర్మమూ కాజాలదు. శిష్యరికం అనేది మీ స్వాధికారము, మీ ఘనత. దానిని నిరూపించేందుకు ఏ యోగ్యతా ప్రతాల అవసరమూ లేదు.

ఇందువలనే మహాభారతంలో ఏకలవ్యుడు, గురువు ద్రోణాచార్యుడు తనను తిరస్కరించడాన్ని గురించి దిగులు పడకుండా అరణ్యంలో ఏకాంతంగా కూర్చోగలిగాడు. ఆ గురువు కేవలం తిరస్కరించాడు, కానీ ఆ శిష్యుడు సంసిద్ధంగా, ఓ శిష్యుడిగా అయ్యేందుకు పట్టుబడుతూ వున్నాడు. కనుక ఆ గురువు ఏం చేయగలడు ? ఒకరోజు ఆ శిష్యుడు తనను ఓడించాడని గురువు కనుగొన్నాడు. ఏకలవ్యుడు గురువు యొక్క మట్టి ప్రతిమను రూపొందించాడు మరి దాని సమక్షంలో విలువిద్యను అభ్యసిస్తున్నాడు. అతను దానికి లోబడి ప్రవర్తిస్తున్నాడు మరి దాని పాదాలను స్పృశిస్తున్నాడు.

ఏకలవ్యుడు విలువిద్యలో అత్యంత ప్రవీణుడయ్యాడని ద్రోణాచార్యుడు విన్నప్పుడు, అతను చూసేందుకు వెళ్ళాడు. అతను ఆశ్చర్యపోయాడు.... కేవలం ఆశ్చర్యపోవడమే కాదు, అతను భయకంపితుడైపోయాడు. అతను కలత చెందాడు ఎందుకంటే ఏకలవ్యుడు ఎంతటి విలువిద్యాపారంగతుడు అయ్యాడంటే పోల్చిచూసినప్పుడు అర్జునుడు వెలవెలబోయాడు.

ద్రోణాచార్యుడు అంత పెద్ద గురువేమీ కాకపోయి వుండవచ్చు. కానీ ఏకలవ్యుడు ఓ మహోత్తమ శిష్యుడు. ద్రోణాచార్యుడు ఓ సాధారణ గురువే అయివుంటాడు ... అతి సామాన్యుడు, ఓ గురువుగా పిలువదగిన యోగ్యత లేనివాడు అయివుంటాడు. అతను నైపుణ్యం గలవాడు, చక్కని సమర్థతగలవాడు అయివుంటాడు, కానీ అతనికి గురువు యొక్క లక్షణమనేది లేనే లేదు. మొదట అతను నిరాకరించినది ఎందుకంటే ఏకలవ్యుడు ఓ శూద్రుడు, అంటరానివాడు.

ఒక గురువు చేసే పనేనా ఇది ? ఒక బ్రాహ్మణుడికీ మరి ఓ శూద్రుడికీ మధ్య ఏ వ్యత్యాసాన్నయినా ఒక గురువు ఇంకా చూస్తున్నాడా ? లేదు అతను విపణి వీధిలో తన మనస్సును లగ్నం చేసిన, ఒక వ్యాపారవేత్త అయివుంటాడు. క్షత్రియ యోధుల యొక్క గురువు ఒక శూద్రుడిని ఎలా సమ్మతించగలడు ? అతను సమాజం పట్ల అత్యంత భయం కలిగి వున్నవాడు అయివుంటాడు. అతను ఈ సమాజం యొక్క మూలస్తంభమైవుంటాడు మరి అందువలనే దాని కట్టుబాట్లలో జీవిస్తూ ఉండివుంటాడు. అతను సంకుచిత మనస్కుడై ఉండుంటాడు. అతను ఓ శూద్రుడు అని చెప్పి ద్రోణాచార్యుడు ఏకలవ్యుడిని తిరస్కరించిన రోజే, ద్రోణాచార్యుడు స్వయంగా తానే ఓ శూద్రుడిగా తయారైన రోజు ! ఎంతటి మూర్ఖత్వం !

కానీ ఏకలవ్యుడు అద్భుతమైనవాడు. గురువు తిరస్కరించాడు అనేది అతను పట్టించుకోలేదు. తన మనస్సులో అతను ఆయనను గురువుగా అంగీకరించాడు ... అది ముగిసిపోయింది. గురువు యొక్క తిరస్కారం కూడా ఆయన పట్ల అతనికి ఉన్న గౌరవాన్ని నాశనం చేయలేకపోయింది. అతను ఒక అరుదైన శిష్యుడు అయివుంటాడు !

మరి అనంతరం అతిపెద్ద వంచన : ఏకలవ్యుడి నైపుణ్యం తెలిసినప్పుడు అతను సుప్రసిద్ధుడయ్యాడు ... ద్రోణాచార్యుడు కంపించిపోయాడు ఎందుకంటే తన శిష్యుడైన అర్జునుడు ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచాలని అతను కోరుకున్నాడు. ఏకలవ్యుడు కూడా అతని స్వంత శిష్యుడే, కానీ అతని అంగీకారం లేనివాడు. ఆ గురువు ఓడిపోయినట్లు భావించాడు. తాను హృదయం మరి ఆత్మలతో బోధించిన, తన ప్రయాసనంతా పెట్టిన వ్యక్తి, ఈ మనిషి ముందు కేవలం వెలవెలబోయాడు. తన స్వంత చేతులతో ద్రోణాచార్యుడి యొక్క మోటైన మట్టి బొమ్మను మాత్రమే తయారు చేసి మరి దాని ముందు అభ్యాసం చేయడం ద్వారా మహోన్నత నైపుణ్యాన్ని సాధించాడు. శిష్యుడు గురువుకు గురుదక్షిణ ఇవ్వడమనేది ఆచారం కావడం వలన, ఏకలవ్యుడు తన బొటనవ్రేలును కోసి తనకు సమర్పించాలని తాను కోరుకుంటున్నట్లు అతనికి ద్రోణాచార్యుడు చెప్పాడు.

అది అత్యంత విచిత్రమైనది ... ఏకలవ్యుడికి శిక్షణ ఇచ్చేందుకు ద్రోణాచార్యుడు సిద్ధపడలేదు, కానీ అతని గురువుగా ఉన్నందుకు గురుదక్షిణను అడిగేందుకు అతను వచ్చాడు ! కానీ ఏకలవ్యుడు ఒక అద్భుతమైన శిష్యుడు అయివుంటాడు : తనకు ఉపదేశించడానికి నిరాకరించిన మనిషికి గురుదక్షిణను చెల్లించేందుకు అతను నిరాకరించలేదు. ఏకలవ్యుడిలాంటి శిష్యుడే అసలైన శిష్యుడు. అతను వెంటనే తన

బొటనవ్రేలును ఖండించాడు మరి దానిని ద్రోణాచార్యుడికి ఇచ్చాడు. ద్రోణాచార్యుడు కుడిచేతి యొక్క బొటనవ్రేలును అడిగాడు ... అతను తన బొటనవ్రేలును ఖండించుకునేలా చేయడమనేది కుటిల రాజకీయం : అప్పుడు ఏకలవ్యుడి యొక్క విలువిద్య నిరుపయోగమవుతుంది.

ఈ ద్రోణాచార్యుడు నిశ్చయంగానే క్రూరుడు మరి దుష్ట స్వభావం గల మనిషి అయివుంటాడు. గురువుగా ఉండడం అనేది ఎంతో దూరంలోనిది అతనిని మానవుడు అని పిలువడం అంత సులభమైనదేదీ కాదు. అతను ఎంత నీచమైన యుక్తిని ప్రయోగించాడు ! మరి అంత సరళ హృదయుడైన శిష్యుడిపై దానిని ప్రయోగించాడు. అయినాగానీ హిందువులు ద్రోణాచార్యుడిని ఓ గురువుగానే పరిణిస్తారు, వాళ్ళు అతనిని ఓ గురువు అనే పిలుస్తూంటారు. ఒక బ్రాహ్మణుడిగా జన్మించడం వలన మాత్రమే ఒకరు ఓ అసలైన బ్రాహ్మణుడు అయిపోరు.

ఏకలవ్యుడు ఓ అసలైన బ్రాహ్మణుడు మరి ద్రోణాచార్యుడు కేవలం ఒక శూద్రుడు మాత్రమే. అతని మనస్తత్వం నీచమైనది. ఈ బ్రాహ్మణుడైన ఏకలవ్యుడు తన బొటనవేలును ఖండించుకున్నాడు ; అతను రవంత కూడా సంశయించలేదు. " మీరు అడుగుతున్నదేమిటి ? నేను శిక్షణ కోసం అడిగినప్పుడు అది ఇవ్వడానికి మీరు నిరాకరించాడు. నేను మీ నుంచి ఏమీ నేర్చుకోలేదు ", అని అతను అననైనా అనలేదు. లేదు, ఆ వ్యవహారమంతా అయుక్తమైనదే అయినా కూడా, అది అతనికి ఎన్నడూ స్ఫురించలేదు.

అతను అన్నాడు, " నేను మీ వద్ద నుంచి నేర్చుకున్నాను. మీరు తిరస్కరించడం వలన వ్యత్యాసమేముంది ? నేను ఈ కళను మీ నుంచే నేర్చుకున్నాను. మీరు తిరస్కరిస్తూనే ఉన్నారు, అయినాగానీ నేను మీ నుంచి నేర్చుకున్నాను. చూడండి, నేను మీ ప్రతిమను తయారు చేశాను, కనుక నేను మీకు ఋణపడి వున్నాను. మీరు ఒక బొటన వ్రేలును అడుగుతున్నాను ; మీరు నా ప్రాణాన్ని అడిగినా కూడా నేను దానిని ఇస్తాను." అతను తన బొటనవ్రేలును అతనికి ఇచ్చాడు.

ఒక శిష్యుడిగా ఉండడమనేది మీపై ఆధారపడి వుంటుంది. అది ఎవ్వరి అంగీకారం లేదా అనంగీకారానికి సంబంధించిన ప్రశ్న కాదు.

మీరు ఎంతో పొందారని మీరు అనుభూతి చెందితే కనుక, అప్పుడు అది సంభవించింది. ఈ అనుభూతిని మరింత ప్రగాఢమవ్వనీయండి. ఒక శిష్యుడిగా ఉండడమనే అనుభూతిని చేజార్చుకోకండి. మరి మీ అభివృద్ధి అపరిమితమైనదిగా

వుంటుంది. మీరు పొందుతూనే ఉంటారు. శిష్యరికం అంటే నేర్చుకునే కళ తప్ప మరేమీ కాదు.

నాలుగవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

మద్యం చేదుగా ఉంటుందనీ మరి గుండెను మండిస్తుందనీ నేను విన్నాను ; కానీ మీ మధువు యొక్క రుచి మరోవిధంగా వుంది.

అలాంటప్పుడు మీకు పరిచయం ఉన్న మధువు అసలైన మధువు కాదు, ఎందుకంటే మధువు చేదుగానూ ఉండదు, గుండెనూ మండించదు. గుండెలో మండించేదీ మరి చేదుగా ఉండేదీ నకిలీ మద్యమే, అది అసలైన మధువు కాదు. మధువు యొక్క రుచిని మీరు తెలుసుకోవడం ఇదే మొదటిసారి. నకిలీ మద్యం గురించి ఇక ఎంతమాత్రం బెంగపడకండి. మొట్టమొదటిసారిగా మీరు మధుశాలలో ప్రవేశించారు. ఇప్పుడు మీ హృదయాన్ని ఓ పాత్రగా మలచుకోండి మరి మీ హృదయం తనివితీరేలా పానం చెయ్యండి, ఎందుకంటే ఈ పానం రూపాంతరీకరణను తెస్తుంది. ఈ మధువు మరపును తీసుకురాదు, ఈ మధువు స్మృతిని తీసుకువస్తుంది.

మిమ్మల్ని అచేతనులను చేసేది నిజంగా మధువేనా ? ఈ మధువు మీ చైతన్యాన్ని తీసుకువచ్చేది. ఈ మధువు మిమ్మల్ని మేల్కొలుపుతుంది. మీ అంతరంగంలో దాగివున్న వాడితో ఈ మధువు మిమ్మల్ని పరిచితుల్ని చేస్తుంది. ఈ మధువు మిమ్మల్ని 'మీరు'గా చేస్తుంది.

బాహ్యంగా మీరు ఇతరులకు ఓ త్రాగుబోతులా కనిపించవచ్చు ... దిగులు పడకండి. బహుశా బయటి ప్రజలు మీ పారవశ్యాన్ని అపార్థం చేసుకుంటారు మరి అది ఉన్మాదం లేదా అచేతనత్వం అని అనుకుంటారు. వాళ్ళ గురించి మీరు పట్టించుకోవాల్సిన అవసరం లేదు : అసలైన పరీక్ష మీ అంతరంగంలోనే వుంది. మీ చైతన్యం వృద్ధి చెందుతున్నట్లయితే మీరు బెంగపడాల్సిన అవసరమే లేదు ; ప్రపంచాన్ని దాని ఇష్టం వచ్చినట్లుగా అర్థం చేసుకోనివ్వండి.

మజాజ్ యొక్క పంక్తులను వినండి :

నా మాటలలో దేవదూత సందేశం వుంది,
నేను అస్పష్టుడనని ప్రజలు అంటారు.
బాగా గుర్తించండి, నేను ఓ రహస్యాన్ని,

నేను ప్రేమ పంట యొక్క ఆరాధకుడను.
ప్రేమ మరి కేవలం ప్రేమే నా ప్రపంచం.
వివేకం యొక్క ఆందోళన నుంచి నేను నా ముఖం తిప్పేసుకున్నాను.
హాఫీజ్‌లో మరి ఉమర్ ఖయ్యాంలో ఉన్న ఆ దుష్టత
అవును, ఆ విషయంలోనూ కొంతమేరకు నేను అపరాధినే.
జీవితం అంటే ఏమిటి ? ఆడమ్ యొక్క పాపమేనా ?...
జీవితం ఇదే అయితే కనుక అలాంటప్పుడు నేను ఓ పాపినే.
నా మాటలలో దేవదూత సందేశం వుంది,
నేను అస్వస్థుడనని ప్రజలు అంటారు.

జీసస్ సైతం కేవలం అస్వస్థుడేనని ప్రజలు అన్నారు, అత్యంత అసమ్మతితోనే వాళ్ళు అతనిని దేవదూత అని పిలిచారు. ప్రజలు సోక్రటీస్‌ను కూడా పిచ్చివాడు అనే అన్నారు, మరి వాళ్ళు అతనికి విషాన్నిచ్చారు. మసూర్ జ్ఞాని అని ప్రజలు ఎన్నడూ అనుకోలేదు, లేదంటే వాళ్ళు అతనికి మరణశిక్ష ఎందుకు వేశారు ? నేను మీకు అష్టావక్రుడి యొక్క వృత్తాంతాన్ని చెప్పాను : అతని స్వంత తండ్రే ఎంత ఆగ్రహోదగ్రుడయ్యాడంటే ఆయన అతనిని, అతని శరీరం అష్టవంకరలు తిరిగి పోతుందని శపించాడు.

జీసస్ శిలువ వేయబడడానికి ముందు ఈ భూమిపై ముప్పయిమూడు సంవత్సరాలు ఉన్నాడు. సోక్రటీస్‌కు విషం ఇవ్వబడే సమయానికి అతను అప్పటికే వృద్ధుడైపోయాడు. మహావీరుడు మరి బుద్ధుడిపై రాళ్ళు రువ్వబడ్డాయి, అది నిజమే. కానీ అష్టావక్రుడిని పరిగణించండి : అతను ఇంకా పుట్టనైనా పుట్టలేదు మరి అతను అప్పటికే శపించబడ్డాడు. అతను ఇంకా గర్భాశయంలోనే ఉన్నాడు మరి అతను జీవితకాలంపాటు అంగవికలుడై పోయాడు. మరి దానిని చేసినది మరెవరైనా అయితే కనుక, అది క్షమించదగినది అవుతుంది ... కానీ అతని స్వంత తండ్రే అది చేశాడు. అతని జన్మకు కారణమైనవాడే ఆగ్రహించాడు.

జ్ఞానోదయం యొక్క సందేశం ప్రజలలో ఇమడదు. సత్యం ప్రజలను దుఃఖితులను చేస్తుంది. పరమానందంతో ఉన్న ఓ వ్యక్తి ప్రజలను అసౌఖ్యతతో నింపుతాడు. మీరు దుఃఖంగా ఉంటే కనుక ఎవ్వరూ అలజడికి గురికారు... కేవలం దుఃఖంగా ఉండడాన్ని ఆస్వాదించండి. ప్రజలు అంటారు, నీ హృదయం సంతృప్తి చెందేలా దుఃఖించు, ఏ హాని లేదు... ఇది సరిగ్గా అది ఉండాల్సిన విధంగానే ఉంది. మీరు నవ్వితే కనుక, ప్రజలు అవిశ్రాంతంగా అయిపోతారు. నవ్వడం అనేది

ఆమోదయోగ్యమైనది కాదు. మీరు పిచ్చివారు అని ప్రజలు అనుమానిస్తారు. బుద్ధిమంతుడైన ఓ మనిషి ఎప్పుడైనా నవ్వుతాడా ? ఒక జ్ఞాని నవ్వడం మీరు ఎప్పుడైనా చూశారా ? వివేకవంతులు నాట్యమాడడం లేదా ఒక పాటను పాడడం మీరు చూశారా? ఒక వివేకవంతుడైన వ్యక్తి గంభీరంగా ఉంటాడు, అతని ముఖం గంభీరంగా, అతని మనోస్థితి దుఃఖంగా వుంటుంది. మనం వాళ్ళను గొప్ప మహాత్ములని పిలుస్తాం : ఒక మనిషి ఎంత అస్వస్థుడిగా ఉంటే అతను అంత గొప్ప మహాత్ముడైపోతాడు. ఎవరైనా ఓ శవంలా, అస్వస్థులుగా, దరిద్రం నెత్తి మీద పడినట్లుగా కూర్చుంటే కనుక ప్రజలు అంటారు ఏమి తపసితనం, ఏమి పరిత్యాగం !

నేను ఒకసారి ఒక గ్రామానికి వెళ్ళాను మరి కొంతమంది ప్రజలు ఓ మహాత్ముడిని నన్ను కలిసేందుకు తీసుకువచ్చారు. వాళ్ళు అన్నారు, " ఆయన ఎంతో అద్భుతమైనవాడు, ఆయన అత్యంత అరుదుగా తింటాడు, అత్యంత అరుదుగా నిద్రపోతాడు. ఆయన అత్యంత నిశ్శబ్దంగా వుంటాడు, ఆయన అతి తక్కువగా మాట్లాడుతాడు. మరి ఆయన తపస్సు ఎంత శక్తివంతమైనదంటే ఆయన వదనం స్వచ్ఛమైన బంగారంలా తయారైపోయింది."

వాళ్ళు ఆయనను తీసుకువచ్చినప్పుడు నేను అన్నాను, " మీరు ఈ మనిషిని ఎందుకు హింసించారు ? అతను అస్వస్థుడై ఉన్నాడు. అతని ముఖం బంగారంలా లేదు, అతను కేవలం ఆకలితో మరి దాహంతో అలమటిస్తున్నాడు ... అతను రక్తహీనతతో ఉండడం వలన అతని ముఖం పసుపుపచ్చగా మారింది. అతను ధార్మికుడు అని మీరు అనుకుంటున్నారా ? మరి అతను ఎలా మాట్లాడగలడు ? అతనికి మాట్లాడేందుకు శక్తి లేదు. ఈ మనిషి కొద్దిగా మూర్ఖుడిలా కనిపిస్తున్నాడు. అతని కళ్ళలో తేజస్సు లేదు, వ్యక్తిత్వం లేదు, ఆనందం లేదు. అది ఎలా ఉండగలదు ? ... అతను సరిగ్గా నిద్రపోవడం లేదు, సరిగ్గా తినడం లేదు మరి త్రాగడం లేదు. మీరు అతనిని పూజిస్తున్నారా ? అతను చేస్తున్నదాని వలన మీరు అతనిని పూజించడం పట్ల మాత్రమే అతను ఆసక్తిని కలిగి వున్నాడు. మీ పూజల కోసమే అతను అది చేస్తున్నాడు."

వాళ్ళను కొంతకాలం పూజించడం ఆపెయ్యండి మరి మీ మహాత్ముల్లో నూటికి తొంభై తొమ్మిది శాతం మంది మాయమైపోవడాన్ని... మీరు పూజించడం ఆపేసిన రాత్రే మాయమైపోవడాన్ని మీరు కనుగొటారు. మీ పూజల వలనే వాళ్ళు అన్ని రకాలైన మూర్ఖపు విషయాలనూ చేస్తుంటారు. వాళ్ళు ఏం చేయాలని మీరు కోరుకుంటే అదే చేస్తారు. " మీ వెంట్రుకలను ఒక్కొక్కటికీ పీకెయ్యండి," అని మీరు చెప్తే కనుక,

వాళ్ళు తమ జుట్టును పీకేసుకుంటారు. " దిగంబరంగా ఉండండి," అని మీరు చెప్పినట్లయితే, వాళ్ళు దిగంబరంగా నిలబడతారు. " మిమ్మల్ని మీరు ఆకలితో మాడ్చుకోండి," అని మీరు చెప్పినట్లయితే, వాళ్ళు తమను తాము పస్తులుంచుకుంటారు. బదులుగా మీరు కేవలం ఒకే ఒక పని చెయ్యాలి : వాళ్ళను గౌరవించాలి, వాళ్ళ అహాలకు బలాన్ని ఇవ్వండి.

ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండేదే అసలైన మతం. అసలైన మతం ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైనది, సఫలం చేసేది మరి జీవితాన్ని సమర్థించేది. అసలైన మతం పువ్వులలానే వుంటుంది ... అక్కడ దుఃఖమనేది లేదు. ప్రజలు దుఃఖాన్ని శాంతిగా అర్థం చేసుకుంటారు. దైన్యం అనేది శాంతి కాదు. శాంతి ఉల్లాసంగా పాడుతుంది. శాంతి అత్యంత ప్రకాశవంతమైనది. శాంతి అనేది ఓ గొప్ప త్రాగుబోతు. మీ కాళ్ళు తడబడతాయి. పారవశ్యం మిమ్మల్ని ఆవరిస్తుంది. మీరు అవనిపై నడుస్తారు, అయినాగానీ మీరు అవనిపై నడవడం లేదు, మీరు ఆకాశంలోనే చరిస్తున్నారు... మీరు మీ రెక్కలను పరచుకుంటున్నట్లుగా, ఎగిరిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా.

అది మంచిదే ... మీరు నా మధువును రుచి చూస్తే కనుక, మీరు అసలైన మధువును రుచి చూశారు ... ఇక ఏ ఇతర మధుశాలకూ వెళ్ళాల్సిన అవసరమే ఉండదు.

కేవలం ఏకైక దాహార్తిని అనుభూతి చెందండి ... ప్రేమ కోసం ; కేవలం ఒకే ఒక విషయాన్ని కోరుకోండి ... ప్రేమ. మీ సమస్త ప్రపంచాన్నీ మరి మీ సమస్త అస్తిత్వాన్ని ప్రేమతో నిండి ఉండనివ్వండి, అది చాలు. మరి మనస్సు యొక్క అలజడులను సమాప్తం అయిపోనివ్వండి ; ప్రేమ యొక్క రక్షణలోకి దిగి రండి.

ఉమర్ ఖయ్యాం అవగాహన చేసుకోబడలేదు. అతని పట్ల మహా అన్యాయం చేయబడింది. ఒకరోజు బొంబాయిలో ఒక బార్ ముందు నేను ఈ సూచికను చూశాను, దానిపై ఇలా వుంది : ' ఉమర్ ఖయ్యాం.' అతని పట్ల మహా అన్యాయం చేయబడింది. అతని కవిత్వాన్ని ఫిట్జ్ గెరాల్డ్ ఆంగ్లంలోకి అనువదించినప్పుడు అతను ఎంతో పొరబడ్డాడు. అతను ఉమర్ ఖయ్యాంను అర్థం చేసుకోలేదు. ఫిట్జ్ గెరాల్డ్ అవగాహన చేసుకోలేకపోయాడు, ఎందుకంటే ఉమర్ ఖయ్యాంను అవగాహన చేసుకోవాలంటే ఒకరు సూఫీల యొక్క పరమానందాన్నీ, సూఫీల యొక్క సమాధినీ అనుభవించాలి.

ఉమర్ ఖయ్యాం ఒక సూఫీ మార్మికుడు. సిద్ధిని పొందిన అరుదైన వ్యక్తులలో అతను ఒకడు : బుద్ధుడు మరి అష్టావక్రుడు, కృష్ణుడు మరి జరాతుస్త్రాల కోవకే అతను వస్తాడు. అతను మాట్లాడుతున్న మధువు అనేది దివ్య మధువు. అతను మాట్లాడుతున్న సౌందర్యం అనేది దివ్య సౌందర్యం. కానీ ఫిట్జ్ గెరాల్డ్ అవగాహన చేసుకోలేదు. తన పాశ్చాత్య మనస్సుతో అతను మధువును అక్షరాలా మద్యంగానే అర్థం చేసుకున్నాడు.

అతను ఉమర్ ఖయ్యాం యొక్క మాటలను అనువదించాడు మరి ఈ అనువాదం అత్యంత సుప్రసిద్ధమైపోయింది. ఆ అనువాదం అత్యంత అందమైనది, దాని కవిత్వం అత్యంత రమణీయమైనది ; నిశ్చయంగానే ఫిట్జ్ గెరాల్డ్ ఓ గొప్ప కవి. కానీ అతను అవగాహన చేసుకోలేకపోయాడు. సూఫీల యొక్క ప్రత్యేక లక్షణం అతని కవిత్వంలో చేజారిపోయింది. మరి ఫిట్జ్ గెరాల్డ్ ద్వారా ఉమర్ ఖయ్యాం సుప్రసిద్ధుడయ్యాడు.

కనుక ఉమర్ ఖయ్యాం గురించి తెలిసినదంతా పొరబడినదే. ఉమర్ ఖయ్యాం ఎన్నడూ మధువును సేవించలేదు, ఎన్నడూ ఏ మధుశాలకూ వెళ్ళలేదు. కానీ అతను నిశ్చయంగానే ఇతర మధువులన్నింటినీ పేలవంగా చేసే మధువును సేవించాడు. మనం ఆలయం అని పిలిచే, మనం భగవంతుడి యొక్క ఆలయం అని పిలిచే ఆ మధుశాలలోకి అతను వెళ్ళాడు.

హాఫీజ్‌లో మరి ఉమర్ ఖయ్యాంలో ఉన్న ఆ దుష్టత

అవును, ఆ విషయంలోనూ కొంతమేరకు నేను అపరాధినే.

ఈ పంక్తులను వ్రాసినవాడైన మజాజ్ కూడా ఉమర్ ఖయ్యాంను అపార్థం చేసుకున్నాడు ; అతను కూడా ఉమర్ ఖయ్యాంను ఓ త్రాగుబోతుగానే భావించాడు. అతిగా త్రాగడం వలన మజాజ్ మరణించాడు. చేదుగా ఉంటుందని మరి గుండెను మండిస్తుందనీ మీరు పేర్కొన్న మద్యం, దానిని త్రాగడం వలనే తన యవ్వనంలోనే మజాజ్ మరణించాడు. అతనిది ఒక దురదుష్టకరమైన మరణం.

నేను మాట్లాడుతున్న మధువును గురించి మరేదోనని అపార్థం చేసుకోకండి. ఉమర్ ఖయ్యాం విషయంలో చేయబడిన పొరపాటునే నా విషయంలోనూ చేయకండి. అది సాధ్యమే.

నేను మీకు చెబుతున్నాను : సాక్షీతత్వపు చైతన్యంతో జీవితాన్ని ఆస్వాదించండి. కానీ మీరు ' సాక్షిని ' వదిలేయాలని అనుకుంటారు. ' ఆస్వాదించడం ' అనేదానిని మాత్రమే మీరు పట్టుకుంటారు. జీవితాన్ని ఆస్వాదించండి, కానీ సాక్షిగా ఉండకుండా మీరు దానిని ఆస్వాదిస్తే కనుక మీరు దానిని ఆస్వాదించరు. మీరు ఓ సాక్షిగా ఉన్నప్పుడు మాత్రమే అసలైన ఆస్వాదన వుంటుంది. మధువును త్రాగండి. కానీ మీరు చైతన్యాన్ని కోల్పోతే కనుక ఇది సరైన పానం కాదు. మీరు పానం చేస్తూండగా మీ చైతన్యం వృద్ధి చెందితేనే మీరు అసలైన మధువును పానం చేస్తున్నారు. సమాధి తప్ప మరో మధువు ఏదీ లేదు.

నేను దానిని చూస్తున్న విధంగా, సమాధి యొక్క ఆకర్షణ ప్రవృద్ధమయ్యేంత వరకూ మనిషిలో మద్యం పట్ల ఆకర్షణ కొనసాగుతూనే వుంటుంది. అసలైన మధువు వారికి అందుబాటలోకి వచ్చేంతవరకూ ప్రజలు నకిలీ మద్యాన్ని తాగుతూనే ఉంటారు. అసలైన నాణెం అందుబాటులోకి వచ్చేంతవరకూ నకిలీ నాణేలు చలామణీ అవుతాయి. మద్యం యొక్క వినియోగాన్ని నిలిపివేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ప్రయత్నిస్తూనే ఉంటాయి, కానీ అది జరుగదు. అది చెయ్యడాన్ని వాళ్ళు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. నిషేధాన్ని అమలు చేయమని ధార్మిక వ్యక్తులు ప్రభుత్వాలకు సలహాలిస్తూనే ఉన్నారు. వాళ్ళు నిరాహారదీక్ష చేస్తారు, ఇది చేస్తారు మరి అది చేస్తారు: " మద్యం వినియోగించడాన్ని నిలిపివేయాలి." కానీ నిషేధం విషయంలో ఎవ్వరూ సఫలీకృతం కాలేదు. వివిధ పేర్లతో మరి వివిధ సాధనాల ద్వారా మానవుడు మత్తు పదార్థాలు సేవిస్తూనే వుంటాడు.

నేను దానిని చూస్తున్న విధంగా, నిషేధాన్ని అమలు చేయడం అనేది ఏ ప్రభుత్వానికైనా సామర్థ్యాన్ని మించినదే అవుతుంది. కానీ సమాధి యొక్క మధువు వ్యాపించడం ప్రారంభిస్తే కనుక, ఈ అవనిపై అసలైన మధువు కనిపిస్తే కనుక, నకిలీది నిలిచిపోతుంది. మనం మందిరాలను మధుశాలలుగా మార్చితే మరి అక్కడ ఉల్లాసం మరి పాటలు మరి పరమానందం మరి ఉత్సవం ఉండడం మొదలైతే కనుక, మరి మనం అయుక్తమైనవాటి బదులుగా ఆరోగ్యకరమైన సూత్రాల ద్వారా జీవిస్తే మరి జీవితాన్ని ఒక ఆశీర్వాదంగా పరిణమించనిస్తే కనుక... అప్పుడు మద్యం తనంతట తానే మాయమైపోతుంది.

మానవుడు దైన్యం వలనే మద్యపానం చేస్తాడు. దైన్యం తరిగిపోతే కనుక, మద్యం కూడా తరిగిపోతుంది. తనను తాను మరచిపోయేందుకే మానవుడు మద్యం త్రాగుతాడు, ఎందుకంటే ఎన్నో దిగుళ్ళు వున్నాయి, ఎన్నో సమస్యలు, ఎంతో దైన్యం

వుంది : మనం వాటిని మరిచిపోకపోతే కనుక అప్పుడు మనం ఏం చేస్తాం? విచారం, దుఃఖం మరి దైన్యం తగ్గిపోతే కనుక, మద్యాన్ని సేవించడం కూడా తగ్గిపోతుంది.

ఒక అరుదైన విషయం జరగడం నేను చూశాను : ఎన్నోసార్లు త్రాగుబోతులు వచ్చి మరి నా వద్ద సన్యాసం స్వీకరించారు. పొరపాటున వాళ్ళు చిక్కుబడిపోయారు. వాళ్ళు నా వద్దకు ఇలా అనుకుంటూ వచ్చారు, " ఈ మనిషి దేనినీ నిషేధించడు : త్రాగడం లేదా త్రాగకపోవడం, తినడం లేదా తినకపోవడం, ఇది లేదా అది... ప్రయత్నించడంలో హాని ఏమీ లేదు..." వాళ్ళు ఎంతో సంతోషంగా ఉన్నారు.

వాళ్ళు అంటారు, " మీరు చెబుతున్నదానితో మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాం, దానిని ఇంతకు ముందెన్నడూ ఎవ్వరూ చెప్పలేదు." కానీ వాళ్ళ ధ్యానం ప్రగాఢమైన కొద్దీ, సన్యాసం యొక్క వర్ణం ప్రగాఢమైన కొద్దీ, వాళ్ళ పాదాలు వాళ్ళను మధుశాలవైపు తీసుకెళ్ళడం ఆపేస్తాయి, మరో మధుశాల వాళ్ళను పిలువడం ప్రారంభిస్తుంది.

ఆరునెలల పాటు ధ్యానం చేసిన తరువాత ఒక త్రాగుబోతు నాకు చెప్పాడు, " ఇంతకు ముందు నేను దుఃఖంగా ఉండడం వలన నేను త్రాగేవాడిని, అప్పుడు నేను దుఃఖాన్ని మరచిపోయేవాడిని. ఇప్పుడు నేను కొద్దిగా ఆనందంగా ఉన్నాను, మరి నేను త్రాగితే కనుక, ఆనందం మరచిపోబడుతుంది. ఇప్పుడు అది ఒక సమస్య అయిపోయింది ... ఎవ్వరూ ఆనందాన్ని మరచిపోవాలనుకోరు. మీరు ఏం చేశారు?"

నేను అన్నాను, " ఇప్పుడు నువ్వు ఎంచుకో."

అతను అన్నాడు, "ఇప్పుడు నేను త్రాగితే కనుక, నా ధ్యానం చెడిపోతుంది. లేదంటే ధ్యానం యొక్క నెమ్మదైన సున్నితమైన వెల్లువ అంతరంగంలో ప్రవహిస్తుంది, ఒక మెల్లనైన మలయమారుతం వీస్తూంటుంది. నేను మద్యాన్ని సేవిస్తే కనుక అప్పుడు ధ్యానం యొక్క ప్రవాహం రెండు నుంచి నాలుగు రోజులపాటు గందరగోళమవుతుంది. తరువాత నేను అతి కష్టం మీద మాత్రమే దానిని తిరిగి తీసుకురాగలను. ఇప్పుడు అది ఓ సమస్య అయిపోయింది."

నేను అతనికి చెప్పాను, " ఇప్పుడు నువ్వే నిర్ణయించుకోవాలి, ఇప్పుడు ఆ ఎంపికలు నీ ముందే ఉన్నాయి. నువ్వు ధ్యానాన్ని వదిలేయాలనుకుంటే కనుక, ధ్యానాన్ని వదిలెయ్యి. నువ్వు ఆల్కహాల్‌ను వదిలెయ్యాలనుకుంటే కనుక, ఆల్కహాల్‌ను వదిలెయ్యి. అవి రెండూ కలిసి ఉండలేవు, కానీ మీరు రెండింటినీ కలిగి వుండాలనుకుంటే కనుక, అప్పుడు రెండింటినీ ప్రయత్నించండి."

అతను అన్నాడు, “ ఇప్పుడు అది కష్టం ఎందుకంటే ప్రవహిస్తోన్న ధ్యాన రసం ఎంతో పునీతమైనది మరి అది నన్ను అంతటి ఎత్తులకు తీసుకువెళుతోంది : నాలాంటి ఒక పాపి ఎప్పుడైనా అలాంటి అనుభవాలను పొందగలడని నేను ఎన్నడూ ఊహించలేదు ! మీతో తప్ప మరెవ్వరితోనూ నేను దీని గురించి మాట్లాడడం లేదు ఎందుకంటే నేను మరెవరికైనా దీనిని చెప్పినట్లయితే నేను ఓ త్రాగుబోతునని, నేను అతిగా త్రాగి వుంటానని వాళ్ళు అనుకుంటారు. నిషా దించుకోమనీ, మైకం లేకుండా మాట్లాడమనీ వాళ్ళు నాకు చెబుతారు. నా అంతర్గత అనుభవాన్నీ గురించి నేను వాళ్ళకు చెప్పినట్లయితే నేను మరీ అతిగా త్రాగానని వాళ్ళు అనుకుంటారు. వాళ్ళు దానిని నమ్మరు. నా భార్య సైతం దానిని నమ్మదు. ఆమె అంటుంది, “ ఈ అర్థం పర్థంలేని మాటలు ఆపెయ్యి. ఇది ఆధ్యాత్మికతకు సంబంధించిన ప్రశ్న కాదు... నువ్వు మరీ అతిగా త్రాగావు.” నెలరోజులుగా నేను ఒక్క చుక్కనైనా ముట్టుకోలేదని నేను ఆమెకు చెబుతాను.

“ కనుక నేను చెప్పగలిగిన ఏకైక వ్యక్తి మీరే,” ఆ త్రాగుబోతు అన్నాడు, “కేవలం మీరు మాత్రమే అవగాహన చేసుకుంటారు. మరి ఇప్పుడు ధ్యానాన్ని వదిలేయడం అనేది కష్టతరం.”

జీవితాన్ని ఒక సకారాత్మక దృష్టి కోణం నుంచి చూడండి. మీరు ఆనందంగా ఉండడం ఆరంభిస్తే కనుక, అప్పుడు మీ దైన్యం వలన మీరు పట్టుకుని వున్న విషయాలు వాటంతట అవే వదిలిపోతాయి. ధ్యానం వస్తే కనుక, అప్పుడు మద్యం వదలిపోతుంది. ధ్యానం వస్తే కనుక, అప్పుడు మాంసాహారం తినడం వదిలిపోతుంది. ధ్యానం వస్తే కనుక, అప్పుడు నెమ్మది, నెమ్మదిగా కామశక్తి అనేది బ్రహ్మచర్యంగా రూపాంతరం చెందడం ప్రారంభిస్తుంది. కేవలం ధ్యానాన్ని రానివ్వండి.

నేను మీకు చెబుతున్నాను, ధ్యాన మధువును పానం చెయ్యండి.

నేను మీకు చెబుతున్నాను, సమాధి యొక్క మధుశాలలో ప్రవేశించండి మరి మధుపానం చేసేవారి సమావేశంలో పాల్గొనండి.

నన్ను ఆనందం యొక్క ఈ ఒక్క క్షణాన్ని జీవించనివ్వు.
నన్ను చిరిగిపోయిన కలల దుప్పటిని కుట్టుకోనివ్వు...
అలాంటి వాన మబ్బు ఎన్నడూ మళ్ళీ తన నీడను కమ్ముకోజాలదు.
నన్ను గ్రోలనివ్వు, ఓ పాత్ర నుంచి కానట్లయితే, నీ కళ్ళ నుంచి.

ఈ సత్సంగాన్ని గ్రోలండి...

ఓ పాత్ర నుంచి కానట్లయితే, నీ కళ్ళ నుంచి.

ఈ సత్సంగాన్ని గ్రోలండి, ఈ సత్సంగం నుంచి మైకంతో తిరిగి వెళ్ళండి. కానీ ఈ నిషాలో మీ ఎరుకను చేజారిపోనివ్వకండి. పరవశులై ఉండండి, కానీ ఎరుక యొక్క అంతర్గత దీపాన్ని వెలిగించండి.

అలాంటి వాన మబ్బు ఎన్నడూ మళ్ళీ తన నీడను కమ్ముకోజాలదు
నన్ను గ్రోలనివ్వు, ఓ పాత్ర నుంచి కానట్లయితే, నీ కళ్ళ నుంచి.

అయిదవ ప్రశ్న :

ప్రియమైన ఓషో,

విశ్వాసం మరి స్వయం సూచన అనేవి ఒకటే మరి ఒకే విషయమేనా ? విశ్వాసానికి మరి అంతర్గత-స్వభావం, లేదా ఎరుకకు మధ్యన ఉన్న వ్యత్యాసం ఏమిటి ?

రామకృష్ణ పరమహంస యొక్క కాళీమాత పూర్తిగా అతని విశ్వాసం, అతని ప్రసరణేనా, లేదా ఆమె తనదైన స్వీయ వాస్తవాన్ని కలిగివుందా ?

అలౌకికుడు లేదా భగవంతుడితో సంభాషణ అనేది సాధ్యం కాదా ?

విశ్వాసం మరి స్వయంసూచన అనేవి ఒకే విషయమే. స్వయం సూచన అనేది విశ్వాసం యొక్క శాస్త్రీయనామం. వాటి మధ్యన ఏ వ్యత్యాసమూ లేదు.

అయితే, అంతర్గత-స్వభావం మరి విశ్వాసం అనేవి అత్యంత విభిన్నమైనవి. అన్ని విశ్వాసాలూ విసర్జించబడినప్పుడు సాక్షాత్కరించేదే అంతర్గత-స్వభావం. మీ మనస్సు నుంచి అన్ని ఆలోచనలూ మరి అన్ని విశ్వాసాలూ మాయమైపోయినప్పుడు మీరు మీ అంతర్గత-స్వభావ అనుభవాన్ని పొందుతారు. అంతర్గత-స్వభావాన్ని ఓ విశ్వాసంగా తయారు చేయకూడదు.

ఒకసారి మా ఇంటివద్ద ఒక సన్యాసి అతిథిగా ఉన్నాడు. అతను ఉదయం మరి సాయంత్రం " అహం బ్రహ్మాస్మి " ... నేనే అత్యున్నత వాస్తవాన్ని. నేను ఈ శరీరాన్ని కాదు, ఈ మనస్సును కాదు, నేను అత్యున్నతాన్ని," అని అతను జపిస్తూ కూర్చుంటాడు.

నేను దీనిని రెండు లేదా మూడు రోజులపాటు విన్నాను. నేను అన్నాను, "నువ్వు అది అయితే కనుక, నువ్వు అయి ఉన్నావు. దానిని మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేయడమెందుకు ? నువ్వు కాకపోతే కనుక, అప్పుడు దానిని పునరుక్తం చేయడం వలన ఏమి వస్తుంది ?"

దానిని మళ్ళీ మళ్ళీ పునరుక్తం చేయడం ద్వారా ఒక భ్రాంతిని కల్పించడం సాధ్యమే. పునరుక్తం చేయడం ద్వారా, " నేనే అత్యున్నతాన్ని " ఒకరు అత్యున్నతంగా మారిపోయినట్లు భ్రాంతి కలుగవచ్చు ... కానీ ఈ భ్రాంతి అనేది ఒకరి స్వభావం యొక్క అంతర్గత అనుభవం కాదు. మీరు అత్యున్నతులని మీకు తెలిస్తే కనుక, అలాంటప్పుడు మీరు దానిని ఎందుకు పునరుక్తం చేస్తున్నారు ? ఒక మనిషి బాటపైన వుండి, " నేను ఓ మనిషిని, నేను ఓ మనిషిని " అని పునరుక్తం చేస్తుంటే కనుక, అప్పుడు ఏదో సరిగ్గా లేదని ప్రతి ఒక్కరూ అనుమానించడం ప్రారంభిస్తారు. ప్రజలు అంటారు, " ఆపు, నీలో ఏదైనా దోషం వుందా ! నువ్వు దీనిని ఎందుకు మళ్ళీ మళ్ళీ అంటున్నావు ? అది సత్యమైతే కనుక, అప్పుడు ఆ విషయం ముగిసిపోయింది. నీకు ఆ విషయంలో ఏదైనా అనుమానం ఉందా ?"

" నేను అత్యున్నత వాస్తవాన్ని" అనేది పునరుక్తం చేయదగినదేనా ? ఒక్కసారి మరి ఎప్పటికీ చేయదగిన ప్రకటన అది. కేవలం ఒకే ఒక్కసారి ఉద్భవించే సిద్ధి యొక్క ప్రకటన అది. దాని తరువాత, ఆ విషయం ముగిసిపోతుంది. అది ఒక మంత్రం కాదు. ఒక మంత్రం అనేది కేవలం ఓ సూచన మాత్రమే ; ' మంత్రం ' అనే పదం యొక్క అర్థం ఏమిటంటే : ఓ సూచన. ఇందువల్లనే మనం సలహాలు ఇచ్చేవారిని, సూచనలు ఇచ్చేవారిని, ' మంత్రి ' అని పిలుస్తాం. మంత్రం అనేది ఒక సూచనను మళ్ళీ మళ్ళీ పునరుక్తం చేయడం. దానిని మళ్ళీ మళ్ళీ పునరుక్తం చేయడం ద్వారా మనస్సులో ఒక ముద్ర ఏర్పడుతుంది. మరి ఆ ముద్ర వలన మనం భ్రాంతులను ప్రసరించడం ప్రారంభిస్తాం.

" రామకృష్ణ పరమహంస యొక్క కాళీమాత పూర్తిగా అతని విశ్వాసం, అతని ప్రసరణేనా, లేదా ఆమె తనదైనా స్వీయ వాస్తవాన్ని కలిగివుందా ?"

అది కేవలం ప్రసరణే ... అది కేవలం అతని విశ్వాసమే. ఎక్కడా ఏ కాళీ లేదు, ఏ కన్నె మేరీ లేదు : అవన్నీ మనస్సు యొక్క ప్రసరణలే, మరి అన్ని ప్రసరణలూ విసర్జించబడాలి. ఇందువలనే కాళీ గురించిన రామకృష్ణుడి ప్రసరణ విసర్జించబడగానే, చివరి అడ్డంకి పడిపోయిందని అతను అన్నాడు. అది అతని స్వీయ ప్రసరణ. మరి

రామకృష్ణుడు కాళి యొక్క తన ప్రసరణ యొక్క శిరస్సు ఖండించడానికి ఖడ్గాన్ని ఎత్తినప్పుడు, రక్తం బయటకు వచ్చిందని మీరు అనుకుంటున్నారా ? ఏదీ బయటకు రాలేదు. ఆ ప్రసరణ అసత్యం, ఆ ఖడ్గం కూడా అసత్యమైనదే : రెండు అసత్య విషయాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి మరి ఇంకేమీ లేదు.

" అలౌకికుడు లేదా భగవంతుడితో సంభాషణ అనేది సాధ్యం కాదా ?"

కాదు ! మీరు చేసే సంభాషణ ఏదైనా మీ ఊహే అవుతుంది, ఎందుకంటే మీరు ఉన్నంత కాలం భగవంతుడు ఉండడు, మరి భగవంతుడు ఉన్నప్పుడు మీరు ఉండరు ... అక్కడ ఏ సంభాషణ అయినా ఎలా ఉండగలదు ? సంభాషణకు ఇద్దరు అవసరమవుతారు. మీరు మరి భగవంతుడు ముఖాముఖీగా నిలబడితే కనుక అప్పుడు సంభాషణ అనేది సాధ్యమవుతుంది. మీరు ఉన్నంతకాలం, భగవంతుడు ఎక్కడ ఉంటాడు ? మరి భగవంతుడు ఉన్నప్పుడు, మీరు ఎక్కడ ఉంటారు ?

కబీరు అంటాడు,

ప్రేమ మార్గం ఎంతో ఇరుకైనది.
అక్కడ, ఇద్దరు నడువలేరు.

ఆ మార్గంపై ఇద్దరు నడువలేరు, ఇద్దరు ఇమడలేరు, కేవలం ఒక్కరే మిగులుతారు, కనుక సంభాషణ అనేది ఎలా ఉండగలదు ? సంభాషణకు ఇద్దరు, కనీసం ఇద్దరు అవసరమవుతారు.

కనుక మీరు ఎవరితో మాట్లాడుతోన్నా అది మీ ఊహ మాత్రమే, అది అసలైన దైవత్వం కాదు. దైవత్వం సంభవించినప్పుడు, సంభాషణ అనేది సంభవించదు : ఒక గర్జన సంభవిస్తుంది ; ఒక ప్రకటన, ఓ సంభాషణ కాదు... ప్రాగ్దిశ ద్రష్టలు "తాకని ధ్వని" అని అనేది సంభవిస్తుంది. అది ' ఓం ' అనే పదం యొక్క ఉద్భవం. కానీ అది ఇతరులెవరితోనూ మాట్లాడడం కాదు, ఇతరం ఇక మిగిలి వుండదు.

ఏ భక్తుడూ ఎన్నడూ భగవంతుడిని చూడలేదు. భగవంతుడు కనిపిస్తున్నంత వరకూ, భక్తుడు కూడా ఉంటాడు. అప్పుడు అది ఇంకా ఓ ఊహాత్మక దర్శనమే. అందువలనే ఒక క్రైస్తవుడు జీసస్‌ను కలుసుకుంటాడు, ఒక జైనుడు మహావీరుడిని కలుసుకుంటాడు, ఒక హిందువు రాముడిని కలుసుకుంటాడు. ఒక హిందువు జీసస్‌ను కలుసుకోవడం గురించి మీరు ఎప్పుడైనా విన్నారా ? ... ఏదో విధంగా మార్గంలో అకస్మికంగా జీసస్‌ను కలుసుకోవడం ? వాళ్ళు అతనిని ఎన్నడూ కలుసుకోరు.

ఒకక్రైస్తవుడు ధ్యానంలో కూర్చున్నప్పుడు అతనికి బుద్ధుడు కనిపించడం గురించి మీరు ఎప్పుడైనా విన్నారా ? అది ఎన్నడూ జరుగదు. అది ఎలా జరుగగలదు ? విశ్వాసం చేత నాటబడని విత్తనం ఊహలోకి ఎలా ప్రవేశించగలదు ? మీ విశ్వాసం ఏదైనాగానీ, అది మీ ఊహ ద్వారా పెంపొందించబడుతుంది.

అష్టావక్రుడి యొక్క సూత్రం ఇదే : అన్ని ప్రసరణల నుంచి అన్ని విశ్వాసాలనుంచి, అన్ని ఊహలనుంచి, అన్ని వ్యాఖ్యానాల నుంచి, అన్ని సాధనలు మరి ఆచారాల నుంచి స్వతంత్రులు అవ్వండి.

సాధనలు మరి ఆచారాలు ఎల్లప్పుడూ బంధనాలే. మీలోపల ఎవ్వరూ మిగిలి లేనప్పుడు ... భక్తుడూ లేడు, భగవంతుడూ లేడు ... అప్పుడు ఒక మౌనం సాక్షాత్కరిస్తుంది. ఆ మౌనంలో పగలూ, రాత్రీ పరమానందపు జల్లుకురుస్తుంది. ఆ క్షణంలో సంభాషణ అనేది ఎలా ఉండగలదు, వాదన అనేది ఎలా ఉండగలదు ? లేదు, సంభాషణంతా కేవలం ఊహాత్మకమైనది మాత్రమే.

ఒక కవి అంటాడు :

కొన్నిసార్లు రేయి నన్ను ఆవరిస్తుంది,
కొన్నిసార్లు పగటిని నేను ఆహ్వానిస్తాను.
కొన్నిసార్లు ఓ తేజస్సు నన్ను అన్వేషిస్తుంది,
కొన్నిసార్లు కాంతిని నేను తేజోమయం చేస్తాను.
ఎప్పుడు అది నా ఉనికి యొక్క స్వరమో
మరి ఎప్పుడు అది నా మనస్సు యొక్క స్వరమో నేను ఎలా తెలుసుకోగలను ?

నేను మీకు చెబుతాను, ఆ గుర్తింపు సరళమైనది : ఏదైనా మాట్లాడబడినంతసేపూ, మాట్లాడుతున్నది మనస్సు. ఏదైనా కనిపిస్తున్నంతవరకూ, మనస్సు కనిపిస్తుంది. ఏమీ కనిపించనప్పుడు, ఏదీ మాట్లాడనప్పుడు ... అప్పుడు మనస్సు లేకపోవడం ఉంటుంది, సమాధి ఉంటుంది. అనుభవం అనేది ఉన్నంత కాలం, మనస్సు ఉంటుంది. ఇందువలనే, ' భగవంతుడి యొక్క అనుభవం,' అనే వ్యక్తీకరణ సరైనది కాదు, ఎందుకంటే అనుభవం అనేది ఎల్లప్పుడూ మనస్సుకు సంబంధించినదై వుంటుంది. అనుభవం అనేది ఎల్లప్పుడూ ద్వైతానికి, రెండింటికి చెందినది. కేవలం అద్వైతమే మిగిలి వున్నప్పుడు అనుభవం ఎలా ఉండగలుగుతుంది ? ఇందువలనే ' ఆధ్యాత్మిక అనుభవం ' అనే వ్యక్తీకరణ సరైనది కాదు. అనుభవమంతా అంతమైపోయినచోటే ఆధ్యాత్మిక ఉంటుంది.

లేదా మీరు ఆటలాడుతూనే ఉండవచ్చు. అది దాగుడుమూతల ఆట, ఎండ మరి నీడలకు చెందినది. మీరు ఆడుకోవాలనుకుంటే కనుక, ఆడుకోండి. అది ఊహ యొక్క ఓ ఉల్లాసకరమైన క్రీడ, అత్యంత రమ్యమైనది, అత్యంత రసవంతమైనది ... కానీ అది ఊహ యొక్క క్రీడ. అదే సత్యం అన్నట్లుగా నటించకండి. ' నేను ' అనేది లేనప్పుడు, నువ్వు అనేది లేనప్పుడు సత్యం ఉంటుంది. ఇరువురు పోయినప్పుడు, ద్విత్వం అనేది పోయినప్పుడు సత్యం ఉంటుంది. అప్పుడు ఒక్కరు మాత్రమే మిగులుతారు. ' ఏక ఓంకార సత్యం ' ... ఓంకారం యొక్క నాదమే సత్యం.

చివరి ప్రశ్న :

ఓషో ! మీకు కోటానుకోట్ల వందనాలు ! పవిత్రమైన మౌంట్ అబూ మీద, మీ అనుగ్రహ హస్తం యొక్క రక్షణలోకి వచ్చేందుకు నేను అనుగ్రహించబడ్డాను. అప్పటి నుంచీ నేను ఎంత కోల్పోయానో, నేను ఎంత పొందానో లెక్కేలేదు. నా జీవితం ఒక కృతజ్ఞతగా, ఒక ఆశీర్వాదంగా పరిణమించింది. ఏ ప్రశ్నా రావడం లేదు, కనుక నేను ఒకదానిని రూపొందిస్తున్నాను.

ఈరోజు, ధ్యాన శిబిరం యొక్క ముగింపు రోజు, మీ నుంచి కొన్ని మాటలు వినేందుకు నా హృదయం అవిశ్రాంతంగా వుంది. దయచేసి, నా భిక్షాపాత్రలోకి ఈరోజు కేవలం రెండు పువ్వులను వెయ్యండి.

రెండే ఎందుకు. దానిని మరింత అధికంగా ఉండనివ్వండి.

హరి ఓం తత్ సత్ !



భగవాన్ శ్రీ రజనీష్ ‘ ఓషో ’ గా ప్రసిద్ధులు.

విలియం జేమ్స్ పదం ‘ ఓషయానిక్ ’ నుంచి

‘ ఓషో ’ ను తీసుకోవడం జరిగిందని ఓషో వివరించారు.

‘ ఓషనిక్ ’ అంటే సాగరంలో సంలీనం కావడం.

‘ ఓషనిక్ ’ ఒక అనుభవానికి సంకేతం.

అయితే మరి అనుభవించేవారి సంగతేమిటి ??

ఈ దృష్ట్యా ‘ ఓషో ’ అనే అర్థవంతమైన పదాన్ని వాడుతున్నాం.

తరువాత్తరువాత ‘ ఓషో ’ అనే పదం చారిత్రక కాలం నుంచీ దూర

ప్రాచ్యదేశాల్లో పరిగణనలో వుందని తెలుసుకున్నారు. “ ఆశీర్వాదం

అందుకున్న వ్యక్తి పైన ఆకాశం పూలజల్లు కురిపిస్తుంది ”

అని దీని అర్థం.

ఓషో అంతర్జాతీయ ధ్యానాశ్రమం

సహజత్వం ఉట్టిపడే సుందరమైన ఓషో ధ్యానాశ్రమం నలభై ఎకరాల విస్తీర్ణంలో, మహానగరమైన ' ముంబయి ' కి ఆగ్నేయ దిశలో సుమారు వందమైళ్ళ దూరంలో గల పూణే పట్టణంలోని ' కోరేగావ్ పార్క్ ' అనే ప్రదేశంలో వుంది. ఈ ఆశ్రమం రకరకాల ధ్యాన పద్ధతులను, జీవించే కళలనూ (Arto of Living), ఉత్సవాలను, నృత్యాలను, యోగా మొదలైన వాటిని "ఇక్కడ-ఇప్పుడే (Here & Now) జీవించు మరెప్పుడో కాదు" అనే విధంగా అందిస్తూ, ప్రతి సంవత్సరం వందకు పైగా దేశాల నుండి తరలివచ్చే సత్యాన్వేషకులకు స్వాగతం పలుకుతూ ఆశ్రమ వసతి గృహంలో సౌకర్యాలను అందిస్తుంది.

ఈ ఆశ్రమం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, ' స్పృహ 'తో జీవింపచేయటం ', మరియు జీవితంలోని ప్రతి విషయాన్నీ, ప్రతి క్షణాన్నీ పండుగలా మలచుకుని, సంపూర్ణ స్వీకరణను నేర్పటం. ఇక్కడికి కొందరు ఆహ్లాదంగా గడపడానికి, మరికొందరు ఆశ్రమంలో నిర్వహించే వివిధ ధ్యానాలలో పాల్గొనటానికి, ' స్వయం స్పృహ ' (Awareness) ను అభివృద్ధి పరచే వివిధ మెళకువలను నేర్చుకుని, జీవితాన్ని మరింత సహజంగా, ఒత్తిడి లేకుండా, ఆనందకరంగా గడపాలనే ఉద్దేశ్యంతో వస్తారు. ఈ శిక్షణా తరగతులన్నీ 'Osho Multiversity' ద్వారా ప్రఖ్యాత ఓషో తీర్థ్ పార్క్ ప్రక్కన గల 'పిరమిడ్ కాంపెక్స్' లలో నిర్వహిస్తున్నారు.

మీరు అనేక ధ్యాన ప్రక్రియల్లో పాల్గొనే అవకాశాన్ని ఆశ్రమం వారు ఉదయం 6.00 నుంచి రాత్రి 11.00 వరకు ప్రతిరోజూ అందిస్తున్నారు. ఇక్కడ ప్రతి సాయంత్రం ధ్యానం జరుగుతుంది, అది నృత్యంతో ప్రారంభమై, నిశ్శబ్ద ఆసన స్థితిలో, ఓషో మధురమైన మాటలతో పూర్తవుతూ అంతరానంద అనుభవాన్ని పొందే గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది.

అంతేకాక శారీరక ఆరోగ్యం కోసం వివిధ క్రీడా ప్రాంగణాలు, వ్యాయామ శాలలు మరి ఒలంపిక్ సైజులో వున్న ఈతకొలను మొదలైన వసతులను కల్పిస్తోంది. ఇంకా, శారీరక సమన్వయ మెళకులను నేర్పే ' థాయ్-ఛి ', ' చి-కాంగ్ ', యోగా వంటి వాటిని కూడా అభ్యసించవచ్చు.

ఆశ్రమంలో స్వయంగా పండించిన కూరగాయలతో అత్యంత స్వచ్ఛమైన శాకాహార వంటకాలను రుచి చూడవచ్చు. ఇక్కడ 'రాత్రి భోజనం' స్నేహితులతో కలిసి నక్షత్రాల క్రింద, సజీవ సంగీతం వింటూ, నృత్యాలను వీక్షిస్తూ, ఆస్వాదించవచ్చు.

మరిన్ని ఆశ్రమ వివరాలకోసం www.osho.com ను, మరియు బుకింగ్ కోసం guest house@osho.com ను సంప్రదించండి.

" ఓషో గురించి "

ఓషో బోధనలు అన్ని వర్గీకరణలనూ తిరస్కరిస్తూ, అన్ని వర్గీకరణలకు అతీతంగా ఉంటున్నాయి. ఓ వ్యక్తి ఒంటరిగా చేస్తున్న స్వీయ అన్వేషణ గురించే కాకుండా, నేడు మానవజాతి ఎదుర్కొంటున్న అనేక అత్యవసర సామాజిక మరియు రాజకీయ అంశాల పట్ల చాలా సహజంగా బోధనలు సాగుతున్నాయి. ఓషో పుస్తకాలు వ్రాయలేదు ... కానీ తన జీవిత కాలంలో 35 సంవత్సరాలపాటు ఆయన మాట్లాడిన ఆడియో వీడియో ప్రవచనాల నుంచి పుస్తకాలుగా రూపొందించారు. ' సండే-టైమ్స్ ' అనే లండన్ పత్రిక ఓషోని " 20వ శతాబ్దపు 1000 మంది నిర్మాతలతో ఒకరిగా" మరియు ' సండే-మిడ్-డే ' అనే భారత పత్రిక భారతదేశ చరిత్రను తిరగరాసిన పదిమంది ప్రముఖులలో అంటే బుద్ధ, గాంధీ మొదలైన వారి సరసన చేర్చింది. అంతేకాకుండా, ప్రముఖ అమెరికా రచయిత ' టామ్‌రాబిన్స్ ' ఓషోను జీసస్ తర్వాత ' అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి ' గా అభివర్ణించారు.

ఓషో సహాయమంతా ఒక నవ్యమానవుడిని నిర్మించే దిశలో జరుగుతుంది. ఆ నవ్య మానవుడిని ' ఓషో జోర్బా ది బుద్ధా ' అంటాడు. ఆ నవ్య మానవుడు ఏకకాలంలో నేలపై ఉంటూనే నింగిలోని చుక్కలను కూడా అందుకోగలడు. ఓషో తన మణిహారంలో అన్ని విషయాలను చేర్చుకున్నారు. ఇటు సత్యాన్వేషణలో అసాధారణ ప్రజ్ఞ కలిగిన తూర్పు దేశాల జ్ఞానాన్నీ, అటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో అత్యంత శక్తివంతమైన పడమటి దేశాల విజ్ఞాన సర్వస్వాన్నీ తనదైన శైలిలో సమన్వయపరచారు.

చాలా వేగంగా మార్పులకు లోనవుతున్న జీవన విధానాలకు ధీటుగా ' అంతః పరివర్తన విజ్ఞానాన్ని ' వివిధ ధ్యాన పద్ధతుల ద్వారా ఈ కాలపు మనిషికి అందించారు. సాధనలో నిరంతరం అడ్డుపడే శారీరక, మానసిక పరమైన ఒత్తిడులను పారద్రోలిన తర్వాత ఆలోచనారహిత ధ్యాన అనుభవాన్ని సులువుగా అందించే విధంగా రూపొందించిన ఓషో ... ' చైతన్య ధ్యానాలు ' (Active Meditations™) నేడు అత్యున్నతంగా నిలుస్తున్నాయి.

ప్రతిరోజూ జరిగే ధ్యానాలలో ఇవి ఉంటాయి

ఓషో డైనమిక్ మెడిటేషన్ Osho Dynamic Meditation™ :

శరీరంలోని అన్ని ఉద్విగ్నతలనూ, అణచిపెట్టేయబడి ఉంటున్న అన్ని అనుభూతి ఆవేశాలనూ విడుదల చేసేందుకోసం కల్పించి రూపకల్పన చేయబడిన క్రియాత్మక ధ్యాన తంత్రం. మరింత సజీవత్వాన్నీ, నిశ్శబ్దాన్నీ అనుభవంలోకి తెప్పించే తంత్రం.

ఓషో కుండలినీ మెడిటేషన్ Osho Kundalini Meditation™ :

శరీరంలో నిద్రాణంగా ఉంటున్న శక్తుల్ని ఉద్దీపితం చేయించే ధ్యాన తంత్రం. నాట్యాల ద్వారా, నిశ్శబ్దంగా కూర్చోవడం ద్వారా ఈ శక్తుల్ని అంతరంలో దిశాదర్శకత్వాన్ని చేసే తంత్రం.

ఓషో నాదబ్రహ్మ మెడిటేషన్ Osho Nadabrahma Meditation™ :

ఇది 'శక్తి ప్రవాహాన్ని' హమ్మింగ్ ద్వారా శృతిచేసి నిశ్శబద్దతకు తీసుకుపోవటం. ఇది పురాతన 'టిబెటన్ హమ్మింగ్ ప్రక్రియ' ఆధారంగా రూపకల్పన చేయబడింది.

ఓషో నటరాజ మెడిటేషన్ Osho Nataraj Meditation™ :

శరీర అంతర్రసాయనంతో కలిసి నాట్యం చేసే ఈ పద్ధతిలో నాట్యం ఎంత సంపూర్ణంగా జరుగుతుందంటే, నాట్యం చేస్తున్నవాడు అదృశ్యం అయిపోయి అక్కడ ఓ నాట్యం మాత్రమే మిగులుతుంది.

విపస్సనా మెడిటేషన్ Vipassana Meditation :

గౌతమబుద్ధుడి నుండి ప్రారంభమైన, మరి ఈ 21వ శతాబ్ద మానవుడి కోసం తీర్చిదిద్దబడి మనస్సులో సాగే నిరంతర గోలను శ్వాస మీద అవధానంతో విలీనం చేసే ధ్యాన పద్ధతి.

నో డైమన్షన్ మెడిటేషన్ No Dimensions Meditation™ :

మహా శక్తివంతమైన శక్తుల్ని కేంద్రీకృతం చేసుకునేందుకు ఉపయుక్తమై, ఓ సూఫీ తంత్రం మీద ఆధారపడి ఉన్న పద్ధతి.

ఓషో గౌరీశంకర్ మెడిటేషన్ Osho Gourishankar Meditation™ :

రాత్రి సమయంలో ఓ గంటపాటు కొనసాగే ధ్యానం. ఇందులో ఉంటాయి ఓ శ్వాసించే పద్ధతి, దీపాన్ని సుఖంగా చూస్తూ ఉండడం, అతి నెమ్మదిగా సాగే శరీర చలనాలతో కూడిన ధ్యాన పద్ధతి.

Books by Osho in English Language

Early Discourses and Writings
A Cup of Tea
Dimensions Beyond The Known
From Sex to Super-consciousness
The Great Challenge
Hidden Mysteries
I Am The Gate
The Inner Journey
Psychology of the Esoteric
Seeds of Wisdom

Meditation
The Voice of Silence
And Now and Here (Vol 1 & 2)
In Search of the Miraculous (Vol 1 &.2)
Meditation: The Art of Ecstasy
Meditation: The First and Last Freedom
The Path of Meditation
The Perfect Way
Yaa-Hoo! The Mystic Rose

Buddha and Buddhist Masters
The Book of Wisdom
The Dhammapada:
The Way of the Buddha (Vol 1-12)
The Diamond Sutra
The Discipline of Transcendence (Vol 1-4)
The Heart Sutra

Indian Mystics
Enlightenment: The Only Revolution (Ashtavakra)
Showering Without Clouds (Sahajo)
The Last Morning Star (Daya)
The Song of Ecstasy (Adi Shankara)

Baul Mystics
The Beloved (Vol 1 & 2)

Kabir
The Divine Melody
Ecstasy: The Forgotten Language
The Fish in the Sea is Not Thirsty
The Great Secret
The Guest
The Path of Love
The Revolution.

Jesus and Christian Mystics
Come Follow to You (Vol 1-4)
I Say Unto You (Vol 1 & 2)
The Mustard Seed
Theologia Mystica

Jewish Mystics
The Art of Dying
The True Sage

Western Mystics
Guida Spirituale (Desiderata)
The Hidden Harmony (Heraclitus)
The Messiah (Vol 1 & 2) (Commentaries on Khalil Gibran's The Prophet)
The New Alchemy: To Turn You On (Commentaries on Mabel Collins' Light on the Path)
Philosophia Perennis (Vol 1 & 2) (The Golden Verses of Pythagoras)
Zarathustra: A God That Can Dance
Zarathustra: The Laughing Prophet (Commentaries on Nietzsche's Thus Spake Zarathustra)

Sufism
Just Like That
Journey to the Heart
The Perfect Master (Vol 1 & 2)
The Secret
Sufis: The People of the Path (Vol 1 & 2)
Unio Mystica (Vol 1 & 2)
The Wisdom of the Sands (Vol 1 & 2)

Tantra
Tantra: The Supreme Understanding
The Tantra Experience
The Royal Song of Saraha (same as Tantra Vision, Vol 1)
The Tantric Transformation
The Royal Song of Saraha (same as Tantra Vision, Vol 2)

The Original Man
Turning In
Osho : On the Ancient Masters of Zen (7vol.)
Dogen : The Zen Master
Hyakujo : The Everest of Zen – With Basho's haikus
Isan : No Footprints in the Blue Sky
Joshu : The Lion's Roar
Ma Tzu : The Empty Mirror
Nansen : The Point Of Departure
Rinzai : Master of the Irrational
**Each volume is also available individually.*

Responses to Questions
Be Still and Know
Come, Come, Yet Again Come
The Goose is Out
The Great Pilgrimage: From Here to Here
The Invitation
My Way: The Way of the White Clouds
Nowhere to Go But In
The Razor's Edge
Walk Without Feet, Fly Without Wings and Think Without Mind
The Wild Geese and the Water
Zen: Zest, Zip, Zap and Zing

Talks in America
From Bondage To Freedom
From Darkness to Light
From Death To Deathlessness
From the False to the Truth
From Unconsciousness to Consciousness
The Rajneesh Bible (Vol 2-4)

The World Tour
Beyond Enlightenment (Talks in Bombay)
Beyond Psychology (Talks in Uruguay)
Light on the Path (Talks in the Himalayas)
The Path of the Mystic (Talks in Uruguay)
Sermons in Stones (Talks in Bombay)
Socrates Poisoned Again After 25 Centuries (Talks in Greece)
The Sword and the Lotus (Talks in the Himalayas)
The Transmission of the Lamp (Talks in Uruguay)

Osho's Vision for the World
The Golden Future
The Hidden Splendor
The New Dawn
The Rebel
The Rebellious Spirit

The Mantra Series
Hari Om Tat Sat
Om Mani Padme Hum
Om Shantih Shantih Shantih
Sat-Chit-Anand
Satyam-Shivam-Sundram

Personal Glimpses
Books I Have Loved
Glimpses of a Golden Childhood
Notes of a Madma

Interviews with the World Press
The Last Testament (Vol 1)

Intimate Talks betweenMaster and Disciple - Darshan Diaries
A Rose is a Rose is a Rose
Be Realistic: Plan for a Miracle
Believing the Impossible Before Breakfast
Beloved of My Heart
Blessed are the Ignorant
Dance Your Way to God
Don't Just Do Something, Sit There
Far Beyond the Stars
For Madmen Only
The Further Shore
Get Out of Your Own Way
God's Got A Thing about You
God is Not for Sale
The Great Nothing
Hallelujah!
Let Go!
The 99 Names of Nothingness
No Book, No Buddha, No Teaching, No Disciple
Nothing to Lose but Your Head
Only Losers Can Win in This Game
Open Door

The Book of Secrets:
Vigyan Bhairav Tantra

The Upanishads

Behind a Thousand Names
(Nirvana Upanishad)
Heartbeat of the Absolute
(Ishavasya Upanishad)
I Am That (Isa Upanishad)
The Message Beyond Words
(Kathopanishad)
Philosophia Ultima
(Mandukya Upanishad)
The Supreme Doctrine
(Kenopanishad)
Finger Pointing to the Moon
(Adhyatma Upanishad)
That Art Thou
(Sarvasar Upanishad, Kaivalya Upanishad, Adhyatma Upanishad)
The Ultimate Alchemy, Vol 1&2
(Atma Pooja Upanishad Vol 1 & 2)
Vedanta: Seven Steps to Samadhi
(Akshaya Upanishad)
Flight of the Alone to the Alone
(Kaivalya Upanishad)

Tao

The Empty Boat
The Secret of Secrets
Tao:The Golden Gate (Vol 1&2)
Tao:The Pathless Path (Vol 1&2)
Tao: The Three Treasures (Vol 1-4)
When the Shoe Fits

Yoga

The Path of Yoga
(previously Yoga: The Alpha and the Omega Vol 1)
Yoga: The Alpha and the Omega
(Vol 2-10)

Zen and Zen Masters

Ah, This!
Ancient Music in the Pines
And the Flowers Showered
A Bird on the Wing
Bodhidharma: The Greatest Zen Master
Communism and Zen Fire, Zen Wind
Dang Dang Doko Dang
The First Principle
God is Dead:
Now Zen is the Only Living Truth
The Grass Grows By Itself
The Great Zen Master Ta Hui
Hsin Hsin Ming: The Book of Nothing
I Celebrate Myself:
God is No Where, Life is Now Here
Kyozan: A True Man of Zen
Nirvana: The Last Nightmare
No Mind: The Flowers of Eternity
No Water, No Moon
One Seed Makes the Whole Earth Green
Returning to the Source
The Search: Talks on the 10 Bulls of Zen
A Sudden Clash of Thunder
The Sun Rises in the Evening
Take it Easy (Vol 1 & 2)
This Very Body the Buddha
Walking in Zen, Sitting in Zen
The White Lotus
Yakusan:
Straight to the Point of Enlightenment
Zen Manifesto : Freedom From Oneself
Zen: The Mystery and the Poetry of the Beyond
Zen: The Path of Paradox (Vol 1, 2 & 3)
Zen: The Special Transmission

Zen Boxed Sets

The World of Zen (5 vol.)
Live Zen
This. This. A Thousand Times This
Zen: The Diamond Thunderbolt
Zen: The Quantum Leap from Mind to No-Mind
Zen: The Solitary Bird, Cuckoo of the Forest
Zen: All The Colors Of The Rainbow(5vol.)
The Buddha : The Emptiness of the Heart
The Language of Existence
The Miracle

Open Secret
The Shadow of the Whip
The Sound of One Hand Clapping
The Sun Behind the Sun Behind the Sun
The Tongue-Tip Taste of Tao
This Is It
Turn On, Tune In and Drop the Lot
What Is, Is, What Ain't, Ain't
Won't You Join The Dance?

Compilations

After Middle Age: A Limitless Sky
At the Feet of the Master
Bhagwan Shree Rajneesh: On Basic Human Rights
Jesus Crucified Again, This Time in Ronald Reagan's America
Priests and Politicians: The Mafia of the Soul
Take it Really Seriously

Gift Books of Osho Quotations

A Must for Contemplation Before Sleep
A Must for Morning Contemplation
India My Love

Photobooks

Shree Rajneesh: A Man of Many Climates, Seasons and Rainbows through the eye of the camera
Impressions... Osho Commune International Photobook

Books about Osho

Bhagwan: The Buddha for the Future by Juliet Forman
Bhagwan Shree Rajneesh: The Most Dangerous Man Since Jesus Christ by Sue Appleton
Bhagwan: The Most Godless Yet the Most Godly Man by Dr. George Meredith
Bhagwan: One Man Against the Whole Ugly Past of Humanity by Juliet Forman
Bhagwan: Twelve Days That Shook the World by Juliet Forman
Was Bhagwan Shree Rajneesh Poisoned by Ronald Reagan's America? by Sue Appleton.
Diamond Days With Osho by Ma Prem Shunyo

Gifts

Zorba the Buddha Cookbook

For any information about Osho Books & Audio/Video Tapes please contact:

Sadhana Foundation
17 Koregaon Park, Pune-411001, MS, India
Phone: 020 66019999 Fax: 020 66019990
E-mail: distrib@osho.net Website: www.osho.com

ఓషో రజనీష్ తెలుగు పుస్తకాలు

1.	ఇక్కడ... ఇప్పుడ..	20.00.
2.	గురువుకి పాదాభివందనం !	20.00
3.	వీడ్కోలు చెప్పకండి, శుభోదయం పలకండి !	25.00
4.	జీవన సరిగమలు !	25.00
5.	పిల్లలే - పెద్దలు	20.00
6.	బౌద్ధ మహారసాయనం	20.00
7.	చిట్టచివరి బంధమే గురువు	20.00
8.	విద్యపేరుతో మనం బోధిస్తున్నది ఏమిటి ?	20.00
9.	బాధలు లేకపోతే భవిష్యత్తు కూడా ఉండదు	20.00
10.	గతంతో తెగతెంపులు	20.00
11.	భార్యా భర్తల సంబంధం	20.00
12.	హుష్.... నిశ్శబ్దం	20.00
13.	మరణం తర్వాత ఏమౌతుందో తెలుసా ?	25.00
14.	అతీషా : ప్రజ్ఞావేదం	100.00
15.	జెన్ మానిఫెస్టో - 1	100.00
16.	జెన్ మానిఫెస్టో - 2	100.00
17.	నా విజ్ఞప్తి - 1	100.00
18.	నా విజ్ఞప్తి - 2	80.00
19.	చువాంగ్ త్సూ -1	80.00
20.	చువాంగ్ త్సూ - 2	80.00
21.	వేదాంత సప్తపది	150.00
22.	అష్టావక్ర గీత	180.00
23.	మహిళ	120.00
24.	పూర్ణ పురుషుడు	150.00
25.	వజ్రచ్ఛేదిక	125.00
26.	విజ్ఞాన భైరవ తంత్ర	110.00
27.	అద్భుతాన్ని అన్వేషించడంలో	150.00
28.	ఈ దేహమే బుద్ధ శరీరం	160.00

29.	అవేర్‌నెస్ (జాగృతి)	120.00
30.	ఆనందం	100.00
31.	మనకు తెలియని క్రీస్తు జీవితం	25.00
32.	జీవితాన్ని పండుగ చేసుకో	25.00
33.	ధ్యానం అంటే ఏమిటి ? ఎందుకు ? ఎలా ?	30.00
34.	సత్యాన్వేషణ	30.00
35.	నారీ-క్రాంతి	35.00
36.	జీవన క్రాంతి సూత్రాలు	35.00
37.	మట్టి దీపాలు	35.00
38.	[illegible]ము కండ్లతో కన్న కథనం	35.00
39.	ప్రభువు వేతికే పిల్లదారులు	35.00
40.	సత్యా శోధన	35.00
41.	క్రాంతి బీజాలు	40.00
42.	ప్రాథమిక మానవ హక్కులు	40.00
43.	యోగా-1	60.00
44.	యోగా-2	60.00
45.	ఓషో ధ్యానయోగం	60.00
46.	సంభోగం నుండి సమాధి వైపు	80.00
47.	సాక్షి సాధన	40.00
48.	మన అంతరంగంలో వెతకాలి	50.00
49.	ధమ్మపదం - 1	120.00
50.	ధమ్మపదం - 2	120.00
51.	ధమ్మపదం - 3	120.00
52.	హృదయంలోనికి ప్రయాణం	70.00
53.	ఓషో జీవిత చరిత్ర - 1	60.00
54.	ఓషో జీవిత చరిత్ర - 2	120.00